లేనివారు, చెనఁటిత్రొక్కుడు గూర్పరులు = చెడుమార్గములఁ బోవఁజేయువారు, అర్థతృష్ణ=ధనమందలి యాశచే, ధర్మముమీఁది యాశచేఁగాదు, శ్రీ=సంపద.

శ్లో॥ తుల్యార్థం తుల్యసామర్థ్యం, మర్మజ్ఞం వ్యవసాయినమ్ ।
అర్థరాజ్యహరం భృత్యం, యోహన్యాత్ సహతస్స్వయమ్ ॥ కామందకము.

సమానప్రయోజనము సమానసామర్థ్యము గలిగి కార్యసాధనమందుఁ బట్టుదలగలిగి యర్థమును రాజ్యమును హరింపఁజూచు భృత్యుని జంపనిరాజు తానే వానిచేఁ జచ్చును.

తా త్ప ర్య ము.

భరతా! నీయొద్ద నిర్మలమైన మనస్సులేనివారు చెడునీతిని బోధించు విద్యయందుఁ బ్రీతిగలవారు నీకాప్తులైన భృత్యులమీఁదఁ నయినవారిమీఁదఁ గొండెములుచెప్పి వారిని వెడలఁగొట్టించువారు, రాజభయము లేనివారు చెడ్డత్రోవలఁ ద్రొక్కింపఁ జూచువారు ధర్మబుద్ధిలేక లోభులై కేవల ధనాశచే సంపదగోరువారు ఇట్టివారిని రాజు చంపకపోయెనా వారిచేఁ జచ్చుట నిజము.

తే. హృష్టుఁడును శూరవరుఁడును • ధృతియుతుండు
సత్కులుండును సుమతి ప్ర•శ స్తశుచియు
దక్షుఁడును బ్రీతి గలవాఁడు • దండనాథుఁ
డగుచు వఱలు నెనీ కిప్డు • సుగుణలోల ! ౨౨౬౬

ఇఁక సేనానాయకుల గుణములఁ జెప్పుచున్నాఁడు.

హృష్టుఁడును=రాజు చేసిన దానమానాదులఁ దృప్తి చెందినవాఁడు శూరవరుఁడు=యుద్ధములందు శత్రువులపై కుటికి వారిని వధించువాఁడు, పిటికియై ప్రాణభయమున వెనుకంజపెట్టనివాఁడు, ధృతియుతుండు = ఎట్టియాపదయందును ధైర్యము వదలనివాఁడు, సత్కులుండును=గొప్పవంశమునఁ బుట్టినవాఁడగుటచే నపకీర్తికి భయపడువాఁడు. సుమతి=సమయమునకుఁ దగినట్లు తనసేనలఁ జక్కని వ్యూహముల నిలుపుటకుఁ దగిన కాలముల సేనలరప్పించుటకు సమయమెఱిఁగిన శత్రుసేనపై పడి వారి వ్యూహములను జెఱుచుటకుఁ గావలసిన మంచిబుద్ధిగలవాఁడు, శుచి=త్రికరణముల యందుఁ బరిశుద్ధుఁడు, దక్షుఁడు=కార్యసాధనమందు నేర్పరి, దండనాథుఁడు=సేనానాయకుఁడు, దండమనఁగా=సేన దీనివికృతియే దండు.

తా త్ప ర్య ము

నీ సేనానాయకుఁడు సుగుణములయందాసక్తిగలవాఁడా? అతఁడు నీదానమానాదుల సంతోషించువాఁడును శూరుఁడును ధైర్యముగలవాఁడును మంచికులమునఁ బుట్టినవాఁడును సేనలునడుపుట మొదలగు కార్యములందు మంచి బుద్ధిగలవాఁడు త్రికరణ శుద్ధిగలవాఁడును కార్యములు చేయుటయందు సమర్థుఁడును రాజునందుఁ బ్రీతిగలవాఁడునై యున్నాఁడా?

చం. బలయుతులా, పరాక్రమవి•భాసితులా, రణకేళిదక్షులా,
తొలిఁ దమపౌరుషంబులను • దోఁపఁగఁ జేసినవారె, సైన్యము
ఖ్యులు! నటువంటివారలకుఁ • గూర్తె ముదంబును బారితోషికం
బుల సతులన్ నృపాత్మభవ • పోణిమి నీపయిఁ గూర్మి యెక్కఁగన్ ! ౨౨౬౭

తాత్పర్యము.

నీ సేనయందలి ముఖ్యులు బలవంతులేకదా ! పరాక్రమముచేఁ బ్రకాశించు వారేకదా? యుద్ధక్రీడయందు సమర్థులా? నీయొద్దకు రాకముందు తమ పౌరుషములను బహిరంగపఱిచినవారేకదా ! అటువంటివారికి బహుమానములను దాసికలను నొసఁగి నీపయి వారికి స్నేహమెక్కువ యగునట్లు చేయుచున్నావా !

ఉ. జీతము బత్తెమిచ్చెదవె • సేవకకోటికిఁ గ్లుప్తకాలమం
దాతతకాలయాపన మొ•కప్పుడుఁ జేయవు గాదె? వేళకున్
వేతన మీయనట్టిపతి•ని న్గినుకం గనుచుందు రాభటుల్
ప్రీతి దొలంగి తిట్టుదురు • పెక్కులుకీడులు పుట్టు దానిచేన్. ౨౨౬౮

తాత్పర్యము.

నియమితకాలమునకు సరిగా సేవకులందఱకు జీతమియ్యవలసినవారికి జీతము బత్తెమియ్యవలసినవారికి బత్తెము రెండు నియ్యవలసినవారికి రెండు నిచ్చుచున్నావా? ఒకప్పుడైన నాలస్యము చేయుటలేదుగదా ! క్లుప్తకాలమునకు సరిగా జీతమీయని రాజును ఆభటులు కోపదృష్టిచూచి తిట్టుదురు. దానివలనఁ బ్రేమచెడును. దాని వలన సమయమువచ్చినపుడు విశ్వాసముతో నిర్వంచనముగాఁ బనిచేయరు. దాని వలన ననేకములయిన కీడులు రాజునకుఁ గలుగును.

కం. కులజులు ప్రధానులును ని,శ్చలరక్తి న్నిన్నుఁ గండ్రె • సమయం బైనన్
గలనను నీకై ప్రాణం, బుల నీయఁ గడంగుదురె ప్ర•భూతప్రీతిన్ ! ౨౨౬౯

కులజులు = మనక్షత్రియకులమునఁ బుట్టినవారు, ప్రధానులు, ముఖ్యులు. నిశ్చలరక్తిన్=చలింపని ప్రేమతో, సమయంబైనన్ = వారిసహాయ్యము కావలసిన యుద్ధసమయమందు, కలనను = యుద్ధమందు, ప్రభూతప్రీతిన్ = అధికప్రేమచే, ఇది రాజబంధువుల లక్షణము.

తాత్పర్యము

క్షత్రియవంశమునఁ బుట్టిన ప్రధానులు వారి సాహాయ్యము కావలసిన యుద్ధ సమయములందుఁ జలింపని ప్రేమతో నిన్నుఁ జూచుచున్నారా? సమయమునందు ముఖము తప్పింపరుగదా ! అంతియకాదు. యుద్ధమందు నీయందలి ప్రేమచే నిన్ను రక్షింపఁగోరి తమ ప్రాణముల నర్పింప సిద్ధపడుదురా ?

కం. మనజనపదమునఁ బుట్టినఁ మనుజుం బండితు యథోక్త•మార్గస్థిరు ద
క్షుఁణుఁ బ్రతిభాయుతు నీహి,తముగా నొసరింతె కార్య•తత్పరమతివై. ౨౨౭౦

ఇఁక దూతలక్షణమును దెలుపుచున్నాఁడు.

మనజనపదమునన్ = మనదేశమందు, పండితున్ = ఇతరుల యభిప్రాయ మెఱుఁగఁ గలవానిని, యథోక్తమార్గస్థితున్ = రాజెట్లుచెప్పెనో యాప్రకారమే చేయువానిని, అదితప్పని వేఱొకత్రోవఁ బోవువాఁడుగా నుండరాదు. కార్యోప యోగముగాఁ బెక్కుసంగతులు చెప్పుచున్నను దనప్రభువు చెప్పినదానిని వదలక దాని కనుపంగముగాఁ జెప్పువాఁడు, దక్షిణున్=కార్యము చేయఁగల సామర్థ్యము గలవానిని, ప్రతిభాయుతున్ = సమయోచితముగా నెదుటివారి ప్రశ్నములకుఁ దగిన ప్రత్యుత్తరములను వెంటవెంటనే యియ్యఁగల క్రొత్తక్రొత్తగా వికాసము నొందు బుద్ధిగలవానిని, కార్యతత్పరమతివై=కార్యము సాధించుటే ప్రయోజనము గాఁగల మనస్సుగలవాఁడవై, దక్షిణు=ఇందలి ణకారము సాధ్యము కావునఁ బ్రాస గతము.

తా త్ప ర్య ము.

ఇతరదేశములఁ బుట్టినవారిని నీవు దూతలుగాఁ బంపితివేని వారిదేశమం దున్న ప్రీతి నీదేశమందుండదు గావున నీకార్యము సాధింపఁబోవుదూత నీరాజ్య మునఁ బుట్టినవాఁడుగానే యుండవలయును. మఱియును వాఁడెదుటివారి మాటల ధోరణిఁ బట్టియే వారి యభిప్రాయము నెఱుఁగ శక్తిగలవాఁడై యుండవలయును. నీవొకటిచెప్పినఁ దానొకటిచేయువాఁడుగాక నీవుచెప్పిన మార్గముఁ దప్పనివాఁడుగా నుండవలయును కార్యముసాధించు సామర్థ్యము గలవాఁడుగా నుండవలెను గాని యేదియో నెపముపెట్టి వెనుకకు వృథాగా వచ్చువాఁడుగా నుండరాదు. ఎదుటి వారి యుక్తులకు వెంటవెంటనే తగిన ప్రతియుక్తి చెప్పు సమయోచిత బుద్ధిగలవాఁడుగా నుండవలెను గాని మరల నాలోచించిచెప్పెద ననికాని మహారాజుగారి నడిగివచ్చి చెప్పెదననికాని యనువాఁడుగా నుండరాదు. కావున నీవు నీకార్యము సాధించుట యందు మనస్సుగలవాఁడవై తివేని యిట్టివానిని దూతగాఁ బంపుము.

సీ. పరపక్షమున మంత్రి•వరపురోహితయువ, రాజసేనానికా•రాగృహాధి
పతి లోనుగాఁ గల•పదునెనమండ్రఁ దీ, ర్థాఖ్యులఁ దనపక్ష•మందు మొదటి
మూవుర విడి పదు•నేవురవృత్తంబు, లరయఁ జారులను ము•వ్వురను బరుల
కును దమలోఁ దమ•కును నెఱుంగఁగ రాని,యట్టుల నియమింతె•యమలచరిత

ఆ. పగతుఁ దగుటఁ దలఁపఁ•బడియున్న గర్వంబు, చెడియు మరలనిన్నుఁ•జేరనేని
యబలుఁ డనుచు వాని • నవమానదృష్టిని, జూడకుందు వయ్య•సుగుణభావ.
౨౩౭౧

ఇఁకఁ దీర్థుల లక్షణము చెప్పుచున్నాఁడు.

పరపక్షమునన్ = విరోధులపక్షమునందు, మంత్రి....పతి=౧ మంత్రి ౨ పురో హితుఁడు ౩ యువరాజు ౪ సేనాపతి ౫ దౌవారికుఁడు ౬ అంతర్వంశికుఁడు ౭ కారాగారాధిపతి ౮ అర్థసంచయకరుఁడు ౯ కార్యనియోజకుఁడు ౧౦ ప్రాడ్వి

వాకుఁడు ౧౧ సేనానాయకుఁడు ౧౨ నగరాధ్యక్షుఁడు ౧౩ కర్మాంతికుఁడు ౧౪ సభ్యుఁడు ౧౫ ధర్మాధ్యక్షుఁడు ౧౬ దండపాణి ౧౭ దుర్గపాలుఁడు ౧౮ రాష్ట్రాంతపాలుఁడు. ౧ మంత్రి = Minister = ఆలోచనము చెప్పువాఁడు. ౨ పురోహితుఁడు=Private Secretary ౩ యువరాజు = Prince ౪ సేనాపతి = సేనలకన్నిటికి నధిపతి Commander in-chief ద్వారపాలకుఁడు = అంతఃపురాది ద్వారపాలకులయందు మేటి Gate-keeper ౬ అంతర్వంశికుఁడు=అంతఃపుర కార్యనిర్వాహకుఁడు- Palace Controller ౭ కారాగారాధిపతి=చెఱసాలల కధిపతి- Superintendant of Jails ౮ అర్థసంచయకరుఁడు = ధనము రాఁబట్టువాఁడు- Revenue officer Collector ౯ కార్యనియోజకుఁడు = రాజాజ్ఞలను వెల్లడించువాఁడు- ౧౦ ప్రాడ్వివాకుఁడు = న్యాయస్థానమున న్యాయ విచారణకర్త Judge "వివాదే పృచ్ఛతి ప్రశ్నం ప్రతిప్రశ్నం తథైవచ, ప్రియపూర్వం ప్రాగ్వదతి ప్రాడ్వివాకస్తతః స్మృతః॥" అని ప్రాడ్వివాక లక్షణము- ౧౧ సేనానాయకుఁడు = సేనయందలి భటులకు జీతము బత్తెము విచారించువాఁడు- ౧౨ నగరాధ్యక్షుఁడు = రాత్రులందు నగరద్వార ప్రాకారాదుల ప్రహారితిరుగుచు రక్షించువాఁడు- ౧౩ కర్మాంతికుఁడు=కార్యాంతమందు రాజాజ్ఞప్రకారము సేనలందుఁజేరని జీతగాండ్రకు నందఱకు జీతములు పంచిపెట్టువాఁడు- Accountant-General ౧౪ సభ్యుఁడు = ప్రతిదినము సభనలంకరించుట రాజమంత్రి మొదలగువారి యాసనముల నేర్పఱచుట సభ్యులను రప్పించుట అసభ్యులను నిరోధించుట సభయందు శబ్దములేకుండఁ జేయుట సభారక్షకుల నియమించుట యీ యధికారము గలవాఁడు- ౧౫ ధర్మాధ్యక్షుఁడు=ధ్యాయభాగాది విషయమున వాదులాడువారి వాదములఁ బరిశోధించి ధర్మశాస్త్రప్రకారము పరిష్కరించువాఁడు Munsiff ౧౬ దండపాలుఁడు = జారులను జోరులను ఇతరాపరాధములఁ జేసిన వారిని దండించువాఁడు Magistrate ౧౭ దుర్గపాలుఁడు=దుర్గము=కోట- గిరిదుర్గము జలదుర్గము వనదుర్గము లోనగు దుర్గములను నెల్లప్పుడు కాపాడువారిపై యధికారి- ౧౮ రాష్ట్రాంతపాలుఁడు=రాష్ట్రమును బరరాజు లాక్రమింపకుండఁ బొలిమేరలను సర్వదా రక్షించువారిపై నిర్వాహకుఁడు- ఈ పదునెనమండ్రుగురు తీర్థులనఁబడుదురు. వీరందఱు పరపక్షమువారు స్వపక్షమున మొదటిముగ్గుర ననఁగా మంత్రి- పురోహితుఁడు- యువరాజు వీరు తప్పఁ దక్కినవారు ఈ ముగ్గురు సమక్షమందే యుండువారు కావున వారివర్తనము ప్రత్యక్షముగనే తెలియుచుండును. గావున వీరలపైఁ జారుల వేయరాదు.

"చారాన్ విచాచారయేత్తీర్థేష్వాత్మనశ్చ పరస్యచ పాషండాదీ నవిజ్ఞాతానన్యోన్య మితరైరపి। మంత్రిణం యువరాజంచ హిత్వాస్వేషు పురోహిత"మ్మని నీతిశాస్త్రము.

తీర్థలక్షణము. 'యో నౌ వ జలావతారేచ మంత్ర్యాద్యష్టా దశస్వపి పుణ్య క్షేత్రే తథా పాత్రే తీర్థంస్యా ద్దర్శనేష్వపి'అని హలాయుధుఁడు చారులను = వేగు వాండ్రను- ముగ్గురను = ఒక్కొక్క- తీర్థమునకు ముగ్గురుచొప్పున ఈ ముగ్గురు తాము వేగులవారని పరులకుఁ దెలియరాదు- వారిలోవారికిఁ దెలియరాదు. ప్రగ తుఁడు=శత్రువు- అవమానదృష్టిని=అగౌరవముతోఁగూడిన చూపుతో.

తా త్ప ర్య ము.

ఇతరరాజుల విషయమున మంత్రి- పురోహితుఁడు- యువరాజు- సేనానాయ కుఁడు- చెఱసాలయధిపతి మొదలైన పదునెనమండ్రను తీర్థలను దనపక్షమున మొదటి ముగ్గురనువిడిచి పదునేవురను వీరి నడవడియెట్టిదో తెలియుటకై యొక్కొ క్కరికి ముగ్గురు ముగ్గురు చొప్పున వేగువాండ్రను వారు వేగులని వారిలోవారికిఁ గాని పరులకుఁగాని తెలియకుండునట్లు నియమించుచున్నావా? శత్రువైనకారణముచే ముందు తఱుమఁబడి పొగరు వదలినవాఁడయ్యు మరల నీయొద్దకు వచ్చెనేని వాఁడు బలహీనుఁడని యవమానింపవుకదా బలహీనుఁడని యవమానింపనురాదు. కేవలము బలహీనుఁడని యెక్కువ చనువీయనురాదు. వాస్తవముగా గర్వముడిగి వేఱుదిక్కు లేక వచ్చెనో యెవరిసాహాయ్యమైనఁ గలవాఁడై మోసబుద్ధితోనే వచ్చెనో తెలియ వలయును. గావున సావధానుఁడవై యుండవలయును. చేరుటయనఁగా యుద్ధము నకై వచ్చుట యని యొకరు వ్రాసియున్నారు. ఒకసారి దెబ్బతిని పోయినవాఁడు మరల యుద్ధమునకు వచ్చెనేని మఁందు దెబ్బతినిపోయిన బలహీనుఁడేకదా యని యలక్ష్యదృష్టిఁ జూడరాదు. అవమానము సహింపలేక విదులాపుత్రునివలె యశో వా మృత్యుర్వా యనియైన వచ్చియుండవచ్చును. లేదా బలమైన యితర సాహా య్యము సుగ్రీవునివలె సంపాదించుకొనియైన వచ్చియుండవచ్చును. కావునఁ దగిన సన్నాహముతోనే యుద్ధమునకుఁ బోవలెను. పూర్వోత్తర సందర్భములు విచారిం పక గర్వమున వాలివలెఁ బోరాదు.

కం. లోకాయతికుల విప్రుల, నేకాలమునందుఁ గొలువ • వే కద? వార
స్తోకానర్థచణుల్ సుమి, ప్రాకటవిపరీతమతులుఁ • బండితమానుల్. ౨౨౭ ॥

లోకాయతికులగువిప్రులన్=లోకాయతికులగు బ్రాహ్మణులను- అస్తోకానర్థ చణుల్=మిక్కిలి కీడుగలిగించువారు- ప్రాకటవిపరీతమతులు=స్పష్టముగా విపరీతజ్ఞా నము గలవారు- పండితమానుల్=పాండిత్యము లేకపోయినను దమ్మునఁదాము పండి తులమని తలఁచువారు.

లోకాయతికులు = (1) లోకమున+ఆయతము = విస్తారమైనది- లోకాయ తము = ప్రత్యక్షప్రమాణము- అదికలవారు లోకాయతికులు- మతవ్యక్తీయ తద్ధి తాంతము. చార్వాకులు మొదలగు నాస్తికమతమునఁ జేరినవారు. వీరు ప్రత్యక్ష

ప్రమాణవాదులు. ప్రత్యక్షమేకం చార్వాక యని ప్రమాణము (2) లోకము దీనిమూలమున జనులందఱు చూతురు. ప్రత్యక్షప్రమాణము. అయితము = సమస్త స్థలములందున్న సాధ్యాంశమును గ్రహించుటకు సాధనము హేతువ్యాపక సాధ్య గ్రాహకము. అనుమానప్రమాణము. ఈరెంటిని గలవారు లోకాయతికులు. బౌద్ధాదులు. వీరికిఁ బ్రత్యక్షానుమానములు ప్రమాణములు. జాబాలి చేసిన వాదము వీరివాదమే. ఈకాలమున వీరు అచలపరిపూర్ణవాదులని రహితవాదులని శుష్కాద్వైత వేదాంతులని చెప్పఁబడుచున్నారు.

భగవద్గీతయందుఁ బదునాఱవ యధ్యాయమున శ్రీకృష్ణ భగవానుఁడు చెప్పిన ఆసురప్రకృతులువీరే. ఇట్లుచెప్పుటచే నీకాలమందువలె నాకాలమందును నిట్టివారు కొందఱు గలరని యేర్పడుచున్నది. ఇది స్వభావసిద్ధమే పశుపుజన్మమునం దుండి జీవుఁడు మనుష్యశరీరము తొలుతొల్త ధరించినపుడు పూర్వజన్మవాసనా బల ముచేఁ బూర్వపుఁ బశుభావముపోదు. పశువులకు దేహజ్ఞానమేకాని యాత్మజ్ఞానము లేదు. అట్లులే వీరలును. వీరికిఁ బరమార్థము దేహమే తరువాత నుత్తమజన్మములు వచ్చినను కామపూరిత మనస్కులగుటచే "నిప్పటి సుఖంబులె మేలయితోఁచు వారికిన్"అని భారతమునఁ జెప్పబడినట్లు వారికిఁ బరలోకదృష్టికలుగదు. ఆకాల మందిట్టివారిని దండించువారుండిరి. ఇప్పుడు వారులేరు. కావున విజృంభించు చున్నారు.

తా త్ప ర్య ము.

బ్రాహ్మణులుగదా యనుతలంపుతో నాస్తికవాదులైనచార్వాకులనుబౌద్ధులు లోనగువారిని నేసమయమందైనను గౌరవింపవుకదా! వారినిఁ జేరఁదీసితివేని యిక్కడి కీడీ లోకమునఁ బరలోకమునఁగూడఁ గలిగింతురు. ఏలనఁగా వారి మనస్సులు యథార్థమునకు విరుద్ధమైన యర్థమును గ్రహించినవి. ఏలన వారు పండితులు గాకున్నను తమ్మునేదాము పండితులమనితలఁచి సర్వజ్ఞత్వము తలపై వేసికొని విపరీత బుద్ధులు నేర్పుచుఁ దమ్మునమ్మినవారి నుభయలోకములఁ జెఱుతురు చార్వాకుఁడను వాఁడు బృహస్పతి శిష్యుఁడు బృహస్పతి గీతలయం దీనాస్తికవాదము గలదు.

ఆ. విద్యమానముఖ్య॰వివిధధర్మాగమ విధుల దుర్బుధులును ॰ వికలశుష్క-
వాదరతులు గాన ॰ వారితో సాంగత్య, మొదలి యుంట మేలు ॰ పుడమిపతికి ౨౨౮౩

నాస్తికవాదుల సాంగత్య మనర్థకారి యనుదానినే వివరించు చున్నాఁడు.

విద్యమాన = సత్సంప్రదాయ పరంపరగాఁ జదువఁబడుచున్నవియు- ముఖ్య= తామస స్మృతి పురాణములుకాక సాత్త్వికములై సజ్జనాదరణీయములై ప్రధానము లయి యున్నవియును- వివిధ=పలువిధములగు- ధర్మాగమవిధులన్=ధర్మశాస్త్రముల యందు- దుర్బుధులు=దుర్బుద్ధికలవారును- వేదమార్గమునకు విపరీతమగు బుద్ధికల

వారును- వికట=మిక్కిలి వంకరమైనవియు- శుష్క = నిస్సారమై నిరర్థకములగు - వాద=వాదములయందు- రతులు=ఆసక్తిగలవారు- ఎడలి=వదలి- 'ఆర్షంధర్మోపదేశంచ వేదశాస్త్రావిరోధినా, యస్తర్కేణానుసంధత్తే సధర్మంవేదనేతర' యను స్మృతి యిటఁ బ్రమాణము. ఋషులకు సమ్మతమై వేదశాస్త్రములకు విరోధింపక తర్కములచేఁ జేయఁబడు నుపదేశము ధర్మము.

## తాత్పర్యము.

సత్సంప్రదాయ పరంపరగాఁ జదువఁబడునవియు, కేవలసాత్త్వికములయి, నాదరింపఁబడి ప్రధానములైనవియు నానావిధములగు ధర్మశాస్త్రములందు విపరీతబుద్ధిగలవారై వక్రమును నిస్సారములు నిరర్థకములయిన తర్కయుక్తి వాదములందుఁ బ్రీతిగలవారు కావున వారితోఁ గలిసి మెలసి యుండినఁ గీడుతప్పదు.

సీ. వరదృఢద్వారంబు • వారణఘోటక,రథసంకులం బయి•ప్రకాలుదాని
సంతతోత్సాహులు • సంజితేంద్రియు లార్యు, లాత్మకర్మరతులు•నైన విప్ర
రాడ్వైశ్యజనులచే • రాజిత మవుదాని, బహువిధప్రాసాద•పటలి గలిగి
వైద్యజనాస్తిని • హృద్య మౌదానిని, నిత్యసంతుష్టిని • నెగడుదాని

తే. పీరు లగుమనపూర్వులు • విహితరీతిఁ, బాలనము సేసి పట్టినా•పట్టణంబు
మనయయోధ్యను సార్థక•మహితనామి,కగను బాలింతువే తండ్రి!•కరముఁ బ్రీతి. ౨౨౭౪

వరదృఢద్వారంబు=శ్రేష్ఠమై గట్టిమైన గవనివాకిలిగలది- వారణ=ఏనుఁగులచేతను- ఘోటక=గుఱ్ఱములచేతను- రథ=తేర్లచేతను- సంకులంబు=కలఁతచెందినది- సంతతోత్సాహులు = ఎడఁతెగని యుత్సాహముగలవారు- సంజితేంద్రియులు = చక్కఁగా జయింపఁబడిన యింద్రియములు గలవారు- ఆర్యులు = గొప్పగుణములు గలవారు- ఆత్మకర్మరతులు=తమతమ శాస్త్రీయ వర్ణాశ్రమములకుఁ దగిన కర్మములు చేయుటయందుఁ బ్రేమకలవారు- విప్రరాట్ వైశ్యజనులచే=బ్రాహ్మణక్షత్రియవైశ్యజనులచే- రాజితము=ప్రకాశించునది- బహువిధప్రాసాదపటలి=అనేకవిధములయిన మేడలసమూహములు- వైద్యజనాస్తిని=విద్వాంసులగువారుండుటచే- హృద్యము=మనోహరము- నిత్యసంతుష్టి = ఎల్లప్పుడు కొఱఁత యనునదిలేక సంతోషముచే- విహితరీతిక్=ధర్మపద్ధతిని- అయోధ్యను- సార్థకమహితనామికగన్ = అర్థముతోఁ గూడిన పేరుగలదానిని- అయోధ్య యనఁగా యుద్ధమున జయింపసాధ్యముగానిది- కరము=మిక్కిలి.

## తాత్పర్యము.

దృఢమైన గవనివాకిండ్లుగలిగి యేనుఁగులు గుఱ్ఱములు రథములు వీనిచేఁ గలఁతచెంది ప్రకాశించుచు నెల్లప్పుడు నుత్సాహముగలవారును జితేంద్రియులును

సద్గుణసంపత్తిగలవారును- వారివారి వర్ణాశ్రమధర్మముల ననుసరించి పనిచేయువారు నగు బ్రాహ్మణులచేతను- క్షత్రియులచేతను- కోమట్లచేతను- ప్రకాశించునదియు ననేకవిధములగు మేడలుగలిగి పండితజనులచే శోభిల్లి మనోహరమై నిత్యసంతోషముగలదానిని వీరులయిన మనపెద్దలుధర్మపద్ధతి తప్పక రక్షించిన మనపట్టణము నయోధ్యను శత్రువుల కసాధ్యమై దానిపేరు సార్థకమగునట్లు మిక్కిలి ప్రీతితోఁ బాలించుచున్నావా?

సీ. నిలుకడ నెలవుల ♦ నెలకొన్న వారిచే, శతయజ్ఞకలితసు♦స్థలులచేత
దేవాలయప్రపా♦పావనసరసుల, సంహృష్టనరపుణ్య♦సతులచేత
నొప్పుగా వరసమా♦జోత్సవంబులచేత, నాకృష్టపశుసమూ♦హములచేత
సంతతాహింసక♦జనసంఘములచేత, వాన నమ్మనిశాల్య♦వనులచేత
తే. సత్త్వములు లేక సహృదయ♦జనులచేత, భీతభయులైనవారుల♦వేలచేతఁ
గనకమణిరౌప్యభాసిత♦ఖనులచేత, నొప్పు మనసీమ సుఖముగ ♦ నున్నదయ్య?
౨౨౮॥

నిలుకడనెలవులన్=స్థిరమైన యిండ్లయందు- నెలకొన్నవారిచేన్ = కాఁపురములు చేయువారిచే (నెలవుకొను=నెలకొను) ఈ రాజ్యము మంచిరాజు పాలనము క్రింద నుండుటచేతను, ఇందు సువృష్టికి నారోగ్యాదులకుఁ గొఱఁతలేక యుండుటచేతను దీనినివదలి యొక్కప్పుడైన దేశాంతరముపోవ నక్కఱలేకుండునట్లు జనులిందే సుప్రీతితో స్థిరముగాఁ దరతరములుగా వసించుచున్నారనిభావము. శతయజ్ఞకలిత సుస్థలులచేతన్=అశ్వమేధాంతములగు ననేకయజ్ఞములు చేసినస్థలములచేతను- దేవాలయ=దేవళములచేతను- ప్రపా = బాటసారులకు ద్రావనీళ్ళిచ్చు చలిపందిళ్ళచేతను- పావనసరసులన్=పవిత్రమైన జలములుగల కొలఁకులచేతను- సంహృష్ట నరపుణ్యసతులచేతన్ = మిగులసంతోషించిన పుణ్యపురుషులచేతను పుణ్యస్త్రీలచేతను- వరసమాజోత్సవంబులచేతన్ = శ్రేష్ఠములైన సభలయుత్సవంబులచేతను- ఆకృష్ట= సర్వత్ర చక్కఁగా దున్నఁబడిన భూములచేతను- కొంతదున్ని కొంతదున్నకవిడిచిన భూములుగాని బొత్తిగదున్నకయే విడిచిన భూములుగాని లేవనుట పశుసమూహములచేతన్=ఆవులు మేఁకలు మొదలగు పశువుల మందలచేతను- సంతతాహింసక జనసంఘములచేతన్ = ఒకరివలన నొకరికి నేవిధమైన బాధయులేని మనుష్యులగుంపులచేతను- వాననమ్మని = వానకురిసిననే పండును లేనియెడలఁ బండదను భయము లేని- భూమియంతయు సరయూనదీతీరము గాన వర్షముకురిసినను గురియకున్నను పొలములకు నీళ్ళులేవను విచారములేదని భావము.

భూమియంతయు నదీమాతృకమేయని తాత్పర్యము. శాల్యవనులచేతన్ = శాలి+వనులచేతన్=వడ్లుపండెడి మాగాణి (తరి) భూములచేతను- సత్త్వములు=

క్రూరమృగములు- సహృదయ = మంచిమనస్సులతోఁ గలసిమెలసి యైకమత్యము గల- జనులచేతన్=ప్రజలచేతను- వీతభయులు = ఈతిబాధలవలన దొంగలు మొదలైనవారివలన భయములేనివారు- పౌరులవేలచేతన్=వేలకొలఁది పురజనులచేతను- కనక=బంగారు- మణి=రత్నములు- రౌప్య=వెండి వీనిచే- భాసిత = ప్రకాశించు- ఖనులచేతన్=గనులచేతను- మత్సీమ=మన దేశము.

శ్లో॥ రాజ్ఞః సప్తైవ రక్ష్యాణి తాంచైతాని బోధమే। ఆత్మామాత్యాశ్చ కోశశ్చ దండోమిత్రాణి చైవహి। తథాజనపదాశ్చైవ పురంచ కురునందన। ఏతత్సప్తాత్మకం రాజ్యం పరిపాల్యం ప్రయత్నతః॥ యదారక్షతి రాష్ట్రాణి యదాదస్యూనపోహతి। యదాజయతి సంగ్రామే సరాజ్ఞో ధర్మఉచ్యతే॥ రాజధర్మ-రాజు-మంత్రులు- కోశము- దండము- మిత్రులు- జనపదములు పురము ఈయేడుగలది రాజ్యము వీనిని రాజెటులైనఁ బరిపాలింపవలయును. రాష్ట్రము రక్షించి దొంగవైరుల గెలిచిన రాజే ధర్మజ్ఞుఁడు.

తాత్పర్యము.

నాయనా! మనదేశమందింతవఱకు ఈరాజులు మంచివారు ధర్మముగఁ బాలింతురు. ఈదేశము మంచిది- రోగాదిబాధలులేనిది- యనుతలంపుతోఁ బ్రజలు తరతరములుగ స్థిరముగఁ గాఁపురములు చేయుచున్నారు. ఇంకొక్కొక్క స్థలమునందు ననేక మహాయాగములు చేయఁబడినవి- విష్ణ్వాలయములేని గ్రామమం దొకనాఁడైన వసింపరాదు. అందు భుజింపరాదని యుండుటచే ("విష్ణ్వర్చారహితే గ్రామే విష్ణ్వర్చారహితేగృహే॥ నతత్రభోజనంకుర్యాత్, నతత్రదివసంవసేత్॥" విష్ణువిగ్రహము పూజింపఁబడని గ్రామమందు విష్ణుపూజజరుగని యింటియం దొకనాఁడైన నిలువరాదు భుజింపనురాదు అని యర్థము) ప్రతిగ్రామమందును దేవాలయములు గలవు. దప్పిగొన్న బాటసారులకు నీళ్ళిచ్చు చలిపందిళ్ళుగలవు. తటాకములు కొలఁకులు గలవు. పుణ్యపురుషులు పుణ్యస్త్రీలు సర్వదా సంతోషయుక్తులై యుందురు సభామందిరములందు నుత్సవములు జరుగుచుందును. బీడుభూమి కొంచెమైనను లేదు. ఆవులమందలకు, మేఁకలమందలకు నిట్టి పశువులమందలకుఁ గొఱఁత లేదు. ప్రజలలో నొకరివలననొకరికి బాధలేదు. వరిపైరుపండుటకు వానను నమ్మి యాకాశ మొగఁజూడవలసిన పనిలేదు. క్రూరమృగములులేవు. జనులందఱు స్నేహభావముచే నైకమత్యము గలవారై యుందురు. వేలకొలఁది జనులు పురములందున్నను వారికేవిధమైన భయములేదు. బంగారుగనులు వెండిగనులు రత్నపుగనులు చాలఁగలవు. ఇట్టిమనదేశము సుఖముగా నున్నదిగదా!

తే. దున్నియిలజీవనము చేయు • చున్నవారి, పశువులను మేపుకొనుచును • బ్రతుకువారి
పట్లఁ బ్రీతి వహింపుదే • వర్తకమున, బ్రదుకుని యాశ్రితులకు శు • భంబు గలదె?

తా త్ప ర్య ము

భూమిదున్ని జీవనముచేయువారి విషయమందును పశువులనుమేపి జీవించువారి విషయమందును వారు కష్టజీవులు గావున వారికిఁగావలసిన పదార్థముల సాహాయ్యము చేయుచున్నావా? ప్రజలు తమయాహార పదార్థములకు వారిపైఁగదా యాధారపడియున్నారు. అట్లులే వాణిజ్యముచే జీవించుచు నిన్నాశ్రయించుచుండు వారికి శుభమేకదా వారికి నీవలనఁగాని యితరులవలనఁగాని పీడలేదుగదా.

కం. ఇష్టంబుఁ గూర్చి వారి క, నిష్టంబును దీర్చి ప్రోతు • వే? జనములు సం
తుష్టిని మన భూపతి విధి, దృష్టగతిం గావ వలయు • నెవ్వారి నైనన్.        ౨౨౭౭

కృషిగోరక్షా వాణిజ్యాదులఁ జేయువారి రక్షణము రాజుల కవశ్యకర్తవ్యమని విశేషించి చెప్పుచున్నాఁడు.

ఇష్టంబుఁగూర్చి=కృషిచేయువారికిఁ గొఱముట్లకుఁగాను గావలసిన కొయ్యసామాను నెరవునకు నాకులడవులనుండి తెచ్చుకొనుటకుఁ బసవుల నడవులలో మేయుటకు నాజ్ఞ యిచ్చుట మొదలయినవి- అనిష్టంబులు=వారిపశువులకు మృగాది బాధలేకుండఁ జేయుట- ఇట్లే తక్కినవారినిగుఱించి యాలోచించునది- ప్రోతువే = రక్షించుచున్నావా- సంతుష్టిని=సంతోషములో- మనన్=బ్రదుకునట్లు- విధిదృష్టగతిన్=శాస్త్రమందుఁ గానవచ్చువిధముగా- ఎవ్వారినైనన్ = ఏవర్ణమువారి నైనను ఏయాశ్రమమువారి నైనను.

తా త్ప ర్య ము.

కృషి- గోరక్షణము- వాణిజ్యము చేయువారికి రాజ ప్రాపకత్వం తావశ్యకము కావున వారికిఁ గావలసినసాహాయ్యము చేయుచు వారిబాధలు దీర్చుచున్నావా? రాజగువాఁడు సమస్త వర్ణాశ్రమముల వారిని శాస్త్రమునఁ జెప్పినచొప్పున రక్షింపవలయును.

కం. నీకాంతల మన్నింతువె? ప్రాకట రక్షితలె వారు • వారలపలుకుల్
చేకొన కుందె? రహస్యం బేకాంతమునందు నైన • నెఱిఁగింపవుగా?        ౨౨౭౮

తా త్ప ర్య ము.

నిన్నాశ్రయించియుండు స్త్రీలను గౌరవించుచున్నావుకదా! వారికిఁ బరపురుష సంబంధము బాధలేకుండునట్లు రక్షించుచున్నావా? వారి బుద్ధిప్రకారము నీవు నడచుటలేదుకదా! ఏకాంతమందైనను నీవువారికి రహస్యవిషయములు చెప్పవుగదా! వారు చపలచిత్తులు కావున రహస్యము దాఁపలేరు.

శ్లో॥ పూజనీయా మహాభాగాః పుణ్యాశ్చ గృహదీప్తయః
స్త్రియశ్శ్రియో గృహస్యోక్తాస్తస్మాద్రక్ష్యా విశేషతః ॥

స్త్రీలు భాగ్యవతులు- పుణ్యవతులు- గృహదీపములు- గృహస్థునిపాలి లక్ష్ములు- పూజనీయులు. కావున వారిని విశేషించి రక్షింపవలయును. కానివారిని నమ్మరాదు. ఉద్యోగ.

శ్లో॥ అర్హంతి నైవవిశ్వాస మర్థకామ పరాస్త్రియః
తాసు తత్త్వేనన బ్రూయా న్నాతిస్నేహా త్సదాసుధీః॥ భోజ.

బుద్ధిమంతులు స్త్రీలను నమ్మరాదు. వారెప్పుడు నర్థకామములందే యాసక్తి గలవారు. కావున మర్మమువిడిచి యథార్థము వారికిఁ జెప్పరాదు.

శ్లో॥ స్త్రీషు రాజసు సర్పేషు స్వాధ్యాయే శత్రుసేవిషు
భోగేష్వాయుషి విశ్వాసం కఃప్రాజ్ఞః కర్తుమర్హతి ॥

స్త్రీలను- రాజును- సర్పమును- స్వాధ్యాయమును శత్రుసేవకుని, భోగమును ఆయుస్సును బుద్ధిగలవాఁడెవ్వఁడు నమ్మును; ఉద్యోగ.

స్వభావ దౌర్బల్యమునకుఁ దోడు స్త్రీలకు ధర్మరాజుశాపంబును గలదు.

గీ॥ అంగనా జనమ్ములకు రహస్యరక్షణంబునం
దలిశక్తి మనంబులందుఁ, గలుగకుండెడు
నెల్లలోకముల నని శపించెనా ధర్మజే
వశా ప్రియ సుతుండు ॥ భార. శాంతి. ౧-౪౧.

కం. నాగవనము రక్షింతువె! బాగుగ ధేనుకలు గలవె ♦ పట్టఁగఁ గకులన్?
నాగాశ్వవశార్జనమున, నేగతి సంతుష్టిలేక ♦ యొసఁగుదువు కదా! ౨౨౬౯

నాగవనము=ఏనుఁగులుండునడవి- ధేనుకలు = ఆఁడేనుఁగులు- నాగ=ఏనుఁగులయొక్కయు- అశ్వ=గుఱ్ఱములయొక్కయు- వశా = ఆఁడేనుఁగులయొక్కయు- అర్జనమునన్=సంపాదించుటయందు- సంతుష్టి=తృప్తి.

తా త్ప ర్య ము.

ఏనుఁగులుండు నడవుల రక్షించుచున్నావుగదా! నీవు రక్షింపనియెడల నితరు లేనుఁగులఁ బట్టుకొనిపోదురు. మగయేనుఁగులఁ బట్టుటకు నాఁడేనుఁగుల రక్షించుచున్నావుగదా! నా కిన్ని యేనుఁగులు గుఱ్ఱము లున్నవి చాలునని తృప్తి పడక యాఁడేనుఁగులను మగయేనుఁగులను గుఱ్ఱములను సంపాదించుచున్నావా!

కం. దినముదినంబును వఱువాతను భూమిజనుల కెల్ల ♦ దర్శన మిడు దే!
యనుమానింతురు దేహంబున కేమో నృపతి కనుచుఁ బొడచూపనిచోన్.
౨౨౭౦

వఱువాతను=ఉదయకాలమున- పొడచూపనిచోన్=కానరాకున్న యెడల.

## తాత్పర్యము

ప్రతిదిన ముదయకాలమున సభయందుఁ బ్రజలకు దర్శన మిచ్చుచున్నావా? కొన్నిదినములు రాకపోయితివేని నీకేమో రోగము వచ్చినది- ఆకారణమున వెలువల రాలేదని సందేహింతురు.

కం. పనివాండ్రను విచ్చలవిడిఁ, దనుఁ జేరఁగ నీయరాదు ♦ తలచుగ వారిన్
గనుఁగొనక యుండరా దిం,దును మధ్యమవృత్తిమేలు ♦ దొరలకుఁ బావన్. ౨౫౧

## తాత్పర్యము.

సేవకులు నియమములేక వారివారి యిష్టానుసారము వచ్చుచుఁ బోవుచుండు రేని యతిపరిచితివలన వారు నిన్నుఁ జులకనగాఁ జూతురు. వారిని బొత్తుగఁ జూడకయు నుండరాదు. ఎప్పుడైన నొకసారి చూచి వారి స్థితిగతులు రాజు విచారింపవలెను.

కం. ధనధాన్యతోయసాధన, వినిచయసంగతములే ప్ర♦వీరభటశరా
సనధరయుతములె శిల్పక,జనయుక్తములౌనెదుర్గ♦చయములు భరతా! ౨౫౨

నీదుర్గచయములు=నీకోటలసమూహములు- దుర్గము = చొరరానిది- ధన- ధాన్య- తోయ- సాధన- వినిచయసంగతములె = ధనముయొక్కయు- ధాన్యము యొక్కయు, జలములయొక్కయు, నాయుధముల యొక్కయు- సమూహములచేఁ గూడినవి- ప్రవీరభటశరాసనధరయుతములె=మిగులవీరులగు భటులతోను- విలుకాండ్రచేతను గూడియున్నవా? శిల్పకజనయుక్తములు = శిల్పపుఁబని చేయువారితోఁ గూడియున్నావా? ఔదకం పార్వతం వార్క్షమైరిణం ధాన్వనం తథా, జలాన్నాయుధయంత్రాఢ్యం వీరయోధైరధిష్ఠితం, గుప్తిప్రాధాన మాచార్యాదుర్గం సమను మేనిరే యని కామందకము.

## తాత్పర్యము.

తమ్ముఁడా! నీ గిరిదుర్గములు-జలదుర్గములు-వనదుర్గములు-లోనైనవి ధనము చేతను- ధాన్యముచేతను-జలములచేతను- ఆయుధములచేతను గూడి యున్నవికదా! వీరులగు భటులు విలుకాండ్రు రక్షించుచున్నారుగదా! పనులుచేయుటకు శిల్పులున్నారుగదా.

ఉ. ఆయము లున్న దండిగ? వ్య♦యంబును స్వల్పము చేయుచుంటివే?
యేమొడ నీధనంబుఁ జన ♦ నీయవు గాదె యపాత్రులందు? నీ
వీయుదె యోధపాతిథిమ♦హీసురమిత్రులకు న్ధనంబులన్?
జేయుదె దేవతాపితృల♦ చేతలకై ధనరూపసాహ్యమున్? ౨౫౩

ఆయములు = ఆదాయములు- దండిగ = విశేషముగ- అపాత్రులందున్ = అయోగ్యులందు- యోధప=ముఖ్యయోధులకు- అతిథులకు- మహీసుర = బ్రాహ్మ

గులకు- మిత్రులకున్ = స్నేహితులకు- దేవతాపితృలచేఁతలకై = దేవతాకార్యములు- పితృకార్యములు చేయువారికి.

తా త్ప ర్య ము.

వ్యయమునకంటె విశేషించి యాదాయ మున్నదికదా! ఆయమును మించి వ్యయము చేయకుండు టేగాక యాయమునకంటెఁ దక్కువగానే వ్యయముచేయుచున్నావుకదా! అయోగ్యులకు అనఁగా నటవిటగాయక చేటీవేశ్యలకు విశేషముగ నీవు ధనమియ్యవుగదా! యోధముఖ్యులకు నతిథులకు బ్రాహ్మణులకు స్నేహితులకు ధనము లిచ్చుచున్నావా? వీరికిచ్చుట సత్పాత్రవినియోగము. దేవతాకార్యములు పితృకార్యములు చేయువారికి ధనమిచ్చి సాహాయ్యము చేయుచున్నావా? అన్ని కార్యములు మనమే చేయఁజాలము గావునఁ జేసెడివారికిఁ దోడుపడవలయును. పుణ్యకార్యములు స్వయముగఁ జేయఁజాలనివారు, వానిని జేసెడివారికి సాహాయ్యము చేసినచోఁ గొంతపుణ్యము లభించును.

చం. అమలమనస్కుఁడున్ శుచియు • నార్యుఁడు నైనొకరుండు చోరక
   ర్మమునను దూషితుం డయినఁ • బ్రాజ్ఞుల నీ వడుగంగఁబోక లో
   భమున వధింతువా? ఖలుఁడు • పట్టుపడంగ సకారణంబ చౌ
   ర్యమునకు వానిచే ధనము • లంది వధింపక వీడవే కదా? ౨౨౫౮

అమలమనస్కుఁడున్=నిర్మలమైన మనస్సుగలవాఁడును- శుచియున్=వాక్కాయములందుఁ బరిశుద్ధుఁడును- ఈరెండు విశేషములవలన వీఁడు త్రికరణశుద్ధిగలవాఁడని యేర్పడుచున్నది. ఇట్టివాఁడు- చోరకర్మమునను=దొంగతనముచేత- దూషితుండయినన్=నిందింపఁబడెనేని- అత్యాశచే = వానినివధించిన వానిద్రవ్యము నీకులభించునుగదా యనునాశచే ననిభావము- వధింతువా=చంపుదువా- ఖలుఁడు=దుష్టుఁడు- సకారణంబ=సరియైన కారణముతో- చౌర్యమునకున్=దొంగతనమునకు.

తా త్ప ర్య ము.

త్రికరణ శుద్ధుఁడైనవాఁడొకఁడు దైవవశమున దొంగతనము చేసినాఁడని నిందింపఁబడెనేని వాని నేమిచేయవలయునని బుద్ధిమంతుల నడుగక వానిని జంపిన వానిద్రవ్యము నీ ధనశాలచేరునను తలంపుతో వానిని జంపవుకదా! వాస్తవముగ నేరముజేసి దొంగతనమునకై పట్టుపడెనేని వానివలన ధనలాభము పొందినవాఁడవై వానిని జంపక వదలిపెట్టవుకదా?

కం. ధనికునకును ధనహీనునకును వ్యవహారంబు పొసఁగఁ • గుటిలత మంత్రుల్
   ధనికునిరొక్కముపై నాశను గొన కుండఁగఁ బరీక్ష • సలుపుదె వారిన్? ౨౨౫౯

తా త్ప ర్య ము.

ధనము కలవానికిఁ బేదవానికిఁ గలహము గలిగినప్పుడు కుటిలబుద్ధులై నీ మంత్రులు లంచగొంతులై ధనికుని ధనముపై నాశపడకుండునట్లు వారిని బరీక్షింతువా?

కం. దోసమును జేయ కుండియుఁ, శాసింపఁగఁ బడినయట్టి•జనములయశ్రుల్
వాసి చెడఁ జేయు భోగ్యై,కాసక్తు నృపాలుఁ బశుధ•నాత్మజహీనున్. ౨౩౬

తా త్ప ర్య ము.

దోషము చేయకయు దండింపఁబడిన వానికన్నీళ్ళు భోగము నందాసక్తిగల రాజుయొక్క పశువులను ధనములను గొడుకులను జంపును. నేరము చేసిన వానిని విడుచుటవలనఁ గలుగుపాపమునకంటె నేరముచేయనివానిని దండించిన నెక్కువ పాపముగలదు.

కం. బాలుర వృద్ధుల వైద్యుల, నోలిని వశ్యులుగఁ జేయు•చుందువు కాదే
మేలిధనంబులఁ బ్రేమను,మై లలితోక్తులను మూఁడు•మార్గంబుల చేతన్. ౨౩౭

తా త్ప ర్య ము.

బాలకులను ముదుసళ్ళను వైద్యులను బుజ్జగింపు మాటలచేతను బ్రేమతో నాదరించుటచేతను ధనమిచ్చుటచేతను నీమూఁడుమార్గములచే వశపఱుచుకొను చున్నావా?

కం. గురువృద్ధతాపసోర్వీసురచై త్యాతిథుల కెల్ల • శుభసిద్ధార్థో
త్కర దేవతాళి కెల్లను, వరమతి వయి మ్రొక్కు చుందు•వా కడుభక్తిన్?
౨౩౮

ఉర్వీసుర = బ్రాహ్మణులకు- చైత్య= నాలుగుత్రోవలు కలియుచోటనుండు దేవతావాస వృక్షములకు- సిద్ధార్థోత్కర = ప్రయోజనము సిద్ధించినవారి సమూహములకు- దేవతాళికిన్ = దేవతలసమూహములకు- వరమతివై = నిర్మల మనస్సు గలవాఁడవై.

తా త్ప ర్య ము.

గురువులకు- వృద్ధులకు- తాపసులకు- బ్రాహ్మణులకు నాలుగువీథులు కలియు చోట దేవతలువసించు చెట్లకు నతిథులకు శుభప్రయోజనము- మోక్షలాభము సిద్ధించినవారికి- దేవతలకందఱకు మిగులభక్తితో నిర్మలమనస్సుతో నమస్కరించు చున్నావా?

కం. అర్థముచే ధర్మంబును, నర్థము ధర్మంబుచేత • నవి కామముచే
వ్యర్థంబులు గాకుండ స,మర్థింతువె? సుఖము మరగి • యువి చెఱపవుగా? ౨౩౯

తా త్ప ర్య ము.

అర్థముచేత ధర్మంబును వ్యర్థముచేయుట లేదుగదా! యనఁగా ధర్మముసంపాదింపవలసిన సమయము పూర్వాహ్ణము, ఆసమయంబున నర్థముసంపాదించుట యెట్టు

లాయని యాలోచించుచు ధర్మముచేయక దానిని నేటఁగలుపుచున్నావా? అట్లులే యర్థము సంపాదింపవలసినకాల మపరాహ్ణము. ఆసమయమందు ధర్మవిచారము చేయుచు నర్థమును సంపాదింపక వ్యర్థముచేయుట లేదుకదా! రాత్రులందు ననుభవింపవలసిన కామము పూర్వాహ్ణముల నపరాహ్ణముల ననుభవించుచు నారెంటిని నాలోచింపక వానిని వ్యర్థముచేయుచున్నావా? ధర్మార్థకామముల మూఁటిని నేయేవేళ కేయేది చేయవలయునో యది యావేళకుసరిగాఁ జేయుచున్నావుగదా! అర్థముమీఁది యాశచే లోభివై ధర్మకార్యములుచేయుట మానలేదుకదా! కేవల ధర్మాసక్తిచేఁ గుటుంబపోషణమునకుఁ గావలసిన యర్థము సంపాదింప మానలేదుగదా! కేవల సుఖాభిలాషచే ధర్మార్థముల రెంటిని ధ్వంసము చేయలేదుగదా?

కం. ఉదయంబున ధర్మంబును, బదపడి యర్థంబు ప్రొద్దు•పడఁ గామం బ
యద్ది యెఱిఁగి యనుష్ఠింతువె? మది చెడి కలయంగ నీకు•మా రొంటొంటిన్. ౨౩౯౦

## తాత్పర్యము.

మీఁది విషయమునే స్పష్టీకరించుచున్నాఁడు. ఉదయకాలమున ధర్మార్జనము- ఆవల నర్థార్జనముచేసి ప్రొద్దుగ్రుంకినపిమ్మట నొకటిన్నర జామైనపిమ్మటఁగామ సుఖ మనుభవించుచున్నావా? ఒకదానితో మఱియొకటి కలుపుటలేదుగదా? ఉదయమనఁగా సూర్యోదయమునకు నరజాము ముందటినుండి యని గ్రహింపవలెను. ప్రొద్దుగ్రుంకినపిమ్మట ననఁగా సూర్యాస్తమయము కాఁగానే భార్యతోఁడఁ భోగశయ్య నలంకరింపుమని యర్థముకాదు. సాయాహ్నకృత్యములు భోజనాదులు జాముపఱకుఁ దీర్చుకొని యావల గంటకో గంటన్నరకో యనియర్థము. రాత్రి భోజనమైన తరువాత నధమపక్షము రెండుగంటలకులోగా భార్యతో సంగమింపరాదు.

తే. సర్వశాస్త్రార్థ నిపుణు లో•త్మవిబుధులు, పౌరజానపదాళితోఁ•బ్రత్యహంబు
నీవుధరమీఁద సుఖవయి•నెగడుటకును, బ్రార్థనముఁ జేయుచున్నారె•రాజసేనయ. ౨౩౯౧

సర్వశాస్త్రార్థనిపుణులు=సమస్తశాస్త్రంబులందు సమర్థులు- తొత్మవిబుధులు=బ్రాహ్మణులు- పౌరజానపదాళితోన్=పురము వారితోను బయటియూళ్ళవారితోను- ప్రత్యహంబు=ప్రతిదినము.

## తాత్పర్యము.

సకల శాస్త్రములయందు సామర్థ్యముగల పండితులగు బ్రాహ్మణులు పురజనులతోను బయటియూళ్ళవారితోను గలిసి మూరాజు సుఖముగ దీర్ఘాయువై

జీవించునుగాక యని ప్రార్థనము చేయునట్లు వారికి సంతోషకరముగ ధర్మపద్ధతిని రాజ్యము చేయుచున్నావుగదా! నానిమిత్తమై మీరు ప్రార్థనముచేయుఁడని యాజ్ఞ చేసి చేయించుట లేదుగదా?

సీ. అనృతంబుపలుకుట • నాస్తిక బుద్ధియు, దీర్ఘసూత్రత క్రుధ • ధీప్రమాద
మాలస్యమును జ్ఞాని•పాళికి దర్శనం, బీయ కుండుట పంచ•వృత్తితయును
గార్యంబుపట్ల నొ•క్కండ యాలోచించు, టెట్టివానికి నెదు•రేగు చుంట
నిశ్చితకార్యంబు • నెఱవేర్పమియు ననర్థజ్ఞులతోడ మం•త్రంబు సేత

తే. మంత్రమును రక్ష సేయమి • మంగళంబు, లైనకార్యంబులందు న•నాదరంబు
ననఁగఁ బరఁగెడిపదునాలు • గైనరాజ,దోషములు లేక యుండె ని•ర్దుష్టచరిత.

౨౬౯

అనృతంబు=అసత్యము- నాస్తికబుద్ధి = పరలోకములేదు ఈశ్వరుఁడు లేఁడను బుద్ధి-దీర్ఘసూత్రత=నిశ్చయించిన పిమ్మట వెంటనేకార్యముచేయ నారంభింపక రేపు చేయుదములే- మఱునాఁడు చేయుదములే యని వ్యర్థముగఁ గాలయాపనము చేయుట- క్రుధ = మాతాపితృ బ్రాహ్మణాచార్య దుర్బలులయెడను- అసమయములందును గోపము- ధీప్రమాదము = బుద్ధియజాగ్రత్త- ఆలస్యము=సోమరితనము- మదకరము లగు పదార్థములఁ దినుటచేఁ గలిగెడి మాంద్యము- జ్ఞానిపాళికిన్ = పండితసమూహమునకు- పంచవృత్తిత = పంచేంద్రియములకు వశుఁడై యుండుట- కార్యంబులపట్ల రాజ్యసంబంధ కార్యములందు- నిశ్చితకార్యము=కర్తవ్యమని నిశ్చయించిన కార్యము- అనర్థజ్ఞులతోడన్ = తనకుఁ గీడాలోచించువారితో- మంత్రమును- ఆలోచనను- మంగళంబులైన కార్యంబులందున్ = ఉదయమున నద్దము పూలు పరిగవస్త్రములు లోనైనవానిని జూచుట మొదలయినవి- అనాదరంబు=నిర్లక్ష్యభావము- నిర్దుష్టచరిత =దోషములేని నడవడిగలవాఁడా.

## తాత్పర్యము.

1 అసత్యముపలుకుట 2 పరములేదు, దేవుఁడు లేఁడనుబుద్ధి 3 కార్యముచేయక దీర్ఘాలోచనమునందే కాలముగడపుట 4 కోపింపరానివారి మీఁదను గోపింపరాని సమయములందును గోపించుట 5 బుద్ధిపొరపాటు 6 మాంద్యము 7 జ్ఞానులదర్శనము శ్రేయస్కరము గావున మనమైపోకపోయినను వారైవచ్చినపుడైనను వారిని దర్శింపకుండుట 8 పంచేంద్రియములకు లోపడియుండుట 9 రాజకార్యములను దానొక్కఁడే యాలోచించుట- 'కం. విను మధురాహారంబులు । గొనుటయుఁ బెక్కండ్రు నిద్ర గూరినయెడ మే । ల్కని యుండుట కార్యాలో । చనము దెరువు నడచుటయును జన దొక్కనికిన్ ॥ భార. 10. నీచునకుఁగూడ వాఁడురాఁగానే యెదురుగాఁ బోయి గౌరవించుట- లేక యేకకాలమున నానాదిక్కులనుండు శత్రువులపై దండెత్తుట - 11 నిశ్చయింపఁబడిన కార్యము చేయకుండుట- 12 అనర్థజ్ఞులగువారితో నాలోచిం

చుట 13 ఆలోచనను దాఁపక బయలుపెట్టుట– 14 శుభకార్యములందు నిర్లక్ష్యభావము– ఇవి పదునాలుగు రాజులయం దుండరాని దోషములు– ఇవిలేక రాజ్యము చేయుచున్నావుగదా?

రాజదోషము లింకను పెక్కులున్నను వానియందు ముఖ్యములైన యీ పదునాలుగని యెఱుంగవలయును.

కం. పదియును నైదును నాల్గెన్మిది యేడును మూఁడు నైన • నీతివర్గములన్
వదలక విద్యలమూఁటిని, మదిఁ దలఁతువె? యింద్రియముల • మర్దించితివే!
౨౭౩

పదివర్గములు=వేఁట– జూదము– పగటినిద్ర– అపవాదము– స్త్రీలు– మదము– నృత్తము– గీతము– వాద్యములు– వ్యర్థముగాఁ దిరుగుట– ఈపదియును "మృగయాక్షో దివాస్వప్నః పరివాదః స్త్రియోమదః తౌర్యత్రికం వృథాట్యాచ కామజో దశకోగుణః" ఇతి మనువు. లోభము– క్రోధము– ఆలస్యము– అసత్యము– అజాగ్రత– భయస్వభావము– అస్థిరత్వము– మూర్ఖ్యము– దుర్నీతి– అవమానపఱుచుట– యివి పది వర్గములని కామందకుఁడు.

అయిదువర్గములు=అయిదుదుర్గములు = జలదుర్గము– పర్వతదుర్గము– వృక్షదుర్గము– (మరు) ఎడారిదుర్గము– ధాన్వనదుర్గము– ఔదకం పార్వతం వార్క్షమైరిణం ధాన్వనంతథా శస్త్రంప్రశస్తమతిభిః దుర్గందుర్గోపచింతకైః" మనుస్మృతి.

అయిదువర్గములు=ఐదువైరములు– "సాపత్న్యం వస్తుజం స్త్రీజం వాగ్జాతమపరాధజమ్ వైరప్రభేద నిపుణై ర్వైరం పంచవిధం స్మృతమ్" కామందకుఁడు. జ్ఞాతులగుటచేతను– ఒకవస్తువు నాదినాదియని కలహించుటచేతను– స్త్రీలనిమిత్తముగను– పారుష్యముచేతను– అపరాధము చేయుటచేతను విరోధము గలుగును. ఈనైదు విరోధకారణములు.

నాలుగువర్గములు: 1 సామము– దానము– భేదము– దండము. 2 ఔరసమిత్రుఁడు– తంతుసంబంధ మిత్రుఁడు– వంశక్రమమిత్రుఁడు– వ్యసనమునుండి రక్షించుటచే నైనమిత్రుఁడు– ఈ నలువురు మిత్రులు. "ఔరసం తంతు సంబంధం తథా వంశక్రమాగతమ్ రక్షితం వ్యసనేభ్యశ్చ, మిత్రంజ్ఞేయం చతుర్విధ"మ్మని కామందకుఁడు. 3 న్యాయేనార్జన మర్థస్య, రక్షణంవర్ధనంతథా సత్పాత్రే ప్రతిపత్తిశ్చ రాజవృత్తం చతుర్విధమ్మని కామందకుఁడు. ధనమును న్యాయముగా సంపాదించుట దానిని రక్షించుట వృద్ధిచేయుట దానిని సత్పాత్రమునకు దానముచేయుట– ఈ నాలుగు ధర్మచతుష్టయ మనఁబడును. ఏడువర్గములు· 1 రాజు– మంత్రి– మిత్రుఁడు– బొక్కసము– రాష్ట్రము– దుర్గము– సైన్యము– ఇవి సప్తాంగములు. స్వామ్యమాత్యాశ్చరాష్ట్రంచ దుర్గకోశోబలం సుహృత్ । పరస్పరోపకారీదం రాజ్యంసప్తాంగ

ముచ్యతే॥ 2 తనపక్షమువారిలోని భేదములు- తనవాఁడు మిత్రుఁడు ఆశ్రితుఁడు- సుబంధుపుత్రుఁడు కార్యసముద్భవుఁడు భృత్యుఁడు అనేకవిధములగు నుపచారములచే వశపఱుచుకొనఁబడినవాఁడు- నిజోర్థమిత్రశ్చ సమాశ్రితశ్చ సుబంధుజః, కార్యసముద్భవశ్చ, భృత్యోగృహీతో వివిధోపచారైః పక్షంబుధా సప్తవిధంవదంతి— ప్రధానవ్యూహములేదు. 1 శ్యేన వ్యూహము 2 సూచీవ్యూహము 3 వజ్రవ్యూహము 4 శకటవ్యూహము 5 మకరవ్యూహము 6 దండవ్యూహము 7 పద్మవ్యూహము ఇవి ప్రధానములైనవి. ఇవిగాక గరుడవ్యూహము లోనైనవి కొన్ని గలవు. శ్యేనస్సూచీ చవజ్రశ్చ శకటోమకర స్తథాదండాఖ్యః పద్మనామాచ వ్యూహా సప్త ప్రధానతః॥

ఎనిమిదివర్గములు : కృషి- వాణిజ్యము- దుర్గములు- అనకట్ట- ఏనుఁగుల కట్టుట- గనులు పన్నురాఁబట్టుట శూన్యనివేశనము. "కృషి వాణిజ్య దుర్గాణి సేతుః కుంజర బంధనమ్। ఖన్యాకరః కరాదానం శూన్యానాం చనివేశనం। అష్టవర్గమిమం సాధు స్వస్థవృత్తోనలోపయేత్॥ కామందకుఁడు. "పైశున్యం, సాహసం ద్రోహం ఈర్ష్యాసూయార్థదూషణమ్। వాగ్దండ యోశ్చ పారుష్యం క్రోధజోపి గుణోష్టక॥ అని కామందకుఁడు. కొండెము చెప్పుట- సాహసము- ద్రోహము- ఈర్ష్య=ఓర్పులేనితనము- ఓర్పులేకపోవుటగాని ఓర్పునకు విరోధియైనదిగాని యగు గుణము- అజ్ఞులు=దుర్బలులు చేసిన యపరాధముల సహింపలేకపోవుట- అసూయ=పరులగుణములను దోషములుగాఁ జెప్పుట-ధనముయొక్క- వ్యర్థవ్యయము- వాక్పారుష్యము=నిష్ఠురముగ మాటలాడుట- ఇవి క్రోధమువలనఁ గలుగుగుణములు.

మూఁడువర్గములు :ధర్మము- అర్థము- కామము. 2 ఉత్సాహశక్తి- ప్రభుత్వశక్తి-మంత్రశక్తి- 3 ఇతరులక్షయము స్థానమువృద్ధి క్షయః స్థానంచవృద్ధిశ్చ-త్రివర్గో నీతివేదినామ్" అమరుఁడు. 4 వస్తువ్వశక్యేషు సముద్యమశ్చ- శక్యేషుమోహాదపముద్యమశ్చ- శక్యేష్వకాలేషు సముద్యమశ్చ- త్రిధైవకార్య వ్యసనంవదంతి" కామందకుఁడు శక్తికిమించిన పనికి యత్నించుట- శక్యమైనదానిని మోహమున యత్నింపకుండుట- శక్యమైనను నకాలమందు యత్నించుట- యీమూఁడు కార్యవ్యసనములనఁబడును 5 త్రయి- వార్త- దండనీతి- ఇవి ఆన్వీక్షికితో నాలుగైనను నవి త్రయియందంతర్భావము— "త్రయీవార్తా దండనీతిరితి విద్యాహిమానవాః। త్రయ్యా ఏవవిశేషోయ మియ మాన్వీక్షికీమతా" కామందకుఁడు. ఇందు త్రయి యనఁగా ఋక్కు- యజుస్సు సామము అనఁబడు మూఁడువేదములు. వార్త యనఁగా:— కృషి గోరక్షణ వాణిజ్యములు- కొందఱు వార్తాపత్రికలమీఁద వార్తయంద జగమువర్తిలుచున్నది యను భారతపద్యమును నుదాహరించుచున్నారు. "వార్తయంద జగము వర్తిలుచున్నది యదియు లేనినాఁడ యఖిలజగము లంధకార మగ్నమగుట గావున వార్త నిర్వహింపవలయుఁ బతికి" ఇచట వార్త యనఁగాఁ గృషిగోరక్షణ వాణిజ్యము

లనియే యర్థముగాని ప్రొద్దుపోని ముచ్చటలు చెప్పుటగాదు. దండనీతి = నీతి శాస్త్రము.

## తాత్పర్యము.

దశవర్గము- పంచవర్గము- చతుర్వర్గము- అష్టవర్గము- త్రివర్గము- విద్యాత్రయము. అను వీనిలక్షణములు దెలిసి యందేవి గ్రాహ్యములో యేవిత్యాజ్యములో యెఱిఁగి గ్రహింప వానిని నాచరించుచు విడువవలసినవానిని వదలుచు నున్నావా? ఇంద్రియములను నీవు చక్కఁగా శిక్షించి వశపఱుచుకొంటివా?

తే. దైవమానుషవ్యసనము ♦ లెల్లఁ దెలిసి కృత్యప్రకృతిమండల వింశతి♦వర్గములను
షడ్గుణంబుల వానిలో ♦ సంధి విగ్రహంబు యాత్రయు దండవి♦ధంబుఁ దలఁతె?

౨.౩౯౮

దైవమానుషవ్యసనములు=దైవమువలనను మనుష్యులవలనను గలుగు- వ్యసనములు = నిప్పు- నీళ్ళు- వ్యాధి- కఱవు- చావు- ఈయైదు దైవవ్యసనములు. ఇవి దైవికముగా వచ్చినవి. అధికారులవలన దొంగలవలన- శత్రువులవలన రాజలోభము వలన రాజప్రియులవలనఁ గలుగు వ్యసనములు మానుషవ్యసనములు. ఇవి యైదు విధములు.

హుతాశనో జలంవ్యాధి ర్దుర్భిక్షం మరణం తథా। ఇతి పంచవిధం దైవం మానుషం వ్యసనంపరం అయుక్తేభ్యశ్చ చోరేభ్యః పరేభ్యో రాజవల్లభాత్। పృథివీపతి లోభాచ్చవ్యసనం పంచధా భవేత్ ॥

కృత్య=కృత్యము- భేదనము- ఇది అలబ్ధవేతనుఁడు=కొలువుచేసిన దినములకు జీతము రావలసియుండియు నదిరాని ధనాసక్తుఁడు- మానవంతుఁడై యుండియు నవమానింపఁబడినవాఁడు- నిష్కారణముగ రాజుచేఁ గోపింపఁబడి రాజునందుఁ గోపముగలవాఁడు- భయపెట్టఁబడినవాఁడగుటచే భయపడియుండువాఁడు- ఈ నలువురను వారికి వారికిఁ గావలసినవి యిచ్చి శత్రురాజునుండి భేదించునట్లు చేయవలయును. "అలబ్ధవేతనో లుబ్ధో, మానీచాప్యవమానితః। క్రుద్ధశ్చ కోపితోనస్మాత్ భీతశ్చ భీషితః। యథాభిలషితై కామైర్భిందాద్దేతాం శృతుర్విధాన్॥ కామందకుఁడు. ప్రకృతి=ప్రకృతివర్గము- అమాత్య రాష్ట్రదుర్గాణి కోశోదండశ్చ పంచమః। ఏతాః ప్రకృతయ స్తజ్ఞై ర్విజిగీషో రుదాహృతా యని కామందకుఁడు.

మంత్రి- రాష్ట్రము- దుర్గము- బొక్కసము- దండము యీయైదు ప్రకృతి వర్గ మనఁబడును.

మండలము=పండ్రెండువిధముల రాజుగలది- నడుమనుండువాఁడు విజిగీషువు- వీనికి ముందుండువా రైదుగురు- శత్రువు - మిత్రుఁడు శత్రుమిత్రుఁడు- మిత్రమిత్రుఁడు- శత్రుమిత్రమిత్రుఁడు- వీనికి వెనుకనుండువారు- పార్ష్ణిగ్రాహుఁడు ఆక్రం

రుఁడు పార్ష్ణిగ్రాహాసారుఁడు ఆక్రందాసారుఁడని నాలుగువిధములు-పార్శ్వమందుండు మధ్యముఁడు వీరికి వెలుపలనుండువాఁ డుదాసీనుఁడు.

విజిగీషువు రాజ్యమున కానుకొనియుండు రాజ్యమునకుఁ బ్రభువు విజిగీషునకు శత్రువు, వాని రాజ్యమున కానుకొని యావలనుండువాఁడు విజిగీషునకు మిత్రుఁడు, అమిత్రుని రాజ్యమున కానుకొనియుండు వాఁడు విజిగీషునకు శత్రుమిత్త్రుఁడు, శత్రుమిత్రున కానుకొనియుండువాఁడు విజిగీషునకు మిత్రశత్రుఁడు. వాని కావలివాఁడు శత్రుమిత్రమిత్రుఁడు ఇట్టులే వెనుకవైపు చూచునది, విజిగీషువునకు వెనుకటివాఁడు పార్ష్ణిగ్రాహుఁడు, వానివెనుకటివాఁడు ఆక్రందుఁడు వానివెనుకటివాఁడు పార్ష్ణిగ్రాహాసారుఁడు వానివెనుకటివాఁడు, ఆక్రందాసారుఁడు, ఇచ్చటి శత్రుమిత్రాది శబ్దము లాయాదేశపు రాజులకేర్లమాత్రమే కాని వాస్తవ శత్రు మిత్ర వాచకములు గావు. అట్టివాని నట్టివానిఁగా భావించి వర్తింపవలయును.

తన రాజ్యమునకు నానుకొనియుండు రాజు తానెప్పుడు చెడునో తనరాజ్య మెప్పుడు దానాక్రమింతునా యని సమయమునకు వేచియుండును గావున వానిని శత్రువువలె భావింపవలయును, వానిప్రక్క నుండువాఁడు. వానికి శత్రువు గావునఁ దనకుమిత్రుఁడు ఇట్లేతక్కినవి, మధ్యముఁడు విజిగీమువునుగాని శత్రువునుగాని నిగ్రహించుటకు సమర్థుఁడగును. విజిగీషు ప్రక్కదేశపురాజు ఉదాసీనుఁడు పదు నొకొండుగురికి నొక్కటిగా నైనను వేఱువేఱుగా నైనను నిగ్రహానుగ్రహముల జేయ సమర్థుఁడగును.

వింశతి వర్గములు, బాలుఁడు వృద్ధుఁడు దీర్ఘవ్యాధిగ్రస్తుఁడు బంధువులచే బహిష్కరింపఁబడినవాఁడు భయపడుస్వభావము గలవాఁడు భయవంతులగు మంత్రి సేనాపత్యాదులగువాఁడు లుబ్ధుఁడు లుబ్ధజనులుగలవాఁడు విరక్తప్రకృతి, విషయాసక్తుఁడు, అనేకాలోచనలు గలవాఁడు, దేవబ్రాహ్మణ నిందకుఁడు, ఋషిశాపగ్రస్తుఁడు దైవమే మనకు సర్వము నిచ్చునని ప్రయత్నము సేయనివాఁడు దుర్భిక్షముచే బీడితుఁడు, సేన నశించినవాఁడు దేశాంతరము పోయినవాఁడు, అనేకశత్రువులు గలవాఁడు క్రూరగ్రహదశలు గలవాఁడు, సత్యము ధర్మము లేనివాఁడు, అను నిరువది విధములగు రాజులు గలరు. వీరితో సంధిసేయరాదు. వీరితో యుద్ధమే చేయవలయు నని నీతిశాస్త్రము.

బాలో వృద్ధో దీర్ఘరోగీ తథాజ్ఞాతి బహిష్కృతః
భీరుకో భీరుజనకో లుబ్ధో లుబ్ధ జన స్తథా
విరక్త ప్రకృతిశ్చైవ విషయేష్వతి సక్తిమాన్
అనేకచిత్త మంత్రశ్చ దేవబ్రాహ్మణనిందకః
దైవోపహత కశ్చైవ దైవచింతక ఏవచ

దుర్భిక్ష వ్యసనోపేతో బలవ్యసనసంకులః
అదేశస్థో బహురిపుర్యుక్తో కాలేనయశ్చసః
సత్యధర్మవ్యపేతశ్చ వింశతిః పురుషా అమీ
ఏతైస్సంధిం నకుర్వీత, విగృహ్ణీయాత్తు కేవలమ్. కామందకుఁడు.

(౨) ఇరువది యుద్ధకారణములు రాజ్యము నపహరించుట, స్త్రీనపహరించుట, స్థానము నపహరించుట. దేశము నపహరించుట, బంధువు నపహరించుట, ధనము నపహరించుట, మదము, మానము, విషయాసక్తి, అర్థజ్ఞానశక్తి, ధర్మనాశములు, దైవవిరోధము, మిత్రావమానము, మిత్రద్రవ్యాపహరణము, బంధునాశము, భూతదయాశూన్యత, మండలదూషణము, అనఁగా తనమంత్రి సేనాపతి మిత్రుల విఘటనము, ఒక్కలాభమునకే యనేకులాశపడుట, ఈ యిరువది యుద్ధకారణములు.

శంబరాసురుఁ డింద్రునితోడ విరోధించెను, గావున దశరథుఁడు వానిని జంపెను. ఇది దైవవిరోధమను కారణము, తనమిత్రుఁడగు సుగ్రీవునితో వాలి విరోధించి తనసమక్షమందే ప్రహరించెను గావున శ్రీరాముఁడు వాలిని జంపెను. తనకుమిత్రుఁడైన సాత్యకిని, భూరిశ్రవుఁడు తనయెదుటనే చంపఁజూచెను గావున వాఁడితరునితో యుద్ధముచేయుచున్నను అర్జునుఁడు వధించెను. ఇవి మిత్రవిరోధములను కారణము. స్వమిత్రవిరోధి స్వవిరోధియే. భోజనవిషయమున కృష్ణ దుర్యోధన సంభాషణము చూచునది.

షడ్గుణములు: సంధి, విగ్రహము యానము, ఆసనము ద్వైధీభావము, సమాశ్రయము. ముఖ్యములైనవి మొదటినాలుగు. యానాసనములు విగ్రహమందు ద్వైధీభావ సమాశ్రయములు సంధియందుఁ జేరును, పోఁగామిగిలినవి ముఖ్యములైనవి సంధి విగ్రహములు రెండే యగుచున్నవి. సంధి = విజిగీషువు (జయింప నిచ్ఛగలవాఁడు) కోరిన నిబంధనములకు సమాధానపడినవానితోఁ జేరుట, విగ్రహము = యుద్ధము, ఆసారమనఁగా=మిత్రబలము, ఆసారస్స్యా న్మిత్రబలే'' యని రత్నమాల. విజిగీషువునకు నతని శత్రువునకు నిరువురకు బలము తగ్గినపుడు మంచిశక్తివచ్చు కాలము నెదురు చూచుచు యుద్ధప్రయత్నము సేయక యూరకుండుట యాసనమనఁబడును. ద్వైధీభావము = ఒక్కనికి నిరువురు శత్రువు లున్నప్పుడు వారిద్దఱితోను మంచిమాట చెప్పుకొని తనయాత్మను వారికి సమర్పించినట్లు చెప్పుట, సమాశ్రయము శత్రువుచేఁ బీడింపఁబడుచున్న రొకరాజు బలవంతుఁడగు మఱియొకని నాశ్రయించుట. "బలినో ర్ద్విషతో ర్మధ్యే వాచాత్మానం సమర్పయన్ । ద్వైధీభావేన వర్తేత కాకాక్షివదలక్షిత" యని ద్వైధీభావలక్షణ మని నీతిశాస్త్రము. యానాసనే విగ్రహస్య రూపం సన్ధిరితి స్మృతిమ్ సంశ్రేశ్చ సంధిమార్గస్థై ద్వైధీభావ సమాశ్రయా''అని కామందకుఁడు. దీనివలన సంధివిగ్రహములు రెండే ముఖ్యములైనవి.

యాత్ర = యానము=ప్రయాణము=శత్రువుపై దండెత్తిపోవుట, ఈదండ యాత్ర యైదువిధములు.

1 విగృహ్యయానము = పార్ష్ణిగ్రాహాదులతోఁ జేరకయే బలాతిశయముచేత శత్రువుపై దండెత్తిపోవుట.

2. సంభూయయానము=సామంతరాజులతోడఁ జేరి దండెత్తుట. 3. ప్రసంగయానము=ఒకనిపై దండెత్తునట్లు చాటించి మఱియొకనిపై దండెత్తుట. 4. ఉపేక్ష్యయానము=ఒకనిమీఁదికని యుద్ధమునకై బయలుదేఱి వాఁడుబలవంతుఁడు గావున వానిమిత్రునిపై నెత్తిపోవుట. 5. సంధాయయానము = పార్ష్ణిగ్రాహాదులతోఁ జేరి శత్రుపై దండెత్తుట. దండవిధంబు = 1 సేనలను వ్యూహములుగానిలుపుట, 2శత్రువును శిక్షించువిధము, వ్యూహముల విషయము ముందే చెప్పఁబడెను. తలఁతె, ఈ చెప్పినవాని నన్నిటిని దెలిసికొని వానిలోఁ దాజ్యములవదలి గ్రాహ్యములను గ్రహించుచున్నావా యని భావము.

తా త్ప ర్య ము.

దైవవ్యసనముల గుఱించియు, మానుష్యవ్యసనముల గుఱించియుఁ గృత్యము గుఱించియుఁ బ్రకృతి, మండలము, వింశతివర్గములు షడ్గుణములు వానిలో ముఖ్యములైన సంధి విగ్రహము యాత్ర దండము గుఱించియు నాలోచించి విడువవలసిన వానిని విడిచి గ్రహింపవలసినవానిని గ్రహించుచున్నావా?

కం. నలువురో ముగ్గురో మంత్రులు, కలయఁగ యోజించితె మంత్ర✱కార్యము లెల్లన్ ?
　దెలిసికొని వారు వారలు, పలికెడివిధ మెల్ల నీవు ✱ భావింతె మహిన్? ౭౧-౫

మంత్రకార్యములు=ఆలోచించి చేయవలసిన కార్యములు.

తా త్ప ర్య ము.

ఆలోచించి చేయవలసిన కార్యములగుఱించిన యాలోచన ముగ్గురకుఁ దక్కువలేక నలువుర కెక్కువలేక యుండునట్లు మొట్టమొదట వారితో వేఱువేఱుగాను, ఆవల నందఱఁగలిపి యొక్కటిగాను వారియభిప్రాయముల గ్రహించుచున్నావుగదా! ఆవల వారందఱు చెప్పినవానిలో మేలుగీళ్ళు నీవు స్వతంత్రించి యాలోచించుచున్నావా? ఇరువురతోనే యాలోచించిన వారిరువురు వేఱవేఱభిప్రాయములు గలవారైరేని యెటుచేయుటకు సంశయ మేర్పడును, ముగ్వురైనయెడల నిరువురొకవిధము మఱియొకఁడు మఱియొకవిధమైనచో నెక్కువపక్షమువారి యభిప్రాయప్రకారము వర్తింపవచ్చును అందు సందేహమేర్పడినచో నాలుగవవాని యభిప్రాయము తెలియవచ్చును. అంతకెక్కువమందితో నాలోచింపరాదు. ఐకమత్యము కుదురక వారిలోవారు కలహించిరేని రహస్యము చెడును. రాజనంమఁబక్షపాతదోషము స్పష్టమేర్పడును, రహస్యవిషయము లెక్కువమందితో నాలోచింప

రాదు, కొందఱాలోచనలు చెప్పువా రొంటరిగా నున్నప్పుడొకవిధము నలువురిలో నడిగిన మఱియొకవిధము చెప్పుదురు. అట్టిమంత్రులు నమ్మరానివారు, అప్పుడుసత్య మేర్పడదు, ఎందఱెన్ని యాలోచనలు చెప్పినను మంత్రులు చెప్పిరి నేనుజేసితి ననరాదు, వారుచెప్పినది విని యాలోచించి తన మనస్సునకు సమాధానమైన విధముగ వర్తింపవలయును. విభీషణ శరణాగతి నాలోచింపుఁడు.

కం. ఫలయుతములె నీచదువులు! ఫలయుతములె నీధనములు ♦ పను లన్నియున్ !
ఫలయుతమే నీదారయు! ఫలయుతమే నీశ్రుతంబు ♦ ప్రాజ్ఞవతంసా! ౭౨

నీచదువులు = నీవేదాధ్యయనము, దార = భార్య, సంస్కృతమున దారాః నిత్యబహువచనాంతము, దానికేకవచనమున రూపములేదు. ఆకారణముచే భరతునకుఁ బెక్కురు భార్యలున్నట్లు కొందఱు దురూహచేయుచున్నారు, అది నిరాకరము అది వాల్మీకిమతముగాదు, నలువురన్నదమ్ము లేకపత్నీవ్రతనిష్ఠులే. అక్కసెల్లెండ్ర నలువురిలోఁ బెద్దదియగు సీతకే యప్పటికి ౧౮ సంవత్సరములయియుండ మాండవి కంతకుఁ దక్కువ వయస్సుండవలెను. ఆకారణమున సంభోగార్హదశకు వచ్చినదో లేదో; ఇఁక నీకుబిడ్డలుగలరా యనుట యవివేకప్రసంగమగును. ఇది, విషయము బోధింపవలసి వేసినప్రశ్న. నీశ్రుతంబు=నీవు పెద్దలవలన వినినది, ప్రాజ్ఞవతంసా =బుద్ధిమంతులందు శ్రేష్ఠుఁడా, మతిమంతులందు శ్రేష్ఠుఁడా, వేదాధ్యయనఫల మగ్నిహోత్రాదులు చేయుట గావున నటుచేయుచున్నావా?

తాత్పర్యము.

ధనము కలిమికిఫలము దాను భుజించుట యొకరికిచ్చుట. తాను దినినది యిహలోకఫలము, ఒకరికిచ్చినది పరలోకఫలదము, పరజన్మఫలదము. కావున లోభివై నీవుతినక పరులకీయక యున్నవాఁడవు కావుగదా! నీవుచేయు కార్యములన్నియును నీవు కోరినట్లు ఫలించుచున్నవా? వ్యర్థములై పోవుటకాని విపరీతఫలము నిచ్చుట కాని లేదుకదా! భార్యను సంపాదించుట రతిసుఖమునకు (ఇది యిహలోక ఫలము) పుత్రప్రాప్తికిఁ (ఇది పరలోకసుఖము) గావున నీ భార్యవలన నీరెండు సుఖములు గలుగఁగలవా? శాస్త్రము పెద్దలవలన వినుటకుఫలము గుణాగుణములు తెలిసి సద్గుణ మనుష్ఠించి సదాచారము గలిగి దుర్గుణము విడనాడుటకే కావున నట్లుచేయుచున్నావా? అటుచేయక పోయితివేని చదివిన చదువునకు వినిన వినికిడికి ఫలము శ్రమముమాత్రమే యగును.

అగ్నిహోత్ర ఫలావేదా, దత్తభుక్త ఫలంధనమ్
రతిపుత్ర ఫలాదారా, శీలవృత్త ఫలంశ్రుత"మ్మని భారతము.

కం. ధర్మార్థ కామసహితము, శర్మద మాయుష్యకరము ♦ జనవరతనయా
నిర్మలమతి నాచెప్పిన, కర్మంబుల నెల్ల జరుపఁ♦గా మదిఁ గొంటే. ౭౩

ధర్మార్థకామసహితము = త్రివర్గ మనఁబడు ధర్మము అర్థము కామము అను

వానితోఁగూడినది, శర్మదము = ఇహలోకసుఖము పరలోకసుఖము నిచ్చునది, ఆయుష్యకరము=ధర్మార్థకామమోక్షములను నాలుగిటిని సాధించుటకుఁ గావలసిన దీర్ఘాయుస్సు నిచ్చునది. వార్ధకేమునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజా మ్మన్నట్లు ముసలితనమున మునిలై తపస్సుచేసి యోగబలమునఁ గడపట దేహము విడువవల యును గావున దీర్ఘాయువు కావలయును, నిర్మలమతిన్ = మలినములేనిమనస్సుతో.

తా త్ప ర్య ము.

తమ్ముఁడా! నేను నీకుఁ జెప్పిన కార్యములన్నియు ధర్మార్థకామములతోఁగూడి నవి, ఇహలోకసుఖము పరలోకసుఖము గలిగించునవి, మోక్షార్థికిఁ గావలసిన దీర్ఘా యువు నిచ్చునవి. కావున వీనినెల్ల నిర్మలమైన మనస్సుతో రాజకుమారా! నీవుచేయ వలయునని మనస్సున నిలిపితివా?

కం. మనతండ్రియు మనతాతలు, మును నడచినయట్ల నడుతె • మునుకొని శుభవృ
త్తిని జరియించెదు గాదే, యనఘాత్మక ధర్మమార్గ • మాచరితం బే! ౨౨౯౮

తా త్ప ర్య ము.

పాపరహితమైన మనస్సుగలవాఁడా! మనతండ్రి తాత లేప్రకార ముభయ లోక శ్రేయస్కరమైన నడవడి నెట్లు నడచిరో యట్టులే నీవు శుభచర్య నడచు చున్నావుగదా? ధర్మార్థకామములలో ధర్మమునకే ప్రాధాన్యమిచ్చుచున్నావుగదా? ధర్మకార్యము నూతనముగ నేదైనఁ దటస్థించిన మాపెద్దలు చేయలేదు గనుక నేనది చేయనవక నూతనమైనదైనను ధర్మమైనదయినచో విడనాడుట లేదుగదా?

కం. విను మధురాహారంబులు, గొనవుగదా యొక్కరుఁడవె • కూర్మిని నీమే
లున్న గోరుమిత్రవరులకు, ధనముల సంతుష్టి సేయు•దా వలసినచోన్. ౨౨౯౯

మధురాహారంబులు=తియ్యనైనవి తినుపదార్థములు పాయసము లోనైనవి. వలసినచోన్=అక్కఱపడిన వేళలందు.

తా త్ప ర్య ము.

తియ్యనిపదార్థము లొకరికిఁబెట్టక నీవొకఁడవే తినవుగదా? "ఏకస్స్వాదు నభుంజీత" యనునది మఱవలేదుగదా? స్నేహభావముచే నీమేలుగోరు నీమిత్రులకు వారి కక్కఱ లవసరముల ధనమిచ్చి సంతోషింపఁ జేయుచున్నావుగదా?

కం. నరపాలుఁడు ధర్మంబునఁ, బరిపాలన సేసి ధరణిఁ • బడపడి స్వర్గం
బరుగును గావున ధర్మము, ధరణీవరతనయ! విడువఁ • దగ దే వేళన్. ౨౩౦౦

తా త్ప ర్య ము.

నీవు చెప్పినప్రకారము ధర్మమున వర్తించిన నాకు రాఁగల ఫలమేమందువా? రాజగువాఁడు ధర్మమార్గమునఁ బ్రజలఁ బాలించెనేని మరణించినపిదప స్వర్గమునకుఁ బోయి యచ్చట దివ్యభోగము లనుభవించును, ధర్మమునఁ బరిపాలింపక పోయినా ప్రజలుచేయు పాపముచే రాజగువాఁడు నరకమునకుఁబోక తప్పదు. కావున ధర్మ

మును దాను బాలించుచుఁ బ్రజలుకూడ ధర్మపద్ధతి నడచునట్లు చేయవలయును. కావున నెట్టిసందర్భములందును నష్టమైనను గష్టమైనను బ్రాణాపదవచ్చినను ధర్మము విడువరాదు. ధర్మము శాశ్వతము, కష్టసుఖము లశాశ్వతములు, అశాశ్వతములగు వానికై శాశ్వత ధర్మమును విడువరాదు.

ఈ సర్గమునకుఁ గచ్చిత్సర్గమనిపేరు. ఇందలి కొన్నిశ్లోకములు సభాపర్వమందలి కొన్నిశ్లోకములు సమానములై యున్నవి. ఆకారణముచే నెవరో భారతశ్లోకములను అసందర్భోచితముగ రామాయణమునం దిఱికించిరని కొందఱ యభిప్రాయము, భరతుఁడు రాఁగానే కుశలము విచారింపక రాజనీతి బోధించియుండునా ? యని వారివాదము, ఈశ్లోకములు ప్రక్షిప్తము లయిన నగునుగాక, కాకపోయినఁ గాకపోవునుగాక, వారుచెప్పెడికారణము సరియైనదికాదు,

ముందటికాళ్ళకు బంధాలు వేయుటయందు శ్రీరామచంద్రమూర్తికి నగ్రతాంబూల మియ్యఁదగునని ముందే సూచింపఁబడెను. ఆయన వాక్యధోరణి హెచ్చరికతో చదివినవారంద ఱాయభిప్రాయము నంగీకరింపక తప్పదు. ఇంగితజ్ఞాశ్చకోసలా యనువాక్య మాయనయందు సంపూర్ణముగ నన్వయించును.

భరతుఁ డే యభిప్రాయముతో వచ్చుచున్నాఁడో యది శ్రీరామచంద్రమూర్తికి మున్నె తెలియును. ఇది లక్ష్మణునకును జెప్పెను, భరతుని వేష మాయభిప్రాయమును బలపఱిచెను, తండ్రి మరణించె ననియు గ్రహించెను. భరతుఁడు రాజుగా నుండవలయుననియే శ్రీరామచంద్రమూర్తి యభిప్రాయము, ఆయన రాజుగా నుండుట తనకు సమ్మతమనియు నాయననే రాజుగా నుండవలయు ననియు దానికిఁ గావలసిన విషయములు బోధించు నెపమున వానిని నెఱిఁగింపవలయు నని యుద్దేశించి యుభయవిధ ప్రయోజనము గలుగుటకై రాజనీతిని ముందుగనే యుపదేశింపఁ బూనుకొనెను, తెలిసినవారికైనను దెలియనివారికైనను బెద్దలు హితముపదేశించుట కర్తవ్యము.

ఇది వారిమనస్సు నావిషయమందు దృఢపఱుపవలయు ననియేకాని క్రొత్తగా నేర్పుటగాదు, ధర్మరాజునకు రాజనీతి తెలియదనియా నారదుఁడుపదేశించెను. సీతాదేవికిఁ బాతివ్రత్యలక్షణము తెలియదనియా యనసూయాదేవి యుపదేశించెను. ఈ సమయము దప్పిన మరల సమయము దొరకదనియు శ్రీరామచంద్రమూర్తి యెఱుఁగును. అన్న రాలేదని యేడ్చుచుఁ బోవునపుడా రాజధర్మోపదేశము. కావున నది యసందర్భోచితమనుట సరిగాదు. రామాయణమునఁ గానవచ్చు శ్లోకములు భారతమునఁ గొన్ని గానవచ్చుచున్నవి. ఇవన్నియుఁ బ్రక్షిప్తములని యెవ్వరు ననఁజాలరు. కావున వ్యాసమహర్షియే రామాయణ శ్లోకములు గ్రహించె ననుట వాస్తవము.

—•౧౧౧-వసర్గము. భరతుండు శ్రీరామునకు దశరథుండు మరణించుట దెల్పుట.•—

కం. ఆ వాక్యముల విని భరతుం, డావాసవనిభునిఁగాంచి • యనె వినయమునన్
  నావంటిధర్మహీనుఁడు, గావించునె రాజధర్మ•కాండము లెల్లన్. ౨౩౦౧

శ్రీరామచంద్రమూర్తి చెప్పిన యన్నినీతులను ధర్మములను భరతుఁ డొక్క మాటతో వ్యర్థపఱుచుచున్నాఁడు. వాసవనిభునిన్=ఇంద్రునితో సమానుని, ధర్మకాండములు = ధర్మసమూహములు, ధర్మహీనుఁడు = (1) శ్రీరాముని శుశ్రూషయనెడి పరమైకాంతి ధర్మములేనివాఁడు, (2) శేషత్వమనెడి స్వరూపము తప్పినవాఁడు, రాజధర్మసమూహములు సామాన్యధర్మములు, కైంకర్యదాస్యములు విశేషధర్మములు, విశేషధర్మములందు దృష్టిలేనివానికి సామాన్యధర్మములు వ్యర్థములు. అయోధ్యాకాండమంతయు సామాన్య ధర్మములనే బోధించుచున్నది. అరణ్యకాండమునుండి విశేషధర్మములు ప్రారంభమగును.

తా త్ప ర్య ము.

శ్రీరాముఁడుచెప్పిన మాటలనెల్ల విని భరతుఁడు దేవేంద్రునితో సమానుఁడైన నాయనతో నణఁకువతో నన్నా! నీవుచెప్పిన రాజధర్మములన్నియు ధర్మాత్ములకు సాధ్యములు గాని రాజ్యమునే యధర్మమార్గమున సంపాదించిన నాకెట్లు సలుప సాధ్యపడును? నావంటి ధర్మహీనుఁడా నీవు చెప్పిన రాజధర్మములాచరించువాఁడు? రాజధర్మరక్షణ సమర్థుఁడవు నీవేకాని నేనుగాను, నీవనుగ్రహించిన నేను దాసధర్మరక్షణ సమర్థుఁడ నగుదును.

చం. కలదు గదా సనాతనము•గా మనలో నొక ధర్మ, మగ్రజుం
  డిల మని యుండఁ బిన్న వహి•యింపఁగరాదు ధరాభరంబు, స
  ల్లలితసమస్తవస్తుసువి•లాస కయోధ్యకు నాదు వెంబడిం
  జెలువుగ నేగుదెంచి యభి•షేకముఁ గైకొను ముత్సవంబుగన్. ౨౩౦౨

మనలో = మనవంశమున, సనాతనముగా = ఆదిమకాలమునుండి, అనఁగా మనువు కాలమునందుండి, అగ్రజుండు = పెద్దవాఁడు, మనియుండన్ = బ్రదికియుండఁగా, పిన్న=చిన్నవాఁడు, ధరాభరంబు=భూమిభారము, సత్ + లలిత = మిగుల నందమైన. సమస్తవస్తు=సకలపదార్థములయొక్క, సువిలాసకు=మిగుల నందము కల దానికి, వెంబడిన్=వెన్ను + బడి=వెంబడి, ఉత్సవంబుగన్ = సంతోషముగ.

తా త్ప ర్య ము.

అన్నా! మనజాతిలో ముఖ్యముగ మనవంశములో సనాదిగ నొకధర్మముండుట నీవెఱిఁగిన విషయమేకదా! అది యేదనఁ బెద్దవాఁడు జీవించియుండఁగాఁజిన్నవాఁడు రాజ్యభారము వూనరాదు. కావున సమస్త సుందరవస్తువులచే మనోహరమైన యయోధ్యకు నావెంట వచ్చి సంతోషముతోఁ బట్టాభిషేకము చేసికొమ్ము, నీధర్మమును నీవు నిర్వహింపవేని స్వధర్మమును నిర్వహింపని నీవు పరధర్మమును నిర్వ

హింపుమని నాకెట్లు చెప్పఁగలవు? స్వధర్మనిష్ఠుఁడుకదా ధర్మోపదేశాధికారి.

కం. జనపతి నరుఁ డనువారలె, యనుపమధర్మార్థసహిత•మగునీవృత్తం
బు నమానుష మని చెప్పుట, ననఘా దేవుఁడ వటంచు•నాత్మం దలఁతున్. ౨౩౦౩

అనుపమ=అసమానమైన, ధర్మార్థసహితము=ధర్మమను ప్రయోజనముతోఁ గూడినది, ఇచ్చట నర్థమనఁగా ధనమనుట సరిగాదు. వృత్తంబు = శీలము, అమానుషము=అతిమానుషము, మనుష్యశక్తికి మించినది.

తాత్పర్యము.

కొందఱు మనుష్యులు "నావిష్ణుః పృథివీపతి" విష్ణ్వంశము లేనివాఁడు రాజు కాఁజాలఁడను నర్థమునుగూడ నంగీకరింపక రాజు మనుష్యమాత్రుఁడే, అదృష్టము కొలఁది రాజైనాఁడనువారుకూడ నసమానధర్మమే ప్రయోజనముగాఁగలనీచరిత్రము జూచి యిది మనుష్యశక్తికి మించినది, కావున నీయన మనుష్యమాత్రుఁడు కాఁడనుచున్నారు. కావున నాయభిప్రాయమందో నీవు సాక్షాద్దేవుఁడవే. శ్రీమన్నారాయణుఁడవే, కావున మనుష్యమాత్రుఁడగు నన్నైనను రాజ్యము నీవు ధరింపవలసియుండఁగా సాక్షాద్దేవుఁడవగు నీవు ధరింపవలసినదానిని నీదాసుఁడనగు నేనెట్లు ధరింపఁ గలను.

సీ. కేకయక్ష్మాపతి•గృహమున నే నుండ; జానకీలక్ష్మణా•సహితముగను
నడవులకును నీవు • నడచినయంతనే, దుఃఖాభిభూతుఁ డై•తూర్ణముగను
మనతండ్రి స్వర్గంబుఁ • జనె లెమ్ముతండ్రికి,నుదకంబు లిమ్ము మే•ముభయులమును
గార్యంబులెల్ల ము•గ్గావించినారము, మీ రిరువురు సేయ • మేకొనుండు

తే. ప్రియుఁడు నీళ్ళను విడఁ దృప్తి•ప్రేతములకు
గరమ్ముఁ బితృలోకమునను న•క్షయ్య మగును
దండ్రికిని నీవు ప్రియుఁడవు • తద్ద గాన
లెమ్ము నీ వింకను నివాప • మిమ్ము ప్రీతి. ౨౩౦౪

దుఃఖాభిభూతుఁడు=దుఃఖముచేఁ గ్రమ్మఁబడినవాఁడు, తూర్ణముగను = శీఘ్రముగ, మేకొనుఁడు=పూనుఁడు, నివాపము=తర్పణోదకము.

తాత్పర్యము.

నేను కేకయరాజునింట నుండుసమయంబున నీవు సీతాలక్ష్మణులతోడ నడవులకు నడచిరాఁగా నిన్నుఁబాసిన దుఃఖముచే మనతండ్రి మరణించెను. నీవు లక్ష్మణుఁడు తండ్రికిఁ దిలోదకము లిండు, నేను శత్రుఘ్నుఁడు నిదివఱకే యాకార్యము చేసితిమి, మీరును శీఘ్ర నంగీకరింపుఁడు, మేము చేసియుఁ బ్రయోజనము లేదు, ఏలన మరణించినవారికి వారియందుఁ బ్రీతిగలవారు నీళ్ళువిడిచిననే తృప్తికలుగును గాని వారికిఁ బ్రీతిపాత్రులు గానివారు విడిచినచో దానివలన వారికేమేలు కలుగఁబోదు. నేనువిడుచునీళ్ళు తనకుఁ జెందరాదని పదుగురులోఁ దండ్రి చెప్పెనఁట,

కావున మేము లోకధర్మము ననుసరించి చేసినను ప్రయోజనములేదు. నీవు తండ్రికిఁ బ్రియుఁడవు, నీవు నీళ్ళువిడిచిననే యాయన కూర్ధ్వగతులు సుఖము కలుగును. కావున నీళ్ళు విడువుము.

జ్యేష్ఠపుత్రుఁడే శ్రేష్ఠపుత్రుఁ డగుటచేతను దక్కినవారు కామజులగుటచేతను వీరు పితృకార్యములు చేయుటకును బనికిరారా యని సంశయింపరాదు, శ్రాద్ధాదు లందు శ్రద్ధప్రధానము, శ్రద్ధలేకున్న నది శ్రాద్ధ మనిపించుకొనఁబడదు, ప్రీతిలేక శ్రద్ధకలుగదు. కావునఁ దండ్రికిఁ బ్రియులయినవారు ముఖ్యులుగాని పెద్దవాఁడై నంతమాత్రమున దురాచారుఁడు, అవినీతుఁడు నగువాఁడు శ్రేష్ఠుఁడు గాఁజాలఁడు.

శ్లో. పుత్రాణాం మధ్యమోవాపి, కనిష్ఠో జ్యేష్ఠ ఏవవా
పితుర్యస్తు ప్రియతమః, సర్వం తేనైవ కారయేత్. ఋశ్యశృంగుఁడు.

పుత్రులలో నడిమివాఁడైనను, గడపటివాఁడైనను దండ్రికెవ్వఁడు ప్రియత ముఁడో వాఁడే జ్యేష్ఠుఁడు. అన్నికార్యములు వాఁడే చేయవలయును, కావున జ్యేష్ఠుఁడునై ప్రియుఁడునై నవాఁడు నిదుశ్రాద్ధములు నివాపములు నక్షయఫలహేతు వులని చెప్పవలసిన పనియేలేదు.

తరళము. నినుఁ దలంచియ యేస్పుచున్ మఱి • నీదు దర్శనకాంక్షి యై,
నినుఁ దలంగకయున్నబుద్ధిని • నేరకేమియుఁ ద్రిప్పఁగా,
ననఘ! నీవిడనాడుటన్, భవ•దార్తిపీడితుఁ డౌచు, నీ
• జనకుఁ డక్కట యస్తమించెను • జాల నిన్ను స్మరించుచున్. ౨౩౦౪

దర్శనకాంక్షి=చూడఁగోరికగలవాఁడు, తలంగక=వదలక, నేరక=సమర్థుఁడు గాక, భవదార్తి పీడితుఁడు=నీవియోగమువలనఁ గలిగిన దుఃఖముచేఁ బీడింపఁబడిన వాఁడు, నీజనకుఁడు=నీతండ్రి, దశరథుఁడు తనకును దండ్రియైనను గైకకారణమునఁ దనయందుఁ బ్రీతితప్పినవాఁ డగుటచేఁ బేరునకుఁ దండ్రియేకాని తండ్రికుండవలసిన పుత్రవాత్సల్యము లేనివాఁడు, అస్తమించెను=మరణించెను, దశరథుని మరణవార్తను గూర్చి కైక భరతునకుఁ జెప్పినసరణియు, భరతుని వచనసరణియుఁ బోల్చిచూచు నది. నీతండ్రిమరణమునకు నీవే కారణభూతుఁడ వగుటచే నీవు చేసినపని సరిగా దని భావము. తరలము, నభరసజజగములు ౧౨-వ యతి.

అస్తమించుట యనునది సూర్యునివిషయమున సుప్రసిద్ధపదము. దశరథుఁ డస్తమించె ననుటచే సూర్యుఁ డస్తమించిన లోకము గాఢాంధకారమున మునిఁగినట్లు దశరథు మరణమున జగము శోకాంధకారమున మునిఁగెను. సూర్యుఁడు పోయినఁ జంద్రుఁడయిన నుండిన లోక మాహ్లాదించును. అభిరామచంద్రుఁడు రామచంద్రుఁడు నీవు లేనికారణమున లోకము దిక్కుతెలియక దుఃఖించుచున్నది. చచ్చెను, మరణిం చెనను నది పరుషోక్తి అస్తమించె ననుట మృదూక్తి, అర్థముసమమే. "భీష్మభానుఁ డస్తమించె"నని తిక్కన. భా. భీష్మ.

నీవలన లోకమున కిట్టియనర్థము కలిగెను. రాముఁడవై లోకమును సంతోష పెట్టుటకు మాఱు నీవు దుఃఖపెట్టుచున్నావు.

తా త్ప ర్య ము.

అన్నా! నీతండ్రి నిన్నుఁదలంచి యేడ్చియేడ్చి నిన్నుఁజూడఁగోరి యది లభింప మిని నీయందే బుద్ధిదృఢముగ నిలిపి దానిని మరలింపనేరక నీవు విడిచివచ్చిన కార ణమున నీ వియోగ బాధచేఁ గష్టపడుచు రామారామా యని నిన్నే స్మరించుచు నస్తమించెను.

—• ౧౦౨-వ సర్గము. పితృమరణంబు విని శ్రీరాముఁడు దుఃఖంచుట. •—

చం.అని భరతుండు తండ్రి విల•యంబును వాసవముక్తవజ్రపా
తనమునుబోనివాక్యముఁల • దారుణరీతిని విన్పఁ గానసం
బున బలుగండ్రగొడ్డటను • మూలముమట్టుగఁ ద్రుంపఁ ద్రెళ్ళుపు
ష్పనిచయభూషితం బయిన•పాదపమో యన వ్రాలె రాముఁడున్. ౨౩౦౬

విలయంబును=మరణమును, వాసవ=ఇంద్రునిచే, ముక్త=విడువఁబడిన, వజ్ర =వజ్రముయొక్క, పాతనమునుబోని = పడుటతో సమానమైన, దారుణరీతిని = భయంకరమైన విధముగ, విన్పన్=వినిపింపఁగా, పుష్ప = పూలయొక్క, నిచయ= సమూహముచే, భూషితంబు = అలంకరింపఁబడినది, పాదపము = చెట్టు, పాద + పము=కాళ్ళచే నన఼గా వేళ్ళచేఁ పానము చేయునది.

తా త్ప ర్య ము.

ఈప్రకారము తండ్రి మరణవార్తను బిడుగుపడిన విధముగ భయంకరముగు విధమునఁ దననిమిత్తమై వచ్చెనని చెప్పఁగా నడవియందు గండ్రగొడ్డలిచే వేళ్ళ వఱకు నఱకఁబడఁగా నేలమీఁద దబాలునఁ బడు చెట్టువలె శ్రీరాముఁడు తటాలున మూర్ఛపోయి పడెను.

ఉ.కూలముఁ గూలఁ ద్రోచి వెల•గూరిన నిద్దుర పోవుదంతినా
వ్రాలినఁ జూచి తమ్ములును • వారిజలోచన సీతయున్ వ్యథా
జ్వాలలఁ గ్రాఁగి రామునకుఁ • జల్లనినీటను దేహ మంతయున్
జాలఁగఁ దడ్పి; రంత రఘు•చంద్రుఁడు మూర్ఛ దొఱంగి దీనుఁడై. ౨౩౦౭

కూలము=ఒడ్డు, వెలగూరివన్ = బడలికకలుగఁగా, దంతినాన్ = ఏనుఁగో యనునట్లు, వ్యథాజ్వాలలన్=శోకమనెడి నగ్నిశిఖలచే, దీనుఁడై = దుఃఖంచుచున్న వాఁడై, మూర్ఛదొఱఁగుటకై శీతోపచారవిషయమున "యతః అమృతంవా ఆప స్తస్మా దద్భిరవతాం తమభిషించతి" యని శ్రుతియుఁ జెప్పుచున్నది.

తా త్ప ర్య ము.

ఏటి యొడ్డులను గొమ్ములచేఁ గోరాడికోరాడి యవలద్రోచి గాసికలుగఁగా నేలపైఁబండుకొని నిద్దురపోవు నేనుఁగువలె నేలపై శ్రీరాముఁడుసొమ్మసిల్లివ్రాలఁగా

భరతాది సోదరులును సీతాదేవియు దశరథుని మరణమునకు శ్రీరాముని దశకు శోకమనెడి నిప్పుమంటలచేఁ దపించియు శ్రీరామునకు శైత్యోపచారమునిమిత్తము చల్లని నీటిచే దేహమంతయుఁ దడిపిరి. అట్లు చేయఁగా శ్రీరాముఁడు మూర్ఛవిడిచి లేచి దుఃఖించుచు.

ఉ. కన్నుల బాష్పపూర మెసఁ • గన్ భరతుం గని యిట్లుపల్కె- నే
మున్నది నా కయోధ్య నిఁక • నుత్తముఁడా జనకుండు లేమి, లో
కోన్నతుఁ డేలినట్టిది య•యోధ్య యిఁకన్ భరియింప నెవ్వఁడో
యన్న సమర్థుఁ, డాదిభుజ • గాధిపుభారము నేది మోసెడిన్ ! ౨౩౦౭

బాష్పపూరము=కన్నీళ్ల ప్రవాహము - ఎసఁగన్ = అతిశయింపఁగా - ఆదిభుజగాధిపు = ఆదిశేషుని.

తా త్ప ర్య ము.

కన్నులవెంట నీళ్లు ప్రవాహమువలెఁగారుచుండఁగా భరతునితో నిట్లనియె. భరతా-అయోధ్యకు రారమ్మని పిలువవచ్చితివే అయోధ్యయందుత్తముఁడైన తండ్రి లేనప్పు డింక నేను దేనినిమిత్తమై రావలెను? రాజ్యభారము వహించుట కనెదవా? జనసత్తముఁడైన దశరథునిచేఁ బాలింపఁబడినది యయోధ్య- అట్లాయనచే మోవఁబడిన భారమును మఱి యెవ్వఁడు మోయ సమర్థుఁడు. ఆదిశేషుఁడు మోయు భూభారమును ఆదిశేషుఁడుగాక మఱి యెవ్వఁడు మోయఁగలఁడు ?

కం. ననుఁగూర్చి పనవి చచ్చిన, జనకుని సంస్కారవిధులు • సలుపనిననుఁబోల్
తనయుఁడు దుర్జాతుం డా, ఘనమతికిం బుట్టి యేమి • కార్యము చెపుమా. ౨౩౦౮

రాజు మరణమునకుఁ దాను గారణము కావునను దనకై ప్రాణము విడిచిన జనకునకుఁ దాను జేయకుండుటఁ బట్టియుఁ దనజన్మమే వ్యర్థమని తన్నుఁదాను శ్రీరాముఁడు నిందించుకొనుచున్నాఁడు. పనవి=ఏడ్చి- సంస్కార విధులు=దహనసంచయనాది పైతృక కార్యములు, దుర్జాతుండు = చెడుజన్మముగలవాఁడు-ఘనమతికిన్=గొప్ప మనస్సుగలవానికి - కార్యము = ప్రయోజనము.

తా త్ప ర్య ము.

నాయందంతటి ప్రేమగలిగి నన్నుఁదలఁచి తలఁచి యేడ్చి యేడ్చి చచ్చిన కన్నతండ్రికి నాయన జీవించి యున్నప్పుడెట్టి యుపకారముచేయకున్నను మరణించిన పిమ్మటనైనఁ జేయఁదగినది యొకటియేయైన పైతృకకర్మముచేయని నావంటి పాడు జన్మముగల కొడుకు అటువంటి పుత్రవాత్సల్యముగల తండ్రికిఁబుట్టి యేమి ప్రయోజనము. నాకై ప్రాణమిచ్చినవాని కిన్ని నీళ్లు విడువకపోయితినిగదా.

తండ్రికి నీళ్లు విడిచి శ్రాద్ధముపెట్టనికొడుకు జీవించియుండుటకన్నఁ జచ్చుటే మేలు.

కం. భరతా! శత్రుఘ్నునితోఁ, బూరి జనకుని ప్రేతకృత్య•ములు దీర్చితి వీ
వరయఁగ ధన్యుఁడు నా కా,పరమం బగుపుణ్య మబ్బు • భాగ్యము లేదే. ౨౩౧౦

పూరిన్=పూర్ణముగా - ప్రేతకృత్యములు = మరణించినవారికిఁ ప్రేతత్వము వదలిపోవుకార్యములు.

తా త్ప ర్య ము.

భరతా! నీవు శత్రుఘ్నునితో జనకునకుఁ జేయవలసిన పరలోక హితకృత్యము లన్నియుఁ జక్కఁగఁ జేసి పుత్రత్వమును సార్థక పఱిచికొంటివి. లక్ష్మణునితోడ నేనట్లు చేయు పరమపుణ్యములభించు భాగ్యము నాకు లేదాయెఁగదా. ఈ లోకమున నున్న వేళ వారి వారి శ్రేయస్సునకుఁ గావలసిన కార్యములు వారు వారు చేసికొందురు. పరలోకము ఫలభూమి. కావున నచ్చటఁ జేసికొనునది లేదు. ఇక్కడి వారు వారిని గుఱించి యేమైనఁ జేసినఁగలదు లేకుండిన వారిగతియంతే. అట్లు పరాధీనులయినవారికి సహాయపడి ప్రేతత్వము తొలఁగించి స్వర్గస్థులఁజేయుట పరమ పుణ్యకార్యముగదా.

ఆ. దిక్కు లేక జనులు • దీను లై చీకాకు,పడుచు నున్న పురికి • వ్రతము విడప
నైన నందుఁ దండ్రి• లేనికారణమున, మరలి వచ్చుటకును•మనసు రాదు. ౨౩౧౧

చీకాకు=కలవరము - వ్రతము విడపనైనన్ = పదునాలుగేండ్ల దడవులలో నుండుననువ్రతము ముగిసిన తరువాతనైన.

తా త్ప ర్య ము.

భరతా! తండ్రియాజ్ఞప్రకారము పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయవలయునను వ్రతము ముగిసిన పిదపఁ దండ్రిని సేవించుటకై (రాజ్యమేలుటకై కాదు.) యయోధ్యకు రావలయునని యుంటిని. అట్టి భాగ్యము నాకు లేదాయె. దశరథుఁడు చచ్చుటచే జనులు దుఃఖాక్రాంతులై కలవరపడుచున్నారంటివి. అట్టి చోటికి నావలనైన వచ్చుటకు నాకు మనసులేదు. తండ్రినిఁబంపిన నేనేమని యయోధ్యకు వత్తును? ౨౩౦౨ వ- పద్యములోని భరతువాక్యమున కిది ప్రత్యుత్తరము.

కం వనవాసము సంపూర్ణము,గను బిలిచి యయోధ్య కేను • గ్రమ్మఱ నన్నున్
గని దిద్దెడివా రెవ్వరు, జనకుఁడు లోకాంతరంబుఁ • జనుటను భరతా. ౨౩౧౨

లోకాంతరము=మఱియొక లోకము-మయూరవ్యంసక సమాసము.

తా త్ప ర్య ము.

వనవాసము పదునాలుగేండ్లు సలిపెదనని వ్రతము పూని యట్టి వ్రతమును భగ్నపఱిచికొని యపకీర్తినగుట పాపకార్యము గదా. నీ విప్పు డయోధ్యకు నన్ను రమ్మనుచున్నావు. ఆ వ్రతము పూర్ణముగ నెఱవేర్చి నీవు కోరిన ప్రకార మయోధ్యకు వచ్చెదననుకో. ఏమి ప్రయోజనము. అక్కడ నా కెవ్వరు తాఁకు దప్పులు చెప్పిదిద్దెడివారుగలరు. అట్లు చేయఁగల జనకుఁడు పరలోకమేగెఁగదా.

కం. మును కృతసత్కార్యుని నను, దనతోడఁ గూర్చుండఁబెట్టి•తండ్రి సుధోక్తుల్
విన నాడు శ్రవణసుఖముగ, విన నేర్తునె యింక నెన్ని•విధముల వానిన్. ౨౩౧౩

మును=పూర్వము, కృతసత్కార్యునిన్=చేయఁబడిన మంచిపనులుగలవానిని, సుధోక్తుల్ = అమృతమువలెఁదియ్యనైన మాటలు, శ్రవణసుఖముగన్ = వీనుల కింపుగ.

తా త్ప ర్య ము.

భరతా! నీవే యొకరికిఁ దాఁకు దప్పులు చెప్పనేర్తువు. నీ కొఱకు చెప్ప వలెనా యందువేమో. పోని జీవించియున్న కాలమందు నాచే నేదైన మంచిపని చేయించి తనతోడమీఁదఁ నన్నుఁ గూర్చుండఁబెట్టుకొని మనతండ్రి తియ్యని మాటలు వినసింపుగాఁ జెప్పుచుండెను. అటువంటి మాటలైనఁ జెప్పెడి వాఁడేడీ. అయోధ్యకువచ్చి యటువంటి మాటలు నేను వినఁగలనా? మంచిమాటలుకూడ విను భాగ్యము లేనిచోటికి నేనేల రావలె?

శ్రీరామచంద్రమూర్తి శోకవిలాపము నెపమున నేనిప్పుడు నయోధ్యకు రాను గడువుతీఱిన పిమ్మటను రాను, అని తన యభిప్రాయమెఱింగించెను. భరతుఁడు పట్టాభిషిక్తుఁడై యుండఁగాఁ దా నయోధ్యకు వచ్చినఁ బ్రజాక్షోభము కలుగును గాని తప్పదు. అట్టిదానికిఁ దాను నిమిత్తము కారాదని యాయన యభిప్రాయము. పదునాలుగు సంవత్సరము లయినపిమ్మటఁ గూడఁ దాను రాననుట భరతునకు గోరు చుట్టుమీఁది రోఁకటి పోటు.

ఉ. హా యని భార్యదిక్కు - మొగ•మై తరుణీ! యిఁక నీకు మామ లేఁ
డాయెనుగా, యిఁ కెవ్వరిని • నాఁడెదు మామ యటంచు, లక్ష్మణా!
నాయన లేనివాఁడ వయి•నాఁడవుగా, యని యశ్రుపూరపూ
ర్ణాయతలోచనుం డగుచు•నారఘువీరుఁడు పల్లటిల్లఁగన్. ౨౩౧౪

ఈ ప్రకారము తండ్రికై దుఃఖించిన విధముగా భరతుని మాటకుఁ బ్రత్యుత్తరమిచ్చి యిఁక లోకవిడంబనార్థము సీతా లక్ష్మణులఁజూచి యనుచున్నాఁడు.

అశ్రుపూర=కన్నీళ్ల ప్రవాహముచేఁ పూర్ణ=నిండిన, ఆయత=దీర్ఘములైన లోచనుండు=కన్నులుగలవాఁడు పల్లటిల్లఁగన్=దుఃఖింపఁగా.

తా త్ప ర్య ము.

హాయని యేడ్చుచు సీతదిక్కు-తిరిగి దేవీ నీవు మామలేనిదానవైతివిగదా. ఇఁక నెవరిని మామాయని నోరారఁ బిలిచెదవు. లక్ష్మణా తండ్రిలేని వాఁడవైతివి కదా యని కన్నులనిండ నీళ్లు క్రమ్మఁగా శ్రీరాముఁడు దుఃఖించుచుండఁగా.

లక్ష్మణునకుఁ దండ్రిలేకపోయినఁ దనకున్నట్లా? నసంవృత్తః పితామమ' నాతండ్రి మరణించినవాఁడుగాఁడు అని మునుచెప్పెను. దీని వలనఁ దండ్రి చచ్చిన వ్యసనము తనకు లేదని భావము. తండ్రివలెఁదన్ను లక్ష్మణుఁడు విచారించు చుండుటచే నిట్లు చెప్పెను.

కం. ధరణీతనయాధవు నతి, కరుణోక్తుల నాలకించి • కాకుత్స్థులు ని
ర్భరశోకమునం గుందిరి, ధరణీశ్వరుఁ దలఁచి తలఁచి • తమమదులందున్. ౨౩౧౫

ధరణీ తనయాధవు=భూపుత్రిభర్తయగు శ్రీరాముని, అతికరుణోక్తులు= మిక్కిలి శోకముతోఁగూడిన మాటలు, (కరుణ+ఉక్తులు) కరుణమనఁగా శోకము కరుణ యనఁగాదయ, అలకించి=విని, కాకుత్స్థులు = భరతలక్ష్మణ శత్రుఘ్నులు, నిర్భరశోకమునన్=భరింపరాని వ్యసనముచే.

తా త్ప ర్య ము.

శ్రీరాముని శోకపూరితములయిన వాక్యములువిని భరత లక్ష్మణ శత్రుఘ్నులు తమ తండ్రిని దలఁచి తలఁచి సహింపరాని దుఃఖముచే బాధపడిరి. జనకుని మరణవార్త వినుటచేఁ గలిగిన దుఃఖముకంటె శ్రీరాముని వ్యసనోక్తులు వినుటచే నెక్కువ శోకము గలిగెనని భావము.

కం. ఉమ్మలికించురఘూత్తముఁ, దమ్ములు దేర్చిరి సుసాంత్వ • తర వాక్యులఁ గా
ర్యమ్మిఁక జనకునకు నివా, పమ్ముల నొసఁగంగ వగవ • ఫలమా యనుచున్. ౨౩౧౬

ఉమ్మలికించు=శోకించు, తేర్చిరి=సమాధానపఱిచిరి, సుసాంత్వతర వాక్యులన్=మిక్కిలి యూరడింపుమాటలచే, నివాపమ్ములు=ప్రేతమునకై విడుచునీళ్లు, వగవన్=దుఃఖింపఁగా.

తా త్ప ర్య ము.

• శోకించు రామచంద్రునిఁ దమ్ములూరట మాటలచే నన్నాయేడ్చిన నేమి లాభము. ఎంతయేడ్చినను జచ్చినవాఁడు మరలివచ్చునా? చచ్చినవారికై యేడువ రాదుగదా. నీవు చేయవలసినకార్యము నీళ్లు విడుచుటకదా. అది చేయక యిది చేసెదవేల యని సమాధానపఱిచిరి.

ఉ. మామ దివంబుఁ జేరె నను • మాట చెవిం బడ నార్తి జానకీ
భామిని యశ్రువేగమునఁ • బ్రాణవిభుం గననేర దేడ్చుచున్
రాముఁడు నామెఁ దేర్చి నయ • నంబులు వాఁచఁగనేడ్చులక్ష్మణున్
బ్రేముడిఁ బిల్చి తండ్రికిని • నీళ్లు విడం జనువాఁడఁ దమ్ముఁడా. ౨౩౧౭

అశ్రువేగమునన్=మీఁద మీఁదఁ గాఱుచున్న కన్నీళ్ళ యతిశయముచే, ప్రేముడిన్=ప్రేమచే. ప్రేమ, తద్భ, ప్రేముడి.

తా త్ప ర్య ము.

మామ మరణించె ననుమాట చెవిని బడఁగానే దుఃఖముచేఁ బరితపించు జానకి యతివేగముగఁ గాలువవలెఁ బాఱుచున్న నీళ్లు దృష్టి నడ్డగించుటచే భర్తను జూడలేకపోయెను. అప్పుడామెను శ్రీరాముఁడే సమాధానపఱిచి కన్నులు వాఁచి పోవునట్లు శోకించు లక్ష్మణుని సమాధానపఱిచి నాయనా నేను దండ్రికి నీళ్లు విడువఁ బోవుచున్నాను.

ఉ. చీరము గారపిండియును • దెచ్చిరఁ జేర్పుము, పోవ నిమ్ము ముం
దీరమణీమణిం, బిదప • నేగుము నీ, వటువెన్క వచ్చెదన్,
దారుణ మైనకార్యముల • ధర్మపథం బిది, యంచుఁ బోవుచో
వారల నందునున్న తగు • వారలు దేర్చిరి సాంత్వవాక్కులన్. ౨౩౧౭

చీరము=నారవస్త్రము, గారపిండి=గారగింజలను నూనెపోకుండ నూరిచేసిన ముద్ద, దారుణమైన దుఃఖముచే దీవ్రములైన ధర్మపథంబు=ధర్మశాస్త్రమునఁ జెప్పఁబడినమార్గము అశుభకార్యములు చేయఁ బోవునపుడు స్త్రీలు బాలురు ముందు పోవలయును వారివెనుకఁ బెద్దవారు పోవలయును. ఉదకోపస్పర్శనే ఆరోహణే ఇతి సర్వత్రైవసర్వే కనిష్ఠక ప్రథమా అనుపూర్వ్య ఇతరేస్త్రీ యోగే అని ఆపస్తంబ సూత్రము.

## తా త్ప ర్య ము.

లక్ష్మణా! నారవస్త్రము గారపిండి త్వరగా సమకూర్పుము. ముందీ సీతను బోవనిమ్ము. ఆమె వెనుక నీవు పొమ్ము. నీ వెనుక నేను వచ్చెదను. అశుభకార్యములందు ముందు బాలురు స్త్రీలు పోవుట, వారి వెనుక పెద్దవారు పోవుట ధర్మమార్గము అని వారట్లు దుఃఖపడుచుఁబోవఁగా నందుఁజేరిన యోగ్యులు వారిని సమాధానపఱిచిరి.

కం. దాంతుండును విదితాత్ముఁడు, శాంతుండును రామభక్తి • సంపన్నుఁడు స
త్స్వాంతుఁడు నిత్యానుగధీ,మంతుండు సుమంత్రుఁ డల్ల • మాటలఁ దేర్చెన్. ౨౩౧౮

దాంతుఁడు=అంతరింద్రియ నిగ్రహముగలవాఁడు, విదితాత్ముఁడు=ఆత్మస్వరూప మెఱిఁగినవాఁడు, శాంతుఁడు=బాహ్యేంద్రియ నిగ్రహముగలవాఁడు, రామభక్తి సంపన్నుఁడు=రామభక్తియే సంపదగాఁగలవాఁడు, సత్+స్వాంతుఁడు = మంచి మనస్సుగలవాఁడు, నిత్యానుగ ధీమంతుఁడు = వంశపరంపరగా మంత్రిగా వచ్చిన బుద్ధిమంతుఁడు.

## తా త్ప ర్య ము.

అంతరింద్రియ బాహ్యేంద్రియ నిగ్రహముగలవాఁడును, ఆత్మస్వరూప మెఱిఁగినవాఁడును, రామభక్తియను నైశ్వర్యముగలవాఁడును మంచి మనస్సుగలవాఁడు వంశపరంపరగా వచ్చిన మంత్రియునగు సుమంత్రుఁడు మెల్లని మాటలచే నూరార్చెను.

సీ. వారు దుఃఖంబునఁ • బాదము ల్దడఁబడ, రమ్యపుష్పితవన • రాజిరాజి
తంబు సుతీర్థ మై • యింపై నమందాకి,నీనది డాయుచు • నిర్మలంబు
శివమును నై కడు • శీఘ్రంబునను బాఱు, చారుతీర్థమున యు • శస్వివరులు
ధరణీశు మదిలోనఁ • దలఁచుచు నిదె నీకు, నిదె నీకు ననుచును • నిడిరి జలము

ఆ. లంత రామచంద్రుఁ • డంజలి నుదకంబుఁ, దీసికొనుచు యామ్య•దిశకుఁ దిరిగి
చటులశోకభార • సంతప్తుఁ డగుచును, జనకుఁ గూర్చి యిట్టు•లనుచుఁ బలికె. ౨౩౨౦

రమ్య=అందమై, పుష్పిత = పూచినదైన, వనరాజి=వనసమూహములచే, రాజితంబు=ప్రకాశించునది, ఇట్లనుటచే నెండబాధలేనిదని భావము, సుతీర్థము= మంచిపుణ్య జలములు గలది. ఇట్లనుటచేఁ బితృకార్యములకు యోగ్యమగు పవిత్ర జలము గలదని భావము, ఇంబు=మనోహరము, ఇట్లనుటచే దీనిదర్శనమునఁ గొంత దుఃఖశాంతియయ్యెనని భావము, దీనిచేఁ గొంచెము కాలము తీర్థసమీపమున రోదనముచేయు నాచారము సూచితము, నిర్మలము=బురదలేనిది, శివము = శుభకరము, యశస్వివరులు=శాస్త్రమర్యాదానిష్ఠులైనస్వధర్మరతులనికీర్తికెక్కినవారిలో శ్రేష్ఠులు॰ జలముఁనిడిరి=స్నానముచేసి తర్పణములు గావించిరి, వారు=సీతారామలక్ష్మణులు॰ స్త్రీలకుఁ దర్పణాధికారముఁగలదని ముందే చెప్పఁబడెను, అంజలిన్=దోసిట, యామ్య దిశకున్=దక్షిణ దిక్కునకు, యమసంబంధము యామ్యము.

తా త్ప ర్య ము.

స్వధర్మనిష్ఠులని కీర్తిగన్న సీతారామలక్ష్మణులు మువ్వురు దుఃఖముచేఁ గాఢ్పు తొట్రుపాటుపడుచుండ మనోజ్ఞమైపూచిన చెట్లవరుసలుగలిగి పుణ్యతీర్థమై మనోహరమైన మందాకినీ నది సమీపించుచు బురదలేనిదై శుభకరమై వడిగాఁబాఱు మనోహరతీర్థమందు నీటికెదురుగ నిలఁబడి దశరథుని మనసులో స్మరించుచు నిది నీకు నిదినీకు నని తర్పణములుగావించిరి. అంత శ్రీరామచంద్రుఁడు దోయిట నీళ్ళు దీసికొని దక్షిణదిశతిరిగి మిగులశోకభరమునఁ దండ్రినుద్దేశించి యిట్లనెను.

—• రామలక్ష్మణులు దండ్రికి నివాపంబు లిచ్చుట. •—

కం. నే నొసఁగెడ విమలం బగు,నీనీరమ్ము పితృలోక • మేఁగిన నీకున్
మానుగ నక్షయసుఖసం,ధానచణం బగును గాతఁ • దండ్రీ యచటన్. ౨౩౨౧

ఈ పద్యము తర్పణమంత్రార్థము. విమలము=దోషరహితమైనది. అక్షయ సుఖసంధానచణంబు = శాశ్వతసుఖమును గూర్చుసామర్థ్యముగలది, అచటన్ = ఆలోకమందు.

తా త్ప ర్య ము.

తండ్రీ! నేనిచ్చు నీ నిర్మలజలము పితృలోకమునకేగిన నీకు నచట శాశ్వత సుఖమును గలిగించుశక్తి గలదగుఁగాక.

కం.అని మందాకినితీరం,బున రాముఁడు భ్రాతృయుక్త•ముగను నివాపం
బును విడిచి యొండుకడకుం, జని యచ్చట నొక్క-దర్భ•సంస్తరసీమన్. ౨౩౨౨

భ్రాతృయుక్తముగను=లక్ష్మణునితో, నివాపము=తర్పణజలము,ఒండుకడకున్= పిండప్రదానము చేయుటకై వేఱొక స్థలమునకు, దర్భసంస్తరసీమన్ = దర్భలు

పఱచినచోట, ఇంతవఱకు జలతర్పణముపకు నందఱు నధికారులే కావున సీతారామ లక్ష్మణులు మువ్వురు చేసినట్లు చెప్పఁబడెను. ఇఁక సపిండీకరణము పెద్దకొడుకు చేయునది కావున శ్రీరాముఁడొకఁడే చేసినట్లు చెప్పఁబడుచున్నది

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము లక్ష్మణునితోడ నీళ్లు విడిచి యొడ్డునకువచ్చి పేతోక స్థలము నందుఁ బిండములు పెట్టుటకై దర్భలు పఱచి వానిమీఁద.

తే. గారపిండియు రేగును • గలిపి పిండ,ములనునిల్పినీ శేసుంకు • దలఁచి తండ్రిఁ
గన్నులను నీరు జడిగొని • కాఱు చుండ,నిట్టులనుఁ బిండములఁ జూపి • దృఢతరాస్థ.
౨౯-౩౦

శ్రీరామచంద్రుఁడు రేగుపండ్లు గారపిండి కలిపి పిండములను శేసి దర్భలపై నుంచి తండ్రిని స్మరించి కన్నులవెంట నీరువర్షమువలెఁ గాఱుచుండ మిగుల శ్రద్ధతోఁ బిండములనుజూపి యిట్లనియె.

ఇచట శ్రీరామచంద్రమూర్తి తండ్రి నుద్దేశించి పిండములను బెట్టెఁగదా ఈపిండను లెప్పటి పిండములు? దశాహములోపలఁ బెట్టుపిండములా? సపిండీ కరణమునాఁటి పిండములా? "ముఖ్యకర్తావిదేశస్థః కాలేఽకాలే శ్రుతౌయది, తిలవారి ప్రకుర్వీత, పిండదానం వివర్జయేత్॥ ముఖ్యకర్త దేశాంతరమందుండి యేకోద్దిష్ట కాలమందుఁగాని తదనంతరముగాని తండ్రిమరణము వినినేని నూవులు నీళ్లు విడువ వలయునేకాని పిండప్రదానము చేయరాదు." అని యుండుటచే నివి దశాహము లోపలినాఁటి పిండములుగావు. రెండవదియుఁగాదు. ఎట్లనః– "పితరౌచేన్మృతౌ స్యాతాం, దూరస్థోపిహిపుత్రకః। శ్రుత్వాతద్దిన మారభ్య, దశాహం సూతకీ భవేత్॥ దేశాంతరమువనుండు పుత్త్రుఁడు తండ్రి మరణవార్త వినినేని యాదినము మొదలు పదిదినములు సూతకముగలవాఁడగుచున్నాఁడు. అను వచనమువలన శ్రీరామచంద్రమూర్తికి సూతకము ప్రాప్తింపఁగా "సర్వేషామేవ వర్ణానా, మాశౌచాంతే సపిండనమ్" అని యుండుటచే నాశౌచాంతమునఁ జేయవలసిన సపిండీకరణము సూతకియై యెట్లు చేసెను? కావుననిది సపిండీకరణముగాదు. అని యాక్షేపమురాఁగా సమాధానమేమన :—

ఇక్కడఁ జెప్పఁబడినవి సపిండీకరణము నాఁటివే. అట్లయిన నాశౌచాంతమున జేయవలసిన సపిండీకరణము వెంటనే యెట్లుచేసెను. అనిన– "వేదార్థం యోవిజానాతి వేదమంగైస్సమన్వితమ్। సంకల్పం సరహస్యంచ క్రియావాంశ్చేన్నసూతకమ్॥ రాజర్త్విగ్దీక్షితానాంచ బాలేదేశాంతరం తథా, వ్రతినాం సత్త్రిణాంచైవ సద్యశ్శౌచం విధీయతే॥ అని దక్షుఁడు– నరాజా మఘదోషోస్తి, వ్రతినాం నచ సత్త్రిణాం, ఐంద్రం స్థానము పాసీనా, బ్రహ్మభూతాహి తేసదా॥ రాజ్ఞో మహాత్మికే

స్థానే। సద్యశ్శౌచం విధీయతే। ప్రజానాం పరిరక్షార్థ మాసనం చాత్ర కారణమ్॥ మను- ౫-౯౩-౯౪.

ఈ వాక్యములవలన వేదవేదాంగము లర్థము కల్పము రహస్యముతో నెఱిఁగినవానికిఁ గ్రియావంతునకు రాజులకు- ఋత్విజులకు దీక్షితులకు- చౌలముగాని బాలురకు- వ్రతులకు యాగముచేయుచుండు వారికిని సూతకములేదని యేర్పడుచున్నది.

యతివ్రతి బ్రహ్మచారి నృపకారుక దీక్షితాః
నాశౌచ భాజః కథితా రాజాజ్ఞా కారిణశ్చయే. శంఖ-౧౫-౨౨.

అట్లైన దశాహసూతక మెవ్వరి కనినః—

శ్లో॥ అస్నాత్వాచ జపోహుత్వా భుంక్తేదత్త్వా త యోద్విజః
ఏవం విధస్య విప్రస్య దశాహం సూతకం భవేత్ ।

స్నానముచేయక జపహోమభోజనాదులుచేయు బ్రాహ్మణునకు దశరాత్రములు సూతకముగలదు.

ఇటులని యీనాఁటి బ్రాహ్మణులు మేము స్నానముచేసి భోజనము చేయుచున్నాము కావున మాకు సూతకము లేదనరాదు. ఇది పూర్వయుగములమాట.

కలౌయుగేత్విమాం ధర్మాన్ వర్జ్యానాహుర్మనీషిణః
కల్పాంతరాణి కుర్వాణః కలౌ వ్యామోహ కిల్బిషీ॥ హారితుఁడు-

ఈ ధర్మములు కలియుగమందుఁద్యాజ్యములు- సపిండుఁడు చచ్చినేని బ్రాహ్మణుఁడు పదిదినములు సూతకముండవలెను.

"నకర్తవ్యం నకర్తవ్యం, సద్యః సంకోచనం కలౌ" కలియుగమందు సంకోచింపరాదు సంకోచింపరాదు.

ఈ కారణముచే వేదవేదాంగతత్త్వవేదియు, రాజు, క్రియాశీలుఁడు, వ్రతియునగు శ్రీరామచంద్రునకు సూతకము స్నానముతోసరి. అట్లైనను మఱియొక సందేహము.

సపిండీకరణము ప్రేతత్వ విముక్తికిఁగదా. భరతుఁడు సపిండీకరణము చేసినపుడే దశరథునకుఁ బ్రేతత్వము పోయెనే. ఇప్పుడు మరలఁ బ్రేతత్వవిమోచన మనవసరమేమి?

చిన్నవాఁడు ముందు సపిండీకరణము చేసినను దేశాంతరమందున్న పెద్దవాఁడు సపిండీకరణము ప్రేతశబ్దము విడిచి చేయవలెను- ప్రేతశబ్దముచ్చరింపరాదు. సపిండీకరణము మానరాదు.

యవీయసాకృతం కర్మ ప్రేతశబ్దం విహాయతు
తజ్జ్యాయసాపి కర్తవ్యం, సపిండీకరణంపునః॥ అని ప్రమాణము-

అట్లైనను సపిండీకరణము నాఁడు బ్రాహ్మణభోజనముచేయవలయునే- ఆ విషయము చెప్పలేదేయనిన- సపిండీకరణము ప్రధానమైనచో నందున్నవారికే, ఫలమూలము లిచ్చెనని యూహింపనగు.

కం. పురుషున కన్నం బెది యా,పురుషుని దేవతలకు నదియ • భుక్తి యగుటన్
నరవర! భుజియింపుము కడుఁ, బెరిమన్ మా కన్నమైన•పిణ్యాకంబున్. ౨౩-౨౮

ఇది తర్పణముచేసిన చోటికిఁ గొంచెము దూరమునఁ జేయుటఁబట్టి యిది సపిండీకరణమని యెఱుఁగవలయును. దశాహమైనపిదప నాశౌచమున్న పుత్రుఁడు తర్పణముచేసి సపిండీకరణము చేయవలయును. మఱియు నీ పిండప్రదానము తర్పణమునువలె లక్ష్మణుఁడు చేసినట్లు చెప్పలేదు. కావున జ్యేష్ఠుఁడు మాత్రమే చేసిన యీ కార్యము సపిండీకరణమే. దృఢతరాస్థన్=మిక్కిలి దృఢమైన ప్రయత్నముచే శ్రద్ధయాదేయమ్మని శ్రాద్ధమునకు శ్రద్ధ యావశ్యకము గావున నట్టి శ్రద్ధచెప్పఁబడెను. పిణ్యాకంబున్=పిండిని. యదన్నః పురుషోభవతి తదన్నాస్తస్య దేవతాయను శ్రుతివాక్యమిచట ననుసంధించునది.

ఓయీ శ్రాద్ధము పైతృకకర్మముకదా. దేవతలకుఁ జెప్పినది- పితృదేవతల కెట్లన్వయించుననరాదు. ఇచ్చట దేవతాశబ్దము దేవ పితృ మనుష్య సంప్రదాన మాత్రపరము- ఎట్లనినఁ దైత్తిరీయమందు వైశ్వదేవగ్రహ బ్రాహ్మణమున.

"ఏ తస్మిన్వా అస్రిగ్రహే మనుష్యేభ్యో దేవేభ్యః, పితృభ్యః, క్రియతే- మనుష్యులకు దేవతలకుఁ బితృదేవతలకుఁ జెప్పఁబడినది కడపట" ఏతావతీర్వై దేవతాః తాభ్యః ఏవైనం సర్వాభ్యోగృహ్ణాతి అని మనుష్యాది సాధారణ పరముగా దేవశబ్దము ప్రయోగింపఁబడెను.

యద్భక్షస్యాత్తతో దద్యాత్, బలిభిక్షాంచ శక్తితః
అమ్మూలఫల భిక్షాభి రర్చయే దాశ్రమాగతాన్॥ మనువు.

తానేది భుజించునో యదియే శక్తికొలఁది బలిభిక్షములకు నియ్యవలయును. ఆశ్రమమునకు వచ్చినవారిని ఆ జలము కందమూలములు ఫలములు వీనిచే నర్చింపవలయును. ఇచ్చట యజ్ఞశిష్టమని గ్రహింపవలెను. అంతియకాని వచ్చినవారి నిమిత్తమై తనకు లేనిపదార్థములు సంపాదింపఁ బ్రయాసపడవలసిన పనిలేదు.

## తాత్పర్యము

పురుషునకేది యాహారమో యాయాహారమే యతని దేవతలకు నిడవలయును గావున రాజా నాయందుఁ బ్రేమచే మాకన్నమైన యీ పిండిని దినుము. దీనివలన శ్రీరామచంద్రమూర్తికి నిత్యాహారము ఫలమూలాదులేకాని మాంసము కాదని యేర్పడుచున్నది.

సీ. అనుచుఁ గర్తవ్యక్రి•యల నెల్లఁ దీరిచి, క్రమ్మఱి చనియెఁ బ•ర్వతము నెక్కి-
యాకుటింటిని జేరి • హా యని భరతల.క్ష్మణులను గ్రుచ్చి శో•కంబు గదుర
విలపింప వారల • విపులారవంబున, ధరణీధరము ప్రతి•ధ్వనుల నీనె
నది విని భరతు సై•న్యంబులు భీతిల్లి, భరతుండు శ్రీరామ•భద్రుఁ జూచెఁ
తే. గావుననెప్పట్టి నింతటి•కలకలమ్ము, వినియెఁ గాఁబోలుఁదమతండ్రి•చనుట దివికి
ననుచు వారలు వారివా•హనము లంద, వీడి పరు వెత్తి రాధ్వని•జాడఁబట్టి. ౨౩౨౯

కర్తవ్యక్రియలన్ = చేయవలసినకార్యములను, తీరిచి = నెఱవేర్చి, ఆకు+ఇల్లు=ఆకుటిల్లు=పర్ణశాల- విపులారవంబునన్=పెద్దధ్వనిచే, ధరణీధరము=కొండ.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారముచెప్పి చేయవలసిన కార్యములనెల్ల నెఱవేర్చి కొండయెక్కి-మరలి పర్ణశాలకుఁబోయి భరతలక్ష్మణులను కౌఁగిలించుకొని హాయని యేడ్చెను. వారును నట్లే యేడ్చిరి. ఆ పెద్దధ్వనికిఁ బర్వతమునఁ బ్రతిధ్వని పుట్టెను. ఆ ధ్వని విని భరతుని సేనల వారలు భయపడి భరతుఁడు శ్రీరాముని జూచెఁగాఁబోలు-శ్రీరాముఁడు తనతండ్రి మరణము వినియెఁగాఁబోలు. కావుననే యిట్టికలకలము పుట్టెనని వారి వారి వాహనములు వారున్నచోటనే వదలి ధ్వని జాడఁబట్టుకొని పరువెత్తిరి.

—• పౌరులు శ్రీరాముని పర్ణశాలకుఁ బోవుట. •—

కం. కొందఱు గుఱ్ఱంబులపైఁ, గొందఱు నాగములమీఁదఁ•గొందఱు తేర్లన్
గ్రందుగ సుకుమారులు చన, నందఱుఁ గాల్నడన పోయి • రాస్థలమునకై. ౨౩౩౦

తా త్ప ర్య ము.

నడువలేని సుకుమారులు కొందఱు గుఱ్ఱములమీఁదఁబోయిరి కొందరేనుఁగులమీఁదఁబోయిరి. కొందఱు రథములమీఁదఁబోయిరి. తక్కిన యందఱు నా ప్రదేశమునకుఁ నడచి పోయిరి.

కం. మొన్ననె విడిచిన రాముని, నెన్నాళ్లో యయిన యట్లు • లేఁకారుచు వే
గోన్నతి నాశ్రమమున కా,యన్నలఁ దమ్ముల జూడ • నరిగిరి లోకుల్. ౨౩౩౧

వేఁకారుచున్=వాఁచిపోవుచు, రూ-వేఁకరుచు- వేగోన్నతిన్=వేగముయొక్క-యతిశయముచే, మొన్ననె=సమీపకాలమందే.

తా త్ప ర్య ము.

సమీపకాలమందే నిలకుముందు వదలిన శ్రీరాముని నెన్నియో దినములకు ముందు విడిచినట్లుచూడ వాఁచి పోవుచు మిగులవేగముగ నాశ్రమమునకై యున్నదమ్ములఁజూడ లోకులు పరువుపాఱిరి.

కం. భ్రాతలసమాగమంబును, జేతః ప్రీతిగను జూడఁ • జెచ్చెరఁ జనఁగా
జాతఖురనేమిరావ, వ్రాతము దలఁపించె జలధ•రసమాగమమున్. ౨౩౨౮

సమాగమంబు=చేరికను, చేతఃప్రీతిగను = మనస్సునకు సంతోషము కలుగునట్లు, చెచ్చెరన్=త్వరగా, జాత=పుట్టిన, ఖుర=గుఱ్ఱపు గిట్టలయు, నేమి=రథచక్రములయు, రావ=ధ్వనియొక్క, వ్రాతము=సమూహము, జలధరసమాగమమున్=మేఘములో మేఘముకలియుటను, తలఁపించెన్ = మనస్సునకుఁ దెచ్చెను, స్మృత్యలంకారము.

తాత్పర్యము.

అన్నదమ్ములకూడికను మనస్సునకు సంతోషకరముగాఁ జూచుటకు లోకులు పోఁగా వారి వాహనములగు గుఱ్ఱములగిట్టల ధ్వనులును రథచక్రముల ధ్వనులను మేఘముల యుఱుములను స్మరణమునకుఁ దెచ్చెను.

కం. గడబడ దడబడ నులివులఁ, దొడిఁబడి యక్కానలోని•దుంతలు దంతుల్
బెడిదపుఁబులులుం బాములు, గడగడ కొం డదురఁ బాఱె • గవయవృకంబుల్. ౨౩౨౯

ఉలివుల=ధ్వనులచే, తొడిఁబడి=చెదరి, దుంతలు=దున్నలు, దంతుల్=ఏనుఁగులు, బెడిదపు=భయంకరమైన గవయవృకంబుల్ = గవయములు, తోడేళ్లు- గడబడ-దడబడ-గడగడ ఇవిధ్వన్యనుకరణములు.

తాత్పర్యము.

మనుష్యులయు వాహనములయు గడబడ దడబడ ధ్వనులచే నాయడవిలోని దున్నపోతులు- ఏనుఁగులు- పులులు- పాములు- గవయ మృగములు తోడేళ్లు కొండ గడగడ యదరునట్లు పరువెత్తెను.

కం. చక్రంబులచక్రంబులు, చక్రాంగంబులును సార • సంబులు నత్యూ
హక్రౌంచంబులు మింట న,వక్రగతిం గూయ దొడఁగె•వదలనిభీతిన్. ౨౩౩౦

చక్రంబుల=చక్రవాకపక్షులయొక్క, చక్రంబులు=సమూహంబులు, చక్రాంగంబులు=హంసలు, సారసంబులు=బెగ్గురు పక్షులు, నత్యూహ=నీటి యుష్ట్రి, నత్యూహో జలరంకుస్స్యాత్ హలాయుధుఁడు, క్రౌంచంబులు=క్రౌంచపక్షులు, మింటన్ = ఆకాశమందు, అవక్రగతిన్=విస్తారముగ.

తాత్పర్యము.

జక్కవల గుంపులు- హంసలు- బెగ్గురులు- పసులపోలిగాండ్రు (కాటుక పిట్టలు) క్రౌంచములు ఇవియన్నియు గూండ్లువిడిచి భయముచే నాకాశమున కెగిరి యందు విస్తారముగఁ గూయుచుండెను.

కం. ఖగములు తారాపథమున, మృగములు మనుజులును నేల • నెల్లడఁ గ్రమ్మన్
వగ నేలఁ గూరుచుండిన, సుగుణమణిన్ రాము నచటఁ • జూచెను జనముల్. ౨౩౩౧

ఖగములు=పక్షులు, ఖ+గ = ఆకాశమునఁబోవునవి, తారాపథమునన్ = ఆకాశమార్గమందు, వగన్=వ్యసనముతో.

తా త్ప ర్య ము.

ఆకాశమునఁ బక్షులు, నేలపై మృగములు మనుష్యులు నలుదిశల వ్యాపింపఁగాఁ దండ్రి మరణమునకై వ్యసనపడుచు నేలపైఁగూర్చుండిన సాధుశ్రేష్ఠుఁడగు శ్రీరాముని జనములు చూచెను.

కం. తిట్టుచుఁ గైకను మంథరఁ, బుట్టెఁడు బాష్పములఁ గనులు • పూరటిలంగా
నట్టెఁ గనుంగొని రామునిఁ, గట్టా యని యెల్లవారుఁ•గాఁతియపడఁగన్. ౨౩౩౨

పుట్టెఁడు = పుట్టి+ఎడు = పుట్టికొలఁదిగల అనఁగా విశేషముగ, పూరటిల్లంగా=నిండఁగా, కట్టా=అయ్యో, కాఁతియపడఁగన్=బాధపడఁగా

తా త్ప ర్య ము.

అదశయందు శ్రీరామునిఁజూచిన వారందఱు కైక మంథర వలనఁగదా యిట్టి మహాత్మునకింత కష్టమువచ్చెనని వారిని దిట్టుచు నుబ్బివచ్చుచుండు విస్తారమైన కన్నీళ్లచేఁ గన్నులునిండఁగా శ్రీరాముని నెగాదిగఁజూచి యయ్యోయీయనకెంతకష్టము వచ్చెనని పరితాపపడిరి.

ఉ. వారలఁ జూచి రామజన•వర్యుఁడు తండ్రిని దల్లినిం బలెన్
గూరిమిఁ గౌఁగిలించుకొనఁ • గొందఱు రామునిఁ గూర్చెఁ గౌఁగిటం
బౌరులు కొంద ఱాయనకు • మ్రొటికి మ్రొక్కిరి, బంధులన్ సుహృ
ద్వారము నాదరించెఁ దగు•భంగుల రాముఁడు సాదరంబుగన్. ౨౩౩౩

తా త్ప ర్య ము.

వచ్చినవారి నందఱినుజూచి శ్రీరాముఁడు తనకంటెఁ బెద్దవారును బూజ్యులు నగువారిని దండ్రిని దల్లిని గౌఁగిలించుకొనునట్లు కౌఁగిలించుకొనెను. కొందఱు శ్రీరామునిఁ గౌఁగిలించిరి. పౌరులు కొందఱు శ్రీరామునకు మీఁద మీఁద నమస్కరించిరి బంధువులను స్నేహితులను వారి వారి యోగ్యతాను సారముగఁ బ్రీతితో శ్రీరామచంద్రుఁ డాదరించెను.

కం. వారల యేడుపుటులివు ల,వారితమై మిన్ను మన్ను • వారక నిండన్
గైరికగుహలు మృదంగ, స్వారరవములట్టు లిచ్చెఁ • బ్రతినిస్వనముల్. ౨౩౩౪

వారల = చూడవచ్చినవారియొక్క, ఏడుపు+ఉలివు = రోదనధ్వని, అవారితమై=అడ్డగింపరానిదై, మిన్ను=ఆకాశము, మన్ను=నేల, గైరికగుహలు=పర్వత

సంబంధములైనగుహలు, మృదంగస్వారరవములు=మద్దెలలు వాయించిన ధ్వనులు. ప్రతినిస్వనముల్=ప్రతిధ్వనులు.

తా త్ప ర్య ము.

ఆ చూడవచ్చినవారి రోదనధ్వనులు వారింపరానివై భూమి యాకాశము నిండఁగా నాధ్వనులచేఁ బర్వతగుహలు మద్దెలను వాయించినట్లు ప్రతిధ్వను లిచ్చెను.

—•{ ౧౦౩-వ సర్గము. కౌసల్య సుమిత్రకు శ్రీరామలక్ష్మణుల యేటినీటి రేవుఁ జూపి దుఃఖించుట. }•—

కం. అంతట దశరథధరణీ,కాంతుని కామినులు మున్ను • గా భూతనయా
కాంతునిఁ గనఁగ వసిష్ఠుం,డెం తే ముదమునను వచ్చు • నెడమార్గమునన్. ౨౩౩౫

తా త్ప ర్య ము.

మగవారందఱు ముందుగావచ్చి శ్రీరాముని దర్శించిరి. దశరథు భార్యలను బిలుచుకొని వసిష్ఠుఁడు కాలినడ శ్రీరాముని మరలఁ గనఁగఁ గలిగెఁగదా యను సంతోషముతో వచ్చుచుండఁగా మార్గమధ్యమందు.

సీ. దేవు లెల్లరుఁ దిన్న • తిన్ననినడకల, మందాకినీకూల • మందుఁ జనుచు
రామలక్ష్మణసేవి • తామలతీర్థంబుఁ, గనుఁగొనఁ గౌసల్య • కనుల వారి
ధారలు గురియంగఁ • దనపజ్జ వచ్చుసుమిత్రాదిసతులకు • మెల్ల ననియెఁ
దమరాజ్యమునునుండి • తఱుమఁగొట్టంబడి, పట్టి యనాథులు • వనభుచరిసు

ఆ. లంబువులకుఁ గాను • వరుగుదెంచెడి రేవు,చూడుఁ డిదియె యడుగు • జాడ లొప్పు
రాకపోకలవి • రాపడి యున్నది, కంటివే సుమిత్ర • కష్టపాటు. ౨౩౩౬

దేవులు=రాజ భార్యలు, ఏక- దేవి; బహు- దేవులు- దేవుఁడనుటకుఁ దెనుఁగున బహువచనము లేదు. దేవుండ్లు గ్రామ్యము- తిన్న తిన్నని నడకలన్ = సుకుమారులు గావునను శోకభారముచేతను- మెల్ల మెల్లని నడకలచే- కూలమందున్= తీరమందు- రామలక్ష్మణ సేవితామలతీర్థంబు=రామలక్ష్మణులచే స్నానపానార్థముప యోగింపఁబడు నిర్మలమైన పుణ్యజలము- వారిధారలు=నీళ్ల ధారలు, పజ్జ=పార్శ్వము నందు, అనాథులు=దిక్కులేనివారు, అంబువులకుఁగాను=నీళ్లనిమిత్తమై, రాపడి = రాపుతగిలి.

తా త్ప ర్య ము.

రాజభార్యలందఱు సుకుమారులు శోకతప్తులుగావున మెల్లగా నిట్లనిరి. అమ్మలారా తమ రాజ్యమునుండి వెడలఁగొట్టఁబడి దిక్కులేనివారగు పుణ్యచరిత్రులు రామలక్ష్మణులు నీటికై వాడుకగా వచ్చుచుఁబోవుచుండు రేవిదియే. నీకెట్లు తెలియు నందురా. ఇదిగో వారిరాకపోకల యడుగుల జాడఁగలిగి కాలిత్రొక్కుడుల నలఁగి

యున్నది. సుమిత్రా! రామలక్ష్మణులకు వచ్చిన కష్టముచూచితివా? ఇతరమనుష్య సంచార చిహ్నాలు కానరామిచే నీయడుగులు వారివే యని తీర్మానించెను.

కం. నాకొడుకు నిమిత్తం బై. నీకొడు కిటనుండి దినము • నీళ్లం బ్రీతిం
 జేకొని పోవుఁ గదా యస్తోకాతంద్రతను దాన • సుమహితచరితా! ౨౩౩౪

సుమహిత చరితా=మిక్కిలి పూజ్యమైన నడవడిగలదానా, అస్తోక=అల్పము కాని, అతంద్రతను=హెచ్చరికతో.

తా త్ప ర్య ము.

నాకొడుకు కొసరము నీకొడుకిచ్చటనుండి ప్రతిదినము ప్రేమచే మిక్కిలి జాగరూకతగలవాఁడై నీళ్లు తీసికొనిపోవుచుండునుగదా. నాపాపమునాతోఁబోవక నీకును జుట్టుకొన్నది.

సీ. ఇది నీచకర్మంబ•యీ హేతువున నీదు,పుత్రు గర్హింపదు • భువనవితతి
 యన్న సేవయె పర•మార్థమం చతఁ డట్లు, చేయు నాసుగుణకే•చెల్లు నదియు
 నాతనియీకష్ట • మంతయుఁ దీఱదే, భరతుండు కోరిక•పడసె నేని
 యని యేగుచును దక్షి•ణాగ్ర దర్భలమీఁద, జనకునకై రామచ•ంద్రుఁ డిడిన
తే. యట్టియింగుదిపిణ్యాక • మదిన చూచి, లోడనుండెడి దశరథు•చేడెలఁ గని
 యనిరొఁ గంటిరె జనకున•కై రఘూత్తముండు సవిధిగఁ బెట్టిన•పిండములను.
 ౨౩౩౫

గర్హింపదు=నిందింపదు, భువనవితతి = లోకసమూహము, పరమార్థము = ఉత్తమ పురుషార్థము, మంచిగుణములుగల యతనికే, తీఱదే = నశింపదా, దక్షిణాగ్రదర్భలమీఁదన్=దక్షిణపు కొనలుండఁ బఱచిన దర్భలమీఁద, ఇడిన=ఉంచిన, ఇంగుదీపిణ్యాకము=గారపిండి, సవిధిగన్=శాస్త్రప్రకారము.

తా త్ప ర్య ము.

ఇట్లు నీరుమోసికొనిపోవుట రాజకుమారులకు నీచకర్మమే- కాదనునుగాని యీ కారణముచే నీ కొడుకును నీచకార్యము చేయుచున్నాఁడని లోకమునిందింపదు. పరులబలవంతముచేతనో కూటినిమిత్తమో యొకరియొద్ద కొలువునందుండి వారికై నీళ్లు మోయుట నీచకార్యమే కాని ప్రతిఫలకాంక్షలేక ప్రేమతోఁ గర్తవ్యమనుభావముతో నుపకారబుద్ధితోఁ బెద్దలసేవచేయుట పరమపురుషార్థ సాధనమని యతఁడు చేయుచున్నాఁడు. అట్టివాని నెవరు నిందింతురు? నిందింపరేకదా మఱి పొగడుదురు. ఏలన మీఁదఁ జెప్పినట్లు జ్ఞానము భక్తిగలిగి ధర్మబుద్ధితోఁ గష్టవేళ మానావమానము లెంచక సవతితల్లి కొడుకను తలంపులేక లోకమున నెవఁడిట్లు సేయును? ఇట్లుసేయుట యీసుగుణధన్యునకే చెల్లునుగాని యితరులకుఁ జెల్లదు. శ్రీరాముని మరల నయోధ్యకుఁ బిలుచుకొని పోవలయునన్న భరతుకోరిక నెఱవేఱెనేని లక్ష్మణుని యీకష్టమంతయుఁ దుదముట్టునుగదా.

అని చెప్పుచుఁ బోయి పోయి దక్షిణపు వైపునకొనల దర్భలమీఁదఁ దండ్రి నిమిత్తమై శ్రీరామచంద్రుఁడు పెట్టినగారపిండి పిండములనుజూచి తనతోడనుండు దశరథు భార్యలకుఁజూపి శ్రీరాముఁడు శాస్త్రప్రకారము తండ్రికిఁబెట్టిన పిండములను జూచితిరా.

శ్లో॥ శుశ్రూషతేయః పితరం, నచాసూయేత్కదాచన
మాతరం భ్రాతరంవాపి, గురుమాచార్యమేవచ
తస్యరాజన్ ఫలంవిద్ధి, స్వర్లోకే స్థాన మర్చితమ్
నచపశ్యేత నరకం, గురుశుశ్రూషయాత్మవాన్. భార. అను- ౧౧౦ అధ్యా.

తండ్రిపైఁ గోపింపక శుశ్రూషచేయువాఁడును అట్లులే తల్లికి- నన్నకు-గురువునకు- నాచార్యునకు సేవచేయువాఁడు నరకమునకుఁబోఁడు. స్వర్గమందుఁ బూజ్యస్థానమును బొందును. దీనిచే నెంతటి నీచకార్యమైనను గురుపితృదేవ కార్యార్థము భక్తితోఁ జేయఁబడునేని యది నీచమెన్నఁటికిఁగాదు.

మ॥ గృహసమ్మార్జనమో, జలాహరణమో, శృంగార పల్యంకికా
వహనంబో వనమాలికా కరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతి యో ప్రాగ్దీపికారోపమో
నృహరీ వాదములేల లేరెయితరుల్ నీలీలకుం బాత్రముల్

అముక్త. ౨-౧.

దేవతానిమిత్తమై కసవూడ్చుట, నీళ్లుమోయుట పల్లకిమోయుట, దండలు కట్టుట, ధ్వజము మొదలయినవిమోయుట, చామరము గొడుగుపట్టుట దీపములు పెట్టుట యివి శ్లాఘ్యములుగాని నీచములుగావు. వీనినేకూలి దీసికొని మనుష్యులకుఁ జేసిన నీచములే.

ఉ. దేవసమానుఁడైన జగతీపతివర్యుఁడు శక్రభోగసం
భావితుఁ డార్యమూర్తి పరిభక్షితసాగరవేష్టితక్షముం
డేవిధి గారపిండి తిను నియ్యెడ రామునివంటిపుత్రుఁడు
ర్వీవిభుఁడైన తండ్రికిడ వే శోకదుఃఖము భూమి నున్నదే. ౨౩౯

శక్రభోగ సంభావితుఁడు = ఇంద్రుని సౌఖ్యముచే గౌరవింపఁబడినవాఁడు, ఆర్యమూర్తి=పూజ్యుఁడు, పరిభక్షితసాగర వేష్టితక్షముండు = సముద్రముచేఁ జుట్టఁబడిన భూమిని ననుభవించువాఁడు.

తా త్ప ర్య ము.

దశరథుఁడో దేవతలతో సమానుఁడగువాఁడు. రాజులలో శ్రేష్ఠుఁడు- ఇంద్ర భోగమువంటి భోగమనుభవించినవాఁడు. లోకులచే గొప్పవాఁడని పూజింపఁబడిన వాఁడు, అట్టివాఁడీ గారపిండి నెట్లు దినఁగలఁడు, ఇట్టి పిండములను రామచంద్రుని

వంటివాడుకు భూమీశ్వరుఁడైన దశరథున కిడినట- ఇంతకంటె దుఃఖకారణము వేఱొకటి లోకమునఁగలదా.

తేజోమూర్తులైన దేవతలు పృథివీతత్త్వ భూయిష్ఠములైన పదార్థములు నోరఁదినరు. ధూపులచే సారముగ్రహింతురు. వి. పు.

కం. అంగద! రాముఁడు దండ్రికి నింగుదిపిణ్యాకపిండ ♦ మిడుటను గన్నా
రం గాంచియు నాడెంద మ,భంగురదుఃఖమున వేయి ♦ పటియలు గాదే. ౨౩౮౦

అంగద=అయ్యో, అభంగురదుఃఖమునన్ = విస్తారదుఃఖమున, పటియలు = చీలికలు.

తాత్పర్యము.

అయ్యో! జీవితకాలమునందు వ్రేలువేసిరైనఁ దాఁకియుండని గారపిండితోఁ జేసిన పిండములను నాకొడుకు శ్రీరాముఁడు తన తండ్రికిఁ జేతులారఁ బెట్టుటను గన్నులారఁ జూచియు నాగుండె దుఃఖతాపముచే వెయ్యితునుకలుగాఁ బెటిలిపడ కున్నదిగదా. నాకంటె రాతిగుండె దెవ్వరుండు లోకమున నుండునా!

కం. అన్నం బెది పురుషున కా,యన్నమె తద్దేవతలకు ♦ ననువేదోక్తిన్
మున్ను విని యుంటి నిప్పుడు, కన్నారఁగ సత్యమనుచుఁ♦గనుఁగొంటయ్యెన్. ౨౩౮౧

తాత్పర్యము.

అమ్మలారా! ఏ పురుషున కేది యాహారమో యాపురుషుని దేవత కదియే యాహారము. అని శాస్త్రమునందుఁ గలదని మును వినియుంటిని- అది సత్యమని నేఁడు కన్నారం జూచితిని.

యదాహారో భవేత్తేన, పూజయేత్పితృదేవతాః ।
తేనైవ పూజయేన్నిత్యం, మతిథిం సముపాగతమ్॥ శంఖ.

ఎవని కేది యాహారమో వాని పితృదేవతలకు నతిథుల కదియే యాహారము.

—♦ కౌసల్యాదులు శ్రీరామునిఁ జూచుట. ♦—

చం. అని యిటు లార్తిఁ గూర సవ ♦ తాండ్రురు దేర్పుచుఁ బోయి యాశ్రమం
బున దివి వీడి వట్టిసుర♦పుంగవుఁ బోలెడి త్యక్తభోగు రా
మునిఁ గని గొల్లు మంచు వెత ♦ మున్గి రవంబుగ నేడ్వ రాముఁడున్
జననులపాదపద్మములఁ ♦ జయ్యనవ్రాలి నమస్కరించినన్. ౨౩౮౨

సవతాండ్రురు=ఇచట నిత్యసంధి, ఏమ్యాదులలోఁ జేరుట సాధువు. బహువచనము ప్రత్యయము, దివి=స్వర్గము, సురపుంగవున్=దేవశ్రేష్ఠుని, త్యక్తభోగున్= వదలిన భోగములుగలవానిని.

కొందఱు ఇత్వసంధి నిషేధించెదరుగాని యీక్రింది ప్రయోగంబులు గానం బడియెడి. దీనిసాధుతకు శ్రావ్యంబై గ్రాహ్యంబను నథర్వణోక్తియే ప్రమాణము.

"ఆనతిచ్చి" 'కనుదోయిలయన్,' 'తిత్తోల్చి', పదాలు, సవతాలు (సవతాలికిఁ బతి వలచిన), మగనాలు, తెలివార, తెలివ్రల్లమ్మున, అని భారతమందును, కాఁపుఁగోఁడలు కంచంత కాఁపురంబు. (కంచి+అంత) కంట వత్తిడుకొని సైరిక ప్రభుండు (వత్తి+ఇడుకొని) అని పాండురంగ మాహాత్మ్యంబునను, మనవేటికి నూతనమా (మనవి+ఏటికి) భవానీ భర్తకలిమెంత, మన్నింపంగఁ బాడింతటన్ (పాడి+ఇంతటన్) తాళంజాలదు కౌఁగిలియ్యదు, మొలబంత్లై బొమ్మలబంత్లై మెడబంత్లై, అని నరసభూపాలీయ మందును వాకిలిప్పుడు తెఱచినాయి (వాకిలి+ఇప్పుడు) అని భాస్కర రామాయణమందును. దూళెమ్మె మారుతోద్ధూత పుష్పపరాగ (దూళి+అమ్మె) అని భీమఖండము, ౪ అ. ౧౭౪ పద్యంబునందును 'వాని కౌఁగిలది యొక్కడ హావిధియేమి సేయుదున్' అని మనుచరిత్రము, 3 అ. నందును, 'పెండుంగరంబు' అని శ్రీనాథుని హరవిలాసంబునను; మగనాలి పరిపోల్పఁదగదు విధవయనియు. సవతాలి కొడుకు ౪ అ. అనియు, తిత్తోల్చి తోలు పచ్చడము చేసి(౬ అ.) అని కాశీఖండంబునందును తిత్తోల్చి తెచ్చిరి దిననాథనందను వని నైషధంబునను. 'నాకు నొక్క బ్రాఁతే సురలోక వందిత మదింగవచంబునుఁ గుండలంబులున్' అని. భార అరణ్య ౭ అ. న. ఎఱ్ఱాప్రెగడయు, ధర్మతత్పరులకు గెల్పు బ్రాఁతె' యని భార. శల్య. ౧ అ. తిక్కనయు మనోవల్లభుం। గనిపెండ్లాడుదుగాని యందనుకఁ జిక్కంబట్టు మీ ధైర్యమున్' అని ౫ ఆ- ౩౭ ప- చంద్రాంగద చరిత్రమునందును ఎఱ్ఱాప్రెగడ హరివంశంబునందు, తెలివొంది నీకే బ్రాఁతియే వెన్నలున్- ౬ ఆ. అనియు, కాకేమి తన్నుఁదిట్టెనె, కోకిల తనకేమి ధనముకో యొమ్మనెనే. అని. కవి. కర్ణ- ౨-ఆ-౮ పద్యమునందును. కేలుదోయెత్తి యాదలఁగీలుకొల్పి నైష-౮- ఆ మందును. అలరుబంతిది యని ఆంధ్రభాషాభూషణమునను. 'ద్రోవదన్। తీయం బోఁడి' యని పాంచాలీ పరిణయమందును పల్లవపుటార్చిడఁగరాదు. అని రామరాజ భూషణుఁడును. ఇత్యాది ప్రయోగంబులు పెక్కులు గానంబడుచున్నవి. విజయవిలాస విష్ణుచిత్తీయములందు వలసినన్ని కలవు. వానిని గొందఱు కేవలలాక్షణిక గ్రంథంబులుగ సంగీకరింపమి నుదాహరణంబు లియ్యంబడవయ్యె. ఈ ప్రయోగములవలన శ్రుతికటువులుగాని ఇత్వసంధులు గ్రాహ్యములని పూర్వులు గ్రహించిరి.

తాత్పర్యము.

ఈ ప్రకారము శోకింపంగా సవతులు గతించిన దానికేలమ్మా యేడ్చెదవు భరతుఁడెటులైనఁజేసి శ్రీరామలక్ష్మణులను బురమునకుఁ బిలుచుకొని వచ్చును లే- మనమందఱము పోయి వేఁడుకొనిన శ్రీరాముఁడు రాకయుండునా అని సమాధానపఱుచుచుఁబోయి యాశ్రమమందు, స్వర్గము విడిచిన దేవేంద్రునివలె భోగములను వదలిన శ్రీరామునిఁగని యాయనయునికికి స్త్రీలందఱు గొల్లున నొక్కపెట్టున

నోరని యేడ్చిరి. శ్రీరాముఁడా తల్లులనందఱఁజూచి చివాలునలేచి వారి పాదకమలములపై వ్రాలి నమస్కరించెను.

కం. వారు సుఖస్పర్శములగు,హారిమృదులపాణులన్ ని • జాంగుళులన్ సీ
తారమణీశునివీఁపుకు, మారముఁ బోఁదుడిచి రంత • మాతలఁ గనుచున్. ౨౩౮౩

సుఖస్పర్శములగు=సుఖకరమయిన స్పర్శముగలవి, హారి=మనోహరములైన మృదులపాణులన్=మెత్తని యఱచేతులచే, నిజాంగుళులన్=తమ వ్రేళ్లచే, దుమారము=దుమ్ము.

తాత్పర్యము.

ఆతల్లులందఱు తమ సుఖకరమగు మెత్తని యఱచేఁ దాఁకుచుఁ దమవ్రేళ్లచే నారబయల నదీతీరమునఁ బండుటచే నయిన శ్రీరాముని వీఁపునందలి దుమ్మును బోవఁ దుడిచిరి. అంత నా తల్లులఁగని.

సీ. సౌమిత్రి దుఃఖించి • సాష్టాంగ మెరఁగిన, నాతనిరఘురాము • నట్లచేయ
జానకి చనుదెంచి • సంతప్తహృదయ యై, యత్తల కెల్లను • నశ్రు లురల
మ్రొక్కి నిల్చుండిన • నక్కటికంబునఁ, దల్లి కూఁతునుబోలెఁ, • దర్ద గ్రుచ్చి
వనవాసకృశ దీన • వామాక్షి వీక్షించి, కౌసల్య పల్కె స • గద్గదముగఁ

ఆ. దండ్రి జనకరాజు • దశరథేశుఁడు మామ, రామచంద్రవిభుఁడు • ప్రాణధవుఁడు
నైననీవు నిట్టి•యడవులలో నెల్లు, దుఃఖపడెదవమ్మ • తోయజాక్షి! ౨౩౮౪

ఎరఁగినన్=నమస్కరింపఁగా, అక్కటికంబునన్=దయచే, వనవాసకృశన్ = అడవియందుండుటచేఁ జిక్కిన దానిని, దీనన్ = వ్యసనముతోఁగూడినదానిని, సగద్గదముగన్=డగ్గుత్తికతో.

తాత్పర్యము.

లక్ష్మణుఁడు వచ్చి సాష్టాంగముగ నమస్కరింపఁగా నాయనను శ్రీరాముఁడును జేసినట్లు చేయఁగా సీతాదేవివచ్చి తపించుచున్న మనస్సుతో నత్తగార్లకందఱకుఁ గన్నీరు కాఱుచుండ నమస్కరించి నిలుచుండఁగా దయతోఁ దల్లికూఁతువలె గాఢముగాఁ గౌఁగిలించి వనవాసము చేయుటచేఁ గృశించి దుఃఖించు సీతనుజూచి కౌసల్య డగ్గుత్తికతో నిట్లనియె. అమ్మా! నీవు జనకరాజు కూఁతురవు. దశరథమహారాజు కోడలవు. రామచంద్రవిభుని భార్యవు. అట్టిగొప్పయింటఁబుట్టి యిట్టి గొప్పయిల్లు మెట్టి యిటువంటి గొప్పవానిఁ జేపట్టిన సుకుమారివి ఉత్తమరాజకన్యవు. నీ వేవిధముగా నమ్మా! యీ యడవులందుఁ గష్టపడుచున్నావు.

ఉ. వాడినకల్వ, యెండ ధర • వ్రాలి కృశించిన తమ్మి, ధూళిచేఁ
గూడినజాతిరూపము, మొ • గుల్ గుమి మాటినచందురుండు నాఁ
జూడఁగ నీమొగంబు భృశ•శోకభరారణిసూతి కాల్చెడిన్
వాడిగ నన్నుఁ గాష్ఠమును•వాడుముగా శుచి గాల్చుకైవడిన్. ౨౩౮౫

తమ్మి=కమలము, జాతరూపము=బంగారు, మొగుల్ గుమి=మేఘములసమూహము, మాటిన=అడ్డగించిన, భృశ=అధికమైన, శోకభర=శోకభారమనెడి, అరణిసూతి=అగ్ని. కాష్ఠమును=ఎండినకట్టెను, రూక్షముగా=తీవ్రముగా, శుచి=అగ్నిహోత్రుఁడు. ప్ర. రూఢి. విక్ర. రూఢి.

## తాత్పర్యము

వాడిన కలువపూవు- ఎండకు నీరు పట్టువిడిచి భూమిపైఁబడి శుష్కించిన కమలము- దుమ్ము కప్పిన బంగారము- మబ్బుగ్రమ్మిన చంద్రుఁడో యనునట్లు నీ ముఖముఁజూడఁగా నన్ను నెండిన కట్టెను దీవ్రముగా నగ్నిహోత్రుఁడు కాల్చునట్లు తీవ్రశోకాగ్ని కాల్చుచున్నది.

సీ. అనుచు నీగతిఁ దల్లి ♦ యడలుచు నుండఁగ, జంభారి దేవతా ♦ చార్యునకును
మ్రొక్కునరీతిని ♦ మ్రొక్కి శ్రీరాముఁడు, శిష్టవినుతుఁడు వ ♦ సిష్ఠునకును
నాతనితోడుత ♦ నాసీనుఁ డైనను, భరతుండు నిజమంత్రి ♦ పౌరయుతము
గాఁగఁ గూర్చుండెఁ దాఁ♦గరములు మోడిచి,భరతుఁడేమనిరామ♦భద్రుమ్రొక్కి

ఆ. పలుకు విందు మనుచుఁ♦బ్రజలు వీనులు విచ్చి,వినుచు నుండ రాముఁ♦డనుజులైన
భరతలక్ష్మణులును♦పౌరులతో సభ్య,యుక్తసవనవహ్ను♦లొప్పఁ గనిరి, ౨౩౪౬

జంభారి=ఇంద్రుఁడు, దేవతాచార్యునకు=బృహస్పతికి, శిష్టవినుతుఁడు=సాధువులచే స్తోత్రముచేయఁబడినవాఁడు అగువసిష్ఠునకును, షష్ఠికిఁ బ్రథమావిశేషణము, ఆసీనుఁడు=కూర్చుండినవాఁడు, సభ్యయుక్త=సభ్యులతోఁగూడిన సవన వహ్నులు=యజ్ఞమునందలి త్రేతాగ్నులు.

ఇచ్చటఁ దల్లులకు నమస్కరించిన తరువాత వసిష్ఠునికి నమస్కరించినట్లున్నది- దీనికిఁగారణ మాయన స్త్రీల కందఱకు వెనుక నుండుటయే- రాజస్త్రీల నందఱ ముందిడుకొని వెనుకఁ దాను వచ్చినట్లు ౨౩౩౯ వ పద్యంబున నున్నది. ఆకారణముచే మూఁడు వందల యేఁబది రాజభార్యలకు వెనుకనుండిన వాఁడగుటచే వారియేడ్పులయిన పిమ్మట వసిష్ఠుఁడు శ్రీరామునిఁ జేరవచ్చెను. గార్హపత్యము. దక్షిణాగ్ని- ఆహవనీయమని మూఁడగ్నులు.

## తాత్పర్యము.

ఈ ప్రకారము తల్లి కౌసల్య దుఃఖపడుచుండఁ నింద్రుఁడు బృహస్పతికి మ్రొక్కినట్లు శ్రీరాముఁడు వసిష్ఠునకు నమస్కరించి యాయనతోడఁ గూర్చుండెను. వారిరువురు గూర్చుండిన పిదప భరతుఁడు మంత్రులతోఁ బౌరులతోఁ జేతులు జోడించుకొని కూర్చుండెను ప్రజలందఱు భరతుఁడు శ్రీరామునితో నేమి మాటలాడునో యెట్లు మాట్లాడునో విందమని చెవులు విచ్చుకొని వినుచుండిరి. పౌరులతోడ శ్రీరామ భరత లక్ష్మణులు యజ్ఞశాలయందు సభ్యులతోడి త్రేతాగ్నులవలెఁ బ్రకాశించిరి.

—• ౧౦౪-వ సర్గము. శ్రీరాముఁడు భరతునిరాకకుఁ గారణం బడుగుట. •—

కం. గురువత్సలుఁ డగుతమ్ముఁడు, భరతుఁడు తనుఁ జూడవచ్చు • భావము సీతా
వరుఁ డెఱిఁగి కౌఁగిలించుచు, సరసగతిని నడుగఁదొడఁగె • సహలక్ష్మణుఁడై
౩౩౪౮

గురువత్సలుఁడు=పెద్దవారియందుఁ బ్రీతిగలవాఁడు, సరసగతిని = ప్రేమతోఁ గూడినవిధముగా, గురువత్సలుఁడనుటచే భరతుఁడు శ్రీరామునందు భక్తిగలిగి యాయనను నయోధ్యకుఁ బిలుచుకొని పోవవచ్చినాఁడే కాని లక్ష్మణుఁ డెంచినట్లు కలహమునకు వచ్చినవాఁడుకాఁడని యేర్పడుచున్నది. అతఁడు సాధుభావముతో వచ్చెను గనుకనే శ్రీరాముఁడు ప్రేమతోఁ గౌఁగిలించి యాదరించెను. సహలక్ష్మణుఁడై యనుటచే రామలక్ష్మణు లేకాభిప్రాయులైరని భావము. లక్ష్మణు సందేహము తీరెను.

తా త్ప ర్య ము.

పెద్దవారియందుఁ బ్రేమగల భరతుఁడు తన్నయోధ్యకుఁ బిలుచుకొనిపోయి రాజ్యాభిషేకము చేయవలయునను తలంపుతో వచ్చెనని భరతుఁడు జడలు ధరించిన కారణమున నింగితజ్ఞుఁడగు శ్రీరాముఁడెఱిఁగి కౌఁగిలించి ప్రేమవాక్యములచే లక్ష్మణుతోఁగూడి యిట్లనియెను.

ఉ. ఏమిది నీవ మాకు వచి • యింప వినన్ మన సయ్యె, నేల యీ
భూమికి నీవు వచ్చితివి • పూనితివేల జటాజినంబు? నీ
మేమెయి నారచీరల వ • హింపఁగ నేటికి? రాజ్య మిట్లు నీ
వే మని వీడి తన్ననని • యెన్ భరతుం డిటు కేలిమోడ్పుతోన్. ౩౩౪౯

జటాజినంబు = జడలు, జింకచర్మము. ఇది సమాహారద్వంద్వము కావున నేకవచనము.

తా త్ప ర్య ము.

ఇదియేమి భరతా! నీ విషయము నీవే చెప్పఁగా విన మనస్సగుచున్నది. రాజ్యభారము వహింపవలసిన వాఁడ వీయరణ్యభూమికి నీవేలవచ్చితివి. వేటకు వచ్చితివా? అట్లైన నీజడ లేమి. ఈకృష్ణాజినమేమి. ఈనారచీరలుకట్టఁగారణమేమి ఏమని నీవు రాజ్యమును వదలి వచ్చితివి. అని యడుగఁగా భరతుఁడు చేతులు జోడించుకొని యిట్టులనెను.

సీ. అన్న! చేయఁగరాని • యట్టికార్యముఁ జేసి, నిందఁ బాసి వెనుక భూ • మిరాధవుండు
పుత్రశోకంబున • గాత్రంబు దొఱఁగెను, నాఁడుది నాతల్లి • యాడినట్టి
యామాటఁ బాటించి • యాత్మయశోహార, మగుమహాపాపంబు • నాచరించె
రాజ్యఫలంబును • బ్రాపింపమియు కాక, విధవ యై యేడ్చుచు • విపుల ఘోర

తే. నిరయమునఁ బడు నాతల్లి • నిష్ఠురాత్మ, యట్టియపవాదనిహతుండ• నైననన్ను
　నీదుదాసుఁ బ్రసాదింప • నీకుఁ జెల్లు, మఘవుపోలిక రాజ్యంబు• మరలఁ గొనుము
౨౩౪౯

గాత్రంబు=దేహము- తొఱఁగెను=విడిచెను- ఆత్మయశోహరము=తనకీర్తిని నాశము చేయునది- విపుల ఘోరనిరయమునన్ = అధికమైన భయంకరమైన నరకమందు- నిష్ఠురాత్మ = పరుషమైన మనస్సుగలది- అపవాదనిహతుండన్ =నిందచేఁ జంపఁబడిన వాఁడను- ప్రసాదింపన్ = అనుగ్రహింపఁగ- మఘవుపోలికన్ = ఇంద్రునివలె.

తాత్పర్యము.

అన్నా! చేయరాని చెడ్డపనిచేసి మిమ్ము వదలి రాజు పుత్రవియోగ శోకంబున దేహము వదలెను. ఇది తండ్రి చేసిన యకార్యమునకుఁ బ్రథమఫలము. గొప్పవిషయములు స్త్రీలతో నాలోచింపరాదనియు "బెడలలనుండుఁగా యువతి బృందముల కెల్లనుబుద్ధి" స్త్రీ బుద్ధిః ప్రలయంకరీ"యన్న ధర్మసూక్తులు మఱచి యాఁడుది నాతల్లి చెప్పినమాటనుబట్టి తనయశస్సు నాశము చేసికొనెను. ఇది రెండవఫలము. ఇంత ఘోరకార్యము చేసిన నాతల్లికో ప్రథమఫల మామె కోరినట్లు రాజ్యము లభింపక పోవుట, రెండవఫలము విధవయై యేడ్చుచు ఘోరనరకమునఁ బడుట. ఇఁక నా గతియో యేపాప మెఱుఁగకపోయినను నైకకడుపునఁ బుట్టినకారణమున రాజ్యము నిమిత్తమై తల్లిమూలమున నన్ను నడవిపాలు చేసె నను నిందచేఁ జచ్చుట; తండ్రి చేసిన కార్యము తల్లి చేసినకార్యము నవరింపనిపుడు సాధ్యపడదు. నేను నీదాసుఁడను. నాయందనుగ్రహించి నాకు నిష్కారణముగవచ్చిన యపకీర్తి తొలఁగిపోవునట్లు లింద్రునివలె నీరాజ్యము నీవు గైకొమ్ము. ఇదినాకోరిక. ఈ నిమిత్తమై నేనువచ్చితిని నేను నీదాసుఁడను స్వామివగునీవు జటాజినధారివై నారలుగట్టుచు నడవియందుండ నేనెట్లు రాజచిహ్నములు ధరించి సింహాసనముపైఁ గూర్చుండి నగరవాసిని గాఁగలను! దాస్యము నాకార్యము. స్వామిత్వము నీకార్యము. నాకార్యము నేను జేసెదను. నీకార్యము నీవు చేయుము.

భరతుఁడింత ఘోరవ్రతము పూనుటకు నపకీర్తి భయమే. లక్ష్మణునకుమాత్ర మేకాదు. లోకమునకంతయు నీసందేహముగలదు. ఆయనకీర్తిఁ బోఁగొట్టుకొనుటకు భరతుఁ డింతశ్రమించెను. శ్రీరామచంద్రమూర్తియు నపకీర్తికి భయపడియే కదా సీతను విడనాడుట.

సంభావితస్యచాకీర్తి ర్మరణాదతిరిచ్యతే. భ-గీ. కీర్తిమంతుఁడపకీర్తిసహించుటకంటె మరణించుట శ్రేయస్కరము.

కం. కలప్రకృతిజనములును విధవలు నగు మనతల్లు లెల్ల • వచ్చిరి వీరే
　కులభూషణ! నినుఁ గన నిష్కలుషాత్మక! మమ్ముఁ గరుణఁ • గనుఁ గొనఁ గదవే.
౨౩౫౦

### తా త్ప ర్య ము.

ఈ ప్రార్థన చేయువాఁడను నేనొకఁడనే గాను. ఈ యుద్దేశముతోనే యీ మంత్రులు, అమాత్యులు, పౌరులు, సామంతులు విధవలయిన మనతల్లులు సందఱు నిన్నుఁజూడ నిదిగో వచ్చినారు. వారిముఖములు చూడుము. వారియభిప్రాయములు దెలియును. కలుషచిత్తులనైన నేను నాతల్లి తండ్రి చేసిన కార్యమును గలుషములేని మనస్సుగల నీవు మాతప్పు క్షమించి మమ్ముఁ గరుణఁజూడుము.

తే. పెద్దవాఁడుండ రా జయి • చిన్న తమ్ముఁ, డలరుటలు మనవంశమ • ర్యాదయగునె?
భరణదక్షుఁడ వీవ యీ • ధరణి నెల్ల, రాజ వై సల్పుమా హిత • రంజనంబు.
౨౩౫౧

### తా త్ప ర్య ము.

ఏమితప్పు చేసితివని నిన్ను నేను క్షమింతును, నీవుచేసిన తప్పేమో నాకుఁ దెలియలేదే యందువా.

నాతప్పు నాకుఁ దెలియకపోలేదు. పెద్దవాఁడుండఁగాఁ జిన్నవాఁడు రాజయి సుఖించుట మనవంశమర్యాద యగునా? పెద్దవాఁడుండఁగాఁ జిన్నవాఁడు రాజయిన దృష్టాంతములు లేవా యందువా? పెద్దవాఁడు దుష్టుఁడో- అంధుఁడో- పతితుఁడో- కుష్ఠరోగియో యయ్యెనేని యప్పుడు చిన్నవాఁడు రాజుగావచ్చును. నీయందట్టిదోషములులేవు. రాజ్యభరమును వహింప నన్నివిధముల సమర్థుఁడవు, కావున నీవే రాజవై హితులను సంతోషపెట్టుము.

కం. కైరవబాంధవుచేతను, శారదనిశవోలె నిన్ను • జనపతిఁగా నీ
ధారిణి పొంది సనాథగ, సారసదళనేత్ర! వెలుఁగు • జనహర్ష దయై. ౨౩౫౨

కైరవబాంధవుచేతను=కలువలకాప్తుఁడగు చంద్రునిచే- శారదనిశ=శరత్కాల రాత్రి- సనాథగ = విధవగాక భర్తగలదై- సారసదళనేత్ర = తామరరేకులవంటి కన్నులు గలవాఁడా- జనహర్షదయై=జనులకు సంతోషము గలిగించునదియై.

### తా త్ప ర్య ము.

శరత్కాలపున్నాటిరాత్రి కువలయ బాంధవుఁడగు చంద్రునిచే లోకులకు సంతోషకరమైనట్లు యీభూమి నిన్ను భర్తగాఁగలదై విధవగాక లోకులకు సంతోషము గలిగించునది యగును.

కం. నీసోదరుఁడన్ శిష్యుఁడ, దాసుఁడ సచివాళితో య • థా యోగ్యగతిన్
నే సాష్టాంగనమస్కృతి,తో సాధువతంస! వేఁడు • దున్ దయఁ గనుమా. ౨౩౫౩

నీసోదరుఁడన్=నీతమ్ముఁడను- నీవు నాకన్నవు- పితృసమా జ్యేష్ఠా యన్నట్లు నీవు తండ్రివంటివాఁడవు- తనబిడ్డలకు నెప్పుడెప్పు డేమేమి కావలయునో వారడుగకున్నను దానే తెలిసికొని వారివారికిఁ గావలసినవి యిచ్చుట తండ్రికివిధి కావున నే నడుగకున్నను నాకోరిక నీవే తెలిసికొని నెఱవేర్చవలసి యుండుట నీకు విధియై

యున్నను నవసరమునుబట్టి నేనే వేఁడుచున్నాను. తమ్ముఁడ ననుచున్నావే దాయ భాగము పంచుకొనవచ్చితివా, రాజ్యమంతయు నీకే యిచ్చివచ్చితినిగదా యిఁక భాగపరిష్కార మేమున్నది యందువేమో? నే నాయభిప్రాయముతో రాలేదు. శిష్యుఁడన్=శిష్యుఁడను గాన గురుపుదర్శనము శిష్యుఁడు చేసికొనవలసినది విధి కావున వచ్చితిని. నీవు నాకెట్లు శిష్యుఁడవందువా? నీ వన్నవగుట నీ జన్మముచేతనే నీవు నాకు గురువు. అదియునుగాక నాకప్పుడప్పుడు మంత్రోపదేశముచేసి తప్పొప్పులు చెప్పినవాఁడవు కావున గురువవు. మంత్రోపదేశము చేసినవాఁడు తండ్రియే కదా. నీకు నేను శిష్యుఁడను గాన నాయందేదేని దోషముండిన నన్ను దండించి యైనఁ జక్కదిద్దవలసినది నీకువిధి. వాస్తవమున నేను నీ కేయపరాధముచేసినవాఁడఁ గాను. కావున నీరాజ్యము నీవు గైకొమ్ము. తండ్రి నీ కిచ్చినరాజ్యము నాకేలయందువా? శిష్యునిసొత్తు స్వార్జితమైనను పిత్రార్జితమైనను గురువుదే. అర్థము ప్రాణము గురువుదే. తండ్రినీకిచ్చినది నాకేల యందువా శాస్త్రవిరుద్ధముగా వర్తించి న్యాయ్యముగా నీసొత్తగుదాని నాకిచ్చునధికారము తండ్రికిలేదు. అధికార విచారముతోఁ బనిలేదు. ఇచ్చినాఁడందువా? ఇచ్చుకోలు పుచ్చుకోలు రెండున్ననే దానముపూర్ణమగును. ఇచ్చుటయందు దాతకున్న స్వాతంత్ర్యము పుచ్చుకొనుటయందుఁ బ్రతిగ్రహీతకుఁ గలదుగదా. పుచ్చుకొనకున్నఁ దండ్రికోరిక నెఱవేర్చినవాఁడవు కావంటివా? పుచ్చుకొంటిననుకో దానివినియోగమందు నేను స్వతంత్రుఁడనే కదా నా యిష్టము వచ్చినట్లు వినియోగించెదను. ఆవిషయమునఁ దండ్రినిర్బంధము లేదు కదా. నేను శిష్యుఁడను గాన శిష్యునియర్థము ప్రాణము గురువుది గాన నీకిచ్చెదను. నేను క్షత్రియుఁడను ఒకరిచ్చుబిచ్చ మెట్లు నాకేలయందువా! నేను నీకు బిచ్చముపెట్టరాలేదు. శిష్యవిత్తము గురువుది కావున నీది నీవు గ్రహింపవచ్చును గదా అందుఁ బ్రతిగ్రహదోషములేదు.

శిష్యమాత్రుఁడనే కాను నేను నీదాసుఁడను. నీవు స్వామిని దాసునిసొత్తు స్వామిదే, దాసునకు సొమ్మేలేదు. కావునఁ దండ్రి నాకిచ్చినదైనను నేనే నీసొత్తైనపుడు నాసొత్తు నీసొత్తేయని వేఱుగఁ జెప్పవలయునా? ఇది నేను నీకు రహస్యముగాఁ జెప్ప నే కాకిగారాలేదు. రాజకర్తలగు మంత్రుల సమూహములతో సేనలతో నీపై యుద్ధమునకు వచ్చినట్లు వచ్చినాను. వీరికైన నాయుధములులేవే, రిక్తహస్తములతో నెట్లు యుద్ధముచేసి నన్నుజయించెదవందువా? మా యందఱమొద్ద నమోఘాస్త్రములు అంజలిముద్రలున్నవి. వానిని నీవు నిరాకరింపలేవు. నిరాదరింపలేవు. వానికి నీవులోపడక తప్పించుకొనలేవు. ఇదిగో ప్రయోగించెదను. నీ పాదములఁ బడి సాష్టాంగ నమస్కారము చేయుచున్నాను. నన్ననుగ్రహింపుము. నన్ననుగ్రహింపక పోయితివా? "నామనసు ప్రతాపయింబనుచున్న దమ్మహా! భావుఁడు చిత్రకూటమునఁ బాదములంబడెఁ జేతులొగ్గెనం! తోవడిఁనేఁడె నన్మరలఁ ద్రోక్కనిపోవ నిరా

కరించితిన్ ॥ అని పశ్చాత్తాప పడఁగలవు. బుద్ధిమంతుఁడు వెనుకఁ బశ్చాత్తాపము కలిగించుకార్యము ముందు చేయరాదు.

సాధువత్సల=సాధువులందు శ్రేష్ఠుఁడా— దీనుల ననుగ్రహించువాఁడు గదా సాధువు. వీఁడునాజ్ఞారి=నాకు ద్రోహముచేసినవాఁడని నన్ను నాప్రార్థనను నిరాకరించిన నిరాకరింపవచ్చునుగాని యేకోపము వీరిపట్ల నీవుచెప్పలేవుగదా. ఇందఱు వేఁడుకొనుచుండ సాధువగు నీవెట్లు వీరిననుగ్రహింపక యుండఁగలవు. వీరిదుఃఖము నీవెట్లు చూచి సహింపఁగలవు. ప్రజలకు సమ్మతుఁడైనవాఁడు రాజుగానుండనర్హుఁడు. అట్టివాఁడవు నీవని ప్రత్యక్షముగా దృశ్యపడుచున్నది. నేను వీరికిసమ్మతుఁడనైనచో వీరేల నిన్ను వేఁడ నింతదూరమువత్తురు? కరుణా శాకుత్స్థుఁడను నీబిరుదు వ్యర్థపడదా? వేఁడుదున్ = యాచించుచున్నాను గాని యాజ్ఞాపింపలేదు. సోదరుఁడు శిష్యుఁడు దాసుఁడునగు నేనెదుట నిలఁబడఁగానే నాకోరిక నెఱవేర్పవలసిన గురువవునీవు. నేను నమస్కరించి యాచించినను నిరాకరించుట తగదు. ఇన్ని బలిష్ఠకారణము లుండుటచే నన్ననుగ్రహింపుము.

## తా త్ప ర్య ము.

అన్నా ! నేను నీకుఁదమ్ముఁడను శిష్యుఁడను దాసుఁడను. అందఱుమంత్రులతో యోగ్యమగురీతిగా నీకు సాష్టాంగనమస్కారము చేయుచున్నాను. నాయందు దయదలఁపుము

కం. పూజితములై శాశ్వతమై, రాజిలి స్థిర్యంబునైన • ప్రజప్రార్థనమున్
భూజనవత్సల! మీఱిన్, యోజనసేయుఁగ నీకు • యోగ్యం బగునే. ౨౩౪౪

పూజితమై = ఇప్పుడు నిన్ను వేఁడవచ్చిన ప్రజ వీథులవెంటఁ బనిపాటలేక తిరుగు పోమరిమూఁకగాదు, నీవును గౌరవింపఁదగినది. ఏలనెదవా? శాశ్వతమై = స్థిరముగ వంశపరంపరగా మననగరమందే వసించియుండునట్టిది— స్థైర్యము = వీరందఱు మనతండ్రికిఁ గావలసినవారై— తండ్రివంటివారు. ఇట్టినీకడకు నీవచ్చియున్న ప్రజల— భూజనవత్సల=భూప్రజలయందుఁ బ్రేమగలవాఁడా— వీరందఱు నీకుఁదమయందెంతో ప్రేమగలదని నీవు తండ్రివంటివాఁడవని తమమేలే కోరువాఁడవని నమ్మియున్నారు. వారియందు నీకుఁగలప్రేమ కనఁబఱుచు సమయమిదే, ఇట్టినీవు ఇట్టి వీరికోరిక నతిక్రమించుట దగినకార్యమా ?

## తా త్ప ర్య ము

వీరందఱు నీవు పురంబుననున్నప్పుడు రాజగౌరవభీతి దూరదూరమున నున్నవారు. ఇప్పుడు బిడ్డలవలె సమీపమునకు వచ్చినవారు. వీరందఱు రాజపూజ్యులు. వీరు వంశపరంపరగా మననగరమందేయుండి మనమేలే తమమేలుగను మనకష్టము తమకష్టముగ నెంచియుండువారు. వీరందఱు మనతండ్రికి ముఖ్యులుగావునఁ దండ్రివంటివారు. నీవు తమయందు నిజమైన ప్రీతిగలవాఁడవని నమ్మియుండువారు. ఇట్టి

నీవు ఇట్టినీప్రార్థన- ఆజ్ఞ గాదు- నతిక్రమింపఁదగదు. సవతికొడుకను నెపమున నా ప్రార్థన నిరాకరించినను నీప్రార్థన నెట్లు నిరాకరింపఁగలవు!

—• శ్రీరాముఁడు భరతునితో నీవు నిర్దోషి వని చెప్పుట. •—

చం. అని కనులందు శోకజల • మల్ల దొనంకఁగఁ బాదపీఠిపైఁ
దనశిరమున్ ఘటించి పడి•తద్దయు నూర్పుచు నున్న తమ్మునిన్
గనుఁగొని లేవ నెత్తి తన•కౌఁగిటఁ గ్రుచ్చి వచించెఁ దమ్ముఁడా!
చనునె భవాదృశుం డిటులు • సల్పఁగ? నేమనువారు పామరుల్? ౨౩౧౫

భవాదృశుండు=నీవంటివాఁడు, పామరుల్=అజ్ఞులు, ఇందు భరతుని శరణాగతి విధము చెప్పఁబడెను. తాత్పర్యము.

ఈ ప్రకారము,భరతుఁడు కన్నులందు శోక బాష్పములు కదలుచుండఁగాఁ బాదపీఠముమీఁదఁబడి మిక్కిలి, యూర్పులు పుచ్చుచున్న తమ్ముని లేవనెత్తి కౌఁగిటఁజేర్చి శ్రీరాముఁడిట్లనియె తమ్ముఁడా! నీవంటివాఁ డీప్రకారము సేయఁ దగునా? నీవే యిట్లుచేసిన జ్ఞానములేనవా రేమందురు.

కం. కులజుండవు సాత్త్వికుఁడవు, నలఘువ్రతరతుఁ డవును మ•హాతేజుఁడ వీ
విల కై యింతటిపాపముఁ, దలపెట్టఁగ నైన నీకుఁ•దర మెట్టలగున్? ౨౩౧౬

భవాదృశుఁడను దానికి వివరణమిందుఁ జెప్పఁబడుచున్నది. కులజుండవు = గొప్పకులమునఁ బుట్టినవాఁడవు. కులము కొలఁది బుద్ధి గావున నీవు గొప్ప బుద్ధిమంతుఁడవు, కావుననే సాత్త్వికుఁడవు- సత్త్వగుణము విశేషించి కలవాఁడవు కావుననే రాజసులు తామసులు చేసినట్లు కామక్రోధలోభములకు వశపడి కార్యములు చేయఁజాలని వాఁడవు. సహజముగ వచ్చిన యీరెండు గుణములేగాక అలఘువ్రతరతుఁడవు = గొప్పవ్రతములందుఁ బరధనమును బరస్త్రీలను నాశింపరాదు. పరులహింసింపరాదు. పితరాజ్ఞ గుర్వాజ్ఞ మీఱరాదు. ఇటువంటివి సముచితముగఁగాక వ్రతములుగ ధరించినవాఁడవు. మహాతేజుఁడవు=ఇట్టివానిని సాధించుటకును వలయునేని పరాక్రముననే దేనినైన సాధింపఁగల తేజస్సంపన్నుఁడవు-ఇట్టినీవు- ఇలకై=ఈమంటికై, ఇంతటిపాపము = లోభకారణమున నన్నునూరు వెడలఁ గొట్టునట్టి తండ్రిని జంపునట్టి పాపములను తలపెట్టఁగనైనన్ = ఆలోచించుటకైన నీకు, తరమెట్టలగున్=ఎట్లు సాధ్యపడును, సాత్త్వికులయందుఁ బరాపకారబుద్ధులు పుట్టనే పుట్టవు, ఆగంతుకముగ వచ్చినా నిలువను నిలువవు- అపకీర్తివచ్చె నను మాటకుఁ బ్రత్యుత్తర మిచ్చుచున్నాఁడు.

తాత్పర్యము.

సహజములైన గొప్పకులమునఁ బుట్టుట, సత్త్వగుణము కలిగియుండుట యను వానిని గలిగి స్వపౌరుషసాధ్యములైన మహావ్రతనిష్ఠ తేజస్సుగల నీవు భూమి నిమిత్తమైన యన్నవిషయమున నింతపాపముచేయ నాలోచింపఁగనైన సాధ్యమా ?

నీవు కావలయునన్నను పాపముచేయఁజాలవు, సత్త్వగుణ మతిశయించినచోట తమోరజోగుణములకు నిలువనీడ లేదు.

ఉ. కావునఁ గొంచెమైన నప•కారము నీయెడ లే దెఱుంగుదున్
నీవును బాల్యహేతువున • నిజజననిం దగ దిట్లు దిట్ట, న
న్నా! విపరీతమా సుమతు • లైనను దా రెవ మెచ్చుదారపు
త్రావళిపట్ల స్వేచ్ఛమెయి•నాదర ముంచుట కైకనందనా! ౨౩౫౭

నేను నీకపకారము చేసితినని తల్లిమూలమున నాకు వచ్చిన నిందను దొలఁగింపుమనిన మాటకుఁ బ్రత్యుత్తరము శ్రీరాముఁడు చెప్పుచున్నాఁడు.

దారపుత్రాదులపట్ల=భార్యాపుత్రుల విషయమున, స్వేచ్ఛమెయిన్ = తమ యిష్టమువచ్చినట్లు ప్రేమాతిశయమున శాస్త్రముల్లంఘించి నైనను, కైకనందనా= నేను గైక కొడుకను దోషముతప్ప నాయందు మరేమి దోషము లేదంటివి. కైకనందనుఁడవగుటదోషముగాదని నాయభిప్రాయము.

కైక దుష్టురాలు. ఆమెదోషమునాకు సంక్రమించెనందువా. కట్టెలగుణము దాని యందలి యగ్నిహోత్రమునకు సంక్రమించెనా? జలములందలి దోషము వాని యందుఁ బ్రతిఫలించిన సూర్యచంద్రులకుఁ గలిగెనా? గులకరాతిలోఁగదా రత్నము పుట్టును? నీయందుఁదల్లి దోషము సంక్రమించెనని నీగుణమెఱింగినవారు నమ్మరు.

తాత్పర్యము.

• కైకనందనా! మీఁదఁజెప్పిన కారణములచే నీయం దేయపరాధము లేదని యిట్లు చేయ నీకు సాధ్యపడదని నే నెఱుఁగుదును. కావునేను నీ విషయమున నప రాధమెంచితినని తలఁపవలదు. నీవు పిల్లతనముచేతఁ దల్లిని దిట్టుచున్నావు. ఆమె నీమేలెంచి చేసెనా నీకీడెంచిచేసెనా నీమీఁద ప్రేమచేఁగదా యిట్లుచేసెను. ప్రేమ తోఁగార్యముచేసిన వారిని దూషింపవచ్చునా? తల్లియగునది చేయరానిపని యేమి చేసెను. లోకములోఁ బెండ్లాము బిడ్డల సుఖము నిమిత్తమై ప్రేమాతిశయముచే నిష్టమువచ్చినట్లు కార్యములు చేయువారులేరా. ఇష్టప్రాప్తి- అనిష్టనివారణము ఇవిరెండు ప్రతిజంతువుకోరునవేకదా. ఇష్టప్రాప్తికై కొడుకవైన నీకు రాజ్యము లభింపఁగోరెను. అనిష్ట పరిహారమునకై నన్నడవులకుఁ బొమ్మనెను. అంతియకాని నా యందుఁ బగగలిగికాదు. అట్లు నా మీఁదద్వేషభావముండిన శ్రీరామునిఁ జంప వలసినదిగాఁ గోరియుండునుగదా. కావునఁ గార్యసాధనమునకై యెంతచేయవల యునో యంత మాత్రమే చేసెనుగాని యంతకుమించి క్రోధైకతానయై యేమియుఁ జేయలేదు. కావున నామెను దూషించుట నీకుఁదగదు.

కం, కొడుకులు భార్యలు శిష్యులుఁ, బుడమిని నేగతిఁ జరింపఁ•బోలు నటంచున్
నొడువుదురో సాధువు లా,వడువున మనతండ్రిపట్ల•వలదే మనకున్. ౨౩౫౮

ఇఁకఁ దండ్రిని గుఱించి చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము.

నీవు సాత్త్వికుఁడవు సాధువవుగదా. లోకములోఁ బురుషులపట్ల వారికొడుకును భార్యలు శిష్యులు చరింపవలయునని సాధువులు చెప్పుదురో యాప్రకారము మన తండ్రి విషయమున మనము వర్తింపవలయునా పనిలేదా? వర్తించుట న్యాయ్యమేకదా.

కం. ధరణీధరణంబున నే,కరణిని నన్నుండో నిలుపఁ • గానల నను నా
కరణిం గృష్ణాజినములు, ధరియించి చరింపు మనఁగ • దండ్రి తగండే? ౨౩౫౯

తాత్పర్యము.

తండ్రికిఁ గొడుకులపట్లఁ బెట్టను గొట్టను నధికారము కలదాలేదా. పెట్టుట కధికారముగల తండ్రి కొట్టుట కధికారిగాఁడా. కడియనినవోరు దెబ్బచి కల్లమనిన నోరు మూయునదా గుజ్జము. తండ్రిచెప్పినది తనకిష్టమైనదిచేసి కష్టమైనది విడుచువాఁడా కొడుకు. కావున రాజ్యభారము వహించి సుఖింపుమని తండ్రి చెప్పినమాట నంగీకరించి కృష్ణాజినములు ధరించి యడవికిఁ బొమ్మనిన నేను బోనంటినేని నేనేమి కొడుకను. ఆయనయేమి తండ్రి నన్నామాత్రము కార్యముఁజేయ నాజ్ఞాపింపఁ దండ్రికధికారములేదా? జీవతో వాక్యకరణాత్ అన్నట్లు తండ్రిచెప్పినమాట వినువాఁడు పుత్రుఁడుగాని యితరుఁడు పుత్రుఁడా?

తే. ధర్మమార్గవిదుం డైన • తండ్రియందు, మనము జను లెన్న గౌరవం • బునిచినట్లు
ధర్మభృచ్ఛ్రేష్ఠ! మనకును • దల్లియందు, గౌరవం బుంప మర్యాద • గాదె చెపుము?
౨౩౬౦

ధర్మమార్గవిదుఁడు=ధర్మవిధము తెలిసినవాఁడు, ఎన్నన్=పొగడునట్లు, ధర్మభృత్+శ్రేష్ఠ=ధర్మమును భరించువారిలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము.

ధర్మమార్గమును దెలిసిన తండ్రియందు జనులు శ్లాఘించునట్లు మన మెట్టి గౌరవముంతుమో తండ్రికంటెఁ బదియంతలు గొప్పదగు తల్లియందు మనము గౌరవముంచుటతగదా? నీవే చెప్పుము.

ఆ. ధర్మశీలురైన • తల్లియుఁ దండ్రియు, రామ! పొమ్ము నీ వ • రణ్యమునకు
ననుచు నాజ్ఞ సేయ • నాయాజ్ఞ మీఱంగ, నాకు నర్హమగునె • న్యాయ్యచరిత?
౨౩౬౧

తాత్పర్యము.

యుక్తమైన నడవడిగలవాఁడా! తల్లియుఁ దండ్రియు నిరువురు మనకుఁ బూజ్యులైనప్పుడు వారిరువురొక వాక్యముగ రామా! నీవరణ్యమునకుఁ బొమ్మని యాజ్ఞాపింపఁగా నేను దిరస్కరించుట న్యాయ్యమా?

తే.నీవు రాజ్యమయోధ్యలో • నేమ్మిఁ దాల్చి,భువనసత్కృతిఁబొందుము•పూజ్యచరిత!
దండకారణ్యవాటి నే • నుండువాఁడ, వల్కలాజినములు దాల్చి•యలుక లేక. ౨౩౬౨

తా త్ప ర్య ము.

రాజ్యభారము నేను మోయలేనంటివి. అట్లైన నీకొక యుపాయము చెప్ప
ను. దానివలన నీకు భారము తగ్గును. తండ్రివాక్యమును మన మిరువురమును
రిపాలించినవారమగుదుము. నీవు రాజ్యమును జనపదములను నగరములను నయో
ధ్యలోనుండి విచారింపుము. అడవులలో నారచీరలు జింకచర్మముధరించి యేభయ
లేక నేనుండి యందుధర్మాధర్మములు విచారించుచుండెదను.

వాలితో శ్రీరామచంద్రమూర్తి చెప్పినదిదియే. చూ. కిష్కింధ-౧౮-౪౦.

లోక మెఱుంగఁగ జనకుం, డీకరణి విభాగపఱిచి • యేగెన్ దివికిన్
నీ కిచ్చినభాగము నేఁ, జేకొన ధర్మంబె నీవ•చెప్పుము భరతా! ౨౩౬౩

తా త్ప ర్య ము.

నీవిభాగము నేను గల్పించినది కాదు. లోకమంతయుఁ దెలియునట్లీవిధముగ
న దాయభాగము పంచి తండ్రిస్వర్గమేగెను. చిన్నవాఁడవైన నీభాగమును
వాఁడనైన నేను దీసికొనుట ధర్మమా? భరతా! నీవే చెప్పుము.

లోకగురుఁడు ధర్మాత్ముఁడు, నీకుఁ బ్రమాణంబ కాదె • నియతి జనకుఁడున్?
ని కతఁ డిచ్చినభాగము నీ కుపభోగింప కుంట•నీతియు నగునే? ౨౩౬౪

తా త్ప ర్య ము.

మనతండ్రి ప్రజలకందఱకు గురువు. ధర్మయుక్తమైన మనస్సుగలవాఁడు.
న్నవాఁడవు కావున సుఖభాగము నీకిచ్చి పెద్దవాఁడను గష్టము సహింపఁగల
ంతెఱిఁగి కష్టభాగము నాకిచ్చెను. నాకిచ్చిన భాగము నేను సంతోషముతో
చితిని. నీకిచ్చినభాగము నీవట్లే గ్రహింపక యనుభవింపక యిట్లు పెనఁగు
నీకుఁ దగునా? ఆయన వాక్యము లోకమున కంతయుఁ బ్రమాణమైనప్పుడు
త్రము కాదా.

 ప్రదభాగం బీ, వనవాసము నాకు దీనిఁ • బదునాల్గేఁడుల్
దీర్చుటె గురుహిత మని, మనమునఁ దలపోయువాఁడ•మానితచరితా! ౨౩౬౫

తా త్ప ర్య ము.

భాగము నీ యిష్టము. నాకుఁ దండ్రి యిచ్చినది వనవాసభాగము. దానిని
 సంవత్సరము లడవియందుండియే ముగింపవలయును. ఇదియే యాయ
గొప్ప హితకార్యమని నాయభిప్రాయము.

కం. నరలోక సత్కృతుఁడు సుర,వరసన్నిభుఁ డైనతండ్రి • పలికిన యదియే
పరమాత్మహితము లోకే,శ్వరభావం బైన నాకు • సంతస మిడునే? ౨౩౬౬
నరలోకసత్కృతుఁడు=భూజనసమూహముచే గౌరవింపఁబడినవాఁడు- సుర
వరసన్నిభుఁడు=ఇంద్రునితో సమానుఁడు- పరమ + ఆత్మహితము = నాకు మిక్కిలి
హితమైనది- లోకేశ్వరభావము=సమస్తలోకములకుఁ బ్రభువగుట - సంతసము =
సంతోషము- ఇడునే=కలిగించునా.

## తా త్ప ర్య ము.

ఈలోకమున నందఱు జనులచేఁ బూజింపఁబడినవాఁడు పరలోకమున నింద్రు
నితో సముఁడై దేవతలచే గౌరవింపఁబడువాఁడు- ఇట్లుభయలోక పూజ్యుఁడైన
తండ్రియేమి చెప్పెనో యదియే నాకు మిగుల శ్రేయస్కరము. దానినివిడిచి సర్వ
ప్రపంచ ప్రభుత్వము లభించినను నాకు సంతోషము గలిగింపలేదు.

—•{ ౧౦౫-వ సర్గము. భరతుండు శ్రీరాముని రాజ్యంబు గ్రహింపఁ బ్రార్థించుట. }•—

కం. ఆనాటిరాత్రి యీగతి, మానవసింహులకు శోక • మయ మయియె చనన్
•భానుం డుదయించిన నది,లో నిష్ఠను జపతపంబు • లుం దీర్చి వెసన్. ౨౩౬౭
ఆనాటిరాత్రి = భారద్వాజాశ్రమముఁవిడిచి రామాశ్రమముఁ జేరిననాటి
రాత్రి-శోకమయమయియె=ఏడ్పుతోనే.

## తా త్ప ర్య ము.

శ్రీరామభరతులు కలిసికొనిన నాటిరాత్రి యీవిధముగ నాపురుషశ్రేష్ఠు
లకు నేడ్పులార్పులతోనే గడచెను. ఉదయముకాఁగా వారు మందాకినీ నదిలో
స్నానముచేసి త్వరగా సంధ్యాది కృత్యంబులు దీర్చికొనిరి.
ఉ. రామునిఁ గొల్చి యుండిరి న•రప్రవరుల్ హితమంత్రియుక్తి, నా
స్తోమమునందుఁ గొంతవడి • చూపఱునం దొకరుండు నేని యే
దేమియుఁ బల్కకుండె, మఱి • జ్యేష్ఠునిఁ గన్గొని కైకపట్టియుం
బ్రేమయు భక్తిగౌరవముఁ • బెంపుఁ గనంబడఁ బల్కె నీగతిన్. ౨౩౬౮
నరప్రవరుల్ = మనుజశ్రేష్ఠులు- లక్ష్మణ భరత శత్రుఘ్నులు - హితమంత్రి
యుక్తిన్=హితులతోను మంత్రులతోను గూడినవారై -స్తోమమునందు=సమూహము
నందు- కొంతవడి=కొంతవఱకు- చూపఱునందు=చూచువారియందు.

## తా త్ప ర్య ము.

భరతాదులు హితులతోను మంత్రులతోను శ్రీరామునిసేవించి ప్రక్క నే
యుండిరి. ఆజనసమూహమందుఁ గొంతకాలమువఱకుఁ జూచువారిలో నొకఁడైన
నేమియుఁ బలుకకయుండెను. అవలఁ గొంతసేపటికి సన్నసుజూచి భరతుఁడు
ప్రేమయు- భక్తి- గౌరవము- పెంపు గానవచ్చునట్లు శ్రీ

ఉ. చెప్పితి బుద్ధిఁ దల్లికిని • జెన్నఁటిరీతిని నాకు దత్త మై
విపుగుభాగ్యయుక్తపృథి•వీస్థలి మీకు నొసంగువాఁడ నై
యిప్పుడిఁ బూని వచ్చితి న•హీనగుణాఢ్య! యకంటకంబు నో
నిప్పుడమిన్ గ్రహించి యవ•నీశ్వర! నన్నుఁ గృతార్థుఁ జేయవే. ౨౩౮

చెన్నఁటిరీతిని=ఇదివరకటివిధమున- దత్తమై = ఈయఁబడినదై-విపుగు=విశాలమైన- భాగ్యయుక్త=ఐశ్వర్యముతోఁగూడిన- పృథివీస్థలి = భూప్రదేశము- అహీనగుణాఢ్య=గొప్పగుణములు సంపదగాఁగలవాఁడా.

తా త్ప ర్య ము.

తల్లిదండ్రులిరువురు కోరినప్రకారము నీ పదవులకు వచ్చితినంటివి. వచ్చిన తండ్రియనుమతి మరల నేనిప్పుడు తేలేను. ఆయనసమ్మతి నా తల్లిబలాత్కారముచే నైనదికాని స్వబుద్ధిపూర్వకమైనది కాదు, బలాత్కారమున నిచ్చినసమ్మతి సమ్మతి కాదని మనువుచెప్పలేదా, కావునను వాస్తవమునను దండ్రి సమ్మతించినవాఁడు కాఁడని నీకే తెలియును. ఈయనర్థకారిణే నాతల్లి. ఇదిగో జీవించి యిచ్చుటకె వచ్చి యున్నది. ఆమెచేసినది సరిగాదని నేనామెకు బుద్ధిచెప్పితిని. ఆమెయు నీవు మరల నయోధ్యకువచ్చుట కంగీకరించినది, రాజ్యము నాకుదత్తమంటివి. అది మోసవిధముగ ననాయ్యమార్గమున నాకులభించినది. అట్టిది నాకేల? ఏవిధముగనో యొక విధముగ నీకు దత్తమైనదందువా? విస్తారమగు నైశ్వర్యముతోఁగూడిన యీభూమి యంతయు నీకునీయఁ బనిపూని వచ్చితిని. కావున నుదారాది గొప్పగుణములు గల నీవు నాయందు దయయుంచి నిష్కంటక రాజ్యమంతయు గ్రహింపుము అట్లైన నేను కృతార్థుఁడ నగుదును.

నేను క్షత్రియుఁడను ప్రతిగ్రహము నాకుఁ గులధర్మము కాదందువా? నేను నీకు దానమీయరాలేదు. నాసొత్తు నీవుతీసికొమ్మని చెప్పరాలేదు, తండ్రి నీకురాజ్యమిచ్చెను, నీభాగము నీ వేలుమని నీవనుటచే నాదైనను నీవు శిష్యుని దాసుని సొత్తు గురువులెస్వామివలెఁ దీసికొమ్మంటిని, వాస్తవమున రాజ్యము నాదికాదు. రాజ్యము నేను నీవారమే. నీది నీవు తీసికొమ్మనుచున్నాను గాని నాది నీవు తీసికొమ్మనలేదు. కావునఁ గులధర్మహాని లేదు

ఆ. వానకాలమునఁ బ్ర•వాహవేగంబునఁ, గట్టఁ దెంచుకొనుచు•నట్టె వచ్చు
వెల్లినాఁపరాని•విధమున నీరాజ్య, మీవు దక్క నితరుఁ • డేల లేఁడు. ౨౩౯

వెల్లి=ప్రవాహము.

తా త్ప ర్య ము.

వానకాలమందుఁ గట్ట త్రెంచికొనివచ్చు ప్రవాహమువలెఁ బ్రజలు నేననాయ్యయముగ రాజనైతినని కోపాతిశయముచే నేను రాజను దామ ప్రజలను మర్యాద విడిచి వర్తింప సిద్ధముగనున్నారు. వారట్లుచేయుట న్యాయ్యమే. ఇట్టి సంకటసమయ

మున నీవుతప్ప వారిని శాంతిపఱిచి మర్యాదాసేతువును రక్షింపఁజాలిన సమర్థుఁడు మఱియొకఁడు లేఁడు.

కం. తురగమువడకను ఖరమును, గరుడునిగ మనంబుభంగిఁ♦గాకము పోలన్
　దర మగునే? యట్టులు నీ,వరమార్గము నెనయ నాకు ♦ వశమే దేవా! ౨౩౭౧

తా త్ప ర్య ము.

నీవు రాజపుత్రుఁడవై క్షత్రియుఁడవై యుండి ప్రజలు మర్యాదదప్పి వర్తించి రేని నీపరువు నీవుకాపాడుకొనలేవా యేందువేమో? గుఱ్ఱమువలె గాడిద నడచుట కును గరుడునివలెఁ గాకి పోవుటకును సాధ్యమా? అట్లులే ప్రజాపాలనమందు నీ యుత్తమ మార్గ మవలంబింప నాకుసాధ్యమా ?

కం. పరులను బోషించుచుఁ ద,ద్భరమున్ వహియించువాని ♦ బ్రదుకే సుఖ మా౯,
　బరునాశ్రయించి తినువుం, భరియించెడి వాని బ్రదుకు వ్యర్థముసుమ్మా. ౨౩౭౨

తా త్ప ర్య ము.

అన్నా ! నీవిచ్చట నొంటరిగానుండి యెవరి కేమిమేలుచేయఁగలవు? సంపా దించినదానితోఁ బరులఁ బోషించుచు వారి యక్కఱ లవసరముల దీర్చుకొనువాని బ్రదుకు బ్రదుకుగాని పరులనాశ్రయించి జీవించుచుఁ దనదేహరక్షాభరమును బరు లపైవైచువాని దేమిబ్రదుకు? గృహస్థాశ్రమముతప్పఁ దక్కినవన్నియుఁ బరాధీనపు బ్రదుకులే. గృహస్థుఁడుగా నుండ నసమర్థుఁడుకదా సన్న్యాసియో వనవాసియో కావలెను. ఇక్కడ నీయింటికి నేయతిథివచ్చును? ఏయభ్యాగతివచ్చును ? వచ్చిన నెందఱువత్తురు? వచ్చినవారి కేమిపెట్టఁగలవు ? కావున గృహస్థధర్మ మవలంబించి ప్రజలఁ బాలింపుము?

　సజీవతి యవస్యైకో బంధుభి శ్చోపభుజ్యతే
　జీవంతోఽపి మృతాస్త్వన్యే, పురుషాః స్వోదరం భరః॥　　　దక్షుఁడు.

బంధువులతోడ నెవఁడు భుజించునో వాఁడు బ్రదికియుండువాఁడు, తనకడుపు మాత్రము నింపుకొనువాఁడు బ్రదికియుండినను జచ్చినవాఁడే.

చం. పురుషుఁడు వితృ నద్ది పెను♦భూరుహమై మఱుగుజ్జవానికిన్
　వరగతి నెక్కరానిగతి ♦ వర్ధిలుచు న్నునుఁబూత పూచియున్
　బరమఫలాన్వితంబు నయి ♦ వాలక యుండినఁ జెట్టుఁజెంచు న
　ప్పురుషున కేమి సంతసము ♦ పుట్టఁగఁ జాలునో యూహ సేయుమా. ౨౩౭౩

వితృన్=గింజనాటఁగా- పెనుభూరుహము = పెద్దచెట్టు- మఱుగుజ్జవానికిన్= మిగులఁబొట్టివానికి- వాలక=ప్రకాశింపక.

తా త్ప ర్య ము.

నాకష్టసుఖవిచారము లటుండనిమ్ము. ఒకఁడు ఫలము భుజించుకోరిక గలిగి భూమిలో నొకవిత్తనము నాఁటెననుకొమ్ము. అది పొట్టివారి కందరానట్లు పెరిఁగి

మహావృక్షమై పూఁతయుఁ బూచినదనుకొమ్ము. ఇఁకఁగాయలుకాచును. అవి పండును తిందమని యాచెట్టుపెట్టినవాఁడు కొండంతయాశతో నెదురుచూచుచుండ నది గొడ్డుపోయి ఫలమనునది లేనిదయ్యె నేని యాచెట్టుపెంచినవాని కేమిసంతోషము కలుగునో నీవే యూహింపుము.

తే. రామ మాకెల్లరకు నీవ ♦ రక్షకుఁడవు, నీదుభృత్యుల మగుమమ్ము ♦ నీవ యేలఁ
బూనవేనియుఁ బైయర్థ ♦ మునకు నుపమ, యిదిమహాభుజ! తక్కఁన ♦ దెలుఁగుమీవ. ౨౩౭౪

అర్థమునకు=విషయమునకు – ఉపమ=సమానము– దృష్టాంతము.

తా త్ప ర్య ము.

రామచంద్రా! నీవు మాకందఱకు రక్షకుఁడవు మేము నీకు భృత్యులము ఇట్టిమమ్ము నీవు కాపాడక పోయినపక్షమున మీఁదఁజెప్పిన విషయమునకు నీవే దృష్టాంత మగుదువు. నిన్ను దశరథుఁడు కనిపెంచి పెద్దచేసినది నీవు ప్రజలరక్షించి తనకు గీర్తి తెచ్చెదవనికదా, అట్టులే నీవు గొప్పవాఁడవైతివి. దశరథుఁడు చెట్టుపెట్టినవాఁడు నీవు మహావృక్షము. ఇతరులకు దుర్రారా మఱుగుజ్జువారు, నీవు పట్టాభిషేక మంగీకరించుట చెట్టుపూయుట; నీవు రాజ్యమేల కుండుట చెట్టుగొడ్డుపోవుట, ఫలహీనమగుట. అట్టిచెట్టునుజూచి చెట్టుపెట్టినవాఁ డేమిసంతోషించును ! ఈచెట్టు గొప్పవృక్షమగుచున్నది, ఫలించును, తిందమని కాచికాచి యుండుచిలుకలు పక్షులు మనుష్యులు నేమిసంతోషింతురు! నీశక్తి నీసామర్థ్యము నీసుగుణసంపత్తి జనులయందుఁ బ్రకాశింపవలెనా యడవిఁగాచిన వెన్నెలవలె నీచెట్లయందు మృగములందుఁ బ్రకాశింపవలెనా ?

తే. రాజ్యసింహాసనస్థ న ♦ రాతిదమను, నిన్నుఁ గాంచెడివారలు ♦ నెమ్మితోడ
రాష్ట్రమునవారు సచివులు ♦ రాజవర్య, నిండుతేజన వెలుఁగుమా ♦ ర్తాండు నట్లు ౨౩౭౫

అరాతిదమనున్=శత్రువుల నణఁచువానిని– నెమ్మితోడన్=సంతోషముతో– మార్తండునట్లు=సూర్యునివలె– మృతంబ్రహ్మాండం జీవయతీతి మార్తండః నశించిన బ్రహ్మాండమును బ్రదికించువాఁడు, సూ.మార్తాండుఁడు– మర్తండుఁడు, మర్తాండుఁడు– మార్తండశబ్దము శకంధ్వాదులలోఁ జేరినది–అథ మర్తండ మర్తాండౌ అనిశబ్దార్ణవము.

తా త్ప ర్య ము.

రాజ్య సింహాసనమునందు శత్రువుల నణఁచు నిన్ను రాష్ట్రమునందలిజనులు మంత్రులు లోనగువా రుదయాద్రి నధిరోహించి చీఁకట్లఁ బాఱఁదోలి లోకము రంజిలఁజేయు సూర్యునివలెనే నిన్నుఁజూచి సంతోషింతురు. ఇప్పుడు రాజులేని కారణమున దేశము శోకాంధకారమున మునిఁగియున్నది.

కం. నిను ననుసరించి వచ్చుచు, మనుజర్షభ! సింధురములు ♦ మదమున గీఁకల్
నినుచును నంతఃపురగత, వనితలు మోదమునఁ జొంగి ♦ పడెదరు తృప్తిన్. ౨౩౭౬

మనుజర్షభ=పురుష శ్రేష్ఠా, సింధురములు=ఏనుఁగులు, గీఁక=ఘీంకారశబ్ద
భవము, నినుచును=నిండించును.

తా త్ప ర్య ము.

నీవయోధ్యకుఁ బ్రయాణమైతివేని సంతోషించువారు నీరాజ్యపాలనా
ర్యము శత్రుసంహారశక్తి తెలిసినపురుషులు మాత్రమే కారు. ఎవఁడు సామ
ముకార్యములు కష్టములు తమకుఁ దప్పవుగదా యటుండియు రాజైనను
ర్చుచుఁ దల్రవేలనై చికొని నడచు నేనుఁగులు నీవెంట సంతోషముతో నిప్పుడు కన్నీరు
లు చేయుచు నడచును. అంతఃపురస్త్రీలు సంతోషముతోఁ ఘీంకార
రణము పశువులకు స్త్రీలకు నీయందుఁగల నైసర్గిక ప్రేమయే బొంగిపడెదరు. దీనికిఁ
స్వభావముగవచ్చిన ప్రేమ). అట్టి సహజ స్నేహభావముగలవారిని (తల్లికి బిడ్డయందు
నీకు న్యాయ్యమా. దుఃఖపఱు

అనవుడు రాముని భరతుఁడు, వినయంబున వేఁడుచున్న • విధముం గని మే
లని శ్లాఘించెను నాగర,జనములు తద్వచనరచన • సంతసపడుచున్. ౨౩౭౭
శ్లాఘించెను = మెచ్చుకొనెను, నాగరజనమును = అయోధ్యానగరమందలి
, తత్=అభరతుని, వచనరచన=మాటలపొందికకు, సంతసపడుచన్ =
పడుచు.

తా త్ప ర్య ము

ఈప్రకారము భరతుఁడు శ్రీరామునితో వినయముతోఁ బ్రార్థించుచున్న
జాది పురజనులందఱు భరతుఁడు న్యాయ్యముగ యుక్తియుక్తముగ భక్తి
తోఁ జెప్పిన మాటల పొందికకుఁ జక్కఁగఁ జెప్పినాఁడని శ్లాఘించిరి.
దీనాలాపంబులఁ, దను నార్తిని వేఁడుచున్న • తమ్మునిఁ గని యిం
యంగ ననునయించుచు, వినియతచిత్తుండు రామ • విభుఁ డిట్లనియెన్. ౨౩౭౮
దీనాలాపంబులన్=శోకముతోఁగూడిన మాటలచే, ఆర్తిని = బాధపడుచు,
ంచు మన్ = సమాధానపఱుచుచు, వినియతచిత్తుండు = జితేంద్రియుఁడు,
పఁబడిన మనస్సుగలవాఁడు భరతునిది యార్తప్రపత్తి యని యేర్పడు

తా త్ప ర్య ము.

కవాక్యములతో బాధపడుచుఁ దన్నుఁ బ్రార్థించు తమ్ముని భరతునిఁ
ంపని చిత్తముగల శ్రీరామచంద్రుఁడు సమాధానవాక్యములు చెప్పి
చు నిట్లనియెను.

శ్రీరాముఁడు భరతునకు దుఃఖోపశాంతివాక్యంబులు చెప్పుట. •—

ఁడ! నరునకు స్వాతంత్ర్యమ్మున్న దె యెన్నఁడైనఁ • దనయిచ్ఛను లో
నఁ గ్రుమ్మర దైవమ్మె,యిమ్మెయి నమ్మెయిని లాగి • యలయించుఁ జుమీ.
౨౩౭౯

## తా త్ప ర్య ము.

తమ్ముఁడ! నావనవాసమునకుఁ గైకయీ దశరథులు కారణమని నీవు మాటలాడువిధము చూడఁగాఁ గార్యనిర్వాహణమందుఁ బురుషుఁడే స్వతంత్రకర్త యని నీవు తలఁచినట్లు తోఁచుచున్నది. ఆయభిప్రాయము సరిగాదు. పురుషుఁడు తన యిష్టప్రకారము లోకమున సంచరించు స్వాతంత్ర్యముగలవాఁడా? కాఁడు. అట్లైన స్వతంత్రుఁడెవఁడు? ఎవనికిఁ బురుషుఁడు పరతంత్రుఁడనెదవా? దైవము పురుషుని నీప్రక్కకు నాప్రక్కకు లాగి బాధించునుజుమీ.

ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని, యంత్రారూఢానిమాయయా
యను భ-గీ-శ్లోకార్థమిచ్చట ననుసంధించునది.

సమస్త భూతముల హృదయ ప్రదేశమందు నీశ్వరుఁడుండి సర్వభూతములను దన సంకల్పశక్తిచేఁ దన కిష్టమువచ్చినట్లు యంత్రమునకు వేసి త్రిప్పినట్లు త్రిప్పుచుండును.

శ్లో.జానామి ధర్మం నచమే ప్రవృత్తిః జానామ్యధర్మం నచమే నివృత్తిః
త్వయాహృషీకేశ హృదిస్థితేన యథా నియుక్తోస్మితథాకరోమి॥ ఉద్యోగ.

* ఇది ధర్మమని తెలియును. చేయుట లేదు. ఇదియధర్మమని తెలియును. మానుట లేదు. ఇంద్రియములకు నియంతవైన భగవంతుఁడా నీవెట్లు నియోగించుచున్నావో యట్లుచేయుచున్నాను. నేను స్వతంత్రించి చేయునది యేదియు లేదు.

కం. ధనములు నిధనాంతంబులు, వినువృద్ధిమదర్థములుఁను * విలయాంతంబుల్
జననము మరణాంతంబగు, నొనరెడిసంయోగములు వి * యోగాంతంబుల్.

ఉత్తరం

పురుషుఁడే స్వతంత్రుఁడేని యెప్పుడును బురుషుఁడు తనశ్రేయస్సుఁగోరువాఁడే గనుకఁ దన కేహాని రాకుండఁ జేసికొనవచ్చునుగదా. లోకమున నట్లుగాన రాదు. ధనములు, నిధనాంతంబులు=నాశమే యంతముగాఁగలవి. వృద్ధిమదర్థములు=వృద్ధిగలవి, పెరిఁగి పెరిఁగి, విలయాంతంబుల్=నాశముగుటయే యంతముగాఁగలవి, పెరుఁగుట విఱుగుటకొఱకే, సంయోగములు=కూడికలు, వియోగాంతంబుల్=వేఱుపాటే యంతముగాఁగలవి.

వస్తుస్వభావము మార్ప నెవ్వనికి సాధ్యముగాదు. కానఁదండ్రి మరణమునకై శోకింపకుము. ఇందు మొదటిరెండు పాదములందును నాలవపాదమందును దృష్టాంతములు చెప్పఁబడెను. మూఁడవపాదమునఁ బ్రకృతాంశము, దశరథు మరణము సూచించును.

తాత్పర్యము.

సంపాదించిన ధనములెంత హెచ్చరికతోఁ గాపాడినను గామముపాలో దొంగలపాలో దొరలపాలో యయియో మఱి యే విధముగనో నాశమగుచున్నవి. పెరిఁగినవన్నియు విఱుగుచున్నవి. బ్రహ్మాదులును దమ పదవులనుండి పడుచున్నవారే. పుట్టినవన్నియుఁ జచ్చుచున్నవి. కూడినవారందఱు వీడిపోవుచున్నారు. ధననష్టి- మరణము వియోగము విలయము నెవఁడైనఁ గోరునా? యత్నించునా? వలయువి యట్లగుచున్నవి. వీనికన్నిటికిఁ బురుష ప్రయత్నము చాలమి కారణము గాదు. దైవమే కారణము.

ఆ. పక్వఫలము పడుట• బడిపోవుటయె తక్క, వేఱుభయము లేని• విధముగాఁగ
ధరణిఁ బుట్టినట్టి• నరునకుఁ జావు దక్క నొండుభయము• గాన రాదు. ౨౩౮౧

తన్నడవికంపినది దైవమేకాని తలిదండ్రులు నీవు కారణముగాదని మొదటఁ జెప్పెను. తండ్రిమరణము కాలకృతము గావున దానికై దుఃఖపడవలదని రెండవ పద్యమునఁ జెప్పెను. ఇఁక నా రెండవ పద్యము నర్థమునే దృష్టాంతముతో వివరించుచున్నాఁడు.

పక్వఫలమ్మునకున్=పండినపండునకు.

తాత్పర్యము

పండినపండెల్లకాల మట్లులేయుండదు. నేలఁబడుట తప్ప దానికి వేఱుగతి లేదు. అట్టులే భూమియందుఁబుట్టిన మనుష్యుఁడెంత కాలము జీవించినను నేనాఁడో యొకనాఁడు చావవలసియేయుండును. దీనికిఁగారణము పురుషకారము చాలమియే యందువా కాదు భగవదాత్మకమైన కాలము కారణము.

కం. బలితపుఁగంబంబులు గల, నిలయము కాలక్రమమున • నెఱిచెడురీతిన్
బొలుపు చెడం బురుషుఁడు ముదుసలితనమునఁ జావు చేత • సమయుం జుమ్మీ.
౨౩౮౨

బలితపు=బలముగల, కంబంబులు=స్తంభములు, నిలయము=ఇల్లు, నెఱి = అందము.

తాత్పర్యము.

ఎంత బలిష్ఠమైన స్తంభములువేసి యిల్లుకట్టినను గాలాంతరమునఁ గ్రమక్రమమున నదియందము చెడి కూలిపోవును. అట్లులే యెంతటి పురుషుఁడైనను గాలక్రమమున ముసలివాఁడై మరణించును. దీనికిఁ బురుషకారము చాలమియే కారణమందువా.

కం. గడచిన రే యంతటితోఁ, గడచనియెం గాని మరలఁ • గ్రమ్మఱునే యె
క్కడఁ జలములఁ గళవళపడు, కడలిఁ గలిసి నిండుయమున• గ్రమ్మఱు నొక్కొ.
౨౩౮౩

కడచిన=దాఁటిపోయిన, రే=రాత్రి, కడచనియెన్ = తుదముట్టెను, కడలి =

సముద్రమును, క్రమ్మఱునో౯్౬ = మరలివచ్చునా, రామాయణమున రెండు మూఁడుచోట్ల యమునకు సముద్రముతో సాక్షాత్సంగమము చెప్పఁబడెను. ఇప్పుడు యమున గంగలోఁ గలియుచున్నది. కాని ప్రత్యేకముగ స్వతంత్రించి సముద్రమునఁ గలియుటలేదు. ఇది వాల్మీకి తెలియకచెప్పెనని యేమూఢుఁడనును! ఒకానొక కాలమున వింధ్యపర్వతమునకుఁ గొంచెము దక్షిణమునఁదూర్పు సముద్రము పడమటి సముద్రము కలిసి కాలువగాఁ బాఱుచుండెననియు ఇప్పుడు బంగాళాఖాత మనునది హిమవత్పర్వతపాదంబు నంటియుండెననియు ననఁగా నిప్పటి బంగాళాదేశము (వంగదేశము) సముద్రములో మునిఁగియుండెననియు భూతత్త్వవేత్తలు (Geologists) వ్రాసిన గ్రంథములవలనఁ దెలియవచ్చెడిని. హిమవత్పర్వతమే సముద్రములో మునిఁగియుండె ననుటకు దృష్టాంతము లుండఁగా మీఁద వివరించినవి వింతలుగావు. వీనినిబట్టిచూడ రామాయణకాలమునకు యమున గంగలోఁ గలియక సముద్రములోనే కలియుచుండెనేమో లేక యట్టికాలము సూచింపఁబడెనేమో యని తోఁచుచున్నది. రామాయణకాలమున సగము వంగదేశము సముద్రమయమై యుండెను. ఈసందేహమును బాండురంగ మాహాత్మ్యమునందలి.

శా. గంగా సంగమ మిచ్ఛగించుని మఱింగావేరి దేవేరిగా
సంగీకార మొనర్చునే యమునతో నానందముం బొందునే
రంగత్తుంగతరంగ హ స్తముల నారత్నాకరేంద్రుండు నీ
యంగంబంటి సుఖించునేని గుణభద్రా తుంగభద్రానదీ.

యను పద్యము బలపఱుచుచున్నది. ఇది సంస్కృత గ్రంథపరివర్తనము గావున మూలము నందల్లేయుండును అది నాకు లభ్యపడినదికాదు. ఈ యూహ వాస్తవమయ్యెనేని రామాయణ మెంతప్రాచీన గ్రంథమో తెలియనగు. అయోధ్య ౧౨౩-౨ వ- ఈయభిప్రాయమునకు విరుద్ధమైయున్నది. దీనికి సమాధానము కొందఱు గంగయే యమున యని చెప్పఁబడెనందురు.

తాత్పర్యము

కడచిపోయిన రాత్రియంతటితోఁ బోవునేకాని మరలి యారాత్రియేరాదు. అట్టులే విశేషజలములుగల లవణార్ణవమందుఁ గలిసిన యమున మరల యమునగా వెనుకకుఁ దిరిగిరాదు. ఆవిధముగాఁ బోయినవాఁడట్టులే మరలిరాఁడు. ఇట్లనుటచేఁ గాలాంతరమున రూపాంతరమున రావచ్చునని భావము. సముద్రమందుఁ గలిసిన యమున యమునగా రాదు గాని యాజలము సూర్యరశ్మిలచే నావిరినై మేఘమై వర్షమై మరలఁ బ్రవాహమునఁ గలియవచ్చునుగదా.

చం. పవలును రేయి పోవుచును ప్రాణులయాయువు నాహరించెడిన్
రవియు నిదాఘువేళ స్వక రంబుల వేఁడిమి నంబుజాలముం

దివియువిధాన, న ట్లగుట • నీరేయి యేఁబ్వ మి ఁబల యొడ్ల కై
తవిలినచింత నేడ్చెదవు • తమ్ముఁడ! యాయువు శాశ్వతం బొకో. ౨౩౭౪

అహరించు=అపహరించు- గ్రుంగు- నిదాఘవేళ=గ్రీష్మసమయమందు- స్వక రంబులన్=తనకిరణములచే- అంబుజాలమున్=నీళ్ళసమూహమును- తివియు=లాగు- పీల్చు- ఒడ్లకున్=ఇతరులకు.

తా త్ప ర్య ము.

ఎండకాలమందు సూర్యుఁడు తనవేఁడికిరణములచే జలమును బీల్చునట్లు రేయి పగలు అనునవి పోవుచు జీవజంతువుల యాయువును దీసికొనిపోవుచున్నవి. కాఁబట్టి యయ్యో నాయువిట్లు వ్యర్థముగాఁ బోవుచున్నదే యని నీకై యేడువుము అంతియేగాని యితరులకేడ్చిన నీకురాఁగల లాభమేమి ? తమ్ముఁడా! ఆయువు శాశ్వతిమా ?

ఆయువు శాశ్వతముగాదు, పోయిన నిమిషము మరలరాదు. కావునఁ బోవు నిమిషము వ్యర్థముగఁబోకుండఁ జూచువాఁడు వివేకి.

సీ. వాసుదేవ శ్లోకవార్త లాలించుచుఁ గాలమే పురుషుండు కడపుచుండు
నతనియాయువుఁదక్క- నన్యులయాయువు నుదయాస్తమయముల నుగ్రకరుఁడు
వంచించికొనిపోవ వాఁ డదియెఱుఁగక జీవింతుఁ బెక్కేండ్లు సిద్ధమనుచు
నంగనా పుత్రగేహారామ విత్తాది సంసార హేతుక సంగసుఖము

గీ. దవిలి వర్తింపఁ గాలంబు తటిమెటింగి, దండధర కింకరులువచ్చి తాడనములు
చేసికొనికొనిపోవఁ బుణ్యంబు సేయనైతిఁ, బాపరతినైతినని బిట్టు పలవరించు. భాగ.

కం. పొడమిన మడియుట సిద్ధము, నడచినయే న్నిలిచియుండి • నన్ వడి ఛీఁగిం
చెడినీయాయువు; జన్మము, గడ తేఱెడిమార్గ మేదొ • కనుఁగొను మనుజా. ౨౩౭౫

అనుజా=తమ్ముఁడా- పొడమినన్=పుట్టినయెడల.

తా త్ప ర్య ము.

పుట్టినవాఁడు చచ్చుటనిజము, నీవు నడచుచుండిన నిలిచియుండిన మటిరె ట్లుండిన నోటికడవలోని నీళ్ళవలె నాయువు తఁయించిపోవుచునేయుండును. కాఁబట్టి యేమిచేసిన నీసంసార సాగరము నావలియొడ్డు చేరుదువో యది యాలోచింపుము.

శ్లో. జాతస్య హిధ్రువో మృత్యు, ర్ధ్రువం జన్మమృతస్యచ
తస్మాదపరిహార్యేర్థే, నత్వం శోచితు మర్హసి. భ-గీ. ౨-౨౭.

అనుశ్లోకము ననుసంధించునది.

కం. పురుషునితోఁ బుట్టును మృతి, పురుషునితోఁ గూడియుండుఁ • బురుషునితోడన్
దిరుగుచు నుండును దవ్వగఁ, బురుషునితో నేగు మరలు • బుద్ధిం గనుమీ.
౨౩౭౬

మృతి=మృత్యువు- దవ్వగన్=దూరముగ.

### తా త్ప ర్య ము

తమ్ముఁడా! మృత్యుదేవత యెక్కడనుండియో వచ్చునని తలంపకుము. పురుషునితోడనే పుట్టును. వాని వంటఁగొనియేయుండును. వానితోడఁ దిరుగుచు వాఁడెచ్చటికిఁబోయిన నచ్చటికిఁబోవుచు నుండును. దూరముగఁ బరలోకమునకుఁ బోయిన నక్కడికిఁగూడవచ్చును. అక్కడనుండి మరలి యీలోకమునకు వచ్చిన వెంటనే వచ్చును. కావున నేక్షణమం దది మనలను వాతవేసికొనునోయని హెచ్చరిక గలిగి పోయినచోటను సుఖముగలుగు మార్గ మాలోచించిచేయుము.

కం. ముడుతలు పడ నొడ లెల్లను, దడఁబడఁ బాదములు వెండి • తల తెల్లపడన్
మిడికెడివేళను నీ వేవడువున నినుఁ గాచికొనఁగ • వలఁతివొ చెప్పుమా ౨౩౮౭

ఒడలు=శరీరము- మిడికెడు=దుఃఖపడెడు-వడువునన్=విధముగా- వలఁతివి=సమర్థుఁడవు.

### తా త్ప ర్య ము.

నీకు దేహము దృఢముగా నారోగ్యవంతుఁడవుగా వయస్సుననుండు సమయమందే నీకుఁ బరలోకచింత లేదయ్యెనేని దేహము ముడుతలుపడి నడచునపుడు కాళ్ళుతడఁబడి తలతెల్లపడి కష్టపడుచుండు సమయమందు నిన్నునీవు రక్షించుకొను విధమేదో తెలియఁజెప్పుము. ఏధర్మము సాధించుటకును దేహము ముఖ్యముగా నుండవలెఁగదా, అది నీస్వాధీనము తప్పినప్పుడు నీవేమిచేయఁగలవు చేయఁదలఁచుకొనినను నిహమునకుఁ గావలసినదే చేయుటకు శక్తియుండదుగదా ఇఁకఁ బరలోకమునకుఁ గావలసినది యపుడు ఏవేమిచేయఁగలవు ? నిన్ను నీవే రక్షించుకొన వేని పరులెవ్వరు నిన్ను రక్షింపఁగలరు. కావున బాల్యమునుండి పరలోకచింతన చేయుచుండవలెను. తనకాళ్ళలో బలముండఁగా నడచుటమాని బలముడిగిన తరువాతఁ దన్నుఁ దీసికొనిపొండని పరుల బతిమాలుట తెలివితక్కువతనముగదా.

కం. ఇదె పుట్టె సూర్యుఁ డంచును, నదె సూర్యుం డస్తమించె • నంచును లోకుల్
ముదమునఁ జూతురు; తమతమ, బ్రదుకులు క్షీణంబు లగుట • పరికింప రయో

పరికింపరు=చూడరు- ఇది పరీక్షా శబ్దభవము. ౨౩౮౮

### తా త్ప ర్య ము.

అదిగో సూర్యుఁడుపుట్టెఁ బనులకు ద్రవ్యార్జనమునకుఁ బోదమనియు సూర్యుఁడస్తమించె సుఖముగ శయనించి కామభోగము లనుభవింపఁ బోదమనియుఁ జూతురే కాని లోకులు అయ్యో సూర్యుఁడుదయించి యస్తమించులోపలఁ బన్నెండు గంటల కాలము పోయెఁగదా మన ముద్ధారించుకొన మనమేమిచేసితిమి! రాత్రికిఁ గావలసినది పగలు మునుపునేఁగావలసినది యౌవనమున, వర్షాకాలమునకుఁ గావలసినది యెండకాలమున సంపాదించి చేర్చి పెట్టుకొన్నట్టు పరలోకమున నా కుపయోగపడునది యీలోకమున నేనేమి సంపాదించితినని మూఢత్వమున నాలోచింపరుగదా.

కం. ఋతు వొకటి పోయి క్రొత్తగ, ఋతు వరుదేరంగ హర్ష • వృద్ధిం గను నీ
క్షితిజనసంఘం బది తన,బ్రతికెడికాలంబుఁ దినుట • పరికింపదుగా. ౨౩౪౯

అరుదేరఁగన్=రాఁగా- హర్ష=సంతోషముయొక్క, క్షితి=భూమియందలి.

తా త్ప ర్య ము.

ఎండలకాలము పోయి వర్షము కురియఁగనే అబ్బా యెండలకు మాఁడిపోవు చుంటిమి చినుకులుపడెను. ఇఁకఁ జల్లగానుండునందుము, అదిపోయి శరదృతువు రాఁగానే వానలవలనఁ గదలుటకు మెదలుటకు లేకయుండెను. ఇఁక నిమ్మదిగా రాత్రులందు వెన్నెలలో సుఖంపవచ్చునందుము. ఇట్టులే యొకఋతువు పోయి వేఱొకఋతువు వచ్చిన సంతోషింతుమేకాని యాయుస్సునందింత పోయెనే మరణ కాలము సమీపించుచున్నదే యని యొకరైన యాలోచింపరుకదా.

ఉ. కట్టెయొఁ గట్టె నేర్పఁ బడి • కంథిని జొచ్చి తటానఁ గూడి యు
న్నట్టుల యుండి పాయుగతి • నాలును బిడ్డలు బంధు లర్థముల్
పట్టునఁ జేరియుం బిదపఁ • బాయుట కాలబలంబుచేతనే
యెట్టును బాసిపోక ధ్రువ • మియ్యది నమ్ముము చింతయేటికిన్. ౨౩౫౦

కంథిని=సముద్రమునందు- పాసిపోక=ఎడఁబాసిపోవుట.

తా త్ప ర్య ము.

*ఒక యేటినీటిలో నొకకట్టె మఱియొకయేటిలో నొకకట్టె కొట్టుకొని వచ్చి సముద్రపునీటిలోఁ బ్రవేశించి రెండును దటాలునఁ గలిసికొని మరల నట్టులే తటాలున నెడఁబాసిపోవువిధముగ భార్యలు బిడ్డలు ధనములు వానియంతట నవియే వచ్చి యొకచోటఁజేరి మరల నెడఁబాసిపోవుటకుఁ గాలబలమే కారణము కాని వేఱొక కారణములేదు. కావున నొకరినొకరు నెడఁబాయక తప్పదు. ఇది నిజము.

ఇక్కడఁ గాలబలమనునది పూర్వకృత కర్మబలమే.

శ్లో॥ యథాకాష్ఠంచ కాష్ఠంచ, సమే యాతాం మహోదధౌ
సమేత్యచవ్యపేయాతాం, తద్వద్భూతసమాగమః. భార,౧౨-౨౭-౩౬.

రామాయణమందలి యీశ్లోకమే భారతమందుఁ గానఁబడు ౪-వ పాదము మాత్రము భిన్నము.

ఉ. ఇచ్చగ జీవయుక్తు లగు•నిష్టజనంబులతోడ నొక్కటన్
మచ్చికఁ గూడి యుంద మన • మానక శక్యము గాక యుండఁగాఁ
జచ్చెడివారి నాఁపుటకు • సారవివేక! వశంబె ప్రాణికిన్
విచ్చఁ దలంపు మేటిసఖు • లేటిసహోదరు, లేటిచుట్టముల్? ౨౩౫౧

ఇచ్చగన్=తమయిష్టప్రకారము- జీవయుక్తులు = ప్రాణములతో నుండువారు- ఇష్టజనంబులు=బంధువులు లోనగు నాప్తులు.

తా త్ప ర్య ము.

బ్రదికియున్న బంధువులు మిత్రులు లోనగువారితోఁ గలిసియుండ మనిన సాధ్యముగాక బలవంతముగాఁ జీలిపోవలసియుండఁగా నిఁకఁ బ్రాణము పోవువారిని నాఁపుటకు నెవరికి శక్యము? కావున నీరెక్కడిమిత్రులు? ఎక్కడియన్నదమ్ములు? ఎక్కడిబంధువులు? ఋణము రాఁబట్టుకొనుటకై వచ్చి ఋణము తీరఁగానే పోవువారు చుట్టాలగుదురా.

శ్లో॥ నాయమత్యంత సంవాసః, లభ్యతే జాతు కేనచిత్
అపి స్వేన శరీరేణ, కిము తాన్యేన కేనచిత్. భార. ౧౨-౨౭-౧౨.

తనకుఁ బ్రియమైన తనదేహమును విడనాడక యుంచుకొందమనిన సాధ్యము కానప్పుడు పరుల దేహములను గుఱించి చెప్పనేల.

కం. త్రోవను నిలిచిన యొకఁ డా, త్రోవన చనుపాంథజనము•తోడన్ నేనున్
మీవెంట వత్తు నను వహిఁ, బోవు దగుఁ బెద్దవారు•పోయినత్రోవన్. ౨౩౯-౨

పాంథజనము=బాటసారులు- వహిన్=విధముగ.

తా త్ప ర్య ము.

దోవలో నిలువఁబడియుండు నొకఁ డెటుపోవుటకుఁ దెలియక యాలోచించుచు నాత్రోవఁబోవు మఱికొందఱు బాటసారులను మీరెందుఁబోయెదరనియడిగి తానుద్దేశించిన గమ్యస్థానము వారి గమ్యస్థాన మొకటేయైనచో మీవెంట నేను వచ్చెదను నన్నుఁదోడుకొని పొండనిచెప్పి వారివెంటఁబోయి గమ్యస్థానము చేరినట్లు మనమును పెద్దవారుపోయినత్రోవఁ బోవనగు.

శ్లో॥ యేనాస్యపితరో యాతా, యేన యాతాపితామహాః
తేన యాయా త్సతాం మార్గం, తేనగచ్ఛ న్నరిష్యతి. మను. ౪-౧౭౮.

తాతలు తండ్రులు పోయిన సన్మార్గమునఁ బోయినవాఁడు చెడఁడు.

దీనివలన వంశసంప్రదాయము కులసంప్రదాయము విడువరాదని యేర్పడుచున్నది. దుష్టసంప్రదాయములు మానవలసినవే. ఇందు మఱియొక విశేషము గలదు. కొందఱు జ్ఞానాన్ముక్తియని జ్ఞానము కలిగినంతమాత్రముననే మోక్షములభించునందురు. జ్ఞానోదయ మైనంతమాత్రముచేతనే దేహముపడదు. కావున యావజ్జీవము తమపూర్వులుగావించుచుండిన విధమున స్వధర్మము నిర్వహించుచుఁ గర్మములు చేయుచుండవలెను. సన్న్యాసినై తినని విహితకర్మములు మానరాదు. విరుద్ధకర్మములు చేయరాదు.

ఏవంజ్ఞాత్వా కృతం కర్మపూర్వైరపి ముముక్షుభిః
కురుకర్మైవ తస్మాత్త్వం, పూర్వైః పూర్వతరం కృతమ్. భ-గీ. ౪-౧౫.

ఇట్లు తెలిసికొని మహాతపశ్శక్తిగల పూర్వులు కర్మములు చేసిరి, నీవును బూర్వుల వలెఁ గర్మమే చేయుము. సర్వకర్మముల మానుమని బోధించువారే యట్టియసాధ్య కార్యము చేయలేరైరి.

కం. కావున నతిక్రమింపం,గా వశపడనట్టితోవ • గమనించిన యా
జీవులకై శోకించిన, నేవిధమున మేలు గలదె • యెఱింగింప నయా. ౨౬౩

తాత్పర్యము.

ఈకారణములచేతఁదప్పించుకొని దాఁటిపోవుటకు సాధ్యపడనిత్రోవఁ బోయినవారినిగూర్చి యేడ్చిన నేమైన మేలున్నదా చెప్పుము.

అంతవంత ఇమే దేహా, నిత్యస్యోక్తాః శరీరిణః
జాతస్యహి ధ్రువో మృత్యు, ర్ధ్రువం జన్మమృతస్య చ
తస్మాదపరిహార్యేఽర్థే, న త్వం శోచితుమర్హసి
అవ్యక్తాదీని భూతాని, వ్యక్తమధ్యాని భారత
అవ్యక్తనిధనాన్యేవ, తత్ర కా పరిదేవనా.

ఈదేహముల కంతముగలదు. ఈదేహము గలవాఁడు నిత్యుఁడు, పుట్టినవాఁడు చచ్చుటనిజము, చచ్చినవాఁడు పుట్టుటనిజము. కావునఁ బరిహరింపరాని దానికై యేడ్చియేమిప్రయోజనము? అవ్యక్తమునుండి యన్నిభూతములు వచ్చుచున్నవి. ఎందుండి వచ్చుచున్నవో తెలియదు, నడుమఁ గానవచ్చును, మరల నవ్యక్తమందుఁ జేరుచున్నవి. ఇట్టిదాని కేడుపేల?

కం. వయసు ప్రవాహము వంటిది, రయమునఁ జనుచుండుఁ గాని • క్రమ్మఱదెపుడున్
నియమింపవలయుఁ దనమది, నయముగ సుఖ మందఁ; బ్రజలు • నవ్యసుఖార్థుల్.

రయమునన్=వడిగా. ౨౬౪

తాత్పర్యము.

ప్రవాహము వేగముగఁ బోవునట్లు వయస్సుపోవును. ప్రవాహమెట్లు వెనుకకురాదో యట్లు వయస్సు వెనుకకురాదు. కావున సుఖముఁ గోరువారు తమ మనస్సును నియమించి నీతిమార్గమందుఁ బ్రవర్తింపఁ జేయవలెను. మనుష్యులు క్రొత్త క్రొత్త సుఖములనుభవింప యోగ్యులే కావున క్షణభంగురమైన నైహిక సుఖమునకంటె శాశ్వతమైన మోక్షసుఖమును గోరవలయును.

సీ. ధర్మాత్ముఁడై యుండి • తతశుభావహమైన,జన్నంబు లన్నియు • జరపినాఁడు
దక్షిణాదులచేత • ధరణీసురాదిక, జనములనెల్లను • దనిపినాఁడు
తనభృత్యవర్గంబు • ధరణీజనంబుల, హితదానములచేత • నేలినాఁడు
చేకొలందిగ నీవి • చేసి యథేష్టంపుభోగంబు లన్నియుఁ • బొందినాఁడు
తే. సాధుకర్మంబు లెన్నియో • చలిపినాఁడు, పెక్కుకాలంబు ధరణి పా•లించినాఁడు
నాకలోకసుఖంబుల • నందినాఁడు తండ్రి కేటికి వగవ నా•తండ్రి! చెపుమ. ౨౬౫

తతశుభావహము=విస్తారముగ మేలుకలిగించునది- జన్నము=యజ్ఞము- ధర ణీసురాదిక = బ్రాహ్మణులు మొదలయిన- తనిపినాఁడు=తృప్తినొందఁ జేసినాఁడు- భృత్యవర్గంబున్=సేవకుల సమూహమును- ధరణీజనంబులన్=భూప్రజలను- ఈవి = దానము.

తాత్పర్యము.

తండ్రీ! మనతండ్రి భూమియందుఁ బుట్టినపురుషుఁడు రాజగువాఁడు స్వర్గ లోక ప్రాప్తికై చేసికొనవలసిన ధర్మములన్నియుఁ జేసెను. ధర్మబుద్ధిచే మిక్కిలి శుభ కరములైన యజ్ఞములన్నియుఁజలిపినాఁడు.ఆయజ్ఞములందు బ్రాహ్మణాదులకు శాస్త్రోక్త దక్షిణల యథావిధి యిచ్చి వారిని సంతోషింపఁ జేసినాఁడు, తన్నాశ్రయించియుండు భృత్యులకు భూప్రజలకు వారివారి యోగ్యతకుఁ దగినట్లు దానములు చేసినాఁడు, చేతికివచ్చిన ట్లుదారబుద్ధితో దానములు చేసి యిష్టమువచ్చిన సుఖంబులన్నియు నను భవించినాఁడు. సత్కార్యము లెన్నియో చేసినాఁడు, దీర్ఘకాలము బ్రదికినాఁడు. ఈ లోకమున నీపుణ్యకర్మములు చేసినఫలముగ స్వర్గలోకసుఖములఁ బొందినాఁడు. ఇట్టి తండ్రినిగుఱించి నీవేల శోకించెదవు?

తే. జీర్ణమానుష దేహంబు • క్షితిని విడిచి, బ్రహ్మలోకవిహారపా•త్రంబు నైన
దివ్య దేహంబుఁ దాలిచి • తేజరిల్లు,జనకునకునేల దుఃఖింప•సాధుశీల. -౩౭-

• జీర్ణమానుషదేహంబు=వార్ధకముచేఁ జివికిపోయిన మనుష్యదేహము- క్షితిని =భూమియందు- బ్రహ్మలోక విహారపాత్రంబు=బ్రహ్మలోకమందు సంచరింపయోగ్య మైన- పృథివీతత్త్వము విశేషించియుండు నీస్థూలదేహము లీభూలోకమునందు మాత్రమే యుపయోగించునుగాని తక్కిన తేజస్సులోనగునవి విశేషించియుండు లోకములందిది పనికిరాదు, దివ్యదేహంబు=దేవతాసంబంధమైన తేజస్సుచేఁ బ్రకా శించు దేహము- సాధుశీల=సాధువర్తనముగలవాఁడా.

తాత్పర్యము.

మనతండ్రి వార్ధకముచే జీర్ణించిన మనుష్యదేహమును నిచ్చటనేవిడిచి యీ లోకమునకంటె నుత్తమమగు బ్రహ్మలోకమందు సంచారముచేయ యోగ్యమైన దేవతల దేహములవలెఁ బ్రకాశించు తేజోమయమైన దేహముఁధరించి సుఖించు చుండఁ దండ్రికై యేలయేడ్చెదవు.

కం. వావిరి యీగతినేమువ,బోవఁడు ప్రాజ్ఞుండు నిన్నుఁ • బోలినశ్రుతిమ
త్కోవిదుఁ డగునే మునుకఁగ, నీవిధి శోకింపఁ గార్య • మే మనుఁ దండ్రీ-౩౮-

ప్రాజ్ఞుండు = బుద్ధిమంతుఁడు- వావిరి = అధికము- శ్రుతిమత్కోవిదుఁడు = వేదార్థజ్ఞానముగల పండితుఁడు- మునుకఁగన్=సంతాపింపఁగ.

నీవలె వేదార్థజ్ఞానము బ్రహ్మజ్ఞానముగల పండితుఁ డీవిధముగ విశేషించి దుఃఖింపఁడు. ఏలయనెదవా? చచ్చినవారికై యెంతయేడ్చినను వారు మరల రాఁబోవునదిలేదు. కావున నేడ్చుటవలన లాభములేదు కావున నేడువకు.

కం. ఎట్టిదశయందుఁగానీ,దిట్టతనముఁగలిగియున్న • ధీమంతుఁడు లోఁ
బుట్టినశోకభరంబునఁ, బుట్టఁగనీఁ డశ్రు బిందు•వులు నయనములన్. ౨౩౯౭

దిట్టతనము = ధైర్యము- ధీమంతుఁడు = ప్రశస్తమైన బుద్ధిగలవాఁడు- శోకభరము = శోకాతిశయము- అశ్రుబిందువులు=కన్నీళ్ళు- నయనములన్ = కన్నుల యందు.

తా త్ప ర్య ము.

ధైర్యముగల బుద్ధిమంతుఁ డెంతటి కష్టదశ ప్రాప్తించినను, నెంత శోకాతిశయ మందును గన్నీరుగార్పఁడుఁ దీనివలన నెంతటి కష్టదశయందును నెంతటి ప్రియ వియోగము గలిగినను ధీరుఁడగు బుద్ధిమంతుఁడు కన్నీరుగార్పరాదు. కన్నీరుగార్చుట మరణించినవారికి శ్రేయస్కరముగాదు.

ఉ కావున స్వస్థచిత్తుఁ డవు • గమ్ము విషాదము మాని యూరికిం
బోవుము రాజ్యభారమును • బూనుము తండ్రి వచించినట్లు నే
నీవనవాస మొత్తుఁ బది•యేఁడులు నాలుగు, తండ్రియాజ్ఞ నే
నేవిఫలంబుసేఁత దగు•నే? యది ధర్మమె నాదుబోఁటికిన్? ౨౩౯౮

స్వస్థచిత్తుఁడవు=కుదుటఁబడిన మనస్సుగలవాఁడవు- విషాదము = దుఃఖము- నాదుబోఁటికిన్ =నావంటివానికి,

తా త్ప ర్య ము.

కాఁబట్టి నీమనస్సు కుదుటఁబడనిమ్ము. వ్యసనము మానుము. ఊరికిఁబోయి రాజ్యభారము వహింపుము. తండ్రిచెప్పినట్లు పదునాలుగు సంవత్సరములు వనవాసము చేసెదను. తండ్రియాజ్ఞను నేనే వ్యర్థము చేయవచ్చునా? నావంటివాని కది ధర్మమా?

కం. ఆతండె మనకుఁ దండ్రియు, నాతండే మనకుఁ జుట్ట • మటుగావున నీ
వాతని సమ్మానించుట, ఖ్యాతికరము నాకు నదియె • యగు సమ్మతమున్. ౨౪౦౦

సమ్మానించుట=గౌరవించుట- ఖ్యాతిదము=కీర్తిగలిగించునది.

తా త్ప ర్య ము.

మనకుఁ దండ్రియు నతఁడె, బంధువు నతఁడె, కావున నీవు మనతండ్రిమాట గౌరవించుట కీర్తికరము, నీవట్లుచేయుట నాకు సమ్మతము. కావునఁ దండ్రిమాట తండ్రితో సమానుఁడనైన నామాట నీవు మీఱ నాలోచింపకుము.

కం. పరలోక మందఁగోరెడు,నరుఁడు విపులదయుఁడు ధర్మ • నైష్ఠికుఁ డైనన్
 బరిపాలితగురువాక్యుఁడు, ధరణిం గావలయుఁ జుమ్మి • ధర్మార్థవిదా. ౨౪౦౧

పరలోకము = స్వర్గలోకసుఖము- విపులదయుఁడు=విస్తార దయగలవాఁడు- ధర్మనైష్ఠికుఁడు=ధర్మమందునిష్ఠగలవాఁడు-అయినప్పటికి- పరిపాలితగురువాక్యుఁడు= తండ్రివాక్యమును రక్షించినవాఁడు- ధర్మార్థవిదా=ధర్మముయొక్క యర్థము తెలిసినవాఁడా.

తా త్ప ర్య ము.

స్వర్గలోకసుఖము గోరెడువాఁడు యెంతవిశేష దయగలవాఁడైనను, ధర్మమం దెంత నిష్ఠగలవాఁడైనను తండ్రిమాటప్రకారము నడచువాఁడుగా నుండవలెను. తండ్రియాజ్ఞ ధిక్కరించి యేధర్మముచేసినను నెంత భూతదయ గలిగినను వ్యర్థమే.

దీనివలన భూతదయకంటె ధర్మనిష్ఠకంటె గురుసేవ శ్రేష్ఠమని సూచన. తల్లి దండ్రులయందు దయలేని కృతఘ్నుఁ డేమాత్రము దయావంతుఁడు గాఁగలఁడు, పితృసేవాధర్మము నుల్లంఘించినవాని ధర్మనిష్ఠ యేమాత్రము.

కం. జనకునిసచ్ఛీలము నీ,మనమునఁ దలపోసి యతని • మాటను నిలుపన్
 గొనకొనుము రాజ్యభారం,బును బూను మికేల వసట • మునుఁగఁగ భరతా.
 ౨౪౦౨

* సచ్ఛీలము=సత్ +శీలము=మంచినడవడి- తలపోసి=ఆలోచించి- వసటన్ = వ్యసనమందు.

తా త్ప ర్య ము.

మనతండ్రి యెటువంటి సాధువర్తనముగలవాఁడో యొకయసత్యమైనఁ జెప్పి నాఁడేమో యాలోచింపుము అటువంటివానికి మనవలన నసత్యదోషము రావచ్చు నా? యనియు నాలోచింపుము. ఇది మనచేతిలోనికార్యము గాని యాయనచేయు నదికాదు. ఇదంతయు నాలోచించి రాజ్యభారము వహింపుము, ఏల యేడ్చెదవు.

వాస్తవ మాలోచింప భరతుఁడు తండ్రిచచ్చెనని శోకింపలేదు. రామచంద్ర మూర్తికిఁ దననిమిత్తమునఁ గష్టదశప్రాప్తించెను, తనకు సేవచేయు నదృష్టము లేక పోయెనని యేడ్చెను. దీనికి శ్రీరామచంద్రమూర్తి తండ్రికై యేకుపకుమని బోధించెను. ప్రశ్నోత్తరములకు సంబంధము కానరాలేదు. అయినను రామచంద్రమూర్తి యభిప్రాయము గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితా యను నీతిని నేర్ప వలయుననియే. గతించిన తండ్రి కేడ్చుటయు బ్రతికియుండు నాకేడ్చుటయు రెండు వ్యర్థములే. కాఁబట్టి నీవేడుపు మాని నీకార్యము నీవుచేసికొన వయోధ్యకుఁ బొమ్మని బోధించుటనై యున్నది. ఆకారణమునఁ బ్రశ్నోత్తరములందు విరోధములేదు. (౨౩౯. ప. చూడుము.)

—•{ ౧౦౯-వ సర్గము. భరతుఁడు శ్రీరామునితోఁ దనదుఃఖమునకుఁ గారణముఁ జెప్పుట. }•—

తే. అనుడు శ్రీరాముఁగనుఁగొని • యనియెభరతుఁ, డనఘనీవంటివరుఁడిల • నరిది సూవె
చెట్ట ని న్నేమి కాఱియ • పెట్టలేదు, మేలు నినుఁ బొంగఁ జేయుంగఁ • జాలదౌర. ౨౪౦౩

అనఘ=దోషరహితుఁడా- మేలునకు సంతోషించుట- కీడునకు దుఃఖించుట రెండును దోషములే, అవి లేనివాఁడని యర్థము. అరిది = అపురూపము- అనఁగా లేడనియర్థము. కాఱియ=వ్యథ.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము శ్రీరామచంద్రమూర్తి బోధింపఁగా భరతుఁ డిట్లనియె. అనఘాత్మకా! యాహా! నీవంటినరుఁడు లోకమున లేఁడుగదా? ఏలయందువా? లోకమున నందఱు మేలురాఁగోరుచుందురు, వచ్చిన సంతోషింతురు. కీడురాఁగూడదని కోరుదురు, వచ్చిన నేడ్తురు. నీవో మేలువచ్చిన సంతోషింపవు, కష్టమువచ్చిన దుఃఖింపవు, నీమనస్సువంటి మనస్సుగలవారు దుర్లభులు.

కం. ఎఱుక గల పెద్దలకు వా, రెఱుఁగనియవి చెప్పు నీవె • యెఱుఁగనియట్టుల్
గుఱుకొని సందియ మడిగెదు,కొఱలే కవ్వారి కెఱుక • గూర్చెడివాంఛన్. ౨౪౦౪

గుఱుకొని=ప్రయత్నపూర్వకముగ- ఎఱుక=జ్ఞానము- వాంఛ=కోరిక.

తా త్ప ర్య ము.

లోకమున జ్ఞానవృద్ధు లనిపించుకొన్నవారికిఁగూడ సందేహములు దీర్పునీవు నీకుఁదెలియనట్లు వారిని ధర్మసందేహములు ప్రశ్నించెదవు. ఏల? నీకుఁదెలియక కాదు. వారియభిప్రాయము పొరపాటని తెలిసికొని మీయభిప్రాయము తప్పని చెప్పుట సాధులక్షణముగాదు. కావునను, వారియభిప్రాయము సవరింపవలసియుండుటను నీవేప్రశ్న వేసి వారు ప్రత్యుత్తరము నొసఁగినపుడు దానికి వికల్పముగా నీ యర్థము చెప్పఁగూడదా? యని వారిచేతనే సరి నీవు చెప్పినదే బాగున్నదని యనిపించెదవు కదా.

చం. కనుఁగొననట్టివస్తువునఁ • గల్గదు కామము, తద్విధంబునం
గనుఁగొనువస్తువం దయినఁ • గల్గదు కామము జ్ఞానికిన్; మృతిం
గనినమనుష్యుమీఁదఁ బగ • గల్గదు, తద్విధి నున్నవారిపై
జనవర! కాన నేనును వి•షాదము గూరను దండ్రికై మదిన్. ౨౪౦౫

తా త్ప ర్య ము.

పామరులకుఁ దాముచూడని వస్తువులపైఁ గోరికపోదు. జ్ఞానులకుఁ గాన వచ్చు పదార్థములమీఁదను గోరికపోదు. చచ్చినవారిపై నెవనికి ద్వేషములేదు.

అట్లులే జ్ఞానికి బ్రదికియుండువారిమీఁదను ద్వేషము లేదు. కాఁబట్టి తండ్రి విషయమై నేను శోకింపను లేదు

సీ. అడలె దేటికి నాఁ బ • రావరజ్ఞుండ వై, దుఃఖపాళికి నింత • తూలిపోఁడు
నీవు నాకై వడి • నెగడితి వమరోప. మా! సత్త్వసంపన్నుఁ • డగుమహాత్మ
సత్యసంగరుఁడవు • సర్వజ్ఞమూర్తివి, సర్వదర్శివి కదుఁ • జతురమతివి
ధృతియుతుండవు భవ • స్థితివిదుండవు నీవ, సహియింప రానట్టి • సంకటముల

ఆ. ననుభవింపఁ దగునె • యని దలపోసిన, మాకు సుఖము గలదె • మాన్యచరిత
నిన్నుఁబోలువాఁడు • నిష్ఠురారణ్యాళి, నడల నెట్లు దుఃఖ • పడక యుండు. ౫౭౦

అడలెదు = వ్యసనపడెదవు- పరావరజ్ఞుఁడు- పర+అవరజ్ఞుఁడు- (1) భూత భవిష్యద్వర్తమానము లెఱిఁగినవాఁడు- (2) ఇదియాత్మవస్తువు- ఇది యాత్మవస్తువు కాదని తెలిసినవాఁడు- (3) వీఁడుజీవుఁడు- వీఁడుపరమాత్మ యని యెఱిఁగినవాఁడు- దుఃఖపాళికిన్=దుఃఖముల సమూహములకు- తూలిపోఁడు=చలింపడు- ఆకైవడిన్ = అవిధముగ- అమరోపమా = దేవతతోసమానుఁడా-సత్త్వసంపన్నుఁడు=సత్త్వగుణమే సంపదగాఁగలవాఁడు- సత్యసంగరుఁడవు=సత్యప్రతిజ్ఞకలవాఁడవు- సర్వజ్ఞమూర్తివి= సర్వము దెలిసినవాఁడవు- సర్వదర్శివి = సర్వము భూత భవిష్య ద్వర్తమానములు చూచువాఁడవు- చతురమతివి=నేర్పుతోఁగూడిన మనస్సుగలవాఁడవు- ధృతియుతుండవు = ధైర్యముతోఁగూడినవాఁడవు- భవస్థితివిదుండవు = జననమరణరూపక సంసారస్థితి తెలిసినవాఁడవు-నిష్ఠురారణ్యాళి=పరుషములయిన యరణ్యములయందు- అడలన్=కష్టింపఁగా- దుఃఖింపఁగా.

తా త్ప ర్య ము.

నీవు దుఃఖించినది తండ్రికై కాకున్న మఱియెవరినిమిత్త మందువా? భూత భవిష్య ద్వర్తమానములుగాని ఆత్మానాత్మ వివేకముగాని జీవపరమాత్మల సంబంధముగాని తెలిసినవాఁడు దుఃఖములు ప్రాప్తించినపుడు మనస్సును జలింపనీఁడు. నీవు భగవత్సమానుఁడవు గావున నీవునట్టివాఁడవే నేను గాదననుగాని సత్త్వగుణసంపన్నుఁడు సత్యనియముఁడు సర్వజ్ఞుఁడు సర్వదర్శి ధీరుఁడు సంసారస్థితిగతులు తెలిసిన చతురమతియగు మహాత్ముఁడవు నీవు నిష్కారణముగ సహింపరాని కష్టములకుఁ బాలుపడనేల? నాకేదియుఁ గష్టముతోఁపలేదని నీవందువు, నిజమే నీవుధీరుఁడవు జ్ఞానివి కావున నీకుఁ గష్టముతోఁపక పోవచ్చును. ఎంతోసుఖ మనుభవింపవలసిన మహానుభావుఁ డడవులలో దుఃఖము ననుభవించుచుండిన మేమెట్లు సహించి చూచుచుండఁగలము? మేమెట్లుసహింపఁగలము? నాపాపబలమున నీకిట్టికష్టము వచ్చెఁగదా యని దుఃఖించుచున్నాను. నీతోడ సీతాలక్ష్మణులు దుఃఖించుచున్నారుగదా.

దీనివలన సాధువులగు మహాత్ములు దుఃఖించుచుండ సజ్జనులు చూచి సహింపఁజాలరనియు వారికష్టమును బాపుటకై యెంతకష్టనష్టములైనఁ బడవలయుననియు నేర్పడుచున్నది.

ఉ. నే నటు లింట లేనియెడ • నీచచరిత్ర మదంబ నాకు నై
తా నిటు లోకగర్హితము • దారుణపాపము నాచరించె, ని
క్కేనియుఁ దల్లి యందనక • యింతలు నింతలు తుండె తుండెముల్
గా వఱకంగఁ జాలుదును • గాని నిబద్ధుఁడ ధర్మరజ్జులన్. ౨౪౦౭

నీచచరిత్ర=నీచపు నడవడికగలది, మదంబ=నాతల్లి, లోకగర్హితము=లోకులచే నిందింపఁబడినది, దారుణపాపము = భయంకరమైన పాపకార్యము, ఆచరించెన్ = చేసెను, ధర్మరజ్జులన్=ధర్మమనెడి త్రాళ్ళచే, నిబద్ధుఁడన్ = బంధింపఁబడినవాఁడను. దీనివలనఁ దల్లి యెంతపాపము చేసినను జంపరాదని యేర్పడుచున్నది.

తా॥ నేనింటలేని సమయమందు నీచపు నడవడికగల నాతల్లి నిన్ను నడవులపాలు సేయుట యనెడి ఘోరపాపమును జేసెను. దానికిఁ దగిన శిక్షగా నిపుడే తల్లి యని కూడఁ దలంపక ముక్కలు ముక్కలు తుంటలు తుంటలుగా నఱకఁగలను గాని స్త్రీలను జంపరాదను ధర్మశాస్త్రవాక్యము నన్నుఁ గట్టివైచి యట్టులు చేయనీయక యున్నది. నేనట్లుచేసిన నాయందు దోషమున్నదో లేదో లోక మెఱుంగఁగలదు కాని చేయఁజాలక యున్నాను. ఏలయందువా?

• దీనివలనఁ బాపాత్మురాలగు తల్లిని దండింపవచ్చునుగాని చంపరాదు. తల్లి యను గౌరవ ముంచరాదు, అనునీతి గ్రహింపనగు.

కం. పుట్టితి శుద్ధాన్వయమునఁ, బుట్టినయాజికిని ధర్మ•పుం డెవుల నే
నెట్టన నేర్చితిఁ గని కని, యెట్టులు గర్హ్యం బధర్మ • మే నొనరింతున్. ౨౪౦౮

శుద్ధాన్వయమునన్=నిర్మలమైన వంశమందు, అజికిని=అజకుమారుఁడైన దశరథునకు, నెట్టన=చక్కఁగా, గర్హ్యంబు=నింద్యము, అధర్మము=ధర్మవిరుద్ధము.

తా త్ప ర్య ము.

పాపరహితమైన వంశమునఁ బుట్టిన దశరథునకు నేనుగొడుకనై పుట్టిధర్మమిది యధర్మమిది యని చక్కఁగా నేర్చి యెట్లుక్రోధమునకు వశపడి లోకనిందితమైన ధర్మవిరుద్ధకార్యమును జేయుదును? తల్లి నెట్లు చంపుదును? జ్యేష్ఠుఁడవైన నీరాజ్యము నే నెట్లు హరింతును?

దీనివలన వంశమునకు నపకీర్తివచ్చు నధర్మకార్యము చేయరాదని సూచన.

చం. ఘనుఁడు గురుండు వృద్ధుఁడును • గార్యవిదుండును జచ్చెఁ గాన నా
జనకుఁడు నిందుగోష్ఠిఁ బరు•షంబులు పల్కఁగరాదు గాక యే
మనుజుఁడు పూను నొక్క యొక•మానిని ప్రీతికి నర్థధర్మనా
శన మగునట్టికూరకలు•షం బొనరింపఁగ ధర్మవేది యై. ౨౪౦౯

ఘనుఁడు=గొప్పవాఁడు, గురుఁడు=తండ్రి, వృద్ధుఁడు=ముసలివాఁడు, కార్యవిదుఁడు=చేయఁదగినదేదియో తెలిసినవాఁడు, నిండుగోష్ఠి=జనసమ్మర్దముగల యీ సభయందు, పరుషంబులు=కఠినవాక్కులు, అర్థధర్మనాశనము=అర్థముధర్మము చెఱుచునది, అనఁగాఁ గేవలకామము, క్రూరకలుషము = నిర్దయమైన పాపకార్యము, ధర్మవేది=ధర్మముఁ దెలిసినవాఁడు.

తా త్ప ర్య ము.

కైకయాఁదుండి. కావునఁ గామాసక్తమై తెలివిమాలి పాపము చేసెననిన గుణములచే గొప్పవాఁడు గురుఁడు ముసలివాఁడగుటచే నెంతయో లోకానుభవము శాస్త్రానుభవము గలవాఁడు. ఇదిచేయఁదగినది ఇదిచేయరానిదని ధర్మము తెలిసినవాఁడు పురుషుఁడునగు తండ్రిచేసినకార్యమిట్టిది. ఆయన మరణించుటచేతను ఇది నిండుసభగావునను ఆయనను నిందింపరాదుగాని మనుష్యుఁడెవఁ డొకయాఁడుదానిని సంతోషింపఁ జేయవలయునని ధర్మము, యర్థము నాశముచేయు క్రూరపాపకార్యము కేవలకామమునాశ్రయించి చేయును? పామరుఁడుగూడఁ జేయని యిట్టి పాపము నటువంటివాఁడుచేసిన నేమనుకొనవలయును?

దీనివలనఁ బరోక్షమందు నెవరిని దూషింపరాదనియు, గురువులయందలి దోషములను సభలోఁ జెప్పరాదనియు నేర్పడుచున్నది. అట్లైననేల తండ్రిని భరతుఁ డిట్లాడె ననిన శత్రోరపి గుణాగ్రాహ్యా, దోషావాచ్యాగురోరపి. భా. ౪-౫౧-౫౫.

. శత్రువులందైనను గుణములుండిన గ్రహింపవలయును గురువునందు దోషములున్నఁ జెప్పవలయును. అనున్యాయముచే భరతుఁడుచెప్పినది తప్పుగాదు. నిష్కారణముగ నిష్ప్రయోజనముగ నిందింపరాదు. గురువుయొక్క దుశ్చేష్టచేఁ గలిగిన కీడు తొలఁగించుటకుఁ జెప్పవచ్చును. అటుచెప్పకున్న నతఁడుచేసినది యంగీకరించినట్లగును.

ఉ. కూడు వినాశకాలమున • కున్ విపరీతపుబుద్ధి యంచు ని
ట్లాడెదు లోకమానుడి య • థార్థముఁ జేసె నృపాలుఁ డిప్డు దా
నోడక క్రోధమోహముల • నొప్పనికార్యముఁ జేసి, దాని కీ
డీడుగ సాధువృత్తిఁ జరి • యించి మరల్పుము తత్కృతాఘమున్. ౨౪౧౦

వినాశకాలమునకున్ = చెడిపోవుకాలమునకు, నుడి=మాట, ఓడక = భయపడక, జంకక, ఒప్పనికార్యము = లోకము శాస్త్ర మంగీకరింపనికార్యము, అకార్యము, ఈడుగన్ = సమానముగ, తత్కృతాఘమున్ = ఆయనచేఁ జేయఁబడిన పాపమును, క్రోధమోహములకున్ = నీవు రాముని నడవికిఁ బంపకపోయితివా విషముద్రావి యిచ్చటనే చచ్చెదనని కైకక్రోధము, అట్టి క్రోధముగలదానియందు మోహము, (2) కైకయందుమోహము ఆమెకు విరోధినగు కౌసల్యయందుఁ గ్రోధమనియైనఁ జెప్పవచ్చును.

## తా త్ప ర్య ము.

ఒప్పోతప్పో తండ్రిచేసినాఁడు. చనిపోయినాఁడు. ఇప్పుడేమియనుకొని యేమి ప్రయోజనము? ఆయనచెప్పినట్లు మనముచేయవలసినదే మనకువిధి యనెదవా? అట్లుగాదు. "వినాశకాలే విపరీతబుద్ధి" యని లోకము చెప్పుమాటను దండ్రి క్రోధ మోహములచేఁ జేయరానిపనిచేసి యథార్థపఱిచెను. క్రోధమోహములచేఁ జేయ రానిపనిచేసి పాపమార్జించెను. నీతండ్రి పాపముచే నరకబాధపడుట నీవు సహింప వచ్చునా? కూడదు. కావునఁ బాపముపోవునట్లు నీవు సాధువృత్తిఁ జరియించి యా యన చేసిన యసత్కార్యమును నీవు సత్కార్యముగా మార్పుము. అప్పుడాయనకు బాధ తొలఁగును.

చం. జనకుఁడు కిల్బిషం బొకఁడు • సల్పినయేనియు దానిపాపమున్
 జనకునిఁ బొందకుండఁ గృతి • సల్పినపుత్త్రుఁడె పుత్త్రుఁడౌఁ, జుమీ
 జనకుఁడు పాపముం బొరయఁ జల్పినవాఁడును బుత్త్రుఁ డౌనొకో?
 జనకునిఁ గావుమీ యతఁడు • సల్పినదానిని విస్మరింపుమీ. ౨౩౧౧

దానినే వివరించి చెప్పుచున్నాఁడు.

కిల్బిషంబు=పాపము, విస్మరింపుమీ=మఱచిపొమ్ము.

## తా త్ప ర్య ము.

తండ్రి పాపముచేసెనేని యాపాప మతని నంటకుండఁ జేయు పుత్త్రుఁడే పుత్త్రుఁడుగాని తండ్రికిఁ బాపమువచ్చునట్లు చేయువాఁడా పుత్త్రుఁడు? తండ్రికి నరక బాధతప్పించువాఁడుకదా పుత్త్రుఁడు. అట్లుండఁ దండ్రికి నరకబాధ కలుగునట్లు చేయువాఁడు పుత్త్రుఁడెట్లగును? కాఁబట్టి నీవు తండ్రిని బాపబాధపాలు గాకుండ రక్షింపుము. ఆయన యీపాపకార్యము చేసెను. గావున నరకబాధ యనుభవింప నీలే యనకుము. ఆయన చేసినది మఱచిపొమ్ము. ఆయనను రక్షింపుము

దీనివలన మనకొకఁ డపకారము చేసినను దానని మనస్సునఁ బెట్టక మనము వాని కుపకారమే చేయవలయునని యేర్పడుచున్నది. ఉపకారికి నుపకారము చేయుట గొప్పగాదు. అది కర్తవ్యవిధి. అపకారికినుపకారము చేయుటే గొప్ప అందుఁ దండ్రివిషయ మేమిచెప్పవలె– "సపద్యనేన కించిదకృత్రయాకృతం భవతి స పితస్మా న్పుత్రో ముంచతి తస్మాత్పుత్రో నామ." బృహదా॥ తండ్రిచేసిన పాపమునుండి యతని ముక్తునిఁ జేయువాఁడే పుత్త్రుఁడనఁబడును.

ఉ. ఎక్కడి క్షత్త్రధర్మ మిది • యెక్కడి ఘోరమహావనస్థలం
 బెక్కడిరాజ్యపాలన మి•కేటి జటాభరధారణంబు నీ
 కక్కట! యిట్టిచేఁత దగ•వా! ననుఁ గైకను దండ్రి మిత్త్రులన్
 దక్కినపౌరబంధుజన•తం గృప నేలఁగదన్న మ్రొక్కెదన్. ౨౩౧౨

క్షత్రధర్మము=క్షత్రియులధర్మము, ఘోరమహావనీస్థలంబు = భయంకరమైన గొప్ప యడవిప్రదేశము, జటాభరధారణంబు=జడలుధరించుట, చేత=కార్యము, బంధుజనతన్=బంధుజనుల సమూహమును, కదన్న=ప్రార్థనంబునం దన్ప్రీత్యయాంత క్రియలబీఁదఁ గద కదవు పూర్వకంబు లన్నాదులను ప్రయుక్తంబులగు ప్రౌ. వ్యా. కద యనునది ప్రార్థనమును దెలుపును.

తా త్ప ర్య ము.

అన్నా! నీవా క్షత్రియుఁడవు. నీకు శాస్త్రవిహితమయినది క్షత్రధర్మము. నగరములందుండి నిర్వహింపవలసినకార్యము. నీవుందునది ఘోరారణ్యమందు. నీకుచితచిహ్నము కిరీటధారణము. నీవుధరించినది జటాభారము. ఇట్టి విపరీతచేష్ట తగునా? కావున నాయందు దయయుంచి క్షత్రియోచితవేషము ధరించి క్షత్రియోచితకార్యము చేయుము. నన్నుఁ గైకను దంఢ్రిని మిత్రులను దక్కిన బంధువులను పౌరులను దయతో రక్షింపుము. నీకు నమస్కరించెదను.

దీనివలన నెవనికేది స్వధర్మమో దానియందుండి కులధర్మము పాలించుట శ్రేష్ఠమని యేర్పడుచున్నది.

—♦ భరతుఁడు శ్రీరామునితో వనవాసం బతని కర్హధర్మంబు గాదనుట. ♦—

ఆ. ప్రాజ్ఞలోకవర్య ♦ ప్రజలఁ బాలింపఁగ, దేన శక్య మగునొ ♦ మానవేంద్ర
పటలి కట్టిరాజ్య♦పట్టాభిషేకంబు, ప్రథమధర్మ మనిరి ♦ ప్రాజ్ఞ జనులు. ౨౮౧౩

•ప్రాజ్ఞలోకవర్య=బుద్ధిమంతులయందు శ్రేష్ఠుఁడా. పటలికిన్ = సమూహమునకు, ప్రథమధర్మము=మొదటిధర్మము.

తా త్ప ర్య ము.

క్షత్రియునకు వానప్రస్థాశ్రమచర్య వేషము శాస్త్రవిరుద్ధము కాదుగదా యందువేమో? క్షత్రియులకుఁ బ్రథమధర్మము ప్రజాపరిపాలనము; ప్రజాపాలనము చేయువాఁడు పట్టాభిషేకము చేసికొని సింహాసనమందుండుట విధి. ఇట్లని ప్రాజ్ఞులు చెప్పుదురు; నీవు వారియందు శ్రేష్ఠుఁడవు. ఇది నేను నీకుఁ జెప్పవలయునా! క్షత్రియస్య విశేషేణ ప్రజానాం పరిపాలనమ్। క్షత్రియునకుఁ బ్రజాపరిపాలనము ముఖ్య ధర్మము.

బ్రాహ్మం ప్రాప్తేన సంస్కారం, క్షత్రియేణ యథావిధి
సర్వస్యాస్య యథాన్యాయం, కర్తవ్యం పరిరక్షణమ్॥ మను. ౭-౨.

శాస్త్రముచొప్పున నుపనయన సంస్కారము పొందిన క్షత్రియుఁడు తనదేశమందలి జనుల రక్షింపవలెను.

సీ. ఏనుంగు పంజలో నెల్లసత్త్వంబుల యంజలు నడఁగినయట్లపోలె। రాజితక్షత్ర
ధర్మమునకు లోనయి సర్వధర్మంబులుఁ జనుమఖములు। వేదంబులును శుభవృత్తం
బులును దండనీతి మాసినఁ జెడు భూతలంబు। సంస్కారరహితమై చాలహీనతఁ

బొందు నన్నిలనఁ బ్రజకుఁ జేటావహిల్లు। రాజులరసిన నెమ్మది బ్రదుకుఁగావ। రాజు సర్వోత్తముఁడు ధర్మరాజయందు। రాజధర్మంబ యెక్కుడు రాజనంగ। ధర్మదేవత యవవేత ధర్మతనయ॥ భార-శాంతి. 2-238.

క్షత్రియాణా మయంధర్మో, యత్ప్రజా పరిపాలనమ్
వధశ్చ ధర్మయుద్ధేన, స్వరాజ్య పరిపంథినామ్. వి. పు. ౭-౬-3.

క్షత్రియులకుఁ బ్రజాపాలనము తనరాజ్యమునకు విరోధులగువారిని ధర్మ యుద్ధమునఁ జంపుట ధర్మము.

అభిషిక్తస్య రాజ్ఞః ప్రజాపాలనం పరమోధర్మః॥ అపస్తంబులు.

పట్టాభిషిక్తుఁడైన రాజునకుఁ బ్రజాపాలనము పరమధర్మము.

సీ. ప్రత్యక్ష మగుప్రజా♦పాలనధర్మంబుఁ, బోకార్చి యిగులశం♦కాకులంబు
గాలాంతరఫలంబు ♦ కలితలక్షణహీన, మవినిశ్చితం బగు♦నట్టిధర్మ
మేక్షత్రియుఁడు సల్పు ♦ నీవు కష్టోద్భవ,ధర్మంబుఁ జలుపంగఁ ♦ దలఁచె దేని
నాలుగుజాతుల♦పాలనసేఁత క్లేశాత్మక మగుట న♦య్యాది చరింపు
తే. మాశ్రమచతుష్కమునగృహ♦స్థాశ్రమంబు, శ్రేష్ఠమగు ననికాదొకో♦శిష్టమతము
ధర్మతత్పర నీయట్టి♦ధార్మికుండు,దాని విడనాడఁ జూడంగ ధర్మమగునె? ౨౧౨౨

ప్రత్యక్షము = అందఱకు స్పష్టముగ నింద్రియగోచరమగునది, ప్రజాపాలన ధర్మంబు=ప్రజలను రక్షించుటయను ధర్మము, పోకార్చి=వదలిపెట్టి, శంకాకులంబు =ఫలవిషయమున సందేహముతో వ్యాకులమైనది, కాలాంతరఫలంబు = మీఁద నెపుడో మరణించినతరువాత ఫలమునొసఁగునది, కలితలక్షణహీనము = నిశ్చయమైన లక్షణములేనిది, అవినిశ్చితంబు = క్షత్రియుఁడు మొట్టమొదటఁ దాపసధర్మ మను ష్ఠింపవలయునని యేప్రమాణముచేతను నిశ్చయింపఁబడనిది, అట్టిధర్మము = అట్టి తాపసధర్మము, ఏక్షత్రియుఁడు సలుపున్ = ఏక్షత్రియుఁడును సేయఁడనిభావము, కష్టోద్భవధర్మంబు = శ్రమమువలనఁ గలిగెడిధర్మము, క్లేశాత్మకము = కష్టముతోఁ గూడినది, ఆశ్రమచతుష్కము = బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్న్యాసము అను నాలుగాశ్రమములు, శిష్టమతము = పెద్దలగు నార్యులయభి ప్రాయము, ధర్మతత్పర=ధర్మమునందే విశేషాసక్తిగలవాఁడా.

తా త్ప ర్య ము.

అన్నా! నీవుండఁదలఁచిన తాపసధర్మము ఫలముప్రత్యక్షముగాదు. దానిఫల మిప్పుడు కనఁబడునదికాదు. ఇప్పుడుగాకున్న నెప్పటికైనఁ గలుగనీ తొందరయేమం దువా? ఎప్పటికైనఁ బూర్ణఫలము కలుగునో కలుగదో. అదిసందేహమే. ఏలనఁ? ఎక్కడ నెప్పుడు నేవిధమున కర్మలోపము జరుగునో దానివలనఁ బుణ్యలోకవాసము భంగమగునేమో యనుసందేహముతోఁ గూడియుండునది, తాపసధర్మమున కొక

నిశ్చయలక్షణ మున్నదా యనిన నదియులేదు. అది క్రియయా? శక్తియా? అపూర్వమా? స్వరూప నిశ్చయములేనిది. అదియునుగాక క్షత్రియునకుఁ బ్రథమమందే తాపసచర్య యేశాస్త్రము విధింపలేదు. ఇటువంటి తాపసధర్మమును క్షత్రియుఁ డెవఁడు సలుపఁబూనును? రాజధర్మమో రక్షారూపముగను దండరూపముగను భోగరూపముగను గనులకుఁ గానవచ్చును. కావున ఫలముగలదో లేదోయను సందియములేదు. రాజు ప్రజాపాలనమే చేయవలయునని శాస్త్రము నిశ్చయించు చున్నది. ఇట్టిదానిని బూనుటయందు క్షత్రియుఁ డెవఁడు సందేహించును? రాజ ధర్మము సుఖభోగములతోఁ గూడినది. కష్టించి ధర్మము చేయవలయు నందువా? ప్రజాపాలనక్లేశము సుకరమైనదికాదు; తాపసధర్మమునకంటెఁ గష్టమైనది. ఇందు నీయొకని యోగక్షేమవిచారమే; రాజ్యపాలనమందుఁ గోట్లకొలఁది జనుల యోగ క్షేమములు విచారింపవలయును. కావున నక్లైన దానిని వరింపు. ఇప్పుడు నీవు వానప్రస్థుఁడవై బ్రహ్మచర్య మవలంబించితివి ఇవిరెండును. గృహస్థధర్మమునకంటె శ్రేష్ఠములుగావు. నాలుగాశ్రమములలో గృహస్థాశ్రమమే శ్రేష్ఠమైనదనికదా పెద్దలయభిప్రాయము. సంసారమును నిర్వహింపలేని దుర్బలుఁడుగదా సంసారము వదలవలెను. కాఁబట్టి ధర్మమం దాసక్తిగలనీవు అట్టిధర్మమును వదలి యిట్టులుండుట ధర్మముగాదు.

అన్నియాశ్రమములలో గృహస్థాశ్రమమే శ్రేష్ఠమైన దనుటకుఁ బ్రమాణములు.

శ్లో॥ యథానదీ నదాస్సర్వే, సాగరేయాంతి సంస్థితమ్
ఏవ మాశ్రమిణ స్సర్వే, గృహస్థేయాంతి సంస్థితమ్. భార. ౧౨-౨౯౧-౩౯.

నదీ నదములన్నియు సముద్రముచేరి యెట్లు నిలుకడగలవగునో యట్లే యన్ని యాశ్రమములవారు గృహస్థునియందు నిలుకడగలవారు.

శ్లో॥ యథామాతర మాశ్రిత్య, సర్వేజీవంతి జంతవః
ఏవం గార్హస్థ్య మాశ్రిత్య, వర్తంతి ఇతరాశ్రమాః. భార. ౧౨-౨౯౮-౮.

జంతువులన్నియుఁ దల్లి నాశ్రయించుకొని బ్రదుకునట్లు గృహస్థధర్మమునాశ్రయించి తక్కిన యన్నియాశ్రమములు వర్తించును.

శ్లో॥ సర్వేషా మేవచై తేషాం, వేదశ్రుతి విధానతః గృహస్థ ఉచ్యతేశ్రేష్ఠ స్సత్రీ నేతాన్ బిభర్తిహి॥ వేద శ్రుతివలన నన్ని యాశ్రమములలో గృహస్థాశ్రమమే శ్రేష్ఠము. గృహస్థుఁడే తక్కినమూఁటిని భరించువాఁడు.

శ్లో॥ దైవైశ్చైవ మనుష్యైశ్చ, తిర్యగ్భిశ్చోప జీవతే
గృహస్థః ప్రత్యహం యస్మాత్తస్మా చ్ఛ్రేయాన్ గృహాశ్రమీ.

శ్లో॥ సర్వేషా మాశ్రమాణాంతు, గృహస్థో యోనిరుచ్యతే
సీదమానే నతేనేహ, సీదం త్యన్యేపి క్షేత్రయః.

మూలప్రాణో భవేత్స్కంధః, స్కంధాచ్ఛాఖాసపల్లవాః
మూలనైవ వినష్టేన, సర్వమే తద్వినశ్యతి
తస్మాత్సర్వ ప్రయత్నేన, రక్షణీయో గృహాశ్రమీ
రాజ్ఞాచాన్యైః త్రిభిః పూజ్యో రక్షణీయశ్చ సర్వదా॥

దేవతలు మనుష్యులు పశ్వాదులు గృహస్థునివలననే జీవనము కలవగు చున్నవి. నాలుగాశ్రమములకు జన్మస్థానము గృహస్థాశ్రమమే; గృహస్థుచెడినా తక్కిన మూఁడాశ్రమములవారు చెడినవారే; నాలుగాశ్రమములకు మూలప్రాణము గార్హస్థ్యము. అదియేస్కంధము, దానివలనఁ గొమ్మలు, కొమ్మలవలనఁ జిగుళ్ళు, స్కంధముచెడెనా కొమ్మలు లేవు, చిగుళ్ళులేవు. కావున రాజు తక్కిన మూఁడువర్ణములవారు గృహస్థుని రక్షింపవలయును.

సర్వేషు వేదేషు ధర్మశాస్త్రేతిహాస పురాణేషు గృహస్థా ఏవఅగ్నిహోత్రిణః ప్రాచుర్యేణ విధీయంతే, స్తూయంతేచ తతోగార్హస్థ్యస్యచ ప్రత్యక్షవిధానాత్ స ఏవైక ఆశ్రమః। ఇతరేతు తత్రాశక్తానాం విధీయంత ఇతిబహవ ఆచార్యామన్యంతే.

నైద్యనాథీయము.

సర్వవేదములందు ధర్మశాస్త్రములందు నితిహాస పురాణములందు గృహస్థునికే యగ్నిహోత్రము కలదని ప్రచురముగా విధింపఁబడినది, మఱి పొగడఁబడినది. కాఁబట్టి గార్హస్థ్యమొక్కటే యాశ్రమము. దానిని నిర్వహింపఁజాలని దుర్బలుల కితరాశ్రమములు చెప్పఁబడినవి. అని యనేకాచార్యు లభిప్రాయపడి యున్నారు.

తేషాం గృహస్థో యోనిరప్రజననత్వాద తరేషామ్. గౌతముఁడు.
యస్మాత్త్రయో ప్యాశ్రమిణో, జ్ఞానేనాన్నేన చాన్వహమ్
గృహస్థై రేవధార్యంతే, తస్మా జ్జ్యేష్ఠాశ్రమో గృహీ.

శ్లో॥ యథావాయుం సమాశ్రిత్య, సర్వేజీవంతి జంతవః
తథా గృహస్థమాశ్రిత్య, వర్తంతే ఇతరాశ్రమాః

వాయువు నాశ్రయించి జీవజంతువులన్నియు బ్రదుకునట్లు గృహస్థు నాశ్రయించి యితరాశ్రమములవారు జీవింతురు.

శ్లో॥ అష్యకావ్యస్య కవయోః నసమర్థా విశేషణే
సాధోరివ గృహస్థస్య, శేషస్త్రయ ఇవాశ్రమాః ॥ ఆదిపర్వము.
శ్లో॥ ఆశ్రమాంస్తులయా సర్వాన్ ధృతా నాహుర్మనీషిణః
ఏకతశ్చ త్రయోరాజన్, గృహస్థాశ్రమ ఏకతః॥

త్రాసులో మూఁడాశ్రమము లొకప్రక్కన గృహస్థాశ్రమ మొకటి యొకప్రక్కన నైచి తూఁచితిమేని సరిపోవును.

ఇట్లు గృహస్థాశ్రమము శ్రేష్ఠత్వము సాధించు ప్రమాణవాక్యములు పెక్కులు గలవు.

కొందఱు సన్న్యాసాశ్రమము శ్రేష్ఠమని దానియందు విశేషఫలము గల దని భ్రమించుచున్నారు. అది భ్రమమాత్రమే. ఎట్లన:—

'నలింగం ధర్మకారణ'మ్మని మనుస్మృతి; ధర్మము సాధించుటకు ముఖ్యకారణము కాషాయవస్త్రాది చిహ్నములుగావు. 'జ్ఞానం సన్న్యాసలక్షణం'. సన్న్యాసికి ముఖ్యచిహ్నము జ్ఞానము.

ఈ జ్ఞానమనునది జనకాదులవలె గృహస్థులును సంపాదింపవచ్చును. కావున వేషము ముఖ్యముగాదు. అదియునుగాక వాస్తవసన్న్యాసము దండకమండలు ధారణము కాదు.

శ్లో॥ కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయోవిదుః ॥

కామ్యకర్మములు చేయకుండుటయే సన్న్యాసమని జ్ఞానులు దెలియుదురు.

నియతస్యతు సన్న్యాసః, కర్మణో నోపపద్యతే
మోహాత్తస్య పరిత్యాగ, స్తామసః పరికీర్తితః ॥ భ–గీ.

నిత్య నైమిత్తికరూపమైన మహా యజ్ఞాదికర్మములు బ్రహ్మజ్ఞానమునకు సాధనములగుటచేఁ బ్రాణములు పోవుచున్నను విడువరాదు. అట్టికర్మములను విడుచుటకుఁ గారణ మజ్ఞానమే.

శ్లో॥ యజ్ఞోదానం తపశ్చైవ, పావనాని మనీషిణామ్
ఏతాన్యపిచ కర్మాణి సంగంత్యక్త్వా కరోతి యః
లిప్యతే న సపాపేన, పద్మపత్ర మివాంభసా
కాయేన మనసా బుద్ధ్యా, కేవలై రింద్రియైరపి
యోగినః కర్మకుర్వంతి, సంగం త్యక్త్వాత్మ శుద్ధయే
యుక్తః కర్మఫలం త్యక్త్వా, శాంతిమాప్నోతి నైష్ఠికీమ్
అయుక్తః కామకారేణ, ఫలేసక్తో నిబధ్యతే ॥ భ–గీ.

యజ్ఞము దానము తపస్సు ననునవి బుద్ధిమంతులను బావనులఁ జేయును. ఈ కర్మములనయినను ఫలాపేక్షలేక యెవఁడుచేయునో తామరాకును నీరంటనట్లు వానిని బాపమంటదు. ఆత్మశుద్ధినిమిత్తము యోగులు కాయముచే మనస్సుచే బుద్ధిచే నింద్రియములచే ఫలసంగమువదలి కర్మములు చేయుదురు; యోగి కర్మఫలమువదలి శాంతియందు నిష్ఠగలవాఁడగును. యోగి కానివాఁడు కామముచేఁ గర్మములుచేసి ఫలబద్ధుఁ డగును. భ–గీ. ౧౮–అధ్యా.

గృహస్థోహి క్రియాయుక్తో, నగృహేణ గృహీభవేత్
నచాపి పుత్ర దారాద్యైః, స్వకర్మ పరివర్జితః ॥

దక్షుఁడు దారపుత్త్రాదులతో గృహమునం దున్నమాత్రమున స్వకర్మముల వదలినవాఁడు గృహస్థుఁడు కాఁడు.

శ్లో. అనాశ్రితః కర్మఫలం, కార్యం కర్మ కరోతి యః
స సన్న్యాసీచ యోగీచ, న నిరగ్ని ర్న చాక్రియః. భ-గీ. ౬-౧.

కర్మఫలము నాసింపక యెవఁడు కర్మములను మన విధి చేయఁదగినవను బుద్ధితోఁ జేయునో వాఁడే సన్న్యాసి; వాఁడేయోగి; వాఁడు అగ్నిహోత్రము లేనివాఁడు కాఁడు. క్రియలు లేనివాఁడు కాఁడు.

అప్రయాణాత్తత్రాపి హి దృష్టం బ్రహ్మహి. బ్ర. సూ. ౪-౧-౧౨.

ప్రాణము పోవువఱకుఁ గర్మములు చేయువలయునని యీ ప్రమాణములు స్థాపించుచున్నవి. కావున వాస్తవసన్న్యాసము గృహస్థుఁడుగానుండి కామ్యకర్మములు చేయకుండుటయే.

ఇఁక సన్న్యాసికి ఫలమందాధిక్యముగలదా, చూతము.

శ్లో. సన్న్యాసాద్బ్రహ్మణస్థానం, వైరాగ్యా త్ప్రకృతౌలయః
జ్ఞానాత్కైవల్య మాప్నోతి, త్రిపస్తాగతయః స్మృతాః యని జాబాలిస్మృతి.

సన్న్యాసమువలనఁ జతుర్ముఖ బ్రహ్మలోకము వైరాగ్యమువలనఁ బ్రకృతి యందు లయము జ్ఞానమువలన కైవల్యము. ఈమూఁడుగతులు చెప్పఁబడెను.

శ్లో. వేదాంతవిజ్ఞాన సునిశ్చితార్థాః। సన్న్యాసయోగాద్యతయః యశుద్ధసత్త్వాః
తేబ్రహ్మలోకేతు పరాంతకాలే । పరామృతాత్పరి ముచ్యంతి సర్వే. శ్రుతి.

దీనివలన సన్న్యాసులు చతుర్ముఖ బ్రహ్మలోకమునకుఁ బోయి యందు చతుర్ముఖబ్రహ్మ యుండువఱకుండి యావల నాయనతోడ ముక్తిగాంతురు. అంతియకాని సద్యోముక్తి లేదు. అక్కడనేదైన లోపముగలిగెనా మరల నిచ్చటికి రావలసినవారే. 'ఆ బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోర్జున' యని కృష్ణభగవానుఁడు చెప్పెనుగదా.

సన్న్యాసులకు బ్రహ్మలోక ప్రాప్తియే యనుటకు.
ప్రాజాపత్యం గృహస్థానాం, బ్రాహ్మం సన్న్యాసినాం స్మృతమ్
యోగినా మమృతంస్థానం, తద్విష్ణోః పరమంపదమ్
ఏకాంతిన స్సదా బ్రహ్మ, ధ్యాయినో యోగినో హియే
తేషాం తత్పరమంస్థానం, యద్వై పశ్యంతి సూరయః

గృహస్థులకుఁ బ్రజాపతిలోకము సన్న్యాసులకు బ్రహ్మలోకము (సత్యలోకమని శ్రీధరీయవ్యాఖ్య) ప్రతీకోపాసకులగు యోగులకు విష్ణుపరమపదమగు నమృతస్థానము (ఇది ధ్రువునికి మీఁదనుండు లోకము) ఏకాంతభక్తులయి పరబ్రహ్మము నుధ్యానించుయోగులకు నిత్యసూరులు సర్వదాచూచు దానికిఁ బరమైనస్థానము.

"అనావృత్తిః శబ్దాత్" అను బ్రహ్మసూత్రవాఖ్యయందు శంకరాచార్యులును "సగుణ శరణానామప్య నావృత్తి సిద్ధిరితి" సగుణ బ్రహ్మమును శరణుచొచ్చిన వారికిని మరల జన్మములేదు. అనివ్రాసిరి.

ఇఁక గృహస్థుఁడో.

శ్లో. న్యాయాగత ధన స్తత్త్వ, జ్ఞాననిష్ఠోతిథిప్రియః
శ్రాద్ధకృత్సత్యవాదీచ, గృహస్థోపి విముచ్యతే.

న్యాయ్యమార్గమున ధనమార్జించి, తత్త్వజ్ఞాన నిష్ఠుఁడై అతిథుల సేవించుచు శ్రాద్ధములు జరపుచు సత్యవాదియగు గృహస్థుఁడు ముక్తుఁడగును.

కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయః।
జనకుఁడు మొదలగువారు కర్మయోగముచేతనే ముక్తిని గాంచిరి.

గృహస్థుఁడు వీరుఁడు ధీరుఁడు. సన్న్యాసి పిఱికి పంద.

అరిషడ్వర్గముతో యుద్ధముచేసి జయించువాఁడు గృహస్థుఁడు; వానికి భయపడి పరువెత్తిపోయి కొండలలో గుహలలో నడవులలో దాఁగుకొనువాఁడు సన్న్యాసి. కావున గృహస్థధర్మమే శ్రేష్ఠమను భరతవాక్యము సముచితమే.

ఉ. పుట్టువుచేత స్థానమునఁ • జోఁడిమివిద్యల నీకుఁ జిన్న నే
నెట్టులు నీవు గల్గియును • నేలఁగఁ జాలుదు? ధీగుణంబుల
న్బట్టుఁ జిన్ననాట నినుఁ • బాసి నిలంగను నేర నన్నయా!
యెట్టులు రాజ్యభారము వ • హింతునో? పోవఁ జుమీ యయోధ్యకున్. ౭౮౧

స్థానమునన్ = పెద్దవానిపదవి మైనపిమ్మటఁ జిన్నవానిపదవి యను క్రమమున నీవున్నప్పుడైనను నీకాలాంతరమున నేనురాజ్యమునకు వచ్చిన రావచ్చును. గావున నీవుండఁగనే వచ్చుట ధర్మముగాదని భావము. నీకంటె నే నేమాత్రము పెద్ద? ఒకనాఁడైకదా? కావున నిరువురు సమానులమే యనినఁ జెప్పుచున్నాఁడు. ధీగుణంబులన్ పట్టున బుద్ధిచేత– గుణములచేత– స్థానముచేత.

తా త్ప ర్య ము.

అన్నా! జన్మము వరుసక్రమమునందును విద్యలయందును నీకుఁ జిన్నవాఁడను నేను. నాకంటె గొప్పవాఁడవు నీవు కావున నన్నివిషయములందు నీకు వెనుకనుండవలసినవాఁడనే కాని ముందుపడవలసినవాఁడను గాను. సూర్యుఁడుండిన సూర్యకాంతశిల వేఁడిమి చూపఁగలదుగాని సూర్యుఁడులేనివేళ నదియేమిచేయఁగలదు. అట్లులే నేను నీవుతోడనుండిన నీబలముప్రాపున నెంతైనఁ జేయఁగలనుగాని నిన్నువిడిచి నేనేదియుఁ జేయఁజాలను. చేయలేకుండుటయేకాదు. బుద్ధిచేత గుణములచేతఁ జిన్నవాఁడనగుటచే నీసహాయములేకున్న నిలువనుగూడలేను. చెట్టుప్రాపులేని తీఁగవలె నేలఁబడవలసినవాఁడనే. ఇట్టివాఁడను రాజ్యభారముకూడ నెట్లు భరింపఁగలను? కావున

నేనయోధ్యకుఁ బోను. ఇందు జీవాత్మ పరమాత్మల సంబంధము ఆధారాధేయ భావము, రక్ష్యరక్షకభావము, అంశాంశిభావము దెలియవచ్చుచున్నవి.

సీ. పౌరపురోహిత • బాంధవప్రవరులు, గల రిట నెల్లరుఁ • గాన నిచటఁ
బట్టాభిషేకంబుఁ • బటిమ నొనర్తుము, పదపడి ధారిణీ • పాలనమున
కును బో మ్మయోధ్యకుఁ • గుటిలారులను గెల్చి, వృత్రారిపోలె నీ • వెల్ల రలర
మూఁడుఋణంబుల • మునుముట్టఁ దీర్చి, మిత్రకోటులకు న • మిత్రులకును

ఆ. నిష్టకష్టములను • నిడుచు మ మ్మెల్లరఁ, గావ వయ్య నిన్నుఁ • గాంచి హితులు
దేలఁ బ్రీతిఁ బగలు • దిక్కుమొగంబుగా, రమ్యసుగుణభద్ర • రామభద్ర.

౨౮౧౬

పౌర=పురజనులు, ప్రవరులు = శ్రేష్ఠులు, కుటిలారులు = కుత్సితశాత్రవులు, వృత్రారి = ఇంద్రుఁడు, అలరన్ = సంతోషింపఁగా, మూఁడుఋణంబులు = దేవ ఋణము, పితృఋణము, ఋషిఋణము, మునుముట్టన్=సంపూర్ణముగ,కొఱతలేక, అమిత్రులకున్=పగవారికి, ఇష్టకష్టములను=మిత్రులకిష్టము, అమిత్రులకుఁ గష్టము, క్రమాన్వయము, పగలు=పగవారు, దిక్కుమొగంబుగన్=దిక్కులవంక ముఖము పెట్టి దిక్కునకోఁడుగా పరుగెత్తినవారు,

## తా త్ప ర్య ము.

పౌరశ్రేష్ఠులు, పురోహితశ్రేష్ఠులు, బాంధవశ్రేష్ఠులు లోనగువా రుండవలసిన వారెల్ల నిందున్నారు. వారియభిప్రాయమేమో వీరియభిప్రాయమేమో యని నీవు సందేహింపఁబనిలేదు. వారి వీరిమీఁద నెపముచెప్పఁబనిలేదు. అచటికి ముందుగాఁ బోయిన నచట వీరు పట్టాభిషేకము చేయుదురో చేయరో యని సందేహింపఁ బని లేదు. ఇచటనే నీకుఁ బట్టాభిషేకము చేయుదుము. ఆవల నీవు భూపరిపాలనము నకై యయోధ్యకుఁ బొమ్ము. పోయి కుత్సితశత్రువులనుగెల్చి యింద్రునివలె నందఱు సంతోషించునట్లు దేవపితృఋషి ఋణములు కొఱతలేకదీర్చి మిత్రులకు సంతోషము శత్రువులకు దుఃఖము కలుగునట్లు మమ్మందఱఁ గావుము. అట్లుచేసితి వేని నిన్నుఁజూచి నీహితముగోరువారు సంతోషింతురు. నీకుఁ గీడుగోరువారికి నిచట నుండిన దండముతప్పదని దిక్కునకోఁడుగా నందఱుఁ బరువెత్తుదురు. రాజ్యము నిష్కంటక మగును.

కం. నాతల్లి నిందవలనం; బూతగ నొనరించి తండ్రి • పుణ్యాత్ముఁడుగాఁ
బాతకమునకుం బాపుము, భూతముల మహేశునట్లు • ప్రోవుము మమ్మున్.

౨౮౧౭

పూతగన్=పవిత్రురాలినిగా, పాతకమునకున్ = పాపమునుండి, మహేశు నట్లు=భగవంతునివలె.

తా త్ప ర్య ము.

నిన్ను నేనింతదూరము ప్రార్థించుట నాసుఖముఁగోరిగాదు. నీవు పట్టాభిషేకము చేసికొంటివేని శ్రీరామచంద్రమూర్తిని గామాతురయై యడవులపాలు చేసెనను లోకనిందచేతను బాపముచేతను మృతప్రాయయై నాతల్లియున్నది. ఆమెకా పాపము నిందపోవును. దోషిగానివాని దండించి ధర్మవిధమువిడిచి తండ్రి పాపముచే నరకమునఁ బడియున్నవాఁడు. ఆయన కా నరకబాధతప్పును. ముఖ్యముగా నీరెండుకార్యములుచేసి భగవంతుఁడు జీవకోటులనెల్ల వారివారికిఁ దగిన యోగక్షేమములఁ గూర్చి యెట్లు రక్షించునో యట్లు నీవును మమ్మునెల్ల రక్షింపుము. నీవు పట్టాభిషేకము చేసికొంటివేని యీ మూఁడుపుణ్యములు సంపాదించినవాఁడ వగుదువు.

కం. నామాటలు పెడచెవి నిడి, యీమహికారణ్యవాస • మీఁకోన దేనిన్
రామా! మీఁబడిఁ గానన,సీమకు నివసింప వత్తు • సిద్ధ మ టన్నన్. ౩౮౧

పెడచెవినిడి=ఎడమచెవితోవిని, అలక్ష్యముచేసి, మహికారణ్యవాసము = గొప్పయడవులయందుండుటకు, ఈకోనదేనిన్ = ఇయ్యకొనెదవేని = అంగీకరించు పక్షమున, మీఁబడి=మీవెంబడి, కాననసీమకున్=అడవిప్రదేశమునకు.

తా త్ప ర్య ము

నేనురాను నీ వేమిచేసెదవందువా? నీతోడ నేనుండవలసినవాఁడను, నిన్ను విడిచియుండను. నీవయోధ్యకు వచ్చెదవా, అయోధ్యయందు నీతోడనుందును. నీవరణ్యములం దుందువా? నేనుమీతోడ నరణ్యమందే యుందును. ఇదినిశ్చయము. ఆత్మనువిడిచి శరీర ముండుండఁగలదు?

ఉ. ఇంతయు నాలకించి పురి • కేఁగఁగ నీకొనకున్న జానకీ
కాంతునిఁ జూచి నైగమని•కాయము లశ్రుల నించి హా యటం
చెంతటి ధీరచిత్తుఁ డర•రే యని హర్షము గాంచెఁ దల్లులున్
వంతను బొంది హా యనుచు • బ్రాలిరి మెచ్చిరి కైకపుత్రునిన్. ౩౮౨

ఆలకించి=విని, ఈకొనకున్న=అంగీకరింపని, నైగమనికాయములు = పౌరజన సమూహములు, నైగమస్తూపనిషది దంతే వణిజేనాగరే॥ నానార॥ అశ్రులు = కన్నీళ్ళు, వంతను=వ్యసనమును.

తా త్ప ర్య ము.

భరతుఁ డింతగాఁ జెప్పినదంతయు విని శ్రీరామచంద్రమూర్తి యయోధ్యకుఁబోవ సమ్మతింపలేదు. అట్టి శ్రీరామచంద్రునిఁజూచి పౌరులందఱు నాహా శ్రీరామచంద్రుఁడెంతటి ధీరచిత్తుఁడని మెచ్చుచు వానినిమెఁగడా! యని కన్నీరు గార్చిరి. తల్లులును దుఃఖముచే నేలవ్రాలి భరతుఁడు నిర్బంధనముగా నెంతబాగుగఁ జెప్పెనని శ్లాఘించిరి.

## —•{౧౦౭-వ సర్గము. శ్రీరాముఁడు భరతునితో నతఁడు రాజగుట ధర్మ మని చెప్పుట.}•—

చం. భరతుఁడు వేఁడ నిట్లు బహు•భంగుల రాముఁడు పల్కె నాజికిన్
బురుమతి కేకయాత్మజకుఁ • బుట్టిన నీ కిది చెల్లుఁ, గైకయీ
పరిణయవేళఁ దాతకును • బ్రాజ్యము రాజ్యము శుల్క మిచ్చె భూ
వరుఁ డగుతండ్రి యామెసుతుఁ • బట్టముఁ గట్టఁగ బాస చేయుచున్. ౫౮౦

అజికిన్=దశరథునకు, కేకయాత్మజకున్=కేకయరాజు కూతునకు, కైకయనఁ కేకయరాజు కూఁతురనుటచేఁ దండ్రివలెఁ గూఁతురు గొప్పగుణములు గలదేయని భావము. పరిణయవేళన్=వివాహకాలమందు, తాతకును=కైకతండ్రియగు కేకయ రాజునకు, శుల్కము=ఓరణము.

### తాత్పర్యము.

ఈప్రకార మనేకవిధముల భరతుఁడు ప్రార్థింపఁగా దశరథుఁడు కామ వశుఁడై యధర్మమార్గమున వర్తించెనను మాటకుఁ బ్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు. భరతా! దశరథునివంటి ధర్మాత్మునకుఁ గేకయరాజువంటి గొప్పవానికిఁ గూఁతురైన కైకకుఁ బుట్టిన నీవిట్లుచెప్పుట న్యాయ్యమె. కాని నీవుచెప్పినట్లు దశరథుఁడు కేవల మధర్మాత్ముఁడై రాజ్యము నీ కీయలేదు. మాతల్లి వివాహమునందుఁ గన్యాశుల్క ముగా నీరాజ్య మామెకొడుకున కిచ్చునట్లు కేకయరాజునకు నీతండ్రి మాట యిచ్చెను. ఇది ప్రమాణపూర్వకముగఁ జేసినకార్యము గావునఁ బ్రమాణము ప్రకారము కార్యముచేసినతండ్రి యధర్మాత్ముఁ డెట్లగును.

సీ. విబుధదానవయుద్ధ•వేళ నీజనయిత్రి, పుడమిఱేనికిఁ దోడు•పడినకతనఁ
బరమహర్షంబున • వరములు రెం డిచ్చె, నామెయు వానిన • యడిగె నిప్పు
డిదియును దోషమే • యిందు నొక్కటనీవు, రాజౌటయును నే న•రణ్యములకుఁ
బోవుట మఱిరెండు • భూవరుండవి యిచ్చెఁ, గావునఁ దండ్రివా•క్యంబుఁ బట్టి

ఆ. పదియునాలుగేండ్లు•భ్రమియింప వనముల, వచ్చినాఁడఁ దోడ • వసుధతనయ
లక్ష్మణుండు రాఁగ • లలితపద్ధతిఁ దండ్రి, సత్యవచననిష్ఠుఁ•జల్పుటకును. ౫౮౧

విబుధదానవ యుద్ధవేళన్=దేవతలకు రాక్షసులకు యుద్ధముపొసఁగిన సమ యమందు, జనయిత్రి=తల్లి, పుడమిఱేనికిన్ = రాజునకు, దశరథునకు, తోడుపడిన కతనన్ = సాహాయ్యముచేసిన కారణమున, సత్యవచననిష్ఠున్ = సత్యవాక్యమునం దున్నవానిని.

### తాత్పర్యము.

ఆ వరప్రకారము రాజ్యము నాకిచ్చిన నిచ్చునుగాక! నీ వడవికిఁ బోవలసి నది లేదుకదా? నన్నేల యడవికిఁబంపెను. అది యధర్మముగ దా! యందువా? దానికిఁ గారణము చెప్పెదను వినుము. దేవరాక్షసయుద్ధమందు నీతల్లి తనకు

సాహాయ్యముచేసిన కారణమున నీతండ్రి యామెకు రెండువరము లిచ్చెను. ఆరెండు వరము లిప్పుడామె యడిగెను. అందొక్కటి నీకు రాజ్యాభిషేకము, రెండవది నా వనవాసము. ఆరెండువరములు తండ్రియిచ్చెను. కావున నాయనమాటప్రకారము పదునాల్గు సంవత్సరములు నే నడవులయందు సంచరింప సీతాలక్ష్మణులతోడ వచ్చినాఁడను. ఇట్లు నేను వచ్చుటయం దుద్దేశము తండ్రి సత్యవాక్యనిష్ఠునిఁ జేయుటయే, కాని కామక్రోధములు గావు.

కం. నీవును దండ్రిని నిజమరిఁ,గావింపఁగవలదె! యట్లు • గావున రాజ్య
శ్రీవిభవముఁ గైకొనుమీ, నావచనము వినఁగదయ్య•నాకొఱకైనన్. ౨౪౨౨

నిజమరి = సత్యవాది.

### తా త్ప ర్య ము.

కాఁబట్టి తండ్రిని నేను సత్యవచననిష్ఠునిఁ జేయఁబూనినట్లు నీవును దండ్రిని సత్యవాదినిఁ జేయఁదగుదువుగదా. కాఁబట్టి రాజ్యలక్ష్మిని సంగీకరింపుము. తండ్రి నాతోఁ జెప్పలేదు. కావున నేనేల దాని నంగీకరింపవలయు నందువా! అట్లైనఁ దండ్రిమాట తండ్రినిగదానేను. నేనుజెప్పెదను. అయ్యో! పెద్దవాఁడు చెప్పుచున్నాఁడే యని నాకొఱకైనను నామాటవినుము. నష్టమైనను గష్టమైనను ఇష్టమైనను అనిష్టమైనను పెద్దవారిమాట త్రోసివేయరాదుగదా.

కం. జనకుని ఋణంబుఁ దీర్పుము, జనయిత్రియు సంతసింపఁ • జరియింపు గయుం
డనునతఁడు దొల్లి గయయం, దనిమె సుగీతములఁ బితరు•లందఱు వినఁగన్.
౨౪౨౩

### తా త్ప ర్య ము.

కావునఁ దండ్రిఋణ మాయన మాటప్రకారము నడచి తీర్పుము. తల్లియును సంతోషించునట్లు వర్తింపుము. ఈవిషయమై గయమహారాజు పితరులు వినుచుండఁ జెప్పినగీతములు గలవు. చెప్పెదవినుము.

కం. జనకుఁడు పున్నామనరక,మునఁ గూలక కాచుఁ గాన•మొగి నాతనినో
ర్కొని దీర్చిసుకృతుఁ జేయును,గనుకం బుత్త్రాఖ్యఁ బరఁగుఁ•గా సుతుఁ డెందున్.
౨౪౨౪

పున్నామనరకమునన్=పుత్ + నామ=పున్నామ=పుత్త్రను పేరుగల నరకము నందు, సుకృతున్=పుణ్యాత్ముని, పుత్త్రాఖ్య=పుత్త్రిడనుఖ్యాతి.

### తా త్ప ర్య ము.

తండ్రిని బుత్త్రను పేరుగల నరకమునుండి రక్షించును గనుకను, దండ్రిఁ గోరిక నెఱవేర్చి సుకృతుఁ జేయును గనుకను గొడుకునకుఁ బుత్త్రుఁడను పేరుగలిగెను. పుత్ + త్రాయతే = పుత్త్రః, పిత్రూన్ పాతి=పుత్రః ఈరెండువిధముల వ్యుత్పత్తి గలదు. మొదటి యర్థమందుఁ బుత్త్రియని వ్రాయవలెను. రెండవ యర్థమందుఁ

బుత్రయని వ్రాయవచ్చును. ఇదియును అవచిత యను సూత్రప్రకారము పుత్రి యని వ్రాసినను వ్రాయవచ్చును.

కం. కలుగుదురు గాక తనయులు, పలువురు గుణయుతులు వేద•పారగు లని కో
రుకు-లుజనములు గోరఁగఁ దగుఁ, గలుగఁ డెయొకఁడైనఁ బోవ•గయకనునాశన్.
౨౪౨౫

వేదపారగులు=వేదము తుదముట్ట నధ్యయనము చేసినవారు.

తా త్ప ర్య ము.

పున్నామనరకమునుండి రక్షించువాఁడు జ్యేష్ఠ పుత్రుఁడే. అంతటితో భార్యాసంగమ సుఖము చాలింపవచ్చునుగాని యొకకొడుకు కొడుకుగాఁడను న్యాయ మనుసరించి యతఁడు చచ్చిన నీళ్ళువిడుచువారే యుండరే యను నభిప్రాయములో మఱికొందఱు గుణవంతులు వేదాధ్యయనము చేసినవారు కొడుకులుగలుగఁ గోర వచ్చును. ఏలః వారిలో నొకఁడైన గయకుఁబోయి పిండముపేయువాఁ డుండఁడా యను నాశచేత. అంతియేగాని కామతృప్తికై కాదు. "ఏకాభార్యాత్రయఃపుత్రా" యని యుండుటచే నొకభార్య ముగ్గురు కొడుకులుండువాఁడు ధన్యుఁడు. అంత కెక్కు-వమంది బిడ్డలుండుటకుఁ బాపమే కారణము. (చూ. ప. ౧౫౪౭).

దశరథునకు నలుగురు కొడుకులున్నారే యనిన మూఁడువందల యేఁబది ముగ్వురు భార్యలు గలవానికి నలుగురుకొడుకు లేమిలెక్క-. నలుగురు నొకతల్లి బిడ్డలు గారుకదా! దీనివలన గయాశ్రాద్ధము విశేషఫలదమని యేర్పడుచున్నది.

శ్లో. గయా ముపేత్య యః శ్రాద్ధం, కరోతి పృథివీపతే
సఫలం తస్య తజ్జన్మ జాయతే పితృతుష్టిదమ్॥ వి. పు.

గయకుఁ బోయి యెవఁడు శ్రాద్ధము పెట్టునో పితృదేవతలకు సంతోష మొసఁ గినవాని జన్మము సార్థకము.

శ్లో. గయాశీర్షే యదాపిండం, నామ్నా యేషాం ప్రకుర్వతే
నరకస్థా దివం యాంతి, స్వర్గస్థా మోక్షమాప్నుయుః.
తత్రాక్షయ్యవటోనామ, త్రిషులోకేషు విశ్రుతః
పితౄణాం తత్ర వైదత్తం, మక్షయ్యం భవతిప్రభో
వటవృక్షం సమాసాద్య, శాకేనా ప్యుదకేనవా
ఏకస్మిన్ భోజితే విప్రే, కోటిర్భవతి భోజితా.

బ్రహ్మకైవర్తము, గయయందు నెవరిపేర్లతోఁ బిండము పెట్టఁబడునో వారు నరకమందుండిరా స్వర్గమునకుఁ బోదురు. స్వర్గమందుండిరా మోక్షమునకుఁ బోదురు. అక్షయ్యవటము మూఁడులోకములఁ బ్రసిద్ధికెక్కి-నది. అక్క-డఁ బితృ దేవతల కిచ్చినది యక్షయమగును. వటవృక్షమునొద్దఁ గూరగాని నీళ్ళుగాని యొకని కిచ్చినను కోటిమంది భుజించినట్లగును.

శమీపత్రప్రమాణేన, పిండం దద్యా ద్యథావిధి
ఉద్ధరే త్సప్త గోత్రాణాం, కులమేకో త్తరం శతమ్. గయామాహాత్మ్యము.

తే. రాజఋషు లందఱును నిల్లు • రాజపుత్ర! తలఁచుచుందురు గావునఁ • దండ్రి నీవు
నరకమునుండి కావుమీ • ధరణిజనుల, ననుజుతోఁ గూడి పాలింపు • మరుగు పురికి. ౨౪౨౬

తాత్పర్యము.

రాజర్షులందఱు నీప్రకారము కోరుచుందురు. కావున రాజకుమారా! నీవును దండ్రివాక్యముచొప్పున వర్తించి తండ్రికసత్యము దోషమువలనఁ గలుగు నరక బాధనుండి రక్షింపుము. అయోధ్యకుఁబోయి రాజవుకమ్ము.

ఉ. రాజవు గమ్ము నీవు జన • రాజికి, వన్యమృగాళి కేను నే
రాజను, దండకాటవికి • గ్రక్కునఁ బోయెదఁ, బొమ్ము వీటికిన్,
రాజిలుఁ గాక నీకు దిన • రాజకరాతప మాఁప ఛత్రమున్,
భూజవిశాలశాఖ లిటఁ • జాల్పగు నాకు సుఖప్రదంబులై. ౨౪౨౭

జనరాజికిన్=మనుష్యసమూహమునకు- మృగపాళికిన్ = మృగసమూహమునకు, వీటికిన్ = పురమునకు. దినరాజకరాతపము = సూర్యునికిరణముల వేఁడిమిని, ఆఁపన్=అడ్డగించుటకు, ఛత్రము = శ్వేతచ్ఛత్రము = తెల్లగొడుగు, భూజవిశాల శాఖలు=చెట్లయొక్క వెడలుపగు కొమ్మలు సుఖప్రదంబులై=సుఖమిచ్చునవియై.

తాత్పర్యము.

కాదు కూడదు నీవు రాజవు కావలసినదే యనెదవా? నీకోర్కె. తండ్రికోరిక నెఱవేఱు నుపాయము చెప్పెదవినుము. పురములెటు తండ్రి రాజ్యమునఁ జేరినవో యడవులట్లు తండ్రి రాజ్యమునఁ జేరినవే కదా. కాఁబట్టి నీవు పురమునందుండి జనులను పాలింపుము. అడవులందుండి నేను వన్యమృగములకు రాజనయ్యెదను. నా రాజ్యము నేను పాలించుటకు దండకారణ్యమునకుఁ బోయెదను. నీవు పురమునకుఁ బొమ్ము. నీకెండవేఁడిమి తగులకుండ శ్వేతచ్ఛత్రముండును, ఇక్కడ నాకు వెడలుపాటి చెట్లకొమ్మలుగలవు. అవి నాకుసుఖమిచ్చును, దీని నీవంగీకరింపుము నీకోరిక తండ్రికోరిక నెఱవేఱును.

వన్యమృగాళికనుచోఁ గర్మధారయముగఁ జేసి యడవియందుఁ బుట్టినవియగు మృగములని యర్థముచెప్పవచ్చును. 2. వన్యాళికి+మృగాళికని సుగ్రీవాదిమైత్రి సూచించుచున్నది. ద్వంద్వసమాసమున నొకయర్థము చెప్పవచ్చును. అప్పుడు వన్యాళి యనఁగా వనములందుండు మునుల సమూహమని యర్థము. అప్పుడు మునులకు మృగములకు ననియర్థము. ఇక్కడ నీయర్థము చెప్పినచో యరణ్యకాండ మందలి.

గీ. పాప మాచరించు పాపాత్ములకు భువ, నాహితార్థులైన యట్టి ఖలుల
సంహరించుటకును జననాథుచే నాజ్ఞ, బొంది వచ్చినాఁడ బొలసు దిండి.

అరణ్యకాండము ౮౮౫ ప. అనియు,

కం. మేము స్వధర్మము దప్పక, భూమింగల ధర్మహీనపురుషుల భరతా
జ్ఞామహిమను దండించెద, మేమీ దోషంబు దీననెఱుఁగం జెపుమా.

అని కిష్కింధాకాండమునందును రామచంద్రమూర్తి వాక్యములు సార్థక పడును.

తే. తోడుపడుచుండు నీకు శ•త్రుఘ్నుఁ డచట
నిచట సౌమిత్రి నాకుఁ దా • నెలమిఁ గూర్చు
మనము నలువురు తనయుల • మనఘచరిత
తండ్రి సత్యస్థుఁ జేయఁగఁ దలఁపవయ్య. ౭౮౭

ఎలమిన్=సంతోషమును, సత్యస్థున్=సత్యమునందున్న వానిని.

తాత్పర్యము.

పురమునందు నీకు శత్రుఘ్నుఁడు సహాయుఁడుగా నుండును. ఇచ్చట నాకు లక్ష్మణుఁడు సంతోషము గలిగించుచుండును. ఈవిధముగ మనము నలువురము తండ్రిని సత్యముదప్పనివానిని జేయుదము.

—• ౧౦౮-వ స. జాబాలి శ్రీరామునితో నాస్తికవాక్యంబులు చెప్పుట. •—

కం. ఈలీల భరతు హితవాగ్జాలంబులఁ దేర్చు రాముఁ • గనుఁగొని యట భూ
మీశేఖోత్తముఁ డగుజా, బాలి యధర్మోక్తులిట్లు • పలికెహితేచ్ఛన్. ౭౮౮

ఈలీలన్=ఈవిధముగా, హితవాగ్జాలంబులన్=హితములైన మాటల సమూహములతో, తేర్చు=సమాధానపఱుచు, భూమీశేఖోత్తముఁడు=బ్రాహ్మణశ్రేష్ఠుఁడు, అధర్మోక్తులు=ధర్మవిరుద్ధములగు మాటలు, హితేచ్ఛన్=మేలుకలిగించు కోరికతో.

తాత్పర్యము

ఈ విధముగ హితవులయిన మాటలచే భరతుని సమాధాన పఱుచుచున్న శ్రీరామచంద్రమూర్తినిఁ జూచి బ్రాహ్మణోత్తముఁడగు జాబాలి రామచంద్రమూర్తికి నేవిధముగనైన మేలుచేయవలయునను తలంపుతోఁ గఠినపథ్యముండలేని బిడ్డలకు కేవల వాత్సల్యమున బుద్ధిలేనితల్లి యపథ్యవస్తువునిచ్చునట్టు లధర్మోక్తులను జెప్పెను.

దీనివలన జాబాలి వాక్యములు ధర్మశాస్త్రవిరుద్ధములైనను నాయునయుద్దేశము చెడ్డదిగాదనియు నెటులైన శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషిక్తుఁడై సుఖపడఁ జేయవలయుననియే యనియు నేర్పడుచున్నది. కాని మార్గము సరియైనదికాదు.

చం. అరయఁగ సర్వముం దెలిసి•నట్టిమహామతి పీవు నీకుఁ బా
మరునకు యుక్తమైనమతి•మాంద్య మదెట్టులు కల్గె? నేల యీ

కరమునిరర్థకంపుమతి • గ్రక్కున నేగు మయోధ్య కింక నీ
భరతుఁడు గోరినట్లు జన•పాలనశీలివి గమ్ము రాఘవా! ౨౪౩౦

అరయఁగన్=విచారింపఁగా, మహామతివి=గొప్పమనస్సుగలవాఁడవు. పామరునకున్=జ్ఞానములేనివానికి, యుక్తము=తగినది, మతిమాంద్యము = మొద్దుబుద్ధి, కరము=మిక్కిలి, నిరర్థకంపుమతి, వ్యర్థమైనమనస్సు, జనపాలనశీలివి=ప్రజలరక్షించు శీలముగలవాఁడవు.

తాత్పర్యము.

సర్వముదెలిసిన గొప్పమనస్సు గలవాఁడవు, నీకుఁ బామరున కుండఁదగిన మతిమాంద్య మెటులుగలిగెను. ఏల? యీ ప్రయోజనముమాలిన బుద్ధి విడిచి వేగమే యయోధ్యకుఁబోయి భరతుఁడు చెప్పినట్లు ప్రజాపాలన మొనరింపుము.

ఉ. ఎక్కడితండ్రి? మానవున • కెక్కడిబంధువు? లేటిమాట, తా
నొక్కనిచేఁ గనం దగుప్ర•యోజన మెయ్యది? పుట్టువేళఁ దా
నొక్కఁడ పుట్టుఁ, జచ్చునెడ • నొక్కఁడ చచ్చును, వెంట వచ్చునే
యొక్కఁడునైన? నెట్లగుదు•రో తనవారలు కన్నవారలున్? ౨౪౩౧

తాత్పర్యము

తండ్రి తండ్రి యని పలుమాఱనెదవే. మనుష్యునకుఁ దండ్రియనువాఁడెవ్వఁడు? బంధువులనువారెవ్వరు? ఇదియేమి యనాలోచితప్రసంగము. ఒకనివలన మఱియొకనికిఁ గాఁగల కార్యమేమున్నది? ఒకఁడు మఱియొకనికి నేమిచేయఁగలఁడు. ముదిమిరాకుండఁ గాపాడఁగలఁడా? చావురాకుండఁ గాపాడఁగలఁడా? పుట్టినప్పుడు తానొక్కఁడేపుట్టెను; చచ్చునపు డొక్కఁడే చచ్చును. అప్పుడీ తండ్రులలో బంధువులలో నొకఁడైన వెంటవచ్చునా? అట్లు రానప్పుడు, వీరు కన్నవారెట్లయిరి? బంధువు లెట్లయిరి?

ఉ. ఎక్కడితల్లి తండ్రి? మతి•హీనతవో యటు లంట, లేదు చూ
యొక్కని కొక్కఁ డెందుఁ,బెఱ•యూరికిఁ బోవుచు బాట నిల్చి తా
నొక్కఁడ వేగినంత మఱి•యొందు కడం జనుపాంథునట్లు దాఁ
దక్కుచుఁ దల్లిదండ్రిధన•దారలఁ బోవును జీవి రాఘవా! ౨౪౩౨

మతిహీనత=బుద్ధిలేనితనము, వో=నిశ్చయము, వేగినంతన్ = ఉదయముకాఁగానే, పాంథునట్లు=బాటసారివలె.

తాత్పర్యము.

ఎక్కడితల్లి? ఎక్కడితండ్రి! ఒకనిని దండ్రియని యొకతెను దల్లియని యనుటయే బుద్ధిలేనితనమును సూచించును. ఒకప్రాణికి మఱియొకప్రాణికి సంబంధములేదు. ఒకబాటసారి దూరపు గ్రామమునకుఁ బోవుచు నొకచోట రాత్రికి

నిలిచి యుదయముకాఁగానే తోడిబాటసారులను వదలి లేచిపోవునట్లు తాను దల్లిని దండ్రిని వదలి జీవి రామచంద్రా! పోవుచుండును. ఇట్లుండ నొకరినొకరు మేలు చేయుట యన నెట్టిది.

కం. ఆవాసమాత్ర మియ్యవి, కావున వీనికిని బుధుఁడు • కాంక్షయుఁ గనునే?
భూవరతనయా! ని న్నేలా విపరీతంపుబుద్ధి • యావేశించెన్ ? ౨౪౩౩

ఆవాసమాత్రము = తత్కాలమున వసింప నుపయోగపడు సత్రములు చలువపందిళ్ళు లోనైనవి, బుధుఁడు=జ్ఞానముగలవాఁడు, కాంక్షయున్=కోరికకూడ, ఆవేశించెన్=చొరఁబడెను.

### తా త్ప ర్య ము.

రామచంద్రా! యీతల్లిదండ్రుల దేహములు సత్రములు, చలువపందిళ్ళ వంటివి. తత్కాలమునకు నిలువ నుపయోగించునవి. కావున వీనికై వివేకముగల వాఁడు కోరికసేయఁడు. ఇట్టి విపరీతబుద్ధి నీకెక్కడినుండి వచ్చెను? బుద్ధిమంతుఁడ వైన నీయం దిది పుట్టువదికాదే;

చం. జనకునిరాజ్యము న్విడిచి • సంకటకారణకంటకావృతం
బును విషమంబు నైనచెడు•పోకలఁ బోవఁగ నేల? సర్వభో
గనిచయపూర్ణ మాపురికి • గ్రక్కునఁ బొ మ్మభిషేకసద్విధిన్
గొని సుఖయింపు స్వేచ్ఛఁ; బురి • కూరిమి వేచెడినొంటివేణితోన్. ౨౪౩౪

జనకుని=నీయభిప్రాయ ప్రకారము నీవు తండ్రి యనుకొని వాని "పరప్రతీత్యా పరోబోధనీయ" యను న్యాయము ననుసరించి యిట్లు చెప్పఁబడెను. అనఁగా నెవనికేది తెలిసియున్నదో యెట్లుచెప్పిన నెవనికి సంతోషమో యాయభిప్రాయ ప్రకారము బోధింపవలెనని యర్థము. కావున జనకునిరాజ్య మనుచున్నాఁడు. మృతుఁడైన జనకునకు రాజ్యమెక్కడిదని జాబాలి భావము. సంకటకారణ=కష్టములకుఁ గారణమై, కంటకావృతంబు=ముండ్లచే నావరింపఁబడినది, విషమంబు = యౌవనవంతుల కనుచితమైనది, చెడుపోకలన్ = తప్పుత్రోవల, సర్వభోగనిచయ= సమస్తభోగ్యపదార్థ సమూహములతో, పూర్ణము=నిండిన, ఒంటివేణి = ఒకటిగాఁ బెనసికొనిపోయిన జడ, దువ్వుట లోనగు సంస్కారము లేకయున్నదని భావము.

### తా త్ప ర్య ము.

రామచంద్రా! చచ్చినవానికి రాజ్యమెక్కడిది? నీవు జనకుని రాజ్య మనుటచే నీయభిప్రాయము ప్రకారము చెప్పుచున్నాను. అటువంటి నీ తండ్రి రాజ్యమునువదలి కష్టకారణమైన ముండ్లచే నావరింపఁబడినదియు భోగానుభవయోగ్యమైన యౌవన మందుండువారికిఁ దగనిదియునగు చెడుమార్గమున నేలచెడెదవు. సుఖకారణమై భోగ్యవస్తువులతో నిండినదైన నగరమునకుఁబొమ్ము. నీయిష్టప్రకారము సుఖమనుభవింపుము. వ్రతదీక్షవహించి శిరస్సునకు దువ్వుట జడవేసికొనుట లోనగు సంస్కార

ములు లేక యొకటిగఁ జెనవేసికొనిపోయిన జడతో నగరి నీరాక కెదురుచూచుచున్నది. (నగరి యనుటచే లక్షణావృత్తిచేఁ బురమున స్త్రీలందఱు తలంట్లు నలుగులు జడలు శృంగారములు లేక దుఃఖపూరితులై యున్నారని భావము.) పట్టణమేపోవు రామభద్రునివెంటన్, అనునప్పుడీ లక్షణావృత్తిచేతనే పట్టణజనులని యర్థము గ్రహింపవలెను.

ఉన్నమాటల కున్నట్లు లర్థముచెప్పిన నెచ్చట నర్థముకుదురదో యచ్చట లక్షణావృత్తి చెప్పవలెను. నగరి యేడ్చుననిన నచేతనపదార్థ మెట్లు లేడువఁగలదు. అది సరియగు నర్థముగాదు. కావున నగరిలోనుండు స్త్రీలని చెప్పవలసి వచ్చెను. స్త్రీలు నగరిలో నుండువారే కావున అజహల్లక్షణ యనిపేరు. గంగయందు గొల్లపల్లె యున్న దన్నప్పుడు నదియేటఁ బల్లెలుండవు కావున గంగయొడ్డున గొల్లపల్లె యని యర్థము గ్రహింపవలయును. ఇచ్చటఁ బల్లె గంగనువిడిచి యున్నది గావున జహల్లక్షణ యనిపేరు. దీనిలో నింకను భేదములు గలవు.

ఆ. తండ్రి యెవఁడు నీకుఁ • దండ్రికి నీ వెవ్వఁ? డతఁడు వేఱు వేఱ • యధిప! నీవు
దీని నీ వెఱింగి • మానుగ మే మెల్లఁ, జెప్పినట్లు చేయఁ • జెల్లు నీకు. ౨౮౩౫

తా త్ప ర్య ము.

తండ్రియెవఁడు? నీవెవ్వఁడవు? తండ్రికి నీకు నేమిసంబంధము? అతఁడు వేఱు నీవు వేఱు. దీనిని దెలిసికొని మేముచెప్పినట్లు చేయుము.

కం. జనకుండు బీజమాత్రమ, జననీజఠరమున శుక్ల•సంయుతరక్తం
బున నగుఁ బిండముదానన్, జనియించును ప్రాణిదీన•సందియ మున్నే. ౨౮౩౬

బీజమాత్రము=బీజమునుంచువాఁడుమాత్రమే, జఠరమునన్ = గర్భమునందు, శుక్లసంయుత రక్తంబునన్=రేతస్సుతోఁగూడిన రక్తముచే.

తా త్ప ర్య ము.

పురుషుఁ డొకస్త్రీగర్భమందు బీజమువేయఁగా నది స్త్రీరక్తముతోఁ గలిసి పిండమై యది ప్రాణముగలదై జనించుచున్నది. తండ్రియొక్క యల్పసహాయము మాత్రమే. అమాత్రమునకేల తండ్రి తండ్రియని యేడ్చెదవు. ముఖ్యసహాయము శుక్లరక్తములు.

ఉ. ఎచ్చటి కేఁగఁగా వలె మ•హీశ్వరుఁ డచ్చటి కేగు, నిద్దియే
నిచ్చలు మర్త్యకోటులకు • నిశ్చితవృత్తము. దీనిఁ జూడ కే
పిచ్చితనంబునన్ వృథగఁ • బెక్కువిధంబులఁ బల్కెదీవు? నీ
వెచ్చటఁ దండ్రి యెచ్చట? ని • దేమిటి ప్రాజ్ఞులు విన్న నవ్వరే? ౨౮౩౭

ఎచ్చటికేఁగఁగావలెన్ = ఎచ్చటికిఁ బోవలయునో, మహీశ్వరుఁడు = రాజు, నిచ్చలు=ఎల్లప్పుడు, రూ. నిచ్చ. ఇది నిత్యశబ్దభవము. మర్త్యకోటులకున్=మనుష్య

సమూహమునకు, నిశ్చితవృత్తము = నిశ్చయింపఁబడిన వర్తనము, చూడక = ఆలోచింపక.

తా త్ప ర్య ము.

రాజెక్కడికిఁ బోవలయునో యచ్చటికే పోయినాఁడు. నాలుగు భూతముల సంయోగము దేహము, మరణించినపుడవి మరల నాలిగిటిలోఁ గలిసెను. సర్వకాలములందు మనుష్యకోటులకు నిదియే వర్తనము. పుట్టినవాఁ డెన్నిదినములకైనఁ జావవలసినదే నిశ్చయము. ఇదియాలోచింపక పిచ్చివానివలె వ్యర్థముగ నేమేమో పలికెదవు. నీవెక్కడ ! తండ్రియెక్కడ? ఇరువుర కేమిసంబంధము. ఇదివిన్న బుద్ధిమంతులు నవ్వరా !

వలెన్ అనునది యపప్రయోగమని కొందఱ యభిప్రాయము. కూచిమంచి తిమ్మకవిగారిరుక్మిణీపరిణయము 2-వ ఆశ్వాసంబున, కం॥ లలనావర సురుచిరలీలలనా నృపుఁ డెత్తువేయులాగులఁ దెలుపన్ । వలెనా మదిఁదలపఁగ నీ । వలె నాకిఁక నాప్తులైనవారుంగలరే॥ అశ్వమేధపర్వము, 1-ఆ. సుస్థిరుండవుగావలె సుజనవర్య. నాచన సోముని హరివంశము. 5-ఆ. 20-ప కావలె నన్నచోట నయకారణ భంగమవంగఁ బొంగుచున్ అని ప్రయోగములు గలవు.

కం. ధర్మార్థంబులకొఱకై, కర్మంబులఁ జేయువారి*గాసికి వగతున్
గర్మఁడుఁ డిందును నందు న,శర్మంబున వగచు; మేలు * సౌఖ్యమెకోరన్.-౪౩౮

*ధర్మార్థంబులకొఱకై =ధర్మమునిమిత్తము, అర్థమునిమిత్తము,గాసికి=శ్రమమునకు, కర్మఠుఁడు=కర్మముచేయువాఁడు, అశర్మంబునన్=సుఖములేక.

తా త్ప ర్య ము

ధర్మము సంపాదింపవలయునని, ధనము సంపాదింపవలయునని శ్రమపడువారికై నేను దుఃఖించెదను. సుఖముగోరువారికై నేను దుఃఖింపను. ఏలనఁ గర్మమందే యాసక్తిగలవానికి దానితోనే వానియాయువు సరిపోవును. వాఁడు సుఖపడు టెపుడు? మరణించినతరువాత నంతమా! యేమున్నది? సుఖించుదేహము మట్టిలోఁ గలిసిన సుఖమెవ్వరికి ?

కం. అష్టక యని యాబ్దిక మని, కష్టము పడిచేయువారు * కర్మమునఁ,గంటే
కష్టార్జితాన్ననష్టము, శిష్టవినుత! యన్నమున్ భు*జించునె మృతుఁడున్! -౪౩౯

అష్టక = అష్టకయను పేరుగల శ్రాద్ధము, ఆబ్దికము=సంవత్సర సంవత్సరము మరణించినవారి నుద్దేశించిచేయు శ్రాద్ధము, ఏఁడుడి, కష్టార్జితాన్ననష్టము = కష్టపడి సంపాదించిన యన్నమునకుఁ గలిగెడునాశము. మృతుఁడున్=చచ్చినవాఁడు.

తా త్ప ర్య ము.

ఈదిన మష్టకశ్రాద్ధమని, యీదిన మాబ్దికమని కష్టపడి వైదిక కర్మములు చేయుచున్నారు. కష్టపడి యొకఁడు సంపాదించినది దేరకు నలువురు తినిపోవుట

వలనఁ గలిగెడునష్ట మాలోచించితివా? ఏల నష్టయుందువా? చచ్చినవాఁ డన్నము తినునా ?

అష్టకలనఁబడునవి అగ్రహాయణికావల మూఁడు కృష్ణాష్టముల యందుఁ జేయఁబడు శ్రాద్ధములకుఁ బేరు.

ఉ. ఒక్కఁడు కూడు దిన్న మఱి • యొక్కనిపొట్టయు నిండు నంట హా !
యెక్కడి మాట, యట్లయిన • నింటను శ్రాద్ధముఁ బెట్టి రేనియున్
మక్కువ బాటసారికిని • మార్గమునం దుదరంబు నిండునే?
టక్కులుగాక నిక్క మను • టల్ మతిమంతులు విశ్వసింతురే ! ౨౪౪౦

తా త్ప ర్య ము

చచ్చినవాని పేరుచెప్పి కదా యితరులు దినుచున్నారు. దీనివలన లాభమేమి ? బ్రదికియుండినవారు కూడుదినినఁ జచ్చినవారికడుపు లెట్లునిండును? ఒకఁడు కూడు దినిన మఱియొకనికడుపు నిండునందురే యిదియేటిమాట. అది నిజమగునేని ప్రయాణముపోయినవాని నుద్దేశించి యింట శ్రాద్ధము పెట్టితిమేని బాటసారి కడుపు నిండునా? ఇవన్నియు మోసపుమాటలేకాని నిజములుగావు. బుద్ధిగలవా రిదివిన్న నమ్ముదురా ?

ఉ. చేయుము యాగముల్, దపము • సేయుము, దీక్ష వహింపు, దానముం
జేయు, మటంచు గ్రంథములఁ • జెప్పిరి యన్యధనాపహారులై
ధీయుతు, లవ్వి నమ్మనెసు • ధీమణి. కావఁ బరంబు లేమి నీ
వీయెడ లబ్ధభోగముల • నేల త్యజించెదు ధీరసత్తమా. ౨౪౪౧

అన్యధనాపహారులై=ఇతరుల ధనమపహరించు కోరికగలవారై, ధీయుతుల్ = బుద్ధిగలవారు. సుధీమణి=బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడు, పరము=పరలోకము; అందు ననుభవము, లేమిన్=లేకుండుటచే, లబ్ధభోగములన్=చేతికిప్రాప్తించిన సుఖానుభవములను, త్యజించెదు=వదలెదవు. ధీరసత్తమా=పండితశ్రేష్ఠుఁడా, ధైర్యముగలవారిలో శ్రేష్ఠుఁడా, ధైర్యము పితృవచన పరిపాలనమందని గ్రహింపవలయును.

తే. ధరణి బ్రత్యక్షమగుదానిఁ • దలఁగఁద్రోసి, కాని పరోక్షంబునమ్మనే • చెనఁటిదైన ?
భువనజనసమ్మతంబు నా • బుద్ధి వినుము, కట్టుకొన వయ్య పట్టంబుఁ • గరుణవిూఱ.
౨౪౪౨

ప్రత్యక్షము=ఇంద్రియములకు గోచరించునది, రాజ్యభోగము, పరోక్షంబు = ఇంద్రియములకుఁ గానరానిది, స్వర్గలోకము, చెనఁటి = బుద్ధిలేనివాఁడు, భువనజన సమ్మతంబు=లోకములోని జనులందఱు సమ్మతించినది.

తా త్ప ర్య ము.

మబ్బులోని నీరునమ్మి చెఱువునీరు దెగఁగొట్టువాఁడు కలఁడా? చచ్చిన పిమ్మట నేదో సుఖముకలుగునని ప్రత్యక్షముగాఁ గరగతమైన రాజ్య సుఖానుభవ

మును బోఁగొట్టుకొను బుద్ధిలేనివాఁ డుండునా? కావున లోకముసమ్మతించు నా యాలోచన వినుము. మాయందు దయయుంచి పట్టాభిషేకము చేసికొమ్ము.

చార్వాక మతము.

ఈ చార్వాకమతస్థుల వాదవాక్యములు కొన్ని యుదాహరించుచున్నాను.

శ్లో. న స్వర్గో నాపవర్గో వా, నైవాత్మా పారలౌకికః
నైవ వర్ణాశ్రమాదీనాం, క్రియాశ్చ ఫల దాయికాః
అగ్నిహోత్రం త్రయోవేదా, స్త్రిదండం భస్మగుంఠనమ్
బుద్ధిపౌరుష హీనానాం, జీవికా ధాతృనిర్మితా
యావజ్జీవే త్సుఖం జీవే, దృణం కృత్వా ఘృతం పిబేత్
భస్మీ భూతస్య దేహస్య, పునరాగమనం కుతః
అంగనాలింగ నాజ్జన్య, సుఖమేవ పుమర్థతా
కంటకాది వ్యథాజన్యం, దుఃఖం నిరయఉచ్యతే
లోకసిద్ధో భవేద్రాజా, పరేశో నాపరః స్మృతః
దేహస్యనాశో ముక్తిస్తు, నజ్ఞానా న్ముక్తిరిష్యతే
దేహః స్థౌల్యాది యోగాచ్చ, స ఏవాత్మా నచాపరః
మమదేహోయ మిత్యుక్తిః, సంభవే దౌపచారికీ.

అర్థము. స్వర్గములేదు- మోక్షములేదు- ఆత్మయు లేదు- పరలోకము లేదు- వర్ణాశ్రమములు లేవు- ఫలమునిచ్చు క్రియలు లేవు. అగ్నిహోత్రములు- మూఁడు వేదములు- సన్న్యాసము- భస్మధారణము ఇవి బుద్ధిపౌరుషములు లేనివారికి జీవనోపాయములుగా ధాత సృజించెను. జీవించియుండునంతవఱకు సుఖముగ జీవింపవలయును, అప్పైనఁదీసి నెయ్యిత్రాగవలెను. బూడిదైపోయిన దేహము మరలవచ్చుట యెక్కడిది? స్త్రీలను గౌఁగిలించుకొనుటవలనఁ గలుగుసుఖమే పురుషార్థము. ముండ్లు మొదలైనవి గ్రుచ్చుకొనుటవలనఁ గలుగుబాధయే నరకము. ప్రత్యక్షముగఁ గానవచ్చు లోకప్రసిద్ధుఁడేరాజు- వానికంటెఁ బరుఁడైన యీశ్వరుఁడు లేఁడు. దేహనాశమే ముక్తి. జ్ఞానమువలన ముక్తి లేదు. బలియుట కృశించుటగల దేహమేయాత్మ ఆత్మయనునది వేఱులేదు. నాదేహమనుట యౌపచారికముగాని సత్యముకాదు. అట్లైన జీవించియుండు శరీరమునకు మృతకళేబరమునకు భేదము కానవచ్చుచున్న దేయేమికారణ మనిన వారిట్లు సమాధానము చెప్పుదురు.

శ్లో. అత్ర చత్వారి భూతాని, భూమివార్య నలానిలః
చతుర్భ్యః ఖలు భూతేభ్య, శ్చైతన్య ముపపద్యతే
కిణ్వాదిభ్యః సమేతేభ్యో, ద్రవ్యేభ్యో మదశక్తివత్.

ఈ చార్వాక మతప్రకారము భూమి- జలము- అగ్ని - గాలి యనునవి నాలుగుమాత్రమే భూతములు. ఈ నాలుగింటి కూడికవలనఁ జైతన్య ముత్పత్తి

యగుచున్నది. ఎట్లనఁగా కొన్ని కిణ్వాది పదార్థముల కూడికచే మదము కలిగించు గుణ ముత్పత్తి యగుచున్నదిగదా అట్లులే చైతన్య ముత్పత్తియగునందురు.

ఇట్లుపమానముచేఁ దమవాదమును చార్వాకులు స్థాపింపఁ జూచెదరు. ఇట్లు చేయుట స్వమత విరుద్ధమే. ఎట్లన: నుపమానము అనుమానప్రమాణమున నంత ర్గతము. అది యట్లున్నది గాన నిది యిట్లని యూహా యనుమానమెకదా. కావునఁ బ్రత్యక్షప్రమాణవాదు లనుమానమును గ్రహింపరాదు.

ఉపమానములు సర్వత్ర సరియైన ప్రమాణములు కాఁజాలవు. మనుష్యు నకు రెండుకాళ్ళున్నవి- కోడికి రెండుకాళ్ళున్నవి. కోడి మనుష్యుఁడే యనవచ్చునా? నాలుగుభూతముల సంయోగము చేతనే చైతన్య మేర్పడునేని పీనుఁగుఁ ముక్కులోఁ గాలిమిత్తిపెట్టి వేఁడిగాలియూఁదిన నది జీవించునా? ఇట్లుచేయుటచేఁ బీనుఁగునందు నాలుగుభూతము లుండునుగదా. ఏల జీవింపదు.

కార్యముచేయునది దేహము. అట్టిదేహము మరణానంతరము కాలిపోఁగాఁ బాపము దేనిని గట్టుకొనియుండును? కావున నేపాపముచేసినను భయములేదు. పాపమనునది లోకులను బెదరించి పొట్టపోసికొనుటకై బ్రాహ్మణులు కల్పించిన మిథ్య కావున నిట్టిభయము విడిచి యథేచ్ఛముగా భోగించి సుఖించుటే పురుషార్థము. శుష్క-వేదాంతులు- కూటసన్న్యాసులు- మాయాయోగులు- వంచక పరమహం సలు- దొంగస్వాములు- శిష్యులకు శిష్యురాండ్రకు మఠములనుపేరుగల విటీవిట సంకేతస్థలములందు రహస్యముగఁ జేయుబోధ యిదియే. ఈమతప్రవర్తకుఁడు బృహ స్పతి శిష్యుఁడైన చార్వాకుఁడు. చార్వాకుఁడనఁగా చారు=రమణీయమైన, వాక్ = వాక్కు-గలవాఁడు రమణీయమనఁగా వెనుక దుఃఖము గలిగించునదైనను విను వారి మనస్సును రంజింపఁజేయును గావున రమణీయము. ఈ మతమునకు లోకా యత మనియుఁ బేరుగలదు. ఇందుఁ జేరినవారు లోకాయతికులు. లోక, ఆయ తము- లోకమున స్వభావముగ వ్యాపించియుండునది. ఉపదేశము లేకయే లోకు లీమతము ననుసరింతురు. గావున నిది దురుచ్ఛేదము. (ఛేదింపఁ గష్టమైనది. ఈ మతమువారికి అర్థకామములే పరమపురుషార్థములు. అనఁగా ధనముసంపాదించుట స్త్రీలతో భోగించుట ఇవి జన్మమెత్తి సాధింపవలసిన కార్యములు. ఇది దుఃఖకారణ మగునుగదా యనిన దుఃఖమిశ్రమము లేనికార్యములోకమునలేదు. వడ్లుపొట్టులాడు నట్లు దంపక బియ్యము వచ్చుచున్నదా ! దేహకష్టములేని తపస్సున్నదా! అట్లని వానిని మానినారా? అట్టులే యిదియును.

ఈ మతము నభిమానించువా రెవ్వరనిన: విపరీత వేదాంతులు- దొంగ ముట్టుల మాయలాఁడులు- మగనిబాసిన మగువలు- పతిజీవించియుండ దీర్ఘకాలము పుట్టినింటనుండు తరుణులు- ముదుసళ్ళ వివాహమాడిన యువతులు- విపరీతనిష్ఠగల విటూరులు- పురుషులగోష్ఠిఁ దిరిగెడి కాంతలు- జారపురుషుల భార్యలు- వయస్సున్న

నుండు సపత్నీకులు- వివాహముకాని రజస్వలలు- సొగసులు మరిగిన విధవలు మాఱుమనువుల మానినులు మొదలయిన వారియందుఁ గామదాసులు కామ దాసికలు.

తాయి యనఁగాఁ దల్లి- గండ యనఁగా మగఁడు. మీఁదఁ జెప్పిన మతముల వారి కందఱకుఁ దల్లిని విషయించుట సమానధర్మము. కావున నందఱ కన్వయించు వల్లు తాయిగండమతమని నామకరణము చేయఁబడెను.

వీరి యభిప్రాయము బలాత్కారముగ నొకస్త్రీని చెఱిచినను బయల దోఁచి నను ఇంతయేల బలాత్కారముగ దేనిని జేసినను జేయనివారె యగుదురు. ఏలన?

"సర్వాన్ బలాన్ కృతా నర్థా, నకృతా న్మను రబ్రవీత్" "బలాత్కార కృత్యములనెల్ల నకృతములుగా విధించినాఁ డల్లమనువు" శ్లం. నై" బలవంతముగా నేమిచేసినను నదిచేయనివాఁడే యని మనువుచెప్పెనుగదా యని వీరివాదము. కావునఁ బరస్త్రీలను బలవంతముగఁ జెఱిచినను నది చేయనట్లే కావున దోషము లేదు.

కేవలప్రత్యక్షమును బ్రమాణముగా గ్రహింపరాదని సాంఖ్యదర్శనమే నిరాకరించినది. ఏలన:—

అతిదూరా త్సమీపా దింద్రియఘాతా న్మనోనవస్థానాత్
సౌక్ష్మ్యా ద్వ్యవధానా దభిభవా త్సమానాభిహారాచ్చ. సాంఖ్యకారిక.

ఈ దోషములచేఁ బ్రత్యక్షము బాధితమగుచున్నది. అతిదూరము- ఆకాశ మున నతిదూరమునఁ బాఱెడి పక్షి కన్నులకు గోచరింపదు. అకారణమున నాకాశ మునఁ బక్షి లేదనవచ్చునా? ఆకాశమున మన రిత్తకన్నులకేగాక యంత్రములకును గోచరింపని నక్షత్రము లెన్నియో కలవు. అవన్నియు నసత్యములా? అతి సమీ పము=మిక్కిలి సమీపమందుండు వస్తువు కానరాదు. కన్నులందలి కాటుక కాన రాదుగదా! అకారణమున నది కల్లయనవచ్చునా?

ఇంద్రియఘాతము కంటికిఁ గామలా- పసిరికలు- పొరలు లోనగు వ్యాధులు చెవుడు మొదలయిన రోగములు వచ్చినను నున్నదున్నట్టు తెలియరాదు. "పైత్య దోషోదయంబునఁ బరుసనైన జిహ్వకకుఁ బంచదారయుఁ జేదుగాదె" యన్నట్లు జ్వరాదులచే బాధకలిగినపుడు తీపుకూడఁ జేదగును. పాము కఱచినవానికి వేపాకు దియ్యగా నుండును.

మనోవస్థ = మనస్సు స్వస్థదశయందు లేనప్పుడు సమీపమం దుండునదియే కానరాదు. మనసేకాగ్రముగ నొకవిషయమున నుండునపుడు కన్నులఁ జూచినను గానరాదు. వీనుల ధ్వనిపడినను వినరాదు. ఎవరైనఁ దాఁకినను దెలియరాదు. సన్నిపాతాదులందు నున్మాద దశయందుఁ గన్నులు లోనైనవి చక్కఁగ నుండినను వ్యర్థము లేకదా. 'కామాంధోపి నపశ్యతి'యని కలదుగదా.

సౌక్ష్మ్యము = అతి సూక్ష్మములైనవియుఁ గానరావు. జలములందు- గాలి యందు మనకుఁ గానరాని తెలియరాని సూక్ష్మజంతువు లెన్నియో కలవుగదా! అల్పాల్ప పరమాణువులు గానరావు.

వ్యవధానము=వ్యవధానమనఁగా మఱుఁగు- చాటు-గోడచాటు మనుష్యుఁడు గానరాఁడుకదా.

అభిభవము=అభిభవమనఁగాఁ దిరస్కారము- లోకువ; సూర్యకాంతికిలోఁబడిన వగుటచేఁగదా పగలు చుక్కలు గానరాకున్నవి. ఆమాత్రమునఁ బగలుచుక్కలు లేవనవచ్చునా?

సమానాభిహారము=సమానదశ ప్రాప్తించినపుడును బదార్థము తెలియరాదు. సముద్రమునఁబడిన వర్షబిందువు తెలియవచ్చునా? నల్లని వస్త్రమునందు వ్రాయుమసి పడినఁ దెలియఁగలదా? ఆకారణముచే నది లేదనవచ్చునా? పాలయందుఁ బెరుఁగు నందు వెన్న లేదా? కానరాదు. కావున లేదనవచ్చునా? కట్టెలయందు నగ్ని కాన రాదు. ఆకారణమున లేదనవచ్చునా?

ఇదియునుగాక యొకనికిఁ గానవచ్చినది మఱియొకనికిఁ గానరాకపోవచ్చును. ఒకనికి వినవచ్చినది మఱియొకనికి వినరాకపోవచ్చును. ఈ యిరువురిలో నెవరివాక్యము ప్రమాణము? చార్వాకుఁ డుత్తరహిందూస్థానమున హిమవత్పర్వత -మున్న దనిన నమ్మఁడు. రామేశ్వరమునొద్ద సముద్రమున్న దనిన నమ్మఁడు- తనముత్తాత యున్నాఁడనిన నమ్మఁడు. ఏల తనకుఁగానరాలేదు కావున- ఇట్టిది చార్వాకమతము కావుననే యీమతమువారి నందఱు చీకొట్టుచుందురు.

శ్లో॥ చార్వాక! తవ చార్వంగీ జారతో వీక్ష్యగర్భిణీమ్
ప్రత్యక్షమాత్రవిశ్వాస ఘనశ్వాసం విముంచసి.

పుట్టినింటికిఁబోయి పుట్టుస్నానముచేసి తనభార్య గర్భిణియై మరలవచ్చెను. దానిని జూచి దానిమగఁడు చార్వాకుఁడు విచారపడుచు నిట్టూర్పువిడుచు చుండెను వానిని జూచి మఱియొకఁడు "చార్వాకుఁడా! నీవు ప్రత్యక్ష ప్రమాణవాదివికదా? ఏలరా జారునివలన నీభార్యకు గర్భమువచ్చెనని యూహించి నిట్టూర్పు విడిచెదవు? జారునియొద్ద నీభార్య పండుకొనుట నీవు చూడలేదుగదా! నీభార్య ఱంకుటాలని యెట్లు నమ్మెద"వని పరిహసించెను. కావునఁ బ్రత్యక్షప్రమాణము ప్రమాణము కానేరదు. కావునఁ జార్వాకమతము దుష్టము.

—• ౧౦౯-వ సర్గము. శ్రీరాముఁడు జాబాలిమతమును ఖండించుట. •—

మ. అని జాబాలి వచింప నట్టివిని సత్యాత్ముండు నిశ్చంచలా
త్మను బల్కెం బరభక్తి రామవిభుఁడుం బ్రహ్మ! మదర్థంబు నీ
వనునమ్మాటలు కార్యసన్నిభ మకార్యం బౌ, హితాకారమ
య్యు నపథ్యంబును, గావ వాని విన నొల్లన్ జగద్గర్హ్యమున్. ౨౮౪౩

అర్థైవిని=అర్థముచెప్పక యేకమనస్సుతో విని- సత్యాత్మ్మందు = (1)సత్యము చెప్పు స్వభావముగలవాఁడు- (2) సత్యమాడుటయందే సర్వదా మనస్సుగలవాఁడు- (3) సత్యమునందు ధైర్యముగలవాఁడు- (4) సత్యమైన ధర్మముగలవాఁడు- (5)సత్యమైన ధైర్యముగలవాఁడు- నిశ్చంచలాత్మను=జాబాలిమాటలచేఁజలింపనిమనస్సుతో- పరభక్తిన్=పరమునందుఁగల భక్తితో-(2) అధికమైన వైదికకర్మశ్రద్ధచే-బ్రహ్మ=బ్రాహ్మణుఁడా- నీవుపుట్టిన పుట్టుక యేమి- నీవు చెప్పెడి మాటలేమి! యనిభావము. మదర్థంబు=నాకొఱకు- కార్యసన్నిభము=చేయఁదగినదానివలె స్థూలదృష్టికిఁ గానవచ్చునది- అకార్యము=వాస్తవమునఁ జేయరానిది- హితాకారము=మేలుగలిగించు దానివలెఁ గానవచ్చునది- అపథ్యము = ఆచరించినపక్షమునఁ గీడుచేయునది- జగద్గర్హ్యమున్=ప్రపంచముచే నిందింపఁబడినది.

సత్యాత్మ్మందు నిశ్చంచలాత్మను =వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునందన భ-గీ. వాస్తవమును నిశ్చయముగాఁ దెలిసిన బుద్ధి యేకవిధముగా నుండును.

## తాత్పర్యము.

ఈ ప్రకారము జాబాలిచెప్పఁగా వినివిని సత్యాత్ముఁడగుటచే నామాటలకు మనస్సు చలింపనిక వైదికకర్మాచరణమందుఁగల శ్రద్ధచే శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె. ఓబ్రాహ్మణుఁడా! నీవుపుట్టిన పుట్టువేమి! నీవు చెప్పెడు మాటల తీరేమి! నామేలుకొఱకై నీవుచెప్పినమాటలు చేయఁదగినవానితో సమానముగాఁ గానవచ్చుచున్నవి కాని వాస్తవమాలోచించినఁ జేయరానివై యున్నవి. రూపమున హితముగాఁ గానవచ్చుచున్నవి గాని యనుభవమునఁ గీడుచేయునవై యున్నవి. నీవు భువనసమ్మతమని చెప్పితివిగాని లోకమున నింద్యమై యున్నది. లోకసమ్మతమైన పక్షమందు లోకులందఱీప్రకార మేలచేయరు? కావున నట్టిమాటలు విననెట్లు సహింతును?

తే. భిన్నచారిత్రదర్శనుల్ • పేర్మి చెడఁగ
స్ఖలితమర్యాదులును గల్మ•షప్రవర్త
కులును నగుచును మానంబుఁ • గోలుపోయి
సభల దూషితు లగుదురు • సత్య మిదియు. ౨౮౮౮

భిన్న=వైదిక మతాచారమునకంటె వేఱగు- చారిత్ర=నడవడిని జెప్పునట్టి- దర్శనుల్ = మతముగలవారు- అనఁగా వేదబాహ్యమతములవారు- స్ఖలితమర్యాదులును =వదలిపోయిన యెల్లకలవారు- కట్టుపాటు లేనివారు- కల్మషప్రవర్తకులు = పాపపు నడవడిగలవారు- మానంబున్=గౌరవమును- కోలుపోయి=పోఁగొట్టుకొని- దూషితులు=నిందింపఁబడినవారు- స్ఖలితమర్యాదులు=కర్మములకు ఫలములేదని వీరి యభిప్రాయము గావున నేపాపముచేసిన నేమిభయము, పుణ్యమునకు ఫలములేదు. పాపమునకు ఫలములేదు. కావునఁ బుణ్యకర్మమని పాపకర్మమని విభజనయే వీరిమత

మునలేదు ఆకారణమునఁ గర్తవ్యాకర్తవ్యములు తెలియవలసిన పనిలేదు. కావున శాస్త్రములతోను బనిలేదు. పెద్దలతోను బనిలేదు కావున జారత్వమునకుఁ జోరత్వమునకు నీమొదలయిన కర్మములను స్వేచ్ఛగాఁ జేయవచ్చును. ఈవిధముగ వీరు కట్టుపాటులేనివారు కావుననే, కల్మషప్రవర్తకులు = పాపకార్యములు చేయువారు. ఇట్టివారు గావున వీరినెవ్వరు నమ్మి దగ్గఱరానీయరు. సభలయందు గౌరవములేదు.

### తాత్పర్యము.

వేదోక్తమైన యాచారమునకంటె భిన్నమైన యాచారములను దెలుపుశాస్త్రముల నెఱిఁగినవారు కట్టుపాటులేక స్వేచ్ఛగాఁ జరించువారు పాపపు నడవడిగలవారు తమగొప్పతనమును గౌరవమును బోఁగొట్టుకొని సభలయందు నిందింపఁబడుదురు. ఇది యథార్థము. నీవు వీరిలోఁ జేరినవాఁడవే.

కం. కులహీనునిఁ గులవంతునిఁ, బలువను సజ్జనుని శుచిని ♦ బాపిని శౌర్యా
  గళితునిఁ బూరుషమానిం, దెలియఁగఁ దగు వానివాని♦ నెఱినడవడిచేన్. ౨౪౪౫

కులహీనునిన్=నీచపుఁ గులమందుఁ బుట్టినవానిని- కులవంతునిన్=ప్రశస్తకులమునఁ బుట్టినవానిని- పలువను=దుష్టుని- పలు+వా = మాటనిలుకడలేక పలువిధములుగ మాటలాడువాఁడు- సజ్జనునిన్ = మంచివానిని- శుచిని = పరిశుద్ధమయిన నడవడిగలవానిని- పాపిని = పాపాత్ముని- శౌర్యాగళితున్ = శౌర్యమునందుఁ దగ్గినవానిని- పూరుషమానిన్ = తాను శూరుఁడుకాకయే శూరుఁడనని తలఁచువానిని- నెఱి=నీతితోఁ గూడినవానిని.

### తాత్పర్యము.

నేను గల్మషప్రవర్తుఁడనని నీకెట్లు తెలియునందువా? వీఁడు నీచకులమునఁ బుట్టినవాఁడు- వీఁడు గొప్పకులమునఁ బుట్టినవాఁడు వీఁడు దుష్టుఁడు వీఁడు శిష్టుఁడు వీఁడు పాపహీనుఁడు వీఁడు పాపాత్ముఁడు వీఁడు శౌర్యవంతుఁడు వీఁడు శౌర్యహీనుఁడని వానివాని నీతిప్రవర్తనముచేఁ దెలియవచ్చును. నీమాటలఁబట్టి నీవు నియమహీనుఁడవు. కావున నీవు పాపివని తెలియవచ్చును. శిష్టుఁడైనవాఁడు దుష్టవాక్యములు గూడ నోటరానీయఁడు. మనస్సున నుండునదే నోరవచ్చును నోట వచ్చినపుడు మనస్సున నట్టియభిప్రాయ మున్నదనియే యూహింపవలయును.

సీ. నిక్క మనార్యుఁడై ♦ నెఱియార్యుపోలికి, శుచితావిహీనుఁడై ♦ శుచివిధమున
  లక్షణ్యునట్టు ల♦లక్షణ్యుఁడై దుష్టశీలుఁడయ్యును సాధు♦శీలుమాడ్కి
  శ్రుతిహితకార్యవ♦ర్జితలోకసంకర, మగు నధర్మము ధర్మ ♦ మనుచుఁ జెప్ప
  నాయట్టివాఁ డని ♦ న్యాయ్యమంచుఁగ్రహింపఁ,గార్యవిచక్షణుఁ ♦ డార్యుఁ డెవఁడు
తే. లోకముల దుష్టశీలుని ♦ లోకనింద్యు, నన్నుఁ జూడఁగ నేర్చు స♦న్మార్గదృష్టి?
  నేన ప్రతినను గలిపి ము♦న్నిట ధర్మ, మెవని కెఱిఁగింతు? నాకు మే♦ లెట్లుగాంతు?
౨౪౪౬

నిశ్చయము = నిజముగ- అనార్యుండై = అయోగ్యుండై- నెఱ=నిండు- ఆర్యహోలికన్=యోగ్యునివలె- శుచితావిహీనుండై=శుచిత్వములేనివాఁడై- శుచివిధమునన్=శుద్ధాత్మునివలె- అలక్షణ్యుండై=యోగ్యుల లక్షణములు లేనివాఁడై-లక్షణ్యువట్లు = యోగ్యతగలవానివలె- దుష్టశీలుఁడు = చెడునడవడిగలవాఁడు- సాధుశీలుమాడ్కిన్ = మంచినడవడి గలవానివలె- శ్రుతి=వేదమున- హిత = విధింపఁబడిన- కార్య=వైదిక కార్యములచేత- వర్జిత=విడువఁబడినదియు- లోకసంకరము=జనులందు సాంకర్యము గలిగించునదియు- న్యాయ్యము = న్యాయముతోఁగూడినది- కార్యవిచక్షణుఁడు=చేయఁదగినకార్యములను జేయుటయందు నేర్పరియగువాఁడు- దుష్టశీలుని=దుష్టాచారముగలవానిని- లోకనింద్యున్ = లోకులచే నిందింపఁబడువానిని- మున్నీటన్ = సముద్రమునందు- మున్నీరు = సముద్రము- మూఁడు + నీళ్ళు = మున్నీరు ద్విగువు- ఏకవచనాంతము- వాననీళ్ళు- ఏళ్ళనీళ్ళు- ఊటనీళ్ళు- ఈమూఁడు నీళ్ళు గలది.

## తాత్పర్యము.

వాస్తవముగ యోగ్యుఁడుకాకున్నను యోగ్యునివలె, శుద్ధాచారము లేకున్నను శుద్ధాచారము గలవానివలె, యోగ్యుల లక్షణములు లేనివాఁడయ్యు యోగ్యులవలె, దుష్టుఁడై శిష్టునివలె, వేదోక్తకార్యములు లేనిదై లోకమున సాంకర్యముగలిగించు నధర్మమును నాయట్టివాఁడు న్యాయ్యము ధర్మ్యమునని చెప్పితినేని యది చేయఁదగినది యిది చేయరానిదని తెలిసి కార్యములు చేయ సమర్థుఁడైన యోగ్యుఁడు నావంటి దుష్టవర్తనుని లోకనింద్యుని సన్మార్గుఁడని యెట్లు చూడఁగలఁడు? నేను జేసిన ప్రతిజ్ఞను సముద్రములోఁగలిపి సత్యము నాశముచేసి మీరు సత్యమం దుండుఁడని యెవరికి నేనేమని చెప్పుదును? అసత్యమాడి పరలోకసుఖ మెట్లుగందును? 'సత్యేన లోకాన్ జయతి' యని సత్యమునఁగదా యుత్తమలోకప్రాప్తి.

—• శ్రీరాముఁడు జాబాలికి సత్య మవశ్యానుష్ఠేయం బని బోధించుట. •—

కం. రాజే నాస్తికుఁ డైనను, భూజనతతి యిచ్ఛకోలఁది • పోకలఁ బోదే
రా జేపోకలఁ బోయిన, భూజనసంచయము లట్టి•పోకలఁ బోవున్. ౨౪౪౭

నాస్తికుఁడు = పరలోకము లేదు- దైవము లేదు-ఆత్మ లేదనువాఁడు-భూజనసంచయము=ప్రజలసమూహము.

## తాత్పర్యము.

యథారాజా తథాప్రజా యనున్యాయము ననుసరించి రాజు నాస్తికుఁడై దేవుఁడు లేఁడు పరలోకము లేదని చెప్పునేని లోకులు వారివారి యిష్టప్రకారము దొంగతనము అంకులతనము హత్యలు లోనైనవి చేయుచు వర్తింతురుగదా! అప్పుడు ధర్మము సత్యము ననునవి నశించునుగదా! నేను జెడుటయేకాక లోకులనందఱఁ జెఱచినవాఁడనై యీపాపముకూడ నేనేకదా యనుభవింపవలయును.

ఇచ్చట భగవద్గీతయందలి యీశ్లోకముల ననుసంధింపవలయును.

యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదే వేతరోజనః
సయత్ప్రమాణం కురుతే, లోక స్త దనువర్తతే.
యదిహ్యయం నవర్తేయం, జాతుకర్మ ణ్యతంద్రితః
మమవర్త్మాను వర్తంతే, మనుష్యాః పార్థసర్వశః
ఉత్సీదే యురిమాన్ లోకా, న కుర్యాం కర్మచే దహమ్
సంకరస్య చ కర్తాస్యా, ముపహన్యా మిమాః ప్రజాః భ-గీ. ౩-౨౧.

శ్రేష్ఠుఁ డెట్లుచేయునో వాఁడు చక్కఁగా దెలిసిచేయువాఁడను నమ్మకముతో నితరజను లట్లేచేయుదురు. వాఁడేది ప్రమాణమని చేయునో తక్కినవా రట్లులే వర్తింతురు. నేనొకసమయమందైనను గర్మముచేయకయుండిన నందఱు నామార్గమను సరించి కర్మములుచేయుట మానుదురు. కావున నేను గర్మముచేయనియెడల లోకము చెడును. సంకరమునకుఁ గర్త నేనై వారినందఱఁ జెఱిచినవాఁడ నగుదును.

రాజు సత్కార్యములుచేసిన నతనిసేవకులు లోనగువారట్లు చేయరు గాని రాజొక యకార్యముచేసిన సేవకులు పదియకార్యములు చేయుదురు. రాజొకసీసా సారాయము ద్రావిన సేవకులు పదిసీసాలు త్రాగుదురు.

శ్లో॥ రాజా రాక్షసరూపేణ, వ్యాఘ్రరూపేణ మంత్రిణః
సేవకాశ్చ శ్వరూపేణ, యథారాజా తథాప్రజా.
దురాచారోహిపురుషో, లోకే భవతి నిందితః
దుఃఖభాగీచ సతతం, వ్యాధితోల్పాయురేవచ. మను.

దురాచారము గలవాఁడు లోకనిందితుఁడగును. ఎల్లప్పుడు దుఃఖమనుభవించుచు- రోగియు నల్పాయువగును.

శ్లో॥ రాజ్ఞోహి పూజితో ధర్మ స్తత స్సర్వత్ర పూజ్యతే
యద్యదాచరతో రాజా తత్ప్రజాభ్యశ్చ రోచతే.

కం. సత్యదయారూపక మయి, నిత్యంబుగ రాజవృత్తి • నెగడును గాన
సత్యాత్మక మీరాజ్యము, సత్యంబే కుదురు సర్వ•జగముల కెపుడున్. ౨౪౪౮

ఇంతవఱకు రాజైనవాఁడు సత్యప్రవర్తనము గలవాఁడు కాఁడేని ప్రజలు వానిమార్గమవలంబించి చెడుదురని చెప్పి యిఁక సత్యానుష్ఠాన మవశ్యక కార్యమని చెప్పుచున్నాఁడు.

రాజవృత్తి=రాజుల జీవనము- సత్యదయారూపకము=సత్యము దయ యను నవి రూపముగాఁగలవి- సత్యాత్మకము=సత్యమే యాత్మగాఁగలది- కుదురు=చలింపని యాధారము.

తా త్ప ర్య ము.

సత్యము దయ యాధారముచేసికొని రాజులు జీవింపవలయును. ఆ రెండు లేనిరాజు పెక్కుకాలము రాజుగానుండఁజాలఁడు. ఈ ప్రజలకెల్ల సత్యమే యాత్మ. వారు సత్యమును విడిచిరేని జీవుఁడువిడిచిన దేహమే యగు. కావున సర్వజగము లకు సత్యమాధారము.

కం. సత్యంబె శ్రేష్ఠ మని యా,దిత్యులు మునిపుంగవులును ♦ దెలుతురు సతమున్
సత్యంబుఁ బలుకువాఁడే, సత్యంబుగఁ బరమపదముఁ ♦ జాలుం బొందన్. ౨౪౪౯

ఆదిత్యులు=దేవతలు- తెలుతురు=పొగడుదురు- సతతము=ఎల్లప్పుడు.

తా త్ప ర్య ము.

అన్నిటికంటె సత్యమే శ్రేష్ఠము దేవతలు మునులు సత్యమును సర్వదా స్తోత్రము చేయుచుందురు- వాస్తవముగ మోక్షమును గోరువాఁడు సత్యమునే పలుక వలయును.

కం. పామునకు వెఱచినట్టులు, భూమిజనం బనృతవాదిఁ ♦ జూడగని వెఱచున్
శ్రీమద్ధర్మమె సత్యము, హో ముని! స్వర్గమును సత్య♦మూలము సుమ్మా. ౨౪౫౦

అనృతవాదిన్=అసత్యము చెప్పువానిని- శ్రీమద్ధర్మము = సంపత్కరమగు ధర్మము.

తా త్ప ర్య ము.

కల్లలాడువానిని జూచి జనులు పామునకు భయపడినట్లు భయపడుదురు. సత్యమే ధర్మము సంపద కలిగించును- స్వర్గప్రాప్తికి మొదటికారణము సత్యమే.

కం. సత్యమున నుండు లక్ష్మియు, సత్యము చుమ యీశ్వరుండు ♦ జగముల కెల్లన్
సత్యము మూలం బంతకు, సత్యంబునకంటె లేదు ♦ శాశ్వతపదమున్. ౨౪౫౧

తా త్ప ర్య ము.

సత్యమే లక్ష్మీనివాసస్థానము- ప్రపంచమునకంతయు సత్యమే నియంత. సత్య మునకు లోపడి జగము నడచుచున్నది. సత్యమే ప్రపంచము నిలుచుటకు మూలా ధారము. మోక్షప్రాప్తికి సాధనము సత్యమును మించినది లేదు.

కం. దానంబును వేదంబును, ధ్యానము హోమంబు నిష్ఠ ♦ తప మిష్టంబున్
మానక సత్యాశ్రయములు, కాన నరుఁడు సత్యపరుఁడు ♦ గావలయుఁ జబిూ: ౨౪౫౨

తా త్ప ర్య ము.

దానము- హోమము- వేదము- ధ్యానము- తపము- నిష్ఠ- యాగము ఇవన్నియు సత్యమునాశ్రయించి యుండునవి- సత్యము విడిచినవానికి నివియేవియుఁ బనిచేయవు. కాఁబట్టి నరుఁడు సత్యమే ప్రధానముగాఁ గలవాఁడు గావలయును.

కం. ఒక్కఁడు లోకం బేలెడు, నొక్కఁడు వంశంబుఁ బ్రోచు • నుండు నరకమం
దొక్కఁడు స్వర్గముఁ దొక్కరుఁ, డిక్కరణిని భిన్నగతు ల • వేలా చెపుమా! ౨౮౫౩

తాత్పర్యము.

సత్యఫలమునఁ గాకుండిన నొకఁడు లోకమునంతయుఁ బాలించును- ఒకఁడు వంశమును రక్షించును- ఒకఁడు నరకమునకుఁ బోవును- సత్యనిష్ఠగలవాఁడు లోకమేలును- సత్యానుష్ఠానముచేతనే ఫలానుభవము భిన్నము. ఇది చార్వాకమత ఖండనము.

తే. సత్యసంధుఁడ నగుచును • జగతిఁ బరఁగి, బాస యొనరించి తప్పుట• పాడి యగునె
తాన జనకనియోగంబుఁ • గా దటంచు, నిట్టు నన నేర్చు నయ్యనా•యట్టివాఁడు. ౨౮౫౪

సత్యసంధుఁడను=నిజమైన ప్రతిజ్ఞగలవాఁడను- బాస = ప్రతిజ్ఞ- భాషాశబ్ద భవము- పాడి = న్యాయము- ఈయర్థమున నీపదమున నర్థానుస్వారము లేదు. జనక నియోగము=తండ్రియాజ్ఞ.

తాత్పర్యము.

బ్రాహ్మణుఁడా! లోకమున నింతవఱకు రామచంద్రుఁడు మాటచెప్పినా తప్పువాఁడుకాఁడు, అనుకీర్తిని సంపాదించితిని. అట్లుండఁ బ్రమాణముచేసి తప్పుట న్యాయ్యమగునా! సత్యమందిట్టి పట్టుదలగల నావంటివాఁడు తండ్రియాజ్ఞ నేవిధముగ 'నేను జేయను' అని చెప్పఁగలఁడు?

ఆ. లోభముననో రాజ్య•లాభంబుచేతనో, మోహముననో బుద్ధి•మోసముననో
జనకు నెదుట ననిన•సత్య మన్సేతువు, నఱకఁజాల దేని•కొఱకు నైన. ౨౮౫౫

లోభముననో=పిసినిగొట్టుతనముచేతనో- రాజ్యలాభముచేతనో = రాజ్యము కావలయునను నాశచేతనో- మోహముననో = బుద్ధి తాఱుమాఱగుటచేతనో-బుద్ధి మోసముననో=బుద్ధిపొరపాటుచేతనో- సేతువు=అనకట్ట.

తాత్పర్యము.

తండ్రియెదుట నేనొక సత్యముచేసితిని. అది లాభముకొఱకు చేసితిననుకో- లోభముచేఁ జేసితిననుకో- ఒకటియనుకొని మఱియొకటి చేసితిననుకో- లేక పొరపడి నాననుకో ఏకారణముచేనైన సరియె- యొకసారిచేసిన ప్రతిజ్ఞయను ధర్మసేతువు ద్రెంపనొల్లను.

ఏటి యావలియొడ్డునకు నీవలియొడ్డునకు నడుమనుండునది సేతువు. దాని నాధారముచేసికొని యీవలియొడ్డునా రావలియొడ్డు చేరుదురు. అట్టులే సత్యమను సేతువు నాధారముచేసికొని సంసారసముద్రమున నీవలనుండువా రావలిదరి చేరుదురు. అట్టియాధారమైనదానిని నేనిట్లు తెగఁగొట్టి యాత్మహాని గావించుకొందునా?

దీనివలన నొకసారి మాటచెప్పితిమేని యేకారణముచేనైన నేమి సరి నేను పొరపాటుపడి చెప్పితివనికాని నేనొకటి యనుకొనిన నది వేఱొకటి యైనదనికాని యేకారణముచేనైనను దానిని మీఱరాదు. ప్రాణము పోవునట్లుండినను జెప్పినట్లు జరుపవలసినదే యని సూచన.

నజాతుకామా న్నభయా న్నలోభాత్, ధర్మం త్యజేత్ జీవితస్యాపి హేతోః ॥

కామముచేతఁగాని, భయముచేఁగాని, లోభముచేఁగాని ప్రాణరక్షణము నిమిత్తమైనను ధర్మము దప్పరాదు.

కం. చలచేతస్కుఁడు సత్పథ,చలితుండును గల్ల లాడు•జనుఁ డిడుశ్రాద్ధం
బులు యాగంబులు పితరులు, నిలింపులు గ్రహింప రన ము•నీ! విన మొకో. ౨౮౧౬

చలచేతస్కుఁడు=చపలచిత్తుఁడు– సత్పథచలితుఁడు = సన్మార్గమునుండి చలించినవాఁడు– కల్లలాడుజనుఁడు=అసత్యములు చెప్పువాఁడు– నిలింపులు=దేవతలు.

తా త్ప ర్య ము.

చపలచిత్తుఁడు సన్మార్గమునుండి తొలఁగిపోయినవాఁడు– అసత్యములు చెప్పువాఁడు– ఈ ముగ్గురు యాగాది దేవతాకార్యములు చేసినదానిని దేవత లంగీకరింపరు. శ్రాద్ధాది పితృకార్యములు చేసినఁ బితృదేవత లంగీకరింపరు. అని శాస్త్రములు చెప్పుచుండుట మునీశ్వరుఁడా! మనము వినలేదా?

సీ. ప్రత్యగాత్మంబు ధ•ర్మంబు సత్యాత్మంబుఁ, బ్రత్యక్షముగఁ జూచు•వాఁడ నేను
సజ్జనాచరితంబు • సత్యధర్మార్థంబు, నే జటాధారంబు • నెట్లుధరింతు
ధర్మలేశాన్వితా•ధర్మంబు లుబ్ధులు, పాలసుల్ క్రూరులు • పాపరతులు
సేవింపఁ దగిన దు•ర్భావంపుక్షత్రియ,ధర్మంబు విడిచితిఁ • దాపసేంద్ర

ఆ. మనసునందు నఘము • మాటి కాలోచింప, జిహ్వచేతఁ గల్లఁ • జెప్పు చుండఁ
గాయమునను బాప•కార్యంబుఁ గావింప, ముత్త్రివిధములఁ బాప•ములు లభించు. ౨౮౧౭

సత్యాత్మంబు=సత్యమే స్వరూపముగాఁగల యాధర్మము– ప్రత్యగాత్మంబు = ఏవేళయందైనను ఆత్మనువిడిచి యుండనిదానిఁగా– ప్రత్యక్షముగ = ఎదురుగానున్న దానిని జూచినట్లు చూచుచున్నాను– సజ్జనాచరితంబు = సజ్జనులచే నాచరింపఁబడినది–సత్యధర్మార్థంబు=సత్యమునిమిత్తముధర్మమునిమిత్తము–సత్యస్వరూపమైనధర్మము కొఱకు– జటాధారము=జడలను– ధర్మలేశాన్వితాధర్మంబు=కొంచెము ధర్మముతోఁ గూడిన యధర్మము– లుబ్ధులు=పిసినారులు– పాలసుల్=జ్ఞానములేనివారు–పాపరతులు = పాపమునం దాసక్తిగలవారు– దుర్భావంపు = చెడునభిప్రాయముతోఁ గూడినది యగు– క్షత్రియధర్మంబు = రాజనీతిని– అఘము=పాపము– జిహ్వ=నాలుక– కల్ల=

అసత్యము- కాయము=దేహము- ముద్విధములన్ = మూఁడువిధముల- ఇది మిశ్ర ద్విగువు కావున బహువచనము.

### తాత్పర్యము.

సత్యమే స్వరూపమునుగాఁగల ధర్మమార్గము విడిచి యుండువది కాదు. అది యట్టిదని నేను గనులఁ జూచుచున్నాను కావున సత్పురుషు లాచరించినది యగు జడలుధరించుటగల వానప్రస్థాశ్రమమును సత్యము ధర్మమునిమిత్తమై నేను ధరింతును. క్షత్రియధర్మమందుఁ బాపభాగ మెక్కువ ధర్మభాగము కొంచెము కావున దానిని ఆశాపాతకులు బుద్ధిహీనులు హింసాది క్రూరకర్మములు చేయువారు పాపమందాసక్తి గలవారు సేవింతురు. కావున దానిని వదలితిని. పాపకార్యము నాలోచించుటచే నది చేయకపోయినను బాపమువచ్చును. ఇది మానసికము. అసత్యము నోటితోఁ జెప్పినను బాపమువచ్చును. ఇది వాచకము. దేహముతోఁ జేయుటచేత నీమూఁడు విధములఁ బాపమువచ్చును.

పుణ్యములుగాని పాపములుగాని మనుష్యులకు మూఁడుమార్గములవచ్చును. మనస్సున నాలోచించుట- వాక్కుతోఁజెప్పుట- దేహముతోఁజేయుట-మనస్సుతోఁ జేసిన పుణ్యఫలముగాని పాపఫలముగాని స్వప్నములం దనుభవించును. వాక్కుతోఁ జేసిన పుణ్యపాపములు వాక్కుచేతనే యనుభవమునకు వచ్చును. మనము మాటలచే మాత్ర మొకరిని సంతోషపెట్టిన మనల నెవ్వరో మాటలచే మాత్రమే సంతోషపెట్టుదురు. దేహముతోఁ జేసినది దేహముతోనే నరకమందు స్వర్గమందు మరల భూలోకమందు ననుభవింపవలెను. కలయుగమున నొకవిశేషముగలదు.

ఉ. చేసినఁగాని పాపములు చెందవు చేయఁదలంచి నంతటన్
　చేసెదనన్న మాత్రమునఁ జెందుఁగదా కలివేళఁ బుణ్యముల్. భాగ. 1. 442 ప.

కలియుగమునఁ బాపము క్రియారూపముగఁ జేసిననే వచ్చునుగాని చేసెద నని సంకల్పించినను జేసెదనన్నను రాదు. పుణ్యముచేసెద నని నిండుమనస్సుతో సంకల్పించిన నాకార్యముచేసినపుణ్యము వచ్చును.

శ్లో॥ యత్కృతే దశభిర్వర్షైః। త్రేతాయాం హాయనేనతత్
　ద్వాపరే తచ్చమాసేన, చాహోరాత్రేణ తత్కలౌ.

కృతయుగమునఁ బదిసంవత్సరములు చేసినది త్రేతయం దొకసంవత్సరము ద్వాపరమం దొకనెల కలియందు నొక యహోరాత్రముచేసిన వచ్చును. ఈవిధముగ తపస్సు బ్రహ్మచర్యము జపము కలియందు ఫలించును.

మీఁదఁజెప్పిన మూఁడు మరల సత్త్వము- రజస్సు- తమస్సు నను భేదములచే మూఁడువిధములు- దానినిబట్టి ఫలానుభవము- ఏపుణ్య మెవరెట్లుచేసినను సమాన ఫలమురాదు.

శ్లో॥ నియతం సంగరహిత మరాగద్వేషతః కృతమ్
అఫలప్రేప్సునాకర్మ, యత్త త్సాత్త్విక ముచ్యతే
యత్తుకామేప్సునాకర్మ, సాహంకారేణవా పునః
క్రియతే బహుళాయాసం తద్రాజస ముదాహృతమ్
అనుబంధం క్షయం హింసా, మనపేక్ష్యచ పౌరుషమ్
మోహా దారభ్యతేకర్మ యత్తత్తామస ముచ్యతే॥ భ-గీ. 18-అధ్యా.

ఫలేచ్ఛలేనివానిచేత, స్వవర్ణాశ్రమోచితమగు నేకర్మము కర్తృత్వాదులందు సంగములేకయుఁ గీర్త్యకీర్తులయందు రాగము ద్వేషము వదలియు అవశ్యము చేయఁదగినదే యనుతలంపుతోఁ జేయఁబడుచున్నదో యది సాత్త్వికము. నేనీకార్యము మిగుల శ్రమపడి చేసితినని కర్తృత్వాభిమానముతో ఫలముఁగోరి చేయుకర్మము రాజసము. ఈకార్యముచేసిన పుణ్యమువచ్చునా? పాపమువచ్చునా? యేమిఫలము వచ్చునని యాలోచింపక వ్యర్థధననాశము- హింస- తనసామర్థ్యము ఆలోచింపక వాస్తవకర్త భగవంతుఁడను జ్ఞానములేక చేయుకర్మము తామసము.

మొదటి సాత్త్వికకర్మమునకు శ్రీరామచంద్రమూర్తి దృష్టాంతము. రెండవదానికి మునిబాలునిఁ జంపిన, కైకకు వరములిచ్చిన దశరథుఁడు దృష్టాంతము.

క్షత్రియధర్మంబు విడిచితినని రామచంద్రమూర్తి చెప్పెనే స్వధర్మరక్షా దీక్షాదక్షుఁడైన శ్రీరామచంద్రమూర్తి యిట్లుచెప్పుట స్వవ్రతభంగముఁగదా. 'క్షత్రియస్య పరోధర్మః ప్రజానామేవ పాలనమ్' క్షత్రియులకుఁ బ్రజాపాలనమే పరమధర్మమనియుండ నట్టిస్వధర్మము నుత్తమధర్మమునుదండ్రియెదుట మాట చెప్పితిననియుల్లంఘింపవచ్చునా? అదియునుగాక "శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్। స్వధర్మే నిధనంశ్రేయః పరధర్మో భయావహః॥ తగస్వనుష్ఠిత పరధర్మంబుకంటె। విగుణమైనను మేలు స్వీయధర్మంబు। మరణమైనను స్వధర్మంబునమేలు।పరధర్మమెప్పుడు భయకారణంబు॥" అని కలదుగదా. ఒకవేళ కొంచెము దోషంబుతో రాజ్యము సంపాదించినను దానికిఁ దగిన ప్రాయశ్చిత్తము యజ్ఞాది రూపములఁ బెట్టుకొనవచ్చునుగదా యని సందేహము.

సజ్జనుల సన్నిధియందిట్లు ప్రతిజ్ఞచేసి రాజ్యమునిమిత్తమై యెవఁడు దానిని విడుచునో? అహ్యుఁడగువానికి ధర్మమువదలి రాజ్యముచేయుటకంటె మరణముమేలు. అధర్మమునకంటె మరణముచెడ్డదికాదు నాసత్యప్రతిజ్ఞను వినుము. దేవత్వమునకంటెఁ బ్రాణమునకంటె రాజ్యమునకంటెఁ గొడుకులకంటె యశస్సుకంటె ధనముకంటెఁ బ్రతిజ్ఞ సత్యమగుటయే నేను గోరెదను. ఇవియన్నియు సత్యమునందలి యాఱవభాగమునకు సరిబోలవు.

చం. మతిజల పూరితంబులగు నూతులు నూటిటికంటె సూనృత
వ్రత యొకబావిమేలు మఱిబావులు నూటిటికంటె నొక్క-స

క్రతుశతవదిమేలు తత్క్రతుశతంబునకంటె సుతుండుమేలు త
త్సుతశతకంబుకంటె నొక సూనృతవాక్యముమేలు చూడఁగన్.

కం. వెలయఁగ నశ్వమేధం,బులు వేయును నొక్కసత్యమును నిరుగడలన్
దులనిడి తూఁపఁగ సత్యము, వలనను ములుసూపు గౌరవంబున పేర్మిన్.

గీ. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద, సమధిగమము సత్యంబుతో సరియఁగావు
ఎఱుఁగుమెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద,యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.

వ. రాజ్య పదస్థుండైన క్షత్రియుండు భూరిదక్షిణంబులైన యజ్ఞంబుల దేవబ్రాహ్మ
ణులకుఁ దృప్తిఁజేసి బ్రాహ్మణులకు నగ్రహారంబులు గోసహస్రంబులు నిచ్చి
దురితంబుల వలనం బాసి తమోవిముక్తుండైన చంద్రుండునుం బోలె వెలుంగు".

భార. అర. 1 ఆశ్వా అనిసందేహము.

క్షత్రియులకు రాజ్యపరిపాలనము ప్రతిజ్ఞాపరిపాలనము రెండును స్వధర్మం
బులే. అందు మొదటిదానికంటె రెండవది యుత్తమము; కావున దానిని శ్రీరామ
చంద్రమూర్తి స్వీకరించెను. మహాభారతంబున ధర్మరాజు భీమున కిట్లు చెప్పెను.

శ్లో॥ తం సంధి మాస్థాయ సతాం సకాశే, కోనామ జహ్యాదిహ రాజ్యహేతోః
ఆర్యస్య మన్యే, మరణాద్గరీయో యద్ధర్మ ముత్సృజ్య మహీం ప్రశాసేత్.
మమ ప్రతిజ్ఞాంచనిబోధ సత్యాం వృణే సత్యమమృతాజ్జీవితాచ్చ
రాజ్యంచ పుత్రాశ్చ యశోధనంచ సర్వం న సత్యస్య కలాముపైతి.

భీమ దుర్యోధనుల గదాయుద్ధంబున దుర్యోధను తొడలు విఱుఁగఁగొట్టిన
భీమునిపై బలరాముఁడు కోపించినపుడు కృష్ణమూర్తి.

"దుర్యోధనస్యగదయా, భంక్తాస్మ్యూరూ మహాహవే
ఇతిపూర్వం ప్రతిజ్ఞాతం, భీమేన హి సభాతలే
ఆనృణ్యం యాతు వైరస్య, ప్రతిజ్ఞాయాశ్చ పాండవః
అతో దోషం నపశ్యామి, మాక్రుద్ధస్త్వం బలంవహన్.

"ప్రతిన నెఱపుట నృపులకుఁ బరమ ధర్మ
మగుట మనమునఁ జింతింపు మా లసుతుఁడు
గద సుయోధను తొడలు భగ్నములు సేయ
వాఁడు గా సభఁ బూనిన వాఁడుగాడె.

ఈలేఁదున్ దనదు ప్రతిజ్ఞకై రిపు గదాహతుఁ జేసె నధర్మమేలగున్

భారత యుద్ధంబునఁ గర్ణుచేఁ బరాభవింపఁబడిన ధర్మరాజు నర్జునుని రోషం
బున నీవిల్లు మఱియొకని కీయరాదా యనిన నర్జునుండు కోపించి—

కం. విను మొరులకు గాండీవ మిమ్మని నన్నెవ్వండు పలికె నతని శిరము గ్ర
క్కునఁ బగుల వ్రేయుటకుఁ జేసినవాఁడఁ బ్రతిజ్ఞ నాదు చిత్తములోనన్.

గీ. ఇట్టి కష్టపుఁ గేలికై యిట్లు సేయఁ బ్రతిన పట్టుట దగ దె యప్పలుకు నీవు
వినఁగ నిలఁడాడ నిమ్మహీవిభుఁడు ధర్మ వంతుఁడగుఁగాక చంపనవలయుఁగృష్ణ.

వ. చంపి పాలితప్రతిజ్ఞుండనైన నాకు ససత్యంబు రాకుండఁ బరిహరించెద" ననెను.

కావున క్షత్రియులకు రాజ్యపరిపాలనముకంటెఁ బ్రతిజ్ఞాపాలనమే శ్రేష్ఠము. ఇది స్వధర్మత్యాగముకాదు హరిశ్చంద్ర చరిత్రము స్మరించునది. రాజగువాఁడు ప్రతిజ్ఞ చేసి తప్పనేని వానిమాట నెవ్వరు మరల నమ్మెదరు? ప్రజలవిశ్వాసము సంపాదింపని రాజేమిరాజు? రాజసత్యమాడినఁ బ్రజలేలయాడరాదు? ప్రజలంద ఆసత్యము మరగిన లోకముగతి యేమగునో? కావున రాజు ప్రజాపాలనము మానిన మాన వచ్చును గాని సత్యప్రతిజ్ఞత్వము మానరాదు.

కం. ధర కీర్తియశోలక్ష్ములు. పురుషున్ సత్యైకనిష్ఠుఁ • బొందును దనిచే
సురభూమి కరుగుఁ దోడుగఁ, బురుషుఁడు సత్యంబు నెట్లు • పోకార్పఁ దగున్.
౨౮౧౮

కీర్తియశోలక్ష్ములు=యశస్సు- బలపరాక్రమములచే సంపాదించు గొప్పపేరు- కీర్తి- దాన యజ్ఞాదులచే సంపాదింపఁబడునది- సీ- తపనీయ దండైక ధవళాతపత్రి తోద్దండ తేజః కీర్తిమండలుండు- నైష- లక్ష్మి = సంపద- సత్యైకనిష్ఠున్=సత్యమే ప్రధాననిష్ఠగాఁ గలవానిని- పోకార్పన్=నాశముచేసికొన.

తాత్పర్యము.

• సత్యమే ప్రధానముగాఁగల పురుషునికి కీర్తియశస్సు లక్ష్మి తమంతటఁదామే వలచి వచ్చును. ఈలోకమున నివి సమకూర్చుటేకాక సత్యము స్వర్గలోకమునకుఁ దోడుగఁబోయి దివ్యసుఖములను గలిగించును. ఇట్టి సత్యమును నెవఁడు విడనాడును?

సీ. ఎంత యాలోచించి • యిది మేలటంచును, ఠక్కుమాటలనీవు • నొక్కి యనిన
చెవఁటిధర్మం బెట్లు • చేయఁగ నోపుదుఁ? బార్థివేంద్రునిముందు • బాసఁ జేసి
భరతునిమిత్తమై•గురువాక్య మే నెట్లు, తుంగలలోఁ ద్రొక్కి • భంగపఱుతుఁ
ని మున్న నాయన్న • ప్రతినకై కైకేయి, హర్షించెఁ దా నేమి•యాత్మనెంచు

ఆ. నిపుడు మాటఁ దప్పు; • విపినవీథులయందు, నియతభుక్తిఁ గొంచు • నిష్ఠఁ బూని
పూలఁ బండ్ల మూల•జాలంబులను బిత్రు,దేవతామరులకుఁ • దృప్తి నిడుదు.
౨౮౧౯

ఠక్కుమాటలన్=మోసపుమాటలచే- విపినవీథులయందున్=అడవిప్రదేశము లందు- నియతభుక్తిన్ = క్షత్రియవానప్రస్థులకు శాస్త్రమున నియమింపఁబడిన యాహారము.

తాత్పర్యము.

నీ వెంతయో యాలోచించి మోసపుమాటలచే నీవు చెప్పినది మేలనినొక్కిచెప్పి నను నే నెట్లధర్మము చేయఁగలను? రాజు నెదుట భరతునిమిత్తమై చేసిన ప్రమాణమును

నే నెట్లు ధ్వంసముచేయుదును! పూర్వము తనమాగనిమెదుట నేను జేసిన ప్రమాణమునకై కైకయెంతో సంతోషించెను. ఇప్పుడు నేనామాటతప్పిన నిప్పుడామె యేమి యెంచును! ఇప్పుడామె యంగీకరించెనందువా! యది మీా బలాత్కారముచే నైనది కాని స్వబుద్ధిపూర్వకమైనదికాదు. స్వబుద్ధిపూర్వకమైనచో నిట్లు చేసియేయుండదు. కాఁబట్టి వానప్రస్థులకు నియతమైన యాహారము పండ్లు- పూలు- గడ్డలు లోనైన వానిచే దేవతలకుఁ బితృదేవతలకుఁ దృప్తికలిగించి యువవులందుండును. ఇది జనపాలనశీలివి గమ్ము రాఘవా యను జాబాలిమాటకుఁ బ్రత్యుత్తరము.

ఇప్పటి ప్రాజ్ఞమానులు గొందఱు జాబాలి ప్రశ్నలకన్నిటికిఁ బ్రత్యుత్తర మీాయలేక యొక సత్యమునుమాత్రమే స్థాపించెనందురు. ఇది యాలోచన లేని మాట, ఏలన; శ్రీరామచంద్రమూర్తి భరతునితోఁ జెప్పినదంతయుఁ దల్లిదండ్రుల యెదుట నే నరణ్యమునకుఁ బోదునని ప్రతిజ్ఞ చేసితిని. నీవెన్ని చెప్పినను అసత్యమును నేను మీాఱఁజాలను. రాజ్యపాలనముకంటె సత్యపరిపాలనమే శ్రేష్ఠమని త్రిప్పి త్రిప్పి చెప్పెను. ఆయభిప్రాయము తప్పని జాబాలిమతము. లోకమునందు సత్యాసత్యములు, ధర్మాధర్మములు, పుణ్యపాపములు, వాని యనుభవించు నాత్మ లేదని కావున నసత్యమాడిన దోషము లేదని జాబాలివాదము.

కావున సత్య మనుష్ఠేయమగునా కాదా! యనునది ముఖ్యముగ విచారింపవలసిన విషయము. కావున దానిని స్థాపించెను. ఎప్పుడు సత్యమనుష్ఠేయమని సిద్ధాంతిత మయ్యెనో యప్పుడే ధర్మాధర్మములు పుణ్యపాపము లున్నట్లు సిద్ధాంతపడెను. ఈఫల మనుభవించు నాత్మ లేదను జాబాలిమాటకు నేను గన్నులార నట్టి యాత్మను జూచుచున్నానని శ్రీరామచంద్రమూర్తి చెప్పెను. (౨౮౫౭ ప. ప్రథమ పాదము) తనకొక్కనికి నాత్మయుండుట తెలిసిన నేమిలాభమందురు గాఁబోలు; తనవిషయమైన ప్రస్థావన గావునఁ దాను జూచెదనని చెప్పెను. కాని యితరులకెవ్వరికిఁ దెలియరాదని చెప్పలేదు. జ్ఞానదృష్టిగలవారికిని, యోగసమాధియందుండువారి కందఱకు నిదిగోచరించును. ఇట్టివారెందఱో గలరు.

ఉత్క్రామంతం స్థితంవాపి, భుంజానం వాగుణాన్వితమ్
విమూఢానాను పశ్యంతి, పశ్యంతి జ్ఞానచక్షుషః. భ-గీ.

దేహమువిడిచి పోవువానిని, దేహమునం దుండువానిని, అట్లుండి గుణముల ననుభవించువానిని జ్ఞాననేత్రములు గలవారు చూతురు గాని మూఢులు చూడలేరు. అని కృష్ణమూర్తి సెలవిచ్చెను. రామచంద్రమూర్తిమాట కృష్ణమూర్తిమాట యటుండనిండు. ఈకాలమున రామకృష్ణ పరమహంసగారిని వివేకానందస్వాములవారు "నీవు దేవునిఁ జూచితివా" యని యడిగెను. "నీకంటె స్పష్టముగాఁ గానవచ్చుచున్నాఁ"డని యాయన బదులిడెను. మఱియొకఁడు దేవుఁడుగలఁడని నీకు నమ్మకము గలదా! యనెను. నమ్మకమేమిటి నేను గన్నులారఁ జూచుచున్నానే

యనెను. ఇప్పుడు పాశ్చాత్యదేశములందు నాత్మసాక్షాత్కార మైనవారు కొందఱు గలరు. Cosmic Consciousness లోకములోని నాస్తికులందఱుఁ గలిసియుఁబరమహంసగారి యభిప్రాయము మార్పఁగలరా? నూఱుగురు పుట్టుగ్రుడ్డులు సూర్యుఁడు లేఁడని వాదించినను గన్నులుగలవాఁడు వారిమాటల నమ్మునా? ఎప్పుడు సత్యప్రశస్తి ఆత్మనునికి స్థాపితమయ్యెనో జాబాలి వాదమంతయు సమూలము హతమయ్యెను. దానికి వేఱు ప్రత్యుత్తర మీయవలసిన పనియేలేదు. కావున శ్రీరామచంద్రమూర్తి వ్యర్థభాషణము లాడలేదు.

వైదికవాద మటుండనిచ్చి చార్వాకులగు వారివాదప్రకార మేమి తేలునో చూతము వారు పృథివ్యప్తేజో వాయువులను నాలుగుభూతములు కలిసిన సున్నము పసుపు గలసిన నెఱ్ఱరంగు పుట్టినట్లు, కొన్నివస్తువులుచేరిన మత్తుగుణము పుట్టినట్లు చైతన్యము పుట్టునని యెంచవలయు నందురుగదా! ఉపమాన బలముచేఁగదా వీరిట్లు చెప్పుట. ఆ యుపమానమునే మనమాశ్రయింతము. లోకమునందు వడ్రంగిలేక, వానికి శక్తిలేక, కొయ్యలు, కొయ్య మొదలగు పదార్థములులేక యేగృహమైనను నిర్మింపఁబడలేదు. తనంతటఁదానే పుట్టినయిల్లులేదు. అట్లులే, సృష్టికర్త-వానిశక్తి-జీవులు- ప్రకృతిలేక ప్రపంచము నిర్మింపఁబడలేదని యెంచవలయుననిన వారేమిప్రత్యుత్తర మీయఁగలరు? ఆ నాలుగుభూతములు కలిసినంత మాత్రముననే చైతన్యము పుట్టునని ప్రత్యక్షముగా వీరేల కనఁబఱుపరాదు? ఒకపాశ్చాత్యుఁడు కోడి గ్రుడ్డులను సృష్టింపనెంచి యందుఁ బ్రకృతివస్తువు లెట్లెట్లు కలిసి గ్రుడ్డులయ్యెనో యావిధము గనే కొన్ని సిద్ధముజేసి నిజమైన కోడిగ్రుడ్డులతో పాటు వీనిని కోళ్ళక్రిందఁ బొదుగుటకై యుంచెను. వీఁడుంచిన కృతిమపుగ్రుడ్లుతప్పఁ దక్కినవన్నియుఁ బిల్లలయ్యెను. వీఁడు సృష్టించిన వట్టులే యుండెను. అప్పుడు వాఁడు హా! నాదైవమా యని కేక వేసెను.

ఇట్లు పాశ్చాత్యులు వ్రాసియున్నారు. భూతములు నాలుగు కలసినంతనే చైతన్యము పుట్టదు. దీనికంటె భిన్నమైన ప్రాణశక్తి మఱియొకటి కలదు. అది జగత్కర్త స్వాధీనమందున్నది. ఇంట శ్రాద్ధముపెట్టిన బాటసారికిఁ గడుపునిండునా? యనుట సరిగాదు. మనశరీరము లన్నగతప్రాణములు. పృథివి విశేషించి యుండునది కావునఁ బ్రత్యక్షముగ భుజించిననే దేహము నిలుచును. దేవతలది మనోమయ దేహములు. కావున వారీయన్నము దినఁజాలరు. వారికి మనోమయమైన యన్నమే గావలసియున్నది. కావుననే దేవతలు చూపులచే నాహారము గ్రహింతురని చెప్పఁబడెను. అదియునుగాక, శ్రద్ధా సమన్వితైర్దత్తం, పితృభ్యో నామగోత్రతః। యదాహారస్తు తేజాతా, స్తదాహార త్వమేతితత్ ॥ శ్రద్ధతోఁ బితరులకు నామగోత్రములు చెప్పి పెట్టెడు పిండము ఆయావారి కేది యాహారమో యదిగా వారల కందును. పితరులు స్వర్గమందుండిరా యమృతముగను, మనుష్యులందుండిరా యన్న

ముగను, పశువులయందుండిరా పచ్చికగను నందును. వి-పు. 8-16-15. శ్రద్ధతోఁ బెట్టఁబడునది శ్రాద్ధము. శ్రద్ధమనోవ్యాపారము కావున మనము పితరుల నుద్దేశించి శ్రద్ధతోఁ బెట్టితిమేని వారును మనశ్శక్తిచే వానియందలి ప్రాణధారక సూక్ష్మాంశముల గ్రహింతురు. కావున శ్రాద్ధములు వ్యర్థములని బుద్ధిగలవారు చెప్పరు.

ఆత్మవిచారమందు (అతీంద్రియ వస్తువిచారమందు) శాస్త్రమే ప్రమాణము. తర్కయుక్తులుగావు. ఊహాలోకరిబుద్ధి యనుసరించియుండును. వానిని నమ్మరాదు. ఒకఁ డొకబాటప్రక్కఁ బరుండి నిద్రించుచుండెను. అతోవఁబోవు నొకఁడు వానిని మహాయోగి సమాధియందున్నాఁడని తలఁచెను. మఱియొకఁడు తప్పఁద్రాగి పడినాఁడనుకొనెను. మఱియొకఁడు బాగుగఁ గష్టముచేసి గాఢనిద్రయం దున్నాఁడనెను ఇవన్నియు నూహాలే. ఇందేయూహ ప్రమాణము కావున శాస్త్రాధారములేని యూహ ప్రమాణము కాఁజాలదు.

—• జాబాలికి శ్రీరాముఁడు కర్మం బవశ్యకర్తవ్యం బని చెప్పుట •—

కం. సంతుష్టేంద్రియుఁడను ధుత,చింతారతి లోకయాత్రఁ • జేసెద శ్రద్ధా
వంతుఁడనై నిష్కలుష,స్వాంతంబున సాధుకార్య•సంగతి దనరన్. ౨౬౦

ఇంతవఱకు సత్యము శ్రేష్ఠత్వముచెప్పి యిఁకఁ గర్మానుష్ఠాన మవశ్యమని చెప్పుచున్నాఁడు.

*సంతుష్టేంద్రియుఁడను = సంతోషించిన పంచేంద్రియములు గలుగుటచే ధుత = ఎగురఁగొట్టఁబడిన- చింతా = వ్యసనము- అరతి = అసౌఖ్యము- శ్రద్ధావంతుఁడనై = శాస్త్రమునందుఁ గర్మఫలంబునందు విశ్వాసముగలవాఁడనై - నిష్కలుష స్వాంతంబునన్=పాపరహితమైన మనస్సుతో- సాధుకార్యసంగతిన్ = సాధువులుగానుండువారు చేయఁదగు సత్కార్యముల కూడికచే- లోకయాత్ర = పితృవాక్య పరిపాలనమనెడి లోకధర్మము- చేసెదన్=చేసెదను.

తా త్ప ర్య ము.

అది లేదాయెనే యిదిలేదాయెనే యను విచారముగాని లభించిన దానియం దప్రీతిగాని లేక లభించినవానితోఁ బంచేంద్రియములను సంతోషపెట్టుచు శాస్త్రమునందుఁ గర్మఫలమునందు నమ్మకము గలవాఁడనై పాపరహితమైన మనస్సుతో సత్కార్యములు చేయుచుఁ బితృవాక్యమును బరిపాలించుచుఁ గాలము గడపెదను.

ఆ. కర్మభూమిఁ దీనఁ • గావింపవలయును, బుణ్యకర్మములను • బురుషు లెపుడు
వాయు వగ్నిశశియు•స్వకృతకర్మంబుల,ఫలముచేత వారి•పదముఁ గనిరి. ౨౬౧

శ్రాద్ధాదుల నుదాహరించి సకలవైదిక కర్మములును నిష్ప్రయోజనములని జాబాలి యన్నమాటకు రామచంద్రమూర్తి ఖండనము చెప్పుచున్నాఁడు.

## తా త్ప ర్య ము.

ఇది యీభూమండలము కర్మభూమి కావున నిందుండువారు కర్మములే చేయ వలయును. ఊర్ధ్వలోకములు ఫలభూములు; ఇక్కడ చేసిన కర్మములఫలము నక్కడ ననుభవింపవలయును. ఇచ్చటఁ బుణ్యముచేసినవాఁడు అక్కడ సుఖమనుభవించును. ఇచ్చటఁ బాపముచేసినవాఁడు అచ్చట దుఃఖ మనుభవించును. కావున నిచటఁ బుణ్యకర్మములే చేయవలయును. అట్లు పుణ్యకర్మములు చేసిన మనుష్యులే వారివారి పుణ్యకర్మముకొలఁది వాయువుగా నొకఁడు అగ్నిగా నొకఁడు చంద్రుఁడుగా నొకఁడు పుట్టును.

సూర్యుఁడు, చంద్రుఁడు, అగ్ని, ఇంద్రుఁడు, బ్రహ్మ, రుద్రుఁడు లోనైనవి యుద్యోగపదవులు; మనుష్యులలో నెవఁడెవ డేసంకల్పముతో నేకర్మము లాచరించునో యాకర్మములకు ఫలముగా వాఁడేయుద్యోగపదవి కర్హుఁడో, వానికాపదవి యియ్యఁబడును. వీరందఱు కొంతకాలము (కొన్నికల్పములు) ముందు మనవలె నున్నవారే. వారువారు చేసిన పుణ్యఫలముకొలఁది నాయాస్థానము లలంకరించిరి. కావునఁ గర్మములకు ఫలములేదనరాదు.

ఇహ యత్క్రియతే కర్మ, తత్పరత్రోపి యుజ్యతే
కర్మభూమి రియంబ్రహ్మన్, ఫలభూమి రసౌ మతా. అరణ్యపర్వము.
ఈలోకమునఁ జేసినకర్మము పరలోకమున నుపయోగపడును. ఇది కర్మభూమి.

### భరతవర్ష ప్రశంస.

తత్రాపి భారతం శ్రేష్ఠం, జంబూద్వీపే మహామునే
యతోహి కర్మభూరేషా, అతోన్యా భోగభూమయః
అత్రజన్మ సహస్రాణాం, సహస్రైరపి సత్తమ
కదాచిల్లభతే జంతు, ర్మానుష్యం పుణ్యసంచయాత్.
గాయంతి దేవాః కిలగీతకాని, ధన్యాస్తుయే భారత భూమిభాగే
స్వర్గాపవర్గాస్పద మార్గభూతే, భవంతి భూయః పురుషా స్సురత్వాత్
కర్మాణ్య సంకల్పిత తత్ఫలాని, సన్న్యస్య విష్ణౌ పరమాత్మరూపే
అవాప్యతాం కర్మమహీమనంతే, తస్మింలయం యేత్వమలాః ప్రయాంతి.
జానీమనైతత్క్వపయా విలీనే. స్వర్గప్రదే కర్మణి దేహబంధం
ప్రాప్స్యామి ధన్యాః ఖలుతే మనుష్యా, యేభారతే నేంద్రియ విప్రహీనాః.

మునీంద్రా! జంబూద్వీపమందు భరతవర్షమే శ్రేష్ఠము. ఇది కర్మభూమి. తక్కినవి భోగభూములు. వేయివేల సంవత్సరములు గడవఁగా నెపుడో మనుష్య జన్మము లభించును. తెలిసియో తెలియకయో చేసిన కర్మమువలననే యుద్భిజ్జములు స్వేదజములగును. స్వేదజము లండజములగును. అండజములు జరాయుజములగును.

అందుఁ గడపట మనుష్యజన్మము లభించును. ఆవల సురత్వమువచ్చును. అందుండి మరల స్వర్గమునకు మోక్షమునకు మార్గభూమియగు భరతవర్షంబునఁ బుట్టినవారే ధన్యాత్ములు. ఫలములుగోరక ఫలము పరమాత్మయగు విష్ణువునకు సమర్పించు నిర్మలులు, విష్ణులోకమునకుఁ బోదురు. స్వర్గమునకుఁబోయి మరలజన్మములకు వచ్చువారెందుఁ బుట్టుదురో నిశ్చయము తెలియదు. కర్మసాధనములు కన్నులు కాళ్ళు లోనగు నింద్రియముల వికలతలేక మనుష్యులుగా భారతంబునఁ బుట్టువారేధన్యులు. పూర్వకృత పుణ్యావశమున నీదేశమునఁ బుట్టియుఁ గన్నులు కాళ్ళు చక్కఁగా నుండియు శాస్త్రీయ సత్కర్మములు చేయనివారు భ్రష్టులు.

కం. క్రతువులనూఱిటి నొనరిచి,శతమన్యుఁడు స్వారపదము ♦ సంపాదించెన్
వితతో గ్రతపోనిష్ఠల, నతులితదివ మందఁ జాలి ♦ రఖిలమహాస్థుల్. ౨౮౬౨

క్రతువులన్=యజ్ఞములను- శతమన్యుఁడు=ఇంద్రుఁడు- స్వారపదము = స్వర్గపదము- వితతో గ్రతపోనిష్ఠలన్ = విస్తారమైన తపస్సులయందలి నిష్ఠలచే- అతులిత దివము=అసమానమైన స్వర్గము- చాలిరి=సమర్థులైరి-వీరందఱు వేదవిహితకర్మములు చేయుటచే నీఫలము నొందిరి. బాటసారి కింత నన్నముపెట్టుమని వేదము చెప్పలేదు. గనుక ఫలములేదు. ఇది చార్వాకవాదమును తిఁణకవాదమును ఖండించుచున్నది.

తా త్ప ర్య ము.

నూఱు యజ్ఞములు చేసినవాఁ డింద్రుఁడై నహుషుని వలె స్వర్గాధిపతి యగును. మహాస్థులందఱు స్వర్గముఁ గాంచుట వారువారు చేసిన తపోనిష్ఠలచేతనే.

ఈ కారణముచేతనే హనుమంతుఁడు బ్రహ్మ కాఁబోవుచున్నాఁడు. అశ్వత్థామ వ్యాసుఁడు కాఁబోవుచున్నాఁడు. బ్రహ్మకు నూతేండ్లునిండి మహాప్రలయము వచ్చి యడిపోయి మరల సృష్టికాలము వచ్చినపుడు పూర్వకల్పమం దెవఁడెట్టి తపస్సులుచేసెనో యెఱిఁగి యట్టిజీవునికి రజోగుణ విశిష్టమైన దేహమునిచ్చి భగవంతుఁడు బ్రహ్మపదమందు నిలిపి యతనిలోఁ దాను బ్రవేశించి సృష్టికార్యము చేయును. అట్లులే రుద్రునియందుఁ బ్రవేశించి సంహారకార్యము చేయును. రక్షా కార్యము తానే విష్ణుస్వరూపముతోఁ జేయును. కావున బ్రహ్మరుద్రేంద్రాది పదవులన్నియుఁ గర్మఫల లబ్ధములే. ఫలదాత భగవంతుఁడు విష్ణువే.

శ్లో॥ సృష్టిస్థిత్యంత కరణాత్, బ్రహ్మవిష్ణు శివాత్మికామ్
స సంజ్ఞాం యాతిభగవాన్, ఏకఏవ జనార్దనః.

భగవంతుడైన జనార్దనుఁ డొకఁడే బ్రహ్మ, విష్ణు, శివ స్వరూపములతో సృష్టిస్థితి సంహారకార్యములు చేయును.

శ్లో॥ స్రష్టా సృజతిచాత్మానం, విష్ణుం పాల్యంచ పాతిచ
ఉపసంహ్రియతేచాం తే, సంహర్తాచ స్వయంప్రభుః.

భగవంతుఁడగు విష్ణువు తానే సృష్టికర్తయై తన్ను సృజించుకొను చున్నాఁడు. పాలించువాఁడై తన్ను రక్షించుకొనుచున్నాఁడు. సంహరించువాఁడు తానై సంహరింపఁ బడుచున్నాఁడు.

అనాలోచ్యైవ జగతాం, త్రాతారమపరం హరిః
స్వయమేవాంశరూపేణ, పాలయ త్యఖిలం జగత్.

జగద్రక్షణమునకు వేఱొకని నాలోచింపక విష్ణువు తానే యంశరూపమున సమస్త జగముఁ బాలించును.

ఆత్మను బ్రత్యక్షముగఁ జూచినవారిమాట యటుండనిచ్చినను, నెంతటి పామరునకైనను బండితునకైనను, నేను లేను అనుభావ మేనాఁటికిని గలుగదు. దేహముతోడ సర్వము పోవునుగాక! నేను, అనునదిమాత్ర మేమిచేసినను బోదు. ఆత్మయొకటి కలదు. అదినిత్యమనుటకు నీ యనుభవమే చాలును. ఎప్పుడాత్మయొకటి యున్నది, పాంచభౌతిక శరీర మొకటి గలదని యంగీకరించితివో కర్మఫలానుభవ మంగీకరింపక తప్పదు. మనస్సుతో నెంత చిన్నయాలోచన చేసినను దాని ఫలము తప్పదు.

కార్యకారణ కర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే
పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే. భ-గీ. 13-20.

శరీరము ఇంద్రియములు చేయుకార్యములకు శరీరరూపమునఁ బరిణమించిన ప్రకృతికారణము. ఆ కర్మములవలనఁ గలుగు సుఖదుఃఖము లనుభవించుట యందు నాత్మ కారణము.

శ్లో॥ పురుషః ప్రకృతిస్థోహి, భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్
కారణం గుణసంగోస్య సదసద్యోని జన్మసు. భ-గీ. 13-21.

ప్రకృతిపరిణామమైన శరీరమందుండు జీవాత్మ ప్రకృతిగుణముల ననుభవించును. ఈ గుణములతోడఁ జేరుటయే మంచిజన్మమునకుఁ జెడ్డజన్మమునకుఁ గారణమగును.

చం. అనుచును వెండి యాతపసి•నాస్తికవాక్యములన్ స్మరించి ఛీ
యని మదిలో నసహ్యపడి • యాగ్రహ మెత్తి వచించె సత్యమున్
ఘనతరవిక్రమంబు నను•కంపయు ధర్మము సాధువాద మా
ర్యనిచయదేవతాతిథిస•మర్చయుఁ బ్రోవలు నాకవాటికిన్. ౨౮౬-౩

ఘనతరవిక్రమంబు=మిగుల గొప్పదియగు పరాక్రమము- అనుకంప=దయ- సాధువాదము = మంచిమాటలాడుట- ఆర్యనిచయ = గొప్పవారి సమూహము యొక్క-యు- దేవతాతిథి = దేవతలయు- అతిథులయు- సమర్చ = పూజ- నాకవాటికిన్=స్వర్గమునకు.

## తాత్పర్యము.

ఈ ప్రకారము చెప్పి పరములేదు; పరలోక సుఖము లేదని చెప్పిన జాబాలి మాటలను మనస్సునకుఁదెచ్చుకొని ఛీఛీ యివియేమి పనికిమాలిన మాటలని రోసి యిట్టి దుర్బోధము చేయవచ్చునా యని కోపించి శ్రీరామచంద్రమూర్తి యిట్లు చెప్పెను. సత్యము, పరాక్రమము, భూతదయ, ధర్మగుణము, మంచిమాట, పెద్దలను, దేవతలను, అతిథులను సర్చించుట యివి స్వర్గమార్గములు. వీనియం దొకటొకటియు స్వర్గఫలమిచ్చును. ఎట్లన:—సత్యమువలన స్వర్గఫలము వచ్చుననుటకు.

"నాస్తి సత్యాత్పరోధర్మో, నానృతాత్పాతకంపరమ్
స్థితిశ్చ లోకధర్మశ్చ, తస్మాత్సత్యం విశిష్యతే
సత్యం స్వర్గస్య సోపానం, పారావారస్య నౌరివ. మనువు.

సత్యమునకు మించిన ధర్మములేదు. అసత్యమునకు మించిన యధర్మములేదు. లోకస్థితికి ధర్మమునకు సత్యమే యాధారము. కావున సత్యమే శ్రేష్ఠమైనది. సముద్రము దాఁటువానికి నావవలె, స్వర్గమునకు సత్యమే సోపానము.

ధర్మము పరలోకకారణ మనుటకు:—

శ్లో॥ ధర్మం శనైః సంచినుయా ద్వల్మీక మివధార్మిక
పరలోక సహాయార్థం, సర్వభూతాన్య పీడయన్
ధర్మప్రధానం పురుషం, తపసా హతకల్మషమ్
పరలోకం నయత్యాశు, భాస్వంతఖే శరీరిణమ్.

చెదలు పుట్టను పెంచునట్లు మెల్లమెల్లగా ధర్మమును సమకూర్చవలయును. ఇది యితరప్రాణులకు హానిలేకుండునట్లు పరలోక సహాయముకొఱకుఁ జేయవలయును. తపస్సుచేఁ బాపము పోఁగొట్టుకొని ధర్మమునే ప్రధానముగా నెంచువానిని నది దివ్యతేజముచేఁ బ్రకాశించు దేహముగల యతనిని బరలోకమునకుఁ దీసికొని పోవును.

పరాక్రమము పరలోక సాధనమనుటకు —

శ్లో॥ యే యజ్ఞసంఘై, స్తపసాచ విప్రాః, స్వర్గేషుః శీఘ్రేణ యథైవ యాంతి
క్షణేన యాంత్యేవహి తత్రవీరాః, ప్రాణాన్ సుయుద్ధేచ పరిత్యజంతః. పరాశర.

అనేక యజ్ఞములు, తపస్సులుచేసిన బ్రాహ్మణులు శీఘ్రముగ స్వర్గలోకమునకుఁ బోదురో యట్లు ధర్మయుద్ధమునఁ బ్రాణములు వదలిన వీరులు క్షణమునకు స్వర్గమునకుఁ బోదురు.

భూతదయ పరలోకప్రాప్తి హేతువనుటకు :—

శ్లో॥ సర్వభూతే ష్వనుక్రోశం, కుర్వతస్తవభారత
ఆనృశంస్యే ప్రవృత్తస్య, నియతః పుణ్యసంచయః. భార. రాజధర్మ.

సర్వభూతములందు దయగలిగి హింససేయక యుండు నీకుఁ బుణ్యములు నియతములు.

ప్రియవచనము పరలోక ప్రాప్తి కారణ మనుటకు:—

శ్లో॥ వాక్యైశ్చైవ మధురైశ్శ్లక్ష్ణైః, ప్రయోజ్యా ధర్మలిప్సుతా
సవై సర్వ మవాప్నోతి, వేదాంతోపగతంఫలమ్.

ధర్మఫలమం దాసక్తిగలవారు తియ్యని ప్రియవాక్యము లాడవలయును. దానివలననే వేదాంతజ్ఞానమువలనఁ గలుగుఫలము లభించును.

దేవతాతిథిపూజ పరలోక హేతువనుటకు:—

నివాపేన పితౄనర్చ్య యజ్ఞై, ర్దేవాం స్తథాతిథీన్
అన్నై ర్మునీంశ్చ, స్వాధ్యాయై రపత్యేన ప్రజాపతిమ్
బలికర్మణాచ భూతాని, వాత్సల్యేనాఖిలం జగత్
ప్రాప్నోతిలోకాన్ పురుషో, నిజకర్మ సమార్జితాన్. వి. పు.

నివాపములచేఁ బితృదేవతలను, యజ్ఞములచే దేవతలను, నతిథుల నన్నము చేతను, స్వాధ్యాయముచే ఋషులను, బిడ్డలఁగనుటచేఁ బ్రజాపతిని, బలికర్మములచే భూతములను, వాత్సల్యముచే సర్వప్రాణులను బూజించువాఁడు తనకర్మములచే సంపాదించిన పుణ్యలోకములకుఁ బోవును.

శ్లో॥ యోఽన్యథా సంతమాత్మాన, మన్యథా ప్రతిపద్యతే
కింతేన నకృతం పాపం, చోరేణాత్మాపహారిణా. స్మృతి.

ఒకవిధముగానుండు నాత్మను వేఱొకవిధముగా నుండుదానిగా నెవఁడు తెలిసికొనుచున్నాఁడో యట్టి యాత్మాపహారిచేఁ జేయఁబడని పాపమేదిగలదు?

ఉ. కావున నింతయుం దెలిసి • కాదె ధరామరు లైకమత్యసం
భావన వారివారికుల•పద్ధతిఁ దప్పక ధర్మకార్యముల్
వావిరి చేయువారు? నిను•వంటియధర్మపథాస్తు నాస్తికున్
ధీ విమతస్థబుద్ధి దరిఁ • జేర్చినతండ్రిని దూఱఁగాఁ దగున్. ౨౮-౨౮

ధరామరులు=బ్రాహ్మణులు- ఐకమత్యసంభావనన్ = ఒకయభిప్రాయమునే కలిగియుండుటచే-అధర్మపథాస్తున్=అధర్మమార్గముతోఁ గూడినవానిని-నాస్తికున్=పరము లేదనువానిని- విమతస్థబుద్ధిన్ = వైదికముకాని మార్గమున నున్నవానిని-దరిన్=సమీపమున- దూఱఁగానగున్=తిట్టవచ్చును.

తాత్పర్యము.

"బ్రాహ్మణా నా మనేకత్వ"మన్నట్లు లన్నివిషయములలో బ్రాహ్మణులు పరస్పర భేదాభిప్రాయము గలవారైనను ఈవిషయమందు వారందఱు నేకాభిప్రాయము గలవారై యున్నారు కావుననే వారివారి కులాచారప్రకారము ధర్మకార్య

ములు విడువక చేయుచున్నారు. ఫలములేదేని వారేలచేయుదురు. నీ వధర్మమార్గ మందున్నవాఁడ వని నాస్తికుఁడ వని యవైదిక మార్గనిష్ఠుఁడ వని నిన్నుదూషించి ప్రయోజనములేదు గాని నీవంటివానిని దగ్గఱచేర్చిన మాతండ్రిని నెంతైన దూషింపవచ్చును.

ఇట్లనుటచే నాస్తికవాదము చేయువానిని దగ్గఱచేర్పరాదని వారితో మాట లాడరాదని యేర్పడుచున్నది.

శ్లో. "యోవమన్యేత తేమూలే, హేతుశాస్త్రాశ్రయాద్ద్విజః
ససాధుభి ర్బహిష్కార్యో, నాస్తికో వేదనిందకః. మను. ౨-౧౧.

ఏ ద్విజుఁడు ప్రమాణములైన శ్రుతిస్మృతులను హేతుతర్క వాదముచే జర్చించుచు దూషించునో అట్టి నాస్తికుని వేదదూషకుని సాధువులు బహిష్కరింప వలయును.

శ్లో. విద్యాచోరో గురుద్రోహీ, వేదేశ్వర వినాశకః
తఏతే బహుపాప్మానః, సద్యోదండ్యా ఇతి శ్రుతిః ॥

దొంగతనముగా విద్యనేర్చుకొన్నవాఁడు, గురుద్రోహి వేదములను భగవంతుని దూషించినవాఁడు, వీరు మిక్కిలి యనేక పాపములు చేసినవారు, కావున వీరిని వెంటనే దండింపవలయునని శ్రుతి చెప్పుచున్నది.

శ్లో. మూఢైః పాపరతైః క్రూరైః, స్సదాగమ పరాఙ్ముఖైః
. సంబంధం నాచరేద్భక్తి, ర్నశ్యతే వైస్తు సంగమాత్.

మూఢులతోను, పాపకార్యములం దాసక్తిగలవారితోను, క్రూరకార్యములు చేయువారితోను వేదముల నంగీకరింపనివారితోను సంబంధము చేయరాదు. వారితోఁ గలిసి యుండినను భక్తి నశించును.

ఇచ్చట నొకశంక—

'నిన్నుఁ దరిఁజేర్చిన తండ్రిని దూఱఁగాఁ దగున్'

అని రామచంద్రమూర్తి చెప్పెనుగదా. ఇది తండ్రిని బుద్ధిలేనివాఁడని చేయరానిపని చేసెనని దూషించుటగదా? "శ్లో. శ్వపాక పుల్కసాదీనాం, కుత్సితానా మచేతసామ్। కులేషు తేభిజాయంతే, గురువృత్త్యావమానినః" గురువుల నడవడి నెవఁడు నిందించునో వాఁడు మాల మాదిగలయుఁ గుత్సితజాతులయుఁ గుల ముందుఁ బుట్టుననికదా శాస్త్రము చెప్పుచున్నది. ఇట్టికార్యము రామచంద్రమూర్తి యెట్లుచేసెను? తండ్రినిదూషించిన లక్ష్మణుని దల్లినిదూషించిన భరతుని నిరాకరించినవాఁడు తానిట్లు చేయవచ్చునా? జాబాలి బ్రాహ్మణుఁడుగదా! బ్రాహ్మణుని రామచంద్రమూర్తి నీవు దొంగవంటివాఁడవని దూషించెఁగదా! బ్రాహ్మణునట్లు దూషింపవచ్చునా? "పరమప్యాపదం ప్రాప్తో,బ్రాహ్మణా న్నప్రకోపయేత్, తేహ్యేనం కుపితా, హన్యు స్సద్యః సబలవాహనం" అని యెంత యాపద్దశయందును

బ్రాహ్మణుని నిందింపరాదని యుండ శ్రీరామచంద్రమూర్తి బ్రాహ్మణనింద యెట్లు చేసెనని సందేహము.

శ్రీరామచంద్రమూర్తి పితృనింద చేయలేదు. వైదిక విరుద్ధాచారముగల జాబాలిని జేర్చుకొనుట తప్పని చెప్పుటచే జాబాలిని నిందించినట్లుగాని తండ్రిని నిందించినట్లుగాదు. తండ్రియందు దురుద్దేశ మారోపింపలేదు. జాబాలిని దూషించినది సత్యమే. బ్రాహ్మణుఁడు ఋత్విజుఁడు నగుటచే జాబాలి నింద్యుఁడుగాఁడు గాని చార్వాకమతానుసారియై చార్వాకుని వలె మాట్లాడుటచేఁ జార్వాకుని వలె నింద్యుఁడేయగును; బ్రాహ్మణజాతియందుఁబుట్టి బ్రాహ్మణవృత్తి ననుసరించిననే బ్రాహ్మణగౌరవమునకు యోగ్యుఁడగునుగాని బ్రాహ్మణుఁడుగాఁబుట్టి క్షత్రియవృత్తి యందుండిన క్షత్రియునిగాను వైశ్యవృత్తియందుండిన వైశ్యునిగాను శూద్రవృత్తిఁ దైనచో శూద్రుఁడుగా నెంచబడవలయునేగాని బ్రాహ్మణజాతియందుఁబుట్టి బ్రాహ్మణ వృత్తిమందుండువానికిఁ జూపఁదగు గౌరవము తక్కినవానికిఁ జూపవలసిన పనిలేదు. దీనికి భీష్మవాక్యమే ప్రమాణము. ఆయుధములు ధరించి తనమీఁదికి యుద్ధమునకై వచ్చిన పరశురామునితో భీష్ముఁ డిట్లుచెప్పెను.

శ్లో. ఏతేవేదా శ్శరీరస్థా, బ్రాహ్మణ్యం యచ్చ తే మహత్
తపశ్చ సుమహత్తప్తం న తేభ్యః స్పృహయామ్యహమ్
ప్రహర్తే క్షత్రధర్మస్య, యత్త్వం రామసమాశ్రితః
బ్రాహ్మణ క్షత్రియత్వం హి,యాతిశస్త్ర సముద్యమాత్.   ఉద్యో.

పరశురామా! నీయందు వేదములున్నవి, గొప్ప బ్రాహ్మణ్యముగలదు, గొప్ప తపస్సుచేసితివి. ఇవన్నియు నేనాలోచింపను. క్షత్రధర్మము నాశ్రయించి నీవు వచ్చితివి గావున క్షత్రియుని గొట్టినట్లే కొట్టెదను. ఎప్పుడు నీవు చేతశస్త్రము పట్టితివో యప్పుడే నీవు క్షత్రియుఁడవైతివి. ఈ కారణముచేతనేకదా పాండవులు ద్రోణకృపాశ్వత్థామలను యుద్ధమునఁ గొట్టిరి. ఎప్పుడు జాబాలి చార్వాకమత మాశ్రయించెనో యప్పుడు చార్వాకునివలెనే భావించుట తప్పుగాదు. శుద్ధ బ్రాహ్మణ జాతులైన పరశురామ ద్రోణకృపాశ్వత్థామల విషయమే యిటుండ బ్రాహ్మణునకు క్షత్రియస్త్రీయందు జన్మించి క్షత్రవృత్తియందుండు రావణుఁడు బ్రాహ్మణుఁ డెట్లుకాఁగలఁడు? వానిని జంపిన బ్రహ్మహత్య యెట్లురాఁగలదు? చూడు, సుందర, ౧౧౦౮ ప. మందరము.

ఆ. చోరునట్టివాఁడు • సుమ్ము బుద్ధుఁడు నాస్తికుండునుం దథాగ•తుండ నిజము
ప్రజకు శంక్యుఁ డైన•వాఁడు నాస్తికుఁడౌట, యతనికెదుకువిబుధుఁ•డరుగరాదు.
౫౮౬-౫

శంక్యుఁడు– తథాగతుఁడు=ఆమార్గమునఁ బోవువాఁడు.

## తాత్పర్యము.

బుద్ధుఁడు దొంగవలె దగ్గఱఁ జేరనీయరానివాఁడు– నాస్తికుఁడు బుద్ధునిమార్గమునఁ బోవువాఁడే– వీఁడు అవైదికుఁడని దురాచారుఁడని ప్రజలచే సందేహింపఁబడువాఁడు– భయకారణమైనవాఁడు– కావున జ్ఞానముగలవాఁడు వానికెదురుగఁ బోరాదు. అనఁగా వానిముఖము చూడరాదనుట.

## బుద్ధుఁడు.

ఈ పద్యమునందు బుద్ధుఁడు తథాగతుఁడని రెండుశబ్దములు కానవచ్చుచున్నవి. ఈరెండును కపిలవస్తురాజగు శుద్ధోదనునకు మాయాదేవియందు జనించిన రాజకుమారుని పేరని–

సర్వజ్ఞస్సుగతో బుద్ధో, ధర్మరాజస్తథాగతః । సశాక్యసింహ స్సర్వార్థసిద్ధ శ్శౌద్ధోదనిశ్చసః । గౌతమాశ్చార్క బంధుశ్చ, మాయాదేవీ సుతశ్చసః ॥ అను శ్లోకములచేఁ దెలియనయ్యెడి. ఈయనభార్యపేరు యశోధర, పుత్రుఁడు రాహులుఁడు. ఈయన తమ్ముఁడు దేవదత్తుఁడు, కొందఱితఁడు సమానోదరుఁడు కాఁడందురు.

భగవంతుఁడగు విష్ణుని దశావతారములలో బుద్ధావతారము తొమ్మిదవ యవతారముగ మనవారు లెక్కించుచున్నారు. "మత్స్యః కూర్మో వరాహశ్చ, నారసింహశ్చ వామనః । రామోరామశ్చ రామశ్చ బుద్ధః కల్కిరేవచ ॥ ఈశ్లోకమునే కొందఱు బుద్ధశబ్దముమాఱు కృష్ణశబ్దము పఠింతురు. అది యెట్లులున్నను బుద్ధుఁడు కృష్ణుని వెనుకటివాఁడనియుఁ గలియుగమందుఁ బుట్టినవాఁడనియుఁ జెప్పుటయందు సందేహము లేదు. అట్లయినయెడల బుద్ధునిపేరు రామాయణమున నెట్లు చెప్పఁబడెనని యాక్షేపము రాకమానదు. ఆకారణముచేఁ గొందఱు దీనిని ప్రక్షిప్తమందురు. అనఁగాఁ గ్రొత్తగా నెవరో తెచ్చి యిటికించిరని యర్థము. ఇది యొకవిధమున నంగీకరింపవలసినదిగానే యున్నది. రెండవ సమాధానము, కల్పకల్పమందు దశావతారములు వచ్చుచుండును పూర్వకల్పమం దెట్టిసృష్టియో యట్టిసృష్టియే యీవలి కల్పమందు జరగును. ధాతాయథా పూర్వమకల్పయత్తని వేదముల నాధారము చేసికొని పేర్లతోఁగూడ మునుపటివలెనే బ్రహ్మ సృష్టించుచుండును. వేదముల మూలమున పోయినకల్పమునందు జరిగినవికొన్ని యిప్పుడు మనకుఁ గానవచ్చుచున్నవి.

అట్టులే బుద్ధునివిషయమని కొందఱందురు. బుద్ధునిపేరు తెలిసియుండిన నుండవచ్చును గాక బుద్ధుఁడు పుట్టినతరువాతఁగదా బౌద్ధమతము పుట్టెను. రాముని కాలమునకు బౌద్ధమతములేదే. అప్రకృత రానేల యని యాక్షేపము రాకతప్పదు. నాకుఁదోఁచిన సమాధానము నేను జెప్పెదను. పరిణామవాదప్రకారము ప్రథమ మనుష్యులు ఆస్ట్రేలియా దేశమందలి బుష్మెన్ (Bush men) వలెఁ గేవల పశుప్రాయులు. అది మనుష్యులయందుఁ బ్రథమదశ. ఆవలఁ బైపై తరగతులకు రానురాను

గొంతకాలమున నప్పటిమనుష్యులకు మనుష్యులు పుట్టుట చచ్చుట యనిరెండు ప్రత్యక్షముగ గోచరించుచుండెను. అప్పటికి వారికి దేవుఁడున్నాఁడను జ్ఞానము లేదు, పరలోకజ్ఞానము లేదు. కావున నప్పటివారిలో బుద్ధిమంతులగువారు మరణించిన దేహములను గాల్చినను బూడ్చినను శేషమేమి మిగులకపోవుటచే సర్వము దేహమేకాని దేహమునకంటె భిన్నమైనవస్తువు మఱియొకటి లేదనియు మన్ను- నీరు- గాలి- వేఁడిమి యీనాలుగు దేహమునందుండుటను లోకమున నివి కానవచ్చుటను, ఈనాలుగు కలిసి దేహమయ్యెనని తీర్మానించిరి.

ఆకాశము ఇంద్రియగోచరముకానిది గావున నది వారులెక్కకుఁదీసికొనరైరి. ఉండునది దేహమే కావున నదియుండువఱకు దైహిక భోగములన్నియు ననుభవింపవలయుననియు, నాకు వక్క సున్నము గలిసిన నొక్కొక విలక్షణ వర్ణము గుణముపుట్టినో యట్టులే నాలుగు భూతములు కలిసినపుడు చైతన్య ముదయించుననియుఁ దీర్మానించుకొనిరి చార్వాకమత మిదియే. ఈమతమం దాత్మయను వస్తువులేదు. ఆత్మ మీరు కలదనినను లేదనినను నది నిత్యవస్తువు గావున లేకపోదు. ఇట్లుకొంతకాలము జరుగఁగా నప్పటి బుద్ధిమంతులు శవమును జూచి యిట్లాలోచించిరి, మునుపున్న నాలుగుభూతము లీదేహమున నిప్పటికి నున్నవికదా. ఇంతకుముందు మాటలాడునది, చూచునది, నడచునది యిప్పుడేల మాటలాడదు, చూడదు, నడవదు? ఊపిరిపోయినది యందమా! మనము లోపలికి గాలిని బంపిన బ్రదుకునా? కావున నీనాలుగు భూతములుగాక లోపల నేదోయొక శక్తియుండుటచే నదియున్నంతవఱకు నిది కదలుచు మెదలుచుండినది. అదిపోఁగానే యాశక్తిపోయినది. కావున జడమైన దేహముకాక దానికంటె భిన్నమైన చైతన్యశక్తి యొకటియున్నదని తీర్మానించిరి. దీనికిఁ దోడు స్వప్నములు వచ్చుట అందుఁ జచ్చినవారు కనఁబడుట మాటలాడుట తటస్థించుచుండుటచే వారియూహ స్థిరపడెను. ఇప్పుడు జడదేహము అజడచైతన్యము రెండుగలవని యేర్పాటయ్యెను. ఈ రెంటిలో నేదిసత్యమని యప్పటి ప్రాజ్ఞులు విమర్శింపఁబూనిరి. చార్వాకాదులు దేహమే సత్యమనిరి. మఱికొందఱు చైతన్యమే సత్యము. దేహమునకు వినాశోత్పత్తులు కలవు. కావున నది సత్యమనరాదని వాదించిరి.

ఇదియే మాయావాదముగఁ బరిణమించి యిప్పుడద్వైతమయ్యెను. వీరి కలహమునుజూచి మీరేల కలహించెదరు? రెండును సత్యములే. అసత్యమైనది లేదని కొందఱనిరి. ఈవాదమే ద్వైతము విశిష్టాద్వైతముగఁ బరిణమించెను మతమనఁగా నభిప్రాయము. మతభేదము లిట్లుకలిగెను. కావున నిన్నియభిప్రాయము లన్ని కాలముల నుండునవే. దశరథురాజ్యమున నాస్తికుఁడులేఁడని చెప్పఁబడెను, గాని లోకమున నాస్తికమతమే లేదని చెప్పఁబడలేదు. నాస్తికమతమే లేదేని నాస్తికుఁడులేఁడని చెప్ప నెట్లుసాధ్యపడును? పుట్టనిబిడ్డకుఁ బేరెట్లువచ్చును? మనుస్మృతియందే 'నాస్తికః

వేదనిందక’యని శబ్దములు కానవచ్చునపుడు వారున్నారని యర్థమా? లేరనియర్థమా?

శ్రీరామానుజాచార్యుల వారివలన విశిష్టాద్వైతము, శ్రీశంకరాచార్యుల వారివలన నద్వైతము, మధ్వాచార్యులవారివలన ద్వైతము ప్రబలినట్లు బుద్ధుని వలన నామతము ప్రబలెను. అంతియకాని త్రిమతాచార్యులు పుట్టకముందు త్రిమతములు లేవని యర్థముగాదు. బౌద్ధులుపయోగించు బుద్ధ తథాగత శ్రమణ చైత్య శబ్దములు రామాయణమందున్నవి. అవి సంస్కృతపదములు వానినే బౌద్ధులు గ్రహించిరి. బౌద్ధులకుముం దాశబ్దములు లేవనుట సరిగాదు. కావున రామచంద్ర మూర్తి బౌద్ధము నిరసించినాఁడనుటయందు వింత యేమియు లేదు. ఆత్మ లేదని యాత్మ జ్ఞానము హరించుటచే నాస్తికుఁడు చోరుఁడనఁబడెను.

జాబాలి యిాప్రశంస చేయకముందే శ్రీరామచంద్రమూర్తి భరతునకుఁ జేసిన యుపదేశవాక్యములందు “లోకాయతికుల విప్రుల, నేకాలమునందుఁ గొలువ వేకదవార, స్తోకావర్థచణుల్ సుమి ప్రాకట విపరీతమతులు బండితమానుల్.” అని చెప్పెఁగదా. అయోధ్య, ౨౨౭౨.

బుద్ధుని కాలమునకుముందే నైతండికులు వితండావాదులని కొందఱు బ్రాహ్మ ణులుండిరి. అవునన్నది కాదనుట వీరిమతము. వీరు స్వపక్ష పరపక్ష నిర్ధూమధాములు. వీరితో సంభాషింపరాదని సాంగత్యము చేయరాదని బౌద్ధగ్రంథములందు జైన గ్రంథములందును గలదు. జనకరాజు సభలోవంది బౌద్ధవాదముచేసి బ్రాహ్మణుల నోడించినట్లును అతనిని అష్టావక్రుఁ డోడించినట్లు భారతమున వనపర్వమునఁ గలదు. కావున నాస్తికమతము బౌద్ధమతము రామునికంటె ముందటినుండి యున్నవి. వానినే రామచంద్రమూర్తి చెప్పెను. శాక్యబుద్ధుఁడు కానేడవ బుద్ధుఁ డనియుఁ దనకుముం దార్వురు బుద్ధులు పోయిరని చెప్పెను. సుందర, ౨౧౧ ప. చూడు.

బౌద్ధమతమువారు జ్ఞానమే బుద్ధియని యందురు గాని యంతఃకరణమును వారంగీకరింపరు. బుద్ధిశబ్దము జ్ఞానార్థకము గావున బుద్ధి జ్ఞానమే యని వారివాదము.

బౌద్ధులందు నలుతెగలవారు (1) మాధ్యమికులు (౨) యోగాచార్యులు (౩) సౌత్రాంతికులు (4) వైభాషికులుగలరు. ఇందుమాధ్యమికులు సర్వశూన్యవాదులు. ఈమతమే యచలమని, పూర్ణమని హీనజాతులందు వ్యాపించియున్నది. శ్రీశంకరా చార్యులవారి ప్రాచార్యులు గౌడపాదాచార్యు లీశాఖకుఁ జేరియుండి యందు గ్రం థముకూడ వ్రాసినట్లు తెలియుచున్నది. వీరియద్వైతమునకు మాధ్యమిక సర్వ శూన్య విజ్ఞానవాదములకు విశేషభేదము లేదు. బ్రహ్మమొకటి యలంకార విద్యార్థి వలె నున్నదని యద్వైతులందురు. అదియు లేదని శూన్యవాదులందురు. వీరియస్తి వారినాస్తి రెండు నించుమించు సమానార్థకములే యని మధ్వాచార్యులవారు బృహ దారణ్యకోపనిషత్తు భాష్యమందు వివరముగ వ్రాసియున్నారు. (చూడు. బృహ. ౪-౩-౧౦ సత్యతరక భాష్యము చూడుఁడు.)

ఇచ్చట నొకయాక్షేపము, వేదబాహ్యులైన చార్వాకులమతము బౌద్ధమతము రామచంద్రమూర్తి తనవైదికమతము నాధారముచేసికొని ఖండించుట యేమిప్రశస్త మార్గము, మామతప్రకారము మీమతము తప్పనుట వాదలక్షణమా! యనికొందఱందురు.

చార్వాకుల వాదమునకుఁ బ్రత్యక్షముప్రమాణమైనను లోకవ్యవహారమున ననుమానము గ్రహింపక విధిలేదు. ఆకారణముచే నాత్మలేదను నామతమును ఖండించి యాత్మ కలదనియు దేహమెంతో యాత్మయంతయే యుండుననియు నేనుఁగునందాత్మ యేనుఁగువంత చీమయందలియాత్మ చీమయంత యుండునని మఱియొకమతము వారు ఖండించి దానిని మఱియొకరు ఖండించి యిట్లు ఖండించుచు రాఁగారాఁగాఁ దుదకు వైదికమతము మిగిలెను, కావున దీనినాధారము చేసికొని రామచంద్రమూర్తి మాటలాడెను. అటుకాకుండిన నిన్నిమతవాదములను వరుసగ మాటలాడి యుండును. జాబాలి కివన్నియుఁ దెలియనివి కావు. అట్టివానికి నేమియుఁ దెలియనివానికి వలె వరుసగానేల చెప్పవలెను. ఇవన్నియు వరుసగఁ జెప్పఁబూనిన నదియొక సర్వదర్శన సంగ్రహమగును గావున నాపనికి యత్నింపలేదు.

ముఖ్యవైదికమతములు అనఁగా వేదముల నాధారము చేసికొని వానినే ప్రమాణముగా గ్రహించినవి మూఁడు, (1) అద్వైతము, వీ రేకతత్త్వవాదులు, వీరిమతప్రకారము పరబ్రహ్మముతప్పఁ దక్కినదంతయు మిథ్య. (2) ద్వైతము, ఇది యద్వైతమునకుఁ బ్రత్యక్షవిరోధము, వీరు జీవులనేకులని భగవంతుఁడు జీవులు ప్రకృతి యన్నియు సత్యము అన్ని వేఱువేఱని చెప్పుదురు. అద్వైతులు నిర్గుణ బ్రహ్మమును వీరంగీకరింపరు. (3) విశిష్టాద్వైతము, ఇది యుభయమునకు మధ్యస్థము, ద్వైతమువలె జీవబాహుళ్యము నంగీకరింతురు. ఈశ్వరుఁడు జీవుఁడు ప్రకృతి భిన్నములేకాని జీవప్రకృతులు రెండు నీశ్వరునికి విశేషణమని శరీరి శరీరభావమున నంగీకరింతురు. సూక్ష్మ చిదచిద్విశిష్టుఁడైన యీశ్వరుఁడే స్థూల చిదచిద్విశిష్టుఁడైన ప్రపంచముగాఁ బరిణమించెను. గావునఁ బ్రపంచము సత్యమే భగవత్స్వరూపమే యందురు. ఈముగ్వుర కుపనిషత్తులే ప్రమాణము. వారివారికిఁ దోఁచినట్లు వారు వారర్థము చెప్పుదురు. కాని వేదబాహ్య మతముల ఖండించుటయందు ముగ్వురి కైకమత్యము గలదు.

తథాగతశబ్దమిందే కాక సుందరకాండము ౧౩-వ సర్గము ౭౯-వ శ్లోకమందును గలదు. "రామం తథాగతం దృష్ట్వా" ఇచ్చట రాముని బుద్ధుఁడనవచ్చునా?

శా. నీకుం బూర్వులు నీకు మిన్నలు మహా•నిష్ఠాత్ములై కర్మముల్
సాకల్యంబుగఁ జేయ రే? యిహపర•స్వాయజ్జయశ్రీకులై
లోకన్ శాశ్వతమూర్తులై వెలుఁగ రే • శుద్ధాత్ము ల ట్లాటఁ దా
రేకాలంబున మంగళాత్మకమహా•భీష్టక్రియల్ సల్ప రే? ౭౮-౬

నీకున్ = నీకంటె- "అన్యమార సమీపేత రాద్యర్థయోగంబునఁ గంటె కువర్ణంబులగు, సు. వ్యా. కారక ౧౯ సూ. మిన్నలు=శ్రేష్ఠులు- మహానిష్ఠాత్ములై= కర్మయోగమందు గొప్పనిష్ఠగలవారై- సాకల్యంబుగన్=పూర్ణముగ-కొఱఁత లేకుండ ఇహ....శ్రీకులై=ఇహపర=ఈలోకమందుఁ బరలోకమందు- స్ఫాయల్ = ప్రకాశించు- జయశ్రీకులై=జయలక్ష్మిగలవారై- శాశ్వతమూర్తులై=గ్రహములు నక్షత్రములును స్థిరమైన యాకారముఁగలవారై- వెలుఁగరే=ప్రకాశింపరా- "సుకృతాం హి ఏతాని జ్యోతీగ్ంషి. యన్నక్షత్రాణి" యని శ్రుతి. యుద్ధకాండమందలి సీతాదేవి వాక్య (౬౮౭-౫) మీయర్థమునే బోధించెడిని.

కం. అయ పుణ్యశీలురకు సుప్రియముం బుణ్యంబు నగుచుఁ బేర్గన్నర్థ్వద
  వ్యయముం గనుచున్నాఁడవె, నయశీలా! మింటనిల్చి నక్షత్రమవై.

శుద్ధాత్ములు=నిర్మలమగు నంతఃకరణము గలవారు-అర్థ్లాటన్=వైదిక కర్మానుష్ఠానమువలన నిహపరలోకసుఖము లు గలుగుటవలన- ఎట్టికాలమునందు = ఎట్టిదశయందు- మంగళాత్మక=శుభస్వభావముగలవై మిక్కిలి యిష్టములగు కార్యములను జేయలేదా.

దీనివలన శ్రీరామచంద్రమూర్తి కర్మానుష్ఠానము ఫలవంతమని యవశ్య కర్తవ్యమని చెప్పినవాఁడాయెను. భగవంతుఁడొకఁడు గలఁడని యాయన సర్వజ్ఞుఁడు, సర్వశక్తుఁడు, సర్వవ్యాపి, సర్వకర్త, సర్వకర్మ ఫలప్రదాత యని వైదికమతము.

కొందఱు జీవులుకర్తలందురు. అట్లైనఁ బ్రతిజీవియుఁ దనకుమేలైనదే చేసికొనునుగాని తనకనిష్టఫలమిచ్చుదానిని జేయఁడుకదా. ఎల్లప్పుడు సంతోషసుఖములు గోరునుగాని జీవి కష్టశోకములు గోరఁడుకదా. సంతోష సుఖప్రాప్తికిఁ గాని దుఃఖశోక నివారణమునకుఁగాని జీవులు శక్తిమంతులుగాక యున్నారుకదా. కావున జీవులు ప్రయోజక కర్తలుగారు. ప్రయోజ్యకర్తలు.

ఇఁకఁ గర్మములు కర్తలందమా! కర్మము లచేతనములు. అవియెట్లు కర్మఫలములను స్వర్గనరకాదులను సుఖదుఃఖములఁ గలిగింపఁగలవు? కావునఁ గర్మములు కర్తలుగావు.

ప్రకృతి కర్తయందమా! యనిన నదియు నచేతనమే. అచేతనమెట్లు చేతనలకుఁ గర్మఫలము లీయఁగలదు? కర్మముచేయువారి యుద్దేశము తెలిసికొనఁ గలదు? కావునఁ బ్రకృతియుఁ గర్తకాదు.

కాలము కర్తయందమా యనిననదియు నచేతనమే కావునఁ గర్మఫల మీయఁజాలదు.

ఒకఁడు కోడిగ్రుడ్డునం దేయేవస్తు పరమాణువు లెట్లెట్లు కలిసియున్నవో యట్లులే యేమిభేదములేకుండ నొకకోడిగ్రుడ్డును గల్పించి. యొకకోడి గ్రుడ్లను

పొదుగుచుండ వానిలో దీనినిగలిపి యుంచెను. అన్నిటికిఁ జైతన్యమువచ్చి కోడి పిల్లలు బయటవచ్చెనుగాని వీఁడుపెట్టినది పెట్టినట్లె యుండెను.

పరమాణుసాంగత్యము వలననే చైతన్య ముదయించునను వాదము నిది ఖండించుచున్నది. పసుపు సున్నము కలిపిన వచ్చు నెఱ్ఱరంగుగాని తమలపాకులు పోకలు సున్నము గలిపినవచ్చు నెఱుపుగాని చైతన్యముగాదు.

కావున బాహ్యమతములవారు కర్తలనిచెప్పకు నవి కర్తలుకావని సర్వజ్ఞుఁడు సర్వశక్తుఁడగు భగవంతుఁడు వీఁడియన్నిటికంటె వేఱగువాఁడొకఁడు కర్మఫల దాత యుండవలయును.

కావున భగవంతుఁడు లేఁడనికాని యుండినను నాస్తికల్పుఁడని చెప్పెడు వాదము సరిగాదు. వేదోక్త కర్మములకు ఫలమున్నదా లేదా యనువిషయమున ననుభవము ననుమానము ప్రమాణములు. అభిచారహోమాదులవలనఁ గలుగు ఫలము ప్రత్యక్షము. ఎప్పుడు వేదోక్తములగు నథర్వణ మంత్రములు ప్రత్యక్ష ఫలము లిచ్చుచున్నవో యప్పుడే యందలి తక్కినమంత్రములు ఫలవంతములని యనుమాన ప్రమాణముచే సాధ్యము. కావున స్వర్గాపవర్గములు కర్మఫలములని యేర్పడుచున్నది. వేదాంగమగు జ్యోతిషము ప్రకారము గ్రహణాదులు నిశ్చయము లగుచున్నవి. ఇట్టివి యితరమతములందు లేవుగదా. అనేక దేవాలయము లందుఁ బ్రతిష్ఠిత దేవతామూర్తులవలననే యిష్టసిద్ధులు ననిష్టనివారణములు కలుగుచున్నవి. వీని కితరమతములందుఁ గారణము చెప్పఁబడలేదు. నాస్తియనుటకు నామతము వారిమాటతప్ప వేఱుప్రమాణములేదు. తర్కము బుద్ధిసాధ్యము. ఒకబుద్ధిమంతుఁడు యుక్తులచేఁ జెప్పినదానిని మఱియొక బుద్ధిమంతుఁడు యుక్తులచేతనే ఖండింపవచ్చును. కావునఁ గేవలతర్కము ప్రమాణముగాదు. ప్రత్యక్షానుమానములుస్వతంత్ర ప్రమాణములు గావని ముందేచెప్పఁబడెను. కావున శాస్త్రమేప్రమాణము, శాస్త్రోక్తకర్మమే ఫలకారణము, ఫలదాత భగవంతుఁడు. కావునఁగర్మస్వరూపత్యాగము సర్వదా నిషిద్ధము.

శ్లో॥ భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః ప్రాణినాం బుద్ధిజీవినః
బుద్ధిమత్సునరాశ్శ్రేష్ఠా నరేషు బ్రాహ్మణా స్స్మృతాః
బ్రాహ్మణేషుచ విద్వాంసో విద్వత్సు కృతబుద్ధయః
కృతబుద్ధిషు కర్తారః కర్తృషు బ్రహ్మవేదినః. మను.

స్థావర జంగములందుఁ బ్రాణముగలవి శ్రేష్ఠములు ప్రాణములు గలవానిలోఁ బశువులు శ్రేష్ఠములు, పశువులలో మనుష్యులు శ్రేష్ఠులు, మనుష్యులందు బ్రాహ్మణులుశ్రేష్ఠులు, బ్రాహ్మణులందు వేదవేత్తలుశ్రేష్ఠులు, వేదవేత్తలందు వేదార్థజ్ఞానముగలవారు శ్రేష్ఠులు, వేదార్థజ్ఞానముగలవారిలో వేదోక్త కర్మము చేయువారు శ్రేష్ఠులు, కర్మములు చేయువారియందు బ్రహ్మవేత్తలు శ్రేష్ఠులు.

ఈ శ్లోకముల విషయమున వైద్యనాథీయమందు "కర్తృషు బ్రహ్మవేదిన ఇతి వదతా బ్రహ్మవిద్భిరపి కర్మకర్తవ్యమితి సూచితం భవతి" యని వ్రాయఁబడెను. ఇవి మనుస్మృతి ౩-౯౮-౯౨, శ్లోకములు. దీనివలన బ్రహ్మవేత్తలకైనను గర్మస్వరూపత్యాగ వాదము నిరస్తము.

తా త్ప ర్య ము.

నీకంటె ముందుండినవారు కాదుకాదు. జ్ఞానమునందు నీకంటె గొప్పవారు కఠినమైన నిష్ఠలుగలవారై కొంచెము లేకుండఁ గర్మములు చేయలేదా? వారు బుద్ధిహీనులనియా నీతలంపు, నిర్మలమనస్సుతోఁ గర్మములుచేసినవారు, ఈ లోకమందుఁ బరలోకమందుఁగూడ జయలక్ష్మిని బొందినవారై తేజోమూర్తులై శాశ్వతంబుగఁ బ్రకాశించుచుండలేదా? అటువంటిఫలము గలుగుటచేత శుభస్వభావముగల తమ కిష్టమైనకార్యములను సర్వకాలములందుఁ జేయలేదా? కర్మములు నిష్ఫలములైన వీరెల్లరేల యిట్లు చేయుదురు.

ఉ. దానగుణప్రధానులు ని*తాంతదయామతు లార్యవర్య సం
తానసమేతు లప్రతిహ*తప్రభు లుత్తమధర్మమార్గస
మ్మానులు వీతపాపు లస*మానచరిత్రులు కర్మనిష్ఠలం
బూనెడివారనిసత్తములు*పో మునివేషక! లోకపూజితుల్. ౩౮౨

*మునివేషక = మునివేషము ధరించినవాఁడా- దానగుణప్రధానులు = దానగుణమే ప్రధానముగాఁ గలవారు, 'తస్మాద్దానం పరమంవదంతి' 'త్యాగేనైకే అమృతత్వమానశుః" ఇత్యాదులు ప్రమాణములు. నితాంతదయామతులు = మిక్కిలి దయగల మనస్సుగలవారు- ఆర్యవర్యసంతానసమేతులు=గొప్పవారి సమూహముతోఁగూడినవారు- అప్రతిహత=ఎదురులేని- ప్రభులు=తేజస్సుగలవారు- ఉత్తమ = శ్రేష్ఠమైన-ధర్మమార్గసమ్మానులు=ధర్మప్రవర్తించుటయును గౌరవముగలవారు- వీతపాపులు = పాపములేనివారు- లోకపూజితుల్ = జనులచేఁ బూజింపఁబడువారు.

తా త్ప ర్య ము.

నీవు మునివేషము వేసితివేకాని నీయందు మునికుండవలసిన జ్ఞానముగాని గుణముగాని వర్తనముగాని లేదు. జనులచేఁ బూజింపఁబడువారు నీవంటి వేషధారులు గారు. దానగుణము ప్రధానముగాఁ గలవారు. అపారభూతదయ గలవారు. గొప్పవారిసమూహముతో సాంగత్యము గలవారు. ఎదురులేని తేజస్సుగలవారు. ఉత్తమమైన ధర్మమార్గమును గౌరవించువారు, పాపరహితులు, సమానములేని మంచి నడవడిగలవారు, కర్మనిష్ఠల విడువని మునీశ్వరులు. వీరు నిజముగా లోకపూజితులు.

సారాంశము.

1) పరలోకములేదు. కావునఁ దండ్రితో నసత్యమాడినను బాపానుభవ భయములేదు.

2) బాటసారి నుద్దేశించి యింట శ్రాద్ధముపెట్టిన నతని కడుపు నిండవల్లు చచ్చినవాని నుద్దేశించి శ్రాద్ధములుపెట్టినను బ్రయోజనములేదు కావునఁ గర్మములు వ్యర్థములు. ఇవి జాబాలి వాదములోని ముఖ్యాంశములు.

1) లోకమంతయు సత్యముపై నాధారపడియున్నది, రాజగువాఁ డసత్య మాడెనేని వానినిఁజూచి లోకులందఱు నసత్యమాడుదురు. అసత్యము ప్రబలిన ధర్మము నాశమగును సత్యము ధర్మము రెండుఁజెడెనేని ప్రజలొకరినొకరు పీకితిందురు. కావున సత్యధర్మము లవశ్యానుష్ఠేయములు.

2) కర్మములు ఫలవంతములగునా కావా? యనునది తర్కయుక్తులచే సాధ్య మగునదికాదు. అనుభవవేద్యము; ఇంద్రియ గోచరమైనదానికిఁ దర్కముగాని యతీంద్రియములయిన వానివిషయమునఁ దర్కము పనికిరాదు. తర్కము బురద లోనికంబము. ఎవఁడే ప్రక్కకీడ్చిన నాప్రక్కకుఁ బోవును. తర్కయుక్తులచే నేఁ డొకటి యొకఁడు సిద్ధాంతముచేసిన దానిని నంతకంటె వేఱొకఁడు బుద్ధిమంతుఁడు దానిని ఖండించి తద్విరుద్ధముగా సిద్ధాంతము చేయవచ్చును. కావునఁ గేవల ప్రత్యక్షమెట్లు ప్రమాణముగాదో యట్టులే కేవల తర్కయుక్తులు ప్రమాణములు గావు.

శ్లో. శ్రుతిసాహిత్యరహిత, మనుమానం నకుత్రచిత్
నిశ్చయాత్సాధయేదర్థం, ప్రమాణాంతర మేవచ
శ్రుతి స్మృతి సహాయం యత్ప్రమాణాంతర ముత్తమమ్
ప్రమాణ పదవీ గచ్ఛన్నాత్ర కార్యావిచారణా
పూర్వోత్తరావిరోధేన కోత్రార్థోభి మతో భవేత్
ఇత్యాద్య మూహనం తర్కః, శుష్కతర్కంతు వర్జయేత్.

అర్థము.

అనుమానముగాని, యితర ప్రమాణములుగాని వేదముల సాహాయ్యము లేకుండిన నిశ్చయార్థమును సాధింపలేవు. శ్రుతి స్మృతి సాహాయ్యముగల యితర ప్రమాణ ముత్తమము. అదియే ప్రమాణ మనిపించుకొన యోగ్యమైన దగును. పూర్వోత్తర విరోధములులేక యర్థము సాధించునూహయే తర్కము. శుష్క తర్కము త్యాజ్యము. మనుస్మృతియందు.

శ్లో॥ ఆర్షం ధర్మోపదేశంచ, వేదశాస్త్రా విరోధినా
యస్తర్కేణాను సంధత్తే, సధర్మం వేదనేతరః.

వేదశాస్త్రములకు విరోధింపకుండ స్మృతులయందుఁ జెప్పఁబడిన ధర్మోపదేశమును నెవఁడు తర్కముచే ననుసంధించుచున్నాఁడో సమన్వయ పఱచుకొను చున్నాఁడో వాఁడే ధర్మము తెలిసినవాఁడు కాని యితరుఁడుకాఁడు.

అతీంద్రియములైన వానివిషయమున వేదములే ప్రమాణములు. అవి యపౌరుషేయములు. అవి యనాదిగఁ బ్రమాణముగఁగొని కార్యములు చేయఁబడుచున్నవి. వానికిఁ గర్తయెవఁడో తెలియదు. అట్టివేదముల ప్రకారము కర్మములుచేసిన ఫలము కలుగుటచేతనే యవిసత్యములని యంగీకరింపవలసి యున్నవి. కర్మములకు నైహిక ఫలములు ప్రత్యక్షానుభవమునకు వచ్చినపుడు ఆముష్మికములు కూడవచ్చునని యేల నమ్మరాదు? విశ్వాసమాత్రమేగాక ఫలమనుభవించినవారిని జూచుచున్నాము కదా. నహుషుఁడు నూఱుయజ్ఞములుచేసి యింద్రుఁడయ్యెను. అగ్నిశ్యాది పదవులు కర్మఫలములుకదా. నక్షత్రాదులు కర్మఫలముల నైనవియేకదా. కావున వైదిక కర్మములకు ఫలములేదన రాదు. బాటసారిగుఱించి యింటఁ దద్దినము పెట్టుట వైదిక కర్మముగాదు. కావున దానికి ఫలములేదు. కావునఁ గర్మనిష్ఠులే శ్రేష్ఠులుగాని కర్మభ్రష్టులుగారని శ్రీరామచంద్రమూర్తి ప్రత్యుత్తర సారాంశము.

చం. అనుచు సరోషభాషణము • లాడుమహాత్ము నదీనసత్త్వుఁ గ
   న్గొని మునివెండి యాస్తిక మ•కుంఠితసత్యము నైనపల్కు సా
   నునయముగా వచించె సుమ•నోవరసన్నుత! కాను నాస్తికుం
   డను, నన నాస్తికోక్తి, మఱి • నాస్తి యటన్నది నాస్తి యెంతయున్. ౩౮౪

సరోషభాషణములు=కోపముతోఁగూడిన మాటలు- మహాత్మన్ = గొప్ప మనస్సుగలవానిని- అదీనసత్త్వన్=గొప్పసత్త్వగుణము కలవానిని- ఆస్తికము = పరలోకము- దైవము గలఁడనునది- అకుంఠితసత్యము = మొక్కవోని సత్యముగలది- సానునయముగాన్=ఊఱడింపుమాటలతో- సుమనోవర=దేవశ్రేష్ఠులచే- సన్నుత =బాగుగఁబొగడఁబడినవాఁడా-నాస్తికోక్తి=నాస్తికవాక్యము-నాస్తియన్నదినాస్తి= లేదు అనునదిలేదు- సర్వము సత్యము అనిభావము.

దీనివలన నాస్తికవాదము విననైన వినరాదనియు నెవరైనఁ జేసిన చీవాట్ల వలయుననియు నేర్పడుచున్నది.

పాషండభోజిభిః పాపైః వేదవాద విరోధిభిః
పాషండినో వికర్మస్థాన్, బైడాల వ్రతికాన్ శ్ఛఠాన్
హైతుకాన్ బకవృత్తీంశ్చ, వాఙ్మాత్రేణాపి నార్చయేత్.

వి. పు. ౧౮-౩-౯౭.

పాషండుల కన్నముపెట్టువానిని, పాషండునియన్నముఁ దినువానిని, వేదవాద విరోధిని, పాషండుని, ప్రచ్ఛన్నముగాఁ బాపములు చేయువానిని, నెదుట

మంచిమాటలాడి చాటున నిందించువానిని, సత్కర్మములయందు సందేహబుద్ధి గల వానిని మాటలచేనైన గౌరవింపరాదు.

తాత్పర్యము

అని యీప్రకారము కోపముతో శ్రీరామచంద్రమూర్తి మాటలాడఁగా గొప్పమనస్సుగలవాఁడు మహాసత్త్వగుణము గలవాఁడునగు రామచంద్రమూర్తిని గని నిష్కారణముగ నిటువంటివాని మనస్సును నొప్పించితినే యని జాబాలి మరల నాయనను కేవల సత్యమైనపలుకులతో నూఱడించుచు నిట్లనియె. రామచంద్రా! నీవు దేవశ్రేష్ఠులగు బ్రహ్మాదులచేస్తుతింపఁబడువాఁడవు. నేను నాస్తికుఁడనుగాను. నేను నాస్తికోక్తులను జెప్పను, నాస్తియనునది లోకమునలేదు. సర్వమస్తియే.

దీనివలనఁ బ్రపంచము పారమార్థిక మిథ్యయని యింద్రజాలమని చెప్పెడు వారిమాటలు నమ్మరాదని భావము. నాల్గవపాదంబున నుభయయతి.

—• జాబాలి శ్రీరామునితోఁ దన్ను క్షమింప వేఁడుట. •—

సీ. జానకీశ్వర! ధ•ర్మసంకటవేళ యత్కించి త్కాలం బాని • కీడు దలఁగఁ
ద్రోచుట యొప్పుది • చూచి యే నిప్పు డ,రాజకం బనునుప•ద్రవము దొడర
నాస్తికవాద మొ•నర్చితి నంతియు, కాని నాస్తికుఁడ నేఁ • గాను వింటె
యన్యుఁ డెవ్వం డేని • నాస్తికవాదంబుఁ జేయుఁ దద్వాదంబుఁ • జెలుగు నేవ
తే. ధర్మసంకటకాలోచి•తంబు సుమ్ము; నాదుప్రకృతివు నాస్తిక•వాద మిట్టి
ధర్మసంకటకాలంబు • దాపరించె, నేని వెండి నాస్తికతను•బూనువాఁడ. ౫౮౬౯

ధర్మసంకటవేళన్ = ధర్మము చెడునట్టిసమయమున- యత్కించిత్=ఏదియో యొకమలిము- అరాజకంబు=రాజులేకపోవుట యను- ఉపద్రవము=విపత్తు- ధర్మసంకట కాలోచితంబు=ధర్మమునకు విపత్తువచ్చిన కాలమునకుఁ దగినది.

తాత్పర్యము.

నీవు నాస్తికుఁడవు కాకపోయిన నాస్తికవాద మేలచేసితివందువా? చెప్పెద వినుము. రామచంద్రా! ధర్మమునకు నపాయము సంభవించినపు డేదోయొక విధముగా న్యాయముగనో యన్యాయముగనో ధర్మము చెడకుండఁ గాపాడుట న్యాయ్యము ఇది యాపద్ధర్మము. ఇప్పుడు మీతండ్రిమరణించెను. నీవు రాజ్యము నంగీకరింపవైతివి; నాకు రాజ్యమక్కఱలేదని భరతుఁడు కూడునీళ్ళు చాలించి వానప్రస్థవేషము వేసికొనినాఁడు; మీరిద్దఱు రాజ్యము నంగీకరింపనియెడల రాజ్యము ప్రజలు నేగతి పట్టిపోవలె? దేశమెంతటిదుస్స్థితికి వచ్చును? ఈ మహావిపత్తు నాలోచించి న్యాయముగా రాజ్యము నీది గావున నీవు రాజవగుట ధర్మమనియెంచి న్యాయోక్తులకు నీ వన్నిటికి నన్నివిఱుపులు చెప్పుటచే నీమార్గముననైన నిన్ను నంగీకరింపఁజేయఁ దలఁచి నాస్తికవాదము చేసితినిగాని నేను నాస్తికుఁడనుగాను. నేనట్టివాఁడనై యుండిన మీతండ్రి నన్నేల చేరఁదీసియుండును? ఈ వసిష్ఠాదులెట్లు నన్నుఁ దమతో

గలుపుకొని పనిచేయుదురు? ఎవ్వఁడైన నాస్తికవాదముచేసిన నేనే వానివాదమును ఖండింతును. ఇప్పుడు నేనుజేసినవాదము ధర్మమునకు హానివచ్చినప్పుడు ఎట్లయిన ధర్మస్థాపనము చేయుటకై చేసినదే. నీవు రాజవై యట్లుచేసితివేని నిన్ను నేనే యాక్షేపించి యిప్పుడు నేనుజేసిన వాదమును ఖండించియుందును. ఇప్పుడు నాస్తికవాదము చేయుటకాదు. ఎప్పుడైన నిట్టి కష్టకాలము వచ్చునేని మరల నాస్తికవాదము చేయుదును. ధర్మమందుండి యింతదేశమును నరాజకముచేసి యిందఱ ప్రజల నాశము చేయుట యెక్కువకీడా? నీవొకఁడు తత్కాలమున నాస్తిక్యము నంగీకరించిన ప్రభువై లోకరక్షణము సేయుట మేలా? నీవొకఁడవు చెడినను లోకమంతయు బాగుపడును గదా! యని నాయభిప్రాయము. ఏకకాలమున రెండు పరస్పరవిరుద్ధ విపత్తులు సంభవించునేని తక్కువ విపత్తుగ్రహించి గొప్పవిపత్తును దొలఁగఁ ద్రోయవచ్చును.

ఆ. కడఁగి నిన్నుఁ బురికి • గ్రమ్మఱింపఁగఁగోరి, భరతుఁ డిట్లు జాలి•పడుటకతన
నీయనుగ్రహంబు • నెత్తిపొందఁగోఱకునై, యట్లు పలికినాఁడ • నసఘ సైఁపు. ౩౪౬౦

తాత్పర్యము.

నిన్ను నేవిధముగానైన నయోధ్యకుఁ బిలుచుకొనిపోవ భరతుఁ డీప్రకారము వ్యసనపడుటచేత నతనియందు నీకు దయవచ్చునుగాక యని యీప్రకారము చెప్పితిని. పాపరహితా! క్షమింపుము. ఒకకార్యము సాధింపఁబూనిన వాఁడెన్నివిధములఁ బ్రయత్నింపవలయునో యన్నివిధములఁ బ్రయత్నింపవలసినది విధి. యుద్ధమందు వీరులు మహాస్త్ర శస్త్రములే ప్రయోగించుచున్నారా? అల్పబాణములఁ బ్రయోగించుటలేదా?

—•{ ౧౧౦-వ సర్గము. వసిష్ఠుఁడు శ్రీరామునితో జ్యేష్ఠుఁడు రాజ్యార్హుఁ డని పూర్వరాజవృత్తాంతము జెప్పుట. }•—

సీ. అనఁ గ్రుద్ధుఁ డైనరా•మునితో వసిష్ఠుండు, పలుకు జాబాలియుఁ•బార్థివేంద్ర!
జనులగతాగతం•బును జక్క నెఱుఁగు ని, న్మరలింపఁ గోరి య•ట్లాడెఁ గాలికి
లోకేశ! వినుమ యీ•లోకసముత్పత్తి యఖల మేకార్ణవ • మైనయపుడు
పుడమి నిర్మింపఁగఁ•బడెఁ బరంబునను స్వ, యంభువు బ్రహ్మ దే•వాళితోడఁ

ఆ. గలిగె నీటమునుఁగు•త్క్ష్మాతలంబును హరి, పోత్రి యఁగుచుఁ దేల్చెఁ•బుత్రయుక్త
నవ్యయుండు నిత్యుఁ • డాకాశభవుఁ డల,బ్రహ్మ జగములెల్లఁ•బరఁగఁ జేసె. ౩౪౬౧

క్రుద్ధుఁడైన=కోపించిన- గతాగతంబును=పోకరాకలను-మరణజననములను - లోక సముత్పత్తి=లోకము పుట్టినవిధము- అఖిలము = బ్రహ్మాండమంతయు-ఏకార్ణవము=ఒకసముద్రముగా- పరంబుననున్=పరబ్రహ్మమగు నారాయణుచే- స్వయంభువుబ్రహ్మ=చతుర్ముఖబ్రహ్మ- క్ష్మాతలంబును = భూప్రదేశంబును- పోత్రి = వరా

హము- హరి=విష్ణువు- పుత్రయుక్త=పుత్రులతోడ- అవ్యయుఁడు = వ్యయములేని వాఁడు- నిత్యుఁడు=ఎల్లప్పుడు నుండువాఁడు- ఆకాశభవుఁడు = పరబ్రహ్మమువలన గలిగినవాఁడు- బ్రహ్మ=చతుర్ముఖబ్రహ్మ.

తా త్ప ర్య ము

జాబాలి యాప్రకారము చెప్పఁగా వతనిపైఁ గోపమువహించిన శ్రీరామచంద్రమూర్తితో వసిష్ఠుఁ డిట్లనియె, రామచంద్రా! జాబాలియు జనుల జనన మరణములు మరణించిన వారెచ్చటికిఁ బోవునదియుఁ బుట్టుచుండువా రెచ్చటినుండి వచ్చునదియుఁ జక్కఁగా దెలియును నిన్నుఁ బరమునకుఁ బిలుచుకొనిపోవ నవ్విధముగఁ జెప్పితినను టయు సత్యమే. అదట్టులుండనీ. ఈలోకము పుట్టినవిధమును జెప్పెదవినుము. బ్రహ్మాండమంతయు జలములోనిండి యొకసముద్రముగా నున్నప్పుడు భూమి సృష్టింపఁబడెను. పరబ్రహ్మముచే బ్రహ్మయు దేవతలు గలిగిరి. ఈ భూమి నీట మునుఁగుచుండఁగా విష్ణువాదివరాహమై తనకొమ్మున దానిని బైకెత్తెను. అప్పుడు, అవ్యయుఁడు నిత్యుఁడు పరబ్రహ్మమువలనఁ గలిగినవాఁడునగు బ్రహ్మ తన తనయులగు మరీచ్యాదులతోఁ బ్రపంచమంతయు వ్యాపింపఁజేసెను. ఆకాశము, పరబ్రహ్మము. "ఆకాశోహవై నామరూపయో ర్నిర్వహితా తే యదంతరా తద్బ్రహ్మ"యని శ్రుతి. "ఆకాశో బ్రహ్మ"యని శ్రుతి. ఆకాశమనఁగా సర్వత్ర ప్రకాశించునది. బాలకాండమున ౧౨౪౭ పద్యమున అవ్యక్తజుఁడు నిత్యుఁడవ్యయుఁడగు బ్రహ్మయని చెప్పఁబడెను. అక్కడ నవ్యక్తవాచ్యుఁడే యిచట నాకాశవాచ్యుఁడు.

ఈ సృష్టివిషయము మనుస్మృతియందు స్పష్టముగా వివరింపఁబడినది.

శ్లో. ఆసీ దిదం తమో భూత మప్రజ్ఞాత మలక్షణమ్
"అప్రతర్క్య మవిజ్ఞేయం, ప్రసుప్తమివ సర్వతః.

ఈ ప్రపంచము ప్రలయకాలమందుఁ జీకటిలో మునిఁగియుండెను. అనఁగా నాకాలమందు మహదాదియగు ప్రకృతి సూక్ష్మప్రకృతియైన తమస్సునందు లీనమై తమస్సు భగవంతునితో నేకీభావముగలదై యుండెను. ఈకారణముచే నది ప్రత్యక్ష ప్రమాణమునకు నగమ్యమై చీఁకటిలోని వస్తువులు కనులకుఁ గానరానియట్టి దశ గలదై యిది ప్రపంచమని గుర్తింపఁదగిన చిహ్నములు లేనిదై అప్పుడు వాచకశబ్దములు లేనికారణమున శబ్దముచేఁగూడఁ దెలియరానిదై యంతయు నిద్రించుచున్నట్లుండెను.

శ్లో. తతః స్వయంభూ ర్భగవా నవ్యక్తో వ్యంజ యన్నిదమ్
మహాభూతాది వృత్తౌజాః, ప్రాదురాసీ త్తమోనుదః.

ప్రలయావసానకాలమున జ్ఞాన బలైశ్వర్య తేజోవీర్యములుగల భగవంతుఁడగు పరమాత్మతానే తనసంకల్పముచే శరీరమును బరిగ్రహించునుగాని యాయన

శరీర పరిగ్రహమునకు మనవలెఁ గర్మాదులు కారణముగాదు. ఇట్లు బాహ్యేంద్రియములకు గోచరముగాని శరీరముధరించి మహత్తు, ఆకాశాది మహాభూతములను దొలుత సూక్ష్మరూపమున నావల స్థూలరూపమున నప్రతిహతవృత్తుఁడై ప్రకాశింపఁజేయును. ఆయనయే ప్రలయావస్థను ధ్వంసముచేసి సృష్టివిషయమై ప్రకృతిని ప్రేరించుచు నావిర్భవించెను.

శ్లో. యోవసావతీంద్రియగ్రాహ్యః సూక్ష్మోవ్యక్త స్సనాతనః
సర్వభూత మయోచింత్యః సఏవస్వయము ద్బభౌ.

సకలలోక వేదపురాణేతిహాసాది ప్రసిద్ధుఁడగు పరమాత్మ మనస్సుచే గ్రహింప యోగ్యుఁడై బాహ్యేంద్రియములకు గోచరింపనివాఁడై యవయవరహితుఁడై నిత్యుఁడై సర్వభూతాత్మయై కావున నిట్టివాఁడని చింతింపరానివాఁడై తానే మహదాది సర్వరూపముల నుద్భవించెను.

శ్లో. సోభిధ్యాయ శరీరా త్స్వాత్సి సృక్షు ర్వివిధాః ప్రజాః
అపఏవ ససర్జాదౌ తాసు బీజమవాసృజత్.

ఆపరమాత్మ తనశరీరమునుండి సమస్తప్రజల సృష్టింపనెంచి జలములు గలుగునుగాక యని ధ్యానింపఁగా మొట్టమొదట జలములు గలిగెను. ఆ నీటియందు స్వశక్తిరూపమైన బీజముంచెను.

శ్లో. తదండ మభవద్ధైమం, సహస్రాంశు సమప్రభమ్
తస్మిన్ జజ్ఞేస్వయంబ్రహ్మా, సర్వలోక పితామహః.

ఆబీజము సూర్యకాంతిగల బంగారువన్నెగల యండమయ్యెను. పూర్వజన్మమందు నేను హిరణ్యగర్భుఁడ నౌదునుగాక యని యేప్రాణి భగవంతు నుపాసించెనో యాలింగశరీరముగల జీవమునఁ బ్రవేశించి పరమాత్మ తానే సర్వలోకములకుఁ గారణభూతుఁడైన హిరణ్యగర్భుఁడుగ జన్మించెను.

శ్లో. ఆపో నారా ఇతిప్రోక్తా, ఆపోవై నరసూనవః
తాయదస్యాయనం, తేన నారాయణః స్మృతః

ఆపములు (జలము) నారములు అవి నరుఁడనుపేరుగల పరమాత్మ బిడ్డలు. అట్టినారములు పరమాత్మ కునికిపట్టగుటచే నీపరమాత్మ నారాయణుఁడనఁబడెను.

దీని సారాంశమేమనఁగా! ప్రలయమునఁ దొలుతఁ బృథివి గంధతన్మాత్రమున లయించును, గంధతన్మాత్రము జలమందు లయించును, జలము రసతన్మాత్రమున లయించును, రసతన్మాత్రము తేజస్సున లయించును, తేజస్సు రూపతన్మాత్రమున లయించును, రూపతన్మాత్రము వాయువున లయించును, వాయుస్పర్శతన్మాత్రమున లయించును, స్పర్శతన్మాత్రము ఆకాశమున లయించును, ఆకాశము శబ్దతన్మాత్రమున లయించును, శబ్దతన్మాత్రము కర్మేంద్రియ జ్ఞానేంద్రియమనస్సు అహంకార

మున లయించును, అహంకారము మహత్తు (బుద్ధితత్త్వము) నందు లయించును మహత్తు ప్రకృతియందు లయించును, ప్రకృతి తమస్సునందు లయించును, తమస్సు జీవునియందు లయించును, జీవునకుఁ బరమాత్మతో నేకీభావము కలుగును. లయ మనఁగా నాశమనికాదు. ఇమిడిపోవుట; దుర్భిణియంత్రమందు నొకదానిలో నొకటి ౫-౬ గొట్టములుండును, అన్ని సాగఁదీసితిమా గజముపొడుగగును. ఒకదానిలో నొకటి క్రమముగా ముడుచుచువచ్చిన ౖవేలెఁడు గొట్టమగును. ౖవేలెఁడు గొట్టము గానున్నప్పుడు తక్కినవానికిస్వరూపనాశములేదు. ఈ విధముగా భగవంతుఁ డవ్యాకృతాత్ముఁడై రూపము, నామము, క్రియ లేనివాఁడై కొంతకాలముండును. అవల మరల సృష్టిని సంకల్పించును. ఆ సంకల్పశక్తిచేఁ బ్రకృతియందు క్షోభము గలుగును, అప్పుడు మరల నొకదానిలోనుండి మఱియొకటి తమస్సు, ప్రకృతి, మహత్తు, అహంకారము, ఆకాశతన్మాత్రము, ఆకాశము, వాయుతన్మాత్రము, వాయువు, అగ్ని తన్మాత్రము, అగ్ని, జలతన్మాత్రము, జలము, పృథివీ తన్మాత్రము, పృథివి, పృథివి నుండి యోషధులు- ఈ ప్రకారము వరుసగా నుద్భవించును. ఇది పరిణామమం దురు, (Evolution) ముందుచెప్పినది విపరిణామము (Involution) విపరిణామము చాఁప చుట్టుటవంటిది. పరిణామము చాఁపవిప్పి పఱచుటవంటిది.

ఇవన్నియుఁ జేయువాఁడెవఁడు? వానియంతట నవియే యైనవా? ప్రకృతి జడము కావునఁ దానంతటనది పరిణామము చెందలేదు. జీవుఁడు కర్మబద్ధుఁడై యా కాలమునఁ బ్రకృతిలోఁ గలిసియుండుటచే నతనికి నాశక్తిలేదు. కావున నివన్నియుఁ జేయువాఁడు భగవంతుఁడే. పూర్వకల్పమందు నేజీవి తాను బ్రహ్మగాఁ గావలయు నని కోరి తపస్సుచేసెనో లింగశరీరముతోఁగూడి తనయందు లీలమైయున్న జీవిలోఁ దాను బ్రవేశించి యాబ్రహ్మ తానేయై సృష్టికార్యము చేసికొనును. అట్టులే క్రమముగ సూక్ష్మములుగనున్న తనరూపములను స్థూలములుగఁ జేసికొనును.

ఈ విధముగ సర్వము భగవంతుఁడేయని యేర్పడెను. జీవుఁడు, ప్రకృతి యనునవి రెండును భగవచ్ఛక్తులు; జీవుఁడు చైతన్యశక్తి, ప్రకృతి జడశక్తి. ఈరెంటి యందు భగవంతుఁడు ప్రవేశించియే యుండును. ఈ రెండును భగవంతుని ధారణ పోషణములకు లోపడియుండును. ఇదియే మనుసమ్మతమైన మతమని కుల్లూకభట్టు.

“కింతు బ్రహ్మైవా వ్యాకృత శక్త్యాత్మనా జగత్కారణ మితి త్రిదండి వేదాంత సిద్ధాంత ఏవాభిమతః ప్రతిభాతి” యని వ్రాసియున్నాఁడు. విష్ణుపురాణ మందు నిట్టులేయున్నది. కాని గ్రంథవిస్తరభీతి ననువదింపఁ బడదయ్యెను. కావున జగత్సృష్టి యింద్రజాలము కాదు. మిథ్యయుఁ గాదు.

సీ. ఆయనకు మరీచి • యతనికిఁ గశ్యపుఁ, డతనికి భాస్కరుఁ • డాతనికిని
మనుఁ డుదయించెను • మనువానఁ డిక్ష్వాకుఁ, గనియె నయోధ్యనా•తనికి నిచ్చె
మను వట్టు లగుట నా•తని మూలపురుషుఁగా, నెంచు మీకులమున • కెల్ల నధిప
కుక్షి యాతనికి వి•కుక్షి యాతనికిని, నతనిపుత్రుఁడు బాణుఁ • డతుల బలుఁడు

తే. బాణపతి కనరణ్యుఁ డా•క్షోణినాథు, పాలనంబునఁ దస్కర• బాధగాని
కఱవు డామరములు గాని•కలుగవయ్యె, సత్యధర్మగరిష్ఠుఁడై •జరగుకతన. ౨౮౭౨

తా త్ప ర్య ము.

ఆ బ్రహ్మకు మరీచి, మరీచికిఁ గశ్యపుఁడు, కశ్యపునకు భాస్కరుఁడు, భాస్కరునకు మనువు, మనువునకు నిక్ష్వాకువు, నుదయించిరి. అయోధ్యను మను విక్ష్వాకునకిచ్చెఁ గావున మీవంశమునకు నిక్ష్వాకువే మూలపురుషుఁడు. అతనికిఁ గుక్షి, అతనికి వికుక్షి, అతనికి బాణుఁడు, బాణున కనరణ్యుఁడు కలిగిరి. ఈయనయే రావణుతో యుద్ధముచేసి శపించినవాఁడు. ఈయన పాలనవేళ దొంగలభయము కఱవులు లోనగునవి లేవు. ఈయన మిగుల సత్యధర్మనిష్ఠుఁడు.

కం. అతనికి బృథుభూపతి, జాతుం డైకీర్తిఁ గనెఁ ద్రి•శంకుఁ డతనికిన్
బ్రీతికరపుత్రుఁ డై దివి, కై తనమెయితోడఁ జనియెఁ • బతిపర్యరతిన్. ౨౮౭౩

కం. కలిగెం ద్రిశంకునకు ని, ర్మలచరితుఁడు సుతుఁడు ధుంధు•మారఖ్యాతిన్
వెలయుచు యువనాశ్వుం డన, బలియుఁడు మాంధాత యతని•పట్టియ రామా. ౨౮౭౪

తా త్ప ర్య ము.

అనరణ్యునకుఁ బృథువు, అతని కుమారుఁడు త్రిశంకుఁడు. ఇతనికి సత్యవ్రతుఁడని మొదటిపేరు. ఇతఁడు దేహముతో స్వర్గమునకుఁ బోయెను, త్రిశంకునకు ధుంధుమారుఁడు అతనిపేరే యువనాశ్వుఁడు అతనికి బలశాలి మాంధాత జనించెను.

కం. మాంధాతృతనయుఁ డయ్యె సు,సంధి యతనితనయులు ధ్రువ•సంధియు దృఢవీ
ర్యాంధుఁడు ప్రసేనజితుఁడున్, బంధురకీర్తి ధ్రువసంధి•భరతుం గనియెన్. ౨౮౭౫

తా త్ప ర్య ము

మాంధాత కొడుకు సుసంధి. అతనికొడుకులు ధ్రువసంధి, ప్రసేనజితుఁడు, ధ్రువసంధికొడుకు భరతుఁడు.

సీ. భరతుఁడసితుఁగాంచె•బగతురు హైహయుల్,తాలజంఘులుశూర • తములువాని
నాహవంబున గెంట • నతఁడు ప్రవాసియై, చలిమల ముని యయి • సంచరించె
నతనియిల్లాం డ్రిర్వు • రటఁ జూడి ధరియింప, సవతికి విష మన్య•పతి యొసంగె
నటఁ గర్భనష్టికై • యాపతి కాళింది, చ్యవనునిచెంతకుఁ • జని యెఱింగి

ఆ. వంతె నతఁడు నదయుఁ•డై వరకామ కిల్లనియె నీకుఁబుత్రుఁ•డఖిలలోక
విశ్రుతుండు వైరి•విజయుఁడు వంశక,రుండు సాధునుతగు•ణుండు పుట్టు. ౨౪౭౬

తా త్ప ర్య ము.

భరతునికొడుకు అసితుఁడు, ఈయనను హైహయులు తాలజంఘులు నను వారు యుద్ధమున నోడించి రాజ్యమునుండి వెడలఁగొట్టిరి. అతఁడు దేశము విడిచి పోయి మంచుఁగొండయందుఁ దిరుగుచుండెను. ఆయన కిరువురుభార్యలు, వారిలో నొకతె గర్భవతికాఁగా సవతిమచ్చరమున రెండవ దామెకు విషముపెట్టెను. గర్భవతియగు కాళింది చ్యవను నొద్దకుఁబోఁగా నాముని దయగలవాఁడై తనవలన వరముకోరు నామెకు నీకు జగములఁ బ్రసిద్ధిగాంచి శత్రువులగెలిచి వంశము నుద్ధరించు సజ్జనస్తోత్ర పాత్రుఁడైన కొడుకు పుట్టునని దీవించెను.

కం. అని దీవించిన ప్రొక్కుచుఁ, జని యింటికిఁ బద్మ నేత్రు • సారసగర్భా
భుని సుతునిఁ గనె గరముతోఁ, జనియించుటఁ జేసి యతఁడు • సగరుం డయ్యెన్. ౨౪౭౭

సారసగర్భాభుని=బ్రహ్మతోసమానుఁడగువానిని. గరముతోన్=విషముతో.

తా త్ప ర్య ము.

ఇట్టులు దీవింపఁగా నామె నమస్కరించి యింటికిఁబోయి కమలముల వంటి నేత్రములుగలిగి బ్రహ్మతోసమానుఁడైన కొడుకును గనెను. వాఁడు విషముతోఁడఁ బుట్టినవాఁడగుటచే సగరుఁడను పేరుకాంచెను.

కం. త్రవ్వించె నీరనిధి ము,న్నవ్విభుఁ డాతనితనూజుఁ • డసమంజుఁడు దా
గ్రొవ్వున శిశువులఁ జంపఁగ, నవ్వగపడ గానలందు • నెట్టింపఁబడెన్. ౨౪౭౮

నీరనిధి=సముద్రము.

తా త్ప ర్య ము.

ఆరాజు పూర్వము సముద్రమును త్రవ్వించెను. అతనికొడు కసమంజుఁడు వాఁడు శిశువులను బాగరునఁ జంపఁగ సగరుఁ డతని దేశమునుండి వెడలఁగొట్టెను.

సీ. ఆయసమంజున • కంశుమంతుఁడు పుట్టె, నతఁడు దిలీపుఁ డ•న్సుతునిఁ గాంచె
నతఁడు భగీరథా•ఖ్యమహీశుఁ గాంచెనా,యనపుత్రుఁడుకకుత్స్థుఁ •డార్యచరితుఁ
డతనిపేరను గాదె • యన్వయజుల కెల్లఁ, గాకుత్స్థు లనఁగఁ బ్ర•ఖ్యాతి గలిగె
నతఁడు రఘువుఁ గాంచె • నతఁడు కల్మాషపా,దుం డనఁ బురుషాద•కుండు ననఁగ

తే. మఱియు సౌదాసుఁ డనఁగ నా•మముల నొప్పు
నతనిఁ గాంచెను; శంకణుఁ • డతనిసుతుండు
దశములను గూడి జనకుని • వలనఁ బుచ్చె
నతనికొడుకు సుదర్శనుఁ • డనఁదగుఁ దేఁడు. ౨౪౭౯

తా త్ప ర్య ము.

ఆయసమంజునకు నంశుమంతుఁడు పుట్టెను, అతనికి దిలీపుఁడు, అతనికి భగీరథుఁడు, ఆయనకొడుకు కకుత్స్థుఁడు, ఆయనపేరనే యీవంశమువారు కాకుత్స్థులనఁబడుచున్నారు. ఆయనకొడుకు రఘువు, అతనికొడుకు కల్మాషపాదుఁడు, ఆయన పేరే పురుషాదకుఁడు, సౌదాసుఁడు. అతనికొడుకు శంఖణుఁడు, అతనికొడుకు సుదర్శనుఁడు.

ఆ. ఆసుదర్శనునకు • నగ్నివర్ణుఁడు తత్పు,త్రుండుగాఁగ శీఘ్ర•గుండు నయ్యె
వానికొడుకు మరుఁడు • వాఁడు ప్రశుశ్రుకుఁ, గనియె నంబరీషుఁ•గనియె నతఁడు.
౨౮౭౦

ఆసుదర్శనునకు నగ్నివర్ణుఁడుపుట్టెను, అతనికొడుకు శీఘ్రగుఁడు, వానికొడుకు మరుఁడు, వానికొడుకు ప్రశుశ్రుకుఁడు, వానికొడు కంబరీషుఁడు.

కం. మహిపతి నహుషుం డతనికి, నహుషునకుం బుత్రుఁ డయ్యె • నాభాగుం డా
మహితాత్మున కిరువుర సుతు,లహార్యధృతులజుఁడు సువ్ర•తాఖ్యుఁడు నాఁగన్.
౨౮౭౧

తా త్ప ర్య ము.

అతనికి నహుషుఁడు నహుషునికొడుకు నాభాగుఁడు, అతనికి నిరువురు కొడుకులు మొదటివాఁడు అజుఁడు, రెండవవాఁడు సువ్రతుఁడు.

కం. ఆయజునకు దశరథపతి, దాయాదుం డయ్యె నతని•తనయులలో నీ
వే యగ్రజాతుఁడవు రామా! య ట్లౌట నిలనేలు•మాతండ్రివలెన్. ౨౮౭౨

దాయాదుఁడు = కొడుకు- అగ్రజాతుఁడవు = మొదటఁ బుట్టినవాఁడవు- జ్యేష్ఠుఁడవు.

తా త్ప ర్య ము.

అజుని కుమారుఁడు దశరథుఁడు, ఆయనకొడుకులలో నీవు పెద్దవాఁడవు, గనుక రామచంద్రా! నీతండ్రివలె నీవు భూమిని పాలింపుము.

కం. అనఘా! యిక్ష్వాకులలోఁ, దనయుఁడు జ్యేష్ఠుండు రాజ్య•తంత్రముఁ దీర్పన్
జనుఁ గులధర్మము విడువక, కొనుమీ రాష్ట్రంబు నేలు•కొనుమీ ప్రజలన్
౨౮౭౩

పాపరహితుఁడా! యిక్ష్వాకువంశమునఁ బుట్టినవారిలో నిప్పుడు నేను జెప్పిన ప్రకారము వంశపరంపరగాఁ బెద్దవాఁడే రాజగుచున్నాఁడు. కావున నీవును వంశధర్మముఁ దప్పింపక రాజ్యాభిషేకము నంగీకరించి ప్రజలఁ బాలింపుము.

—• ౧౧౧-వ సర్గము. వసిష్ఠుఁడు శ్రీరాముని రాజ్యంబుఁ గొను మనివేఁడుట.•—

మ. అనుచు న్వెండి వసిష్ఠుఁ డెంతయును న్యా•యం బార ని ట్లాడు నో
జనపాలాగ్రణి రామ! పూరుషున కా•చార్యుండునుం దల్లియున్

జనకుండు న్గురు లైరి ముప్వు రిల జ• న్మం బిచ్చుటం దల్లియున్
జనకుండున్, మఱి జ్ఞానదాత యయి యా•చార్యుండు, నవ్వారిలోన్. ౨౮౮౪

వెండి=మఱియును- జ్ఞానదాత=జ్ఞానము నిచ్చినవాఁడు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము వంశాచారము ననుసరించి పెద్దవాఁడవైన నీవే రాజుగా నుండ వలయునని చెప్పి వేఱొకన్యాయ మనుసరించి మఱియుఁ జెప్పుచున్నాఁడు. రామచంద్రా! పురుషునకుఁ దండ్రి. తల్లి, యాచార్యుఁడని ముగ్గురు గురువులు. జన్మమునకుఁ గారణభూతులౌటచేఁ దల్లిదండ్రులును జ్ఞానోపదేశము చేయుటచే నాచార్యుఁడును గురువులైరి.

కం. తనువు నొసంగినజననీ, జనకులకంటెను సుబుద్ధి•సంపదఁ గూర్పన్
గనుటను నాచార్యుఁడె గురుఁ, డనుపెనుపుం గాంచి శ్రేష్ఠుఁ•డయ్యెను రామా. ౨౮౮౫

తనువు=దేహము- సుబుద్ధిసంపద=మంచిజ్ఞానసంపత్తి- ముప్వురన్=ముప్వురయందు- కొన్ని యెడల వజడము తృతీయసప్తములకు బహుత్వంబున ద్వితీయ చూపట్టెడి. ప్రౌ. వ్యా.

తా త్ప ర్య ము.

ఆ ముప్వురయందు దేహమునకుఁ గారణభూతులైన తల్లిదండ్రులకంటె జ్ఞానసంపద ననుగ్రహించిన యాచార్యుఁడే శ్రేష్ఠుఁడు, మనుష్యుఁడుగాఁ బుట్టినను జ్ఞానములేనివాఁడు పశువువంటివాఁడే కదా. సహి విద్యాతస్తం జనయతి తచ్ఛ్రేష్ఠం జన్మ' యని ప్రమాణము.

తల్లిదండ్రులకంటె గురువు శ్రేష్ఠుఁడనుటకుఁ బ్రమాణము.

శ్లో. ఉత్పాదక బ్రహ్మదాత్రోర్గరీయాన్ బ్రహ్మదః పితా
బ్రహ్మజన్మహి విప్రస్య, ప్రేత్య చేహచ శాశ్వతమ్.

రెండవజన్మము నొసఁగు నాచార్యుఁడును దండ్రికంటె శ్రేష్ఠుఁడు. బ్రహ్మగ్రహణార్థమైన జన్మము బ్రహ్మప్రాప్తియను ఫలము గలిగించును గాన నది యిహపరములందు రెండిటియందును శాశ్వతమైనది. తండ్రికంటె గురువు శ్రేష్ఠుఁడేకాని తల్లికంటె గాఁడు.

శ్లో. కామాన్మాతాపితా చైనం యదుత్పాద యతోబుధః
సంభూతి తస్యతాం విద్యాద్యద్యోని నావభిజాయతే,

తల్లిదండ్రులు మోహముచేఁ గలిసి శిశువును బుట్టించుచున్నారు, పశువులు మున్నగువానివలె మాతాపితలు శిశు వేయోనియందుఁ బుట్టునో యతనికిఁ దమ యవయవముల నొసఁగుదురు.

శ్లో. ఆచార్య స్త్వస్య యాంజాతిం, విధివద్వేదపారగః
ఉత్పాదయతి సావిత్ర్యా, సాసత్యా సాజరామరా,

వేదపారగుఁడైన యాచార్యుఁడు బ్రహ్మచారికి గాయత్రిచే శాస్త్రపురస్సరం బుగ నేజన్మము నొసఁగుచున్నాఁడో అదియే బ్రహ్మప్రాప్తి హేతుభూతమైనది గాన శాశ్వతమై ముదిమి చావులులేని జన్మము ఉపనయనము చేసికొన్న వానికి వేదాధ్యయనము వేదార్థజ్ఞానము అనుష్ఠానము వీనిచే నిష్కామముగ మోక్షసిద్ధిగలదు గాన నాచార్యుఁడే శ్రేష్ఠుఁడు.

శ్లో. పితు ర్మాతుర్గురూణాం చ, ఆచార్యస్యచ సర్వదా
హితం వా ప్య హితంవాపి, తత్కార్య మవిశంకయా. అనుశాసనిక.

తల్లి, తండ్రి గురువు, ఆచార్యుఁడు చెప్పినది హితమైనను అహితమైనను సందేహింపక చేయవలయును.

కం. ధరణీతనయాధవ నీ,గురువునకున్ గురుఁడ నేను ♦ గురుఁడను నీకున్
వరమతి నానుడి వినినను, బరఁగదు సన్మార్గగతికి ♦ భంగము తండ్రీ. ౨౮౬

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రా! నేను నీతండ్రికి గురుఁడను, నీకును గురుఁడను నామాట వినిన నీ సన్మార్గవర్తనమునకు భంగమురాదు.

కం. ధరణీసురులును వీ రే, పురజనులును వీరె ద్విజులు ♦ పుణ్యులు వీరే
పరిపాలింపుము వీరలఁ, బరఁగదు సన్మార్గగతికి ♦ భంగము తండ్రీ! ౨౮౭

ధరణీసురులును=బ్రాహ్మణులును- వీరే=ఇదిగో- పురజనులు=అయోధ్యయందుండు పెద్దమనుష్యులు- ద్విజులు=క్షత్రియులు- వైశ్యులు.

తా త్ప ర్య ము.

ఇదిగో బ్రాహ్మణులు, వీరేక్షత్రియులు, వీరే వైశ్యులు, వీరే నగరమునందు తక్కిన పెద్దమనుష్యులు. ఇందఱు నేకగ్రీవముగ నిన్నుఁ బ్రార్థించుచున్నారు. కావున వీరినెల్ల నాయనా! పాలింపుము.

కం. వరధర్మశీల వృద్ధయు, గురుమతి నీతల్లి యామెఁ ♦ గొలువమి తగునా?
చరియింపు మామెనుడి విని, పరఁగదు సన్మార్గగతికి ♦ భంగము తండ్రీ! ౨౮౮

వరధర్మశీల=శ్రేష్ఠమైన ధర్మము చేయు గుణము స్వభావముగాఁ గలది-వృద్ధ=పెద్దది- గురుమతి=గొప్పమనస్సుగలది- కొలువమి=సేవింపకయుండుట.

తా త్ప ర్య ము.

ఇదిగో మీతల్లి, గొప్పధర్మమునందు వర్తించుట యామెకు సహజగుణము. ఆమె ధర్మమునకు విరుద్ధముగాఁ జెప్పునదికాదు. అందు ముసలిది, పుత్రవియోగ బాధ సహింపలేని వయస్సునందున్నది. ఆమెనీదుఃఖముతో మరణించెనా యామె మృతికి నీవు కారణమగుదువు. అది పుణ్యకార్యము కాదుగదా! అదియును దలి

దండ్రులు జీవించియుండువఱకు వారిసేవతప్ప మఱియే వ్రతములు తపములు చేయ రాదను ధర్మశాస్త్రవాక్యము నీ వెఱుఁగవా? తల్లిమాట మీఱి వర్తింపరాదుగదా. కావున నామెమాటవిని యట్లు వర్తించిన నీకుఁ బరలోకహానిలేదు. 'పితుశ్శతగుణం మాతా' యనుపలుకు నీ వెఱుంగవా?

"తేషాం త్రయాణాం శుశ్రూషా పరమంతప ఉచ్యతే
నతైరభ్య ననుజ్ఞాతో ధర్మమన్యం సమాచరేత్.

తల్లి, దండ్రి, ఆచార్యుఁడు వీరి శుశ్రూషయే పరమతపము, వారియాజ్ఞ లేక వేఱుధర్మ మనిష్ఠింపరాదు.

శ్లో. యావత్పితాచమాతాచ, ద్వావేతౌ నిర్వికారిణౌ
తావత్సర్వం పరిత్యజ్య, పుత్రస్స్యాత్త త్పరాయణః
మాతాపితాచ సుప్రీతౌ స్యాతాం పుత్రగుణైర్యది
సపుత్ర స్సకలం ధర్మం ప్రాప్నుయా త్తేన కర్మణా. దేవలుఁడు.

తల్లిదండ్రు లెంతవఱకు జీవించియుందురో అంతవఱకు సర్వమువదలి వారి శుశ్రూష చేయవలయును. ఎవని శుశ్రూషవలనఁ దల్లిదండ్రులు సంతోషింతురో యాతఁడు తా శుశ్రూషచేతనే సకలధర్మములు చేసినఫలము నొందును.

తే. సత్యధర్మపరాక్రమ • జానకీశ, ప్రార్థనముచేయు చున్నట్టి • భరతుపలుకుఁ
బట్టి వర్తించు టాత్మాతి • వర్తనంబు, గాదు నాపలుకుఁ గైకొమ్ము • కరుణ మీఱ.

సత్యధర్మపరాక్రమ=సత్యమును ధర్మము ననుష్ఠించుటయందుఁ బరాక్రమము గలవాఁడా- సత్యము ధర్మమే పరాక్రమముగాఁ గలవాఁడా- సత్యముచే ధర్మముచేఁ బరుల నాక్రమించువాఁడా- ఆత్మాతివర్తనంబు=ఆత్మ = సత్యధర్మముల ననుష్ఠించు స్వభావమును- అతివర్తనంబు = అతిక్రమించుట- (౨) నీకుఁ బ్రాణమువంటి భరతుని నతిక్రమించిపోవుట- కాదు=తగదు.

### తాత్పర్యము

నీవు తక్కిన క్షుద్రరాజులవలె భుజబలముచేఁ బరుల నాక్రమింపవలయునని చూచువాఁడవు కావు. నీవు సత్యధర్మముల ననుష్ఠించుటయందుఁ బరాక్రమము చూపువాఁడవు. సత్యధర్మముచేఁ బరుల నాక్రమించువాఁడవు. సత్యధర్మములచేఁ బరమును సాధించువాఁడవు. ఇట్టినీవు సత్యధర్మమార్గమునఁబోవ నిష్టపడియున్నావు. అది మంచిదే సత్యధర్మములకు విరుద్ధమగుకార్యము చేయుమని నేనుజెప్పను. అయి నను భరతుఁడుచేయు ప్రార్థనమును నీవంగీకరించుట నీయాత్మను నీవతిక్రమించి యంతఃకరణమునకు విరోధముగా వర్తించుటగాదు. జానకీశా! నీవు కష్టపడఁగలిగి నను నీ జనకరాజకుమారి సుకుమారియగు సీతను జూడుము. ఆమె మెట్టీమడ వులలో దుఃఖింపఁగలదు? ఆమెను నిష్కారణముగ దుఃఖపెట్టుట తగునా? అది పాపకార్యముగాదా? కాఁబట్టి నామాట వినుము, నీకాత్మాతివర్తనదోషము తగదు.

ఆశ్రితులకుఁ బరతంత్రుఁడవై యుండుట నీస్వభావము. నీవు సామాన్యధర్మములైన సత్యమును ధర్మమును మీఱరాదని యెట్లు తలఁచుచున్నావో యట్లే నీవాశ్రితుల నతిక్రమించిపోవుట యను ప్రత్యేకధర్మమును నతిక్రమింపరాదు శరణాగతుఁడైన భరతుని ద్రోచిపుచ్చి యెట్లు శరణాగతరక్షణ ధర్మము నతిక్రమింపఁగలవు?

—•{ శ్రీరాముఁడు వసిష్ఠునితో నాచార్యులకంటెఁ దల్లిదండ్రులు శ్రేష్ఠు లని చెప్పుట }•—

చం. అన విని రాముఁ డి ట్లనియె • నార్యజనోత్తమ పుత్రలబ్ధికై
పనిగొని తల్లి దండ్రి పడు•పాటులకుం బ్రతి సేయ నౌనె! యిం
పునఁ దలఁ జూచి నీళ్ళు, కడు•పుం గని యన్నము, పోసి పెట్టి యెం
డను జలి గాలిఁ బ్రోతురు ది•నంబును,వారలతుల్యులే యొరుల్? ౨౮౦

అర్యజనోత్తమ=సన్మార్గప్రవర్తకులయందు గొప్పవాఁడా- పుత్రలబ్ధికై=పుత్రులు గలుగవలయునని- పనిగొని=ప్రయత్నపడి- పడుపాటులకున్=అనుభవించు కష్టములకు- ప్రతి=బదులు- చేయనౌనె=చేయసాధ్యమా.

తాత్పర్యము.

అయ్యా! సన్మార్గవర్తకులలో నీ వెంతో గొప్పవాఁడవే, నీ విట్లుచెప్పెదవేమి? కొడుకులు కావలయునని కోరి యుపవాసాది వ్రతములుచేసి యాహారనియతి వహించి రోగాదులచే వారు పడుకష్టములకుఁ బ్రత్యుపకార మెవరేమి చేయఁగలరు? వారే కదా తలచూచి నీళ్ళు, కడుపుచూచి యన్నము వేళవేళకుఁ బోసిపెట్టి కేవలము పరాధీనదశయందుండు బిడ్డలను జలిగాలికి బాధపడకుండ దినదినము గడియగడియ రక్షింతురు. వారితో సమానము గురుఁడగునా? గురుఁడు విద్యనేర్పువాఁ డంటివి. 'సతికుడ్యే చిత్రకర్మ.' గోడయుండినఁగదా బొమ్మలువ్రాయుట, యలంకరించుట లోనైనవి. గోడలేకున్న నెవరేమిచేయుదురు? అట్టులేవారు బిడ్డను గలిగించినఁగదా గురు వుపదేశించుట. ఈ గురువునొద్దకు వచ్చువఱకుఁ బోషించినవారు, కావలసినవి నేర్పినవారెవరు? అట్టి తల్లిదండ్రులకంటె గురువెక్కుడా! శ్రుతియును మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవయని తల్లినిదండ్రిని చెప్పినతరువాతనే కదా యాచార్యుని చెప్పెను.

ప్రతి, ఇది సంస్కృతశబ్దము. అవ్యయము అయినను సదా, సర్వదా శబ్దములవలె దీనికి నాంధ్రంబునఁ బ్రత్యేక ప్రయోగముకలదు, "ఎవ్వారు నీప్రతిలేరీ భువనత్రయంబున, కు. హరి 10. అ. ఏనునీ ప్రతిగ వర్ణనచేసెద". హై. ౮ ఆ.

కం. తనుఁ దాను గాచుకొనఁ జా,లనిదశ నేమఱక యెపుడు • లాలించుచు వ
ర్ధన మొనరింతురు సత్ప్రియ,మును బల్కుదు రయ్యా! వారు•ముచ్చట మీఱన్. ౨౮౧

## తాత్పర్యము.

ఆ తల్లిదండ్రులు శిశువులు దమ్ముఁదాము కాపాడుకొననేరని దశయందుఁ బ్రమాదపడక యెల్లవేళల బుజ్జగించుచుఁ బెంతురు. సంతోషముతో బిడ్డలకు సంతోషకరమైన మాటలనే చెప్పుదురు. వారిమేలే కోరుచుందురు. ఇట్లు మనోవాక్కాయములచే బిడ్డలను బెంతురు. కావున నిట్టివారితో నితరులెట్లు సమానులగుదురు.

గురువులకంటెఁ దల్లిదండ్రులు శ్రేష్ఠులనుటకుఁ బ్రమాణములు.

శ్లో. ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతంపితా
సహస్రంతు పితౄన్మాతా, గౌరవేణాతిరిచ్యతే.

పదిమంది యుపాధ్యాయులకంటె నొకయాచార్యుఁడు శ్రేష్ఠుఁడు. నూర్వురాచార్యులకంటెఁ దండ్రి శ్రేష్ఠుఁడు. వేవురు తండ్రులకంటె గౌరవమునందుఁ దల్లి గొప్పది.

ఏతేమాన్యా యథాపూర్వమేభ్యో మాతాగరీయసీ.
ఉపాధ్యాయుఁడు మొదలగువారి యందఱికంటెఁ దల్లి గొప్పది.
యోభావయతి యస్సూతే యేనవిద్యోపదిశ్యతే
జ్యేష్ఠభ్రాతాచ భర్తాచ పంచైతే గురవస్స్మృతాః.

తండ్రి, తల్లి, విద్యనుపదేశించినవాఁడు, అన్న, భర్త, యీ యైదుగురిలో మొదటి ముగ్గురు శ్రేష్ఠులు, వారిలోఁ దల్లి శ్రేష్ఠురాలు.

శ్లో. యంమాతా పితరౌక్లేశం, సహేతే సంభవేనృణామ్
నతస్య నిష్కృతి శ్శక్యా, కర్తుం వర్షశతైరపి. మను. ౨- ౨౨౭.

బిడ్డను గనుటయందు దల్లిదండ్రు లెంతో దుఃఖమును సహింతురు. నూఱు సంవత్సరములైనను వారు చేసినదానికిఁ బ్రతిచేయ సాధ్యముగాదు.

శ్లో. మాసాన్ దశోదరస్థం యాధృత్వా శూలైస్సమాకులా
వివిధై ర్వేదనాదుఃఖైః ప్రసూయేత విమూర్ఛితా
ప్రాణైరపిప్రియాన్ పుత్రా న్మన్యతే సుతవత్సలా
కస్తస్యా నిష్కృతిం కర్తుం శక్తో వర్షశతైరపి. వ్యాసులు.

తల్లి పదినెలలు కడుపునధరించి కడుపుశూలలు నానావిధములైన దుఃఖములు సహించి ప్రసవవేదనచే మూర్ఛపోయి బిడ్డనుగనుచున్నది. తనప్రాణమునకంటెఁ గొడుకెక్కువయని తలంచుచున్నది. అట్టితల్లికి నూఱువర్షములు జీవించినను నామె ఋణమెవఁడు తీర్చుకోఁగలఁడు?

శ్లో. ద్వావాగురూ పురుషస్యేహ, పితామాతాచ ధర్మతః
తయోరపి పితా శ్రేయాన్ బీజప్రాధాన్య దర్శనాత్
అభావే బీజనో మాతా తదభావేతు పూర్వజా.

పురుషున కిరువురు గురువులు, తల్లి దండ్రి. వారిలో బీజప్రదానము శ్రేష్ఠము కావునఁ దండ్రి యెక్కుడు, తండ్రిలేని కాలమునఁ దల్లి యెక్కుడు, వారిరువురు లేరేని అన్న యెక్కువ.

ఆచార్యః శ్రేష్ఠో గురూణాం మాతేత్యేకే. గౌతముఁడు.

ఆచార్యుఁడు గురువులందు గొప్పవాఁడు, కొందఱు తల్లి శ్రేష్ఠురాలందురు.

శ్లో. నాస్తి మాతృసమం దైవం, నాస్తి పితృసమో గురుః
తయోః ప్రత్యుపకారోఽపి, న కథంచ న విద్యతే. దేవలుఁడు.

తల్లితో సమమైన దైవము తండ్రితో సమానుఁడగు గురువు లేఁడు. ఆయిరువురకుఁ జాలినంత ప్రత్యుపకార మెట్టిదో తెలియదు.

ఆచార్యుఁడు తల్లిదండ్రులకంటెఁ దానెక్కువ యనెను. తండ్రికంటె గురువుకంటెఁ దల్లి తానెక్కువయనెను. అందఱికంటెఁ దండ్రి యెక్కువని రామచంద్ర మూర్తి యనుచున్నాఁడు. ఈవివాదపరిష్కార మెట్లు:— బ్రహ్మచారికి విద్యాభ్యాస కాలమందుఁ దల్లిదండ్రులకంటె నాచార్యుఁడే యెక్కువ. గురువు చెప్పినదానికి విరోధముగఁ దల్లిదండ్రులు చెప్పరాదు. అంతకుఁ బూర్వము, ఆవల గురునికంటెఁ దల్లిదండ్రులే యెక్కువ. ఆ యిరువురిలో గౌరవమందుఁ దల్లి యెక్కువ యైనను నాజ్ఞయందు (మగనియాజ్ఞకుఁ దాను లోఁబడియుండవలసినదే కావున) దండ్రి యెక్కువ. ఇచ్చట మంఁదాజ్ఞ చేసినవాఁడు తండ్రి కావున నాయనయాజ్ఞకు విరోధముగ నుత్తరకాలమునఁ దక్కినవారు చెప్పినదానికంటె నాయన చెప్పినదే పాటింపవలయును.

ఉ. కావునఁ గన్న తండ్రి కొడుకా! యిటు సేయు మటంచు మున్న దా
నావిధి నాజ్ఞ సేసెఁ గద • న్యాయ్యమె యాతనిపల్కు కల్లయై
పోవఁగఁ జేయఁ? నాఁ గయిక • పుత్రుఁడు సూతునిఁ జూచి సారథీ!
నీ విట నేలఁ గూర్పు కుశ • నిర్మిత మాసనమున్ మదర్థమై. ౨౪౨

కుశనిర్మితము=దర్భలచేఁ జేయఁబడినది. గన్నతండ్రి = దత్తతీసికొన్న తండ్రి గాదనిభావము. దీనివలన దత్తతీసికొన్న తండ్రి యాజ్ఞ మీఱినను విశేషదోషము గాదని సూచన. దత్తత యించుమించు పుత్రుని వెలకుఁగొనుటవంటిది. తనసొత్తు వానికి వ్రాసియిచ్చి వానిని గైకొనుటయేకదా! కన్నవానికిఁ గొన్నవానికి నెంత భేదము లేదు?

## తాత్పర్యము.

ఈ కారణముచేఁ గన్నతండ్రి పుత్రకా! నీ వీప్రకారము చేయవలసినదని మీకందఱకుఁ దెలిసిన ప్రకారము నా కాజ్ఞయిచ్చెఁగదా! ఆయనమాట యబద్ధమై పోవునట్లు చేయుట నాకున్యాయ్యమా? మీమాట మీఱినదానికై మిమ్ము క్షమింపఁ బ్రార్థింపఁగలను, మరణించినవానిని నేనేమని ప్రార్థింతును. నేను మీమాట మీఱి

నచో మీాకురాఁగల నష్టిగాని కష్టముగాని లేదుగదా. ఆయనమాట మీాఱిన నాయనకు స్వర్గహాని నరక ప్రాప్తి గలుగునుగదా? నన్నుఁగని పెంచినదానికి నిదియా నేనాయనకుఁ జేయు నుపకారము? తండ్రిలేనప్పుడు తల్లియాజ్ఞ పాటింపవలయు నంటివి. సంతోషమే. అదియెప్పుడు? తండ్రియేమియుఁ జెప్పకుండినప్పుడుగదా. ఆసన్న మరణదశయం దెవరేమిచెప్పినను వారికోరిక దీర్పవలసినది బ్రదికియుండు వారికి విధి. కావున నాకుఁ దండ్రియాజ్ఞయెట్టిదో మాతల్లికి భర్తయాజ్ఞ యట్టిదే కదా. భరతుఁ డాశ్రితుఁడు. ఆశ్రితత్యాగము ధర్మముకాదంటివి. సత్యము. నేను దానిని గాదనను. పితృవాక్యపరిపాలనమను ప్రారబ్ధ మతని కడ్డుపడియున్నది. అది తీరఁగానే యతని యభీష్టము నెఱవేర్పఁగలను. కాలవిలంబనమే కాని పూర్ణ త్యాగములేదు. ప్రజలందఱు యాచించుచున్న వారంటివి వారికిఁగావలసినది పరిపాలనమేకదా. పాలించువాఁడెవఁడైన వారికేమి? నేను గాకున్న నాతమ్ముఁడు పాలించును, దానివలన వారికేహానియు లేదుగదా. కావునఁ దండ్రియాజ్ఞమీాఱి వర్తించుటకు నాకుసామర్థ్యములేదు. అని యీ ప్రకారము శ్రీరామచంద్రమూర్తి చెప్పఁగా విని భరతుఁడు నిరాశుఁడై వాదములోఁ గార్యము చక్కఁబడదు. మొండికివేసికొని యయోధ్యాపాపమని మనస్సు కరగఁజేయవలయునని తలఁచి సుమంత్రునిఁ జూచి సారథీ! నానిమిత్తమై యిచ్చట దర్భాసన మేర్పఱుపుము. అనెను.

దీనివలన శ్రీరామచంద్రమూర్తి ప్రాచార్యుఁడైన వసిష్ఠునికంటె గురువగు తండ్రి వాక్యమే శ్రేష్ఠమని చెప్పినట్లాయెను. అదిసరిగాదు. "ఆచార్య ప్రాచార్యసన్నిపాతే ప్రాచార్యాయోప సంగృహ్యోప సంజిఘృక్షే దాచార్యం ప్రతిషే ధేదితర" యని యభివాదన ప్రకరణమున నాపస్తంబసూత్రము కలదు. దీనివలన నాచార్యునికంటెఁ బ్రాచార్యుఁడే (ఆచార్యున కాచార్యుఁడు = ప్రాచార్యుఁడు) ప్రబలుఁడని యేర్పడుచున్నది. కావున నాయన వచనమే కర్తవ్యమని చెప్పవలయును గదా. మఱియును విప్రతిషిద్ధ ధర్మములనేకము లోకసారిగఁ దటస్థించెనేని స్వధర్మనిర్వాహణమే శ్రేష్ఠమనికదా న్యాయము. కావునఁ దండ్రియొకఁడు వనవాసమునకు బొమ్మనిచెప్పిన దానికంటె నాచార్యుఁడు తల్లి, పౌరులు నిందఱు చెప్పిన స్వధర్మనిర్వాహణమే శ్రేష్ఠముగదా, కాదు. ఎట్లన:— "ఆచార్యాధీనః స్యాదన్యత్ర పతనీయేభ్య యని యాపస్తంబసూత్రము కలదుగదా, దానివలనఁ బతనమురాని కార్యములందు గురువచనము కర్తవ్యమేకాని పతనభయము కలిగినపు డాచార్యవాక్యము పాటింపరాదు. ఇచ్చట సత్యవచనభంగముచేఁ బాతిత్యము సంభవించును గాన నాచార్యవాక్యము నవలంబింపరాదు. మఱియు "పాతకాన్యపి పూయంతే పితుర్వచనకారిణ" యను చిరకారివాక్యముచేఁ బితృవాక్యము పాలించుటచే నితరపాపములును నశించుచున్నవి. కావునఁగదా పరశురాముఁడు తండ్రి వాక్యముచొప్పున

మాతృహత్య గావించెను. కావున నాజ్ఞావిషయమునఁ దండ్రి వాక్యమే యతి ప్రబలము. ఆచార్యునికంటెఁ బ్రాచార్యుఁ డెక్కువయను విషయమభివాదన విషయమే కాని సర్వత్రగాదు. కావునఁగదా విశ్వామిత్రుఁడు తాటకను జంపుమని చెప్పినప్పుడు తండ్రియాజ్ఞ స్మరించి యట్లుచేసెను. తొలుత దశరథుఁడు నీవడవికిఁ బొమ్మని రామచంద్రమూర్తికిఁ జెప్పలేదు. అవల సీతాలక్ష్మణులతో నే నడవికిఁబోయెద ననినఁ బోయిరమ్మనెను. ఇది యనుజ్ఞయేకాని యాజ్ఞకాదు. ఇప్పుడు తల్లి పట్టాభిషేకము చేసికొమ్మనునది యాజ్ఞ. దానినెట్లు మీఱవచ్చుననినఁ దల్లికి నాజ్ఞాధికారము లేదని ముందే చెప్పఁబడెను.

కూర్పు కుశనిర్మిత మాసనమున్=దీనివలన నెంతకష్టించియైన గురువుల యనుగ్రహము సంపాదించుకొనవలయునని సూచితము. "యోవాచయతి యస్సూతే యేన విద్యోపదిశ్యతే జ్యేష్ఠభ్రాతాచ భర్తాచ పంచైతే గురవస్తథా। ఆత్మనః సర్వయత్నేన ప్రాణత్యాగేనవాపునః। పూజనీయా విశేషేణ పంచైతే భూతిమిచ్ఛతా।

శంకరుఁడు.

తండ్రి, కన్నతల్లి, విద్యనేర్పినవాఁడు, అన్న, మగఁడు వీరైదుగురు గురువులనఁబడుదురు. ఎన్ని ప్రయత్నములచేనైనఁ దుదకుఁ బ్రాణత్యాగము చేసియైన వారిని దనశ్రేయస్సు గోరువాఁడు విశేషించి పూజింపవలెను.

ఉ. రాముఁడు పట్టనంబునకు • రా మదిఁ బూనెడిదాఁక నింద శా
లాముఖమందు నప్పిడి యి•లాత్రిదశుం డధమర్ణు వాకిటన్
మోమున గుడ్డ వైచుకొని • ముట్టక కూడును నీళ్ళు నుండు న
ట్లేమియు ముట్టకేను వసి•యించెద, నిశ్చయ మిద్ది నావుడున్. ౫౮౩

రాన్=వచ్చుటకు- శాలాముఖమందు=ఇంటివాకిట- అప్పిడి=అప్పు + ఇడి=అప్పిచ్చి- ఇలాత్రిదశుండు=బ్రాహ్మణుఁడు- అధమర్ణు=అప్పుదీసికొనినవానియొక్క.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తికి నామీఁద దయవచ్చి యయోధ్యకు వచ్చెదను లేరా నాయనా యని చెప్పువఱకు నప్పిచ్చిన బ్రాహ్మణుఁ డప్పు రాఁబట్టుకొనుటకై యప్పు దీసికొన్నవాని వాకిట ముఖమున గుడ్డముసుఁగువేసికొని కూడునీళ్ళు ముట్టక యెట్లు పండుకొనునో యట్లు పండుకొనెదను. ఇది నానిశ్చయము.

సీ. ఆసుమంత్రుండు రా•మాస్యంబుఁ జూచుచు, వేచియుండఁగ రఘు•వీరుఁ డపుడు
తాన దర్భలతోడఁ • దల్పంబుఁ గల్పించి,కొనియున్న నాతని • కనియె రాముఁ
డన్న! యేయపకార•ము న్నీకుఁ జేసితి, వాకిటి కడ్డంబు • పండుటకును
నుత్తమస్థుఁడువిప్రుఁ•డొంటిప్రక్కనపండు, దనసొమ్ముమరలంగ•గొనుటకొఱకుఁ
ఆ. దల కిరీట మూని • ధరణిఁ బాలించెడి,ధరణిపతికిఁ నిట్లు • దగునటయ్య
లెమ్ము విడుము భరత•యిమ్మహావ్రతమును, మరలి చనుమునా దు•మాటవినుము

రామాస్యంబు = రామచంద్రమూర్తిముఖము, వేచియుండఁగ=అంగీకారమునకై కాచియుండఁగా, భరతుఁడు తలపెట్టినది ప్రాయోపవేశము = మరణార్థియై పండుకొనుట. అంత ఘోరపరీక్ష శ్రీరామచంద్రమూర్తికి సమ్మతమో యసమ్మతమో తెలియక సుమంత్రుఁ డేమియుఁ జేయఁజాలక యూరకుండెను. పెద్దవారు సమక్షమున నున్నప్పుడు వారి యనుమతిలేక పిల్లవాండ్రయాజ్ఞను సేవకులు చేయరాదు. ఈ కారణముచేతనే రావణవధానంతరము సీత లక్ష్మణునితోఁ జితిపేర్పుమన్నప్పుడు లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి సమ్మతిదీసికొని యాపనిచేసెను. (యుద్ధ పద్య. ౨౬౮౮. అని జనకాత్మజాత యిటులాడిన దీనత లక్ష్మణుండు రా। ముని వదనంబుఁ జూచి నృపముఖ్యుని యాకృతి సూచితతాయం। బునుగొని తన్మతంబునను ధారిచితన్ సమకూర్చ) నని యున్నది. రఘువీరుఁడు = భరతుఁడు, తల్పంబు= శయనము, ఉత్తమర్ణుఁడు=అప్పిచ్చినవాఁడు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి యాజ్ఞకొఱకై కాచి యాయనముఖముఁ జూచుచు సుమంత్రుఁ డూరక నిలఁబడియుండఁగా భరతుఁడు తానే దర్భలుపఱచుకొని పండుకొనుటకు సిద్ధపడిన భరతునిఁజూచి రామచంద్రమూర్తి యిట్లనియె. తమ్ముఁడా! అప్పిచ్చిన బ్రాహ్మణుఁడు తనయప్పు రాఁబట్టుకొనుటకై యప్పుదీసికొనినవాని వాకిట నొకప్రక్కనే యిటులటులు పొరలక పండుకొనును; నీకు నేనేమి యపకారము చేసితినని నీ వట్లు చేయఁదలపెట్టితివి? ఇంతకు నది బ్రాహ్మణునకుఁ దగును గాని తలమీఁదఁ గిరీటముపెట్టుకొని రాజ్యమేలు క్షత్రియునిధర్మమా? లేలే, యిటువంటి వ్రతమును వదలుము. నామాట విని మరల నయోధ్యకుఁ బొమ్ము.

కం. అన విని భరతుం డనుఁ బుర,జనులను వీక్షించి రామ•చంద్రుని మీరై
నను దేర్పరె మరలింపరె, యనవుడు వారెల్లఁ బలికి • రాభరతునకున్. ౨౮౫౫

తా త్ప ర్య ము.

అని రామచంద్రమూర్తి చెప్పఁగా విని భరతుఁడు ప్రజలదిక్కు మొగమై యార్యులారా! మాయన్నకు నామీఁద దయరాలేదు. మీరాయనకు ముఖ్యులు గదా మీరైనఁ జెప్పి యయోధ్యకుఁ బిలుచుకొనిపొండు, మీరే యాయనకుఁ దగిన సమాధానము చెప్పుఁడనఁగా వారందఱు భరతునితో నిట్లనిరి.

ఉ. కంటిమి రామచంద్రుమదిఁ • గల్గినచందముఁ, దద్వచస్థితుల్
వింటిమి లెస్సపల్కెడి వి•వేకధనుం డల తండ్రి వాక్యమం
దుంటయె యిష్ట మీసుకృతి • కొందువిధంబులు ప్రీతిఁ గూర్చ,నీ
దంట మరల్ప మాతరమె • దాశరథీ! యన రామచంద్రుఁడున్. ౨౮౫౬

తద్వచఃస్థితుల్=తత్=రామచంద్రమూర్తియొక్క, వచస్స్థితుల్ = మాటల తీరు, వివేకధనుండు=తప్పొప్పులఁ జక్కఁగాఁ దెలిసినవాఁడు, సుకృతికిన్=పుణ్యాత్మునకు, ఒండు=వేఱు, దంటన్=సమర్థుని.

తాత్పర్యము.

భరతా! నీవు చెప్పినదానికంటె నెక్కువ మేమేమి చెప్పఁగలము? నీ కాయన చెప్పుచున్న ప్రతివచనముల తీరుఁబట్టి యాయన మనస్సువిధముఁ దెలిసికొంటిమి. ఒప్పుదప్పులు జక్కఁగాఁ దెలిసినవాఁడు కావునఁ జక్కఁగానే చెప్పుచున్నాఁడు. ఆయన యేమితప్పు చెప్పెనని యీయనకు మేము చెప్పఁగలము? తండ్రివాక్యము పరిపాలింపవలయుననియే యీయనకోరిక. ఆయనకు దానియందుండు ప్రీతి రాజ్యమందు మఱియెవరియందు లేదు. ఇట్టివానిని మరల్చుటకు మాకుసాధ్యమా? అనిరి.

ఉ. ఆపలు కాలకించి భర•తా యిటు లా హితు లొచుధర్మమే
ధాపరు లైనవారినుడి • దద్దయు నీమది వీరిపల్కులున్
నాపలుకుం దలంచి మఱి • న్యాయ్యపథంబునఁ బొమ్ము, తేర కే
లా పడియుండ, నన్నును జ•లంబుల నంటుము దోషశాంతికై. ౨౮-౭

హితులు=మేలుగోరువారు, ధర్మమేధాపరులు=ధర్మబుద్ధియుండాసక్తిగలవారు.

తాత్పర్యము.

ప్రజలుచెప్పిన మాటలువిని రామచంద్రమూర్తి భరతా! లోకులు చెప్పిన మాట వింటివిగదా. మేలుగోరి ధర్మమందే యాసక్తిగలిగి నిష్పక్షపాతముగాఁ జెప్పెడి వారిమాట తీరిటులేయుండును; నీవు ధర్మపక్షపాతివిగాక నాయందలి ప్రేమచేఁ బలుకుచున్నావు కావున వీరిమాట నామాట మనస్సునకుఁ దెచ్చుకొని న్యాయ్యమార్గమునఁ బొమ్ము. ఏల యూరక నేలఁబడియున్నాఁడవు? వ్రతములేనివాఁడు దర్భలపైఁ బరుండరాదు. దోషము. క్షత్రియుఁడు నీవు సంకల్పించినవ్రతము సంకల్పింపను రాదు. అది స్వధర్మవిరుద్ధము. కావున దోషముపోవ నన్నుఁ జలములను దాఁకుము.

జలములు తాఁకుటయనఁగా నాచమింపుమని యర్థము. అశుద్ధినిమిత్తము కలిగినప్పుడు గురువుల స్పృశించి యాచమించిన శుద్ధుఁడగును. తన్నుఁదాఁకుమనుట నిఁక నిట్టివి చేయనని ప్రమాణము చేయుమనుట.

కం. అన లేచి భరతుఁ డటువలె, వినయంబున జలము లంటి • విశ్వజనంబుల్
విన ని ట్లనియె న్వినుఁడీ, జనములు నాపల్కు సరస•సమ్మతరీతిన్. ౨౮-౮

విశ్వజనంబుల్=సమస్తప్రజలు.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి యీప్రకారము చెప్పఁగా విని భరతుఁడు దర్భాసనము విడిచి లేచి యాయన చెప్పినప్రకారము జలములను దాఁకి ప్రజలందఱు విను

నట్లు వారితో నిట్లనియె, జనులారా! నాపలుకులు సరసము సమ్మతమునైన విధముగా వినుఁడు.

ఉ. కోరినవాఁడఁగాను ధరఁ • గూర్పు మటంచును దండ్రి, నెప్పుడున్
గోరినవాఁడఁగా నిటులు • కుత్సితవృత్తిఁ జరింపఁ గైకయున్,
శ్రీరఘురాముఁ డీయడవిఁ • జేరు టెఱుంగను, దండ్రి వాక్యమే
తీరుపఁ గార్యమేని వని • దేవరమాఱుగ నేన యుండెదన్. ౨౮౯

కుత్సితవృత్తిన్ = మోసవ్యాపారము, దేవర = దేవశబ్దభవము, ప్రభువని యర్థము.

తాత్పర్యము.

తండ్రిని నాకు రాజ్యమిమ్మని నేను గోరలేదు. ఇటువంటి కుచేష్టలు చేయుమని తల్లిని గోరలేదు. శ్రీరామచంద్రమూర్తి యడవికి వచ్చినవార్తయు నేనెఱుంగను. తండ్రివాక్యము పరిపాలించుట యావశ్యకమేని మాయన్నగారి మాఱుగ నేనుండెదను. ప్రతినిధుల నేర్పాటుచేయుట శాస్త్రసమ్మతమయిన కార్యమేగదా. కావున నీ పరివర్తనము నంగీకరింపుఁడు.

—• శ్రీరాముఁడు వనవాసానంతరము రాజ్యంబుఁ గొన నంగీకరించుట. •—

కవిరాజవిరాజితము.

అనవుడుఁ దథ్యహితోక్తికి విస్మితుఁ • డై విభుఁ డిట్లనుఁ బౌరులతో
జనకుఁడు గొన్నది యమ్మిన దాహిత • సత్త్వము మార్పఁగ నొప్పునె యీ
తనికిది నాకును గావునఁ దద్విధి • దప్పఁగ నేఁడిట నొల్లఁ జుఁడీ
వని విధిఁ దీర్పఁగఁజాలెడి నేనటు • భంగి భరం బిడ బాలునిపై. ౨౯౦

తథ్యహితోక్తికిన్ = సత్యము హితమునైనమాటకు, ప్రతినిధుల నేర్పాటు చేయుట శాస్త్రసమ్మతమగుటచేఁ దథ్యము, రాజ్యమర్పించుట హితము, విస్మితుఁడై = ఆశ్చర్యపడినవాఁడై, ఆహితము=కుదువయుంచఁబడినది, రామచంద్రమూర్తికిఁ దాను శిష్యుఁడు గావున నాయన పూనినవ్రతము నాయనకుమాఱుగఁ దాను జేసెదనని భరతుఁడు చెప్పెను. శ్రీరామచంద్రమూర్తి దానిని దథ్యసూక్తి యని తలఁచెను. దీనివలన గురువులవ్రతమును శిష్యులు వారికిమాఱుగఁ జేయవచ్చునని యేర్పడు చున్నది. అట్లు శిష్యులుచేసిరేని గురువులపాపము పోవును.
ఈ విషయమై విష్ణుపురాణంబున నిట్లుగలదు.

"పూర్వమేవం మునిగణైః, సమయోయః కృతో ద్విజ
వైశంపాయన ఏవంతు, తం వ్యతిక్రాంతవాన్ స్తదా.
స్వస్త్రీయం బాలకం సోఽథ, యథాధృష్ట మఘాతయత్
శిష్యానా హచ హేశిష్యాః, బ్రహ్మహత్యాపహం వ్రతమ్

చరధ్వం మత్కృతేసర్వే, నవిచార్యమిదం తతః
బ్రహ్మహత్యా వ్రతంచీర్ణం, గురుణా చోదితై స్తథా॥

ఇందు బ్రహ్మహత్యచేసిన గురువు తనపాపముపోవ శిష్యులను వ్రతముచేయుఁడని చెప్పెను.

తాత్పర్యము.

భరతుఁడు చెప్పిన తథ్యము హితమునైనమాటకు రామచంద్రమూర్తి యాశ్చర్యపడి పౌరులతో నిట్లనియె. ఆర్యులారా! తండ్రి జీవించియుండఁగా నాయన కొన్నదానిని అమ్మినదానిని గుదువయుంచినదానిని నిప్పుడాయన లేఁడను కారణముతో వీఁడుగాని నేనుగాని తప్పిపోవచ్చునా? అటుచేయుట వీనికిఁదగదు. నాకుఁదగదు. నేనేమీ తండ్రిమాట వ్యర్థముచేయ నొల్లను. వీఁడు తండ్రిమాటయందు లక్ష్యములేక తానుగూడ నడవిలోనుండి తండ్రియాజ్ఞ మీఱిన నేనేమి చేయఁగలను? తండ్రి నాకు వనవాసమిచ్చి దానికి వెలగా నారాజ్యముసు గొనెను. దాని నెట్లు మార్పసాధ్యము? నాకుఁ బ్రతినిధిగాఁ దాను నడవులయందుండెద ననెను. శక్తిలేక వేఱుమార్గములేక యున్నప్పుడుగదా ప్రతినిధులను శాస్త్ర మంగీకరించుచున్నది. వారుణస్నానము చేయలేనివానికిఁగదా గౌణస్నానము విధింపఁబడినది; వారుణస్నానమునకు శక్తియున్నప్పుడు గౌణస్నానము చేయవచ్చునా? ఆపద్ధర్మము లాపదయందుఁగాని తక్కినవేళల నాచరింపవచ్చునా? కావున నేను వనవాసము చేయుటకు శక్తియుండఁగా నాకుమాఱుగఁ జిన్నవానిని నీవు వనవాసము చేయుమని యెట్లు చెప్పుదును? పెద్దవాఁడను నేనే చేయలేనని వీఁడెట్లు చేయఁగలఁడు?

"కొన్నది.... దీనివలనఁ గొడుకుల నమ్మ నధికారము తండ్రికిఁ గలదని యేర్పడుచున్నది."

శ్లో. శోణితశుక్ల సంభవో మాతాపితృ నిమిత్తకః
తస్యదాన పరిత్యాగ విక్రయేషు మాతాపితరౌ భవతః॥ బోధాయనుఁడు.

తల్లిశోణితము తండ్రిశుక్లము కలిసి బిడ్డఁడగుచున్నాఁడు కావున వానిని దానమిచ్చుటయందుఁ, బరిత్యజించుటయందు, విక్రయించుటయందు వారికిరువురకు నధికారము గలదు.

ఉ. న్యాయము పల్కెఁ గైక, వసు•ధాధిపుఁడుం జరియించె ధర్మమం
దీయనఘుండు ధీరగుణుఁ • డీడ్యుఁడు తొంటుఁడు వృద్ధసేవనా
త్యాయతభక్తియుక్తుఁ డని • యాల్మ నెఱుంగుదు, సత్యశీలి కై
కేయిప్రియాత్మసూతికిని • క్షేమమ కల్గెడు నెల్ల వేళలన్. ౨౯౧

ఈడ్యుఁడు = పొగడ్తకుఁ దగినవాఁడు, తొంటుఁడు = ఓర్పుగలవాఁడు, వృద్ధసేవనా=వృద్ధుల సేవించుటయందు,ఆయతభక్తియుక్తుఁడు=విస్తారమైన భక్తిగలవాఁడు ప్రియాత్మసూతికిని=ప్రియకుమారునకు.

### తాత్పర్యము.

ఆర్యులారా! వీఁడు తల్లిని దండ్రిని దూషించుచున్నాఁడు గాని వారియందు దోషములేదు. కైక న్యాయమేచెప్పెను. వివాహకాలమందు దశరథుఁడు చేసిన వాగ్దానమునేకదా యామె యడిగెను. నీవుచెప్పిన మాటప్రకారము నడుచుకొమ్మ నుట తప్పా? దశరథుఁడును ధర్మమందే చరించెను. తాను జేసిన వాగ్దానమును నెఱ వేర్చుటయందేమి యధర్మమున్నది? ఇతనియందును దోషములేదు. ధీరాత్ముఁడు, కనుకనే స్తోత్రపాత్రుఁడు. ఓర్పుగలవాఁడు పెద్దలసేవయందు మిగుల భక్తిగల వాఁడు. కావుననే నాసేవకోరుచున్నాఁడు. ఇవన్నియు నాకుఁదెలియును. కాఁబట్టి సత్యస్వభావముగల యీ భరతునకు క్షేమము గలుగునుగాక!

చం. వనమున నాలుగుంబదియు•వర్షము లుండి యనంతరంబు వ
ట్టనమున కేఁగుదెంచి ప్రక•టంబుగఁ బట్టము నొంది యప్పు డీ
యనుజునితోడ నుండు నెటు•లంబ వచించినపల్కుఁ దీర్త నా
యనువునఁ బెద్దవాఁడ నని•యాడినఁ దీర్పఁగ రాదె పీనికిన్ ౨౫౦౨

నాలుగుంబది=పదునాలుగు, వర్షములు=సంవత్సరములు, అంబ=తల్లి, అనంతరము=అవల, అనువునన్=విధముగా.

### తాత్పర్యము.

"నేను బదునాలుగు సంవత్సరములు వనములందుండి యావల నయోధ్యకు వచ్చి పట్టాభిషేకము చేసికొని యప్పు డీతమ్మునితోడ నుండెదను. ఏవిధముగనైనను దల్లియగు కైకచెప్పినమాట నెఱవేర్తును. పెద్దదిగదాతల్లి. ఆమెమాటను జిన్న వాఁడనైన నేను నెఱవేర్పవలయునుగదా యని నేను బూనినట్లు నేను దవకంటెఁ బెద్దవాఁడను, తండ్రివంటి తండ్రిని. అట్టినేను జెప్పినప్పుడు పెద్దవాఁడు చెప్పు చున్నాఁడే ఆయనమాట విందము అని యీమాత్రము నాగౌరవము వీఁడు దక్కింప రాదా! ఇంత మొండితనమా!!

### ౧౧౨-వ సర్గము.

సీ. అనఁగ నంతిక్షితు•లైనసిద్ధర్షులు, నన్నదమ్ములపల్కు•లాలకించి
యద్దిరా యిట్టిమ•హాత్ములఁ గన్నయా, దశరథుం డెంతటి•ధన్యుఁడో
యని ప్రశంసించిరి • యాత్మల దశకంఠు, వధముఁ గోరుచు నున్న•పరమమునులు
భరతునిఁ గన్గొని • పల్కిరి నీతండ్రి, తీరియింపఁ గోరెడి•తలఁపు గల్గె

ఆ. నేని గ్రాహ్య మగును•జానకీధవుపల్కు, దండ్రిబుణముఁ దీర్పఁ•దగు నితనికిఁ
గైకబుణము దీఱఁ•గాదె నిజవనుండు, స్వర్గలోకమునకుఁ•జనుట భరత. ౨౫౦౩

అంతక్షితులు=కానరాకయున్నవారు, సిద్ధర్షులు=సిద్ధులు ఋషులు, ఆలకించి=విని, అద్దిరా=ఔరా, ప్రశంసించిరి=పొగడిరి, గ్రాహ్యము=గ్రహింపఁదగినది.

తా త్ప ర్య ము.

ఈప్రకారము శ్రీ రామచంద్రమూర్తి చెప్పఁగా సభవారికిఁ గానరాక యున్న సిద్ధులు ఋషులు నా యన్నదమ్ముల మాటలు విని యౌరా! యిటువంటి గొప్పమనస్సు గొప్పస్వభావము గలవారిని గొడుకులుగాఁగన్న దశరథుఁడెంత పుణ్యాత్ముఁడో కారణగుణము కార్యమందు వర్తించునన్నట్టు లతఁడెంత గొప్పవాఁడు గాకుండిన నింతగొప్పవారిని గొడుకులుగాఁ గనునా? యని రామభరతులఁ దమ మనస్సులంచే పొగడిరి. ఇక సభయందుండి వారి సంవాదము వినుచున్న గొప్పమునులు దశకంఠుని చావుగోరుచున్న వారగుటచే శ్రీరాముఁ డయోధ్యకుఁ బోవుటకు సమ్మతింపనివారై భరతునిఁజూచి యిట్లనిరి. భరతా! నీతండ్రి తరింపవలెనని నీకుఁగోరిక యుండెనా శ్రీరామచంద్రమూర్తి చెప్పినట్లు నీవు చేయుము. ఈయన తండ్రి ఋణముఁ దీర్చుటే తగును; కైకయప్పు తీరుటచేఁగదా నీతండ్రి స్వర్గమునకుఁ బోఁగలిగెను. లేకున్న నసత్యమాడిన దోషమువకై నరకముపాలయి యుండునుగదా.

తే. అనుచు గంధర్వసిద్ధర్షు•లరిగి రిచ్ఛ, హృష్టవదనాబ్జుఁ డగుచు నీ• తేశుఁ డపుడు
మునులవాక్యంబులకుఁ జాల• మోద మంది,వారి నెల్లరఁ బూజించె • గౌరవమున: ౨౫౦౭

ఇచ్ఛన్=వారి యిష్టప్రకారము, హృష్టవదనాబ్జుఁడు = సంతోషించిన ముఖకమలము గలవాఁడు, మోదము=సంతోషము.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము గంధర్వులు సిద్ధులు ఋషులు చెప్పి వారివారి యిష్టముప్రకారము వెడలిపోయిరి. మునులమాటలకు శ్రీరామచంద్రమూర్తి మిగుల సంతోషముచే వికసించిన ముఖకమలము గలవాఁడై వారిని గౌరవించెను.

తే.అందఱకు సమ్మతం బైన•యగ్రజాతు, వాక్యముల విని భయమున • వణఁకుమేన
హస్తములు రెండుజోడించి • యధికవినయ,గరిమని ట్లను జానకీ•కాంతుఁగనుచు. ౨౫౦౮

సమ్మతము=మనస్సునకు సరిపడినది, అగ్రజాతు=అన్న.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి మాటలనే సభ్యులంద అంగీకరించుటఁ జూచి మన మాట నెవరు సమ్మతింపరైరే యిఁకనేమి చేయుదును అన్న యయోధ్యకు రాఁడే నాగతియేమి యని భయమున వణఁకుచుఁ జేతులు రెండు జోడించి భరతుఁడు మిక్కిలి వినయముతో శ్రీరామచంద్రమూర్తితో నిట్లనియె.

చం.అతులపరంపరాగతని•జాన్వయధర్మము క్షత్రధర్మమున్
మతిఁ దలపోసి తీర్పఁ దగు • మామకమాతృమనోరథంబు లీ

క్షితితల మే నొకండఁ దమి • సేయఁ జమీ భరియింప, భూప్రజా
వితతిమనంబు సంతసము• పెట్టఁగ నైనను నేర నన్న యా. ౩౫౦౬

అతుల=అసమానమైన, పరంపరాగత=వంశపారంపర్యముగా (క్రమముగా) వచ్చిన నిజాన్వయధర్మము=మనవంశముయొక్క ధర్మమును, క్షత్రధర్మమున్=రాజ్య పరిపాలనమే ముఖ్యధర్మమను క్షత్రియులధర్మమును, తలపోసి=ఆలోచించి,మామక=నాయొక్క, మాతృమనోరథంబు=తల్లికోరిక, తమి = కోరిక, భూప్రజా = భూమియా జనులయొక్క, వితతి=సమూహముయొక్క.

తా త్ప ర్య ము.

అన్నా! అసమానమైన మనవంశక్రమమున వచ్చినదైన ధర్మమును క్షత్ర ధర్మమును మనస్సునందాలోచించి నాతల్లికోరిక నెఱవేర్పను. ఈభూభారమును నే నొకఁడనే భరియింపఁగోరను. ఒకవేళ కోరినను నే నీప్రజలకు సంతోషకరముగఁ బాలనము చేయ లేను.

కం.మనచుట్టంబులు యోధులు, మనసుహృదులు మిత్రజనులు • మానవితివృటన్
నిను నెదురుచూచువారలు,జనవర! వానకును హాలిక•జనములమాడ్కిన్. ౩౫౦౭

సుహృదులు=మంచి మనస్సుగలవారు, తివుటన్=కోరికతో, హాలికజనముల=దున్నుకొనిబ్రతుకు కాఁపుల, హాలికుఁడు యోజిదున్నునెడ, యని భారతము. హాలికులై వనేమి పోతన. హాలిక హాలిక శబ్దములు రెండును గలవు. మనచుట్టంబులు యోధులనుచో మనయనునది యోధులతో మనసుహృదులు మిత్రజనులనుచో మన యనునది మిత్రజనులతోడను నన్వయించును. మనచుట్టంబులు మనయోధులు మన సుహృదులు మనమిత్రజనులని యన్వయము. "పరులధనమునకు విద్యాపరిణతికిన్ దేజమునకు"నని భారతము. ఇచ్చట పరుల ధనమునకు, పరుల విద్యాపరిణతికి, పరుల తేజమున కని యన్వయము.

తా త్ప ర్య ము.

మనబంధువులు మనయుద్ధశూరులు మనహితము గోరువారు మనమిత్రులు వీరందఱు నెంతోకోరికతో వానకై హాలికు లెదురుచూచుచున్నట్టు నీరాక కెదురు చూచుచున్నారు.

శా. అన్నా! రాజ్యము నొల్ల, నీవ కొనవే • యన్నిండ పీ వంచు నా
పన్నుండై పడి పాదపద్మయుగళిం•బ్రార్థింపఁగా రాముఁ డు
త్పన్నప్రేమను లేవ నెత్తి తనయు•త్సంగంబునం జేర్చి భా
స్వన్నీలాబ్జతనున్ మరాళరవుఁ గం•జా తేక్షణుం బల్కెడున్. ౩౫౦౮

ఆపన్నుండై=దుఃఖముచే దీనుఁడై, పాదపద్మయుగళిన్ = కమలములవంటి రెండుకాళ్ళమీఁద, ఉత్పన్న = పుట్టిన, ఇప్పుడు ప్రేమపుట్టెననుటచే నింతవఱకుఁ బ్రేమలేదని యర్థముకాదు. పాదములమీఁదఁబడి శరణాగతి చేయుటచేఁ బ్రేమ

యతిశయించెనని భావము. ఇది శ్రీరామచంద్రమూర్తి మనస్సున బాగుగ నాటి యున్నది. శరణాగతవత్సలుఁడుగదా కావుననే.

ఉ. నీ వచనంబులన్ వినని నిష్ఠురచిత్తుఁడ నంచు నెంచకో
పావనశీల నామనసు భ్రాంతపయిం జనుచున్న దమ్మహో
భావుఁడు చిత్రకూటమునఁ బాదములంబడెఁ జేతులొగ్గ నిం
తోవడి వేఁడె నన్మరలఁ దోడ్కొని పోవ. యుద్ధ ౨౧౮-౭ ననికదా చెప్పెను.

భగవంతుని యనుగ్రహము సంపాదింపఁ దలఁచినవా రింతకుమించి చేయ వలసినదిలేదు. ఉత్సంగము = తొడ, భాస్వన్నీలాబ్జతనుః=ప్రకాశించు నల్లకలువ వంటి దేహముగలవానిని, మరాళరవమ్ = హంసధ్వనివంటి కంఠధ్వనిగలవానిని, కంజాతేక్షణునిన్ = కమలములవంటి కన్నులుగలవానిని, ఇంతవఱకుఁ దనమీఁద నన్నకు సందేహమేమో చేరఁదీయలేదే యని దుఃఖపడుచుండినవాఁ డిప్పుడు తన్ను శ్రీరామచంద్రమూర్తి లేవఁదీసి తొడపైఁ గూర్చుండఁబెట్టుకొనఁగానే యిఁక భయము లేదు బ్రతికితినన్న సంతోషమున నతని కింతవఱకు దుఃఖాతిశయముచేఁ దెల్లఁబాఱి యుండినదేహము యథాప్రకారము నల్లకలువ వన్నెగలదయ్యెను. ఏడుపుగొంతు పోయి హంసకంఠధ్వనివంటి మంచి కంఠధ్వనివచ్చెను. కన్నులును కమలములవలె వికాసమునొందెను. అని యుపమానముల సారస్యము.

ఇంతవఱకు భరతుఁడు రామానుగ్రహము సంపాదించుకొనుటకై ధర్మశాస్త్ర వాదము చేసెను. ఇతరులచేఁ జెప్పించెను. మఱెన్నియుపాయములు చేసినను వ్యర్థ మగుటచూచి యివన్ని నిష్ప్రయోజనములని యెంచి శ్రీరామచంద్రమూర్తినే యుపాయముగాఁ గొని యాయన కాళ్ళమీఁద నేపడెను. అప్పుడు శ్రీరామచంద్ర మూర్తి యనుగ్రహించెను. కావునఁ దక్కిన సాధ్యోపాయములగు కర్మజ్ఞానయోగ భక్త్యాద్యుపాయముల నెల్ల వదలి "అకించనో నన్యగతిశ్శరణ్య త్వత్పాదమూలం శరణం ప్రపద్యే" యని నిర్వేదముతోఁ గన్నీరుకార్చుచు భగవంతుని పాదములఁ బడుటే పరమోపాయము చరమోపాయము. ఇంతకు మించినదిలేదు. ఇంత దీనుఁడై నిష్కల్మష హృదయముతో భరతుఁడుచేసిన శరణాగతి యేలఫలింపలేదు? ఫలింపక వ్యర్థముకాలేదు. రావణవధార్థమై దేవత లింతకుముందే శరణాగతి చేసిరి. (బాల. ౧౫౭-౭ స.) ఇప్పుడు భరతుఁడు చేసిన శరణాగతి దానికి విరుద్ధ మయినది. అయోధ్యలోఁ బట్టాభిషేకము చేసికొని సింహాసనముపై హాయిగఁ గూర్చుండిన దండకయందలి రాక్షసుల నెవఁడు చంపును? అందలి మునుల నెవఁ డనుగ్రహించును? రావణాదుల నెవఁడు వధించును? ఇది తనకుఁగల నక్షౌహిణి సేనతో నగుకార్యముకాదు. అదియునుగాక నిష్కారణముగ నందఱ నేమని వధించును? కావున నరణ్యవాసము విహితకృత్యమైయున్నది. పరస్పరవిరు ద్ధమైనవి రెండు తటస్థించి రెండును జేయవలసినవే యైనపుడు ముందు తటస్థించినది

ముందు చేయఁదలఁచెను. వెనుకఁ దటస్థించినది వెనుకఁ జేయఁదలఁచెను. తండ్రి వాక్యము నెఱవేర్చికదా యావల తల్లివాక్యము నెఱవేర్చెను. కావునఁ బ్రబల ప్రారబ్ధ మడ్డపడెనేని యాలస్యమగునుగాని శరణాగతి వ్యర్థముపోదు; ప్రారబ్ధము తీఱఁగానే యాజన్మమందే ఫలించును.

—• శ్రీరాముఁడు భరతుని సమాధానపఱచుట •—

చం. అహితభయప్రదానచరి•తా! వినయాన్విత మిట్టిబుద్ధియున్
సహజముగా లభించిన ప్ర•శస్తగుణుండవు నీకు లక్ష్యమే
మహిపరిపాలనంబు, మతి•మంతులు మంత్రులు మిత్రులున్ సదా
విహితమె పల్కు-చుందురు•వీరిమతిన్ ఘటియింపు కార్యముల్. ౨౫౯

అహిత=శత్రువులకు, భయప్రదాన = భయముగలిగించు, చరితా = నడవడి గలవాఁడా, ఈ విశేషణము రాజ్యపాలనమందు శక్తిగలవాఁడని సూచించుచున్నది. వినయాన్వితము=అణఁకువతో గూడుకొన్నది, విహితమె=మిక్కిలి మేలైనదానినే.

తా త్ప ర్య ము.

రాజ్యమును నేనొకఁడనే భరింపలేను, ప్రజలను రంజింపలేనని భరతుఁడు చెప్పినమాటకు శ్రీరామచంద్రమూర్తి ప్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు:

శత్రువులకు భయముగలిగించు నడవడిగలవాఁడా! అణఁకువతోఁ గూడిన యిట్టిబుద్ధి స్వభావసిద్ధమైన గొప్పగుణముగల నీకు భూమిని బాలించుట లక్ష్యమా గర్వము వినాశసూచకముగాని యణఁకువ యెవరియందున్నను శ్రేయస్సూచకమే. అదిగాక నీవొకఁడవే పోయునది యేమున్నది? ఈమంత్రులు మిత్రులు బుద్ధిమంతులు గావున శ్రేయస్కరమైనవానినే యెప్పుడు చెప్పుదురుగాని యపయశస్సు గలిగించునవి చెప్పరు. కావున వీరియభిప్రాయ ప్రకారము కార్యములు చేయుచుండుము.

ఉ. పాయును గాక లక్ష్మి హిమ•భానుమనోహరమండలంబునున్,
బాయును గాక మంచు హిమ•వన్నగరాజమునుండి, వేలనే
పాయును గాక సాగరము • విశ్వము ముంపఁగ రామచంద్రుఁడున్
నాయన! తండ్రిసత్యవచ•నంబును దప్పఁడు, మాట లేటికిన్. ౨౬౦

సందేహము దీరునట్లు తనయభిప్రాయమును దెల్పఁజెప్పుచున్నాఁడు. హిమభాను = చల్లని కిరణములుగల చంద్రునియొక్క, మనోహర = మనస్సునాకర్షించు నందముగల, మండలంబునున్=బింబమునుండి, లక్ష్మి=కాంతి, లక్ష్మీదేవి. 'ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణ' యన్నట్లు సూర్యబింబమందు విష్ణువున్నట్లు చంద్రబింబమందు లక్ష్మీదేవి యున్నది, సినీవాలి శబ్దమున కుత్పత్తి గురుబాలప్రబోధికయం దిట్లు వ్రాయఁబడినది. అః విష్ణుః తేవ సహావర్తత ఇతి సా లక్ష్మీః సా అస్యామితి సినీ చంద్రకళా - సాబాలా అస్యామితి సినీవాలీ ఈ సీ-అ అనఁగా

విష్ణువు అతనితోఁ గూడినది గనుక నా అనఁగా లక్ష్మి ఆ లక్ష్మిగలది గనుక సిని యనఁగాఁ జంద్రకళ అచంద్రకళ దీనియందు లేఁతదై యుండును గనుక సినీవాలి వబయోరభేదః" శ్రీసూక్తమందును ఈయర్థము కావవచ్చుచున్నది. వెన్నెలను ఆమె తేజస్సుగాఁ జెప్పినను జెప్పవచ్చును. లోకములోనివా రమావాస్యనాఁడు చంద్రునికాంతి పోయినదని తలంతురుగాక. ఆకాంతి మనకుఁ గానరాలేదు గాని చంద్రునికిఁ గాంతియే నాశమైపోలేదు. సూర్యగ్రహణమునాఁడు సూర్యరశ్మి మనకు లేకున్నమాత్రమున సూర్యకాంతియే నాశమైపోయినదని యర్థమా? హిమవన్నగ రాజము = మంచుఁగొండ, మంచుఁగొండయందు మంచులేకపోయిన స్వరూపనాశ మనియే యర్థము. అవల దానికి మంచుఁగొండయని పేరెక్కడిది? ఎండకాలమందుఁ గొంతమంచు కరఁగినంతమాత్రమున నది మంచులేనిదగునా? మంచుఁగొండయందు మంచులేకుండఁ జేయసాధ్యమా? వేల=సముద్రతీరము, చెలియలికట్ట, సాగరము = సముద్రము, విశ్వము=ప్రపంచము, సముద్రము చెలియలికట్టను మించి రాఁగూడ దని మర్యాద; ప్రలయకాలమందు మించివచ్చును. అట్లు ప్రలయము తటస్థించి నను శ్రీరాముఁడుమాత్రము తండ్రిచెప్పిన సత్యవచనము తప్పఁడు.

తా త్ప ర్య ము.

నాయనా! భరతా!! యేల వలవని జాలిపడెదవు? చంద్రునినుండి లక్ష్మి తొలఁగినఁ దొలఁగునుగాక. హిమవంతమున మంచులేక పోయినఁ బోవునుగాక. చెలియలికట్టదాఁటి సముద్రము లోకమును ముంచిన ముంచునుగాక యీరామ చంద్రుఁడు మాత్రము సత్యము తప్పఁడు. ఏల వృథామాటలు?

ఆ. కామ మైననేమి • కడులోభ మగు నేమి, నీకుఁగాను గోరె • నీదుతల్లి
తల్లి తల్లిగాదె • తనయుఁ డాయమపల్కు, సేయ వలదె తక్క•చింత విడుము. ౨౫౧౧

తా త్ప ర్య ము.

కామముచేతనే కోరెనో లోభముచేతనే కోరెనో నీకుఁగా నీ తల్లికోరినది నిజము. ఎంతచెడ్డదైనను దల్లితల్లియేకదా. అట్టి తల్లిపలుకు కొడుకు చేయక యుండ వచ్చునా? తక్కిన యాలోచనలన్ని వదలిపెట్టుము. ఈ రెండుకదానికిఁ బ్రత్యుత్తర మిమ్ము.

—• శ్రీరాముఁడు భరతునకుఁ దనపాదుక లొసంగుట. •—

సీ. అనుచు వచించిన • సూదిత్యసమతేజు, నన్నను గనుఁగొని • యనియె భరతుఁ
డన్న నీవింతటి•యచలప్రతిజ్ఞుండ, వైన నేనే మందు • నయ్య నిన్ను
నాయభాగ్యముగాక • మాయురే యింతైన, నీమది గరఁగదు•నిర్మలాత్మ
యూరక పోనొల్లఁ • గూరిమి మాపుము, ధర్మభూపీఠరత్న•పాదుకలను

ఆ. నీదుచరణములను • నెమ్మి నా శ్రీరామ, భద్రుఁ డట్లు యిచ్చె • భరతునకును
వానిఁ దా గ్రహించి • వఱలినభక్తిని, హస్తయుగళిమొక్కి • యన్న కనియె.

ఆదిత్యసమతేజున్ = సూర్యుని తేజస్సుతో సమానమైన తేజస్సుగలవానిని, అచలప్రతిజ్ఞుండవు = చలింపని ప్రతిజ్ఞగలవాఁడవు, అభాగ్యము = దురదృష్టము, మాయురే = (ఆశ్చర్యార్థకము) ఓరా!, భర్మభూషిత రత్నపాదుకలను=బంగారు సొమ్ములచే నలంకరింపఁబడి రత్నములతోఁ జేయఁబడిన పావుకోళ్ళను, హస్తయుగళి = రెండుచేతులు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి యీప్రకారము తేఁటఁజెప్పఁగా సూర్యునివలెఁ బ్రకాశించు నన్నను జూచి భరతుఁ డిట్లనియె. అన్నా! నీ వీప్రకారము ప్రతిజ్ఞనుండి చలింపననిన నేనేమి చెప్పఁగలను. అది నాదురదృష్ట మనుకొందును. ఓరా! నే నింతదూరము ప్రార్థించినను నీమనస్సు కరఁగలేదే. నీకు నాయందు నిర్మలమైన మనస్సుండెనా యీబంగారు పాదుకలమీఁద నీచరణములను మోపుము. అనిన శ్రీరామచంద్రమూర్తి యట్లుచేసి యిచ్చెను. భరతుఁడు వానిని భక్తితోఁ దీసికొని రెండుచేతులు జోడించి యన్నతో నిట్లనియె.

౨౫ ౨౨-వ పద్యమందు వసిష్ఠుఁడు పాదుకలిమ్మని శ్రీరామునకుఁ జెప్పిన ట్లున్నది. దీనివలన నన్నదమ్ము లిరువురు మొండికి వేసికొనుటచూచి వసిష్ఠుఁడు మధ్యవర్తియై యడుగమని భరతునకు, నిమ్మని శ్రీరామచంద్రమూర్తికిఁ జెప్పెనని తోఁచుచున్నది. ఈబంగారుపాదుక లెక్కడివి? ఆసమయాన కెందుండివచ్చెను? అను ప్రశ్నకుఁ బ్రత్యుత్తరము రామాయణమున లేదు. భరతుని ప్రయత్నము నెఱ వేఱదని తెలిసి వసిష్ఠుఁడు భరతునితో రామునకు నక్కడనే పట్టాభిషేకము చేసెద వేని క్రొత్తపాదుకలు చేయింపుమని చెప్పి చేయించెనని తోఁచెడిని. రామమూర్తి యుత్తకాళ్ళతో నేకడా యడవికి వచ్చెను.

చం. విను పదునాలుగేండ్లు రఘు•వీర! జటాజినధారి నై ధృతిన్
దినములు లెక్కవెట్టుచును • దిన్చు ఫలంబుల, నూరివెల్పలన్
గొని నిలయంబుఁ, బాదుకల•కున్ వినిపించుచు రాజ్యతంత్రమున్
మనియెద; నగ్నిఁ జొచ్చెదఁ జు•మా మఱుచేపట నీవు రానిచోన్. ౨౫౧౩

కం. అనవుడు నట్లుల కానిమ్మని బాస యొనర్చి ప్రచ్చి•యతని శత్రు
ఘ్నునినాఁఅడఁబలుకుచు ని ట్లనియెన్ రాముండు కైక•యాత్మజుతోడన్.
౨౫౧౪

జటాజినధారినై =జడలుధరించి కృష్ణాజినము కట్టుకొన్నవాఁడనై, ధృతిన్ = మరల నీవు వచ్చెదవను ధైర్యముతో, నిలయము=కాఁపురము, ఇల్లు, మనియెదన్= బ్రదికియుండెదను, మఱుచేపట = పదునాలుగేండ్లకు మఱుసఁనాడు, రానిచోన్ = రాకపోయిన పక్షమందు.

తా త్ప ర్య ము

అన్నయా! నేనాడుమాట సావధానుండవై వినుము. నేను సరిగావినలేదన వలదు. ఒకటి రెండు అని దినాలెంచుచు జడలు దాల్చి జింకచర్మము గప్పుకొని పండ్లు దిని యయోధ్యలోఁగాక యూరికి వెలుపల నిల్లేర్పఱచుకొని రాజ్యతంత్ర మంతయుఁ బాదుకలకు వినిపించుచుఁ బ్రాణము బిగఁబట్టి యుండెదను. పదునైదవ సంవత్సరము మొదటిదినము నీవు రాకపోయితివో నే నగ్నిప్రవేశముఁ జేసెదను.

ఇది సీతాదేవికిఁ గైకపైఁ గోపములేదని తెలుపఁ జెప్పినమాట.

భరతుఁడిట్లు చెప్పఁగా నట్లేకానిమ్మని శ్రీరామచంద్రమూర్తి మాటయిచ్చి శత్రుఘ్నుని సమాధానపఱిచి భరతునితో నిట్లనియె.

కం. పోషింపుము కైకను సం,తోషంబున; నాదె దేమొ • దూషణ మాపెన్
రోషమున నిన్ను సీతా,యోషయు నేనును శపింతు • మూర్వీశసుతా! ౨౯

తా త్ప ర్య ము.

నీవు కైకను సంతోషముతో రక్షింపుము. కోపముచే నామెను దూషించెద వేమో. అట్లు చేసితివేని నేను సీతాదేవియు నిన్ను శపింతుము. ఒకవేళ నాశాపము తప్పినా పతివ్రతయగు సీతాదేవిశాపము తప్పదు. జాగ్రత్త యనిభావము.

మ. అనుచుం గన్నుల నీరు గ్రమ్మఁ జని ర•మ్మా నాయనా! యంచుఁ ద
మ్మునిఁ బీడ్కొల్పె, నతండు పట్టకరిరా•ణ్మూర్ధంబునం బాదుకల్
వినయం బారఁగ నిల్పి రామునకు బా•లిన్ మ్రొక్కె, రాముండు నున్
జనవారన్ సెల విచ్చె నైగమవయ•స్యస్తోమమంత్ర్యాళికిన్. ౩౦

పట్టకరిరాణ్మూర్ధంబునన్ = పట్టపేనుఁగు కుంభస్థలమందు, నైగమ=పౌరులకు, వయస్య=మిత్రులయొక్క, స్తోమ=సమూహమునకు, మంత్ర్యాళికిన్ = మంత్రుల సమూహమునకు.

తా త్ప ర్య ము.

అనిచెప్పి కన్నులందు నీరు గ్రమ్ముచుండ నాయనా పోయిరమ్మనిచెప్పిపంపెను. భరతుండును బాదుకలను బట్టపుటేనుఁగు కుంభస్థలమందు వినయముతో నుంచి రామచంద్రునకు నమస్కరించెను. రామచంద్రమూర్తియుఁ బౌరులకు మిత్రులకు మంత్రులకుఁ బోయిరండని సెలవిచ్చెను.

కం. తను వీడ్కొనలే కేడ్చెడు, తనతల్లుల కెల్లరకును • దగుగతి వం
దనములు ఘటించి చొచ్చెం, దనకుటీరంబు రోద•నస్వరయుతుఁడై. ౩౧

వీడ్కొనలేక=వదలిపోలేక, తగుగతి నభివాదనములు = ఉపసంగ్రహణము, ఘటించి=కావించి, రోదనస్వరయుతుఁడై =ఏడుపుధ్వని గలవాఁడై. శ్లో. గురువ త్ప్రీతిపూజ్యాస్స్యుః, సవర్ణా గురుయోషితః। మాతృష్వసా మాతులానీ శ్వశ్రూ రథ పితృష్వసా! సంపూజ్యా గురుపత్నీ వత్సమాస్తా గురుభార్యయా, భ్రాతృ భార్యోప సంగ్రాహ్యా, సవర్ణా హ స్యహ న్యపి, విప్రోష్య తూపసంగ్రాహ్యా జ్ఞాతి

సంబంధియోపితః। అవృద్ధా గురుపత్నీచ నోపసంగ్రహ మర్హతి॥ ఉపసంగ్రహణ మనఁగాఁ గోత్రముపేరు తనపేరు చెప్పి అహంభో అభివాదయే యనిచెప్పి రెండు చెవులు స్పృశించి కుడిచేతిచే గురువు కుడిపాదము ఎడమచేతిచే నెడమపాదము పట్టుకొని శిరస్సునవంచుట. ఈ మీఁదిశ్లోకమున గురువులనఁగా: తల్లి, సజాతి పాలిచ్చిన దాది, తండ్రి, తండ్రితండ్రి, తల్లితండ్రి, అన్నదాత, భయత్రాత, ఆచార్యుఁడు, ఉపనయనము చేసినవాఁడు, మంత్రముపదేశించిన వాఁడు, వారిభార్యలు వీరంద ఱుపసంగ్రహణమునకు వర్జ్యులు.

గురువువలెను సవర్ణలగు గురుభార్యలను గౌరవింపవలెను. తల్లితోఁడఁబుట్టునది, మేనమామభార్య, బిడ్డనిచ్చినయత్త, తండ్రితోఁడఁబుట్టినది, వీరందఱు గురుభార్యల వలె గౌరవింపఁబడఁ దగుదురు. వీరందఱు గురుభార్యతో సమానురాండ్రే. సవర్ణ స్త్రీ నైనచో నన్నభార్యయు నుపసంగ్రాహ్యాయే. గురుభార్య తనకంటెఁ జిన్న దైనయెడ నుపసంగ్రహణము కూడదు.

రోదనస్వరమునకుఁ దనవలన నెందఱ కెంతయసంతుష్టి, కష్టము, దుఃఖము కలిగెననునది కారణము.

—•{ ౧౧౩-వ సర్గము. భరతుఁ డయోధ్యకుఁ బ్రయాణ మయి భరద్వాజాశ్రమంబుఁ జేరుట. }—•

సీ. భరతుండు శ్రీరాము • పాదుకల్ తలఁదాల్చి, తుష్టుఁడై రథము శ • త్రుఘ్నుతోడ
నెక్కె వసిష్ఠము • నీశుండు జాబాలి, వామదేవుండుఁ బ్రా • గ్భూమిఁ జనిరి
మంత్రియుక్తంబుగ • మందాకినిఁ గనుచుఁ, దూరుపుముఖముగ • దూర మరిగి
చిత్రకూటము ప్రద • క్షిణముగ నరుగుచో, గైరికధాతుని • కాయములను

ఆ. పార్శ్వములను గనుచు • భరతుండు సేనతోఁ, జిత్రకూటమునకుఁ • జేరువంతి
నబ్జగర్భ తేజుఁ • డగుభరద్వాజుని, యాశ్రమంబుఁగాంచె • నమలమతిని. ౨౫

ప్రాగ్భూమి=ముందువైపు, గైరికధాతునికాయములన్=కొండలలోఁ బుట్టిన, ధాతువుల=లోహముల సమూహములను. చేరువంతి = సమీపము, ఉత్తరమునుండి దక్షిణముగా వచ్చినవారు పోవునపుడు తూర్పుముఖముగా గిరిప్రదక్షిణించి పోయి రని భావము. తుష్టుఁడు=సంతోషించినవాఁడు.

## తాత్పర్యము.

భరతుఁడు పట్టపేనుఁగు తలమీఁదనున్న పాదుకలను దీసి తనశిరస్సునందుంచి కొని శత్రుఘ్నుతోడ రథమెక్కెను-వసిష్ఠుఁడు, జాబాలి, వామదేవుఁడు, ముందుగాఁ దూర్పుగాఁ బోయిరి. మంత్రులతోడ భరతుఁడు మందాకినిఁ జూచుచుఁ దూరుపు ముఖమై గిరికిఁ బ్రదక్షిణముగఁ బోవుచుఁ గొండయందలి లోహములను బ్రక్క లందుఁ గనుచు సేనతోఁ జిత్రకూటమునకు సమీపమందుండు భరద్వాజాశ్రమము

చూచెను, పోవునపుడు కాలినడక, ఆశ్రమము వెదకుచుఁబోవుట, దానివలన నెక్కువకాలము ఎక్కువదూరము నయ్యెను. ఇప్పుడు చక్కఁగా బయనించుటచే మునుపటికంటె సమీపమయ్యెను.

చేయలంతి=సమీపమున, భరద్వాజునకు రెండాశ్రమములు గలవు. మొదటఁ బ్రయాగక్షేత్రమున నున్నవాఁడు. రామ భరత సంవాద మప్పుడప్పు డతిశీఘ్రమున వినుటకై యాచోటువదలి చిత్రకూటప్రాంతమునకు వచ్చెనని యెఱుఁగునది. భరతుఁడు చిత్రకూటమునుండి మరలునపుడు చిత్రకూట సమీపాశ్రమముననే భరద్వాజునిఁ గాంచెను. కాఁబట్టియే భరద్వాజాశ్రమానంతరము యమునా నదిని దాఁటినట్లు మీఁదఁ జెప్పఁబడెను తిలకవ్యాఖ్య.

వనాదుల యందమును జూచుచుఁ దిన్నఁగాఁ బోవుటచే భరతునకు భరద్వాజాశ్రమము సమీపమున నున్నట్లు తోఁచెనని గోవిందరాజీయము.

శ్రీరామచంద్రునిఁ బిలుచుకొని పోవలయునని వచ్చినవాఁడు పాదుకోశ్చతో నెట్లు భరతుఁడు సంతోషించెను? భరతుఁ డింతదూరము శ్రమించినది రాజ్యము పాలింపలేకకాదు. తాను రాజనఁగానే స్వాతంత్ర్యమొకటి యేర్పడుచున్నది. దాసుఁడెప్పటికిఁ బరతంత్రుఁడేకాని స్వతంత్రుఁడుకాఁడు. స్వతంత్రుఁడ ననుకొనుట పతనహేతువు. ఇప్పుడాభయములేదు. రాజ్యము పాలించుభారము పాదుకలయం దున్నది. కావున తనదాస్యమునకు హానిలేదుగదా యని సంతోషించెను.

భరతుఁడు ముందుకోరిన దిదియేకదా.

కం. భూమిప లక్షణ యుతములు। రాముని చరణాంబుజములు రాగంబునవే
నామస్తకమునఁ దాల్పక। నామదికిని శాంతిలేదు నాసోదరుఁడా. ౨౪౧౯–ప.

చం. అరదము డిగ్గి కాల్నడన • యాయన డాయఁగ నేగి నమ్రుఁడై
చరణములందు వ్రాలుటయు • సమ్మదమూర నతండు నాయనా!
ఖరకరతేజు రామవిభుఁ • గాంచితివే? పను లెల్లఁ దీరెనే?
భరత! యటన్న నాతఁ డిటు • పల్కెఁ దపోధనశీతభానువున్. ౨౪౨౦

అరదము=రథము=తేరు, తద్భవమందు వర్ణాగమము, డాయఁగన్ = సమీపించునట్లు. నమ్రుఁడై=వంగినవాఁడై, ఖరకరతేజు=సూర్యతేజస్సువంటి తేజస్సుగల వానిని, తపోధనశీతభానువున్=తపస్వులలో శ్రేష్ఠుని. (తపస్విచంద్రుని).

తా త్ప ర్య ము.

తేరుదిగి కాల్నడకతో భరద్వాజు సమీపించి యభివాదనము చేయఁగా నాయన సంతోషముతో నాయనా! సూర్యప్రతాపుఁడైన శ్రీరామచంద్రమూర్తినిఁ జూచితివా నీవుపోయినపని చక్కఁబడెనా యని యడుగఁగా భరతుఁ డామునిశ్రేష్ఠున కిట్లనియె.

ఉ. అన్నవు నీ వటంటి, వృథ • యాఱడిపా లయినాఁడ నంటి, నన్
మన్నన చేయు మంటి, దయ • మాలుదె శిష్యునియందువంటి, నేఁ
గన్నుల నీరు పెట్టితిని • గట్టిగఁ బట్టితిఁ బాదయుగ్మ, మే
నెన్నివిధాల వేఁడ మది • నించుక త్రిప్పఁడ యేమి సేయుదున్. ౨౫౦

### తాత్పర్యము.

రామచంద్రా! నీవు నాకన్నవుగదా నన్నపకీర్తిపాలు చేయవచ్చునా? నన్ను క్షమించి నాకువచ్చిన యపకీర్తి పోఁగొట్టుము. నేను నీశిష్యుఁడను. శిష్యునియందు గురువుదయ తప్పవచ్చునా యని కన్నీళ్ళు కార్చితిని. రెండుపాదములు గట్టిగఁ బట్టుకొంటిని. ఎన్నివిధాలనో ప్రార్థించితిని. ఏమిచేసినను ఆయనమనస్సు తిరిగి నది కాదు.

తే. మాగురుండును గడుబతి•మాలుకొనఁగ, రాముఁడనియెను మానిసు•త్రాముననుచు
జనకుఁ డాడినరీతిని • వనములందుఁ, బదియు నాల్గేండ్లు వసియింతు • బాసదీర్త.
౨౫౧

### తాత్పర్యము.

నేను వేఁడుకొనుటయేకాదు, మాగురువు వసిష్ఠుఁడు నెంతో బతిమాలు కొనెను. ఆయనతోఁ దండ్రి చెప్పినరీతి పదునాలుగు సంవత్సరములు వనవాసము చేసి నామాట చెల్లించుకొందునని రామచంద్రమూర్తి చెప్పెను.

ఉ. ఆదృఢచిత్తుమాట విని • యామని యిట్లను క్షేమయోగసం
పాదనచుంచువుల్ కనక•పాదుక లిమ్ము యయోధ్య నేల నా
శ్రీదయితుండు ప్రాఙ్ముఖుఁడు • చెచ్చెరఁ బాదుక లెక్కి వీని నం
తే దయతోడ నిచ్చెను ము•నీశ్వర! భూపరిపాలనార్థమై. ౨౫౨

దృఢచిత్తు = నిశ్చలమైన మనస్సుగలవాని, క్షేమయోగసంపాదనచుంచువుల్=యోగక్షేమములఁ గలిగించుటయందు నేర్పుగలవి. యోగము = లేనిదానిని గలిగించుట, క్షేమము=ఉన్నదానిని రక్షించుట, కనకపాదుకలు = బంగారు పావుకోళ్ళు, శ్రీదయితుండు=లక్ష్మీదేవియగు సీతకుఁ బ్రియుఁడు, ప్రాఙ్ముఖుఁడు=తూర్పు ముఖమైనవాఁడు, భూపరిపాలనార్థమై=భూజనుల రక్షించుకొఱకు.

### తాత్పర్యము.

నిశ్చలచిత్తుఁడైన మాయన్నగారి మాటలువిని వసిష్ఠుఁడిట్లనియె. అట్లు నీవు వచ్చుట కిష్టములేదేని నీపాదుక లిమ్ము, అవియే ప్రజలఁ బాలించుచు వారిక యోగము క్షేమము కలిగించును అనిచెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి తూర్పుగాఁ దిరిగి పాదుకలపై నెక్కిదిగి వానిని ప్రజాపరిపాలనార్థమై యిచ్చెను.

ఉ. హే మ్మన నిట్లు వచ్చితిని • బోదు నయోధ్యకుఁ బాదుకాద్వయిన్
సమ్మతిఁ గొంచు నన్న విని • సంయమి యిట్లను సాధుశీలవృ
త్తిమ్ముల సన్నుతుండ వట • ధన్యచరిత్ర భవచ్చరిత్ర చి
త్రమ్ముకొ? మిట్టనీళు లరు • దా కనఁ బల్లపునేల కేగుటల్? ౨౧.౨౩

పాదుకాద్వయిన్=రెండుపావుకోళ్ళు, సంయమి=ముని, సాధుశీలవృత్తిమ్ముల =మంచి స్వభావము నడవడులచే, సన్నుతుండవు=సత్పురుషులచే స్తోత్రము చేయఁబడువాఁడవు.

తా త్ప ర్య ము.

హే మ్మని చెప్పిన కారణముచే రెండుపావుకోళ్ళుతీసికొని యయోధ్యకుఁ బోవుచున్నాను అనిచెప్పఁగా భరద్వాజమహర్షి యిట్లనియె. రాజకుమారా! నీవు సాధుస్వభావముచేతను నడవడిచేతను సత్పురుషులచే స్తోత్రము చేయఁబడు వాఁడవని ప్రసిద్ధిగాంచితివి. పుణ్యాత్మకా! నీ కిటువంటి నడవడి యాశ్చర్యకరము గాదు. స్వభావసిద్ధము. మిట్టనీళ్ళు పల్లమునకుఁబోవుట స్వభావసిద్ధమే. కాని యందు వింతయేమున్నది.

కం. నీవంటిసుతుఁడు గలుగఁగ, భూవిభుఁ డగుదశరథుండు • భువి విడిచియుఁ దా
జీవించిన వాఁడే యనఁ, బావనమతి భరతుఁ డెఱఁగి • వాచంయమికిన్. ౨౪.౨౫

ఎఱఁగి=నమస్కరించి, వాచంయమికి=ఋషికి, వాక్కునియమము గలవాఁడు వాచంయమి.

తా త్ప ర్య ము.

నీవంటికొడుకు గలిగిన కారణముచే మీతండ్రి దశరథుఁడు దేహము విడిచి యీలోకమునుండి పోయినను గీర్తికాయముచే జీవించియున్నావాఁడే. "ప్రజామను ప్రజాయసే, తరుతే మర్త్యామృత" మ్మను శ్రుతి కలదుగదా అనిచెప్పఁగా నిర్మలమనస్సుగల భరతుఁ డామునికి నమస్కరించి.

చం. తనపరివారము ల్గొలువ • దాశరథుండు పురంబుఁ బోవుచో
నినతనయుం దరించి కని • యింపు దొలంకక జాహ్నవీస్రవం
తిని, వెస దాని దాఁటి చని • తీరమునందలి శృంగిబేర ప
త్తనమును జొచ్చి యన్నయును • దండ్రియు లేనియయోధ్యఁ గాంచుచున్.
౨౪.౨౪

దాశరథుఁడు=దశరథుని కుమారుఁడు, తస్యేదమ్మని సంబంధార్థకము. "ప్రదీయతాం దాశరథాయ మైథిలీ" యని వాల్మీకియే ప్రయోగించి యున్నాఁడు. పురంబున్=ఉద్దేశార్థక ద్వితీయపురంబు నుద్దేశించియని యర్థము ఇనతనయున్ = యమునను, "కాళిందీసూర్యతనయా" నిఘంటువు. తరించి=దాఁటి, జాహ్నవీస్రవంతిని = గంగానదిని.

### తా త్ప ర్య ము.

తనసేనలు సేవకులు మొదలగువారు తన్ను సేవించుచు వెంటరాఁగా భరతుఁడయోధ్యకుఁబోవుచు యమునానదిని దాఁటిపోయి సంతోషముతో గంగనుజూచి దానినిదాఁటి దానితీరముననున్న శృంగిబేరపురము ప్రవేశించి ప్రయాణమైపోయి తండ్రియు నన్నయు లేని యయోధ్యను జూచి.

కం. సారథితో ననియె నిరాకార నిరానంద దీన • గళితస్వరమై

సారమతి నగరి యుండెడి తీరును గను మనుచుఁ బురము • దీనతఁ జొచ్చెన్.

౨౧.౨౨

నిరాకార=శుభమైన యాకారము లేని, నిరానంద=సంతోషము లేనిది, దీన=దుఃఖముగలది, గళితస్వర = సంతోషముతో నున్నప్పుడువలె నుత్సాహపూరితమైన కంఠస్వరము లేనిది, సారమతి=సారము+అతి = నిస్సారమై, దీనతన్ = వ్యసనములోఁ గూడినవాఁడై, నిరాకార శబ్దమునకుఁ గొందఱు భగవత్పర్యాయమున నాకారము లేనివాఁడని యర్థము చెప్పుదురు. ఇక్కడ నిరాకారయనఁగా నాకారము లేనిదని యర్థముగాదుకదా. మఱియొకచోట భరతుఁడు రాముఁడు నిరుదరులు కడుపులేనివారని చెప్పఁబడిరి. కావున 'నిర్' అను నుపసర్గమునకు వ్యతిరేకార్థ మొక్కటియేకాదు. నిరుదరుఁడు అనినఁ జిన్న పలుచని కడుపుగలవాఁడని యర్థము. కావున భగవంతుఁడు నిరాకారుఁడనిన మనుష్య పశుపక్ష్యాదులకువలె నొకవిధమై నిర్దుష్టమైన యాకారము లేక యిష్టమువచ్చిన చొప్పున నాకారములు ధరింపఁగలవాఁడని యర్థము కావుననే నిరాఖ్యాతుఁడనిచెప్పి శ్రుతి వెంటనే ఏకో నారాయణ యని చెప్పెను. కావున నిరాఖ్యాతుఁడనఁగాఁ బేరులేనివాఁడని యర్థముగాదు. ఒక్క పేరే గలవాఁడుగాఁడు సహస్రనామములు గలవాఁడని భావము.

### తా త్ప ర్య ము

భరతుఁడు సారథితో నిట్లనియె. సారథీ! యయోధ్య యుండెడి విధముచూడుము, వన్నె చెడి సంతోషహీనమై దుఃఖముతోఁగూడి కంఠస్వరము చెడి నిస్సారమై యెట్లున్నదో చూడుము.

—• ౧౧౪-వ సర్గము. నిరానందమైన యయోధ్యాపురి వర్ణనము. •—

### మధురగతిరగడ.

పిల్లులు గూబలు • పెల్లవుదానిని, మల్లడిగొను కరి • మనుజులదానిని
శ్రీ లుడుఁ జిమ్మని • చీఁకట్లలముఁగఁ, గాలనిశాగతిఁ • గ్రాలెడిదానిని
గ్రహపీడితశశి • కాంతారీతిని, మహామతి తేజము • మలిగినదానిని
నిగిరిన క్రాఁగిన • యించుకనీళ్ళను, సెగలను బొగిలెడి • చిఱువిహగములను
విలయముఁ గాంచువి • విధమత్స్యములను, సెలయే ఆనఁగను • జెలఁగెడిదానిని
సవమున బంగరు • ధాతుల నుండుచు, హవిసున నణఁగిన • యగ్నిని బోలుచుఁ

చెదరినగజములుఁ • జట్లినధ్వజములుఁ, బదరినవాజులుఁ • బగిలిన తేరులుఁ
గలిగి విరోధులు • కలఁచిన వెగ్గలి, కలఁగినదం డనఁ • గాఁ దగుదానిని
ఫేనము ధ్వానము • పెల్లయి పెద్దతు.పాను గాలియుఁ • బరిశాంతముగా
స్తిమితతఁ గాంచిన • సింధుతరంగము, గుమి నా ప్రోఁతలు • గూడనిదానిని
యజనాంతంబున • యాజకయూథము, యజన • యుధములు • సన్నియుఁ బాయఁగ
వీతరవం బగు • వేదిని బోలుచు, వాతతజనశూ • న్యం బవుదానిని
దినఁబచ్చికఁ దల • దిరముగ ట్రాల్పక, పెనుగోడియుచన • వెలలం గొనిమెడి
గోవులమందనఁ • గూడినదానిని, శ్రీవిలసితమయి • స్నిగ్ధతరం బయి
తేజనుగూడుచు • దివ్యతరం బయి, రాజిలునుత్తమ • రత్నశ్రేణులు
తీరఁగ రాలినఁ • దేజము దూలిన, హారము యొయునఁ గొమ • రారినదానిని
జలిపినపుణ్యము • క్షయ మయి పోవఁగ, నిలఁ బడుచుక్కను • నెనసినదానిని
బంభరకోటులఁ • బలుసూనంబుల, సంభరిత మయి వ • సంతముకడపలఁ
గారున నగ్గికిఁ • గమరినతీఁగల, తీరునఁ గాంతులు • దీఱినదానిని
బేరము సారము • పేరును లేమిని, ద్వారము తెఱవని • పణ్యస్థలమై
మఱుఁగఁగఁ జుక్కలు • మబ్బున శశితోఁ, నెఱిమాసినయా • నిశ నగుదానిని
నృత్తకడవలును • నృత్తపిడుతలును, గత్తరఁ గెడసిన • కలుమందిరమన
దొరలెడికుండలుఁ • దూలెడిగోడలు, జరగుచుఁ బాడలు • చలిపందిలి యన
పీకుని చెడిదవు • వింటను నెక్కుడ, నారసమో యన • నఱకఁగ నైరులు
బిగి చెడి నేలను • వ్రీలినజ్యాలతే,వగ వగ చెడి జిగి • పాసినదానిని
నాహవశూరుం • డశ్వవిభాండసమూహంబులచేఁ • బొలుపుగఁ దీర్చియుఁ
గలని కి నుపయో • గము గా కుండుట, తొలఁచుకిశోరము • తోఁ బో ల్దానిని
గచ్ఛపమత్స్యని • కాయములొప్పఁగ, నచ్ఛం బయి శు • ష్కాంబుక మగుచును
గూలము నోరలఁగఁ • గువలము వెడలఁగ, హాళి చెడినకూ • పాళిని బోలుచు
వగపునఁ జర్వా • భరణవిహీనని, జిగిచెడుమే నను • జెలఁగిన దానిని
జడికారున బహు • జలధరసంతతి, విడువక క్రమ్మర • విప్రభ నాఁగను
నొప్పుచు నున్నయ • యోధ్యనుగనుఁగొని,యప్పుడు భరతుం • డలమటఁ జొచ్చెను.
౨౧.౨౨

గూబలు=గుడ్లగూబలు, పెల్లవు=అధికమగు, మల్లడిగొను=దుఃఖపడెడి, కరి మనుజ ...దానిని=ఏనుఁగులు మనుష్యులు గలదానిని; శ్రీలు=కాంతులు, అజన్ = క్షయింపఁగా, దిమ్మనిచీఁకట్లు = దట్టమైనచీఁకట్లు, అలముఁగ = ఆక్రమింపఁగా, కాల నిశాగతిన్ = కృష్ణపక్షరాత్రివలె, గ్రహపీడిత = రాహుగ్రహముచే బాధింపఁబడిన, శశికాంతా=రోహిణి, మహము= తేజస్సు, ఉత్సవము, మలిగినదానిని = నశించిన

దానిని, ఇగిరిన=ఇంకిన, చిఱువిహగములను=చిన్నపక్షులను, చెలఁగెడిదాని వనియన్వయము, సవమునన్=యజ్ఞమునందు, హవిసునన్=హోమము చేసిన నెయ్యిపెరుఁగు మొదలగువానిచే, చిట్లిన = చీలిన, వదరినవాజులు = బెదరినగుఱ్ఱములు, బెగ్గిలి = భయపడి, దండు=సేన, దీనికిఁ బ్రకృతిరూపము దండము. ఫేనము=నురుఁగు, పరిశాంతముగాన్ = తగ్గఁగా, స్తిమితతన్ = నిశ్చలముగా నుండుటను, సింధుతరంగముగుమి=సముద్రపు టలలసమూహము, యజన + ఆయుధములన్ = యజ్ఞమునకుఁ గావలసిన యుపకరణములను, వీతరవంబు = ధ్వనిలేనిది, పెనుగోడియ = పెద్దకోడె, శ్రీవిలసితమయి=కాంతిచేఁ బ్రకాశితమయి, స్నిగ్ధతరంబు=మిగుల నిగనిగలాడునది, శ్రేణులు=సమూహములు, వరుసలు, కోమరారు = కోమలత్వముచే నతిశయించు, తీయము=వ్యయము, చుక్క=నక్షత్రము, బంభరకోటులన్ = తుమ్మెదల సమూహముచే, బంభరశ్చ మిళిందశ్చ హిందోళ భసలౌ సమాః నిఘంటువు. సూనంబులన్ =పుష్పములచే, సంభరితస్సై = పూర్ణముగ నిండినదై, వసంతము కడపల = గ్రీష్మ ఋతువునందు, కారువన్ = అడవియందు, కమరిన=వాడిన, పణ్యస్థలము=అంగడి, మబ్బున శశితోఁజుక్కలు మఱుఁగఁగ = చంద్రునితో నక్షత్రములు మబ్బుచాటున మఱుఁగుపడఁగా, నెఱి=అందము, నిశ=రాత్రిని. నగుదానిని=పరిహసించుదానిని, పిడుత=చిన్నమంటికుండ, గత్తర=ఉపద్రవము, కెడసిన=పొందిన, కలుమందిరము = కల్లమ్మెడి యిల్లు, పాడఱు=పాడుపడిన, బెడిదపు=భయంకరమైన, ఎక్కిడన్=ఎక్కుపెట్టఁగా, నారసమో=బాణమో, నారాచ శబ్దభవము నారసము, వ్రీలిన=పడిన, జ్యాలత=అల్లెత్రాడు, వగన్=విధముగా, బిగి=బిఱ్ఱు, జిగి=కాంతి, ఆహవశూరుండు =యుద్ధవీరుఁడు, అశ్వ=గుఱ్ఱముయొక్క, విభాండ = విశేషాభరణముల, సమూహములచే=గుంపుచే, తీర్చియు=అలంకరించియు, కలనికిన్ = యుద్ధమునకుఁ కిశోరముతోన్=గుఱ్ఱపుఁ బిల్లతో, కచ్ఛపమత్స్య నికాయములు = తాఁబేళ్ళు చేపలు వీనియొక్క సమూహములు. అచ్ఛము=నిర్మలము, శుష్కాంబుకము=ఎండిననీళ్ళుగలది, కూలము=ఒడ్డు, దొర్లఁగ=ఊర్లిపోఁగా, కువలము=కలువ = కువాలయం కువలయం కువాలం కువలం కువం" ద్వి. కో, హాళి=అందము, కూపాళిని = బావులగుంపును, వగపునన్=వ్యసనముచే, చర్చాభరణహీనుని=గంధపుఁబూఁతలు భూషణములు లేని వానియొక్క, మేను=దేహము, జడికారున=వానకాలమందు. బహుజలధరసంతతి = విస్తారములయిన మేఘముల సమూహము. క్రమ్మన్ = వ్యాపింపఁగా, రవిప్రభ = సూర్యకాంతి, అలమటన్=దుఃఖముతో, చొచ్చెన్=ప్రవేశించెను.

## తాత్పర్యము

సీతారామలక్ష్మణులు లేని యయోధ్యస్థితి వర్ణింపఁబడుచున్నది. అదలించు వారు లేమిని బిల్లులు గూబలు విస్తారముగఁ దిరుగుచున్నదియు వ్యసనముచే బాధ

పడుచుండు మనుష్యులు నేనుఁగులు కలదియు నక్షత్రకాంతిగాని చంద్ర కాంతిగాని లేక చిమ్మచీఁకట్లు క్రమ్ముకొనఁగాఁ గృష్ణపక్షపురాత్రివలె నుండునదియు రాహువుచేఁ బీడింపఁబడి కాంతిహీనమైన రోహిణివలె నుండునదియు, నెండవేఁడిమికి నీళ్ళిగిరి క్రాఁగి పైఁగలెగయుచుండ నీళ్ళుత్రాగుటకులేక తపించుచున్న చిన్నపక్షులును, నీళ్ళ వేఁడిమికి లోపలనేతపించి చచ్చుచేఁపలును గల సెలయేఱువంటిదియు, యజ్ఞమ్ము నందు బంగారుకాంతితో నుండుచు హవిస్సునం దణఁగిపోయిన యగ్నివంటిదియు, శత్రువులధాటి సహింపలేక బెదరిన యేనుఁగులు విఱిగిన టెక్కెములు, భయపడి పరువెత్తు గుఱ్ఱములు, కూలిన తేరులు గలిగిన దండువంటిదియు, నుఱుఁగు, ధ్వని విస్తారముగాఁగల పెద్దతుపానునందు గాలినిలువఁగా సద్దుచప్పుడులేక నిశ్చలముగా నుండు సముద్రపు టలలసమూహమువలె ధ్వనిలేనిదియు, యజ్ఞముకడపట యాజకులు యజ్ఞోపకరణములు అగ్నిపోఁగా ధ్వనిలేక జనములేక యజ్ఞవేదివలె నుండునదియు, మేపుతినుటకుఁగూడ తలవంచని విధముగ బలిసిన యాఁబోతుకోడె మరణింపఁగా గోవులమందవలె నుండునదియు, నిగనిగలాడుచుఁ గాంతితోఁ గూడి దివ్యమై రత్నములచేఁ బ్రకాశించుచుండి యన్నియు రాలిపోఁగా గమ్ములు మాత్రము మిగిలిన హారమువంటిదియు, చేసినపుణ్యము క్షీణమైపోఁగా నేలపైఁబడు నక్షత్రమువలె నుండునదియు, దుమ్మెదలచేతను బూలచేతను నిండియుండి యెండ కాలమునఁ గారుచిచ్చు వేఁడిమికిఁ గమరిన తీఁగలవలె నుండునదియు, వ్యాపారమేమియులేక, కొనువాఁడమ్మువాఁడులేక తలుపులు మూసియుండు నంగడివలె నుండునదియు, చంద్రుఁడు నక్షత్రములు మబ్బుమాటున నుండుటచే నందములేని రాత్రివలె నుండుదానిని, గల్లుతోనిండిన కడవలు త్రాగెడి పికుతలులేక యుపద్రవము వచ్చి విఱుఁగఁబడిన కల్లంగడివలె నుండునదియు గోడలు విఱుఁగఁబడి కుండలు దొరలుచునుండు చలిపందిరివలె నుండునదియు, యుద్ధవీరుఁ డెక్కుపెట్టి బాణము సంధింపఁగా శత్రువు నఱుకుటచే బిగువుచెడి నేలపడిన యల్లెత్రాడుగల విల్లువంటిదియు, యుద్ధవీరుఁడు యుద్ధమునకుఁ దీసికొనిపోవలయునని నానా భూషణములచే నలంకరింపఁగా నది యుద్ధమునకుఁ గొఱగానిది బాఱఁద్రోలిన గుఱ్ఱపుఁబిల్ల వంటిదియుఁ దాఁబేళ్ళు చేఁపలు కలిగి నిర్మలమైయుండి సిరిగిరిపోఁగా నొడ్డులురలఁగాఁ గలువలు చెడిపోఁగానుండు బావులవంటిదియు, గందపుఁబూఁతగాని యలంకారముగాని లేక కాంతిహీనమైన దేహమువంటిదియు, వానకాలమున మేఘములు గ్రమ్ముటచే నుండు సూర్యకాంతివంటిదియు నగు నయోధ్యను జూచి భరతుఁడు దుఃఖాక్రాంతమైన మనస్సుతోఁ బ్రవేశించెను.

మధురగ తిరగడ.

నాలుగుమాత్రలు నాటిన గణములు
నాలుగు రెంటికి నలి విరమణములు

గలసి మధురగతి కనలును జగణము
తొలఁగిన ధృతకౌస్తుభ కవిరమణము!     అప్ప.

—• భరతుఁడు మరల నయోధ్యఁ బ్రవేశించుట. •—

ఉ. స్యందనమందఁ యుండి తన•సారథిఁ జూచి యయో పురంబునం
దేఁడును మున్నటట్లు కడు•హృద్యము లౌశుభగీతవాద్యముల్
విందుగ వీనులం బడవు • విశ్రుతచందనగంధమాలికా
బృందసుగంధబంధురవ • రిష్ఠసమీరము వీవ దియ్యెడన్.     ౨౪౭

స్యందనమంద=తేరునుండి దిగక యందేయుండి, మున్నటట్లు=పూర్వమువలె, హృద్యము=సంతోషకరము, విందుగన్ = ఆహ్లాదకరముగ, విశ్రుత=ప్రసిద్ధికెక్కిన, చందనగంధ=గంధపువాసనచేతను, మాలికాబృంద = పూలదండల సమూహము యొక్క, సుగంధ = మంచిపరిమళముచేతను, బంధుర = నిండిన, వరిష్ఠసమీరము= మిక్కిలి యింపగుగాలి, వీవదు=విసరదు.

తా త్ప ర్య ము.

భరతుఁడు రథమందేయుండి దిగక సారథినిఁజూచి యిట్లనియె. అయ్యో! సారథీ! శ్రీరామచంద్రమూర్తి యీయూర నున్నప్పటివలె శుభకరమైన పాటలు మంగళవాద్యములు చెవులఁ బడకున్నవి. ప్రసిద్ధమైన చందనపు వాసనచేతను, బూలదండల వాసనచేతను నిండి మిగుల మనోహరమైన గాలియు విసరకున్నవి.

ఉ. రాముఁడు లేమిఁ జూవె నగ•రంబునఁ బల్లకి మోయుమ్రోఁతలున్
సామజబృంహితంబులును • సైంధవహేషలు స్యందనారవం
బేమియుఁ దోఁప దయ్యె యొక•రేనియుఁ జందనపుష్పమాలికా
స్తోమముఁ దాల్ప రాత్మఁ బరి•తోషము లేమి వయోవిజృంభితుల్.     ౨౪౮

సామజ = ఏనుఁగుల బృంహితములు=ఘీంకారములు, సైంధవహేషలు= గుఱ్ఱముల సకిలింపులు, స్యందనారవంబులు=రథముల దడదడ చప్పుడులు, చందన పుష్పమాలికాస్తోమము = గంధమును పూలసరముల సమూహమును, తాల్పరు = ధరింపరు, పరితోషము=సంతోషము, వయోవిజృంభితుల్ = వయస్సు విజృంభించు వారు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి పట్టణంబున లేకుండుటచేఁగదా! పల్లకుల మ్రోఁతలుగాని, యేనుఁగుల ఘీంకారములుగాని, గుఱ్ఱముల సకిలింపులుగాని, రథముల చప్పుడులుగాని గోచరింపలేదు. వయస్సునందుండి సుఖమనుభవింపవలసిన వారు కూడ మనస్సులందు సంతోషములేమి గంధము పూసికొనుటగాని పూలదండలు ధరించుటగాని కానరాకున్నవి.

కం. హేళిం బరిపెలుపల వా,హ్యాళిం జన రెవరుఁ బుష్ప•హారవిభూషా
పాళి న్మెయిఁ దాలిచి జన,పాళిన్ రాముండు లేమిఁ • బత్తనమందున్. ౨౪౩౦

హేళిన్ = విలాసముగ, వాహ్యాళి=వయ్యాళి = స్వారి, పుష్పహారవిభూషా పాళిన్=పూలదండలను, ఆభరణముల సమూహములను, మెయిన్=దేహమునందు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి పట్టనమందు లేనికారణముచే నీయూరనున్న జనులలో నెవరును బూలసరములు, ఆభరణములు దేహమునందు ధరించి యూరివెలుపలికి విలాసముగా స్వారిపోయెడివారు గారు.

కం. మాయన్న రాముతోడనె, యీయూరికళావిలాస • మెల్లను జనె; ధా
రాయతివృతసితయామిని,యో యనఁగన్పట్టె నీయ•యోధ్యాపురియున్. ౨౪౩౧

ధారాయతి = జడివానచేత, వృత = క్రమ్ముకొనఁబడిన సితయామినియో యనన్=శుక్లపక్షరాత్రియో యనునట్లు.

తా త్ప ర్య ము.

ఈయూరి యధికమైనకాంతి మాయన్నతోడనే పోయెను. ఇప్పుడీ యయోధ్య జడివానచేతఁ గ్రమ్ముకొనఁబడిన శుక్లపక్ష రాత్రివలె నున్నది.

కం. ఎన్నండు వచ్చునో మా,యన్న జనోత్సవముతోడ • నందఱకును దా
నెన్నండు మోద మిడునో, పన్నుగ వేసంగిమబ్బు•భాతిని సఖుఁడా. ౨౪౩౨

జనోత్సవముతోడన్ = జనులసంతోషముతో, అనుటచే జనులసంతోషమంతయు నాయనతోడనే పోయినది. ఆయనవచ్చిన మరలవచ్చును. వేసంగి = ఎండకాలమందలి, మబ్బు=మేఘము, భాతి=వలె.

తా త్ప ర్య ము.

సఖుఁడా! యీయూరి జనులసంతోషము శ్రీరామచంద్రమూర్తి తోడనే పోయినది. ఆయన వచ్చినఁగాని మరలరాదు. కావున నాయనయెప్పుడు వచ్చునో యెప్పుఁడు వీరికెండకాలమందలి మబ్బువలె సంతోషము గలిగించునో అంతవఱకు వీరిస్థితి యింతే.

చం. యువయువతీజనావళుల • నొక్కరయేని మహాపథంబునన్
సవురుగఁ డాఁకుటీకుగను • సంచరణం బొనరింప రంచు హె
చ్చువుగ సింహహీనగుహ • యందుఁ జొరంబడురీతి భూమిభృ
ద్భవనముఁ జొచ్చి సూర్యరహి•తం బగు మిన్నన నున్నఁ జొక్కుచున్. ౨౪౩౩

యువయువతీ జనావళులన్=వయస్సు పురుషులయు వయస్సు స్త్రీలయొక్కయు గుంపులయందు, యువయువతీ = ఇది ద్వంద్వసమాసము, సాధారణముగా యువతీశబ్దము ముందురావలసి యుండును. అల్పాచ్తరమ్ లఘ్వక్షరంపూర్వమ్ ఈ సూత్రముల ప్రకారము యువశబ్దము ముందు గూర్పఁబడియె. ఇచ్చట నేకశేష

చెప్పవలసియుండినను అవి రెండేగాక జనావళులన్ అని యుండుటచే నేకశేష రాలేదు. "త్వద్దాసదాసీజనాః" మహాపథంబునన్ = రాచబాటయందు, టాకుటీకుగను = ఓయారముగ, సంచరణంబొనరింపరు = తిరుగరు, సింహహీనగుహ = సింహములేని గుహను, భూమిభృద్వనము=రాజగృహము, సూర్యరహితంబగుమిన్ను = సూర్యుఁడు లేని యాకాశము. పూర్వము దేవాసురులకు యుద్ధముజరుగఁగా నందు రాక్షసులకు దేవతలోడిపోయిరి; రాహువుచే సూర్యుఁడు భూమిమీఁదఁ బడఁగొట్టఁబడెను అప్పుడు బ్రహ్మానువున నత్రి యేడుదినములు సూర్యుఁడుగా నుండెనని పురాణకథ. పొక్కుచున్=దుఃఖించుచు.

## తా త్ప ర్య ము.

యావనమందున్న స్త్రీపురుష సమూహములం దొక్కరైనను రాచబాటయందు నందముగ డంబముగ సంచరించువారులేరు. అని దుఃఖించుచు పోయి సింహములేని గుహయందు నిర్భయముగఁ జొచ్చునట్లు రాజునింటియందుఁ బ్రవేశించి సూర్యుఁడులేని యాకాశమువలె నదియుండఁగాఁ బరితాపపడుచు.

## —• ౧౧౫-వ సర్గము. భరతుఁడు నంద్రిగ్రామముఁ జేరుట. •—

శా. అందుం దల్లుల నుండఁ బంచి గురుతో • నా సద్వ్రతాఢ్యుం డనున్
నంద్రిగ్రామమున న్వసించిన దురం•తం బైనశోకంబునన్
గ్రుందం బోవక తాళుకోఁ గలను జు•మ్మా కావునం బోయి నే
నందే కాఁపుర ముందు, నెల్లరును నా•కాజ్ఞప్తిఁ గావింపుఁడీ. ౨౪౩౮

అందున్=ఆపట్టనమందు, ఆరాజగృహములందు, సద్వ్రతాఢ్యుఁడు = మంచి వ్రతములను సంపత్తుగలవాఁడు, అనున్=ఈప్రకారముచెప్పెను, దురంతము = అంతములేనిది, గ్రుందంబోవక=నశింపక, తాళుకోఁగలను=సహింపఁగలను, అజ్ఞప్తి= ఆనతి.

## తా త్ప ర్య ము.

ఆపట్టణంబునఁ దల్లుల నందఱను వారివారి యిండ్లయందు వారివారి నుండఁ జెప్పి యా వ్రతసంపన్నుఁడైన భరతుఁడు వసిష్ఠుతో నిట్లుచెప్పెను. నేనిక్కడనుండిన శోకముతో బ్రదుకలేను. వీధిచూచినను నాకుఁ దండ్రియు నన్నయు జ్ఞప్తికి వచ్చుచుందురు. వా రనుభవింపవలసిన వివి వారిని విడిచి నేనెట్లు లనుభవింపఁగలను? ఇక్కడ నాకు సుఖములేదు. నంద్రిగ్రామము పల్లెటూరు. అక్కడకుఁ బోయి యుందును. మీరందఱు నాకు నాజ్ఞయిండు.

కం. భూమీశుఁ డరిగె దివికి, రాముఁడు నాగురుఁడు వనికి • నడచెను నట నే
రామాగమనము వేచెద, రాముఁడె రాష్ట్రమున కెల్ల•రాజు మహాత్మా. ౨౪౩౯

రామాగమనము=రామునిరాక, వేచెదన్=కాచియుండెదను.

### తాత్పర్యము.

తండ్రియు, రాజునగు దశరథుఁడు స్వర్గమునకుఁ బోయెను. నా గురుఁడగు శ్రీరామచంద్రమూర్తి యడవులకుఁబోయెను. కావున నేను నందిగ్రామమున రామునిరాకకై కాచియుండెదను. మరల శ్రీరామచంద్రునితోడ వచ్చెదను. రాష్ట్రమునకంతయు శ్రీరామచంద్రమూర్తి ప్రభువుగాని నేనుగాను. కావున నే నెచ్చటనుండిన నేమి. రాజగువాఁడుగదా రాజధానియందుండవలె.

చం. అది విని మంత్రులు న్గురుఁడు • నాశుభవాక్యము గారవించి త్వ
ద్గదితము శ్లాఘనీయము హి•తంబు భవాదృశభ్రాతృవత్సలుం
డుదితయశుండు సన్నుతకు•లోద్భవుఁడున్ నిజబంధులుబ్ధుఁ డి
య్యది ఘటియింతు నన్నఁ జరి•తార్థక యెవ్వఁడు సమ్మతింపఁడో. ౨౪౩౬

శుభవాక్యము=మంచిమాట, త్వద్గదితము=నీవుచెప్పినది, శ్లాఘనీయము = పొగడఁదగినది, హితంబు=మేలైనది, భవాదృశ=నీవంటి, భ్రాతృవత్సలుఁడు=సోదరప్రీతిగలవాఁడు, ఉదితయశుండు=ఉదయించిన కీర్తిగలవాఁడు, సన్నుతకులోద్భవుండున్=సజ్జనులచేఁ బొగడఁబడిన వంశమందుఁ బుట్టినవాఁడు, నిజబంధులుబ్ధుఁడు = తనబంధువులయందు మిక్కిలి యాశగలవాఁడు, ఇయ్యది ఘటియింతున్ = ఈప్రకారము చేసెదను, అన్నన్=అనిచెప్ప, చరితార్థక=కార్యము నెఱవేర్చినవాఁడా.

### తాత్పర్యము.

భరతుఁడు చెప్పినమాటలువిని సుమంత్రాది మంత్రులు గురుఁడగు వసిష్ఠుఁడు ఆమాటల గారవించి యిట్లనిరి. భరతా! నీవుచెప్పినది శ్లాఘింపఁ దగియున్నది; హితమైయున్నది, నీవంటి సోదరప్రీతిగలవాఁ డుదయించుచున్న కీర్తిగలవాఁడు గొప్పవంశమునఁ బుట్టినవాఁడు బంధుప్రీతిగలవాఁడు నగువాఁడు నే నీప్రకారమొక కార్యము చేసెదనన్న నెవ్వఁడు సమ్మతింపకుండును.

చం. అని తనయిచ్చచొప్పునన • యాడఁగ మంత్రులు రాజు సారథిం
గని ఘటియింపుమీ రథము • గ్రక్కున నా నతఁ డట్లు సేయఁగా
జనముల కెల్ల మ్రొక్కి యను•జాతుఁడు దోడన రాఁగ ముందుగాఁ
జన గురుఁ డాదిగా, నరిగె • శక్రదిశాభిముఖంబుగా వెతన్. ౨౪౩౭

ఇచ్చచొప్పునన్=ఇష్టప్రకారము, ఘటియింపుమీ = కూర్పుము, సిద్ధముచేయుము, అనుజాతుఁడు = తమ్ముఁడగు శత్రుఘ్నుఁడు, శక్రదిశాభిముఖంబుగాన్ = తూర్పుముఖముగా, వెతన్=వ్యసనపడుచు.

### తాత్పర్యము.

మంత్రులందఱుఁ దనయిష్టమున కనుకూలముగాఁ జెప్పఁగా శీఘ్రముగ రథమును సిద్ధముచేయుమని సారథి కాజ్ఞాపించి తల్లులకందఱకు నమస్కరించి శత్రుఘ్నుఁడు తనతో రాఁగా గురుఁడు మంత్రులు ముందుగాఁబోగా నెటువంటివారి

కెటువంటి కష్టదశవచ్చెనని సీతారాములఁ దలఁచి దుఃఖించుచుఁ దూర్పుదిక్కుగాఁ బ్రయాణమైపోయెను. వచ్చినపూఁట భోజనమునకైన నయోధ్యయందు భరతుఁడు నిలిచినవాఁడు కాఁడు. ఔరా! యెటువంటిభక్తి.

శ్రీ రామచంద్రమూర్తి లేని యూర, శ్రీ రామచంద్రమూర్తి లేని యింట నన్నము దినరాదు. నీళ్ళుత్రాగరాదు. నిద్దుర పోరాదు. అని యేర్పడుచున్నది.

మ. దళము ల్మంత్రులు వారె రాఁగఁ దనమూ • ర్ధంబందుఁ బాదద్వయిన్
వెలయం జేసి నృపాలనందనుఁడు నం • దిగ్రామము జేరి మా
నిలలామంబును గాంచి యిల్లడగ మౌ • నీ! యుంచె మాయన్న య
స్ఖలితక్షేమను రాజ్య మివ్వి క్షితియో • గక్షేమముల్ పూనడిన్. ౨౫౩౮

దళముల్=సేనలు, వారె=వారంతటవారె, అనఁగా మీరురండని భరతుఁడాజ్ఞాపింపనైన లేదనుట. మూర్ధంబందు=తలయందు, పాదద్వయిన్=రెండుపాదుకలు, మానిలలామంబును=మునిశ్రేష్ఠుని, ఇల్లడగన్ = రక్షణార్థముగ, అస్ఖలితక్షేమను=దృఢమైనక్షేమచే, క్షితి = భూప్రజలయొక్క, యోగక్షేమముల్ = లేనివి యిచ్చుట, యున్నవి రక్షించుట యనుకార్యములను.

## తాత్పర్యము.

తాను గష్టపడుటగాక యితరులుగూడ నేల కష్టపడవలయునని యభిప్రాయముగలవాఁడై యెవ్వరిని భరతుఁడు బిలువకున్నను సేనలు మంత్రులు వారంతట వారే రాజుతోడ నుండుటవిధి గావున రాఁగాఁ బాదుకలరెంటిని శిరమందుధరించి భరతుఁడు నందిగ్రామముఁజేరి వసిష్ఠునితో నిట్లనియె.

మునీంద్రా! రాజ్యమును నేను వచ్చువఱకు నీవు పాలింపుమని యిల్లడగా నిచ్చి తనకుమాఱుగఁ దనస్థానమున నుండ వీని నిచ్చెను. కావునఁ బ్రజల యోగక్షేమములను నిఁక నివియే విచారించును.

సీ. అని సచివాదులఁ • గనుఁ గొని మాయన్న, చరణంబులకు ఛత్ర • చామరములు
పట్టుఁడీ యివియ మా • ప్రభుత నింక వహించు, నతులితకరుణ మా • యన్న వీని
నాకు నిల్లడ యిచ్చె • క్ష్మాకన్యకాధవుం, డరుదెంచుదాఁక న • త్యంతభక్తి
రక్షింతు వీనిని • రాముండు చనుదేర, నర్పించి మరల రా • జ్యంబుతోడ

తే. నతని భజియించి యపకీర్తి • నణఁచువాఁడ
నాయనకు రాజ్య మిచ్చుట • యందఱకును
సంతసం బిడు నదియు య • శంబుఁ గూర్చు
మఱియు రాజ్యంబుకంటె స • ల్మనుగు లెస్స. ౨౫౩౯

సచివాదులన్=మంత్రులు మొదలగువారిని, ఛత్రచామరములు = గొడుగు వింజామరములు, అతులితకరుణ=అసమానమైన దయచే, క్ష్మాకన్యకాధవుండు = సీతాపతి, అరుదెంచుదాఁకన్ = వచ్చువఱకు, చనుదేరన్=రాఁగా, భజియించి =

గొలిచి; అపకీర్తి=దుర్యశము, చెడ్డపేరు, సంతసము=సంతోషము. నల్గడుఁగు=నాలు గంతలు, నాలుగు+మడుఁగులు, అచ్ఛికద్విగువు. ఏకవచనము.

### తాత్పర్యము.

అని వసిష్ఠునకుఁ జెప్పి మంత్రులు మొదలగువారినిఁ జూచి యిట్లనియె. మా యన్నగారి పాదములకు ఛత్రముపట్టుఁడు. వింజామరలు వేయుఁడు. ఈ పాదములే యిఁక భూమిని రక్షించుభారము వహించును. నాయందు మాయన్న యెంతో దయగలవాఁడై వీని నిల్లడగా నిచ్చెను. మరల శ్రీరామచంద్రమూర్తి వచ్చు వఱకు మిగుల భక్తితో వీనిని రక్షించుచుందును. ఆయన రాఁగానే రాజ్యముతోడ వీనిని నాయనకు సమర్పించి యాయనను గొలిచియుండెదను. అట్లుచేసి యపకీర్తిఁ బాపుకొనెదను. మాయన్న రాజ్యము మాయన్నకిచ్చుట యందఱకు సంతోషము గలిగించును. అదియే నాకుఁ గీర్తిని గలిగించును. ఆయనరాజ్య మాయనకిచ్చి యాయనసేవ సేయుచుండుటయే రాజ్యము నేలుటకంటె నాకు నాలుగంతలు మేలు.

ఈ పద్యమందు మాయన్నపాదుకలని చెప్పక మాయన్న చరణములనియే భరతుఁడుచెప్పెను. భక్తునకుఁ దానుబూజించు రూపమునం దిట్టి యభేదబుద్ధి యుండవలెను. భగవంతుఁడువేఱు తాను బూజించు విగ్రహము వేఱనుభావన యుండనేరాదు. తాను బూజించునది ప్రత్యక్ష భగవంతుననియే భావన యుండ వలయును. భగవంతునకుఁ బ్రతినిధిగా నుంచుకొన్న రూపమనియు నుండరాదు. భక్తుని మనస్సునందా రూపముతో భగవంతుఁ డనుగ్రహించె ననుకొనవలయును గాని యా పాషాణాదులు భగవంతుఁడని తలంపరాదు.

చం. అని మునివేషయుక్తుఁ డగు • నా భరతుం డలపాదుకాద్వయిన్
గనకపుసింహపీఠి నిడి • కౌతుక మారఁగఁ గట్టి పట్టమున్
దినముదినంబు కార్యములఁ • దెల్పి యుపాయనమిచ్చి తొల్త నా
వెనుకనె తా గ్రహించుచుని • వేదితమున్ భరియించె రాజ్యమున్. ౨౫౮౦

మునివేషయుక్తుఁడు = మునివేషము ధరించినవాఁడు, పాదుకాద్వయిన్ = రెండు పావుకోళ్ళను, కనకసింహపీఠినిడి = కనకపు సింహాసనమున నుంచి, కౌతుక మారఁగన్=కోరిక యతిశయింపఁగా, పట్టముఁగట్టి=రాజులు పట్టాభిషేక సమయం బున ధరించుపట్టమును వానికేకట్టి, దినముదినంబు=ప్రతిదినము, తొలుత=మొదట, ఉపాయనము=కానుక.

### తాత్పర్యము.

ఈ ప్రకారము మునివేషమును ధరించిన భరతుఁడు చెప్పి పావుకోళ్ళ రెంటిని బంగారు సింహాసనమందుంచి సంతోషముతో వానికిఁ బట్టముఁగట్టి ప్రతిదినము నెవ్వరైనఁ దెచ్చియిచ్చిన కానుకల వానికి ముందుగ సమర్పించి యా నివేదితమును బిమ్మటఁ దాను గ్రహించుచు రాజ్యముచేసెను.

ఈపద్యమందు దినదినము చేయవలసిన భగవదారాధన క్రమము సూచింపఁబడినది. దినదిన మనుటచే భగవదారాధనము నిత్యకర్మమనియు నదిచేయక భుజింపరాదనియు గ్రాహ్యము.

శ్లో. యోమోహా దథవాలస్యా, దకృత్వా దేవతార్చనమ్
భుంక్తే సయాతి నరకాన్, సూకరేష్వపి జాయతే॥

అజ్ఞానముచేఁగాని విపరీతబుద్ధిచేఁగాని సోమరితనముచేఁ గాని దేవతార్చనముచేయక యెవఁడు భుజించునో వాఁడు నరకములపాలై మఱుజన్మంబునఁ బందినై పుట్టును.

శ్లో. విష్ణ్వర్చా రహితేగ్రామే, విష్ణ్వర్చా రహితే గృహే
నకుర్యా దన్నపానాది, నతత్ర దివసం వసేత్॥

విష్ణుబింబము లేని గ్రామమందు విష్ణుబింబము లేని గృహమందు నన్నము నీళ్ళుగొనరాదు. అందొకనాఁడైన వసింపరాదు.

శ్లో. కేశవార్చా గృహేయస్య, నతిష్ఠతి మహీపతే
తస్యాన్నం నైవభోక్తవ్య, మభక్ష్యేణ సమంహితత్ ।

కేశవార్చన యేయింటలేదో ఓరాజా! యాయింటివాని యన్నము పక్వమైనను అపక్వమైనను భుజింపరాదు. అది యభక్ష్యముతో సమానము.

ఈ కారణముచే దినముదినమని చెప్పఁబడెను.

శ్లో. తైర్దత్తా నప్రదాయైభ్యో యోభుంక్తేస్తేన ఏవసః

తనకు దేవత లిచ్చినదానిని వారికి నివేదింపక భుజించువాఁడు దొంగయే.

శ్లో. యజ్ఞశిష్టాశినస్సంతో, ముచ్యంతే సర్వకిల్బిషైః
భుంజతే త్వఘం పాపా, యేపచంత్యాత్మ కారణాత్ ।

విష్ణునివేదనమైనది భుజించు సజ్జనులు సమస్త పాపములనుండి విముక్తులగుదురు. భగవంతునికొఱకుగాక తనకని యెవఁడు పాకముచేయునో వాఁడు పాపము దినువాఁడగును. యజ్ఞమనఁగా విష్ణువని శంకరభాష్యము. యజ్ఞోవై విష్ణుః అనిశ్రుతి. కనకపుసింహాసీఠినిడి యనుట, భగవంతునకు నాధారపీఠాది కల్పనము దెలుపును.

కార్యముఁదెలిపి యనుట—

“త్వయ్యారాధాన కామోయం, వ్రతం చరితుమిచ్ఛతి
సంకల్పసిద్ధైర్భగవన్, పూరయాస్య మనోరథాన్ ।

భగవన్ పుండరీకాక్ష, హృద్యాగంతు మయాకృతమ్
ఆత్మసాత్కురుదేవేశ, బాహ్యైస్త్వాం సమ్యగర్చయే
విభోసకలలోకేశ, ప్రణతార్తి హరాచ్యుత
త్వాం భక్త్యా పూజ యామ్యద్య భోగైరర్ఘ్యాదిభిః క్రమాత్ ।

ఇత్యాది మంత్రములచేఁ జేయఁదగుకార్యమును దెలుపుచున్నది. ఉపాదానము. నివేదితము గ్రహించుటయనుటచే, పుష్పమాల్యగంధనైవేద్యాదులు ముందు స్వామికి సమర్పించి యావల వానిని దానుగ్రహింపవలె నని చెప్పుచున్నది.

ధరియించెరాజ్యమున్, అనుటచే గృహస్థుఁ డిట్లుచేసి వానివాని గృహకృత్యములు దీర్చుకోవలయునని సూచితము.

భగవంతుని ప్రతినిధిగా నగ్నినో, సూర్యునో దేనినైన నుంచుకొని పూజించుట ప్రతీకోపాసనము. భగవంతుని బింబమును బూజించుట విగ్రహారాధనము. బేరపూజ యందురు. వీరేయుపాసకులు బేరమనఁగా మూర్తి. దీనికేవిగ్రహారాధన మనిపేరు. వి+గ్రహమనఁగా భగవంతుని తేజస్సును విశేషముగ గ్రహించినదని యర్థము. వి+గ్రహము = పరమాత్మను గ్రహించినదనియుఁ జెప్పనగు. వి=పరమాత్మ. విశ్వంభుషి వ్యోమ్ని వాతే, పరమాత్మని పక్షిణి॥ నానా. ఈశబ్దము తేజస్సామ్యమును, ప్రతిమాయనునది యాకారసామ్యమును దెలుపును. ఈ రెండును గలదే యర్చా. అర్చింపబడునది. అర్చకు యోగ్యమైనది. ఇది ప్రతీకమునకంటె శ్రేష్ఠము. అట్లైన "ప్రతిమాస్వ ప్రబుద్ధీనా" మనువాక్యముగలదే యదియెట్లు? అనుసందేహము గలుగును. ఈ వాక్యము నుదాహరించువారు "బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః" యన్నట్లు మూలమునుండి విడఁదీసి దానికి విపరీతార్థమును గల్పించుచున్నారు. శ్లోకమును సమగ్రముగఁ బూర్వాపరము లన్వయించి చూచిన వీరు చెప్పెడి యర్థము దుష్టమని బోధపడఁగలదు.

శ్లో. అగ్నౌతిష్ఠతి విప్రాణాం, హృది తిష్ఠతి యోగినామ్
ప్రతిమాస్వ ప్రబుద్ధానాం, సర్వత్ర సమదర్శినామ్॥

ఇందు భగవత్సాక్షాత్కారము గలవారు నాలుగుదెగలవారు చెప్పఁబడిరి. విప్రులు, యోగులు, అప్రబుద్ధులు, సమదర్శులని. బుద్ధిలేనివారికి భగవత్సాక్షాత్కారము కాదుగదా. ఈ పదమున కీయర్థము చెప్పిరేని పూర్వోత్తరములతో నన్వయమెట్లు కుదురును.

ఈకారిక కాకదంతకారికవలె నసంబద్ధప్రలాపములు గలదికాదు. విప్ర, యోగి, సమదర్శి, యనుపదములనడుమ నిది యుండుటచే సాహచర్యబలమును వస్తు బలమును రెండు నాలోచించి యర్థము చెప్పవలెను. శాస్త్రతత్త్వవేత్త లీకారిక కిట్లర్థము చెప్పుదురు.

ఈ కారికయందు భగవత్సాక్షాత్కారముగలవారి స్వార్థపరార్థ ప్రసంజన ప్రకారము సంగ్రహముగఁ దారతమ్యము చెప్పఁబడెను. ప్రథమపాదమందు స్వకృతి సాధ్యముగాక భూతసంబంధమైన యగ్నియందు శాస్త్రమత మనుసరించి దేవతోపాసనము చెప్పఁబడెను. రెండవపాదమందు బాహ్యేంద్రియ విశ్రాంతిచే సమాహితమైన చిత్తముగలవారికి హృదయమందు సాక్షాత్కారము నిరూపింపఁ

బడెను. పూర్వార్ధమం దీ రెండువిధముల స్వకృతి సాధ్యముకాని స్వార్థము చెప్పఁబడెను. కాని పరార్థసిద్ధి చెప్పఁబడలేదు. అది యుత్తరార్థమునఁ జెప్పఁబడెను. మూఁడవపాదమందు ప్రతిమాసు, ప్రతిమలందు ననఁగా నగ్న్యాదులకు వ్యతిరేకమై స్వకృతి సాధ్యమై స్వాభిమత రూపాదులచే యోగ్యములైన యాకారములందు అప్రబుద్ధానాం=ఎవరికంటె నతిశయించిన ప్రబుద్ధులులేరో వారికి ననియర్థము. ఈ యప్రబుద్ధ శబ్దము, అఘోరము, అనుత్తమము వంటిది. దేనికంటె ఘోరమైనది లేదో యది యఘోరము. దేనికంటె నుత్తమమైనది లేదో యది యనుత్తమము. అట్లే యెవరికంటెఁ బ్రబుద్ధులు లేరో వారు అప్రబుద్ధులు. వారివారి కభిమతమైన కృతిచే సాధ్యమైన కృతియందు వారివారి యిష్టదేవత సన్నిధానమగును. అయి వారి తేజస్సుచే దానిని బూరించి వారాయాకృతినే వహించి మెల్లగాఁ గాలిన యినుపగుండునందు నగ్నిహోత్రమువలె నుందురు.

"అర్చకాభిమతితః స్వీకుర్వతే విగ్రహమ్" అని ప్రమాణము. "ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా" ఉపాసకుల కార్యార్థమై వారువారు కోరిన స్వరూపమునే భగవంతుఁడు కల్పించుకొను ననికదా శ్రుతి చెప్పుచున్నది.

ఇచ్చుటచేకాదు.

"భక్తాస్తే యాదృశేరూపే, సంసారపద మాశ్రితాః
తాదృశం తే సమీక్షంతే, పరమవ్యోమవాసినః" అహి.

ఈ లోకమందు గృహస్థులగు భక్తులెట్టి భగవత్స్వరూపమందు భక్తిగలవారై యుందురో వారు మరణించి ముక్తులై పరమాకాశమగు వైకుంఠమునకుఁ బోయినపుడు అటువంటివారినే చూచెదరు. ఇక్కడ నభ్యస్తమైనరూపమే యచ్చటను గోచరించుటచే మనోవికారమునకుఁ గారణము గలుగదు. అటుగాదేని భ్రాంతి వారియొద్దకుఁ బోయినట్లుండును. యథాక్రతున్యాయము దీనినే బోధించుచున్నది.

అట్లు భగవత్సన్నిధానము గలుగదేని దాను జేసిన బొమ్మలందుఁ దనకెట్లు దేవతాబుద్ధి పుట్టఁగలదు? ఫలమెట్లు గలుగఁగలదు? కొన్ని దేవతా మూర్తులయందు ఫలము ప్రత్యక్షానుభవసిద్ధమేకదా. ఈకాలమున రామకృష్ణ పరమహంసగారి బాలరాముఁడు ప్రత్యక్షప్రమాణముగదా. ఇట్టి భావము శాస్త్రజ్ఞానము శ్రద్ధాభక్తులు గలవారికిఁ బునుపవిశేష సంబంధానుబంధముచేఁ గలుగుచున్నది. ఇదియు నగ్న్యాదులవలెనే ప్రాకృతాగ్ని భగవంతుఁడగునా? హృదయ రంధ్రము భగవంతుఁడగునా? మనము చూచు సమస్తవస్తువులు భగవంతుఁడగునా? మన యిప్పటిదృష్టికిఁ గావుగదా. ఆయాపదార్థములే భగవత్స్వరూపములని భావించుటచే భగవంతుఁ డాయారూపములతోనే యాయాభక్తులకు గోచరించును. వస్తుభేదమేకాని క్రియాభేదము ఫలభేదములేదు. వాస్తవమిట్లుండఁ దక్కినవారు ప్రతిబుద్ధులని విగ్రహారాధకులు మూఢులని బుద్ధిమంతుఁ డెవ్వఁడనును?

వాస్తవమారయ సర్వము భగవత్స్వరూపము. మనకుఁ గానవచ్చునది కాన రానియది మనస్సునకు గోచరించునది గోచరింపనిది లోపలవెలుపల సర్వము భగవంతుఁడే. సర్వం ఖల్విదం బ్రహ్మ. ఈశావాస్య మిదంసర్వం. అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః॥ అను వాక్యములు ప్రమాణములు. ఇందులో మాయయని టక్కని డమారమని యింద్రజాలమని త్రోసివేయవలసిన దేదియు లేదు. అన్నియు దేవాలయములే. మనకుఁ గానవచ్చు వెలుపలిభాగము భగవం తుని శరీరము. అంతర్భాగము భగవన్మూర్తి. నాకు దేవునందు భక్తియేకాని దేవా లయమందు భక్తిలేదనువాఁడు మూఢుఁడు. తల్లిదండ్రులు గురువులు వీరిమీఁద నాకు భక్తియేకాని వీరిశరీరములు మిథ్యలు నేమిచేసినను దోషములేదనువాఁడు కర్మచండా లుఁడు. కావున మనమింతకుముం దజ్ఞానముచే రాతిగాను చెట్టుగాను జూచుచున్న వానినే యాభావము మార్చుకొని దైవభావములోఁ జూడవలెను. భరతుఁడు చేసిన పని యిదియే. ఇంతకుఁబూర్వము రామచంద్ర చరణములకు బంగారు పాదుకలని తలంచుచున్నవానినే యిప్పుడు చరణములే యని తలఁచెను.

ఇఁక నాలుగవపాదమునఁ జెప్పబడిన సమదర్శులు వీరికి భిన్నులు. వారికి భగవత్సాక్షాత్కారము అగ్నిహోత్రాదులఁ బూజించువారివలె సకృతి సాధ్యము గాదు, విగ్రహారాధకులవలె స్వకృతిసాధ్యముగాదు. వారికన్ని వస్తువులు భగవత్స్వ రూపమువలె మొదటివారికంటె రెండవవారు రెండవవారికంటె మూఁడవవారు వారి కంటె నాలుగవవారు శ్రేష్ఠులని శ్లోకతాత్పర్యము.

ఈ విధముగఁ బూజించువారు ముందుగ హృద్యాగ మనఁగా భూతశుద్ధిచేసి కొని హృదయమందు భగవంతునకు నాసనాదులర్పించి ధ్యానించి నైవేద్యాదు లర్పించి యావల మరల బాహ్యపూజ చేయవలయును. ఈ రెంటిలో నొకదానితో సంతుష్టిపడి యుండరాదు. భగవత్సాక్షాత్కారమైన యోగులు సత్యంత భక్తి యుక్తులుమాత్రము బాహ్యపూజ చేయకుండిన దోషములేదు. తక్కిన యందఱు రెండువిధములైన పూజలు చేయవలెను. ఏవిధమైన పూజయైనను సాధనమే. భగ వంతునందు మనస్సు సర్వదా సర్వావస్థల నిలుచుట ముఖ్యము. అది యేయుపా యముచే మనకు సాధ్యమో యది శ్రేష్ఠము. అంతియేకాని యందొకటి యెక్కువని మఱియొకటి తక్కువని యజ్ఞులు చెప్పుదురు. ఎవరెవరెవరి కేదిసాధ్యమో వారి కదియే శ్రేష్ఠము.

ఒక పెద్దచెఱువున్నది. దానినిండ నీళ్ళున్నవి, ఆ చెఱువుచుట్టు పల్లెలున్నవి. ఏపల్లెలవారి కేరేవు లనుకూలములో వచ్చుటి నీరు గ్రహించి స్నాన పానాదులు గావింపవచ్చును. భాగ్యవంతుల రేవునందలి నీళ్ళుతప్పఁ దక్కినరేవుల నీళ్ళు దాహమార్పవనరాదు.

ఇప్పుడొకటి యిచ్చట విచారింపవలసి యున్నది. ఇప్పుడు వాస్తవముగ రాజెవఁడు? రామచంద్రమూర్తియా? పాదుకలా? భరతుఁడా? ఎవరుకారా?

శ్రీరామచంద్రమూర్తి రాజందమా కాఁడు. తండ్రి రాజ్యమును భరతునకిచ్చి తన్నడవులకుఁ బొమ్మనఁగాఁ బోయి యడవులలో వానప్రస్థాశ్రమమందుండువాఁడు. పట్టనదేశ వ్యవహారము లెట్లు దీర్పఁగలఁడు? కావున రామంద్రమూర్తి రాజుగాఁడు.

పాదుకలందమా! అవి యచేతనములు గావునఁ బ్రజాపాలన మవి చేయ లేమిని నవి రాజుగాఁ జెప్పరాదు.

భరతుఁడు రాజందమా? కైకేయి భరతునకుఁ గోరినది యౌవరాజ్యాభిషేకమే కాని స్వతంత్రరాజ్యముగాదు. అదియునుగాక భరతుఁడు రాజగుట వంశమర్యాదా భంగము. పరివేత్తృత్వ దోషాపాదకము. కావున భరతుఁడు రాజనని చెప్పు కొననే లేదు.

ఎవరు రాజు గా రందమా? యరాజకత్వదోషము ప్రాప్తించును. పూర్వాపరము లన్నియు నాలోచించిన భరతుఁడే రాజనవలయును. తండ్రి యున్నకాలములో యువరాజుగా నుండువాఁడే యాయనయనంతరము రాజుగావలెను, గాని వేఱొకఁడు రాజుగారాదు. ఈ కారణముచేతనే కదా రాముఁడు యువరాజయ్యెనా యాయనకొడుకులే యనంతరరాజు లగుదురని మంథర చెప్పెను.

కం. మనుజు తమ్ముఁ డనుభవించిన,ధనమును రాజ్యంబు పిదపఁ దానెటులు గొనున్
ఘనమతి వరిష్ఠుఁ డగునా,తనయుఁడు శ్రేష్ఠుండు నగుట ధరణిప చెపుమా.
యనికదా కౌసల్య దుఃఖించెను.

భరతుఁడే స్వతంత్రరాజని కౌసల్యయు సంగీకరించిన దాయెను. భరతు నందుఁ బరివేత్తృత్వ దోషములేదు.

ఏలన: శ్రీరామచంద్రమూర్తి భరతుఁడు ఏకోదరులు గారు సవతితల్లుల కొడుకులు.

"జ్యేష్ఠోభ్రాతా యదాతిష్ఠే దాధానం నైవకారయేత్ । నానుజ్ఞాతస్తు కుర్వీత శంఖస్యవచనం యథా ॥ పితృవ్యపుత్రాన్సాపత్న్యాన్ యానారీసుతాం స్తథా । దారాగ్నిహోత్రసంయోగే, నదోషః పరివేదనః ॥ పరాశరుఁడు. అని వాక్యముండుటచే అన్నదమ్ముల కొడుకులందు సవతితల్లుల కొడుకులందుఁ బరివేదనదోషము లేదు. పెద్దవాఁడుండఁగాఁ జిన్నవాఁడు వివాహము చేసికొనరాదని యున్నది కాని రాజ్యస్వీకారము చేయరాదని పై వాక్యమందు లేదే యనరాదు. దారాగ్నిహోత్ర రాజ్యాని యః కుర్యాదగ్రజే స్థితే। పరివేత్తా స విజ్ఞేయః పరివేత్తిస్తు పూర్వజః ॥ భార్యను అగ్నిహోత్రమును రాజ్యమును బెద్దవాఁడుండఁగా గ్రహించిన చిన్నవాఁడు పరివేత్తయనఁబడెను. ఆ పెద్దవాఁడు పరివేత్తియనఁబడును. కావున భరతుఁడు

పరివేత్త యైనను అన్న యనుమతించి యిచ్చినకారణముచేఁ బరివేత్తగాఁడు. కావున రాజుగానుండ నర్హుఁడు. అట్లైనఁ బాదుకలతో నేమిపని యనిన:

శాస్త్రప్రకారము భరతుఁడు పరివేత్త గాకపోయినను పామరులు శాస్త్ర జ్ఞానము లేనివారగుటచే భరతుఁడు పరివేత్తయని యవనియందు నిందనారోపించి తాము నట్లులే చేయనారంభింతురు.

చిన్నవాఁ డనుభవించివిడిచిన రాజ్యము నాకొడుకునకేల యని కౌసల్య చెప్పెనుగదా ఆమెకు మనస్తాపము గూర్పకుండుటకు వంశక్రమాగతమైన జ్యేష్ఠ మర్యాద భంగముగాకుండుటకుఁ బాదుకలు గ్రహింపఁబడెను. కావున వాస్తవరాజు భరతుఁడే. పాలించువాఁడుగదా రాజు.

వాలియును రాజు భరతుఁడుండ నీవెవ్వఁడవు నన్ను దండించుట కనిగదా శ్రీరామచంద్రమూర్తి నాక్షేపించెను. అపనిందఁ బాపుకొనుటకై భరతుఁడును, బట్టాభిషేకానంతరము శ్రీరామచంద్రమూర్తియు నెంత శ్రమించిరో పాఠకు లాలోచించి యపనిందలపాలు గాకుండఁ బ్రయత్నింతురుగాక.

—• ౧౧౬-వ సర్గము. ఋషీశ్వరులు చిత్రకూటంబు విడిచి పోవుట. •—

సీ. అక్కడ శ్రీరాముఁ • డనుజసమేతుఁ డై, చిత్రకూటమున వ•సించు చుండి
భరతుండు పోయిన•పదపడి యచ్చటిసంయమీంద్రులు తన•చాయఁ జూచి
గుసగుస లాడుచుఁ • గొంకుచుఁ జెప్పంగఁ, గనుబొమ్మలార్చుచుఁ•గనులుగిఱపు
కొనుచును డాయుచు • నన బోయి యేమేమొ,గ్రమ్మంగుచు నీరీతి•మిణుకు చున్న
తే. వీరిచంద మిదేమియో•వింతదోఁచె, నంచు శంకించి యొక్కెడ • నంచు నందుఁ
గులపతినిఁజూచి కేల్మోడ్చి• జలజబాంధ,వాన్వవాయప్రదీప మీ • ట్లనియె నపుడు.
౫౪౧

ఇక్కడ నయోధ్యాపురమందలి విషయముచెప్పి యచ్చటఁ జిత్రకూట మందలి వృత్తాంతము కవి చెప్పుచున్నాఁడు.

అనుజసమేతుఁడై=తమ్మునితోఁ గూడినవాఁడై, పదపడి=తరువాత, కొంకు చున్=సందేహించుచు, గిఱపుకొనుచు=గీఁటుచు, వింత=క్రొత్త, కులపతి = ముని శ్రేష్ఠుఁడు, ౧౦,౦౦౦ మంది శిష్యుల కన్నముపెట్టి చదువుచెప్పువాఁడు కులపతి, అయినను నిచ్చట శ్రేష్ఠార్థమం దుపయోగింపఁబడెనని తోఁచుచున్నది, జలజబాం ధవ=కమలములకు మిత్రుఁడగు సూర్యుని, అన్వయము = వంశమునకు, ప్రదీపము = పెద్ద దీపమువలె వెలిఁగించువాఁడు.

తా త్ప ర్య ము.

చిత్రకూటమందు శ్రీరామచంద్రమూర్తి తమ్మునితో వసించుచు భరతుఁడు పోయినపిమ్మట నాపర్వతమునన్న మునిశ్రేష్ఠులు తన్నుఁజూచి తమలోఁదాము గుసగుసలాడుచు నేమో చెప్పఁబోయి యూరకుండుచుఁ గనుబొమ్మ లాడించుచుఁ

గనులు గీటుచు నేమో చెప్పవచ్చినవారివలె సమీపించి యేమిచెప్పవచ్చితిరవ నేమీలేదులే యని దాఁచుచు నగముచెప్పి మరల గ్రుంగుచు నీరీతి బాధపడు చుండఁగా వీరివిధము మునుపటివలె లేదే, యేమో క్రొత్తగానున్నదే యని శంకించి యిదియేమో తెలిసికోవలెనని యామునులయందుఁ బెద్దవానినిజూచి చేతులు జోడించి నమస్కరించి శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె.

చం. మునివర! నాదువర్తనము • మున్నటియట్టిది కాదొ, కాక నా
  యనుజుఁడు పాడి దప్పి నొ క•టా, పొరపాటుననేని ధారిణీ
  తనయయు మత్సపర్యకయి • తావకసేవలపట్టులన్ పతీ
  జనహితవృత్తిఁ బాసెనొకొ • సంభ్రమ మేటికి నొంద సంయముల్? ౨౫౪౨

వర్తనము=నడవడి- పాడి=న్యాయము- మత్సపర్యకై=నాసేవచేయుచుండి- తావకసేవలపట్టులన్=మిమ్ముసేవించువిషయమునందు- పతీజనహితవృత్తిన్=పతివ్రతలకుఁదగిన నడవడిని- సంభ్రమము=తత్తఱపాటు- సంయముల్=మునులారా!

## తాత్పర్యము.

మునిశ్రేష్ఠా! మునుపటివలె నే నిప్పుడు నడచుకొనుటలేదా? నా తమ్ముఁ డేమైన ధర్మముతప్పెనా? లేక సీత నాసేవసేయుచుండి పొరపాటుననైన మీసేవలఁ బతివ్రతలకుఁ దగనియట్టులు ప్రవర్తించెనా? ఏల యిట్లు ఋషీశ్వరులు తత్తఱపడు చున్నారు. భగవత్సేవకన్న భాగవతసేవ శ్రేష్ఠమని భావము.

—• వృద్ధఋషి తమకష్టంబుల శ్రీరామునితోఁ జెప్పుట. •—

సీ. అనుడు వయోవృద్ధుఁ•డును దపోవృద్ధుఁడు, నైనయొకముని వేప•మానుఁ డగుచుఁ
  బరమకల్యాణస్వ•భావజానకియెడ, నందులోఁ దపసుల•యందుఁ దప్పి
  నడచుట యది యేడ • నాయనా! నిర్గూర్చి, యే సుమ్ము తాపసు•లిట్టు లగుట
  రాక్షసతతిచేత • రాయిడిపడి యిట్టు, లందఱు గుసగుస•లాడువారు

ఆ. రాక్షసేంద్రుఁ డైన•రావణుతమ్ముఁడు, ఖరుఁడు నిర్దయుండు • పురుషభోజి
  గర్వి పాపి సుజిత•కాశి నీ విట వచ్చి,నదియు మొదలు మమ్ము • నుదిల పెట్టె.
  ౨౫౪౩

అనుడు=అని యడిగినపిమ్మట- వయోవృద్ధుఁడు=వయస్సుచేఁ బెద్దవాఁడు-తపో వృద్ధుఁడు- తపస్సునందుఁ బెద్దవాఁడు- వేపమానుఁడు = వణఁకుచున్నవాఁడు- పరమ కల్యాణస్వభావ=మిగులశుభకరమైన కార్యములు చేయుట స్వభావముగాఁగల- నిర్ద యుఁడు=దయలేనివాఁడు- పురుషభోజి = పురుషులఁదినువాఁడు- గర్వి = పొగరుకల వాఁడు- పాపి=పాపకార్యములు చేయువాఁడు, సుజితకాశి=(1) యుద్ధమున జయించు వాఁడు- (2) మంచిజయముచే, కాశి = ప్రకాశించువాఁడు- 'జితకాశీ జితాహవ' యని హలాయుధుఁడు. ఉదిల=పరితాపము.

### తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి యీప్రకారమడుగఁగా వయస్సునందుఁ దపస్సునందుఁ బెద్దవాఁడైన యా మునిశ్రేష్ఠుఁడు వణఁకుచు నిట్లనియె, నాయనా! రామచంద్రా! స్వభావముగా గొప్పశుభాచారముగల సీతయెక్కడ? అందులోఁ దపస్వులవిషయమై వక్రమార్గమున వర్తించుటెక్కడ? ఆవిషయం దేమిలోపములేదు. నిన్నుద్దేశించియే మునులిట్లగుచున్నారు. వారి తత్తఱపాటునకు నీవే కారణము, నేనేమి చేసితినందువా రాక్షసులవలన బాధపడుచు నిట్లు గుసగుసలాడుచున్నారు. రాక్షసరాజైన రావణునకు ఖరుఁడను నొకతమ్ముఁడు గలఁడు. వాఁడు దయయెట్టిదో యెఱుఁగఁడు, మనుష్యులఁదినువాఁడు, పొగరుపోతు, పాపాత్ముఁడు, యుద్ధమం దారితేఱినవాఁడు- వాఁడు నీవిచ్చటికి వచ్చినది మొదలు మమ్ము బాధపెట్టుచున్నాఁడు.

ఉ. ఒల్లరు వారు నీయిచటి • యున్కి-ని, మీ రిట వచ్చు టాదిగాఁ
బెల్లున మౌనికోటులకుఁ • బీడ నొనర్చుచు నున్నవారు హృ
ద్భల్లనికాశు లై బహుళ • దారుణభీషణరూపధారు లై
యెల్లెడఁ బెల్లురేఁగి మము • హింస యొనర్చెద రేమి చెప్పుదున్. ౨౫౪౪

ఉన్కి=ఉండుట- హృద్భల్లనికాశులై=గుండెలందు బల్లెముతో సమానులై- బహుళదారుణ = మిక్కిలి క్రూరములు- భీషణ = భయంకరములునగు- రూపధారులై=రూపములధరించినవారై- ఎల్లెడ = అన్నిప్రదేశములందు, పెల్లురేఁగి = మిగుల విజృంభించి.

### తా త్ప ర్య ము.

రామచంద్రా! నీ విచ్చటనుండుట వారికి సరిపడలేదు. మీరిచ్చటకు వచ్చినదిమొదలు వారు మునిసంఘములను మిగుల బాధించుచున్నారు. మాగుండెల బల్లెములై మిగులఁ గ్రూరములు భయంకరములు నైన యాకారములు ధరించి యెక్కడఁజూచిన వారేయై మిగుల విజృంభించి మమ్ము హింసచేయుచున్నారు. ఇఁకనేమి చెప్పుదును.

తే. అప్రశస్తంబు లై నప • దార్థములను
మీఁద వర్షించి మునులను • బెగ్గడి చనిరి
పెలుచ దుష్టులు ఋషులముం • గలను నిలిచి
ప్రాణములు దీసి చనిరి వి • త్రాస మొదవ. ౨౫౪౫

అప్రశస్తంబులు=అపరిశుద్ధములు- బెగ్గడి=బెదరి- విత్రాసము = మిగుల భయము- పెలుచ=కోపము.

### తా త్ప ర్య ము.

అపరిశుద్ధవస్తువులను మునులపై వేసి కొట్టిపోయిరి. కోపముతో ఋషుల యెదుట నిలఁబడి వారు భయపడుచుండఁ జంపిపోయిరి.

ఉ. డాఁగి మఱుంగుచాటులఁ ద•టాలునఁ బైపడి కొన్ని చోటులన్
జాఁగఱగొంచు స్రుక్కులను • నాశము సేయుచు హోమవహ్నులం
దోఁగఁగఁ జేయుచుం బగుల • నాకుచుఁ బాత్రలుపద్రవింపఁగా
వేఁగుచు నున్నవారము వి•వేకనిధీ! యొకభంగి నియ్యెడన్. ౨౫౮౬

జాఁగఱగొంచున్ = నాశముచేయుచు, స్రుక్కులను=హోమసాధనములను, దోఁగఁగ=నీటమునుఁగ.

తాత్పర్యము.

కొన్ని స్థలములందు మఱుఁగుచాటుల డాఁగియుండి తటాలునఁ బైపడి నాశము చేయుచు హోమసాధనముల నాశముచేయుచు హోమాగ్నుల నీటఁదడుపుచుఁ బాత్రలు పగులఁగొట్టుచు బాధపెట్టఁగా నేదోయొకవిధముగా బాధపడుచున్నారము.

ఉ. చచ్చినవార లేమొ యిటఁ • జచ్చిరి, చావక యున్నవార మే
నెచ్చటికైనఁ బోద మని • యిందఱు నన్నరిగొల్ప వచ్చి నా
రిచ్చటి కెంతొదవ్వున న•రేశ్వర! నిర్భరపత్రపుష్పసం
పచ్చతురంబు భాసిలుఁ జా•మా ప్రతనాశ్రమ మొండు రమ్య మై. ౨౫౮౭

నిర్భరపత్రపుష్పసంపచ్చతురంబు = అధికమైన యాకులు పూలు వీని యతిశయముచే గొప్పది- ప్రతనాశ్రమము = ప్రాతదియగు నాశ్రమము- 'పురాణ ప్రతన ప్రత్నపురాతన చిరంతనాః' యని యమరుఁడు.

తాత్పర్యము.

ఇంతవఱకుఁ జచ్చినవారేమో యిటచావనే చచ్చిరి. చావఁగా మిగిలినవారైన మేమెచ్చోటికైనఁ బోయి బ్రదుకుదమని తలఁచి నీకుఁజెప్పుదమని నన్నుఁ బురికొల్ప వచ్చినారు. ఇక్కడికి మిగుల దూరమునందు నాకులు, పూలు విశేషముగాఁ గలిగిన పురాణాశ్రమమొండు గలదు.

ఉ. చేరెద మందు నిందఱము • చేవ గలట్టిరయ్యైన సీతతో
మీ రిట నుంట కానిపని • మేకొను డేనియు వెంట రాఁగ నే
తేరుఁడు మీర. లాఖరుఁడు • దేఁకువఁ బైపడకుండుమున్న, యా
క్రూరునితోడిపోరితము • గో డిడు దక్షున కైన రాఘవా. ౨౫౮౮

చేవగలట్టిరయ్యైనన్=బలవంతులేరయ్యైనను- కానిపని = సరిగానిపని- మేకొను డేని=అంగీకరించెదవేని, ఏ తేరుఁడు=రండు- దేఁకువన్=ధైర్యముతో- పోరితము = కలహము- దక్షునకైనన్=ఎంతటి సమర్థునకైనను.

తాత్పర్యము.

ఆ యాశ్రమమునందుఁ జేరుదమని యాలోచించినాము, మీరెంత బలవంతులేరయ్యైనను సీతతో నిచటనుండుట సరిగాదు. కావున నీవు మా వెంట వచ్చుట

కంగీకరించెదవేని ఖరుఁడు పైపడి రాకముందే బయలుదేఱుఁడు. ఎంతటి సమర్థున కైనను వానితోడి కలహము హానికరమే.

ఉ. మౌనివరుం డిటుల్ పలుక • మానవసింహము వారికిన్ సమా
ధానము లెన్ని చెప్పిన య•థామతిఁ బోయిరి వారు, రాముఁడున్
మౌనులవెంటఁ గొందనుక • మార్గము పోయియు సాగనంపి య
మ్మౌనివరేణ్యు బ్రొక్కి- ముని•మండనునానతి వచ్చె నింటికిన్. ౨౪౪౮

యథామతిన్=వారియిష్టప్రకారము- కొందనుకన్ = కొంతదూరము. ముని మండను=మండనమనఁగా నలంకారము- మునులందు శ్రేష్ఠుఁడని యర్థము. ఆనతి =ఉత్తర్వు.

### తాత్పర్యము.

ఆమునిశ్రేష్ఠుఁ డాప్రకారము చెప్పఁగా మనుష్యులందు శ్రేష్ఠుఁడైన శ్రీరామచంద్రమూర్తి యయ్యలారా! యీ విషయము నాకింతవఱకుం డేల చెప్పలేదు? చెప్పియుండిన దానికిఁ బ్రతిక్రియ చేసియుండనా? ఇప్పుడు చెప్పితిరిగదా. ఇఁకమీఁద వారు మిమ్మంటకుండ నేను రక్షించెదను. మీకు వచ్చిన భయములేదని యెన్నివిధాల సమాధానపఱిచినను వారు వినక వారియిష్టప్రకారము వెడలి పోయిరి. రామచంద్రుఁడును వారివెంటఁ గొంతదూరము పోయి సాగనంపి మునిశ్రేష్ఠుఁ డిచ్చిన బోయిరమ్మని వచ్చెదవని చెప్పఁగా మరలి యింటికివచ్చెను.

ఇచ్చట నొకటి యాలోచింపవలసి యున్నది. శ్రీరాముని నిమిత్తమై మునీశ్వరులేల వెడలిపోవలె? నీ నిమిత్తమై మాకీ కష్టమువచ్చినది నీవిచ్చట నుండవలదు పొమ్మని చెప్పియుండరాదా! లేక దీనికిఁ బ్రతిక్రియ యేమని యడిగియుండరాదా? వాస్తవ మాలోచింప నిది దండకారణ్యవాసులందఱుఁ గలిసి పన్నిన పన్నాగము. చిత్రకూటవాసులుకూడఁ గలిసియున్నారని తోఁచుచున్నది. అరణ్యకాండము ౪౬-౭-వ స. చూడుము "మహాత్మ నిన్ను నీప్రాంతమునఁ జేరఁబంప శరభంగునిఁ జూడఁగవచ్చి నాఁడు పాకాంతకుఁ డా మహాత్ములు సహాయమునన్ నినుఁజేర్చి రీ యెడన్" అని కలదు. రాముఁ డయోధ్యయందున్నను జిత్రకూటమునం దున్నను నించుమించు రెండు సమానములే. కావున శ్రీరామచంద్రమూర్తిని జిత్రకూటమునుండి లేవఁదీయుటకై మును లీయుపాయము చేసిరి. నీవు పొమ్మనుట మర్యాదగాదు. ఆయనకార్యము వేఱొకచోనుండ నిచ్చట నాయన యుండుట యుచితముగాదు. మనము లేచిపోయిన నాయనయు లేచిపోవునని యిట్లుచేసిరి. ఈ సమయమందే వాల్మీకి తమసాతీరము చేరెను.

—• ౧౧౭-వ సర్గము. సీతారామలక్ష్మణుల యత్రిమునియాశ్రమంబుఁ జేరుట. •—

చం. తపసులు చన్న వెన్క- వసు•ధాపతి యించుక చింత సేయుచున్
నెపములు పెక్కు- లున్నయవి • నే నిట నిల్వఁగ రాదు కిమ్మెడన్

సపరిజనుండు మాతృజన • సంయుతుఁడా భరతుండు వ స్టనిం
దపలిపలాడెడిన్ మనము • తద్దయు నయ్యది సంస్మరించినన్. ౫౪౧౦

ఇంచుక=కొంచెము- సపరిజనుండు=పరివారముతోఁ గూడినవాఁడు- మాతృజనసంయుతుఁడు=తల్లులతోఁ గలిసియుండినవాఁడు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి యా మునీశ్వరులందఱుఁ బోయినవెనుక నిట్లాలోచించెను, నే నిక్కడ నుండరామికిఁ గారణము లనేకములున్నవి. భరతుఁడు పరివారముతోఁ దల్లులతో వచ్చి యిచ్చట నన్నుఁజూచెను వానిదుఃఖము వారిదుఃఖము పలుమాఱు స్మరణమునకు వచ్చుటచే మనస్సు వ్యసనాక్రాంత మగుచున్నది.

కం. బంధురగుణుఁ డగుభరతుని,స్కంధావారంబు విడిసె • సవిధావనిఁ ద
త్సింధురవాజికరీష,గంధంబున నిలువ మేలు • గా దిచ్చోటన్. ౫౪౧౧

బంధురగుణుఁడు = మనోహరమైన గుణములుగలవాఁడు- స్కంధావారము=సేన- దండు దిగినప్రదేశమునకు స్కంధావారమని పేరుగలదు. విడిసిన = దిగిన- సవిధావనిన్=సమీపభూమియందు- తత్ =ఆసేనయందలి- సింధుర=ఏనుఁగులయు - వాజి=గుఱ్ఱములయు- కరీష=పేడ (లద్దె) యొక్క- గంధంబునన్=చెడువాసనచేత.

తా త్ప ర్య ము.

భరతుఁ డిచ్చటికి సమీపప్రదేశమందే సేనతో దిగెను. ఆ సేనయందలి యేనుఁగులు గుఱ్ఱములు పెట్టినలద్దె కంపుకొట్టుచున్నది. కావున నిచట నిలుచుట యారోగ్యకరముగాదు.

ఎప్పుడు సీతారామలక్ష్మణులు చిత్రకూటము విడిచి పోయిరను విషయమునఁ దిలకవ్యాఖ్యానమందు శ్వేషమాషమందు భరతుఁడు చిత్రకూటమునకు వచ్చిపోయెను. అపై వర్షాకాలమగుటచే నది ముగియుదాఁక రాముఁడు చిత్రకూటముననే యుండెను. ఆమధ్యకాలముననే కాకాసురుఁడు సీత నుపద్రవించి భంగపడినది. వానకాలమైన పిదప ఋషులు తొందరపడి వెడలిపోయిరి. అవల రామచంద్రుఁడును వెడలిపోయెనని యున్నది.

ఈ యభిప్రాయమున కాధారముగ "రాఘవశ్చిత్రకూటాద్రౌ సానుజో రమతప్రియా, కదాచిదంకే వైదేహ్యా, నిద్రాణే రఘునందనే, ఐంద్రః కాక స్సమాగమ్య, జానకీం వీక్ష్యకాముకః॥ అని పాద్మమందలి వాక్య ముదాహరింపఁ బడెను. కాకాసుర వృత్తాంతము చెప్పుటకై యిది యిట్లుచెప్పఁబడెను. కాని భరతనిర్గమానంతరము జరిగినదని చెప్పుటకుఁ గాదని తోఁచుచున్నది.

ఇది సయుక్తికముగాదు.ఏలన శ్రీరామచంద్రమూర్తి చెప్పినవి రెండుకారణములు. 1. బంధు స్మరణము. 2. లద్దెకంపు చత్వారో వార్షికామాసా యని యాషాఢము, శ్రావణము, భాద్రపదము, ఆశ్వయుజము ఈ నాలుగు వాననెలలు.

కిష్కింధాకాండము చూడుఁడు. అట్లగుట కార్తికమాసమునందు వెడలిపోయి యుండ వలె. ఐదు నెలలుగా సహింపఁగూడిన బంధువియోగతాపము లద్దెకంపావల ససహ్య మెట్లయ్యెను? అదియునుగాక లద్దెకంపు కొట్టుచున్నట్లు శ్రీరామచంద్రమూర్తి చెప్పెనుగదా; క్రొత్తలో పచ్చిగానున్నప్పుడు కంపుకొట్టియుండునా? ఐదు నెలలయిన తరువాతఁ గొట్టియుండునా? వానలకుఁ గొండవంకలకు నదియంతయుఁ గొట్టుకొని పోయియుండదా? కావున భరతుఁడు వెడలిపోయిన పది పదునైదు దినములలో జరిగిన వృత్తాంత మిదియైయుండవలెను.

ఉ. కావున దీనిఁ బాసి యెడ•గాఁ జనుటే యుచితం బటంచు నా
మూవురు నైలుదేరి ముని•ముఖ్యుని నత్రిని జేరి మ్రొక్కినన్
భావము పొంగఁ బుత్రకుల•భంగిని వారల నాదరించి సం
భావన నాతిథేయ మిడి • భవ్యచరిత్ర పవిత్రవృద్ధయున్. ౨౪౪౧

ఎడగాన్=దూరముగ- ఉచితము = తగినది- పుత్రకులభంగిని = ముద్దుబిడ్డల వలె- సంభావన=గౌరవముతో- భవ్యచరిత్ర = శుభమైన నడవడిగలది- పవిత్ర = పాతివ్రత్యమహిమచేఁ బవిత్రురాలు- వృద్ధ=ముసలిది.

తాత్పర్యము.

ఈ కారణములచే దీనిని వదలి దూరముగాఁ బోవుటే తగినపని యని యాలోచించి సీతారామలక్ష్మణులు ముగ్గురు పయనమై యత్రిమహామునిఁ జేరి నమస్కరింపఁగా నాయన సంతోషముచే నుప్పొంగుచుఁ జిన్నబిడ్డల నాదరించినట్లు వారి నాదరించి సగౌరవముగా విందుపెట్టి శుభచరిత్రయుఁ బాతివ్రత్యముచేఁ బరిశుద్ధయు ముసలిదియు- (ముందుపద్యముతో నన్వయము).

అత్రి శబ్దమున కర్థము నత్రియే యిట్లు చెప్పెను.

శ్లో. అరాత్రి రత్రిః సారాత్రి, ర్యాంనాధీతే త్రిరద్యవై
అరాత్రి రత్రి రిత్యేవ, నామమే విద్ధి శోభనే॥ భార. అను. 142-అ.

వ్యాఖ్య.

అరాత్రిః అరయః కామాదయః సంత్యస్మిన్నిత్యరం పాపం అర్శ ఆదిభ్యోఽజిత్యచ్। తస్మాత్ త్రాయత ఇత్యరాత్రిః। అరశబ్దాదలుప్త పంచమీకాత్ పరస్య త్రాయతే రుపరి క్విప్ప్రత్యయః। యస్మాదరాత్రిస్తస్మాదత్రిః। అత్తీత్యద్ మృత్యుస్తస్మా త్త్రాయత ఇత్యత్రిః, మృత్యుశబ్దస్య పాప్మని ప్రయోగదర్శనాత్।

నీలకంఠీయము.

నేను లోకములను పాపములనుండి రక్షింతును గావున నాపే రత్రి. మఱియును వేదములు దినమునకు మువ్మాఱు పఠించుటచే రాత్రులనుగూడఁ బగళ్ళను జేసితిని. కావున నాపేరత్రి. మఱియును నేను వేదాధ్యయనము చేయనిరాత్రి లేదు కావున నాపేరత్రియని సుందరీ! తెలిసికొనుము.

మ. తనయిల్లా లనసూయ తాపసి మహా•ధర్మాత్మ తన్ డాసినన్
జనకాధీశతనూజఁ జూచి సతి! యీ•సాధ్వీలలామంబు భూ
తనయారత్నము గారవింపు మని ప్రీ•తస్వాంతుఁ డై పల్కి యా
యనసూయామహిమంబు వాకొనియె రా•మాధీశుతో నీగతిన్. ౨౫౨౩

ఇల్లాలు=గృహిణి- భార్య- మహాధర్మాత్మ =స్త్రీలకుఁ బరమధర్మమగు పాతివ్రత్యము స్వరూపముగాఁగలది- డాసినన్ = సమీపింపఁగా- జనకాధీశు తనూజన్= సీతను- సాధ్వీలలామంబు=పతివ్రతలలో శ్రేష్ఠురాలు- భూతనయారత్నము = భూమియందు జనించిన రత్నమువంటి సీత- ప్రీతస్వాంతుండై = సంతోషించిన మనస్సుగలవాఁడై-

తా త్ప ర్య ము.

తనభార్యయు, మహాతపస్వినియుఁ బాతివ్రత్యమే స్వరూపముగాఁ గలదియు నగు ననసూయాదేవి తనసమీపమునకు రాఁగా సీతాదేవిని జూచి యీ పతివ్రతా శిరోమణి భూదేవికూఁతురు. ఈమెను నీవు గారవింపుమని సంతోషముతోఁ బల్కి యా యనసూయ గొప్పతనమును నత్రి శ్రీరామచంద్రమూర్తితో నిట్లనియె.

చం. చినుకనుమాట లేక నర•జీవచయంబు ప్రదగ్ధమైనచోఁ,
దనదుతపంబునన్ ఫలవి•తానము మూలములున్ దశాబ్దముల్
పెనుపడఁ బాఱ గంగ నలి • పెన్ సుతపంబునఁ దీవ్రనిష్ఠఁ గై
కొనెఁ బదివేలయేఁడులు వి•కుంఠిత సర్వతపోంతరాయ యై. ౨౫౨౪

నర జీవచయంబు=మనుష్యులు ఇతరప్రాణిసమూహము- ప్రదగ్ధమైనచోన్ = మిగులఁ గాలిపోఁగా- ఫలవితానము=పండ్లసమూహమును- మూలములున్=వేళ్లను- దశాబ్దముల్=పదిసంవత్సరములు- ఇది పంచపాత్రమువంటిది. పెనుపడన్ = వృద్ధి పొందునట్లు. గంగపాఱన్ = గంగప్రవహింప- వికుంఠిత = చెడఁగొట్టఁబడిన- సర్వము=సమస్తములైన- తపః=తపస్సులయొక్క- అంతరాయయై=విఘ్నములుకలదై.

తా త్ప ర్య ము.

చినుకనుమాటలేక మనుష్యులు నితరజీవికోటులు మాఁడిపోఁగా దనతపస్సుచే ఫలములు కందమూలములు పదిసంవత్సరములు వృద్ధిపొందఁజేసెను. గంగను బ్రవహింపఁజేసెను. పదివేలసంవత్సరములు విఘ్నములులేక తీవ్రనిష్ఠఁబూని తపస్సు చేసెను. భర్తయాజ్ఞ గైకొని చేసినది కావున నిది తప్పుగాదు.

తే. దేవకార్యనిమిత్త మీ•దేవి పదియు, రాత్రుల నెల్ల నేకరా•త్రంబుఁ జేసె
స్నాత యయ్యెను వ్రతముల • సౌమ్యశీల, తల్లివలెఁ బూజ్యనీకు నో•ధన్యచరిత.
౨౫౨౫

పదియురాత్రులు=పదిదినములు- ఏకరాత్రము=ఒకరాత్రిగానే- పగలనునది లేకుండునట్లు- పూజ్య=పూజకుయోగ్యురాలు- అనసూయాదేవి కుమారుఁడు దత్తాత్రేయుఁడు విష్ణ్వంశ సంభూతుఁడేకదా.

తాత్పర్యము.

దేవకార్యము నిర్వహించుటకై యీమె పదిదినము లొకరాత్రిగా సూర్యోదయ మనునది లేకుండఁ జేసెను. వ్రతములన్నియు సాంతముచేసి స్నాతకకర్మము జరపెను. నీవునీతల్లివలె నీమెను గౌరవించి పూజింపుము. నీ పూజ కీమె యోగ్యురాలు.

తే. సర్వభూతనమస్కార్య • సాధుకీర్తి
కోపసంత్యక్త నిజకర్మ • కోటిచేతఁ
గనియె ననసూయ యనఁగఁ బొ • గడ్త జనక
తనయ మ్రొక్కింపు మీవు తా • త్పర్యయుక్తి. ౨౯౯౬

సర్వభూత నమస్కార్య=సమస్తజనులు మ్రొక్కుటకు యోగ్యురాలు- సాధుకీర్తి=మంచికీర్తిగలరాలు- కోపసంత్యక్త=కోపముచే విడువఁబడినది- ఈమెయందు నిలువ నెలవులేక కోపము తనంతటఁదానే తొలఁగిపోయెను. నిజకర్మకోటిచేత = తాను జేసిన సత్కర్మముల సమూహమువలన- అనసూయ=అసూయలేనిది- లేదా నిజకర్మకోటిచేత=స్త్రీధర్మమైన పాతివ్రత్యమునకు సంబంధించినయితరుల కసాధ్యములైన యనేకవిధ శుశ్రూషలచే- గొప్పమహిమగలది గాన- అనసూయ=అసూయ పడరానిది- పొగడ్త=కీర్తి- తాత్పర్యయుక్తిన్=మంచియభిప్రాయముతో-

తాత్పర్యము.

ఈమె సమస్తభూతముల నమస్కారమునకు యోగ్యురాలు, సత్కీర్తిగలది, కోపములేనిది, తాను జేసిన పుణ్యకర్మములచే నసూయలేనిది యనుపేరు సంపాదించినది, స్త్రీధర్మమైన పాతివ్రత్యమునకు సంబంధించిన యితరులకు సాధ్యముకాని కార్యములు చేయుటచే నసూయపడరానిదని కీర్తిగన్నది, నీవు సీతాదేవి నీమెకు నమస్కరింపఁజేయుము.

కం. అనవుడును రామచంద్రుఁడు, జనకసుతం గాంచి యనియె • జానకి! వింటే
మునిపల్కులు వృద్ధతపస్విని నే కాన్పించుకొనుము • చేకుఱుశుభముల్. ౨౯౯౭

తాత్పర్యము.

అని యత్రిమహాముని చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి సీతాదేవిం జూచి వింటివిగదా మునీంద్రుఁడు చెప్పినమాటలు, నీవు పోయి యీమెను దర్శింపుము. నీకు మేలగును.

—• సీత కనసూయ హితోపదేశంబుఁ జేయుట. •—

సీ. పతిపలు కాలించి • క్షితికన్య చని వృద్ధ, నొడలెల్ల ముడుతలు • పడినదానిఁ
బండుముదిమిచేతఁ • బాండురం బగుతల, వెండ్రుకల్ జడ లయి • వెలయుదాని

నోరుగాలిఁ జలించు • చున్నయనంటి నా, మిగుల వణంకెడి • మేనిదాని
ధాత్రి బతివ్రతా • ధర్మంబె రూపంబుఁ, జేకొన్నవిధముగఁ • జెలఁగుదానిఁ
తే. గాంచి జనకతనూభవ • కరముభక్తిఁ, దనదుపేర్వాడి మ్రొక్కి హ • స్తములు మోడ్చి
నిలిచి కుశలంబు లడుగ నా • నిర్మలాత్మ, యమ్మహాభాగతోడ ని • ట్లనియెఁ బ్రీతి. ౨౫౬౮

పాండురము=తెల్లనిది- పేర్వాడి=పేరుచెప్పి- మహాభాగ=మిక్కిలిభాగ్యము గలది- ఇచ్చటఁ జెప్పఁబడిన భాగ్యము పాతివ్రత్యమే.

తా త్ప ర్య ము.

భర్తచెప్పిన మాటలు విని సీతాదేవి పోయి దేహమంతయు ముడుతలుపడి నిండుముసలితనముచేఁ దెల్లనైన వెండ్రుకలు జడలుగాఁగలదై నోరుగాలికి నరఁటి చెట్టువలె మిక్కిలి వణఁకుచున్న వృద్ధురాలిని భూమిమీఁదఁ బతివ్రతాధర్మ మీ రూపము వహించి వచ్చినదని చెప్పఁదగినదానిని జూచి మిగుల భక్తితోఁ దనపేరు చెప్పి నమస్కరించి రెండుచేతులు జోడించుకొని నిలువఁబడి కుశలమడుగఁగా నిర్మలమైన మనస్సుగల యనసూయాదేవి సంతోషముతో నా ధర్మాత్మురాలగు సీతతో నిట్లనియె.

ఉ. ఎంతటిపుణ్యశీలవొ క • దే జనకాత్మజ! సాధ్వీధర్మ మే
కాంతముఁ బూని, బంధులను • గల్మిని సౌఖ్యముఁ బాసి, మాన మా
వంతయు లెక్కసేయక, వ • నావళికిన్ వ్రత మూని వచ్చుని
కాంతునితోడ వచ్చితివి • కామిను లిట్టిరు గల్గిరే భువిన్. ౨౫౬౯

సాధ్వీధర్మము=పతివ్రతలయొక్కధర్మము-ఏకాంతము=మిక్కిలి-"తీవ్రైకాంత నితాంతాని గాఢ బాఢదృఢానిచ" అమరుఁడు. కల్మి=సంపద- మానము = గౌరవము- మహారాజుకోడల ననుగర్వము. వ్రతము=పితృవాక్యపరిపాలనా నియమము- కాములు=స్త్రీలు- ఇట్టిరు=ఇట్టివారు.

తా త్ప ర్య ము.

సీతా నీవెంతటి పుణ్యచరిత్రవే! పాతివ్రత్యమనే విశేషము గొప్పదిగ భావించి చుట్టాలను సంపదను సౌఖ్యము వదలి మహారాజు కూఁతురను మహారాజు కోడలను నను గొప్పతనమును లక్ష్యముసేయక తండ్రిని యథార్థవాదిని జేయవలయునని యడవికి వచ్చుచున్న మగనితోడ వచ్చితివి. ఇట్టి స్త్రీలుకూడ లోకమందున్నారా?

కం. నగరస్థుఁడో విపినస్థుఁడో, యగుణియొ నిర్ధనుఁడొ ఖలుఁడొ • యతికాముకుఁడో
మగనాలికిఁ దనపతియే, సుగతికిఁ గారణ మతండ • చూ దైవంబున్. ౨౫౭౦

నగరస్థుఁడో=పట్టణమందున్నవాఁడో, విపినస్థుఁడో=అడవియందున్నవాఁడో- అగుణియొ=మంచిగుణము లేనివాఁడో- నిర్ధనుఁడో = ధనహీనుఁడో- ఖలుఁడో =

దుష్టుఁడో– అతికాముకుఁడో=మిగులకాముకుఁడో– మగనాలికి=పతివ్రతకు– సుగతికి=మంచిలోకములకుఁ బోవుటకు. సీతకు రాఁబోవు కష్టదశను దెలిపి యామెమనస్సు దృఢపఱుచుటకై పతివ్రతాలక్షణ ముపదేశించుచున్నది.

తాత్పర్యము.

పతివ్రతయైన స్త్రీకి మగఁడు పట్టణమందుండి భోగము లనుభవించు నాగరకుఁడైనను అడవియందుండి కష్టము లనుభవించు వనచరప్రాయుఁడైనను గుణహీనుఁడైనను దరిద్రుఁడైనను దుష్టుఁడైనను కామాతిశయముచే జారుడైనను నతఁడే పుణ్యగతులకుఁ గారణము. అతఁడే యామెపాలికి దైవము.

చం. తనయొనరించినట్టిసుకృ • తంపుఁదపంబువిధాన జానకీ!
తను నిఖలస్థలంబులను • దద్దయుఁ బ్రోచెడిప్రాణభర్తకం
టెను మఱి మేటిచుట్టమును • నే నెఱుఁగం జుమీ, జాఁగలైన యా
వనిత లెఱుంగలేరు మగు • వా! తగ వాఱడిపోక పోవుచున్. ౨౬–౧

జాఁగలు=జారిణులు– తగవు=ధర్మము– ఆఱడిపోక=నింద్యమగు మార్గమునఁ బోవుట.

తాత్పర్యము.

జానకమ్మా! తాను జేసిన పుణ్యము తన్నెట్లు సర్వకాలములందు సర్వదశలందు సర్వస్థలములందు రక్షించునో యట్లు మిక్కిలి రక్షించు మగనికంటె స్త్రీకి గొప్పచుట్టమును నేనెఱుఁగను. కామాతిశయముచేఁ జెడునడువడికగల పడఁతులు నింద్యమగు మార్గమునఁ బోవుచు ధర్మమెఱుంగలేరు.

చం. తనపతి పక్ష సేయక ని • తాంతలతాంతశరార్తి నిచ్చమైఁ
జనియెడివారు, ప్రాణవిభు • శాసనమెట్టెడివారు, దుర్యశం
బున వరధర్మసంచ్యుతిని • బొల్పఱి పోవుదు రమ్మ! యిందు నం
దును గుణదోషమూఢ లయి • దుష్టగుణంబు సుఖంబుఁ గూర్చునే. ౨౬–౨

పక్ష=లక్ష్యము; శ్రద్ధాశబ్దభవము– నితాంత=అధికమైన– లతాంతశర=మన్మథునియొక్క– ఆర్తిన్=బాధచే– ఇచ్చమైన్=ఇష్టమువచ్చినట్టు– శాసనమెట్టు=ఆజ్ఞమెట్టు– దుర్యశంబునన్=అపకీర్తిచే– వరధర్మసంచ్యుతిని=శ్రేష్ఠమైన పాతివ్రత్యమును వదలుటచే– పొలుపఱి=బాగుచెడి– ఇందున్=ఈలోకమందు– అందును=పరలోకమందును– గుణదోషమూఢలయి=ఇదిగుణము ఇదిదోషము అని తెలియనివారై– దుష్టగుణంబు=చెడుగుణము.

తాత్పర్యము.

తనమగనియందు లక్ష్యములేక కామబాధచే నిష్టమువచ్చినట్లు తిరుగువారు, మగనిని దమయాజ్ఞలో నుంచువారు, అపకీర్తిపాలై ధర్మహానివలన క్షేమమును నాశము చేసికొని యీలోకమందుఁ బరలోకమందుఁగూడ నిదిగుణము ఇదిదోషమని

తెలియనివా రగుటచేఁ జెడిపోదురు. చెడుగుణమువలన సుఖమున్నదా.

కం. ఇలువడి పాటించుచు మదిఁ, దలఁచుచు మేల్గీడ్పు శుభముఁ • దప్పనిసాధ్వీ
   తిలకము సమస్తధర్మంబులు చేసినవారిమాడ్కిఁ • బొందుఁ ద్రిదివమున్. ౨౯-౩

ఇలువడి = (1) కులీనత- (2) మంచినడత- ఇలు+వడి = ఇంటిమర్యాద-కులపాలికాత్వమని యర్థము. సాధ్వీతిలకము=ఉత్తమపతివ్రత-త్రిదివము = స్వర్గము-పాతాళమర్త్యస్వర్గములలో స్వర్గము మూఁడవది గనుకఁ ద్రిదివమనిపేరు.

తా త్ప ర్య ము.

వ్యభిచారములేక కులధర్మము పాలించుచు నిదిమేలు ఇది కీడని తెలిసి మంచి కార్యముచేయు పతివ్రతారత్నమునకు నామె మఱియేమియుఁ జేయకున్నను ధర్మములన్నియుఁ జేసినవారికి లభించు స్వర్గము లభించును.

చం. సుమతిని బుట్టినింటికిని • జొచ్చినయింటికిఁ గీర్తిఁ దెచ్చునా
   సుమహితసద్గుణప్రకర • శోభిత సన్నుతశీల సాధ్వి యు
   త్తమయశమును బదంపడి ని • తాంతశుభంబును బొంది నాకసౌ
   ఖ్యముఁ గనుఁగాన భర్తృహిత • కారిణి వై చరియింపు మంగనా! ౨౯-౪

సుమతిని=మంచిమనస్సుతో- చొచ్చినయింటికి = ప్రవేశించిన మగనియింటికి- సుమహిత = మిగులశ్రేష్ఠములైన- సద్గుణప్రకర = మంచిగుణముల సమూహముచే- శోభిత = ప్రకాశించునది- సన్నుతశీల = సజ్జనులచే స్తోత్రము చేయఁబడిన స్వభావముఁగలది- సాధ్వి=సాధుగుణముగల పతివ్రత- ఉత్తమయశమున్=గొప్పకీర్తిని-బదంపడి=అవల- నితాంతశుభంబును=అధికమైన మేలును- నాకసౌఖ్యము=స్వర్గలోకమందలి సుఖమును- భర్తృహితకారిణివై =మగనికి మేలుచేయుదానవై.

తా త్ప ర్య ము

మంచిమనస్సుగలదై పుట్టినింటికి మగనింటికిని గీర్తికలిగించు సుగుణములు సదాచారముగల పతివ్రత గొప్పకీర్తిని నావల మేలిశుభంబును బొంది స్వర్గసుఖమును బొందును. గావున నీవు కుమారీ! భర్తకు హితమైనకార్యములే చేయుము.

కం. అని యనసూయయు ననసూ,యను దను వచియించినట్టి • యప్పలుకులకున్
   జనకతనూభవ యలరుచు, మనమున నిట్లనియె మంద • మధురమృదూక్తిన్.
   ౨౯-౫

తా త్ప ర్య ము.

అనసూయ యసూయలేని తనకుఁజెప్పిన మాటలు విని నాయందెంతప్రేమ లేకున్న నిట్లు హితము బోధించునా యని సీతాదేవి సంతోషించుచు మెల్లని తియ్యని మాటల నిట్లనెను. అనసూయ యనసూయ యగుటన్ను ననుటచేఁ బాతివ్రత్యమందు ననసూయతో సమానురాలని భావము. ఈమె చెప్పునదియేమి నేను

వినునదియేమి నాకీమె చెప్పవలయునా నాకుఁదెలియదా యనకుండుటయే యన సూయలక్షణమని తెలియునది.

—• ౧౧౮-వ సర్గము. సీత యనసూయవాక్యంబులకు మోదించుట. •—

కం. నీవంతటితపశ్శాలిని, యీవిధముగ నుడుట చిత్ర•మే సాధ్వులకున్
 సేవింపఁ బ్రాణనాథుఁడె, దైవం బనుమాట దెలియు•దానను దల్లీ. శ్లో. ౧-౨

తపశ్శాలిని=తపముచేఁ బ్రకాశించునది- చిత్రమే=ఆశ్చర్యమా?

తా త్ప ర్య ము.

తల్లీ! గొప్పతపస్సుచేఁ బ్రకాశించు నీవంటి పతివ్రత యీప్రకారము చెప్పుట వింతగాదు. సేవించుటకై పతివ్రతలకు మగఁడే దైవమనుమాట నాకుఁ దెలియును.

ఉ. నాపతి వృత్తహీనుఁ డయి•నన్ దృఢభక్తి నభేదబుద్ధినై
 నోపిక నేను గొల్చి తగ • నుండఁదగున్; విజితేంద్రియుండు శ్లా
 ఘాపరిపూతసద్గుణుఁడు • కారుణికాగ్రణి ధర్మబుద్ధి మా
 తాపితృవత్ప్రియుండు నగు•ధన్యుని రామునిఁ గొల్చు టబ్రమే. శ్లో. ౩-౪

నాపతి వృత్తహీనుఁడు = వృత్తహీనుఁడు నాపతియైయుండిన ననియర్థము. వృత్తహీనుఁడు = మంచినడవడిలేనివాఁడు- అభేదబుద్ధినై=భేదభావము లేక- మంచివాఁడు చెడ్డవాఁడు అను తారతమ్యజ్ఞానము లేక- విజితేంద్రియుండు=ఇంద్రియముల జయించినవాఁడు- శ్లాఘాపరిపూతసద్గుణుఁడు = పొగడ్తచేఁ బరిశుద్ధమైన మంచిగుణములుగలవాఁడు- కారుణికాగ్రణీ = దయావంతులలో మొదటివాఁడు- ధర్మబుద్ధి = ధర్మమందే బుద్ధినిలుపువాఁడు- మాతాపితృవత్ప్రియుఁడు = తల్లివలెఁ దండ్రివలె మేలుకోరువాఁడు- అబ్రమె=అబ్బురమా- ఆశ్చర్యమా- అబ్బురాదులం దుత్వము నకు లోపంబు విభాషనగు. సు-వ్యా. సూ. ౨౪. సంధి.

తా త్ప ర్య ము.

తల్లీ! నాతండ్రి నన్నెవనికిచ్చునో వాఁడు గుణహీనుఁడైనను వానియందు గుణాగుణములెంచక వాఁడే దైవమని నిశ్చలభక్తితో సేవింపవలసినది నాకువిధి. అట్లుండ నింద్రియముల జయించి కీర్తికరములగు పరిశుద్ధగుణములు గలవాఁడై దయావంతులలో మేటియై ధర్మమందు బుద్ధినిలిపి తల్లివలెఁ దండ్రివలె మేలెంచు వాఁడయిన శ్రీరామచంద్రమూర్తి నాకుఁ బతియైనపు డాయనను సేవించుట యేమి యాశ్చర్యము.

కొందఱు నాపతి=రామచంద్రుఁడు గుణహీనుఁడైనను అని యర్థము చెప్పుదురు. అదిప్రశస్తముగాదు.

ఉ. తుల్యవిలోకనుండు గుణ•తోయధి రామవిభుండు తల్లిఁ గా
 నల్యనుబోలె నన్యనృప•సారసనేత్రలఁ జూచి భక్తి సా

కల్యము గా నదాటునను • తన్మవిభుచూచినకాంత దోఁప సా
కల్యము చేస్మి మాతృమతి • చేయు నహంకృతిముక్తచిత్తుఁడై.        ౨౫౬౮

తుల్యవిలోకనుండు = సమదృష్టిగలవాఁడు- అనఁగా భార్యవలెఁ దల్లిని, తల్లి వలె భార్యను జూచువాఁడని యర్థముగాదు. యోగ్యతానుసారముగ ననియర్థము. గుణతోయధి = సముద్రమునందు రత్నములవలెఁ దనయందు గుణరత్నములు గలవాఁడు- లేదా సముద్రమునందు నీళ్ళవలె నీయనయందు సద్గుణము లున్నవని భావము- తోయములేని తోయధియెల్లులేదో గుణములులేని రాముఁడు లేనివాఁడనియే భావము. కల్యాణగుణముల నొకప్పుడైన విడిచి యుండువాఁడు కాఁడు. అన్యనృప సారసనేత్రలన్=ఇతరరాజస్త్రీలను- సాకల్యముగా = పూర్ణముగా- అదాటున=తటాలున- తన్మవిభుచూచినకాంత=దశరథుఁడు చూచినస్త్రీ- తోఁపన్=కనబడఁగా-అహంకృతిముక్తచిత్తుఁడై=అహంకారముచేవిడువఁబడిన మనస్సుగలవాఁడై.

తా త్ప ర్య ము.

సన్నుఁదప్పఁ దక్కిన యందఱు రాజస్త్రీలను గౌసల్యను జూచినట్లుచూచును. వీరందఱు స్త్రీలేగదా, మాతల్లియు స్త్రీయేకదా, ఆమెకు వీరికి నేమిభేదము. కావున వీరు నాకుఁదల్లులవంటివారే అని యీప్రకారము సమదృష్టిఁ జూచును. దశరథమహారాజొకసారి చూచినస్త్రీయైనను దటాలునఁ గానవచ్చెనేని సాక్షాత్తు తల్లియనియే యహంకారములేక భావించును.

ఉ. హృత్తినరక్తి నేను విపి•నావళికిం జనుదెంచువేళ మా
యత్తయు, నావివాహసమ•యంబున నంబయుఁ, జెప్పినట్టివా
క్యోత్తమపాళి నాటినది • యుల్లమునం దిపు డీవు వానినిన్
గ్రొత్తలు చేసి; రంగనల•కుం బతిసేవయె సత్తపం బగున్.        ౨౫౬౯

హృత్తినరక్తిన్=ప్రేమతోఁ గూడినదై-విపినావళికిన్=అడవులకు- వాక్యోత్తమపాళి=శ్రేష్ఠములైన వాక్యసమూహము.

తా త్ప ర్య ము.

నేను నాపతివెంట నడవులకు వచ్చుసమయమునందు నాయత్తగారును బెండ్లిసమయమున నాతల్లియుఁ బాతివ్రత్యముగుఱించి గొప్పమాటలు చెప్పినారు. అవి మనస్సున నాటుకొనియున్నవి, కాని ప్రాఁతపడినవి. ఇప్పుడు నీవు వానిని గ్రొత్తగా మనస్సునకుఁ దెచ్చి బలపఱచితివి. తల్లీ! నాయభిప్రాయమున స్త్రీలకుఁ బతిశుశ్రూషయే మంచితపస్సు వేఱుతపస్సు లక్కఱలేదు.

కం. పతిశుశ్రూషన కాదే, సతి సావిత్రియు వెలుంగు • స్వర్గమునందున్
బతి శుశ్రూషను గాదే, యరివ భవద్ధస్తకలిత • మయ్యె దివంబున్.        ౨౫౭౦

పతిశుశ్రూషన = పతిసేవసేయుటచేతనే- భవద్ధస్తకలితము = భవత్ = నీ యొక్క- హస్తకలితము=చేతియందుండునది-

తాత్పర్యము.

పతిసేవ చేయుటచేతనేకదా సావిత్రి స్వర్గలోకమునఁ బ్రకాశించుచున్నది. పతిసేవ చేయుటచేతఁగదా నీకు స్వర్గ మఱచేతిలోనిదయ్యెను.

కం. దివిదేవత యగురోహిణి, యువతిజనశ్రేష్ఠ యొకముహూర్తం బేనిన్
స్వవిభుం దారాపతి నె, న్నవులక చరియింపఁ గలుగునా యెన్నండున్. ౨౫౭౧

తాత్పర్యము.

ఆకాశదేవత స్త్రీరత్నమగు రోహిణి యల్పకాలమైనను తనభర్తయగు చంద్రునివెంటఁ బోవక యుండఁగలదా. ఈ రోహిణి ౨౭ నక్షత్రములలోఁ జేరిన రోహిణిగాదు.

చం. స్థిరపతిభక్తిఁ జేసెడిప•తివ్రత లిట్లు జగన్నుతంబుగా
ధరణిఁ జరించి యాత్మకృత•ధర్మమునన్ దివిఁ బూజ్యమాన లై
పరఁగుదు రంచుఁ బల్కి-ముని•పత్ని నితాంతముదాన జానకిన్
శిరమును మూరుకొంచుఁ దనుఁ • జేరఁగఁ దీసి వచించె నీగతిన్. ౨౫౭౨

జగన్నుతంబు=ప్రపంచము పొగడునట్లుగా- ఆత్మకృతధర్మమునన్ = తాము చేసిన పతివ్రతాధర్మముచే- పూజ్యమానలై = గౌరవింపఁబడినవారై- నితాంతము దాన=అతిశయించిన సంతోషముతో- మూరుకొంచున్ = వాసనచూచుచు- తనుఁ జేరఁగఁదీసి మూరుకొంచు నని యన్వయము.

తాత్పర్యము.

చలింపని మనస్సుతోఁ బతిసేవచేసెడి పతివ్రతలు లోకులు నుతించునట్లు లీలోకాలోకమునఁ బతివ్రతలై చరించి వారుచేసిన యా పుణ్యముచేతనే స్వర్గము నందుఁ బూజింపఁబడుదురు. అని సీతాదేవిచెప్పఁగా ననసూయాదేవి మిక్కిలి సంతోషించి యామెను దగ్గఱకుఁదీసికొని శిరస్సువాసనచూచి యిట్లుచెప్పెను.

శా. అమ్మా! నీదుమనోజ్ఞవాక్కుల మహా•హ్లాదంబు సంధిల్లెఁ, గో
ర్కె-మ్మా నీకు నభీష్ట మెద్ది సమకూ• ర్తున్ మత్తపశ్శక్తి, నా
నమ్మాటల్ విని విస్మయంబు దరహా•సాంకూరముల్ దోఁపఁగా
నమ్మానాక్షి భవత్కృపం గొదవ లే•దమ్మా యెదే న్నాపుడున్. ౨౫౭౩

మనోజ్ఞవాక్కులన్=మనస్సునకింపైన మాటలచే- మహాహ్లాదంబు=మిగుల సంతోషము- సంధిల్లెన్=కలిగెను- దరహాసాంకూరముల్ = చిఱునవ్వు మొలకలు- అంకూరోంకుర మన్స్త్రీయామ్మని నైజయంతి. భవత్కృపన్=నీదయచే.

తా త్ప ర్య ము.

అమ్మా! యింపైన నీ వాక్కులచే మిగుల సంతోషమైనది. నీకేమి కావల యునో కోరుకొమ్ము. నా తపోబలముచే నీకు దానిని గలిగించెదనని చెప్పఁగా నామాటలువిని యాశ్చర్యపడి యీమె నన్నుఁ బరీక్షించుచున్నదేమోగదా యని చిఱునవ్వుతో సీతాదేవి తల్లీ! నీదయవలన నా కేకొఱంతయులేదు. నేనేమి కోరు దును అని చెప్పెను.

—• అనసూయ సీతాదేవి కంగరాగాదు లిచ్చుట. •—

సీ. ఆమాట లాలించి • యధికతరప్రీతి, నాతపస్విని యిట్టు • లనియె సతికి
నీమాల్యములు వస్త్ర • మీయాభరణములు, నీయంగరాగంబు•లీవిలేప
మెంతయు దివ్యంబు • లిష్టంబు సంప్రీతిఁ, గొమ్మరో వీనిఁ గై•కొమ్ము నీవు
వాడవు పీడవు • వలపులు నూడవు, నీ కనురూపమై • నెలఁగ నుండు

తే. వీని ధరియించి తేనియు • విద్రుమోష్ఠి! లసదనూనశోభాయుత•లలితదేహ
వగుచు నలరించెదవు నీవు • ప్రాణవిభుని, వెలఁది మంగళదేవత • విష్ణునట్లు.

అధికతర ప్రీతిన్=మునుపటికంటె హెచ్చిన సంతోషముచే- ఇదివఱకు నామె పాతివ్రత్యమునకు సంతోషించెను. ఇప్పుడామె నిష్కాపట్యమునకు మిక్కిలి సంతోషించెను. మాల్యములు=పూలదండలు- వస్త్రము=చీర- అభరణములు=సొమ్ములు- అంగరాగములు = దేహమునకుఁ బూసికొను గంధము మొదలైనవి- విలేపము = అత్తరు మొదలైనది- దివ్యంబులు=దేవలోకములోనివి- ఇష్టంబు=మనస్సుకింపైనది- వలపులు=వాసనలు- అనురూపమై = తగినదై- లసత్ = ప్రకాశించు- అనూన = కొఱంతలేని- శోభాయుత=కాంతితోఁగూడిన- లలిత = మనోహరమైన- దేహవు= దేహముగలదానవు- అలరించెదవు=సంతోషింపఁజేసెదవు- విద్రుమోష్ఠి = పగడము వంటి మొఱ్ఱని పెదవిగలదానా- మంగళదేవత=లక్ష్మీదేవి- 'రమామంగళదేవతా' యమరుఁడు. తపస్విని = తపస్సు విశేషించిగలది- అస్మాయామేధాస్రజోవినిః" పాణిని ౫-౨-౧౨౧. మాయావి, మేధావి, స్రగ్వి, యశస్వి, తపస్వి యిత్యాదు లకు స్త్రీలింగమున 'ని' వచ్చును.

తా త్ప ర్య ము.

సీతాదేవిచెప్పిన యామాటలు విని మిక్కిలి యతిశయించిన ప్రీతిచేఁ దప శ్శాలినియైన యనసూయాదేవి యామెకిట్లనియె. ఈ పూలదండలు, ఈవస్త్రము, ఈసొమ్ములు, ఈమైపూఁతలు, ఈ పరిమళద్రవ్యము లివి దేవతా సంబంధమయినవి. భూలోకవాసులకు లభించునవికావు. మనస్సునకు సంతోషకరములైనవి. ఈపూల దండలు వాడవు, పీడిపోవు, వాసనయుఁబోదు, నీకుఁదగి యందముగ నుండును. వీనిని నీవు ధరియించితివా ప్రకాశించునదివై పూర్ణకాంతితోఁగూడి మనోహర దేహము గలదానవై లక్ష్మీదేవి విష్ణువును సంతోషపెట్టినట్లు సంతోషపెట్టఁగలవు.

దీనివలన సీతాదేవి లక్ష్మీదేవియని యనసూయ గ్రహించెనని తోఁచెడిని.

కం. అని ప్రీతి నొసంగిన నజ్జనకతనూజాత వాని • సంతసమునఁ గై
 కొని పూతభక్తితో న,మ్మునిపత్నికి మ్రొక్కి- నికట•మునఁగూర్చుండెన్. ౨౪౭౧
 నికటమునన్=సమీపమునందు.

తా త్ప ర్య ము.

అని ప్రేమతో నీయఁగా సీతాదేవి వానిని సంతోషముతో గ్రహించి నిర్మల మైన భక్తితో నామునిభార్యకుఁ గృతజ్ఞతా సూచకముగ నమస్కరించి యామె యంచునఁ గూర్చుండెను.

కం. ఇటు లంచునఁ గూర్చుండిన,కుటిలాలకఁ గాంచి యత్రి•కోమలి వీడిము
 చ్చట లాడఁ దొడఁగుచును ము,చ్చటమీఱఁగ ననియె రామ•చంద్రునిసతికిన్.
 ౨౪౭౨

కుటిలాలక=వంకరయగు ముంగురులు గలది- ముచ్చట=సంతోషము.

తా త్ప ర్య ము.

ఇట్లు తనప్రక్కనఁ గూర్చుండిన సీతనుజూచి యనసూయ యిటుసుమాట లాడుచు సంతోషముతో నిట్లనెను.

—• సీత యనసూయకుఁ దనస్వయంవరమువృత్తాంతముఁ జెప్పుట. •—

చం. ప్రరుచిరగాత్రుఁడై రఘు•రాముఁడు విక్రమమూర నిన్ స్వయం
 వరమునఁ బెండ్లి యాడె నను•వార్తను వింటిని, గాని నే సవి
 స్తరముగ నాలకింపఁ బ్రమ•దా! మది గోర్కెదుఁ దత్కథన్ వినన్
 జరిగిన దంతయుం జెపుమ • సమ్మద మూర నరాళకుంతలా. ౨౪౭౩

అరాళకుంతలా=వంకరయగు తలవెండ్రుకలు గలదానా- ప్రరుచిరగాత్రుఁడు =మిగుల నందమైన దేహముగలవాఁడు- విక్రమమూరన్ = పరాక్రమమతిశయిం పఁగా- అరాళకుంతలా యనుటచే నీయందరాళత్వము వెండ్రుకలయం దున్నది. గాని మనస్సు సరాళమే యని భావము.

తా త్ప ర్య ము.

కుటిలకుంతలా! నిన్ను రామచంద్రమూర్తి తనపరాక్రమముచే స్వయంవర మునఁ బెండ్లియాడెనని మాటమాత్రము వింటిని గాని యిదియెట్లో యేమోపూర్ణ ముగ విన్నదాననుగాను. ఆకథ వినవలయునని కోరికగలదు. జరిగినదంతయు సవిస్తరముగఁ జెప్పుము.

సీ. అనవుడు జానకి • వినవమ్మ వినుము నా,జనకుఁడు • క్షత్రధర్మ
 రతుఁడు విదేహాధి•పతి యొక్కనాఁడు దాఁ, గ్రతువొండు సేయంగఁ• గడఁగి నేల
 దున్నింప నాఁగటి•తుదతాఁకునను భూమి, పెల్లగిల్లఁగ నేను • వెడలి రాఁగ
 భూపతి ముష్టివి•క్షేపతత్పరుఁడు ధా,త్రీపాంసుకుంఠిత•దేహ నన్నుఁ

తే. గాంచి యబ్బురపడి కన్న•కన్నెవోలె, స్నేహ మూరంగఁ దనయంక•సీమఁ జేర్చి
మత్తనాథవ యిది యని•మమత చేసె, గగనవాణియు నీమె నీ•కన్య యనియె.
౫౪౭౮

క్షత్రధర్మరతుఁడు=క్షత్రియధర్మమం దాసక్తిగలవాఁడు, క్రతువు =యజ్ఞము-ముష్టివిక్షేపతత్పరుఁడు = "షడ్గవేనకృషతి" యని పూర్వమున భూమిని దున్న వలయుననిన కి-కాంక్ష మెద్దులుకట్టి దున్నువారు. ఏల:- ఒకకాఁడి మెద్దులు గట్టినఁ గష్టమెక్కు-వగుటచే హింసయగునని. యజ్ఞముచేయుటకుమం దాభూమి శుద్ధముగా నున్నదికదా ఎముకలు, పెంకులు, పెంకులు లేకయున్నదా యని శోధించుటకై నేల దున్నుదురు. అట్లుదున్ని పిడికిట గింజలు తీసికొని చల్లుదురు. "యాఁజాతా ఓషధయో దేవేభ్య ఇతి చతుర్దశభి రోషధీర్వపతి" యని ప్రమాణము. అట్లే పిడికిటితో గింజలుచల్లుటయం దాసక్తిగలవాఁడు. ధాత్రీపాంసుకుంఠిత దేహ నన్నా= నేలదుమ్ముచేఁ గప్పఁబడిన దేహముఁగలనన్ను, అబ్బురపడి =ఆశ్చర్యపడి, అపూర్వశబ్దభవము అబ్బురము. కన్నకన్నెవోలెన్=కన్నకుఁతురువలె- అంకసీమన్ = తొడయందు, మత్తనాథవ=నాకూఁతురు.

సీతాదేవి తొలుత లంకలోఁ బద్మమందుఁ బుట్టెననియు దానిని రావణుఁడు తీసికొనిపోయి మంత్రులకుఁజూపఁగా లక్షణజ్ఞులు నిన్నుఁజంపుట కీబాలిక యుదయించెననియుఁ జెప్పఁగా వాఁడామెను సముద్రములోఁ (బంగారుపెట్టెలో నుంచి యని కొందఱు) బాఱవైచెననియు, నామె జనకుని యజ్ఞభూమియం దుదయించెననియుఁ జెప్పుదురు. కథకుఁ గాళ్ళు, ముంతకుఁ జెవులు లేవు.

1. వేదవతి సీలంకలోఁ బుట్టెదనని చెప్పలేదు.

2. ఈకాలమందు వలదు వలదనఁగాఁ బుట్టెడిబిడ్డలే మూఁడుకేవల పొడుగైన నున్నారే సీతాదేవి యెంతయుండవలయును? అంతబిడ్డ పట్టుకమల మదెంతయుండవలెను?

3. పాంసుకుంఠిత దేహ యని చెప్పుటచే బంగారుపెట్టెలో వేసెనన్నమాట యసత్యము లోపల మనుష్యులుండు బంగారుపెట్టె నీళ్ళపై నెట్లుదేలును? లోపల గాలిపోవు మార్గము కలదాలేదా, గాలిపోవుమార్గముండిన నీళ్ళులపోలేదు?

4. లంకనుండి గంగాసాగర సంగమమునుండి బిడ్డగాని పెట్టెగాని నీటికెదురెక్కి- యెట్లుపోఁగలిగెను? ఒకవేళ సముద్రములోని యలలకట్టు లిటుకొట్టుకొనుచుబోయినదన్నను గంగకెదురెక్కి- యెట్లు పోఁగలిగెను? అవల మిథిలకు నేలలో నెట్లు పోఁగలిగెను? నేలమీఁదఁబోయెనా? నేలలోపలనే పోయెనా? అంతదూరము నేలమీఁదఁ బోవుచుండిన నేల యెవరికిఁ గానరాలేదు? బిడ్డగాని పెట్టెగాని నేలలో నెట్లు పోఁగలదు?

ఈ విధముగఁ జూచిన నిది దీనినెవఁడో లంకయెందున్నదో మిథిలయెందున్నదో తెలియనివాఁడు కల్పించెనని స్పష్టపడఁగలదు. ఈప్రకారము భూమిలో నాఱుసంవత్సరము లుండెనందురు. ఏమిటికో! కావున నీవిషయము ప్రక్షిప్తమనుట యే సత్యము. గోదాదేవివలె స్వసంకల్పప్రకార మామె యాసమయమున కందుద్భవించె ననిచెప్పుట యొప్పు.

## తాత్పర్యము.

అని యనసూయ యడుగఁగా సీతాదేవి యమ్మా! వినిపించెద వినుము. నా తండ్రి జనకుఁడు క్షత్రధర్మమందుఁ బ్రీతిగలవాఁడు, విదేహదేశమునకు రాజు. ఒకనాఁడు యజ్ఞము చేయవలయునని నేలదున్నింపఁగా నాఁగేటి కఱ్ఱుతాఁకున నేల పెళ్ళలు లేవఁగా నేను భూమిలోనుండి వెడలివచ్చితిని. అప్పుడు ధాన్యము చల్లుటకై పిడికిట గింజలుంచుకొన్న జనకుఁడు నన్నుఁజూచి యాశ్చర్యపడి తాను గన్న కూఁతురువలె స్నేహ మతిశయింపఁగాఁ దనతొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని యీమె నాకూఁతు రనియెను. ఆకాశవాణియు నీమె నీకూఁతురే యనెను. కూఁతురు కోడలు చెల్లెలు కుడితొడమీఁదఁ గూర్చుండవలెను. భార్యవరుసవా రెడమతొడ మీఁదఁ గూర్చుండవలెను.

చం. అన ముద మంది హర్ష లసి ♦ తాననుఁడై తనజ్యేష్ఠపత్నికి
చ్చినఁ దనకూఁతువోలె నను ♦ స్నేహము పేరిమిఁ బెంచు చుండఁగాఁ
బ్రమపడె భర్తృయోగసుల ♦ భం బగుప్రాయము, దానిఁ జూచి ని
ర్ధని ధననష్టికై వలె ని ♦ తాంతము చింతఁ దపించుచు న్మదిన్. ౨౯౯

ముదము=సంతోషము, హర్షలసితాననుఁడై = సంతోషముచేఁ బ్రకాశించు ముఖముగలవాఁడై, జ్యేష్ఠపత్నికి = పెద్దభార్యకు, (దీనివలన జనకునకును ఒకటెకంటె నెక్కువమంది భార్యలున్నట్లు తోఁచుచున్నది) పేరిమిన్ = అతిశయముచే, భర్తృయోగసులభము=భర్తతోఁ గూడియుండుటకు యోగ్యమైనది, ప్రాయము=వయస్సు, సీతాదేవి కిప్పటికి జనకునొద్దకు వచ్చినప్పటినుండి యాఱు సంవత్సరముల వయస్సు. భూమిలో నాఱుసంవత్సరము లుండినట్లు చెప్పెదరుగాని రామాయణమున దానికాధారములేదు. కావున భర్తృయోగ సులభప్రాయమనఁగా వివాహమునకు యుక్తమైనదశయనియే చెప్పవలయును. భర్తృసంభోగ సులభప్రాయ మన రాదు. నిర్ధని = ధనము పోఁగొట్టుకొన్నవాఁడు, ధననష్టికై = పోయినధనమునకై, నితాంతము=మిక్కిలి.

## తాత్పర్యము.

ఆకాశవాణి పలుకులకు సంతోషించి ముఖవికాసము గలవాఁడై నన్నుఁ దన పెద్దభార్యకిచ్చెను. ఆమెయును దనకన్న బిడ్డవలెనే నన్నుఁ బ్రేమాతిశయముసఁ బోషించుచుండెను. అంత నాకు వివాహయోగ్యదశ వచ్చుట చూచి దీనికిఁ దగిన

వరుఁడెవ్వఁడా యని ధనము గోలుపోయినవాఁడు ధననష్టికై పరితపించునట్లు పరితపింప సాగెను.

కం.కూఁతులఁ గనునాతఁడు కాఁర్కూఁతలు విను వియ్యమాడి • కొలఁదులచేనో
 లాఁతులచేనో తనతల, వ్రాఁతకొలఁది నింద్రు నంత•వాఁడై యున్నన్. ౨౫౦

కాఱ్కూఁతలు=కాఱుకూఁతలు = పరుషవాక్యములు, సంశ్లేషంబున నలఘు రేఫములఘు రేఫమగును. వియ్యమాడి = వివాహసంబంధముచేసి, కొలఁదులచేనో =తనకంటె నల్పులచేనో, లాఁతులచేనో = వారికంటె నితరులచే ననఁగా సమానులచేతనో.

కన్యావివాహవిషయచింత యీ సమయమునకు వచ్చునదిగాదు. కొంచెము వయస్సు వచ్చిన మొదలు లేదా యది పుట్టినప్పటినుండి తల్లిదండ్రులను బాధించుచునే యుండును.

కం."గౌరవముం గాంక్షించెదు, పూరుషునకుఁ గూఁతురొకతె పుట్టిన యేనిన్
 గూరును దుఃఖం బెవఁడా, యీరమణికి మగఁడటంచు నెసఁగినచింతన్॥
కం.జననీవంశము వారిని, జనకు కులమువారి స్వపతిసంతతివారిన్
 దనయా కన్యకసంశయ, మునఁ ద్రోయు సదా యకీర్తిముంచునో యనుచున్
 ఉత్త. రా. ౧౮౨-౧౮౩.

కావున వివాహాలోచనఁ జేసె ననఁగానే కన్య గర్భాధానమునకు సిద్ధపడినదని యర్థము చేయరాదు.

తాత్పర్యము.

ఆఁడుబిడ్డలఁ గలవాఁడు తనకంటె నల్పులచేతనో తనతో సములచేతనో యీ పిల్లను వివాహము చేసికొనినవాని యింటివారిచేత నిష్ఠురములు పడవలసి వచ్చును. పిల్లతండ్రి దేవేంద్రుఁడైనను వాని కీతలవ్రాఁత తప్పదు. పిల్ల గుణవతి బుద్ధిమతి యగునేని తల్లిదండ్రులకుఁ బరితాపమెక్కువ.

తే.ఇట్టిగుణధన్య కర్హుఁడై • యెసఁగునట్టి
 కాంతుఁ డెవ్వఁడు సజ్జనా•గ్రణి లభించు
 నంచుఁ జింతార్ణవమున మ•గ్నాత్ముఁ డగుచు
 దరిని గనఁ డయ్యెఁ బ్లవహీను•కరణిఁ దండ్రి. ౨౫౧

గుణధన్య=గుణసంపత్తిగలది, కాంతుఁడు=భర్త, సజ్జనాగ్రణి=సత్పురుషులలో శ్రేష్ఠుఁడగువాఁడు, చింతార్ణవమునన్=విచారసముద్రమున, మగ్నాత్ముఁడు = మునిఁగిన మనస్సుగలవాఁడు, ప్లవహీనుకరణి=తెప్పలేనివానివలె.

తాత్పర్యము.

ఈకన్యక యిటువంటి గొప్పగుణములు గలదిగానున్నదే, దీనికిఁదగినవాఁడు సద్గుణ సంపత్తిగలవారిలో గొప్పవాఁడగువాఁ డెవ్వఁడు భర్తగా లభించునో యవిధ

ముగా నటువంటివానిని సంపాదింపఁగలను. అని విచారసముద్రమున మాతండ్రి మునిఁగి తెప్పలేనివాఁడు నదిని దాఁటలేనట్లు దరిగానలేకయుండెను.

కం.నన్ను నయోనిజఁ గని యెం,దు న్నృపతిని మదనరూపుఁ • దుల్యునిఁ గన శా
సన్నుతమతి దలఁచెను నా,ప్రన్నితనయకు స్వయంవ•రంబు ఘటింతున్. ౨౫౭౨

అయోనిజన్=స్త్రీలగర్భమునందుండి పుట్టనిదానిని, మదనరూపున్ = మన్మ థునిఁబోలిన సుందరుని, తుల్యుని = నాసౌందర్యమునకుఁ దగిన సౌందర్యము గల వానిని, సన్నుతమతి = సత్పురుషులచే స్తోత్రముచేయఁబడిన మనస్సుగలవానిని, ప్రన్నితనయకున్ = ప్రియపుత్రికకు.

తాత్పర్యము.

తల్లిగర్భమునందుండి పుట్టని సుందరియగు నన్నుఁజూచి యిటువంటి దేవ కన్యవంటిదానికిఁ దగినరాజును మన్మథాకారుని దీనికి సమానుఁడగువానిని సంపా దింపవలెనని విచారించెనుగాని తగినవాఁడు కానరాఁడయ్యెను. అప్పు డిదికా దుపా యమని తలంచి స్వయంవరము చాటించితినేని తగినవాఁడు దొరకునని తలఁచెను.

చం.అని తనకున్ మహాధ్వరము•నందుఁ బ్రచేతసుఁ డిచ్చియున్న యా
ధనువును నక్షయాశుగవి•తాన మమానుషచాల్య మాటచే
జనపతు లెక్కు- పెట్టఁ దమ•స్వప్నములందుఁ దలంపరానిదా
నిని దనపిల్వఁబంచుఁధర•ణీవిభుకోటికిఁ జూపి యి ట్లనున్. ౨౫౭౩

మహాధ్వరమునందున్ = గొప్పయజ్ఞమునందు, ప్రచేతసుఁడు = వరుణుఁడు, అక్షయాశుగవితానము=అక్షయబాణములసమూహము, అమానుషచాల్యము = మనుష్యులు కదలింపరానిది, తనపిల్వఁబంచు=తాను బిలిపించిన, ఈమె యయోనిజ యనుటచే నమానవకన్యకగాఁ గానవచ్చుచున్నది గావున నీమెకుఁ దగినవరుఁడు అమానుషశక్తి సంపన్నుఁడుగా నుండవలెనని మనుష్యులకు సాధ్యముగాని పరీక్ష యేర్పాటు చేసెను.

తాత్పర్యము.

ఈప్రకార మాలోచించి తాను జేసిన గొప్ప యజ్ఞమునందు వరుణుఁడు తన కిచ్చియుండిన వింటిని మనుష్యులు కదలించుటకును సాధ్యముగాని దౌటచే రాజులు తమ కలయందైనను నెక్కు-పెట్టఁ దలంపరానిదానిని నక్షయబాణములను దాను బిలిపించిన రాజులకెల్లఁజూపి యిట్లనెను.

కం.ఈవింటిని మోపెట్టిన,యావీరుఁడు నాదుపుత్రి • కగు నాథుఁడు నా
త్మావల్లభతతి ద్రెంక్కు-చు, రావడి యది యెత్తలేమి • గ్రక్కు-నఁ జనఁగన్. ౨౫౭౪

మోపెట్టిన = ఎక్కు-పెట్టిన. మోపు+పెట్టు = మోపెట్టు రాయి + వడు రావడు రాతివలెనగు.

తా త్ప ర్య ము.

ఈ విల్లెక్కు-పెట్టిన వీరుఁడు నాకూఁతునకు మగఁడు కాగలఁడు. అని చెప్పఁగా నారాజులు దాని నెత్తఁజాలక చూడఁగానే రిచ్చవడి దానికొక నమస్కారము చేసిపోఁగా.

చం. అరుఁగఁగ దీర్ఘకాలము మ•హాత్ముఁడు గాధితిమాభవుండు దా
శరథుల రామలక్ష్మణుల • సన్నుతిమజ్జనకుండు సల్పున
ధ్వరమును జూడఁ దోడుకొని•వచ్చి వచించె విదేహనాథుతో
స్మరసుకుమారు లీన్నృపకు•మారకు లాజకుమారు లర్మిలిన్. ౨౫౦౫

దీర్ఘకాలము=చాలఁగాలము, గాధితిమాభవుండు = విశ్వామిత్రుఁడు, అధ్వరమును = యజ్ఞమును, స్మరసుకుమారులు=మన్మథునివలెఁ గోమలమైన దేహముగలవారు, ఆజకుమారులు=దశరథరాజుపుత్రులు, అర్మిలిన్=ప్రేమతో.

తా త్ప ర్య ము.

చాలఁగాల మిట్టులే కడచిపోయెను. రాజకుమారులెవ్వరును దాని నెక్కు-పెట్టఁ బూనుకొనరైరి. అంత విశ్వామిత్రుఁడు మాతండ్రిచేయు యజ్ఞమును జూడ రామలక్ష్మణులఁ బిల్చుకొనివచ్చి మాతండ్రితో మన్మథులవలె సుకుమారులైన యీ రాజకుమారులు దశరథరాజపుత్రులు.

కం. చూపుము నీదాఁచినశివు,చాపముఁ దెప్పించి రామ•చంద్రున కనినన్
భూపాలుఁ డట్లు చేయఁగఁ, దాపసునుడి రామవిభుఁడు • ధనువుం గదిసెన్. ౨౫౦౬

తా త్ప ర్య ము.

జనక మహారాజా! నీవు దాఁచియుంచిన వింటిని దెప్పించి శ్రీరామచంద్రమూర్తికిఁ జూపుము అనిచెప్పఁగా జనకరాజట్టులే చేసెను. విశ్వామిత్రుని మాట ప్రకారము శ్రీరామచంద్రమూర్తి వింటిని సమీపించెను.

కం. చాపం బవలీల సమా రోపం బొనరించి గుణ ము•రుగతిం దివియన్
జూపఱు బెగ డొందఁగ నది, కోపఱి రెం డయ్యె నశని•ఘోషము నిండన్. ౨౫౦౭

అవలీలన్=అనాయాసముగా, సమారోపంబొనరించి = ఎక్కు-పెట్టి, గుణము=అల్లెత్రాడు, ఉరుగతిన్=గొప్పరీతిని, తివియన్=లాగఁగా, చూపఱు=చూచువారు, బెగడొందన్=భయపడ, కోపఱి=అందము చెడి, అశనిఘోషము=పిడుగువంటిధ్వని.

తా త్ప ర్య ము.

ఆవింటిని శ్రీరామచంద్రమూర్తి యనాయాసముగా నెక్కు-పెట్టి యల్లెత్రాడు గట్టిగఁబట్టి లాగఁగాఁ జూచువారు భయపడునట్లు పిడుగుపడునప్పటి ధ్వనివంటి ధ్వనితో నది రెండుగ విఱిగెను.

అమానుషయగు సీతకు నమానుషమైన శివువిల్లు విఱిచిన యమానుష పురుషునకు నిచ్చెదనన్న ప్రతిజ్ఞ యగుటచే శ్రీరామచంద్రమూర్తి యమానుషత్వ మేర్పడుచున్నది. శివుఁడెక్కుపెట్టి లాగినప్పుడు విల్లువిఱుగ లేదు. శ్రీరామచంద్ర మూర్తి యెక్కుపెట్టి లాగినవుడు విఱిగెను. కావున నీయన యంతకంటె గొప్పవాఁడని యిట్టివాఁడే తనపుత్రికకుఁదగిన భర్తయని జనకరాజు గ్రహించెనని భావము.

ఉ. అంతట సత్యవాది జన•కావనినాథుఁడు నన్ను రామభూ
కాంతున కీ జలంబుఁగొనఁ • గైకొనఁ డయ్యెను దండ్రియిష్ట మా
వంత నెఱుంగరామి, నపు • డాదట మజ్జనకుండు పంచె న
క్కాంతుని మామగారి నటఁ • గ్రచ్చఱఁ దోడ్కొనిరాఁగ దూతలన్. ౫౩౹౭౮

సత్యవాది = నిజముచెప్పువాఁడు, అవంత=అవ + అంత = అవగింజంత = అల్పము, ఆదటన్=ప్రీతితో, క్రచ్చఱన్=శీఘ్రముగా.

తాత్పర్యము.

ఈవిల్లు విఱిచినవానికి నాకూఁతు నిచ్చెదనని ప్రతిజ్ఞ చేసియుండిన మాతండ్రి తనమాట నిజముచేసికొన శ్రీరామచంద్రమూర్తికి నన్ను దానముచేయ జలపాత్ర గైకొనెను గాని తమతండ్రియభిప్రాయము తెలియరామిని శ్రీరామచంద్రమూర్తి దానము గైకొన నంగీకరింపఁడయ్యె. అప్పుడు మాతండ్రి దశరథమహారాజు నొద్దకు వెంటనే దూతల నంపెను.

దీనివలనఁ దండ్రిసమ్మతి లేక బిడ్డలు స్వతంత్రించి వివాహమాడ రాదని సూచన.

తే. జనకుఁడంతట శ్రీరామ•చంద్రునకును, నన్ను నొసఁగుచు నూర్మిళా•నామధేయ
నాదుచెల్లెలి లక్ష్మణు•నకు నొసంగె, నట్లు రాముని కనురక్త•నైతి నమ్మ. ౫౪౹౮౦

తాత్పర్యము.

మాతండ్రి యాహ్వానము నాదరించి దశరథమహారాజు రాఁగా శ్రీరామచంద్రునకు నన్నును, నాచెల్లెలూర్మిళను లక్ష్మణునకును దానముచేసెను. ఈవిధముగ నేను శ్రీరామచంద్రమూర్తియందుఁ బ్రియముగలదాన నైతిని. తండ్రిచేసిన పెండ్లి యని శ్రీరామునకు నేను బ్రియురాలనైతిని.

—• ౧౧౯-వ సర్గము. అనసూయ సీతకు సాయంకాలము వర్ణించి చెప్పుట. •—

కం. అన మునిసతి శిరమున్ మూర్కొని కౌఁగిటఁ గ్రుచ్చి యనియెఁ • గోకిలవాణీ
వినఁ జిత్రము స్పష్టము తి,య్యన గా భాషించితివి స్వ•యంవరచరితన్. ౧౹౮౧

మునిపతి = అనసూయాదేవి, మూర్కొని=వాసనచూచి- కౌఁగిటఁగ్రుచ్చి =కౌఁగిలించి, కోకిలవాణీ=కోకిలకంఠస్వరమువంటి స్వరముఁగలదానా.

తా త్ప ర్య ము.

అని సీతాదేవిచెప్పఁగా మునిపత్నియగు ననసూయాదేవి యామె శిరస్సును వాసనచూచి కౌఁగిలించి యిట్లనెను. కలకంఠీ! వినుటకుఁ జిత్రముగాను సందేహము కలుగకుండునట్లుగను మధురముగా నీ స్వయంవర చరిత్రమును జెప్పితివి.

ఉ. క్రుంకెను బ్రొద్దు, చీకటులు • గూడెను, మేఁతకుఁ జన్న పుల్గులుం
డెంకులు చేరి కూసెడిని • నిద్రకుఁగా, నభిషేకవారికై
పంకజనేత్ర! చన్నముని•వర్యులదే తడినార లూని పా
త్రాంకితహస్తులై మగిడి • రద్దెసఁ జూడఁగదమ్మ జానకీ. ౨౫౧

ప్రొద్దు=సూర్యుఁడు, బ్రధ్నశబ్దభవము, తెంకులు=స్థానములు, ఏక. తెంకి. అభిషేకవారికై =స్నానముచేయునీటికై, తడినారలు = తడినారచీరలు, పాత్రాంకిత హస్తులై =నీళ్ళతోనిండిన పాత్రములను చేతియందుఁ గలవారై, మగిడిరి = మరలి వచ్చిరి. దీనివలన స్నానముచేసినవారు జలపాత్రలు చేతలేక యింటికి రారాదు.

“ఉదపాత్రం కరేధృత్వా, బహిర్యాతి యదిద్విజః
చండాల దర్శనాలాప, స్పర్శదోషైః ర్విముచ్యతే॥

జలపాత్రము చేతధరించి వెలుపలపోయిన బ్రాహ్మణుఁడు చండాలునిజూచిన, మాటలాడిన, దాఁకిన దోషమునుండి విడివడుచున్నాఁడు.

తా త్ప ర్య ము.

సూర్యుఁడస్తమించెను, చీకటులు క్రమ్ముకొనెను, మేతకుఁగా దూరము పోయిన పక్షులు మరల నిద్రకై గూండ్లుచేరుచున్నవి; స్నానము చేయఁబోయిన మునులు స్నానముచేసి తడివస్త్రములతో జలపాత్రమును జేతఁబట్టుకొని మరలి వచ్చుచున్నారు. అప్పక్క-చూడుము.

ఆ. వీతిహోత్రునందు•విధియుక్తి ఋషులు హు
తంబు సేయు మారు•తమున కెగరు
ధూమములను గంటె • తొగ రెక్క- పావురాల్
మెడలజిగిన మెఱసెఁ • బుడమిపట్టి. ౨౫౨

వీతిహోత్రునందు=అగ్నియందు, విధియుక్తి=శాస్త్రప్రకారము, హుతంబు= హోమముచేయఁబడినది, మారుతమునకున్=గాలికి, ధూమములు=పొగలు, తొగ రెక్క-=ఎఱుపు వర్ణముగలవై, జిగిన=కాంతిచే, పుడమిపట్టి=జానకీ.

తా త్ప ర్య ము.

శాస్త్రప్రకారము ఋషీశ్వరు లగ్నిహోత్రమునందు హోమము చేయఁగా గాలికెగురు పొగలను జూడుము. పావురముల మెడయందుండు కాంతివంటి కాంతి గలదై జానకీ! మెఱుచున్నది.

కం. పలుచగ నాకులు గలకుజ,ములు సైతము దూరమంద • పొలిచియుఁ జీక
ట్లలమఁగ నాకులు నిండిన,చెలువునఁ గన్పించె; దెసల• చెలువు దొలంగెన్. ౨౯౩

పలుచగన్=దట్టముగఁగాక వెడవెడముగ, కుజములు = చెట్లు, సైతము= కూడ, సహితశబ్దభవము. అలమఁగన్ = క్రమ్ముకొనఁగా, చెలువున = విధముగా, చెలువు = కాంతి.

తా త్ప ర్య ము.

ఆకులు పలుచనగానుండ చెట్లుకూడ దూరమందుండియుఁ జీకట్లు వ్యాపించిన కారణమున దంకిగ నాకులచే నిండినవానివలెనే కానవచ్చుచున్నవి. దిశలు కాంతిహీనము లయ్యెను.

కం. అమ్మా! రేదిమ్మరి స,త్త్వమ్ములు చరలాడఁ దొడఁగెఁ • దపసులమృగజా
తమ్ములు వేద్యవతరణత,లమ్ముల శయనించెఁ గంటె • లలితేందుముఖీ. ౨౯౪

రేదిమ్మరి=రాత్రిసంచారముసేయు, సత్త్వమ్ములు=జంతువులు, చరలాడన్= సంచారము చేయ, తొడఁగెన్=ప్రారంభించెను, మృగజాతమ్ములు = పెంపుడుజింకల సమూహములు. వేద్యవరణతలములన్ = అరుఁగునుండి దిగెడి చోటులందు, లలితేందుముఖీ=మనోహరమైన చంద్రబింబమువంటి ముఖముగలదానా.

తా త్ప ర్య ము.

. సీతమ్మా! రాత్రిసంచారముసేయు జంతువులు సంచరింపఁ బ్రారంభించెను. తపస్వులు సాకుజింకలు వేదులక్రిందిపైపు శయనించెను. చూచితివా?

ఉ. రాతిరి చాల నేగె, నుడు• రాజముఖీ! గగనంబు తారకా
జాతముతో వెలింగెడిని • జంద్రిక మేలిముసుంగుగా వదే
శీతకరుండు దోఁచె రఘు• శేఖరు డాయఁగఁ బోఁగదమ్మా, సం
ప్రీతి జనించె నిన్నుఁ గన • వేడుక ముచ్చట లాడుచుండఁగన్. ౨౯౫

ఉడురాజముఖీ=చంద్రునివంటి ముఖముగలదానా, గగనంబు = ఆకాశము, తారకాజాతముతోన్=నక్షత్రసమూహముతో, వెలింగెడిని = ప్రకాశించుచున్నది, చంద్రిక = వెన్నెల, మేలిముసుంగుగా = మీఁదఁగప్పుకొన్న వల్లెవాటుగా, శీతకరుండు=చంద్రుఁడు, తోఁచెన్=ఉదయించెను, డాయఁగన్=సమీపింపఁగా.

దీనివలన స్త్రీలు భర్తతోడఁ దప్ప వేఱుగ రాత్రులందుఁ బరుండ రాదని సూచన.

తస్యాః సహపత్యా పూర్వరాత్రౌ ఉపసంవేశనమ్ । అర్ధరాత్రౌ దధః శయనం, ఆబ్రహ్మముహూర్తాత్ అధోపోస్థాయ నిత్యావ్యారభతే॥ బోధాయనులు.

భార్య మగనితోడఁ బూర్వరాత్రమందుఁ బండుకొనవలయును. అర్ధరాత్రముమొదలు బ్రహ్మముహూర్తమువఱకు వేఱుగఁ గ్రిందఁ బండుకోవలెను.

బ్రహ్మముహూర్తమున లేచి నిత్యకృత్యములు ప్రారంభింపవలెను. మగని విడిచి చాటుగ వేఱుగఁ బండుకొనుటది చెడిపె యని మనుస్మృతి చెప్పుచున్నది.

"పానం దుర్జన సంసర్గః పత్యాచ విరహోటనమ్
స్వప్నేన్యస్య గేహవాసశ్చ నారీణాం దూషణానిషట్."

తాత్పర్యము.

రాత్రిచాలఁగడచెను, చంద్రముఖీ! యాకాశము నక్షత్రసమూహముతోఁ బ్రకాశించుచున్నది, వెన్నెల వల్లెవాటు ముసుఁగుగాఁ జంద్రుఁ డుదయించెను. అదిగోఁజూడు. ఇఁక నీవు శ్రీరామచంద్రమూర్తియొద్దకుఁ బొమ్ము. నిన్నుఁ జూడ నీతోడ ముచ్చటలాడఁ జాలసంతోషమయ్యెను.

తొలుత చీఁకట్లు, అవల నక్షత్రకాంతి, ఆవలఁ జంద్రోదయము చెప్పుటచే నిది కృష్ణపక్షము కార్తికబహుళ ప్రతిపత్తని తిలకము.ఏ బహుళపక్షమందైన నిట్టులే యుండును.

ఉ.వారిజనేత్ర! నాయిడిన•వస్త్రము లాదిగ నీవు దాల్పఁ గ
న్నారఁగఁ జూడఁ గోరెద. స•మక్షమునంద ధరింపవమ్మ, నా
ధారిణికన్య యన్నియును • దాల్చి నమస్కృతి చేసి రామునిం
జేరఁగఁ బోయెఁ దన్నుఁ గని • చిత్తమునన్ ముద మంద నాతఁడున్. ౨౫౬

వారిజనేత్ర=కమలములవంటి కన్నులుగలదానా, నాయిడిన=నేనిచ్చిన.

తాత్పర్యము.

కమలాక్షీ! నేను నీకిచ్చిన చీరలు, సొమ్ములు, వాసనద్రవ్యములు నీవు నా యెదుట ధరింపఁగాఁ గన్నులపండువుగాఁ జూచి సంతోషింపఁ గోరెదను. వానిని ధరింపుమన నామెయు నట్లుచేసి యామెకు నమస్కరించి శ్రీరామచంద్రమూర్తి యొద్దకుఁ బోయెను. ఆయనయు నామెనుజూచి సంతోషించెను.

దీనివలనఁ గ్రొత్తవస్త్రములు ధరించినవారు పెద్దలకు దేవునకు నమస్కరింప వలయునని సూచన.

కం.జరగినది చెప్పుచును నా•భరణంబులుఁ వస్త్రమాల్య•పటలియుఁ దనకున్
గరుణను మునిసతి యిచ్చిన•సరణిని వినిపించె రామ•చంద్రున కెలమిన్. ౨౫౭

వస్త్రమాల్యపటలియు = వస్త్రము యొక్కయు పూలదండల యొక్కయు సమూహము.

తాత్పర్యము.

అనసూయా దర్శనవేళ జరగిన సంభాషణమంతయుఁ జెప్పి యామునిపత్ని తనకుఁ జీర, పూలదండలు లోనైనవి యిచ్చిన విధమును శ్రీరామచంద్రునకు వినిపించెను.

దీనివలనఁ దనకు లభించిన సంతోషము లాభము భర్తకు సర్వము భార్య వినిపింపవలయునుగాని యేమిచెప్పవలయునులే యని యుపేక్షింపరాదని సూచన. మఱియుఁ గరుణ ననుటచే నప్రతిగ్రహ వ్రతముగలవారును ప్రీతిదత్తములు నయాచితములునగు మంగళ ద్రవ్యములు నిరాకరింపరాదు.

శ్లో. శయ్యాం గృహాన్ కుశాన్, గంధా నపః పుష్పం మణీ న్దధి
ధానా మత్స్యాన్పయో మాంసం, శాకంచైవ ననిర్ణుదేత్. మను. ౪-౨౫౦

శయ్య, గృహము, కుశలు, గంధము, నీళ్ళు, పుష్పము, మణులు, పెరుఁగు, బొరుగులు, చేఁపలు, పాలు, మాంసము, కూరలు ఇవి యయాచితముగ నప్రచోదితముగ బలవంతముగ నీయఁబడినేని నిరాకరింపరాదు.

శ్లో. ఏధోదకం మూలఫల మన్న మభ్యుదితం చయత్
సర్వతః ప్రతిగృహ్ణీయాత్, మధ్వథాభయ దక్షిణామ్.

కట్టెలు, ఉదకము, గడ్డలు, పండ్లు, అన్నము, తేనె, అభయదక్షిణ వీనిని శూద్రాదులైనను వారై తెచ్చి యెదురుగనుంచి తీసికొనుమనిరేని తీసికోవచ్చును.

ఆహృతాభ్యుద్యతాం భిక్షాం, పురస్తాదప్రచోదితామ్
మేనే ప్రజాపతిర్గ్రాహ్యా, మపి దుష్కృత కర్మణః.

వారికివారై యియ్యఁదలఁచినచోటికిఁ దెచ్చి ప్రతిగ్రహీత యెదుట నుంచి, ముందిచ్చెదనని చెప్పినదిగాక, తీసికొనువాఁ డితరులచే నడిగించినదిగాకయున్నచో, శూద్రులిచ్చినను గ్రహింపవచ్చును గాని అంకుటాంధ్రు, షండులు, పతితులు, శత్రువులు వీరిచ్చినది పుచ్చినగవ్వయైనఁ దనకుఁ బ్రాణముపోవుస్థితిలోనైన గ్రహింపరాదు. గ్రహింపఁ గూడినవైనను దత్కాలమున కెంతకావలయునో యంతే గ్రహింపవలయును.

ఉ. మానవదుర్లభం బయిన•మానితసత్కృతిఁ జూచి జానకీ
జానియు లక్ష్మణుండు నరు•సంబునఁ బొంగి తపోధనాఢ్యస
మ్మానన మంది కూర్కి రవి•మండల మభ్ర మలంకరింప సం
ధ్యానియమాదికల్యవిధు•లన్నియుఁ దీర్చి మునీంద్రకోటులన్. ౨౪౮

మానవదుర్లభంబు = మనుష్యులకు లభింపనివి, మానితసత్కృతిన్ = గౌరవార్హమైన సత్కార్యమును, జానకీజాని = రామచంద్రమూర్తి, అరుసంబునన్ = సంతోషముతో, హర్ష శబ్దభవము అరుసము, తపోధనాఢ్య = తపస్సను ధనముచే సంపన్నులైన ఋషులవలన. సమ్మానన=గౌరవము, కూర్కి = నిద్రించి, అభ్రము= ఆకాశము, కల్యవిధులు=ప్రాతఃకాల కృత్యములు.

తాత్పర్యము.

మనుష్యులకు లభింపనిదై ప్రీతిదత్తమైన బహుమానమును జూచి శ్రీరామలక్ష్మణులు సంతోషంబునఁ బొంగిరి. ఈవిధముగాఁ దపస్వులచే గౌరవింపఁ బడిన

వారై వారు నిద్రించి సూర్యోదయింపఁగా సంధ్యావందనాది ప్రాతఃకాల కృత్యములు దీర్చి యందలి మునీశ్వరులను-

ఉ. మార్గము వేఁడ వారలు తు•మాధవనందన! యెందుఁ బోవ దు
ర్మార్గచరిష్ణువుల్ వికట•మానవభోజులు క్రూరరూపసం
పన్నులు రాక్షసు ల్గలరు • నైలయు పోకఁ, బ్రమాద మూన, మా
వర్గమువారి మ్రింగుదురు • వాసవసన్నిభ! దీని నాఁపవే. ౨౫౯

దుర్మార్గచరిష్ణువుల్ = చెడుదోవల సంచరించువారు, వికటమానవభోజులు= భయంకరులై మనుష్యులఁదినువారు, క్రూరరూపసంపన్నులు = భయంకర రూపముల తోఁగూడినవారు, ప్రమాదము=హెచ్చరికదప్పుట, మావర్గమువారిన్ = మావంటి వారిని, వాసవసన్నిభ=ఇంద్రునితో సమానుఁడా, ఆఁపవే=నిలుచునట్లు చేయుము.

దీనివలన రాక్షస భూతప్రేత పిశాచాది భయము అశుచులకేకాని శుచిమంతులకు లేదని సూచన.

భూతములు పిశాచము లెవ్వరిని బాధించునను విషయము భారతంబున ననుశాసనిక పర్వంబున ౧౨౭-వ యధ్యాయమున నిట్లు చెప్పఁబడెను.

"తతి స్సర్వే మహాభాగా దేవాశ్చ పితరశ్చహ
ఋషయశ్చ మహాభాగాః ప్రమథా వాక్య మబ్రువన్
భవంతో వై మహాభాగా అపరోక్ష నిశాచరాః
ఉచ్ఛిష్టా నశుచీన్ క్షుద్రాన్ కథంహింసథ మానవాన్
కేచ స్మృతాః ప్రతీఘాతా యేనమర్త్యా న్నహింసథ
రక్షోఘ్నానిచ కానిస్యుర్యై ర్గృహేషు ప్రణశ్యథ
శ్రోతు మిచ్ఛామ యుష్మాకం సర్వమేత న్నిశాచరాః
ప్రమథా ఊచుః
మైథునేన సదోచ్ఛిష్టాః, కృతేచైవాధరోత్తరే
మోహాన్మాంసాని ఖాదేత వృక్షమూలేచయః స్వపేత్
ఆమిషం శీర్షతో యస్య, పాదతో యశ్చ సంవిశేత్
తత ఉచ్ఛిష్టకా సర్వే బహు చ్ఛిద్రాశ్చ మానవాః
ఉదకే చాప్యమేధ్యాని శ్లేష్మాణంచ ప్రముంచతి
ఏతేచ భక్ష్యాశ్చ వధ్యాశ్చ మానుషా నాత్రసంశయః
ఏవంశీల సమాచారాన్ ధర్షయామోహి మానవాన్
శ్రూయతాం ప్రతీఘాతాన్యై ర్నశాంశక్నుమహింసితుమ్
గోరోచనా సమాలంభో వాచాహస్తశ్చ యోథవేత్
ఘృతాక్షతంచ యోదద్యా న్మస్తకే తత్పరాయణః
యేచమాంసం నఖాదంతి తా న్నశక్నుమహింసితుమ్

యస్యచాగ్నిగృహే నిత్యం దివారాత్రౌచ దీప్యతే
తరక్షో శ్చర్మదంష్ట్రాశ్చ, తథైవ గిరికచ్ఛపః
ఆజ్యధూమో బిడాలశ్చ, ఛాగః కృష్ణోథపింగళః
యేషా మేతాని తిష్ఠంతి గృహేషు గృహమేధినామ్
తాన్యథ ష్వగారాణి విశితాసైః సుదారుణైః
లోకానాస్మద్విధాయేచ, విచరంతి యథాసుఖమ్
తస్మాదేతాని గేహేషు రక్షోఘ్నాని విశాంపతే
ఏతద్వః కథితం సర్వం యత్రవః సంశయోమహాన్.

## అర్థము.

అంత మహాభాగులైన దేవతలు, పితరులు, ఋషులు ప్రమథులను జూచి యిట్లనిరి. (ప్రమథులు = శివుని పరిచారక గణములు, ప్ర+మథ = హింసించువారని వ్యుత్పత్త్యర్థము) మహాభాగులారా! మీరు పరోక్ష నిశాచరులుకదా, మీ రెట్లుచ్ఛిష్టులను, అశుచులను, శూద్రులను హింసించెదరు ? మీరెట్టివారిని హింసింపరు, మీకృత్యములకు నష్టమువచ్చునవి యేవి? మనుష్యు లెట్టివారైనచో మీరు హింసింపఁజాలరు? నిశాచరులారా! యివి వినవలయునని కోరుచున్నాము.

ప్రమథు లిట్లనిరి :

మైథునమువలన జను లుచ్ఛిష్టులగుచున్నారు. ఆకార్యము ముగిసినవెంటనే తమ్ముఁ బవిత్రులుగాఁ జేసికొననివారిని, శ్రేష్ఠులను నవమానించువారిని, మోహముచే మాంసములను దినువారిని, చెట్లమొదళ్ళ నిద్రించువారిని, నిద్రించునపుడు తలక్రింద నేదైన మృగసంబంధ పదార్థము నుంచుకొనువారిని, కాళ్ళపైపు శిరస్సుంచి పండుకొనువారిని, తలపైపు కాళ్ళుంచి పండుకొనువారిని మేముచ్ఛిష్టులని భావింతుము. మనుష్యులందనేక ఛిద్రములున్నవి, నీళ్ళలో నుమ్మివేయువారిని, మలమూత్రములుగాని, యశుద్ధవస్తువులుగాని, వేయువారిని నుచ్ఛిష్టులనియే భావింతుము. ఇట్టివారిని మేము నిస్సందేహముగా బాధింతుము. పీకి తిందుము. ఇంకను నిటువంటి గుణములు గలవారిని బాధింతుము. ఇఁక మాచేష్టలకుఁ బ్రతిక్రియలుగా నుండువానిని, మా బాధలకు లోపడనివారిని జెప్పెదము.

ముఖమున గోరోజనము చేతియందు వాచ (దీనికిఁ దెనుఁగుపదము తెలియ లేదు వసకొఁబోలు) గలవారిని, ఘృతాక్షత లొకరి కిచ్చువారిని, ఘృతాక్షతల శిరస్సున ధరించువారిని, మాంసముఁ దిననివారిని హింసించుశక్తి మాకులేదు. ఎవనియింట రాత్రింపగ లగ్ని వెలుఁగుచుండునో యెవనియింట సివంగి చర్మముగాని కోఱలుగాని యుండునో, కొండలలోనుండు మెట్టతాఁబేలుగాని నేయిహోమము చేయుటవలన వెలువడు ధూమముగాని పిల్లిగాని నల్లమేకగాని గోరోజనము రంగు గల మేఁకగాని యివి యేగృహస్థునింట నుండునో వారియిండ్లకు మిగుల భయం

కరములైన పిశాచములవలనను భయములేదు. మేము మూఁడులోకములు సంచ రించువారమైనను నీపదార్థములుగల యిండ్లలోనికిఁబోము.

తాత్పర్యము.

మేమేమార్గమునఁ బోవలయునో చెప్పుఁడని యడుగఁగా వారిత్రోవ పోయి నను చెడునడతగలిగి మనుష్యులనుదిను రాక్షసులును, భయంకరరూపములు ధరించి యశుచులును హెచ్చరిక దప్పినవారిని మావంటివారిని భ్రమింగుచున్నారు. ఇంద్రు నితో సమానుఁడా! దీని నిలిచిపోవునట్లు చేయుము.

తే. అడవులకుఁ బోయి ఫలసంగ్రహంబు సేయు
సంయములు పోయి వచ్చెడిజాడ యిదియ
యిదియ మీరును దగుత్రోవ యేఁగ వయ్య
యనుచుఁ బ్రాంజలు లగుచు దీవనలు పలుక. ౨౦౦

ఫలసంగ్రహము=పండ్లుబలికూర్చుట, సంయములు=మునులు, ప్రాంజలులు = చేతులు జోడించి నమస్కరించినవారు.

తాత్పర్యము.

పండ్లు తెచ్చుటకుఁగాను నడవులకు మునులు పోయివచ్చుదోవ యిదియె. ఈత్రోవ మీరును బోవచ్చును. పొండని నమస్కరించి దీవింపఁగా.

తే. సంయమీంద్రులు మంగళాశాసనములు, పలికి తన్నంపఁ దమ్ముండు జలజనయన
వెంటఁ జనుదేరఁ జొచ్చెను విపినభూమి,నభ్రమండలమును జలజాప్తులీల.

సంయమీంద్రులు=మునిశ్రేష్ఠులు, మంగళాశాసనములు = ఆశీర్వాదనములు, జలజనయన=కమలములవంటి కన్నులుగల సీత, విపినభూమిన్ = అడవిప్రదేశమును, అభ్రమండలమును=మేఘసమూహమును, జలజాప్తులీల=సూర్యునిలీల.

తాత్పర్యము.

ఈప్రకారము మునీశ్వరులచే దీవింపఁబడి శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మ ణులు తనతోడరాఁగా సూర్యుఁడు మేఘమండలముఁ బ్రవేశించినట్లు ప్రవేశించెను.

ఈ యుపమానము రాఁబోవు నల్పకాల విపద్దశను సూచించుచున్నది. మేఘ మడ్డపడిన సూర్యునకుఁ గాంతిహీనత లేదు. చూచెడివారికి వెలుఁగులేకపోవును. అట్లులే శ్రీరామచంద్రమూర్తికి బాధలేదు. ఆయనకు వచ్చిన బాధవలన బాధ పడునది లోకమే.

అయోధ్యాకాండాంత పద్యములు.

కం. రాంకారబీజమంత్రవ, రాంక సమస్తప్రశస్తహారిగుణాచయాఽ
లంకార సకలసులభా, శంకానాస్తిక్యరుద్ధజనతాహారా. ౨౦౨

రాంకారబీజ మంత్రవరాంకా=రామ్మను నక్షరము బీజముగాఁగల మంత్ర శ్రేష్ఠము చిహ్నముగాఁ గలవాఁడా, సమస్తప్రశస్త హారిగుణచయాలంకార=సకలము

లైన కీర్తింపఁబడిన కల్యాణములైన గుణసమూహములే యలంకారముగాఁ గలవాఁడా దీనిచే నయోధ్యాకాండమందు వర్ణింపఁబడిన శ్రీరామచంద్రమూర్తి కల్యాణగుణములు సూచింపఁబడెను. సకలసులభా = పేరువారనక సకలజనులకు సులభమైన వాఁడా, ఇది గుహసమాగమము లోనైనవి సూచించును. శంకా = సందేహము, శ్రీరామచంద్రమూర్తి భగవంతుఁడగునో కాఁడో సేవించిన ఫలముగలదో లేదో యను సందేహముచేతను, నాస్తిక్య=దేవుఁడు లేఁడు, పరము లేదను బుద్ధిచేతను,రుద్ధ= అడ్డగింపఁబడిన లేక చుట్టఁబడిన బుద్ధిగల, జనతా = జనసమూహమునకు. దూరా = దూరమునందుండువాఁడా.

దూరస్థం చాంతికే చతత్ =తనభక్తులకు సమీపమందుండును, భక్తి లేనివారికి దూరమందుండును. అనికదా భగవద్గీత చెప్పుచున్నది. ఇది జాబాలి నాస్తికవాదమును సూచించుచున్నది.

వనమంజరి. గురుజనవాక్యసమాచరణాసమ • కోపకామవిహీనధీ
పరమకృపాశ్రయ నిశ్చలచిత్తక • భ్రాతృవత్సల కామదా
విరహితదుఃఖసుఖాంతరచేతన • విశ్వసన్నుత భూధవా
నిరుపమధర్మవిధాయి దయామయ • నిత్యహర్ష గుణోజ్జ్వలా. ౨౬౦౩

గురుజనవాక్యసమాచరణాసమ = తండ్రివాక్యమును బరిపాలించుటయందు నసమానమైనవాఁడా, కోపకామవిహీనధీ=కీడు చేసినవారియందుఁ (కైకేయీ మంథరలయందిదు) కోపముగాని కామముగాని లేని బుద్ధిగలవాఁడా, పరమకృపాశ్రయ = ఉత్తమమైన దయకు నిలువ నీడమైనవాఁడా, నిశ్చలచిత్తక = ఎంత విపత్తువచ్చినను సంపత్తువచ్చినను జలింపని మనస్సుగలవాఁడా, భ్రాతృవత్సల=సోదరప్రీతిగలవాఁడా, కామదా=కోరినవారికోర్కెల నిచ్చువాఁడా, విరహిత దుఃఖసుఖాంతరచేతన = ఇది సుఖము ఇదిదుఃఖమని యంతఃకరణమందు లేనివాఁడా, విశ్వసన్నుత=సమస్తప్రపంచముచేఁ బొగడఁబడువాఁడా, భూధవ=భూమికి భర్తయైనవాఁడా, నిరుపమ=అసమానమైన, ధర్మవిధాయి=ధర్మమునే స్వానుష్ఠానముచే విధించువాఁడా, దయామయా = దయాస్వరూపుఁడా, ముందుచెప్పఁబడినది స్వభావము. ఇది స్వరూపము. నిత్యహర్ష=ఎప్పటికి సంతోషమే గలవాఁడా, గుణోజ్జ్వలా = సౌశీల్య సౌలభ్య కృతజ్ఞతాది కల్యాణగుణములచేఁ బ్రకాశించువాఁడా-

వనమంజరి=నజజజ భరగణములు ౧౪-వ యింట యతి.

కమలవిలసితము.

భువననిధిఖరజ•ముఖనయనాంక, ప్రవిదితపురకృత•ప్రథితచరిత్రా
దివిజమనుజనుత • స్థిరతరచిత్తా, ధవవర భవహర • దశరథపుత్రా. ౨౬౦౪

భువననిధి=సముద్రము, ఇది నాలుగవ యంకెను సూచించును. ఖ=ఆకాశము, ౦ సున్నను సూచించును. శరజముఖ = కుమారస్వామిముఖములు, ఇది ఆఱును

సూచించును. నయన = కన్నులు, ఇవి రెంటను సూచించును. ౪౦౨ అని యేర్పడఁగా దీని కడనుండిచదివిన ౨౦౪ అగును. ఈ యంకెలచేత ప్రవిదిత = తెలియఁబడిన, పురకృత = అయోధ్యాపురమందుఁ జేయఁబడిన, ప్రథిత=కీర్తికెక్కిన, చరిత్రా=నడవడిగలవాఁడా.

దివిజ = దేవతలచేతను, మనుజ=మనుష్యులచేతను, నుత = స్తోత్రముచేయఁ బడినవాఁడా, స్థిరచిత్తా=మిగులదృఢమైన మనస్సుగలవాఁడా, ధవవర = రాజులలో శ్రేష్ఠుఁడా, భవహర = జననమరణములఁ బోఁగొట్టువాఁడా, దశరథపుత్రా=దశరథ రాజనందనా. ఈకాండమందు ౨౦౪ పద్యము లున్నవి.

సీ. తనపాదభక్తుల తనయునిఁగాఁ జేసి, యనుకంప వీక్షించె జననమంద
ఆవలఁ దా లక్ష్మణార్యుఁడై రక్షించి, రామాయణం బనుగ్రహముచేసె
స్వీయమంత్రంబును శేల్లూరి నరసింహ, దేశికుండై యుపదేశమిచ్చె
నేకశిలా నగరాధీశుఁడై గ్రహియించి, యాంధ్రవాల్మీకి రామాయణంబు
వ్యాఖ్య దానికిపుడు వ్రాయించుకొనియెను, గరిమతో నయోధ్య కాండమునకు
వాసుదాసుచేత స్వప్రభావంబును, బ్రకటపఱుప రామభద్రవిభుఁడు.

ఇది శ్రీమద్రామచంద్ర చరణారవింద మిళిందాయ
మాన మానసత్వ మహోవైభవ వావిలికొలను
రామచంద్రరాయ తనూభవ వాసుదాస
నామధేయ ప్రణీతంబయిన మంద
రాఖ్య వ్యాఖ్యాసమేత
శ్రీమదాంధ్రవాల్మీకి
రామాయణమందు
నయోధ్యాకాండము.

శ్రీరామార్పణమస్తు.
శ్రీ. శ్రీ. శ్రీ.

శ్లో. నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీక భవాయ తస్మై.

శ్రీరామ.

# శ్రీ రా మ ది న చ ర్య.

శ్లో. పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే.

అను భగవద్వాక్యము చొప్పున సాధువులను రక్షించుటకై పాపాత్ములను నాశముచేయుటకును, ధర్మమును స్థాపించుటకును ప్రతియుగంబున భగవంతుఁడు శ్రీమన్నారాయణుండు భూమిపై నవతరించుచుండును. కల్పకల్పమందు వచ్చిన యవతారములే మరలమరల వచ్చుచుండును. కావున ప్రతికల్పమందును ముఖ్యావతారములు పదియేగాక గౌణావతారములు మఱికొన్ని కలుగుచునే యుండును. ఈవిధమునఁ జూడఁగా నిప్పటికి నెన్ని మత్స్యావతారము లయినవో యెన్ని నృసింహావతారము లయినవో యెన్ని శ్రీరామ కృష్ణావతారము లయినవో చెప్పసాధ్యపడదు.

సందేహము.

ఒకసారివచ్చిన యవతారములే మరలమరల రావలయునని తొలిసారి యుండినవారే, యా యా సందర్భములే మరల మరల రావలయునుగదా మరల మరల దశావతారములు రావలయునని మరల మరల సోమకాసురుఁడు, హిరణ్యాక్షు, హిరణ్యకశిపులు, బలిచక్రవర్తి, రావణ, కంస, శిశుపాలాదులు రావలయునుగదా వారువచ్చినపుడు వారిసహాయులు, సహచరులు, తల్లిదండ్రులును నవతారపురుషునకుఁ గావలసినవారు యథాపూర్వము రావలయునుగదా అట్లయిన నొకసారి యుండినస్త్రీలు పురుషులు మరల మరల వచ్చుచుండవలయునుగదా. అట్లయినఁ బరిణామవాదము పాడగునుగదా. ఒక కల్పమున ముక్తుఁడయిన జీవుఁడు మరల నెనుబదినాలుగులక్షల యోనులందు జన్మింపవలయునుగదా! అప్పటికి ముక్తి యనునది పునర్జన్మ రాహిత్యమనునది వ్యర్థపదములేకదా! యనుసందేహము కలుగవచ్చును.

పరిహారము.

అవతారములు వచ్చుట నిజమే వారికిఁ గావలసినవారు వారికి విరోధులు వారికిఁ గావలసినవారు వచ్చుట నిశ్చయమే అట్టి సందర్భములు కలుగుటయు సత్యమే. మరల బ్రహ్మేంద్రాదులు, నష్టదిక్పాలకులు, సూర్యచంద్రులు, సప్తర్షులు వీరువారననేల నందఱుఁ బుట్టుట యథార్థమే. ఇంతయేల? ఆడినయాటయే యాడవలయును, పాడినపాటయే పాడవలయునుగాని పరిణామవాదము పాడగుటలేదు. ముక్తియనునదీ వ్యర్థపదముగాదు బ్రహ్మేశ్వరేంద్రాగ్ని వరుణాది పదములన్నియు నాయా పదవుల పేళ్లేగాని యా యుపాధులయందుండు జీవాత్మల పేళ్లుగాదు. కలెక్టరు,

డిప్టికలెక్టరు, తహశీల్‌దారుఁడన్నట్లు తహశీల్‌దారుఁడుపోయి తహశీలుదారుఁడు వచ్చెననినఁ బూర్వముండిన మనుష్యుఁడే మరలవచ్చెనని యర్థమాః కాదుకదా. అట్టులే యిదియును. ఒకస్థానమున నున్నవాఁడు పోఁగానే యాస్థానమున నుండ నస్వాఁడెవ్వఁడో వాఁడాస్థానమున నియమింపఁబడును. వాఁడా కార్యముల నెఱవే ర్చును. ఇట్లు వచ్చువాఁడు భిన్నజీవుఁడేకాని మునుపటి జీవుఁడుకాఁడు. కావునఁ బరిణామవాదమునకుఁ బ్రాణభయములేదు. ముక్తునకుఁ బునర్జన్మభయములేదు. పరిణామక్రమమున నడుమఁ దెంపులు లేవు. ఒకస్థానమున రెండుజీవులుండవు. కావుననే కేవలమైక్యముగా నుండునవి లోకమున రెండులేవు. పరిణామ మంకెల వంటిది. ౧-౨-౩-౪-౫-౬ వీనియందు నొకటిని దెలుపునది యొకటియెకాని $\frac{౧}{౧౦౦౦౦}$ నైనను నొకటికంటె భిన్నమేకదా. కావున జీవయాత్రావిషయమునఁ బరిణామమే సరియైనమార్గము. లోకమునఁ గల వ్యత్యాసముల కన్నిటికిఁ దగిన సమాధానము చెప్పునదదియే.

బ్రహ్మాండకోటు లనంతములు, జీవకోటు లనంతములు, ప్రపంచము నిత్యము. సంసారమునిత్యము. కాలమునిత్యము. గంగానదిరేవున మనము నిలుచుండితిమేని మన కెదురుగనున్న జలబిందువులు దాఁటిపోవును. వానిస్థానమున మఱికొన్ని బిందు వులు వచ్చును. ఒకబిందువు సముద్రమునఁ బ్రవేశింపఁగనే యాదియందుఁగాని యంత్యమందుఁగాని శూన్యస్థానము లేనట్లు లోకఁడు ముక్తుఁడుకాఁగానే యాస్థానము గాని యాదియందుఁగాని శూన్యముకానేరదు. అట్టులే యిదియనియు భావించునది. కావున నా స్తంబ బ్రహ్మపర్యంతము బ్రహ్మజన్మదివసము మొదలు లయదినమువఱకు నెంతచర్య జరుగునో తరువాతిబ్రహ్మల కాలమం దంతచర్య యట్టులే యేదైనఁ గొంచెము భేదముతో జరుగును.

శ్రీ రామావతారమునకుఁ దగిన సందర్భము లీవైవస్వత మన్వంతరమున నైదవ మహాయుగమందలి త్రేతయందుఁ దటస్థించెను.

సంవత్సరములు.

| | | |
|---|---|---|
| కృతయుగమునకు | ౧౪౪౦౦౦౦ | ౧౭౨౮౦౦౦. |
| సంధి | ౨౮౮౦౦౦ | |
| త్రేతాయుగమునకు | ౧౦౮౦౦౦౦ | ౧౨౯౬౦౦౦. |
| సంధి | ౨౧౬౦౦౦ | |
| ద్వాపరయుగమునకు | ౭౨౦౦౦౦ | ౮౬౪౦౦౦. |
| సంధి | ౧౪౪౦౦౦ | |

| | | |
|---|---|---|
| కలియుగమునకు | ౩౬౦౦౦౦ | ౪౩౨౦౦౦. |
| సంధి | ౭౨౦౦౦ | |
| మహాయుగము, | | ౪౩౨౦౦౦౦. |

ఇట్టివి వెయ్యిమహాయుగములు బ్రహ్మలోకపగలు. వెయ్యిమహాయుగములు బ్రహ్మలోకరాత్రి. ఇవిరెండు కలసినదినము బ్రహ్మలోకకల్పము. ౩౬౦ కల్పములు బ్రహ్మలోక సంవత్సరము. ౩౬౦౦౦ కల్పములు బ్రహ్మాయువు.

త్రేతాద్వాపర సంధియందుఁ బరశురామ శ్రీరామావతారములు.

'త్రేతాద్వాపర సంధి రాముఁడలుకన్'

అని భారతంబున నుంటఁజేసి త్రేతాయుగాంతమున శ్రీరామావతారమని నిశ్చయింపనగు.

త్రిమూర్తులం దవతారములు విష్ణువునకేకాని తక్కిన యిరువురకు లేవు. కొంచెము శ్రమముతోఁ బిడ్డలఁ బుట్టింపవచ్చును. అవలీలగా వారిని జంపవచ్చును. వారిని రక్షించుటకే యెంతశ్రమమైనఁ బడవలసియుండును. ఎన్నివేషములయిన వేయవలసియుండును. సర్వకాల సర్వావస్థల బిడ్డలను గనిపెట్టి వారి యోగక్షేమములు విచారించుకొనుచు వారిని సన్మార్గవర్తులఁ జేయుట సుకరముగాదు. కావున విష్ణువు రాజసుఁడైన బ్రహ్మను సృష్టికార్యమందును, తామసుఁడైన శివుని సంహారకార్యమందు నిలిపి రక్షాభారము తనయందుంచుకొని దానికిఁ గావలసిన వేషములఁ గొనుచుండును. కావున విష్ణువిప్పుడు మనుష్యరూపమున నవతరించెను.

—• జన్మసంవత్సరమేది? •—

"తతశ్చ ద్వాదశేమాసే, చైత్రే నావమికేతిథౌ
నక్షత్రేఽదితి దైవత్యే, స్వోచ్చ సంస్థేషు పంచసు
గ్రహేషు కర్కటేలగ్నే వాక్పతా విందునాసహ
ప్రోద్యమానే జగన్నాథం, సర్వలోక నమస్కృతమ్
కౌసల్యాఽజనయద్రామం, సర్వలక్షణ సంయుతమ్
విష్ణోరర్థంమహాభాగ, మిక్ష్వాకు కులవర్ధనమ్". ౧-౧౮-౮.

కం. క్రతువు పరిపూర్తి యగుడున్, ఋతుమట్కంబరుగఁ బదియు రెండవనెలలో
క్షితిఁ జైత్రశుద్ధ నవమిన, దితి తారను రవియు నడిమి దివిని వెలుంగన్.
బాలకాండము. ౪౯౯

కం. వర కర్కట లగ్నంబున, సురగురుఁ డుదయించుచుండ సోమునితోడన్
ధరణీముఖ గ్రహపంచక, మరుదుగ స్వోచ్చ స్థలంబులందు వెలుంగన్.
బాల. ౯౦౦.

కం. కౌసల్య జగత్పతి శ్రీ, వాసుని యర్ధాంశమూర్తి వరశుభ చిహ్నున్
భాసుర రఘుకులవర్ధను, వాసిగ నెన్ సర్వలోక వందితు రామున్. బా. ౫౦౧.

దీనినిబట్టి శ్రీరామ జననకాలమున గురువు, చంద్రుఁడు కర్కాటక లగ్న మందుండిరనియు,

| | | | |
|---|---|---|---|
| శు | ర బు | | |
| | | | ల. గురు చం. |
| కు | | | |
| | | శ | |

జన్మలగ్నము కర్కాటకమనియు, మేషమున రవి బుధులు, తులయందు శని, మకరమందుఁ గుజుఁడు, మీనమందు శుక్రుఁడు నుండిరని యేర్పడుచున్నది.

ప్రమాది, ఖర, శోభకృత ప్రాక్షస ప్రభవేషు
ధనుర్గురుః ప్రమాద్యాది వర్షాణాంతు యథాక్రమాత్
కుంభే, కర్కి, ధను, ర్మేష, కన్యారాశౌ శనిక్రమాత్.

అని కాలప్రకాశికయందుఁ గలదు, అనఁగాఁ బ్రమాధియందు ధనుస్సున గురువు, కుంభమందు శని యుండురు. ఖరయందు ధనస్సున గురుఁడుండిన కర్కాటకమందు శనియుండును. శోభకృత్తునందు ధనుస్సునఁ గురు శను లిరువురు నుందురు. రాక్షసయందు ధనుస్సునందు గురువుండిన మేషమందు శనియుండును. ప్రభవయందు ధనుస్సున గురువుండినఁ గన్యయందు శనియుండును. గావున నే సంవత్సరమున గురువు కర్కాటకమందుండిన శని తులలోనుండునో చూతము.

ఖరసంవత్సరమందు గురువు ధనుస్సునందుండెనేని సంవత్సరమున కొక రాశి యతిదుండువాఁడు కావున నాయన కర్కాటకమునకు వచ్చుటకు నెనిమిది సంవత్సరములు పట్టును. ఖరసంవత్సరమునకు నెనిమిదవసంవత్సరము విలంబియగును. శని యొక్కొక్క రాశియందు రెండున్నర సంవత్సర ముండువాఁడు కావునఁ గర్కాటమందున్న శని యెనిమిదవ సంవత్సరమున తులయందుండును. ఈ యెనిమిదవ సంవత్సరము విలంబియగును. శ్రీరాముల జననకాలమున గురువు కర్కాటకమందు శని తులయందుండుటచే నాయన పుట్టిన సంవత్సరము విలంబి యగుట నిశ్చయము.

నక్షత్రము పునర్వసువు.

—• జన్మయుగమేది? •—

దీనిని నిర్ధారించుటకు శ్రీమద్రామాయణమున నాధారములులేవు. అనుక్తమన్యతో గ్రాహ్య మ్మనున్యాయ మనుసరించి గ్రంథములు శోధింపఁగా శ్రీరంగ మాహాత్మ్యమం దీవాక్యములు కానవచ్చుచున్నవి.

ఇవి భగవంతుఁడు బ్రహ్మకుఁ జెప్పిన వాక్యములు.

శ్లో. త్వయార్చితో౽హ మధునా, శ్రీరంగే ధామ్ని పద్మజ
అయోధ్యాంగంతు మిచ్ఛామి రఘుభిః పరిపాలితామ్
తేమాంత్ర త్రార్చ్య యిష్యంతి చతుర్యుగ చతుష్టయమ్
తతః పరం ప్రయాస్యామి కావేరీం చోళరక్షితామ్
చంద్రపుష్కరిణీతీరే శయిష్యేహం చతుర్ముఖ.

బ్రహ్మదేవా! శ్రీరంగధామమందు నీచే నర్చింపఁబడు నేను రఘువంశము వారు పాలించు నయోధ్యకుఁబోవఁ గోరుచున్నాను. అచ్చట వారు నన్ను నాలుగు మహాయుగము లర్చింతురు అవలఁ జోళరక్షితమైన కావేరీ తీరమునకుఁ బోయి చంద్రపుష్కరిణీ తీరమున శయనించెదను. అనిచెప్పఁగా బ్రహ్మ శ్రీరంగధామమును నిక్ష్వాకు మహారాజున కర్పించెను. ఆయన దానిని దీసికొని పోయి–

"ఫాల్గునే మాసి దేవస్య, నక్షత్రే భగదైవతే
ఉత్సవాన ధృథంచక్రే. పుత్రపౌత్రై స్సమన్వితః

ఫాల్గున మాసంబున, శుద్ధపక్షమున, పున్నమనాఁడు ఫల్గునీ నక్షత్రమున నాయన కొడుకులు మనుమలతోడ నుత్సవంబులు జరపె. ఇట్లు నాలుగు మహాయుగములు గడచెను.

శ్లో. త్రేతాయుగే పంచమేతు రాజా దశరథో౽నఘః
పుత్రార్థం హయమేధేన యష్టుం సముపచక్రమే

అయిదవ త్రేతాయుగమందుఁ బుత్రులనిమిత్తమై దశరథరా జశ్వమేధము చేయ నారంభించెను. ఈ వాక్యములవలన నైదవ మహాయుగమందలి త్రేతా యుగమందు దశరథుఁ డశ్వమేధము చేసెనని తెలియుటచే నా యుగమందే శ్రీరామ జననము. విలంబి సంవత్సరమున శ్రీరామ జననము కావున హేవిలంబి యందు నశ్వమేధయాగము పుత్రకామేష్టి జరగెను. దుర్ముఖి చైత్రమందు నశ్వము విడువఁబడెను, మన్మథయందు దశరథుఁడు బిడ్డలులేరని విచారము

శ్లో. పుష్యే జాతస్తు భరతో, మీనలగ్నే ప్రసన్నధీః
సార్పే జాతౌతు సౌమిత్రీ కుళీరే భ్యుదితే రవౌ.

గీ. పుష్యమున మీనరాశిని బుట్టె సుప్ర, సన్నమతి భరతుండును సార్పభమునఁ
గర్కటకమున మధ్యాహ్న కాలమందుఁ బుట్టిరి సుమిత్ర తనయులు పుణ్యనిధులు.

పునర్వసువు నక్షత్రమున శ్రీరామజననము బుధవారము. పుష్యనక్షత్రమున భరతజననము గురువారము. ఆశ్లేషా నక్షత్రమున లక్ష్మణ శత్రుఘ్నుల జననము. శుక్రవారము.

అతీత్యైకాదశాహంతు నామకర్మ తథాకరోత్.

గీ. పదియు రెండవదినమునఁ బార్థివుండు, పుడమి పాయంగఁ దనప్రియపుత్రకులకు
నామకరణ మహంబు నొనర్చెఁ బ్రేమ, నని యుండుటచే-

చైత్ర బహుళపంచమి సోమవారమునాఁడు నామకరణము.

పరాభవ సంవత్సరమున ననఁగా తొమ్మిదవ యేఁట నుపనయనము. ఎట్లనఁగా సీతాదేవి రావణునితో-

శ్లో. మమభర్తా మహాతేజా వయసాపంచ వింశకః।
అష్టా దశహి వర్షాణి, మమజన్మని గణ్యతే. ఆరణ్య. ౪౭-వ సర్గము.

కం. ప్రతిభట రహితుండగునా, పతి కిరువదియేను సమల ప్రాయం బవుడీ
క్షితిఁ బుట్టి నాదిగాఁగన, హితగుణ నాకపుడు పదియునెనిమిది యేఁడుల్.
ఆరణ్య. ౭౬౭.

తామరణ్యవాసమునకై వెడలునప్పటికి శ్రీరామునకు నిరువదియైదు వత్సరములనియు తనకుఁ బదునెనిమిది యేఁడులనియు చెప్పెను.

కౌసల్య శ్రీరామునితో

శ్లో. దశసప్త చవర్షాణి తవ జాతస్య రాఘవ. అయోధ్య. ౨౦ స.
మ. పదునేడేఁడులనుండి యెప్పుడొకొ, నాథంగంబు దుఃఖంబులున్
దుదఁగాంచున్ సుఖమబ్బునంచు, మదినెంతో వేచి మోదింపఁగా.

యని చెప్పుటచే రెండవజన్మమైన యుపనయనమైన దాదిగానని యెంచవలయును. కేవల బాలుఁడేమి యాశలఁ గల్పింపఁగలఁడు. అదియునుగాక దశరథుఁడు కైకేయీ పక్షపాతి. కైకేయికిఁ గౌసల్యయందు విరోధభావము కైకేయికి వివాహకాలమున నిచ్చిన వరమునుబట్టియుఁ బగచేతను దనకొడుకును దనభర్త యాదరించి యుపనయనమైనఁ జేయునో చేయఁడో యట్లుచేయఁడేని తనకొడుకు దనకేమి మేలు గూర్పఁగలఁడని సందేహించుచున్న కౌసల్యకు నుపనయనానంతరము ధైర్యము వచ్చెను. ఆశలు మొలకలెత్తెను. కావున నీ పదునేడనునది ద్విజన్మప్రాప్తి మొదలనియే చెప్పవలయును. అయినచోఁ దొమ్మిదవయేఁట నుపనయనమైననే ప్రవాసము నాఁటికి నిరువదియైదేండ్లగును. ౨౫ లో ౧౭ పోయిన నెనిమిది కావున నెనిమిదవ సంవత్సరమం దుపనయనమనుట సరిగాఁదోఁపదు. కావునఁ బరాభవ సంవత్సరమందే యుపనయనమని యెంచవలయును. తరువాత విశ్వామిత్రుని వెంటఁ దమ పండ్రెండవ సంవత్సరమున ననఁగా సౌమ్యవత్సరమున యాగరక్షణార్థమై రామలక్ష్మణులు పోయిరి.

ఈ విషయమున శ్రీమద్రామాయణ వాక్యములే ప్రమాణములు.

మారీచుఁడు రావణాసురునితో సీతను హరింపవలదని చెప్పునపుడు తనకు భయపడి విశ్వామిత్రుఁడు శ్రీరామునిమ్మని దశరథుని వేఁడఁగా దశరథుఁడు విశ్వామిత్రునితో-

శ్లో. బాలో ద్వాదశవర్షోయ మకృతాస్త్రశ్చ రాఘవః॥

“పసివాఁడు రాఘవుఁడు ద్వాదశ వత్సరుఁ డస్త్రకౌశలంబును నెఱుఁగఁడు’ అని చెప్పినట్లు చెప్పెను.

కావున శ్రీరామునకు నిప్పటికిఁ బండ్రెండు వత్సరములనుట స్పష్టము. ఇది మఱియొక విధముగ దృఢపడుచున్నది.

సీతాదేవి రావణునితో నిట్లు చెప్పెను.

శ్లో. ఉషిత్వా ద్వాదశసమా ఇక్ష్వాకూణాం నివేశనే
భుంజానా మానుషాన్ భోగాన్ సర్వకామ సమృద్ధినీ
తతస్త్రయో దశేవర్షే రాజామంత్ర యతప్రభుః.

సీ. శ్రీరాముభార్యను సర్వకామసమృద్ధ జనసుఖములఁ బదియు రెండేఁడు లిక్ష్వా
కులయింటను గడపితి నేదియుఁ గడమలేక। యంతటఁ బదియు మూఁడవవత్స
రంబున రామాభిషేక కార్యంబు పొంటె.
రాజు మంత్రులతోడ మంత్రంబుసేసి. అరణ్యా. ౪౭-౩.

సీతారామ లక్ష్మణుల యరణ్యవాస గమనము రాముని యిరువది యైదవ యేఁట యని మీఁదఁ జెప్పఁబడెను. ఈ యిరువదియైదవదే యీపద్యంబునఁ జెప్పిన పదుమూఁడవయేఁడు. అంతకుముందు పండ్రెండు సంవత్సరము లత్తగారింట సుఖ మనుభవించుచున్నట్లు చెప్పెను. కావున శ్రీరామునకుఁ బండ్రెండవయేఁట సీతకు గొలో ౧౨ను పోను ఆఱవయేఁట వివాహమని యేర్పడుచున్నది.

ఈ విషయమునఁ గల సందేహపరిహారములు వ్యాఖ్యానమందు వ్రాయఁబడి యుండుటచే నిచ్చట వ్రాయఁబడవయ్యెను.

సౌమ్యసంవత్సర మాఘ బహుళమందు శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రు వెంటఁ బోయి-

౧-వ దినము పగలు సరయూనదీ దక్షిణతీరంబున బలాతిబల గ్రహణము' హస్తపోను చిత్రానక్షత్రము. ఆ రాత్రి సరయూతీరమందు శయనము.

౨-వ దినము నుదయము గంగా సరయూ సంగమదర్శనము, అంగదేశ వృత్తాంత కథనము, రాత్రి కామాశ్రమవాసము.

౩-వ దినము పగలు తాటకావధ, రాత్రి తాటకారణ్యవాసము.

౪-వ దినము పగలు అస్త్రగ్రహణము, సిద్ధాశ్రమ ప్రవేశము, రాత్రి విశ్వామిత్ర దీక్షాగ్రహణము.

౫-వ దిన ముదయము "నేఁడు మొదల్ సవావనంబుం గడఁకన్ ఘటింపుఁడు తపోధనుకై తమినాఱు యామినుల్" అని విశ్వామిత్రుఁడు మానమూనుటచే మునులు రామలక్ష్మణుల బోధించుట.

ప్రభాతకాలే చోత్థాయ పూర్వాం సంధ్యాముపాస్యచ. ౧-౨౯-౩౧.
అద్యప్రభృతి షడ్రాత్రం రక్షతం రాఘవౌ యువాం. ౧-౩౦-౪.

౫-౬-౭-౮-౯-౧౦ యాగరక్షణము. ౧౦-వ దినమున సుబాహు వధాదికము. ౧౦-వ రాత్రి సిద్ధాశ్రమవాసము.

౧౧-వ దినము విశ్వామిత్ర ప్రయాణము, రాత్రి శోణనదీ తీర వాసము, స్వచరిత్ర కథనము.

౧౨-వ దినము త్రిపథగా వృత్తాంతకథనము, రాత్రి గంగాతీర వాసము.

౧౩-వ దినము విశాలాప్రవేశము, రాత్రి విశాలావాసము.

౧౪-వ దినము అహల్యా శాపమోక్షణము, జనకదర్శనము, విశ్వామిత్ర చరిత్ర కథనము, రాత్రి ఆశ్రమవాసము.

౧౫-ఉదయము మిథిలా ప్రవేశము, శివధనుర్భంగము.

౧౬-౧౭-౧౮ జనకదూతల ప్రయాణము, ౧౮-వ దినము జనక దూతలయోధ్యఁ బ్రవేశించుట.

౧౯-వ దినము దశరథ ప్రయాణము.

౨౩-వ దినము దశరథుఁడు మిథిలఁ బ్రవేశించుట. ౧౨౩.౨

౨౪-వ దినము జనక యజ్ఞాంతము. ౧౨౩౫-పద్యము.

౨౫-వ దినము కుశధ్వజాగమనము, వంశకథనము, మఖానక్షత్రము

౨౬-వ దినము గోదానము, యుధాజిత్తునాగమనము.

౨౭-వ దినము ఉత్తరఫల్గుని, సీతాకల్యాణము, శుక్లత్రయోదశి.

శుక్లత్రయోదశి వివాహమునకు శుభదినము, ఆదిన ముత్తరఫల్గునీ నక్షత్రము కావున శ్రీరాము జన్మనక్షత్రమున కాఱవది యగుటచే శుభతార.

శ్రీరాముఁ డయోధ్యవిడిచిన యిరువదియేడవ దినము ఫాల్గున శుద్ధత్రయోదశి యగునేని మయోధ్యవిడిచిన దినము మాఘబహుళ ద్వితీయయై యుండవలయును. విదియ ప్రయాణమునకు మంచిదినమే. ఈ దినము హస్తయగును, అది శ్రీరామునకు ౭-వ ధనతారయగును, కావున నాదినమున హస్తపోను చిత్రయందు నభిజిల్లగ్నమునఁ బ్రయాణమై యుండవలెను.

శ్లో. తిథిర్నదోషా హ్యుదయేచకాలే, నక్షత్రదోషోఽభి జి దాదకాలే
లగ్నాది దోషా స్తమయే చకాలే, నవారదోషాః ప్రభవంతి రాత్రౌ.

అను సూక్తి ననుసరించి నక్షత్రము హస్తమైనను అభిజిత్సర్వదోషఘ్నమ్మని యుండుటచే దోషములేదు.

ఈ దినము సరయువు దాఁటుటతప్ప దూరప్రయాణము చేయలేదు. సరయు వయోధ్యనంటి పాఱుచున్నది. కావున మధ్యాహ్నము పన్నెండుగంటలకు బయలు దేఱినను రెండుగంటలకు బయలుదేఱినను పడవమీఁద రెండుగంటలలో దక్షిణ తీరము చేరియుందురు.

వివాహ మయిదుదినములు జరిగెను; ఫాల్గునబహుళమున విదియతో వివాహము ముగిసెను.

ఫాల్గున బహుళ తృతీయను జనకుఁడు బిడ్డల కరణము లిచ్చుట.
చతుర్థిని నంపకములు.

ఫాల్గున బహుళపంచమి దశరథుఁ డయోధ్యకుఁ బ్రయాణమగుట. షష్ఠి యందో సప్తమియందో పరశురామ భంగము. దశమినాఁ డయోధ్యాప్రవేశము. అవలఁ బన్నెండు సంవత్సరములు యథాసుఖ వర్తనము. బాలకాండము ౨౮ సంవత్సరముల చరిత్రము.

## అయోధ్యాకాండము.

దుందుభి సంవత్సర చైత్రశుద్ధ చతుర్థియందు దశరథుఁడు శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేయవలయునని పౌరులతో మంత్రులతో నాలోచించుట చైత్ర శుద్ధపంచమినాఁ డుదయమునఁ బుష్యనక్షత్రమున యౌవరాజ్య పట్టాభిషేకము నకు నిశ్చయింపఁబడిన దినము.

ఈ దినమునందే సీతారామలక్ష్మణులు వనములకుఁ బ్రయాణము.

శ్లో. పూర్ణే చతుర్దశేవర్షే పంచమ్యాం లక్ష్మణాగ్రజః
భరద్వాజాశ్రమం ప్రాప్య. వవందే నియతో మునిమ్.

యుద్ధ. ౧౨౭. సర్గము-౧.

వనవాసము పదునాలుగు సంవత్సరములు పూర్ణముకాఁగా పంచమియందు శ్రీరాముఁడు భరద్వాజాశ్రమము చేరెనని చెప్పుటచేఁ చైత్ర శుద్ధపంచమి వనవాసారంభదినమని యేర్పడుచున్నది.

చం. వనముల నాలుగుంబదియు వర్షము లుండఁగ మీరలిప్పుడే
చనుఁడని చెప్పెఁగైక యదిసాగుత నేడుమొదల్గ రాఘవా. అయో ౧౧౦ ప.
అనుట చేతను.

కం. కొనిచని మహానుభావుని, జనపదములనెల్లఁ గడచి చని యటవిదుహీ
యని దశరథుఁ డనుటచేతను, చైత్ర శుద్ధపంచమి నుండియె లెక్కింపఁ దగు. ఈరాత్రి సీతారామలక్ష్మణులు ముగ్గురు తమసాతీరమందు శయనించిరి. అప్పటఁ జేరఁగానే శ్రీరాముఁడు లక్ష్మణునితో-

శ్లో. ఇయమద్యనిశా పూర్వా, సౌమిత్రే ప్రహితా వనమ్
వనవాసస్య భద్రం తే, సనోత్కంఠితు మర్హసి. ౨-౪౬-౨.

కం. మన కానన యాత్రావ్రత, దివసములలో నిదియ మొదటిదిన మరిగెడి నో
యనఘా చేరితి మడవియు, వనవాసం బెల్లొ యనుచు వగవకుమన్నా.
అయో. ౧౨౨౩

శ్రీరాముని యీ వాక్యమువలనను వనవాసారంభదినము దుందుభి చైత్ర శుద్ధపంచమి యని యేర్పడుచున్నది. చైత్ర శుద్ధ షష్ఠి గంగాతీరవాసము. గుహ దర్శనము. ఇది యూరువిడిచిన రెండవనాఁడు.

ఊరువిడిచిన మూఁడవనాఁడు సప్తమి. జడలుధరించుట, గంగాతరణము, సుమంత్రున కనుజ్ఞ యిచ్చుట, వనస్పతిమూలమున నిదురించుట.

నాల్గవనాఁ డష్టమి. ప్రయాగదర్శనము, సాయంకాలమున భరద్వాజాశ్రమ ప్రదేశము, అయో ౧౪౩౪-ప. ఆరాత్రి యాశ్రమమందే శయనము. ౧౪౪౬-ప. ఐదవనాఁడు నవమి, యమునదాఁటుట, శ్యామవృక్షదర్శనము, యామునోపవనమున రాత్రి శయనము. అయో. ౧౪౬౭. ప.

ఆఱవనాఁడు దశమి, చిత్రకూటమున వాల్మీకి దర్శనము, పర్ణశాల నిర్మాణము. (ప. ౧౪౭౭-౧౪౭౯.)

ఆఱవనాఁటి సాయంకాలమున సుమంత్రుఁ డయోధ్యఁ జేరుట. (ప. ౧౪౮౭). ఈ పద్యమున మూఁడవనాఁటి సంజయని యున్నది. అనఁగా సుమంత్రుఁడు మూఁడు దినములు ప్రయాణముచేసెనని యర్థమగాదు. సీతారామలక్ష్మణులతోడ ప్రజ లడ్డము వచ్చుచుండఁగా నయోధ్యనుండి గంగకు మొదటిదినమున సగము రెండవ దినమున సగము ప్రయాణముచేసిరి కావున సుమంత్రునకు నంతకెక్కువ కాలము పట్టుట యసంభావ్యము. ఒక్క మధ్యాహ్నమున కెక్కువ పట్టియుండదు. కావున సీతారామలక్ష్మణులు చిత్రకూటము చేరినవార్తవిని యారాత్రికే సుమంత్రుఁ డయోధ్యచేరెను. ఈ రాత్రియందే కౌసల్య దుఃఖించుచు-

కం. వీను నిశలేగ రాముఁడు, కానన వాసంబు చేయఁ గడఁగినది మొదల్.

అని చెప్పెను, కావున నిది యాఱవరాత్రి యనుట స్పష్టము. ఆవెంటనే యర్ధరాత్రమున దశరథుఁడు మేల్కని తనకు, గలిగిన మునిశాపము గుఱించి కౌసల్యకుఁ జెప్పెను-

కోడలినిం గొడుకుం దలంచి యా, త్మారమణేంద్రుఁ డావనిశన్ వనుకే ధవళాక్షి కిట్లనున్. ప. ౧౬౯౧.

ఈ రాత్రియందే దశరథు మరణము.

ఏడవనాఁ డేకాదశి, స్త్రీల విలాపము, దశరథ కళేబరమును తైలద్రోణియం దుంచుట, (ప. ౧౬౯౬). ఎనిమిదవనాఁడు ద్వాదశి, యుదయమున మంత్రిపురోహితుల సభ. భరతునకు దూతలనంపుట. మఱుదినము (౯-వనాఁడు త్రయోదశి) ప్రయాణముచేసి యారాత్రి కేకయునగరముఁ జేరి పదవనాఁటి యుదయము చతుర్దశినాఁడు భరతుని దర్శించిరి. ౯-వనాఁటిరాత్రి భరత దుస్స్వప్నము. పద్య. (౧౬౮౨–౧౬౮౩–౧౬౯౬.) పదవనాఁడే భరతుఁ డయోధ్యకుఁ బ్రయాణము ౧౬-వ నాఁటి యుదయమున భరతుఁ డయోధ్యఁ బ్రవేశించుట.

అరుణోదయంబున భరతుఁ డాత్మపురము మనునిర్మితంబయి సిరులమీఱు
నయ్యయోధ్యను గనుఁగొనె నవనినాథతనయుఁ డిట్టులు సప్తరాత్రములు నడచి
తనదు పురమును జూచి సూతునకు ననియె. ౧౬౬౦-వ ప.

కం. అని యడిగిన నిజ జననికి ననియెన్ భరతుండు నేఁటి కాఱు నొకండున్
జననమ్మ కేలు మామస, దనమును నే విడిచి" ౧౬౯౦-వ ప.

అనుటచే శ్రీరాముఁ డయోధ్యవిడిచిన ౧౬-వ నాఁడు భరతుఁ డయోధ్యఁ జేరెను. చైత్ర బహుళషష్ఠితిథి ౧౬-వదినము చైత్రబహుళ సప్తమినాఁడు భరతుఁడు తండ్రికి నౌర్ధ్వదైహిక క్రియల నారంభించుట.

సీ. పదునొకొండవనాఁడ భరతుఁ డాశౌచంబు, దీర్చి పంద్రెండవ దినమునందు
శ్రాద్ధకర్మములెల్ల జరపి. (ప. ౧౯౧౨).

యని యుండుటచేఁ గనినముట్టు వినినఁజావు. అను నియతి ననుసరించి చైత్రబహుళ షష్ఠినాఁడు దశరథ మృతివార్త విన్నవాఁడు కావున నాదినముమొదలాశౌచము ప్రారంభము. వైశాఖ శుద్ధమునఁ బాడ్యమినాఁడు నివృత్తి. ౨౬ వ దినము భరతుఁ డయోధ్యఁ జేరిన ౨౭-వ దినము వైశాఖశుద్ధ ద్వితీయనాఁడు శ్రాద్ధ కర్మములన్నియుఁ జేయుట, సపిండశ్రాద్ధము సంవత్సరాంత కృత్యము. ఇప్పటి దేశకాల స్థితులఁబట్టి సంవత్సరాంతమువఱకుఁ గర్త జీవింపఁజేని ప్రేతకుఁ గతులులేక పోవునని ౧౩-వ దినమందుఁ జేయఁబడుచున్నది. పూర్వ మట్టిభయములేదు. ఇది ౧౨-వ నాఁటి చరిత్రము. ౨౮-వ దినము వైశాఖశుద్ధ 3-వనాఁడు (భరతుఁ డయోధ్యఁ జేరిన ౧౩-వ నాఁడు).

గీ. మఱి త్రయోదశి దినమున మహిపతనయుఁ,డస్థి సంచయనార్థమై యరుగుదెంచి

ఈ నాఁడే శత్రుఘ్నునిచే మంథరకుఁ బ్రహారములు, (౧౪-వ దినము)౩౦-వ దినము వైశాఖ శు, చతుర్థినాఁడు రాజకర్తలు రాజ్యభారము వహింపుమని భరతుని వేఁడుట (ప. ౧౯౩౭) భరతుఁడు నిరాకరించి శ్రీరాముని దోడితెచ్చెదనని చెప్పుట మార్గశోధకుల నియమించుట, ౩౧-వ దినము వై. శు పంచమినాఁడు (౧౫-వ దినము) భరతుఁడు సభకువచ్చుట, వసిష్ఠుఁడు భరతుని రాజ్యము పట్టముఁ గట్టు కొమ్మని చెప్పుట భరతుఁడు గర్హించుట.

౩౨-వ దినము వై. శు. షష్ఠి (౧౬-వ దినము) భరతుఁడు చిత్రకూటంబునకుఁ బ్రయాణమగుట గంగాతీరవాసము. గుహదర్శనము. (౧౯౭౦-వ ప.) ౩౩-వ దినము వై. శు. సప్తమి (౧౭-వ దినము) భరత జటాధారణము. భరతుఁడు సేనతో గంగ దాఁటుట, భరద్వాజ దర్శించుట, భరద్వాజునివిందు. (౨౦౬౬-వ పద్యము ౩౪-వ దినము వై. శు. అష్టమి. (౧౮-వ దినము) చిత్రకూటమునకుఁ బ్రయాణము శ్రీరామదర్శనము, రాముఁడు దశరథునకు నివాపంబులు విడుచుట. ౩౫-వ దినము వై. శు. నవమి. (౧౯-వ దినము) రామభరత సంభాషణము. (౨౩౬౭-వ ప.) ౩౬-వ దినము వై. శు. దశమి (౨౦-వ దినము) పాదుకాదానము భరతుఁడయోధ్య చేరుట. ౩౭-వ దినము వైశాఖ శుద్ధము, ఏకాదశి (౨౧-వ దినము) భరతుఁడు నందిగ్రామముఁ జేరుట.

భరతుఁడు వెడలిపోయిన పిమ్మటఁ బున్నమవఱకుఁ జిత్రకూటమందే యుండి పర్వంబులకునెల్ల బహుళప్రతిపత్తు మేలు గావున వైశాఖ బహుళమునఁ బాడ్యమి నాఁడు సీతారామలక్ష్మణులు అత్రియాశ్రమముఁ జేరిరి. రాత్రి సంజచీఁకటులు వెంటనే చంద్రోదయము వర్ణించుటచే నీ దినము పాడ్యమియో విదియయో యై యుండవలయును, సంజ చీఁకటులు బహుళమందే కదా యుండును.